TEXT PROBLEM WITHIN THE BOOK ONLY

శ్రీ

దొడ్డ రామాయణము

ప్రథమ భాగము

గ్రంథకర్త:
దొడ్ల వేంకటరామిరెడ్డి

ప్రకాశకులు:
ప్రబోధ పుస్తకనిలయము
గూడూరు

OSMANIA UNIVERSITY LIBRARY

RSITY LIBRARY

Accession N

before the date last marked below

పు న ర్ము ద్ర ణ ము



శ్రీ రాజా వేలుగోటి
సర్వజ్ఞకుమార కృష్ణయాచేంద్ర
బహదూరువారు
వేంకటగిరి

గ్రంథకర్త
శ్రీ దొడ్ల వేంకట
రామరెడ్డిగారు
కావలి

శ్రీ దొడ్డ రామాయణము

(ద్వితీయ ముద్రణము)

సంపాదకుని విన్నపము

మనము జీవించు కాలము కలియుగమైనను ఒక విధముగ విశిష్టమైనదని చెప్పనచ్చును. మానవుడు తాను మఱచిన తన ఔన్నత్యమును జ్ఞప్తికి తెచ్చుకొని దానిని సిద్ధింపఁజేసికొనుటకై అనేక విధముల పాటుపడుచున్నాఁడు. బహుకాలమునుండి తన్ను కట్టివైచినవని తలఁచిన రాజకీయ సాంఘిక వైజ్ఞానిక బంధములను ద్రెంపుకొని విముక్తుఁడగుటకును, తనయొక్కయు తన సంఘము యొక్కయు శ్రేయస్సు నభివృద్ధి పఱచుకొనుటకును స్వేచ్ఛామార్గముల యన్వేషించుచున్నాఁడు. సర్వప్రయత్నములకు ఉత్తమసౌఖ్యాను భూతియే లక్ష్యము గనుక, అది సిద్ధించుదనుక నాతఁడు ప్రయత్న మును విరమింపఁడని మన మూహింపనలసి యున్నది.

కాని సంప్రదాయపరుల కీ స్వేచ్ఛాప్రవృత్తి కొంతమనఃక్లేశమునకుఁ గారణమగుచున్నది. సర్వభూత ప్రవృత్తులను పరమ కారణుఁడైన పరమేశ్వరునియందలి విన్యాసములే గనుక, కలుషితమైన ప్రవాహజలము కాలము గడచుకొలఁది నిర్మలమగునట్లు ఇప్పుడు కాన్పించు వైపరీత్యములెల్లను కాలాంతరమున మరల సహజరూపమును బొందగలవని మన మూహింప వచ్చును.

అయినను శాశ్వతధర్మప్రతిపాదకములును ప్రబోధ సమర్థ ములు నైన గ్రంథరాజములను జ్ఞానపిపాసువులగు జనులకు నందఁ జేయుట మన విధియై యున్నది. నేటి విద్యావ్యాప్తి దీనికెంతయుఁ దోడ్పడఁగలదు. తత్సిద్ధికై 1954 సం. ఆగస్టు తే 5 దిన గూడూరున 'ప్రబోధ పుస్తకనిలయ'మను పేరుతో నొక సంస్థ ప్రారంభింపఁబడినది. దాని ప్రథమఫలితముగ శ్రీ దొడ్డ రామాయణము పునర్ముద్రితమై వెలువడుట యొక సుకృతవిశేషము.

ఈ గ్రంథరాజ మిప్పటికప్పుడే ఆంధ్ర ప్రజల మన్ననాదరణము లను బొందినది. పండితులేగాక సామాన్యులగు స్త్రీపురుషు లనేకులు గూడ దీని కథనానైపుణ్యమునకును వచనమాధుర్యమునకును

ముగ్ధులై ప్రశంసించుట నేను వినియున్నాను. దీని కెల్లను గ్రంథకర్త యగు శ్రీ రెడ్డిగారి మనస్సు 'పరందమాధురీమయంబును శిరీష కుసుమకోమలంబు' నగుటయేగాక 'సర్వభూతహిత'సంపన్నంబును నిరంతరము శ్రీరామచంద్రపదపంకజాసక్తంబు నగుటయే కారణము. ప్రబోధపుస్తకనిలయము శ్రీరెడ్డిగారి ఇతర గ్రంథజాలమును గూడ నచిరకాలములో తిరిగి ముద్రింపించి ఆంధ్రలోకమునకు నందఁజేయఁ గలదని యాశించుచున్నాను.

పరమేశ్వరునికన్న మానవుఁడే ఎక్కువగ నర్చించు నీదినము లలో, 'నేను నరుఁడనే'నని చాటుకొన్న నృపాలశేఖరుఁడగు శ్రీరామ చంద్రమూర్తి జీవితగాథ సర్వప్రామాణికమై వెలయఁగలదని విశ్వ సింపవచ్చును. అదియునుగాక, అనుదినము ప్రతి ఆంధ్రగృహము నందు పూజానంతరము, 'భగవాన్ సర్వదేవాత్మకః శ్రీరామచంద్రః సుప్రీతః సుప్రసన్నః వరదో భవతు' అని చెప్పఁబడుచుండుటచేతను, ఆంధ్రదేశములో శ్రీరామమందిరములేని కుగ్రామమైనను లేకుండుట చేతను శ్రీరామచంద్రుఁడు ఆంధ్రుల ఇష్టదైవమై వారి దైనందిన జీవితజ్యోతియై వెలుఁగుచున్నాఁడనుటకు సందియములేదు. శ్రీసీతా రాముల నిష్కళంక త్యాగము నిర్వ్యాజప్రేమ ఆత్మస్థైర్యము ఆంధ్రుల హృదయములయందు ధర్మమును సుప్రతిష్ఠితముగఁ జేసినవి. ఈ ధర్మ ప్రవృత్తి నింకను వృద్ధిఁబొందించుటలో శ్రీ దొడ్డ రామాయణ మెక్కువగఁ దోడ్పడఁగలదని నేను నమ్ముచున్నాను.

ఎంత జాగరూకతతోఁ బరిశీలించినను కొన్ని ముద్రణాది స్ఖలిత్యములు గ్రంథమునం దచ్చటచ్చటఁ గాన్పింపఁగలవు. పాఠక మహాశయు లోర్పువహించి మన్నించెదరని ప్రార్థించుచున్నాను.

గూడూరు
12-3-55

శ్రీకంఠం కృష్ణరావు
సంపాదకుఁడు

శ్రీ

విజ్ఞాపనము

శ్రీరామచరిత్ర సర్వలోకవిదితము. ఆ చరిత్రను వాల్మీకిమహర్షి సంస్కృతభాషయందు రచించెను. రామచరిత్రకు వాల్మీకి కవితాశక్తియు వాల్మీకి కవితాశక్తికి రామచరిత్రయు నెంతయుఁ దగి పువ్వును దావియువలె ననోన్యశోభనహేతువై విరాజిల్లుచున్నవి. వాల్మీకివలన రాముఁడును రామచరిత్రరచనవలన వాల్మీకియు శాశ్వతులైరి.

రామాయణంబును ఆదికావ్యమనిరి. అట్లనుటంజేసి తత్పూర్వము ఛందోనిబద్ధకావ్యరూపగ్రంథము లేదని యేర్పడుచున్నది.

వాల్మీకిమహర్షి శ్రీరామునకు సమకాలికుఁడు. అయన మహాతపశ్శాలియగుట వాని నామమే సూచించుచున్నది. అంతటి మహాత్ముని రామాయణరచనకు బ్రహ్మ నియమించి త్రికాలజ్ఞానంబును వానికిఁ బ్రసాదించి వాని నోట నసత్యము వెలువడదని వరమిచ్చి చనెను. అట్లు పరమేష్ఠినలన నిర్ణీతుఁడై యసత్యము పలుకనని ప్రతిజ్ఞచేసి వాల్మీకి మహర్షి రామాయణంబును రచించెను. కావున రామాయణము చారిత్రాత్మక గ్రంథమేగాని కొందఱు శంకించునట్లు కవికల్పితం బెంత మాత్రముఁ గానేరదు.

వాల్మీకిమహర్షి రామాయణంబును కుశలవుల జననానంతరమే రచించినట్లు తద్గ్రంథమే తెలుపుచున్నది. రామాయణంబును షట్కాండ పర్యంతమే వాల్మీకి రచించెనని కొందఱుందురు గాని సప్తకాండములు వాల్మీకియే రచించెనని రామాయణమువలననే స్పష్టము.

వాల్మీకి తన గ్రంథమునుగూర్చి 'ఉదారవృత్తార్థపద మనోహరం' బనియు, 'తదుపగత సమాససంధియోగబంధురం' బనియు, 'సమ మధురోపనతార్థవాక్యబద్ధ' మనియు వచించెను. ఈ విశేషణంబులు అక్షరాక్షరంబుల సత్యంబులు. కావుననే రామాయణం బంత రుచివంతమై వినువారిని దన్మయ మొనర్చుచున్నది.

శ్రోతల చిత్తంబు నాకర్షించి తన్మయత్వమొనర్చి యయ్యా రసంబుల నోలలాడించునదే కవిత్వమగును, కవిత్వంబునకు రసము

జీవము. రసోత్పాదనశక్తి పుట్టువుతోడనే కావలయును. పాండిత్యాదులు దానికి మెఱుంగులగును. ఈ రసంబును సమయోచితంబుగాఁ జవిచూప వలయునేగాని క్రుమ్మరింప రాదు.

ఈ రసోత్పాదనము ధ్వన్యిప్రాణితమైనచో శ్రోతల మనఃపరిణతిని బట్టి వింతవింత రుచులను గలిగించుచు నెంత ద్రావినను వారిని దనియ కుండునట్లు చేయును. అట్టి కవిత్వమే యుత్తమ కవిత్వమగును.

కవిత్వంబునకు ఔచిత్యంబెంతయుఁ బ్రధానము. దానినిఁ జక్కగాఁ బాటింపనిచో రసభంగము గలుగకమానదు. ఔచిత్యము శబ్దగతమనియు భావగతమనియు ద్వివిధము. సందర్భమునకుఁ దగినంత మాత్రమే భావంబును వెల్లడించుట భావౌచితి యగును. ఆ భావ ప్రదర్శనంబునకుఁ దులతూఁచినట్లు తగిన పదమును బ్రయోగించుట శబ్దౌచితియగును. భావార్థంబులు రెండును నొండొంటికిఁ దులతూఁచి నట్లుగా నుండునేని ఆ కవిత్వము సజీవకవిత్వ మగును. ఈ శక్తిని సంపాదించుటకుఁ బాండిత్యమెంతయుఁ దోడ్పడును. పాండిత్యంబునకుఁ దోడుగా యుక్తాయుక్త వివేకమును లోకజ్ఞానంబును గూడినచో నెంతయుఁ బ్రశంసనీయమగును. ఇన్ని యుండియుఁ గవి మనస్తత్వంబు మరందమాధురీమయంబును శిరీషకుసుమకోమలంబును గానిచో వాని రచన బెట్టగానుండునేగాని సర్వజనమనోరంజకము కానేరదు. సర్వభూతహితబుద్ధియున్నగాని యట్టిమనస్తత్వంబు గలుగదు. అట్టిబుద్ధి జీవన్ముక్తుని లక్షణము. కావుననే ఋషిగానివాఁడు కవి కానేరఁ డనిరి. ఇవియెల్ల వాల్మీకి మహర్షియందు సమగ్రంబులు. కావుననే వాని కవిత్వము అసదృశమై చదువంజదువ రుచులూరించుచుఁ దనివి దీఱకుండును.

కవులు భావపరిస్ఫుటార్థము శబ్దాలంకారంబుల నర్థాలంకా రంబుల నాశ్రయించుట కలదు. ఇట్టి ప్రతిభావ్యాయామమునకన్న ఉన్నదియున్నట్లు తేటమాటలతోఁ బొంకముగా వివరించి భావస్ఫుటం బొనర్చుట కడిఁదికార్యమేగాక మనోహరముగాఁ గూడ నుండును. ఇది యందఱికిసాధ్యము కాఁజాలదు. ఇట్టి కవిత్వము బాలవృద్ధావబోధక మగులయేగాక బహుజనాదరణీయమై శాశ్వతంబుగా నిలుచును. కవి కేవలచిత్రకారకుఁడు మాత్రమేగాఁడు; బోధకుఁడును శ్రోతృజనాంతఃపరిణామప్రదుఁడు నగును. లోకోభ్యున్నతి కవీంద్రులపై నాధారపడి

యున్నదని చెప్పుట యతిశయోక్తిగాదు. కావునసే కవీంద్రు లపూర్వ సృష్టికర్త లగుదురు. పై లక్షణంబులెల్ల వాల్మీకి కవిత్వంబున సమగ్రంబులు. దానం జేసియే వానినిఁ గవికోకిలం బనిరి.

రామాయణమందుఁ గొన్ని యంశంబులు సామాన్యధర్మదృష్టికి విపరీతంబులై తీఱనిశంకలు గలిగించుచున్నవి. ఈ యంశంబులను విశేషధర్మదృష్టితోఁ బరిశీలించినచో నట్టి శంకలు తప్పకతీఱును. ఈ ధర్మసూక్ష్మంబులు సామాన్యునకు గోచరింపవు. భీష్ముఁడంతటి వాఁడు గూఁడ దనకేది హితమో నిశ్చయించుకొనలేక సర్వజ్ఞుఁడైన శ్రీకృష్ణభగవానునకు స్వహితనిశ్చయార్థమై చరమప్రార్థనంబును గావించెననఁగా నితరులసంగతి చెప్పవలయునా? తెలియని దానిని తెలిసికొనుట యుక్తమగునేగాని విపరీతార్థంబులకుఁ జిక్కుట సరిగాదు.

రామాయణతారకారణము ఉత్తరకాండమందుఁ గలదు. సౌకర్యార్థము దానిని మొదటనే చేర్చి పూర్వకాండమని పేరిడితిని. వాల్మీకి గ్రంథంబునకు నా రచన తర్జుమా గాదుగాని దానిని బ్రాయికముగా ననుసరించితిని. ప్రక్షిప్తములను వదలితిని. మహర్షి సూచించిన భావంబులను గొన్నిటిని సుంత వివరించితిని. సందర్భోచితంబుగాఁ గొంత చేర్చితిని. పఠన సౌలభ్యార్థము కొన్ని పద్యములను గ్రంథాంతరంబులనుండి గ్రహించితిని. కొన్నింటిని స్వయముగా రచించి కూర్చితిని. " " ఈ గుర్తుగల పద్యంబులు గ్రంథాంతరస్వీకృతములు.

విప్రలంభపరిణామంబగు కరుణరసంబును బాఠకులకు మఱి కొంత చవిచూపు తలంపుతో భవభూతిరచించిన యుత్తరరామచరిత నాటకంబునుండి గొంతభాగంబును శ్రీ వేదము వేంకటరాయశాస్త్రి గారి తర్జుమాను గ్రహించి కూర్చితిని.

రామాయణసారంబును గ్రహింపవలయుననన్నచో మూల గ్రంథమునే చదువవలయును. అందులకు సంస్కృతభాషాజ్ఞానము వలయును. అదియెల్లరకుఁ గలుగదని యాంధ్రభాషాజ్ఞానమాత్రుల కర్థాన్వార్థము భాస్కరాదికవీంద్రులు ఆంధ్రపద్యప్రాయంబుగా రామాయణంబును మహోరసవత్తరశైలి రచించిరి. వచనకావ్యరచనకు నవకాశమిప్పుడు గలిగినందున నిటీవల నొకరు దానిని గద్యాత్మకంబుగా రచించిరి. అట్లు వారాంధ్రప్రపంచంబును ధన్య మొనర్చి తామును

ధన్యులైరి. అట్టి యుద్గ్రంథంబులుండగా మరల నేనీగ్రంథంబు వ్రాయ నేల యనవచ్చును.

బాల్యంబునుండి రామాయణమందు నాకుఁ బ్రీతి మిక్కుటము. 1899 వ సంవత్సరంబున మాకు మొల్లరామాయణంబును బ్రవేశ పరీక్షోపఠనగ్రంథముగా నిర్ణయించిరి. దానిని జదువుటనలన రామ చరిత్రయందలి నా ప్రీతి రెట్టించెను. అప్పుడప్పుడే యాంధ్రభాషయందు నాకు సుంత ప్రవేశమంకురించుచుండెను. అప్పుడు నాకు సహపాఠియైన శ్రీ మేడిశెట్టి వెంకటాచలమునాయుడుగారు రామాయణంబును నవల రూపంబున వ్రాయవలసినదని నాటనుండి నన్ను బలవంతపెట్టసాగెను. అందులకుఁ జాలనని మిన్నకుంటిని.

1932 వ సంవత్సరంబున గీతాహృదయ రచనకుఁ గొడంగి యందు రెండధ్యాయంబులు పూర్తిగావించితిని. అది కేవలవేదాంత విషయంబగుటంజేసి యందే నిరంతరము పరిశ్రమించుట సుంత శ్రమగాఁ దోఁచెను. ఆక్లేశమును గావ్యరసాస్వాదనంబునఁ బాసఁదలంచి వాల్మీకిరామాయణంబును వ్యాఖ్యాచతుష్టయ సమన్వితంబుగాఁ జదువ నారంభించితిని. కొన్నాళ్ళు చనఁగా, నాచదువుభాగంబు నప్పుడప్పుడే యాంధ్రవచనరూపంబున వ్రాయఁదగదా యనుతలంపు తలసూపెను. ఆ సంకల్పము దొడ్డరామాయణ రూపంబునఁ బరిణమించెను.

నిష్కామకర్మయోగమే వాస్తవమైన గృహస్థధర్మము. అట్టి ధర్మంబునకు శ్రీరామచరిత్ర మహోత్తమమైన లక్ష్యముగా నున్నది. జీవితముయొక్క పరమావధి ముక్తి అనిరి. ముక్తిఅనఁగా విడుదల అని యర్థము. విడుదల అగుటకుఁబూర్వము బంధంబుండనలయును. ఏల ఎప్పుడు ఎవరు దేనిని బంధించిరి? అను ప్రశ్నలు తప్పక వచ్చును. ఈ నాల్గింటి విచారమే తత్త్వశాస్త్రము. సంగమే బంధనంబనియు అసంగమమే ముక్తియనియుఁ దత్త్వశాస్త్రనిశ్చయము.

అట్టి అసంగసిద్ధి కలుగుటకుఁగా కర్మభక్తిరాజజ్ఞానములనెడి నాల్గుమార్గంబులను జెప్పిరి. ఈ మార్గములనే యోగములందురు. నాదికాదు అను భావమే అసంగయోగము. అది యొకవిధమైన మనస్తత్వము. కర్మయోగులు తమ కర్మఫలంబును తమదిగా భావింపకపోవుటచేత మనస్తత్వం బట్టిదిగా నగుచున్నది. భక్తి యోగులు తమరినే ఈశ్వరార్పణము చేయుటవలన వారికిఁగూడ

నట్టి మున స్తత్వము సిద్ధించుచున్నది. రాజయోగము జ్ఞానయోగము వీనియొక్క సిద్ధిగూడ నట్టిదిగానే యున్నది.

ఎల్లయోగములసిద్ధి అసంగమే గావునను, వారు వారు వారి వారి వర్ణాశ్రమదేశకాలస్థితులనుబట్టి యనుకూలమైన మార్గము ననుసరించి అసంగసిద్ధినిఁ బడయవచ్చుననియు, ఆ నాల్గుయోగములలో ఒకటిహెచ్చు ఒకటితక్కువ అనుభావము సరిగాదనియు, లోకమందు గృహస్థులు బహుళమగుటంజేసియు గృహస్థులకు మోక్షము లేదను తలంపుతో అన్యమార్గంబులను అనుష్ఠింపవలసినది లేదనియు శ్రీరామ చరిత్ర బోధించుచున్నది. ఈ కారణముచేతనే రామాయణము సర్వజనులకుఁ బ్రియతమముఁ బ్రశంసనీయమునై గ్రాలుచున్నది.

మా వంశనామధేయము 'దొడ్డ' అనియుండి కాలక్రమంబున 'దొడ్ల' అను మార్పుచెందెను. రామాయణము దొడ్డగ్రంథమగుటంజేసియు, మా యింటిపేరుగూడ 'దొడ్డ' అగుటవలనను ఉభయార్థద్యోతకంబుగా నా రచించిన దానికి 'దొడ్డరామాయణ' మను పేరిడితిని.

నా తండ్రిగారికి బొబ్బిలిమొదలు కార్వేటినగరమువఱకుఁ గల సంస్థానాధీశులు చిరపరిచితులు. అందు శ్రీ వేంకటగిరి సంస్థానాధీశులు ముఖ్యులు. నాకును బ్రకృతము శ్రీ వేంకటగిరి సంస్థానాధీశులైన శ్రీశ్రీ రాజా నెలుగోటి సర్వజ్ఞకుమార కృష్ణయాచేంద్రబహదూరు వారికిని దొలుదొల్తఁ గావలిగ్రామంబున 1926 వ సంవత్సరంబున వారు కుమారరాజుగానున్న కాలములో సమావేశము గలిగెను. అది క్రమక్రమంబుగా వర్ధిల్లి తుదకు వారు నా యెడ మిత్రభావంబును జూపునంతగా నయ్యెను. వారి యంతస్తత్వంబును గ్రహింపఁగల్గితిని. వారి హృదయము నిరంతర రామధ్యానపరమై యుండుటయు, ఎన్నఁడేనియుఁ గార్యాంతర ప్రయాణాదులవలన రామపదపూజకు నవకాశము గలుగనినాఁడు వారికొక దుర్దినమగుటయు సుగతమయ్యెను.

ఒకప్రక్క సిరిసంపదలతోఁ దులతూగుచుండియు, ఎల్ల యకార్యంబులకు బీజప్రదములైన భాగ్యోన్నతులుండియు, వానికిఁ గైవశముగాక దైవభక్తియు ధర్మరక్తియుఁ గలిగియుండుట సుకృత విశేషముగాని వేఱుగాదు. ఇట్టివారు భోగవాసనావిశిష్టులైన యోగభ్రష్టులగుదురని గీతావాక్యము.

శ్రీరాజాగారి యందుఁగల యీ శుభలక్షణంబులు నా హృదయంబు నాకర్షించెను. వారికీ ర్తి సుప్రతిష్ఠమగుట యుక్తమని తోఁచెను. తదర్థము నా రచించు గ్రంథంబును వారికి నంకితం బొనర్పఁదలఁచి నా తలంపును వారికి నెఱిఁగించితిని. నా యెడ వారికిఁగల ప్రేమాతిశయంబునఁ జేసి నా ప్రణయమును వారంగీకరించిరి. శ్రీవారి విశిష్టశుభగుణగౌరవసూచకంబుగాఁ బ్రతిఫలనిరపేక్షతో వారి నీ గ్రంథంబునకుఁ గృతినాయకులనుగాఁ జేసితిని.

ముద్రణంబున అఱసున్నలు శకటరేఫలు కొన్నియెడలఁ దాఱుమాఱయ్యెను. గ్రంథవిస్తరభీతిఁజేసి వానిని సవరణ పట్టికలోఁ జేర్పనైతిని. అజ్ఞానజనితంబులొండెఁ బ్రమాదవశంబులొండె దోషంబులు కొన్ని యీ గ్రంథంబునఁ గానరావచ్చును. వానిని దెలిపినచోఁ బునర్ముద్రణంబునఁ కృతజ్ఞతాపూర్వకంబుగా సవరించు కొందును.

ఈ గ్రంథంబును ముద్రణంబునకు నొసఁగితినేగాని, వ్యాపారపర్యటనవిశేషంబున నొక చోటియునికి నాకు దుర్లభమగుటంజేసి, ముద్రితభాగంబును సరిచూచుటకుఁగూడ సాధ్యము గాదయ్యెను. ఆ భారంబునెల్ల శ్రీ వాయునందన ముద్రాక్షరశాలవారే యోపికతో భరించి ముద్రణంబును బూర్తిజేసిరి. అందులకై వారికి వందన పరశ్శతంబు లర్పించుచున్నాను.

నా రచించిన కళావతీయుగంధరవిజయంబులవలె ఈ గ్రంథము గూడ మద్గురువర్యులగు శ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగారి శుభవిమర్శనదృష్టికి నోఁచియున్నచో యెంతో బాగుగానుండును. వారు కీర్తిశేషులగుటంజేసి యీ కలిమి దవ్వయ్యెను. ఇది గొప్పదురదృష్టము.

ఏ రామభక్తి బాల్యంబునుండి నాయంతర్లీనమై శుభాశుభంబుల రెంటఁ జేయూఁతగాఁ బరగుచు నా జీవితంబును గొనసాగించుచున్నదో ఏ రామభక్తి వాల్మీకిమహర్షి నుద్ధరించి తన్ముఖంబున రామాయణంబును సర్వలోకకళ్యాణంబుగా వెల్లడించెనో, ఆ రామభక్తి వలనఁ బ్రేరితుఁడనై నా గావించిన యీ సేవను ఆంధ్రప్రపంచం బంగీకరించి నన్ను ధన్యునొనర్చుఁగాక.

15–10–40
మకాం, కలిచేడు

ఇట్లు బుధవిధేయుఁడు,
దొడ్ల వేంకట రామరెడ్డి
గ్రంథకర్త

శ్రీ

రత్న మాల

శా॥ శ్రీసీతాకరసంపుటచుత్యములై సేసల్ పయిన్ రాలుచో
నా సంతోషము సుస్మితాయతనిజాస్యంబందుఁ దొల్కాడఁగా
వాసింగాంచిన రామభద్రుని కృపావాత్సల్యదృగ్జాలముల్
శ్రీసర్వజ్ఞకుమారకృష్ణవిభునిం జేయున్ శుభప్రాభవున్॥ 1

సీ॥ నిర్వక్రవిక్రమ నిపుణత మెఱయించి
ప్రథితరాజ్యశ్రీని బడసినాఁడు
హరిహరదేవాలయంబులు నిర్మించి
దైవప్రసాదంబుఁ దాల్చినాఁడు
కవిరాజరాజిసత్కావ్యరత్నము లంది
చెలిమి వాగ్దేవిఁ బూజించినాఁడు
అఖిలాన్నసత్రమహాగ్రహారంబుల
దానసన్మానముల్ దనిపినాఁడు

గీ॥ తలనువ్రాల్పని కీర్తిపతాకయనఁగ
సింహపురికళాశాల సృజించినాఁడు
ప్రణుతిపాత్రులు గారొకో ప్రజలకెందు
వేంకటగిరివెల్గోటి పృథ్వీపవరులు ?॥ 2

శా॥ కాలాతిక్రమ లుప్తధర్మసరిరక్షోదీక్ష సంధిల్లఁగా
లీలామానుషవిగ్రహుండగుచు భూలిన్ లోకముల్ ప్రోచు నే
కాలాతీతుఁడు వాని దివ్యకృప నెక్కాలంబు నిత్యోన్నతిం
గ్రాలుంగాక, కుమారకృష్ణపృథివీకాంతా ! భవత్సంతతుల్॥3

చ॥ వినయము శాంతభావము వివేకము సౌమ్యగుణంబు వాక్ప్రసా
దనమును గల్గినం గలుగుఁ దాదృశసంపదకెల్ల జీవమో
యను నవనీతతుల్యహృదయంబు విశిష్టవిభూమయై సహా
వనిధవకోటి మీకు నొకవన్నెను గూర్చెడుఁ గృష్ణభూవరా!॥4

ఉ॥ మాటల తేటతీపు లవిమర్శక బుద్ధిగ్రహింపవెన్నడున్,
జేటొనరించినన్ మదినిజేర్పవు, సారవిచారదృష్టమై
నాటినభావ మంతరమునం గనుగందఁగనీవు, ధాత్రి నీ
సాటిదొరల్ భవత్కులయశఃప్రసవంబులుగారె? భూవరా!॥ 5

ఉ॥ హాళి సహస్రవర్ష ములకవ్వలఁ దక్కినరాజ్యలక్ష్మి బే
తాళపరాక్రమోర్జిత యథాగతి మీ కులమందు నిల్చి నీ
పాలనఁగోరె న ప్పరమభాగ్యవతిన్ సుకుమారి సుందరిన్
లాలనచేసి పొందు మకళంక మహోన్నతభోగసంపదల్॥ 6

మ॥ సిరియున్ రాజ్యము భోగ్యవస్తుచయముం జేరన్ భవాంబోధిసం
తరణాసక్తియు రామపాదకమలధ్యానంబు నిక్కాలమం
దరుదా నైనఁ గుమారకృష్ణవసుధేశా? నీయెడన్ మూఁడు సు
స్థిరమయ్యెం దగ దే వరింప నినుఁబ్రీతిం గావ్యకన్యామణుల్? 7

ఆ॥వె॥ సత్య మొక్కఁడు మఱి సర్వభూతహితంబు
నెల్లధర్మములకు నెల్ల యండ్రు;
రాజపదవి వాని రక్షణార్థమగుట,
రామచరితఁ గఱపు, రాజవర్య!॥ 8

క॥ ఎందాఁకనుండు భారతి
యెందాఁకను రామచరిత మెసఁగు వసుధలో
నందాఁక నీ యశము సెం
పొందుత సర్వజ్ఞమగుచు నుర్వీనాథా!॥ 9

20—1—40
మకాం, నిత్యకళ్యాణి.

దొడ్ల వెంకటరామరెడ్డి,
కృతికర్త.

శ్రీరస్తు

సౌజన్యసింధువులైన శ్రీయుత దొడ్ల వేంకటరామారెడ్డి గారికి మిత్రుఁడు దుర్భా సుబ్రహ్మణ్యశర్మ ఆశీర్వచన పురస్సరముగా వ్రాసిన లేఖ :

తమరు ప్రీతిపూర్వకముగాఁ బనిచిన 'దొడ్డరామాయణము'ను దిలకించి యమందానంద భరితుఁడనైతిని. అందుఁ దొల్లాల నామనంబున కచ్చెరువు గొల్పినది గ్రంథ నిస్పృతి, సన్ననిపైపులలో డెమ్మిసైజున సుమారు వేయి పుటలగ్రంథమును వ్రాయుట కెంత దృఢవ్యవసాయము వలయునో అది ప్రాజ్ఞు లూహించుకొనఁ గలరు. ఆట్టి పూనిక యెల్లరకు సాధ్యముకాదు. మీరన్నట్లు మీ 'వృత్తి' యొకటి, 'యాశయము' వేఱొకటి. ఆట్లయ్యు నైదేండ్లలో నింత గ్రంథము రచించుటకు మీకుఁ బ్రేరకము కీర్తి యందలి రక్తియో, శ్రీరామచరణభక్తియోయై యుండవలయును. నిమ్మెఱుంగిన యెవ్వరుగాని మీరు తొలిదాని నంతగాఁ గాంక్షించువారని యనుకొనరు. మఱియు, మీ నిరాడంబర జీవితము, మీ తత్త్వజిజ్ఞాస, యివి యట్టి తలంపును దూరీకరించుచున్నవి. కావున శ్రీరామకథయందలి ప్రీతియే మీ గ్రంథ నిర్మాణోద్యమమునకుఁ గారణమని నే నూహించుచున్నాను. మీ తోడి సంభాషణములవలన నేను గ్రహించినంతవఱకు మీ 'హృదయమున' నాకుఁ గానవచ్చినంతవఱకు, మీ డెందము నిర్గుణముప్రక్కకన్న సగుణమువంకకే మొలునునూపుచున్నదని నా యెన్నిక. కావున 'సంభవామ్యాత్మ మాయయా' అని వాకొని యట్లే యవతరిలుచున్న సగుణబ్రహ్మమొయొక్క యసంఖ్యావతారములలో శ్రీరాముని పవిత్ర చరిత్ర మీ డెందము నరికట్టుటబ్బురము కాదు. మొల్లరామాయణము చదువుటచే ముప్పది సంవత్సరములకుఁ బూర్వమెన్నఁడో హృదయమున నాటుకొన్న భక్తిబీజము, తత్త్వవిమర్శల దోహదముఁ బొరసి యింత కాలమునకు మొలకెత్తి పతిత్రలోకపారిజాతమగుట మీ పూర్వపుణ్యవిశేషమని భావించుచున్నాను.

వాల్మీకిరామాయణమునకుఁ దెనిగింపులు పెక్కులు గలవు. కొని వానిలో నేది గాని భాస్కరరామాయణము వలె జనప్రీతిపాత్రమైనట్లు కానరాదు. అదేమివింతయో గాని, ఆ తెనిఁగింపులలో ఉత్తరోత్తరములకన్నఁ బూర్వపూర్వములే జనప్రియములుగాఁ గానవచ్చుచుంట విశ్వజనవిదితము. రామాయణమునకు యథామూలములైన ప్రన్నని తెనిఁగింపులు గద్యరచనలు ఒండు రెండు గలవు. అవి వెనుకటివారి పద్యరచవలకన్న హృద్యములుగా నున్నవని కొందఱిమతము. ఇంతకును గ్రంథమున డెందమును బంధిగొనునది రసనూర్తిగాని, కబ్బముయొక్కబాహ్యరూపము (పద్యము ఒండె-గద్య మొండె) కాదుకదా! మీ రచన యీ గద్యకృతుల నతిశయించుచున్నది. మఱియు మీరు గ్రహించిన యానుపూర్వింబట్టి విశిష్టముగానూడ నున్నది. 'కళావతి' దొరఁకొని వికసిలుచుండిన మీ వచన రచన యీ దొడ్డకృతియందుఁబరిణతమై చక్కని సౌరభము వెదచల్లుచున్నది. ఒక్కొక్కయెడ నవలలను, ఒక్కొక్కయెడ నాటకములను దలఁపించుచు మీ కథనమార్గమును రసప్రచురముగా నున్నది. పాత్రముల సంభాషణలతోనే ప్రధానములగు కథాభాగముల నడపుటయు, ఆ ప్రసంగములు ఔచిత్యతరంగితములై యుండుటయు మీ రచనలకు అపూర్వ వాల్లభ్యము నాపాదించుచున్నవి.

మీ రుదాహరించిన పద్యములు ఉత్తమోత్తమములు. అందు మీ యవియుఁ గొన్నికలవు. కొని మీరు సైంధవ భారత భర్తృహర్యాది కృతుల నాశ్రయింపక భాస్కరరామాయణ రామాభ్యుదయాది కృతులనుండియు, ఆంధ్రీకృతములైన 'జానకీ పరిణయా'ది రామపరబహురూపకములనుండియు మాత్రమే పద్యము గ్రహించియున్న సందర్భశుద్ధి ఇంకనుబంధురముగా నుండెడిది. ఇప్పుడున్న తెఱంగునఁ దత్తద్గ్రంథముల యెఱుకగలవారి మనస్సు రామకథనుండి మరలి తత్పద్యకర్తృరచనారుచిరతా పరామర్శకమగు చుండును. రావణుఁడు సీతను వర్ణించుపట్ల — కీచకుఁడు ద్రౌపదిని వర్ణించు తిక్కనపద్యమొకటి (గండుమీలకుఁబుట్టి-ఇత్యాది) ఒండు రెండుచోట్ల నుదాహృతమై యున్నది. ఇది విరాటపర్వ కథవంకకో, తిక్కన కవితాచమత్కృతి వంకకో మనస్సును మరల్చి ప్రకృతకథావధానమున కింకుక యడ్డుతగులును. ఏనను ఆట్టి గ్రంథములతోడి పరిచయములేని పఠితలకుఁ బలువురకు ఈ యుద్ధారములు సద్యస్సమాహ్లాదనహేతువులుగా నుండు ననుట నిరవద్యము. ఉత్తరకాండములోని కథ కొంతముందుకుఁ జెట్టి తక్కువభాగమును ఉత్తరరామచరిత నాటకముతో జోడించుట యందు మీ రసజ్ఞత ప్రకటితమగుచున్నది. కొన్ని స్తవములు సంస్కృతమున నున్న వాని నట్లే యుంచుట భక్తులగు పఠితలకుఁ బారాయణమున కత్యంతానుకూలము. ఎంత పెనంగినను, సంస్కృతమునకున్న గౌరవము తెనుంగునకు రాదనుటకు, ఇదా నీంతనుల భగవద్గీతాద్యాంధ్రీకరణములు పెక్కులు ఉపేక్షితము లగుచుండుటయే తారాక్ష్యము.

అయ్యో ఘట్టములలో ధర్మాధర్మములఁగూర్చి మీరు చేసిన సంప్రధారణ తత్తత్పాత్రముల శీలనున కనురూపమై మీ లోకజ్ఞతను, మీరు చేసిన తత్త్వశాస్త్ర పరిశ్రమమును వేనోళ్లఁ జాటుచున్నది. దైవము-పురుషకారము, త్రిగుణములు - తత్ పరిణామములు, శాస్త్రము-పురుషబుద్ధి ఇత్యాది చర్చలలో మీరు పాత్రముఖమునఁ జేయించిన సిద్ధాంతములు శాస్త్రసమ్మతములై మూలమునకు మెఱుంగు పెట్టుచున్నవి. వీనిని వీడఁదీసి చూపవలయునన్న విమర్శ విస్తృతమగును. దానికి వలయు నోపికయొండె నభినివేశమొండె నేఁడు నాకులేదు. అయోధ్యాకాండములోని శ్రీరామ జాబాలి సంవాదము ఈ తెఱఁగాంశములకుఁ దలమానికము.

మీ పదములు మృదువులు, సుప్రసిద్ధములు; సమాసములు శుభగములు; అన్వయ మక్లిష్టము, శైలి సరళము, ధార యనర్గళము. వేయేల, మీ గ్రంథము పండితులకుఁ బరితోషకారియై పాఠకులకుఁ జదువఁజదువ రసమొలికించునదియై చిరకాల మాంధ్ర దేశమునఁ బ్రశస్తిగాంచఁగల కతిపయకృతులలో నొకటిగా నుండునని నా దృఢ విశ్వాసము. బ్ర॥ శీ॥ వేదము వేంకటరాయశాస్త్రుల వారివలన మీరు వడసిన విద్యాతిశయము వితరేయక యిట్టిమహనీయకృతి ద్రావి యందు వారిని స్మరించుట మీ సౌజన్యము నకుఁ దద్దయుం దగియున్నది. ఈ రసోత్తర ప్రబంధము సంకితముగొన్న విద్వత్ప్రభువులు సర్వజ్ఞకుమార యాచేంద్రులవారు ధన్యులు. తద్వంశమువారు రచించిన, కృతిగొన్న బహుగ్రంథములవలె నిదియుఁ దదీయ యశఃపతాకయై విరాజిల్లఁగలదు. ఇందు దొరలిన పలుతెగలపొరలు రెండవకూర్పున సవరింపఁ బడఁగలవని విశ్వసించుచున్నాను.

అముద్రిత స్థితిలోఁ బెక్కునాళ్ళు నా కడనుండినను నేను సరిచూడ నైతిని కినుక మనసుకు రానీక, అచ్చువడిన వెనువెంటఁ బొత్తమును బంపి ప్రత్యక్షమున నా యభిప్రాయమును మరల మరలఁ గోరిన మీ ఋణమోగుణము కెట్లుగ్గడింపవలయునో

యెఱుంగకున్నాను. ఇట్టి గుణగౌరవముచేతనే మీకు అభిలషితము స్వాయత్తముగా నున్నను, భగవంతుఁడు మీకు నిరతిశయానంద ప్రదుఁడగుఁగావుత మని హృదయ పూర్వకముగాఁ బ్రార్థించుచున్నాను.

. మ॥ తినఁబెట్టఁబటువైన కల్మి, సరళోదీర్ణ స్వభావంబు, చ
క్కని వైదుష్యము, తత్త్వతత్పరత, సౌఖ్యంబీను సంసారశే
లన: ముత్సాహము, నార్జవంబు, నివియెల్లఁ గూడి నీయందుఁ బ్రా
గ్జనిఁ బుణ్యంబుల నేమొనర్చితివొ వేంకట్రామరెడ్డ్యగ్రణీ॥

నెల్లూరు
24-1-42

మిత్రుఁడు

దుర్భా సుబ్రహ్మణ్యశర్మ.

Retired Telugu pandit.
V. R. College.

విషయసూచిక

పూర్వకాండము :

విశ్రవసు జననము 1
వైశ్రవణ వృత్తాంతము 3
వైశ్రవణుఁడు లంకాపతియగుట 4
రాక్షసోత్పత్తి కథనము 4
హేతి సంతానము 4
సుకేసు జననము 5
మాల్యవదాదుల చరిత్ర 6
లంకా నిర్మాణచరిత్ర 6
మాల్యవదాదుల వివాహాదికము 7
దేవతలు శివుని శరణిల్లుట 8
దేవతలు విష్ణుని శరణిల్లుట 8
మాల్యవదాదుల మంతనములు 9
రాక్షసుల దండయాత్ర 10
విష్ణువు మాల్యవదాదులను నిర్జించుట 11
రాక్షసులు లంకనుండి పాతాళమునకుఁ బోవుట 13
రావణాదుల జననాదికము 14
దశగ్రీవుఁడు దనుజరాజ్యాభిషిక్తుఁడగుట 18
దశగ్రీవాదుల వివాహాదికము 21
దశగ్రీవుని దుండగములు 23
దూతను జంపుట 23
అన్ననోడించి పుష్పక విమానమును హరించుట 24
నందీశ్వర శాపము 27
శివుని తిరస్కరించుట 28
వేదవతిని బలాత్కరించుట 30
యజ్ఞభంగము చేయుట 31
నానారాజులను జయించుట — అనరణ్య శాపము 33
యముని జయించుట 34
రసాతల దండయాత్ర 40
వరుణుని జయించుట 41
నానాస్త్రీలను జెఱపెట్టుట 42
సోదరీ నిరసనము 43
రావణ శుక్రాచార్యుల సంభాషణము 44
రావణునకు విభీషణుఁడు హితవు చెప్పుట 44
రావణుఁడు రంభను ధర్షించుట 47
రంభ నలకూబరునిశ్రోల విలపించుట 48
నలకూబరుఁడు రావణుని శపించుట 49
రావణుఁ డింద్రునిపై దండెత్తుట 49
ఇంద్రకృత శ్రీమహావిష్ణు స్తోత్రము 49
శ్రీవిష్ణువు దేవేంద్రు నోదార్చుట 52
దేవదానవ యుద్ధము 52
జయంత మేఘనాదుల యుద్ధము 53
దేవేంద్ర రావణుల యుద్ధము 53
మేఘనాదుఁడు దేవేంద్రునిబంధించుట 55
యుద్ధము మానుమని మేఘనాదుఁడు తండ్రికిఁ జెప్పుట 56
దేవతలు బ్రహ్మకు మొఱపెట్టుట 56
బ్రహ్మ రావణునకు వరంబులిచ్చి ఇంద్రుని విడిపించుట 57
బ్రహ్మ ఇంద్రునాశ్వాశించుట 57
రావణ కార్తవీర్యార్జునుల యుద్ధము 59
రావణుఁడు నర్మదలో నీరాడి శివ పూజ సేయుట 59
నర్మద ప్రాజ్ఞుభియగుట 61
కార్తవీర్యార్జునుఁడు రావణుని బంది సేయుట 63
పులస్త్యుఁడు రావణునిపదలిపెట్టించుట 63
వాలిపయి రావణుఁడు దండెత్తుట 65
వాలి రావణుని భంగపఱచుట 65
దైత్యుల విశృంఖల చర్యలు 66

బాలకాండము :

అయోధ్యా నగరము 68
రాజ్యాంగము 71
ధర్మ పరిపాలన ఫలము 72
దశరథుని సంతాపము 72
దశరథుఁడు పుత్రార్థము యజ్ఞ మొనర్చుట 74
దశరథునకు సుమంత్రుని హితవచనము 74

ఋష్యశృంగుని చరిత్ర 75
యాగప్రకరణము 77
యజ్ఞారంభము 80
భోజనాదికము 80
యజ్ఞవేదికా నిర్మాణము 81
యజ్ఞదానాదికము 81
యజ్ఞాశ్వహోమాదికము 82
పుత్రకామేష్టి 82
యజ్ఞారము వచ్చిన బ్రహ్మతో దేవతలు మొఱపెట్టుట 88
దేవతలను బ్రహ్మ యోదార్చుట 88
తపస్సు - వాంఛితార్థ సిద్ధి 84
శ్రీమహావిష్ణు సందర్శనము 85
శ్రీవిష్ణువునకు దేవతలు మొఱలిడుట 86
శ్రీవిష్ణువు దేవతల నోదార్చుట 87
ప్రాజాపత్య పురుషుడు దశరథునకు పాయసమిచ్చుట 87
వానరావతార ఘట్టము 87
శ్రీరామాదుల జననము 89
విశ్వామిత్ర సమాగమము 90
దశరథునకు వసిష్ఠుడు హితంబుచెప్పుట 95
దశరథుడు రామలక్ష్మణులను విశ్వామిత్రునివెంట బంపుట 95
రాముడు బలాతిబలవిద్యలను గ్రహించుట 95
అంగదేశవృత్తాంతము 96
గంగాతరణము 97
మలినకరూశ దేశంబుల వృత్తాంతము 98
తాటకా వృత్తాంతము 98
తాటకావధ 100
గాధేయుడు రామునకు నానాస్త్ర ప్రదానము చేయుట 101
సిద్ధాశ్రమము 102
మారీచాదుల సంహారము 103
మిథిలాగమనము 104
గిరివ్రజపుర వృత్తాంతము 104
గాధేయ జననము 107
కాశికీనది వృత్తాంతము 107
దేవతలు నిస్సంతానవంతులగునట్లు పార్వతి శపించుట 108
షణ్ముఖ జననము 109
గంగావతార చరిత్ర 110
సగరుడు యజ్ఞము సేయుట 110
సగర యజ్ఞాశ్వహరణాదికము 111
గంగావతరణము 118
గంగకు జాహ్నవియను పేరు వచ్చుట 115
గంగకు భాగీరథియను పేరువచ్చుట 115
విశాలానగర వృత్తాంతము 116
సముద్ర మథనాదికము 116
కూర్మావతారాదికము 116
దేవేంద్రుడు దితిగర్భంబునుఁ బ్రవేశించుట 117
అహల్యా వృత్తాంతము 119
అహల్యాకృత రామస్తవము 120
జనకుని యజ్ఞము 122
జనకుఁడు విశ్వామిత్రాదుల సందర్శించుట 122
విశ్వామిత్రుని చరిత్ర 124
వసిష్ఠ విశ్వామిత్రుల వైరము 124
విశ్వామిత్రుఁడు రాజ్యమును సన్న్యసించుట 126
విశ్వామిత్రుఁడు మరల వసిష్ఠుని దార్కొనుట 127
విశ్వామిత్రుఁడు త్రిశంకునకు సశరీర స్వర్గమిచ్చుట 128
అంబరీషోపాఖ్యానము 132
ద్వితీయ భంగము 134
తృతీయ భంగము 135
బ్రహ్మత్వ సిద్ధి సాధనవిచారము 136
సర్వము యత్నసాధ్యము 137
శివధనుర్భంగము 139
దశరథాగమనము 141
ఇక్ష్వాకువంశక్రమము 143
జనకవంశక్రమము 144
ముహూర్త నిశ్చయము 145
సీతాకళ్యాణము 146
విశ్వామిత్ర నిర్గమనము 148
జనకోపదేశము 149
రామ పరశురామ సమాగమము 149
వసిష్ఠుడు రామునకుఁ బరశురామ చరిత్ర చెప్పుట 153
అయోధ్యానగర ప్రవేశము 156

అయోధ్యాకాండము :

దశరథ మంతనము 158
దశరథ సంకల్పము 159
పౌరజనామోదము 160
యౌవరాజ్యాభిషేకయత్నము 161
దశరథుఁడు రామునకు ముఖ్య రాజనీతులుపదేశించుట 162
కౌసల్యాదేవి పుత్త్రుని క్షేమార్థము భగవంతుని ప్రార్థించుట 163
రాముఁడు నిజయౌవరాజ్యాభిషేక వార్త తల్లికిఁ జెప్పుట 164
రాముఁడు పత్నితోడ నుపవాసవిధి సల్పుట 165
అయోధ్యానగరమును శృంగారించుట 166
విషబీజారోపణము — కైకేయీ మంథరలు 166
విషపరిణామము 173
కైకేయీ ప్రాసాదము 181
కైకేయీ కపటవ్యూహము 182
కైకేయీ దశరథుల సమాగము 183
దశరథుఁడు కైకేయికి బాసచేయుట 184
కైకేయి వరంబులు గోరుట 187
దశరథుని దుఃఖోదనములు 187
అభిషేక ద్రవ్యార్జనము 196
కైకేయీ సుమంత్రులు 196
రాముఁడు దశరథునొద్దకుఁబోవుట 198
కైకేయీ రాములు 199
రాముఁడు తల్లిని వీడ్కొనుట 203
కౌసల్యా విలాపము 204
లక్ష్మణుని శోకకోపంబులు 205
రాముఁడు కౌసల్యా లక్ష్మణుల నోదార్చుట 206
రాముఁడు లక్ష్మణుని శాంతి పరచుట 212
కౌసల్యాదేవి పుత్త్రుని దీవించి పంపుట 213
సీతా పతిభక్తిపరీక్ష 217
లక్ష్మణుని పట్టుదల 224
పెద్దలను బూజించి వీడ్కొనుట 226
ప్రదానములు 226
భృత్యవర్గ సన్మానము 227
త్రిజటుఁడు 227
ప్రజాదుఃఖము 228
తండ్రిని వీడ్కొనుట 229
సుమంత్రుఁడు కైకేయికి బోధించుట 232
కైకేయీ దశరథుల వివాదము 233
సిద్ధార్థుఁడు కైకేయిని నిందించుట 234
రామాదులకు వల్కలము లిచ్చుట 234
వసిష్ఠుఁడు కైకేయికి హితము చెప్పుట 235
దశరథుని పరితాపము 236
కౌసల్యాదేవి సీతకు హితముపదేశించుట 237
సీత నిజమనమును వెల్లడించుట 237
రామాదుల నిర్గమనము 237
సీతారామలక్ష్మణుల వనప్రయాణము 238
దశరథుని దురవస్థ 239
కౌసల్యా విలాపము 240
సుమిత్ర కౌసల్య నోదార్చుట 241
రామాదయోధ్యావాసుల నూరార్చుట 242
వృద్ధబ్రాహ్మణులు రాముని వెంటఁ బడి వేఁడుట 243
వనవాస ప్రథమ వాసరము 244
రాముఁడు పురవాసుల నేమరించి చనుట 245
పౌరులు రామునిగానక యిల్లుచేరుట 245
రాముని వదలివచ్చినవారికిఁ దమ పతులను బౌరస్త్రీలు కోరుట 247
రాముఁడు కోసలదేశంబును గడచి చనుట 247
గుహునితోడి సమాగమము 248
గుహలక్ష్మణుల సంవాదము 249
రాముఁడు సుమంత్రుని గుహుని వీడ్కొనుట 250
గంగాతరణము 253
తొలిరాత్రి 254
భరద్వాజాశ్రమము 255
యమునాతరణము 257
చిత్రకూటమున వాల్మీకిని సందర్శించుట 258

పర్ణశాలా ప్రవేశము 258
గుహుఁడు సుమంత్రుని వీడ్కొనుట 259
సుమంత్రుఁడు దశరథుని సందర్శించుట 259
దశరథుఁడు మూర్ఛగతుఁడగుట 261
కౌసల్యా పరిదేవనము 262
దశరథుని నిర్యాణము 270
జనులు కర్తవ్యమునుగూర్చి పలుకుట 271
భరతునకుఁగా దూతలు గిరివ్రజ పురమునకు జనుట 272
భరతుని స్వప్నము 273
భరతుఁడయోధ్యకుఁ దరలుట 275
అయోధ్యానగరస్థితి 275
కైకేయీ భరతులు 276
భరతుని శపథము 279
దశరథుని దహనక్రియలు 281
భరత పట్టాభిషేకమును రాజకర్తలు కోరుట 283
భరతుఁడు రాజ్యమును నిగ్రహించుట 284
భరతుఁడు రామునికై తరలుట 285
గుహ భరత సంవాదము 285
భరతుఁడు భరద్వాజ మహర్షిని సందర్శించుట 289
భరద్వాజుఁడు భరతునకు విందొనర్చుట 290
భరతుఁడు చిత్రకూటమునకుఁదరలుట 292
సీతారాముల వనవిహారము 293
రామభరతుల సమావేశము 295
రాముఁడు రాజధర్మముల నుపదేశించుట 298
భరతుఁడు రామపట్టాభిషేకమును ప్రార్థించుట 302
రాముఁడు తండ్రికి జరమక్రియలు సలుపుట 303
కౌసల్యాదేవి పుత్రాదుల కష్టములకై దుఃఖించుట 304
రామాదులను వారి తల్లులు చేరుట 305
రామభరతుల సంవాదము 305
రామ జాబాలిమహర్షుల వివాదము 309
చార్వాకమత ఖండనము 312
స్వభావవాద ఖండనము 312
పరమాణువాద ఖండనము 313
సృష్టితత్త్వము 313
పరమాత్మ 313
కారణతత్త్వ విచారము 313
సృష్టిసంకల్ప విచారము 314
కర్మతత్త్వము 315
శ్రాద్ధవిధి 316
సైన్యరక్షితి 316
యోగములు 317
మనుష్యుని విశేష ధర్మము 317
యుక్తివాదఫలము 317
సత్యమే ధర్మము 318
రామవసిష్ఠుల సంవాదము 319
భరతుఁడు నిరశనవ్రతమున కుపక్రమించుట 320
దేవతలు భరతునకు హితము చెప్పుట 321
రాముఁడు తన పాదుకలిచ్చి భరతుని పంపుట 322
పాదుకా పట్టాభిషేకము 322
ఋషులు చిత్రకూటమునుబాసి చనుట 323
రాముఁడు చిత్రకూటమును వదలి యత్రియాశ్రమము చేరుట 324
రామాదులు దండకారణ్యమునకుఁ బోవుట 325

అరణ్యకాండము :

రాముఁడు సీతాలక్ష్మణులతోడఁ దాపసమండలమునకుఁ బోవుట 326
విరాధవధ 327
రాముఁడు శరభంగాశ్రమమునకుఁ జనుట 330
ఆశ్రమమునులు రాక్షసబాధలుగూర్చి రామునకు మొఱలిడుట 331
సుతీక్ష్ణమహర్షి యాశ్రమము 333
సీతారాముల సంభాషణము 335
ధర్మభృన్ముని సందర్శనము 339
రామాదులు మునిపల్లెలో పదియేండ్లు గడపి సుతీక్ష్ణమహర్షి యాశ్రమంబు చేరుట 340
సుదర్శనాశ్రమము 340
ఇల్వల వాతాపులు 341

అగస్త్యాశ్రమము 342
జటాయు సందర్శనము 345
పంచవటి 345
ఋతువర్ణనము 346
శూర్పణఖ 347
జనస్థానము-ఖరాసురుడు 348
ఖరుడు రామునిపై బదునల్వుర రక్షోవీరులఁబంపుట 349
ఖరుని యుద్ధసన్నాహము 350
దుశ్శకునములు 351
రాముఁడు యుద్ధసన్నద్ధుఁడగుట 352
రాక్షససైన్య సంహారము 353
దూషణ సంహారము 354
ఖరసేనాధ్యక్షుల సంహారము 354
త్రిశిరుని సంహారము 355
ఖరసంహారము 356
ఆకంపనుఁడు జనస్థాన వృత్తాంతంబును రావణునకుఁ దెలుపుట 359
రావణుఁడు మారీచుని సహాయము గోరుట 360
రావణుఁడు పగదీఱు విధమును నిశ్చయించుట 365
రావణ మారీచుల పునస్సమాగమము 365
మారీచుఁడు రావణునకు మరల హితంబు చెప్పుట 366
రావణుఁడు మారీచుని శాసించుట 368
రావణ మారీచులు రామాశ్రమము వచ్చుట 369
మారీచుఁడు చిత్ర సువర్ణమృగమై సీతాదేవిని ప్రలోభించుట 370
సీతాదేవి మాయామృగంబును తేఁగోరుట 370
రాముఁడు మృగార్థము పోవుట 371
మాయామృగ ప్రహారణము 371
సీతాదేవి లక్ష్మణుని గతినిందించాడుట 372
లక్ష్మణుఁడు రామునికొఱకుపోవుట 373
రావణుఁడు సన్యాసి వేషముదాల్చి వచ్చుట 374
సీతాదేవి మాయాసన్యాసిని సత్కరించుట 376
మాయాసన్యాసి నిజరూపంబుఁ దెలుపుట 377
సీతాదేవి రావణునిఁ దిరస్కరించుట 377
రావణుఁడు సీతాదేవిని హరించుట 378
సీతావిలాపము 379
జటాయువు రావణుల యుద్ధము 381
జటాయువునకై సీతాదేవి దుఃఖించుట 383
దుశ్శకునాదులకు రాముఁడు సంతాప మొందుట 385
లక్ష్మణుఁడు తాను సీతాదేవిని వదలిన కారణముఁ దెల్పుట 386
రామవిలాపములు 386
లక్ష్మణుఁడు రామునోదార్చుట 389
రాముఁడు ముఖ్యాతిరేకంబున దారుణోద్యోగి యగుట 389
లక్ష్మణుఁడు రామునితలంపుమార్చుట 391
రాముఁడు సీతాన్వేషియై తరలుట 392
లక్ష్మణుఁడు రామునకు ప్రశాంతి గూర్చుట 394
జటాయువు రామునకు సీతా వృత్తాంతము చెప్పుట 396
జటాయువు దహనసంస్కారములు 397
రావణుఁడు సీతాదేవిని లంకకుఁ దెచ్చుట 398
మతంగాశ్రమము - ఆయోముఖి 399
కబంధుఁడు 400
సుగ్రీవునితో మైత్రిసేయుమని కబంధుఁడు రామునకుఁ జెప్పుట 402
రావణుఁడు సీతాదేవికిఁ బండ్రెండు నెలలు గడువిచ్చుట 404
రామలక్ష్మణులు శబరియాశ్రమముఁ జేరుట 406
పంపాసరోవర సందర్శనము 407

శ్రీరస్తు

శ్రీ సీతారామచంద్రపరబ్రహ్మణేనమః

శ్రీ దొడ్డరామాయణము

శా. శ్రీమద్దివ్యగృహస్థధర్మముఁ బ్రతిష్ఠింపంగ మర్త్యాకృతిన్
భూమింబుట్టె నెవండు, ముజ్జగము లేపుణ్యాత్మకుం బాడుచున్
సేమం బందుఁ జతుర్విధార్థముల, నాసీతామనోహారి శ్రీ
రాముం డీవ్రత మాకుఁ బ్రీతిమెయి నశ్రాంతంబు భద్రంబులన్.

ఉ. అంకిలి లేక కార్యము సమాప్తము నొందెడుపాంటె మున్నుగాఁ
బంకజసంభవాదులు సభక్తికపూజ లొనర్తు రేని కా
శంకరుపట్టి బన్నములసామి దయాపరతంత్రమూర్తి మా
వంకఁ గటాక్షవీక్షణ లవం బొలయించెడుఁగాత నర్మిలిన్.

కం. పంచాశద్వర్ణములఁ బ్రపంచంబున వ్యాప్తిఁగాంచి పరగెడుతల్లిం
జంచద్విపంచికాసముదంచితపాణిన్ భజింతు నబ్జజురాణిన్.

ఉ. ఆదిఁ గలావతిన్ నుతుపునప్పుడు ప్రోడతనంబుఁ బూని యా
మీఁదట మార్దవం బనుగమించి యుగంధరునిన్ వచించి నీ
తాదహరప్రకాశమునఁ దద్దయుసౌమ్యతఁదాల్చితిప్పు డే
మాదిరి పల్కుదో భువనమంగళమూర్తిచరిత్ర, భారతీ.

ఉ. ఆశయమొండు వృత్తియన నయ్యె నొకండుగఁ, బూర్వకర్మ మీ
రాశిది యీటఁజేసి యిరురాజులఁ గొల్చుటయయ్యెనాకు, నా
యాశలు దీఱఁ దావకపదాబ్జసపర్య లొనర్పనైతి నం
చో శుకవాణి! నావలను నూనకువమ్ము పరాఙ్ముఖత్వమున్.

గీ. అరిదిగఁ గవితాశాఖాగ్ర మధివసించి
'రామరామ' యనెడి మధురాక్షరముల
మధురమధురంబుగాఁగఁ దన్మయతఁ బల్కు
ననఘు వాల్మీకికోకిలం బాత్మఁ దలఁతు.

మ. ప్రతిభానిర్మితనూత్నభావమయసామ్రాజ్యం బధిష్ఠించి శా
శ్వతులై ప్రాకృతజీవలోకశుభకాంక్షన్ సద్రసాసార సం
తతధారల్ గురియించి యక్షయమహానందంబు నశ్రాంతముం
బ్రతిపాదించెడి సంస్కృతాంధ్రసుకవిబ్రహ్మల్ ననుంబ్రోచుతన్.

చ. అనుపమ చిత్తశుద్ధినిరుపాధికభక్తియుఁ దోడు నిల్వ నే
యనఘుఁడు దాఁటె రామచరితాంబుధి సర్వజగన్నుతంబుగాఁ.
బ్రణతజనార్తిహారియు శుభప్రతిపాదియు నేమహాత్ముఁ డా
యనిలతనూజుఁ డీవృత ననంతదయామతి వాంఛితార్థముల్.

చ. ఎవనిసపర్యలం దలఁచి యెంతయువండురు నాంధ్రవాణి యా
ప్రవిమల ధీవిశారదుని బండితవర్యు రసౌచితీ రహ
స్యవివరణాద్వితీయుని గుశాగ్రమతిన్ భజియింతు మద్గురున్
వివిధ కళాప్రపూర్ణ నల వేదము వెంకటరాయశాస్త్రిలన్.

చ. పటుతరవాగ్మి యంచుఁ బ్రతిభాప్రథితుం డని యార్తకోటికిం
బటువగు సూతకొమ్మయనఁ ప్రస్తుతిఁగన్న రసజ్ఞమాళిఁ బ్రా
కట కవితావినోది బుధగణ్యుని శ్రీయుత తూములూరు వేం
కట శివరామమిత్రమణి గాటపుఁగూర్మి దలంతు నిచ్చలున్.

ఉ. కేవల రామభక్తి పలికించినవైఖరి నిమ్మహాకృతిన్
ధీవరులార! వ్రాయుటకుఁ దెంపు వహించితి నంతె గాని ప్ర
జ్ఞావిభవంబుఁ జూపుటకుఁగాదు; రసంబుగ్రహించి పేర్మి దో
షావళి నుజ్జగింపనగు హంసలు క్షీరము నీరముం బలెన్.

ఉ. ఆయతభక్తి నీదుచరణాబ్జములన్ మదినిల్పి దొడ్డ రా
మాయణమంచుఁ బేరిడి యమానుషకంబగు నీచరిత్రమున్
వ్రాయఁగఁ బూనితిం దెలుఁగువాక్యముగాఁ గడుఁదెంపుసేసి, రా
మా! యిటు లీమనోరథము మన్ననచేయుదువో దయానిధీ!

ఉ. గీతలసేవచేతను జిగిర్చిన చిత్తముఁ బెంపుగాంచెఁగా
నాతతభక్తిమూలభవదంఘ్రుల చల్లనినీడవైచి నా
చేతులు గూర్చితిం గరుణఁ జేకొని ప్రోవుము రామచంద్ర! యా
సీతను వాయునందనుని జిష్ణువిభీషణుఁ గన్నకూర్మితోన్.

ఉ. నీ వవతార మెత్తుటయె నిక్కముగాదటఁ, మూనికల్పనో
జ్జీవితచిత్రమూర్తివట, చెల్లరొ! సాధ్యమె నిన్నుఁ గాంచ దో
షావిలకర్మబద్ధజనుషాంధులకున్ బహిరాంతరాత్మ లీ
లావిభవాభిరాము సకలస్థితిమూలము, రామభద్రకా?

చ. అనృతముఁ బల్క నన్న ముని యయ్యెను డక్కరి, కల్పితుండవై
తనరితి వీవు, నీదుచరితల్ ముసలమ్ములసుద్దు లయ్యె, ని

న్ననయముగొల్చుటయ్యె హృదయంబునుగ్రమ్మినదుర్బలంబహో!
కన నగుఁగాదె యిందె కలికాలవిశేషము రామభద్రకా!

ఉ. అంతరమందు నీదు మధురాకృతి నిల్పి నిరంతరంబు నై
కాంతికభక్తి చేయు మహితాత్ముల కెల్లను దోడునీడవై
చెంతఁ జరించుచుండుదువు సిద్ధము సుమ్మిది వక్రబుద్ధు ల
త్యంతము నిన్ను లేదనినయంతనె చెల్లునె? రామభద్రకా!

ఉ. తొల్లిటిగాథ లేల? యల తుర్కఁ గపీరుని రామదాసునిన్
దల్లయుఁడైన యా తులసిదాసుని నమ్మగఁరాదె? వారలు
న్నల్లరులంచుఁ బల్కునవనాగరకాగ్రణులున్న నుండసీ;
చెల్లరొ! యంతమాత్రనె నశించునె సత్యము? కల్లనిల్చునే?

మ. చనెఁబో నేఁబదియేడువర్షములు నాజన్మాది, నెన్నాళ్ళు భూ
మిని నున్నన్ ఫలమేమి? యిట్టిబ్రదుకుల్ మిథ్యావినోదక్రియా
వినియోగాత్మకనాటకంబులుగదా, విశ్వేశ్వరున్ నిన్నుఁ గా
ననినాఁడింతటనేనిఁ దీర్పఁగదవే నాకోర్కె సీతాపతీ.

సీ. సిరిసంపదలఁగోరి సేవింపఁగా లేదు
ప్రారబ్ధమును ద్రోయరాదుగానఁ
బేరుప్రతిష్ఠకై పెనగుఁలాడుట లేదు
వర్తనంబును బట్టివచ్చుఁగాన,
భార్యాసుతులమేలు ప్రార్థింపగా లేదు
వారు నీవారలై వఱలుఁ గాన
అద్వైతసిద్ధికై యాసింపఁగాలేదు
ద్వైతవాసనయింకఁ దనరుఁగాన,

గీ. చిత్తమేప్రొద్దు నీయందె స్థిరతగాంచి
నీకథామృతపానైకనియతిఁ గల్గి
తావకేచ్ఛానుసారియై తరలునట్లు
ప్రేమతోఁ ప్రసాదింపుము రామచంద్ర.



శ్రీ సీతారామాంజనేయార్పణమస్తు.

శ్రీ దొడ్డ రామాయణము

పూర్వకాండము

చ. అవసర మైనయప్పుడు స్వయమ్ముగ నేఘనుఁ డాత్మమాయచే
నవతరణంబు నొంది దురితాత్ములదుర్భరబాధనుండి యీ
భువనముఁ బ్రోచు,నప్పరమపూరుషు నాద్యు ననంతు నప్రమే
యవిభవు సర్వలోకసముపాశ్రయు దీనదయాళుఁ గొల్చెదన్.

విశ్రవసు జననము

తొల్లి కృతయుగంబునఁ బ్రజాపతికిఁ బులస్త్యుఁడను సుతుఁ డుండెను. అతఁడు సర్వసుగుణసంపన్నుఁడై ధర్మమునుబట్టిగాని శీలమును బట్టిగాని సాక్షాత్ప్రజాపతియే యని పొగడొందుచు దేవతలకెల్ల వల్లభుఁడై సర్వలోక ప్రియుఁడుగా నొప్పెను.

ఆ పులస్త్యుఁడు ధర్మపరత్వంబునఁ జేసి మేరుపర్వతంబునకుఁ జని యందుఁ దృణబిందువను పేరి యాశ్రమంబున వసించుచు స్వాధ్యాయ నియతేంద్రియుఁడై ఘోరతప మొనర్పసాగెను.

ఆ ప్రదేశము సర్వఋతువులందు రమ్యము నుపభోగ్యమునై యుండుటఁ జేసి యటకు దేవకన్యకలును బన్నగాంగనలును రాజర్షి తనయులును జని క్రీడించుచుండిరి. ఆ మహిళారత్నముల మధుర గానాలాపంబులును నృత్యగీతంబులు నత్తపశ్శీలికి విఘ్నకారులై తోఁచెను. అతఁ డందులకుఁ గోపించి, 'ఎవతె యిటకు వచ్చి నాకంటఁ బడునో యా యింతి సద్యోగర్భవతి యగుఁగాక' అని శపించెను. ఆశాపంబును విని భయపడి నాఁడుసుత ఆకన్య లటఁజనుట మానిరి.

ఆ కాలంబునఁ దృణబిందు వనురాజర్షి గలఁడు. వాని కొక పుత్త్రిక యుండెను. ఆ కోమలి యీ శాపంబు నెఱుంగక యథా పూర్వము నాఁడుగూడ నయ్యాశ్రమ ప్రదేశంబునకుఁబోయి యందుఁ గొంతవడి విహరించుచుండెను. ఎంతసే పున్నను సఖు లెవ్వరు నటు

రారైరి. కారణ మేమోయని యాపూబోఁడి తలపోయసాగెను. అంత లోన స్వాధ్యాయధ్వని శ్రవణోల్లాసముగా వినవచ్చెను. ఆ వేదశ్రుతి యెందుండి వచ్చెనో యెఱుఁగ వేడుకపడి యా కాంతామణి యావంకఁ గొంతదూరము పోయెను. అటఁ బులస్త్యఋషి యుండెను. వానినిఁ జూచుటే తడవుగా నామె దేహము వైవర్ణ్యముఁ జెందెను; ఆమెకు గర్భచిహ్నము లుదయించెను.

ఆ బాలామణి తద్విపరీతంబునకు సముద్విగ్నమానసయై, 'కటా! ఏ దోషంబున నిట్టిది సంభవించెనో' యని చింతించుచుఁ దండ్రి యాశ్రమంబునకుఁబోయి వానియెదుట నిలిచెను. తృణబిందువు తనపట్టిని జూచి, 'పుత్రీ నీ శరీర మిట్లు గానేల' అని యడిగెను. 'తండ్రీ, కారణ మేమో తెలియరాదు. పులస్త్యమహర్షి యాశ్రమంబునకు నా చెలుల కొఱకుఁ బూర్వపురీతిఁ జనితిని. అటకు నాసఖులెవ్వరును రారైరి. అంతలోన వేదశ్రుతి చెవిఁబడెను. ఆవంకకు జని యటఁ బులస్త్య మహర్షిని జూచితిని; వెంటనే నారూప మిట్లు విపర్యాస మొందెను; భయపడి యిందువచ్చితి' నని యామె చెప్పెను.

తృణబిందువు వృత్తాంత మెల్ల విని ధ్యానగతుఁడై దివ్యదృష్టి చేత సమస్తము గ్రహించి వివరంబును బుత్రికకుఁ దెలిపి యామెను వెంటఁగొని పులస్త్యమహర్షి యొద్దకుఁ బోయి, 'మహాత్మా, ఈ బిడ్డ నా పుత్రిక. సుగుణభూషణభూషిత; ఈమెను నీకు సమర్పించుచున్నాను గ్రహింపుము. తపశ్చరణయుక్తుండవును శ్రామ్యన్మనోజేంద్రియుఁడవు నైన నీకు నాసుత శుశ్రూష లొనర్చుచుండు' నని పలికెను. పులస్త్యుఁడు వల్లెయనెను. అంతఁ దృణబిందువు తనపట్టిని వానికి యథాశాస్త్రము మర్పించి నిజాశ్రమంబునకుఁ బోయెను.

ఆకన్య యందుండి పులస్త్యుని శుశ్రూషించుచు స్వగుణంబుల వాని మదికెక్కి వర్తించుచుండెను. ఆమునిపుంగవుఁ డామె శీలవృత్తంబులకు సంతోషించి, 'సుశ్రోణీ, నీగుణసంపద కెంతయు నానందించితిని. ఆత్మసదృశుఁడైన పుత్రుని నీకుఁ బ్రసాదించితిని. ఉభయవంశంబులకు నతఁడు కర్తయై పౌలస్త్యుఁ డనుపేరఁ బరగును. మఱియు నేను వేదాధ్యయనము చేయుచుండఁగా నీవు వింటివి గావున నీగర్భసంజాతుని విశ్రవసువనియుఁ బేర్కొందురు' అని చెప్పెను. ఆమె ప్రహృష్టాత్మ యయ్యెను. అంతఁ గొన్నాళ్లకు విశ్రవసువు జనించెను. అతఁడు

పుట్టువుఁదొట్టి యశోధర్మంబులఁబాయక సమస్తవేదంబు లధ్యయనించి వ్రతాచారరతుఁడును సమదర్శియునై తండ్రివలెనే తపంబాచరించి ముని యయ్యెను.

వైశ్రవణ వృత్తాంతము

విశ్రవసుఁడు సత్యసంధుఁడై శీలముఁబాయక మూర్తిగొన్న శాంతమట్లు తేజరిల్లుచు శుచియు స్వాధ్యాయనిరతుఁడును సర్వభోగ విముఖుఁడును నిరంతరధర్మపరాయణుఁడునై యుండుట భరద్వాజ మహర్షి యెఱిఁగి పరమప్రీతుఁడై దేవవర్ణి యను తనపుత్త్రికను వాని కిచ్చి వివాహ మొనర్చెను. వారికి సుతుఁ డొకఁ డుదయించెను. ఆ బాలుఁడు శైశవంబునందే బ్రహ్మగుణయుతుఁడగుటకుఁ బితామహుఁడు సంతసించి వాని భవితవ్యమునకుఁ బోలునట్లుగా ధనాధ్యక్షుఁడనుపేరు వానికిఁజెను. మఱియు నతఁడు తండ్రి నెల్లవిధంబులఁ బోలుటఁజేసి వానిని వైశ్రవణుఁడనియు వచించిరి.

ఆ వైశ్రవణుఁడు తపోవనగతుఁడై 'సత్యం హి పరమం ధర్మం ధర్మో హి పరమాగతిః' అని నమ్మి నియమము వహించి ధర్మ మాచ రించుచు సహస్రవర్షంబులు తపంబు సలిపి స్నాతుఁడై జలాశిగాఁ గొంతకాలము, వాయుభక్షుఁడై కొంతకాలము, నిరశనవ్రతంబూని కొంతకాలము, నిట్లు మఱల వేయి సంవత్సరంబులు పుచ్చెను. ఈవర్ష సహస్రము వానికొక్క వర్షమాత్రంబుగాఁ గడచెను. బ్రహ్మ వానికి మహాప్రీతుఁడై యింద్రాదిసురగణపురస్సరంబుగాఁ దదాశ్రమంబునకు వచ్చి 'వత్సా, నీకు నెచ్చిత్తిని; శుభమగుఁగాక; వరముఁ గోరుము; వరములకుఁ బాత్రుఁడవుసుమా' యనెను.

వైశ్రవణుఁడు పరమేష్ఠికి నమస్కరించి, 'దేవా, లోకపాలన వితరక్షణాధికారంబులను వరింతు' ననెను. బ్రహ్మయు సంతసించి, 'వత్సా, అట్లే యగుఁగాక. లోకపాలకత్వంబునకై యింద్రయమ వరుణు లనువారిని ముగ్గురను సృష్టించి నాల్గవవాని నిర్మాణంబును సంకల్పించియున్నాను. నీవే యతఁడవై నిధీశత్వముఁ బడసి యుండు' మని పలికి సూర్యసన్నిభమైన పుష్పకవిమానంబునిచ్చి 'వత్సా, ఈ విమానరాజంబును గైకొని దేవతాసముఁడవై సంచరించుచుండుము. నీకీ వరద్వయం బిచ్చి కృతకృత్యులమైతి' మనుచుఁ ద్రిదశులతోడ స్వస్థానంబునకుఁ బోయెను.

వైశ్రవణుఁడు లంకాపతియగుట

బ్రహ్మదులు చన్నంతనే వైశ్రవణుఁడు తన తండ్రియొద్దకుఁ బోయి వానికి మ్రొక్కి యుదంతమెల్ల విన్నవించి, 'పరమేష్ఠి యిష్టవరంబుల రెంటి నిచ్చి చనెను. ఎందు నేను వసింప నగునో వాని నడుగ మఱచితిని; ఆయనయేని నా నివాసస్థల మిది యని నిర్దేశింపఁడయ్యెను. తగు చోటు నిర్ణయింపుము. ఎచ్చట నే నున్నచో నావలనఁ బ్రాణులకుఁ గించిన్మాత్రమేనియు బాధ కలుగకుండునో యట్టి తావును నిశ్చయింపు' మని కోరెను. విశ్రవసుఁడు సుతునకు సంతసించి పర్యాలోచించి, 'నాయనా, దక్షిణసముద్ర తీరంబునఁ ద్రికూట మనుపర్వతము గలదు. ఆనగంబుమీఁద నమరావతిని బోని పురవరంబు లంక యనునది యున్నది. ఆనగరరత్నంబును దొల్లి విశ్వకర్మ రాక్షసనివాసార్థము నిర్మించెను. సువర్ణప్రాకారపరిఘావలయితంబును రుక్మవైడూర్యతోరణవిరాజితంబును సమస్తయంత్రశస్త్రసంపూర్ణంబునై శోభిల్లు నప్పురంబున రాక్షసులు నివసించుచుండి కొండొకనాఁడు విష్ణువులని భయంబునఁ జేసి దానిని వదలి రసాతలము నాశ్రయించిరి. నాఁటఁగోలె నది శూన్యముగా నున్నది. దానికి జేఁ డెవ్వఁడును గలుగఁడు. నీ వందు సుఖముండుము. ఆచోటు నీకోరికకు సరిపోవు' నని చెప్పెను.

రాక్షసోత్పత్తికథనము

నాప్రుడు, 'నాయనా, ఈరాక్షసు లెవ్వరు? వారి పుట్టుపూర్వము లేమి? విష్ణువులనిభయము వారికేల దాపరించె' నని వైశ్రవణుఁ డడిగెను. విశ్రవసుఁ డిట్లనియె. 'వత్సా, తొల్లి ప్రజాపతి జలంబులను సృజించి తద్రక్షణార్థము జలజంతువులను బుట్టించెను. ఆ సత్త్వములు సృష్టికర్తను డాసి 'క్షుత్పిపాసార్థితులమైతిమి; ఏమి చేయ నగు'నని నినీతవిధంబున నడిగెను. అది విని ప్రజాపతి నవ్వులాటకుంబోలె 'రక్షధ్వ' మనెను. ఆమాట విని 'రక్షామ' అని కొన్ని 'జక్షామ' అని కొన్ని అచ్చపెట్టెను. బ్రహ్మ కోపించి 'రక్షామ' అని యన్నవి రాక్షసులుగా, 'జక్షామ' అని యన్నవి యక్షులుగా నగునట్లు శపించెను. ఆ సత్త్వము లట్లాయెను.

హేతిసంతానము

'అందు హేతి ప్రహేతి యనువా రిరువు రన్నదమ్ములు, మధుకైటభులతో నెన సేయఁదగినవారుండిరి. వారిద్దఱు రాక్షసులకు రాజు

లైరి. అందుఁ బ్రహేతి యనువాఁడు ధార్మికుఁడు; దానంజేసి యతఁడు తపోవనంబునకుఁ బోయెను. హేతియనువాఁడు భార్యార్థియై ప్రబల ప్రయత్న మొనర్చి తుదకు శమనుని చెల్లెలు భయ యను కన్యను బెండ్లాడి యా యింతివలన విద్యుత్కేశుఁడను సుతునిఁ బడసెను. ఆకూన దీప్తార్కసమతేజస్సమేతుఁడై పెరిగి కాలక్రమంబున సంప్రాప్త యౌవనుఁడయ్యెను. హేతి వానికిఁ బెండ్లిసేయ సంకల్పించి సంధ్యా సుతను దనబుత్రునకుఁగా వరించెను. అఁడుబిడ్డ నెవ్వనికైన నొకనికిఁ గూర్పక తప్పదు గావున సంధ్య యుంచులకు నియ్యకొని తన కూఁతును సాలకటంకట యనుదానిని విద్యుత్కేశున కిచ్చి వివాహ మొనర్చెను. అతఁడు భార్యంగూడి యింద్రుఁడు శచీదేవితోడ బోలె సుఖంబులు చూఅగొనుచుండెను.

సుకేశుజననము

'ఇట్లు కొంతకాలము జరుగఁగా సాలకటంకట చూలు దాల్చి మందరపర్వతంబునకుఁ జని యట శరత్కాలసూర్యతేజస్వియగు పుత్రుని, గంగ యగ్నిజగర్భంబునుబోలెఁ బ్రసవించి పతిమ్రొదివిరాళించేసి యాబుడుత నంచే డించి భర్తను జేరి వానితోడ యథాసుఖము విహరింప సాగెను. ఆకూన యందే తల్లికై పనవుచుండెను.

'ఇట్లుండఁ గొండొకనాఁడు పార్వతీపరమేశ్వరులు వృషభ వాహనారూఢులై వాయుమార్గంబునఁ జనుచుండఁగా వారికి శిశురోదన మొండు వినవచ్చెను. బిడ్డయేడ్పు చెవి సోకినంతనే పార్వతికి జాలి జనించెను. మహాదేవుఁ డది గ్రహించి సతికిఁ బ్రియముఁ గూర్చు వాఁడై యా శిశువునకు నమరత్వమును దల్లిప్రాయంబు నిచ్చి గగన చారియగు పురంబొండు ప్రసాదించెను. ఉమయు నబ్బాలుని దురవస్థకు రక్కసుల కామోద్వేగము కారణముగా నెఱిగి యాజాతి కట్టిది సహజంబగుట గ్రహించి 'అసురులకు సద్యోగర్భప్రాప్తియు సద్యఃప్రసవంబును వారిశిశువులకు సద్యోవయస్సిద్ధియు' నగుఁగాక యనెను. నాఁడుసుత యట్లే జరుగుచున్నది. ఆబాలుఁ డట్లు పార్వతీపరమేశ్వరుల వరంబుల కల్కించేసి గర్వించి సుకేశుఁ డనుపేర నొప్పి యంబరచరపురం బధిష్ఠించి సర్వగామియై విరాజిల్లెను.

'ఆసుకేశుఁ డట్లు ప్రాప్తవరుఁడై యుండుట గ్రామణి యను గంధర్వుఁడు విని వానికి నిజసుతను దేవవతియను దాని నిచ్చి పెండ్లి

యెనర్చెను. త్రైలోక్యవిఖ్యాతరూపయౌవనశాలిని యైన యా దేవవతియు వరదానకృతైశ్వర్యుఁడగు పతిని బొంది నిర్ధనుఁడు ధనప్రాప్తికిం బలె సంతోషించెను. సుకేశుఁడును సతితోడిదే లోకంబుగా నుండెను.

మాల్యవదాదుల చరిత్ర

'ఆ దేవవతీసుకేశులకు మాల్యవంతుఁడు సుమాలి మాలి యను పుత్త్రులు మహాబలపరాక్రమశాలులు ముప్పురు త్రైతాగ్నిబోనివారు జనించి ముక్కంటికిసములై మంత్రత్రయంబుక్రియ నత్యుగ్రరూపంబులు దాల్చి దోషత్రయమునలె మహాఘోరులై పెరుఁగుచుండిరి. ఇట్లుండఁ గొండొకనాఁడు వారు తమతండ్రి యీశ్వరు నారాధించి వరంబులు పడయుట విని, కృతనిశ్చయులై మేరుపర్వతంబునకుఁ బోయి యందు ఘోరనియమంబుతో సర్వభూతభయావహంబుగాఁ దపం బొనర్ప సాగిరి. వారి తపస్తాపంబునకు ముజ్జగంబులు సదేవాసురమానుషంబుగా నుడ్డుడికెను. చతుర్ముఖుఁడు తత్తఱిల్లి త్రిదశసమేతంబుగా హుటాహుటి వారిదగ్గఱకు వచ్చి, 'తపోవరులారా, మీకు మెచ్చితిని ; వరము గోరు' మనెను. వారు నలునకు మ్రొక్కి, 'స్వామీ, మాతపస్సును మెచ్చి వర మీయవచ్చితివేని, అజేయత్వముఁ జిరజీవంబును గలిగి మేము ముప్పురము లొండొరుల ననుసరించి సుఖముండునట్లుగా ననుగ్రహింపు' మనిరి. చతురాస్యుఁడు వారికిఁ గోరినవర మిచ్చి చనెను.

'అంత మాల్యవదాదులు ముప్పురు బ్రహ్మనరగర్వోద్ధతులై సురాసురులను బట్టి బాధింపసాగిరి. దేవర్షి చారణాదులెల్లరు వారినుండి కాపాడు రక్షకుని గానక నిరయంబందిన నరులగతి ననుకరించిరి. మఱియు వారు ముగ్గు రట్లు నిరంకుశవర్తనులై చరించుచుఁ గొండొక నాఁడు విశ్వకర్మ యొద్దకుఁజని 'శిల్పివరేణ్యా, ఓజస్తేజోబలంబుల మీకు సాటి గలుగరు. దేవతలకు వారు కోరిన గృహంబులను స్వశక్తి వలన నిర్మించి యిచ్చితివి. మాకుఁగూడ నట్టిది యనుగ్రహింపుము. హిమాద్రియందో మేరునగమందో మందరగిరియందో వసింపఁగోరుదుము. నీవు మాకుగా నిర్మించుగృహంబు మహేశ్వరుని గృహంబునకు దీటుగా నుండనోపు' ననిరి.

లంకా నిర్మాణ చరిత్ర

'విశ్వకర్మ వారి యభిమతంబును విని, 'వత్సలారా, దక్షిణ సముద్రతీరంబునఁ ద్రికూటపర్వతము గలదు. దాని నడిమిశిఖరము

మిన్నేరయు చుండును. ఆ శిఖాగ్రంబును బక్కులు సయితము డాయ నేరవు. అందుఁ దొల్లి మయుఁడు దేవేంద్రుని ప్రీత్యర్థము లంకయను పేరి పుర మొండు నిర్మించెను. ఆ పట్టణము నూఱు యోజనంబుల నిడివియు ముప్పది యోజనంబుల వెడల్పును గలిగి స్వర్ణప్రాకారంబులతో హేమ మయ తోరణంబులతో నొప్పారుచుండును. ఆ నగరము మీ కెంతయు నివాసయోగ్యము. అచ్చట నున్న మిమ్ము శత్రువులు తలఁపుతోనేని చెనకనోపరు' అని చెప్పెను. మాల్యవదాదు లది విని మహాసంతోష మంది మర్యాదతో వానిని వీడ్కొనివచ్చి వేలకొలఁది యనుచరులను వెంటఁగొని చని లంకాపురము చొచ్చి యందుఁ గాపురము చేరిరి.

మాల్యవదాదుల వివాహాదికము

'ఆ కాలంబున నర్మదయను గంధర్వాంగన యొక తె యుండెను. ఆ యింతికి సుందరి, కేతుమతి, వసుధయను పుత్త్రికలు మువ్వురు రూపలావణ్య వయోవిలాసంబుల శ్రీధీకీర్తులకు నుద్దియైనవా రుండిరి. నర్మద యా మువ్వురను జ్యేష్ఠానుక్రమంబుగా మాల్యవత్సునమాలి మాలి యను మువ్వురకు నిచ్చి యుత్తరఫల్గునీనక్షత్రంబునఁ బరిణయ మొన ర్చెను. అందు సుందరీ మాల్యవంతులకు వజ్రముష్టి విరూపాక్షుఁడు దుర్ముఖుఁడు సుప్తఘ్నుఁడు యజ్ఞకోపుఁడు మత్తోన్మత్తుఁడు అను కుమారులును అనల యను పుత్త్రికయు జనించెను. సుమాలి కేతుమతి యందుఁ బ్రహస్తుఁడు అకంపనుఁడు వికటుఁడు కాలకార్ముకుఁడు ధూమ్రాక్షుఁడు దండుఁడు సుపార్శ్వుఁడు మహాబలుఁడు సంహ్రాది ప్రఘసుఁడు భాసకర్ణుఁడు అను కొడుకులను; రాక, పుష్పోత్కట, కైకసి, కుంభీనసి అను కుమార్తెలను బడసెను. వసుధకు మాలివలన అనిలుఁడు, అనలుఁడు, హరుఁడు, సంపాతి యనువారు పుట్టిరి. మాల్యవ దాదు లట్లు సంతానములతోడను బెక్కండ్రు నిశాచరులతోడను గూడి సమధికరాజ్యశ్రీవిభవోన్నతు లనుభవించుచు మృత్యు ప్రతి మాన తేజంబుల నొప్పారుచు రణరంగంబుల దురాసదులై వరగర్వోద్ధతి విష్టవీగుచుఁ గ్రతుక్రియలకు నాఁక వెట్టి సురలను మర్దించుచు ఋషులకుఁ గీడొనర్చుచు నాగయక్షోదులను బహుభంగుల బాధించుచు నిరంకుశ వృత్తిఁ ద్రొక్కిరి.

దేవతలు శివుని శరణిల్లుట

'ఆ రక్కసుల దుండగంబులను సహింపలేక భయార్తులై దేవతలును ఋషులును గుమికూడి దేవదేవుఁడగు మహేశ్వరునొద్దకుఁ బోయి 'దేవా, ఆదిమధ్యాంతరహితా, అవ్యక్తరూపా, సర్వలోకాధారా, జగదేకసమారాధ్యా, త్రిపురాంతకా, త్రిలోచనా, శరణు! శరణు! సుకేశుని పుత్త్రులు బ్రహ్మవరోద్ధతులై మమ్ము మహాకష్టంబులపాలొనర్చుచున్నారు. మా యిండ్లును మా యాశ్రమంబులును సర్వమునాశనమయ్యెను. స్వర్లోకంబునుండి దేవతలు వలసపోయిరి; నాకము రాక్షసలోకముసకుఁ గ్రీడామందిర మయ్యెను. నేనే విష్ణుఁడను నేనే రుద్రుఁడను, నేనే బ్రహ్మను అని పేర్వేరఁ బల్కుచు నందులకుఁ దల లూఁపనివాఁడని వారు కాలఁదన్ని నేలరాయుచున్నారు. దేవా, అభయమిచ్చి మమ్ము రక్షింపుము. నీవు శివస్వరూపంబును వదలి రూపాంతరంబు గ్రహించినఁగాని వారు సమయరు' అని కుయ్యిడిరి. నీలలోహితుఁడు వారి ప్రణయంబులు విని, 'దేవతలారా, మాల్యవదాదులను బరిమార్ప నాతరము గాదు. అందులకు శ్రీమహావిష్ణువు దక్కయొరులు చాలరు. మీరెల్లరును మహర్షి పురస్కృతంబుగాఁ జని యా దీనరక్షకుని పాదంబుల వ్రాలుఁడు. ఆజగత్ప్రభున్ వారిని రూపుమాపి మీయార్తి యుడుపు' ననెను.

దేవతలు విష్ణుని శరణిల్లుట

'అంత దేవతలు మహేశ్వరునకు జయంబులు పలికి నిశాచరభయార్దితులై వెనువెంటనే విష్ణువును డాసి ప్రణమిల్లి, 'దేవా, శంఖచక్రధరా, సుకేశుని కొడుకులు ముగ్గురు మాల్యవదాదులు వరదానబలంబునం జేసి యెవ్వారినిఁ జీరికి కొనక త్రేతాగ్నులకరణిఁ బ్రజ్వరిల్లుచు మాస్థానంబులెల్ల నపహరించిరి. దిక్కెది మేము దివ్యులమైతిమి. ఆ మాల్యవదాదులు త్రికూటశిఖరంబునందలి దుర్గమంబగు లంకాపురంబున నున్నారు. అందుండి వారు మమ్ముఁ గావించు గాతియలకు మేర లేదు. మధుసూదనా, నిన్ను శరణిల్లితిమి. నీవే మాకు దిక్కు. మదోద్ధతులైన యారాక్షసులను సానుబంధంబుగా భాస్కరుఁడు నీహారమట్లు నీవు హరించునందాక మాభయంబులు తీఱవు. మాయెడఁ బ్రసన్నుఁడ వగు' మని విన్నవించిరి.

'జనార్దనుఁడు వారి దీనాలాపంబులు విని కనికర మూని, 'సుర లారా, ఇఁక మీరు భయంబులు మానుఁడు. సుకేశునిపుత్త్రులు మాల్యవదాదులు నాకుఁ దెలియనివారు కారు. వరదర్పితులై మట్టు మీఱియున్న యా తులువలను సంహరింతు' నని పలికెను. దేవతలంత సంతుష్టులై విష్ణువునకు మ్రొక్కి తమతమ తావులకుఁ జనిరి.

మాల్యవదాదుల మంతనములు

దేవతలప్రయత్నంబుల నెల్ల మాల్యవంతుఁడు విని తమ్ములను జీరి, 'సోదరులారా, వింటిరా దేవర్షుల జతనంబులు? వారు మనచావుఁ గోరి శంకరునకు మొఱలిడిరి. ఆ పని తనవలనఁగాదని యా యంధకారి చెప్పెను. గత్యంతర మేమని వాని నడిగిరి. శ్రీమన్నారాయణుని శరణిల్లు మని ముక్కంటి యుపాయము బోధించెను. వారు నల్లే యొనర్చిరి. ఆ వైకుంఠుఁడు సురలకు నభయమిచ్చి, మనవధను బ్రతిజ్ఞ చేసెను. కర్తవ్యము నాలోచింపుఁడు. నిర్జరులను భర్జించిన కారణంబున హిరణ్యకశిపుఁడును నముచియుఁగాలనేమియు వీరసత్తముఁడైన సంహ్లాదుఁడును బహుమాయియు రాధేయుఁడును యమళార్జునులును హార్దిక్యుఁడును శుంభనిశుంభులును దితిసుతులును మహాబలపరాక్రమవంతులయ్యు సర్వాస్త్రకుశలులయ్యు నారాయణునివాతఁబడి వేనవేలుగా మన పూర్వులు మడిసిరి. జనార్దనుఁడు మనకు ఆవంశవైరి యనుమాట మఱవక ప్రకృతము విచారింపఁగను. వానిని జయించుట కష్ట' మని చెప్పెను.

'ఆమాటలెల్ల మాలియు సుమాలియు విని, 'అన్నా, వ్యాధి మరణంబులు మనకుఁ గలుగవు. ఇది బ్రహ్మవరము. విరించిపలుకు తప్పదు. ఆ నరమహిమంబుసంజేసి యశ్లోభ్యమైన దేవసాగరంబుఁ జొచ్చి కొల్లలాడితిమి. ఇంద్రుఁడు దిక్కులు ప్రాఁకెను. రుద్రునిమాట నీవే వచించితివి. నారాయణుఁడా? అతఁడేపాటి? యముఁడంతటివాఁడే మన మ్రోల నిలువనోపఁడనఁగా విష్ణువు గిష్ణువుఁ జెప్పనేల? అదటుండనిమ్ము. విష్ణువునకు మనము గోరంత యపకారమైనను జేయలేదు. అతఁడు మనలను ద్వేషింపనేల? దేవతల దీనాలాపంబులకు మది చలించి వారి నోదార్చుటకుగా నతఁడట్లనియుండును. అన్నిటికి దేవతలే కారకులుగా నున్నారు. అ య్యాపదలను బరిమార్చుదము. అంతతో వైరబీజము సమసిపోవు' ననిరి. మాల్యవంతుఁడును వల్లె యనెను.

రాక్షసుల దండయాత్ర

'క్షణములోన రాక్షససేనవాహిని వెల్లివిరిసెను. స్యందనంబు లధిష్ఠించి కొందఱును, గిరిసన్నిభములైన వారణంబు లెక్కి కొందఱును, బవనజవంబుగల హయంబులమీఁదఁ గొందఱును, ఖరంబు లారోహించి కొందఱును ఉష్ట్ర వృషభ శింశుమార భుజంగమ మకర కచ్ఛప మీన విహంగంబుల పయిఁ గొందఱును, సింహ వ్యాఘ్ర వరాహ సృమర చమరీ మృగంబులమీఁద మతికొందఱును, రాక్షసపుంగవులు దాడి వెడలిరి. మాల్యవదాదులు వారిని వెంటఁగొని మొట్టమొదట యమునిదెసకు నడచిరి.

'రాక్షసు లట్లు యుద్ధోత్సాహులై నగరు వెడలినంతనే లంకాధిష్ఠాన భూతంబులెల్ల విమనస్కము నొందెను. భౌమంబులు నాంతరిక్షంబులు నైన నిమిత్తంబులు భయావహముగాఁ దోఁచెను; అస్థి మేధ శోణితంబులు వర్షించెను; సముద్రము చెలియలికట్ట నతిక్రమించెను; పర్వతంబులు చలించెను; మేఘనిర్ఘోషాట్టహాసంబు లుప్పతిల్లెను; వఱుడులు దారుణంబుగాఁ గూసెను; భూతంబులు రాలసాగెను; గృధ్రంబులు మంటలు గ్రక్కుముఖంబులతోఁ బిండుగట్టి మింటఁ జరించెను; గగన తలంబునుండి కొఱివులు రక్కసులపైఁ గురిసెను; శారికాకపోతంబులు విద్రుతంబుగాఁ బఱచెను; కాకబిడాలంబు లుద్భటారావంబులు గావించెను.

'అట్లు భౌమాంతరిక్షనిమిత్తంబులు మహాభయావహముగాఁ దోఁచినను రాక్షసులు బలగర్వోన్నతిఁజేసి యా యుత్పాతంబుల లెక్కసేయక మృత్యుపాశబద్ధులై యూడ్వఁబడువారువోలె నిలువక చనిరి. వారి సముద్యోగంబును దేవదూతలవలన నారాయణుఁడు విని యుద్ధసన్నద్ధుఁడై యాయుధతూణీరంబులు సంతరించి కోటిసూర్యప్రకాశమైన దివ్యకవచంబుఁ దొడిగి శ్రోణీసూత్రంబును బంధించి శంఖచక్రగదా ఖడ్గంబులను సవరించి గరుడవాహనారూఢుఁడై కాంచనగిరిశృంగంబున సతటిజ్జీమూతమట్లు శోభిల్లుచు హుటాహుటిఁ దరలెను. సిద్ధచారణ గంధర్వులు పాడిరి. దేవర్షులు జయంబులు పలికిరి. గరుడుఁడు తెక్కలు విదలించెను. ఆ గాలివడికి వైరిసైన్యము వికీర్ణశస్త్రము భ్రమత్పతాకమునై క్షోభించి యుట్టూతలూగెను.'

విష్ణువు మాల్యవదాదులను నిర్జించుట

'రాక్షసాంబుదంబులు గర్జించుచు శరములు వర్షించుచు నారాయణుని ముట్టడించెను. నల్లని నక్తంచరులు శ్యామావదాతుఁడగు విష్ణువును జుట్టియుంటఁ జూడఁగా వర్షమాణపయోధరంబు లంజనాద్రిని జుట్టిన వైఖరి దోఁచెను. రాక్షసధనుర్ముక్తశరాణంబులు వజ్రానిలమనోజవంబులఁ జని మిడుతలు కేదారంబును, మశకంబులు పర్వతంబును, దంశంబులు మధుఘుటంబును, మకరంబులు సాగరంబును వలె హరిని గ్రమ్ముకొనుటచే లోకంబులు ప్రళయంబునం దట్లాయెను. రథారూఢులు రథంబులను, గజారూఢులు గజంబులను, హయారోహకులు హయంబులను, మాధవునిపైకిఁ బురికొల్పిరి. కొందఱు శరపరంపరల నువ్విరి; కొందఱు శక్తితోమరంబులను బఱపిరి. అవియెల్ల మూఁగి హరికి నూపిరాడనీయవయ్యెను. ఆ మహనీయుఁడు కోపము వహించి కోదండంబును బూని మనోజవంబులును వజ్రసన్నిభంబులు నైన శరంబులను సంధించి యాకర్ణాంతము దివిచి పుంఖానుపుంఖంబుగా సారించెను. సూర్యునుండి కిరణంబులట్లు, సాగరంబునుండి తరంగంబులకరణి, పర్వతంబులనుండి నాగేంద్రంబుల చందాన, మేఘంబులనుండి ధారాపాతముక్రియ, మాధవుని కోదండంబునుండి శరంబులు, పరంపరలుగా నుప్పతిల్లి రాక్షసయూథంబును గప్పెను. వారు దిక్కటి శరభంబులకు సింహంబులట్లు, సింహంబులకు ద్విపంబులవలె, ద్విపంబులకు వ్యాఘ్రంబులకరణి, వ్యాఘ్రంబులకు ద్విపులక్రియ, ద్విపులకు శునకంబులవహి, శునకంబులకుఁ బిల్లులరీతిఁ, బిల్లులకు సర్పంబులపోలిక, సర్పంబులకు నెలుకల చాయఁ బఱచుచు బొబ్బెయలు దూఱుచుఁ గళనళించుచుఁ గుంపుచు క్రమ్ముచుఁ బటాపంచలైరి. అందుఁ గొందఱు వజ్రహతంబుల శైలంబులట్లు కూలిరి; మఱికొందఱు వ్రణాంకితులై పర్వతంబులు స్వర్ణధారలట్లు రక్తధారల నోడ్చిరి.

'నారాయణుఁ డట్లు గావించి పాంచజన్యంబును బూరించెను. ఆ శంఖారావము త్రైలోక్యవ్యథాకరంబుగా ధ్వనింప నమ్మహానిర్హ్రాదంబునకు హతశేషులగు రక్కసులు గుండియలు వ్రీలి సనిచెడి మృగరాజు చొచ్చిన కరియూథంబు చాడ్పునఁ జెల్లాచెదరై పడుచు లేచుచు లంకదారిఁ బట్టిరి. అసురసైన్య మట్లగుట సుమాలి గాంచి కోపక్రోధమూర్ఛితుఁడై విష్ణువును దలపడి వానిపయి నంపవానఁ గురిసి నిజసైన్య

సముజ్జీవనార్థమోయన సింహనాద మొనర్చి గజరాజు తుండంబును బోలెఁ దన హస్తంబును వీచెను. నారాయణుఁ డంత శరంబొండు వైచి తత్సారథి శిరంబును ద్రుంచెను. వాని పాటునకు రథాశ్వంబులు భయభ్రాంతిఁ గొనెను; రథము తికమకలయ్యెను; సుమాలి భ్రమ చెంది భ్రాంతేంద్రియుఁడుగాఁ దోచెను.

'సుమాలి యట్లగుటకు మాలి మహోగ్రమూర్తియై చాపంబును గరతలంబున సంధించి వెన్నునిపయి నుఱికి వానియెద గుఱిచేసి కార్ముస్వరవిభూషితంబులగు బాణంబులను వైచెను. ఆ తూపులు క్రొంచ పర్వతంబును హంసలట్లు హరిశరీరంబును జొచ్చెను. జితేంద్రియుఁ డాధికివలె జనార్దనుఁ డందులకు సుంతయుఁ జలింపక ప్రత్యస్త్రంబుల నయ్యసురుపయిఁ బఱపెను. వజ్రవిద్యుత్ప్రభాభాసురంబులైన యా శరంబులు మాలిదేహముఁ జొచ్చి నాగంబులు సుధారసంబు నట్లు వాని రుధిరంబులను గ్రోలెను. విష్ణువట్లు వానిని నొప్పించి తదీయ రథధ్వజ చాపతూరంగంబులఁ ద్రుంచెను. మాలి కోపస్ఫూర్తి వహించి మధ్యందిన చండభానుని పగిది మండిపడి గదఁబూని పర్వతాగ్రంబునుండి కేసరిలోలె రథంబునుండి దుమికి గరుడుని లలాటంబున వైచెను. ఆ ప్రేటువడికి వైనతేయుఁడు వేదనాతురుఁడై మోము మఱలించెను. అదిచూచి మాలి మహాట్టహాస మొనర్చెను. నారాయణుఁడు పక్షీంద్రునకుఁ గోపించి పెడవాటుగానుండియు మాలిమీఁదఁ జక్రంబును బ్రయోగించెను. కాలచక్రమునుబోని యాచక్రము రవిమండలము వలెఁ బ్రకాశించుచుఁ బోయి మాలి శిరంబును ఖండించెను. ఆ తల మింటికెగసి వేఁడినెత్తురులు గార్చుచుఁ దవ్వునఁ బడెను. సురలు సంతుష్టులై సాధువాదంబులు పలికిరి.

'మాలిచావునకు సుమాలి మాల్యవంతులు బెగ్గడిల్లి శోక సంతప్తులై లంకాపురమువంకఁ బరుగెత్తిరి. అంతలోన గరుడుఁడు తెప్పరిల్లి కోప ప్రచండుఁడై తెక్కలల్లార్చెను. వానితెక్కల గాలివడికి రక్కసులు నొగుడాకుల క్రియ దవ్వునఁబడి తలలు తెగి కొందఱును, గుండియలు వ్రీలి కొందఱును, జూర్ణితాంగులై కొందఱును, మడిసిరి. మాల్యవంతుని హరివెంబడించెను. ఆ రక్కసుఁడది చూచి సంరక్తలోచనుఁడై పద్మలోచనునివంక మరలి, 'నారాయణా, పురాతనమగు క్షత్రధర్మంబును మఱచితివా? భయపడి యుద్ధము మానిన మమ్మఁబంప

నగునా? పరాఙ్ముఖవధఁ గావించు పాపి నరహంత యగునుగదా? పుణ్యకర్మసాధ్యమగు స్వర్గము వానికి దవ్వుగాదా? యుద్ధశ్రద్ధ నీకున్న దంచువా? అట్లయిన నిటిగో రమ్ము. నీ బలమెల్లఁజూపు' మని యెద యిచ్చి నిలిచెను.

'అట్లు మాల్యవంతుఁడు మాల్యవంతము పగిది నిల్చిన హరి వానింగాంచి, 'మీకు వెఱచియున్న దేవతలకు నభయ మిచ్చితిని. నా మాటను జెల్లించుకొనుటకై రాక్షసోత్సాదనమునకు నవసర మయ్యెను. సురలకార్యము నాకుఁ బ్రాణప్రియము; కావున రాక్షసులు రసాతలము చొచ్చినను వారిని వదలక మర్దింతు'నని పలుకుచు నేమఱి యుండెను. అది యవసరంబుగా మాల్యవంతుఁడు శక్తి నెత్తి హరి భుజాంతరంబున వైచెను. ఆ శక్తియు ఘంటాస్వనపురస్సరంబుగాఁ జని హరియెదఁదాకి మేఘాంతరంబున శతహ్రదవలె మెఱసెను. శక్తి ధర ప్రియుఁడగు విష్ణు వాశక్తినే గైకొని మాల్యవంతు నుద్దేశించి ప్రయోగించెను. అది గోవిందకరనిస్సృతయై యురవడించి చని మణి హారసముజ్జ్వలంబును విశాలంబునైన మాల్యవంతుని యురోభాగంబును గిరికూటంబును బిగువునలేఁ దాఁకి వాని కవచంబును వ్రీల్చెను. వాఁడు సుంత చలించి తెప్పిఱిల్లి కంటకావృతమైన శూలంబు నొండు దివిచి నారాయణవక్షోభాగమును గుఱిచేసి వైచి గరుడుని దాడించి దవ్వు నిలిచెను. వైనతేయుఁడు మహోగ్రమూర్తియై తెక్కలల్లార్చెను. ఆ వాయువేగంబునకు సుమాలి సహైన్యంబుగా దవ్వు వీవఁబడి లంకలో బడెను.'

రాక్షసులు లంకనుండి పాఱిపోవుట

'రక్కసులట్లు హరివలన బహుభంగుల భంగపడి సేనానాయకు లను బెక్కండ్రఁ గోల్పోయి విష్ణు నెదురింప నోపక లంకానివాస మెప్పటికేని ప్రాణోపద్రవకరనుని నిశ్చయించుకొని పుత్త్రమిత్ర కళత్రపరివారంబుగాఁ బాతాళంబునకు వలసపోయిరి.

'వత్సా! నాఁడుసుత లంకానగరము శూన్యముగానున్నది.' వైశ్రవణుఁడు తనతండ్రిమాట ప్రకారము లంకయందుఁ గాపుగము చేరెను.

రావణాదుల జననాదికము

సుమాలికిఁ గైకసి యను పుత్త్రిక గలదు. ఆ బాలిక పద్మాలయము వదలి వచ్చిన లక్ష్మియో యన నుండెను. సుమాలి యా కూఁతును వెంటఁగొని రసాతలమునుండి వచ్చి మర్త్యలోక సంచార వినోదంబులఁ దనుపుచుండెను. ఒకనాఁ డతఁ డట్లు సంచరించుచు విశ్రవసుఁడున్న యాశ్రమము డాయ వచ్చెను. ఆ సమయంబున ధనేశ్వరుఁడు పుష్పక విమానముమీఁద వచ్చి తండ్రికి విశ్రవసునకు మ్రొక్కి పోవుచుండెను. సుమాలి యా వైశ్రవణునిగాంచి విస్మయమంది 'కటా! రాక్షసకులమున కెంత దాపరించెను! మేము సన్న గిల్లుటచేతఁగదా వీరికింతటి సిరి యబ్బుట! ఏమి సేయనగు?' నని మహా చింతాక్రాంతుఁడై రసాతలంబునకుఁ బోయి పెద్దయుం దడవు తలపోసి పుత్త్రికను బిలిచి, 'అమ్మా, నీకు యౌవనము సంప్రాప్తమయ్యెను; ప్రదానకాలము వచ్చెను. తిరస్కరింతువో యని వెఱచి స్వయముగా నిన్నెవ్వఁడును వరింపఁడు. నీవన్ననో సాక్షాత్ లక్ష్మిని బోలుదువు; ఏతన్మాత్రులకు నిన్నొసఁగనొల్లము. తగువరునకై సర్వప్రయత్నము లొనర్చితిమి. ఇందాక యత్నసిద్ధి గలుగదు. మానాభిమానులకుఁ గన్యాపితృత్వ దుఃఖ మింతనరాదు. కన్యవలనఁ తల్లి వంశమును, దండ్రి వంశమును, భర్తృ వంశమును మూఁడు నుద్ధరింపఁ బడును. ఆ మూఁడు వంశముల కీర్తిగాని, యపకీర్తిగాని కన్యనుబట్టి యుండును. పుత్త్రీ! మునివరంబునఁ బ్రజాపతికులంబున జనించితివి. నా చూచినంతలో విశ్రవసుఁడుదక్క నొండు సీకుఁ దగఁడు. పౌలస్త్య వంశ్యుఁడైన యమ్మహానీయుని వరింపుము; కుబేరసదృశులైన పుత్త్రులు నీకుఁ గలుగుదురు' అని చెప్పెను.

కైకసి యంతఁ దండ్రిమాట నౌదలఁ దాల్చి విశ్రవసుఁడున్న యాశ్రమంబునకుఁ బోయి యిట నగ్నిహోత్రము నుపాసించుచు నాల్గవ యగ్నివలెఁ జేజరిల్లుచున్న యా మునిపుంగవుని డాసి సమయాసమయంబులు విచారింపక వాని చరణంబులు మెట్టి యెదుట నిలిచి యధోముఖియై యంగుష్ఠాగ్రంబున నేల రాయుచుండెను. విశ్రవసుఁ డాపూర్ణచంద్రనిభాననను జూచి, 'సుమంగలీ! ఎవని తనయవు? ఇందేల వచ్చితివి? నీ తలపేమి? ఏమి వలయునో చెప్పు' మనెను. కైకసి యంతఁ జేదోయి గీలించి, 'మునివరా, నా మతము మీకు స్పష్టము; నన్నడుగనేల?

నా తండ్రియాజ్ఞమేరకు నిందు వచ్చితిని. నా పేరు కైకసి యందురు; నాతండ్రి సుమాలి' యని వినయమధురంబుగాఁ జెప్పెను.

విశ్రవసుఁడంత ధ్యానగతుఁడై సుంతతడవునకుఁ గను విచ్చి 'కళ్యాణీ, నీ మనోగతము తెలిసెను. నావలన సుతునిఁ గోరి యిందు వచ్చితివి. నీ యిచ్ఛ యగుఁగాక. నీవు నన్నాశ్రయించిన సమయము దారుణమైనది గావునఁ దత్పలంబుగా నీసుతులట్టివారే యగుదు'రనెను. ఆ కన్య యామాట విని సాష్టాంగ ప్రణామమొనర్చి, 'మహాత్మా, బ్రహ్మవాది వగు నీవలన నిట్టి దురాచారులఁ బడయనొల్లను. నాయెడఁ బ్రసన్నుఁడ వగు' మని ప్రార్థించెను. ఆ మునిపుంగవుఁడు కరుణించి, 'తన్వీ, ఓడకు; నీ కడపటి సుతుఁడు నా వంశానురూపుఁడును ధర్మాత్ముఁడు నగుఁ బొమ్ము' అనెను.

కైకసి యంతఁ గొన్నాళ్లకు గర్భవతియై మహా భీభత్సాకారుని గాంచెను. అతఁడు పదితలలు నిరువదిచేతులుఁ గలిగి దంష్ట్రాకరాళుఁడై కాటుకరాశివలెఁ జూపట్టుచు వెఱపించుచుండెను. వాని పుట్టుకకు శివంబులు నోట నిప్పులు రాల్చెను; క్రవ్యాదంబు లపసవ్యంబుగ మండలాకృతిఁ బాఱెను; రుధిరంబులు వర్షించెను; మేఘుంబు లాక్రందించెను; సూర్యుఁడు నిస్తేజుఁడయ్యెను; మహోల్కలు పడెను; ధరాతలంబు చలించెను; శైలయజంఘానిలంబులు వీచెను; సముద్రుఁడు ఘూర్ణిల్లెను.

ఆ శిశు వుదయించినంతనే యచ్చటికి వానితండ్రి విశ్రవసుఁడు వచ్చి తదీయాకారముఁగాంచి వానికి దశగ్రీవుఁడను సార్థకనామ మిడిచనెను. అనంతరము మఱియొక సుతుఁ డాకాంతకు నుదయించెను. అంతటి యున్నతుఁడు మఱియొండు గలుగఁడు. వానికిఁ గుంభకర్ణుఁడను పేరు పెట్టిరి. వాని వెనుక యొకపుత్రిని జనించెను. దానిని శూర్పణఖ యనిరి. కట్టకడపట వెండియుఁ గుమారుఁ డొకఁ డుద్భవించెను. వాని జననకాలంబునఁ బుష్పవృష్టి కురిసెను; దేవదుందుభులు మ్రోఁగెను; అంతరిక్షంబున సాధువచనంబులఁ బలికిరి. వానిని విభీషణుఁడనిరి.

దశగ్రీవుఁడు బాల్యంబుదొట్టి లోకోద్వేగకరుఁడై చెలరేఁగెను. కుంభకర్ణుఁడు కంటఁబడిన మహర్షులను మ్రింగసాగెను. ముల్లోకంబులను భక్షించినను వానికిఁ దృప్తికాకుండెను. విభీషణుఁడు మాత్రము ధర్మపరుఁడై స్వాధ్యాయనియతాహారవ్రతముఁ బూని విజితేంద్రియుఁడై యుండెను.

ఇట్లుండఁ గొండొకనాఁడు ధనేశ్వరుఁడు పుష్పకవిమానమెక్కి పితృదర్శనార్థము వచ్చెను. కైకసియా ధనపతిని గాంచి తదీయవిభవంబు నోర్వనిదై దశగ్రీవునిఁ జీరి, 'పుత్రా, నీయన్న వైశ్రవణునిఁ జూతువా? భ్రాతృభావము మీయిరువురకు సమానముగా నున్నను వాని దివ్య వైభవము నీకుఁ గలుగదుగదా. నాయనా! మీ రిట్టి విభవాభిరాము లగుట నేను చూడనోతునా? సర్వము యత్నాధీనమందురు. నీవును గుబేరునకు సాటి కారాదా?' యని వ్యసనకలుషస్వరంబునఁ బలికెను. దశగ్రీవుఁడు తల్లి పలుకులు విని మహామర్షము నొంది, 'జననీ! నీయెడఁ మానుము. కుబేరునకు సాటియో వానికన్న నధికుఁడనో కాకున్న నాదియు నొక బ్రదుకా? అట్లు కానినాఁడ నన్ను మఱచిపొమ్ము. ఇదే ప్రతిజ్ఞ సలుపుచున్నాను,' అని పలికి యామంటతోనఁ దమ్ముల వెంటఁగొని వెడలి గోకర్ణాశ్రమము చేరి యందు దుష్కరమైన తపం బాచరింపఁ దొడఁగెను.

వారి తపఃక్రమ మిట్లని వచింపరాదు. అందు దశగ్రీవుఁడు నిరాహారవ్రతముఁ బూని దీర్ఘతపోనిష్ఠ నిల్చి వేయేండ్లకొక్కొక్క-తలవంతున ఛేదించి హోమముచేయుచుఁ దొమ్మిదివేల సంవత్సరములకుఁ దొమ్మిది తలలు ద్రెవ్చి పదియవవేయి సమాప్తమైనంతఁ బదవశిరస్సును గూడఁ గోసి హోమమొనర్పనుండెను. అప్పుడు పితామహుఁడు దేవతలతోడ వెడలి వచ్చి, 'దశకంఠా, నీకుఁ బ్రీతుఁడ నైతిని. కోరుము వరము; కోరిన దిచ్చెద' ననెను. దశగ్రీవుఁడు సంతసించి నలువకుఁ దలతోడ మ్రొక్కి, 'దేవా, ప్రాణులకు మరణభయంబునుమించిన భయము గలుగదు; మృత్యువుసాటి శత్రువును గలుగఁడు. 'జీవన్ పశ్యంతి భద్రాణి' యందురు. నిఖిలసుఖానుభవంబునకు జీవము ముఖ్యము. అది చాలని నాఁడు తక్కినవెల్ల గల్గియుఁ నిష్ఫలంబు కావున నమరత్వంబును వేఁడుదు' ననెను. బ్రహ్మ యాకోరికను విని, 'దశగ్రీవా, సర్వామరత్వంబు నొసంగ నెవరికిని వరముగాదు. వేఱొండు గోరు' మనెను. దశగ్రీవుఁడు ప్రాంజలియై, 'స్వామీ, అట్లగునేని, సుపర్ణనాగయక్షులవలనఁ గాని దైత్యదానవరాక్షసులవలనఁగాని దేవతలవలనఁగాని నాకుఁ జావు రాకుండునట్లు వరమును బ్రసాదింపుము. ఇతర ప్రాణులపలని చింత యీమన్మాత్రముగూడ నాకు లేదు. మానవులో యనిన వారు తృణప్రాయులుగదా' యని వచించెను. పరమేష్ఠి వాని యజ్ఞానగర్వో ద్ధతులకు విస్మయమంది

'కర్ణస్య కండూయనకేనాపివా దంతస్య నిష్కాణనకే నాపి।
తృణేన కార్యం భవ తీశ్వరాణాం కిమపి వాక్పాణిమతా నరేణ॥'

అనువాక్య మితఁడు వినఁడు కాఁబోలు; 'మతి యెంతో గతి యంతే గదా' యని తలఁచి, 'దశకంధరా, నీ కోరినట్లే యగుఁగాక. నిన్ను మెచ్చితిని గావున నీ యడుగని వరమును గూడ నిచ్చుచున్నాను. నీవు వ్రేల్చిన తలలు తొమ్మిది మరల మొలఁచుగాక; కోరినరూపంబును ధరింతువుగాక' అని వచించి చనెను. పరమేష్ఠినూటతోడ దశగ్రీవుని తలలు తొమ్మిది మొలచెను.'

కుంభకర్ణుఁడు తీవ్రదీక్షఁబూని వేసవియందుఁ బంచాగ్నిమధ్య నిల్చియు, వర్షాకాలంబున జడివానలో నుండియు, శిశిరంబున నీట మునింగియుఁ బదివేల యేండ్లు తపం బొనర్చెను. వాని తపోవహ్నికి లోకంబులు క్రాఁగెను. విధాత యి య్యాపదఁ బాపనెంచి కుంభకర్ణుని యొద్దకుఁ బోనుండెను. దేవత లది యెఱిఁగి పితామహునకు దోయి లొగ్గి, 'తండ్రీ, కుంభకర్ణుఁడు లోకంబుల నెట్లు గాసించినది మఱచితివా? ఈ దుర్మతి నందనవనంబుఁ జొచ్చి యట నచ్చరలేమల నేడ్వార నొక పెట్టున దిగమ్రింగెను; మహేంద్రానుచరులను బదువురఁ దృటిలో భక్షించెను; పెక్కండ్రు ఋషులను మెసనెను. ఈకూళ తిన్న నరులకు లెక్కయే లేదు. ఎట్టి వరబలంబును లేకయే యింత యొనర్చినట్టి యీ దురాత్మునకు నీవు వర మిచ్చుచో నీసృష్టియెల్ల నామావశిష్ట యగును. మా మొఱ లాలకించి వరవ్యాజంబున నితనిని మోహవివశు నొనర్చి లోకంబులను రక్షింపుము. ఈ నేత వీనికి శిక్షయగుఁగాక' అని ప్రార్థించిరి. నాఁపుడు బ్రహ్మ సుంత చింతించెను. తోడ్తోడ సరస్వతీ దేవి వాని పార్శ్వంబునఁ దోఁచి ప్రాంజలి యొనర్చి, 'దేవా, పిలవి'మ్మ నెను. ప్రజాపతి వాణిం గాంచి, 'దేవీ, ఈ రక్కసునినోట నిల్చి దేనతల ప్రణయంబును దీర్పు' మనెను. శారద వల్లె యనెను.

అంతఁ బ్రజాపతి కుంభకర్ణునొద్దకుఁ జని, 'కుంభకర్ణా, ఇష్టవరం బును గోరు' మనెను. వాఁ డామాట విని కన్నువిచ్చి చూచి, 'దేవా, నిద్రాత్వము నిమ్ము' అనెను. అట్లే యని పలికి బ్రహ్మ చనెను. కొంత వడికిఁ గుంభకర్ణుఁడు తెలివొంది, 'అహో! నిత్యత్వ మనుటకు మాఱుగా నిద్రాత్వమును గోరి కీడు తెచ్చికొంటిని గదా. కటా! ఎంత మోస మయ్యెను' అని బహుభంగులఁ జింతించి ఇదంతయు దేవతలు గావించిన వ్యామోహఫల మని నిశ్చయించుకొనెను.

అట విభీషణుఁడు ధర్మపరమతిం దగిలి శుచియై యొంటికాల నిలిచి యైమువేల యేండ్లు తపం బొనర్చి యనంతరము మఱియైదువే లేండ్లు సూర్యు ననుసరించుచుఁ దలయు బాహువులును బయి కెత్తి స్వాధ్యాయధృతమానసుఁడై నందనంబున స్వర్గస్థుఁడుఁ బోలె విడువని నిష్ఠఁ దవిలి యుండెను. అతని నియమము సమాప్త మైనంతనే పుష్ప వర్షము గురిసెను. అచ్చర లాడిరి. అంతఁ బితామహుఁడు ప్రత్యక్షమై, 'వత్సా, నీధర్మబుద్ధికి మెచ్చితిని; వరముఁగోరు' మనెను. విభీషణుఁడు నలువకు సాష్టాంగ మొనర్చి, 'దేవా, లోకగురుఁడవైన నీవు స్వయ ముగా నాయెదుటఁ దోఁచి యిట్లడుగుటచేత నే కృతకృత్యుఁడ నైతిని. అయిన నొక్కటిఁ గోరుదు. ఎంత యాపద పైకొన్నను నాబుద్ధి ధర్మ మును బాయకుండుఁగాక; అశిక్షితముగా బ్రహ్మాస్త్రము నాకు సిద్ధించుఁ గాక. ఏయాశ్రమము ననుష్ఠింతునో యా యాశ్రమమునకు నుచితమైన ధర్మనిరతి నా బుద్ధియందుఁ బ్రవర్తిల్లుఁగాక. ఇవి నాకుఁ బరమాభీష్టములు. ధర్మాభిరక్తులకు దుర్లభంబు గలుగదు గావున ధర్మమునే వరింతు' నని వినయపురస్కరంబుగా వచించెను. నావుడు విధాత లేనగవు మోము నలంకరింపఁ గరుణార్ద్రదృష్టితో విభీషణుని జూచి, 'వత్సా, రాక్షస కులోత్పన్ను లెక్కడ? ధర్మాభిరతి యెక్కడ? ఇది నీయందు విపరీతము; నీకెంతయు సంతసింతు; నీ యడిగినవేగాక యమరత్వంబును గూడ నీ కిచ్చితి' ననెను. విభీషణుఁడు తలతోడ నవ్వరంబులను గ్రహించి మహా ప్రసాదమని పలికి పరమేష్ఠికి సాష్టాంగ మొనర్చెను. అంత నలువ యంతర్హితుఁ డాయెను.

దశగ్రీవుఁడు దనుజరాజ్యాభిషిక్తుఁడగుట

దశకంధరాదు లట్లు వరంబు లంది శ్లేష్మాతకవనంబున జనకుని తోడ సుఖముండిరి. వా రట్లు వరంబులు పడయుట సుమాలి విని సంతోషవశుఁడై మారీచ, ప్రహస్త, విరూపాక్ష, మహోదరాది సచివులను వెంటఁగొని రసాతలమునుండి వెడలి పంక్తికంఠు నొద్దకు వచ్చి వానిఁ గవుంగిటఁ గూర్చి యభినందించి, 'నాయనా, పరమేష్ఠివలన నీ వింత యుత్తమవరంబులఁ బడయుటం జేసి నా చిరమనోరథ మీడేరిన ట్లయ్యెను. ఎవనికి వెఱచి స్వస్థానమగు లంకాపురంబును ద్యజించి రసాతలంబునకు వలస వచ్చితిమో వానివలని భయము గూడ నేటితో సమసిపోయెను. వత్సా, లంకానగరము మనపురముగాని యొరులది గాదు. అయినను విష్ణువునకు నోడి యందుండి పాఱివచ్చితిమి. ఇప్పు

డచట నీయన్న కుబేరుఁ డున్నాఁడు. సామముచేత నొండెఁ దానము వలన నొండెఁ బరాక్రమంబున నొండె లంకానగరంబును వశపఱచు కొనుము. అట్లగునేని నీకు లంకేశ్వరత్వము సిద్ధించును. నీవలన మన రాక్షసకుల మెల్లఁ బ్రకృతదురవస్థను బాసి తలయెత్తనోపును. మేమెల్ల రము నిన్నుఁ గొలిచి సుఖముందు' మనెను.

దశగ్రీవుఁ డాసలహా విని, 'తాతా, కుబేరుఁడు నా యగ్రజుఁ డంటివి. అన్నయనఁ దండ్రియంతటివాఁడు. వాని విషయమున మీ రిట్లాడ నగునా?' యని యడిగెను. సుమాలి వాని మనంబు గ్రహించి నాఁటికి మిన్నకుండెను. కతిపయదినంబులు చన్నంతఁ గొండొకనాఁడు మఱల నాసంగతి ప్రస్తావమునకు వచ్చెను. ప్రహస్తుఁ డది యవకాశ ముగాఁ గొని, 'దశగ్రీవా, శౌర్యవంతులు మీనమేషము లెంచరు. అన్నదమ్ము లనెడిభావము శూరులందుఁగలదా? తొల్లిటి పరాక్రమ వంతుల చరిత్రలు వినవా? అదితి దితి యనువారు అక్కాచెల్లెండ్రుండిరి. వారికి శరీరములు మాత్రమే వేఱుగాని హృదయ మొక్కటిగా నుండెను. వా రిరువురును గశ్యపప్రజాపతిని బెండ్లాడి యెట్టి యఱమఱలు లేక సుఖముండిరి. అదితి దేవతలను గాంచెను; దితికి దైత్యులు జనించిరి. దైత్యులు స్వభుజాటోపపరాక్రమంబుల వ్యయించి వనార్ణవపర్వత సహితంబుగా మహామహీమండలంబునెల్లఁ గెలిచి యెదురు లేక యుండిరి. విష్ణువు వారిని సంహరించి యవ్యయమైన తదీయ రాజ్యంబును దేవతల కిచ్చెను. తమ్ముల సొమ్మని మాటమాత్రమైన నిర్జరు లనిరా? రాజ్యము నొల్లరైరా? అమరులంతటివారే పాటింపని ధర్మంబును నేఁడు నీవు తలఁపనేల? ఇదియునుగాక యొరుల సొమ్ము నీవు కోరుటగాదు. లంకా నగరము నీవంశ్యులది. అది యెప్పుడో యొకనాఁడు నీకు వచ్చి తీఱును. వెన్నుని దుర్నయంబునఁజేసి యది ప్రకృతము పరాధీనమయ్యెను. పరులనుండి నీసొత్తును నీవు గ్రహించుట యధర్మ మెట్లగును? అట్లు సేయవేని నిన్నొక యనదగాఁ దలంపరా? శక్తిమంతునకు నింతకన్నఁ దలవంపు గలదా?' యని యుక్తియుక్తముగా బోధించెను.

దశగ్రీవుఁ డది యెల్ల సావధానముగా విని ముహూర్తకాలము పర్యాలోచించి, 'ప్రహస్తా, నీమాట యసమంజసముగాదు. నీవు వెంటనే కుబేరునొద్దకుఁ బోయి, లంకాపురము మహాత్ములగు మా రాక్షసుల దనియు, మా పురంబును మాకు మరల నిచ్చుట పరమధర్మమనియు, నీయట్టి యనఘాత్ములు పరద్రవ్యంబును గాంక్షింపరనియు, మాది

మాకిచ్చుటవలన ధర్మంబును బాలించినవాఁడ వగుదువనియు, నా మాటగా సామపూర్వకంబుగా వచింపు' మని చెప్పి వానిని బంపెను.

ప్రహస్తుఁడు తోడ్తోడఁ గుబేరునొద్దకుఁ జని, 'రాజా, నీతమ్ముఁడు దశగ్రీవుఁడు పంపఁగా వచ్చితిని. నా పేరు ప్రహస్తుఁడు. 'సర్వశాస్త్ర విదాంవరా, ఈలంకాపురంబునుఁ దొల్లి సుమాలిప్రముఖులు బహుకాల మేలిరి. ఇది రాక్షసులవలన భుక్తపూర్వము. కారణాంతరమున వారు దానిని వదలి వలసపోయిరి. వారు లేనప్పుడు నీవు దాని నాక్రమించు కొంటివి. అంతమాత్రాననే యది నీది గాదు, గానేరదు. నేనన్ననో సుమాలివంశ్యుఁడను, మీఁదుమిక్కిలి నీకుఁ దమ్ముఁడను. నా వేడికోలు గ్రహించి నాసొమ్మును నాకు మనఃపూర్వకముగా నిమ్ము; తగవు వలదు' అని నీతమ్ముఁడు దశాస్యుఁడు నాముఖంబున విన్నవించుచున్నాఁడు. ధర్మజ్ఞుఁడవగు నీబోంట్లకుఁ బెక్కు-చెప్పనేల?' అనెను.

కుబేరుఁ డావృత్తాంత మెల్ల విని, 'ప్రహస్తా, ఈ పురంబును దొల్లి రాక్షసులు పాలించిరనుట నిజము. వారు చన్నతర్వాత నాతండ్రి నన్నిట నిలిపెను. నాఁడుసుత నేనిట యక్షులతోడనుండు. దీనికై యింత రాయబారమేల? నాతమ్ముఁడు దశగ్రీవుఁ డిందు వచ్చి యీ రాజ్యంబునెల్ల యథావిధిగా నేలుకొనవచ్చును. నీవు చని యిది నా మాటగా వానికిఁ దెలుపు'మని పలికి వానిని బంపివైచి, తాను దన తండ్రియొద్దకుఁ బోయి సంగతియెల్ల వానికి వినిపించి, 'నాయనా, తమ్ముని రాజ్యంబు నాకేల? దానిని వానికే యిచ్చివైతును. ఇఁక నే నెందుండ నగునో సెలవి'మ్మని వేఁడెను.

విశ్రవసుఁడు పుత్త్రునివిని, 'నాయనా, లంకాపురమును గూర్చి దశగ్రీవుఁడు నాతోఁ బ్రస్తావించెను. వలదన్నను వినఁడు. వాఁడు వర ప్రదానసంమూఢుఁడై మాన్యామాన్యంబులఁ గూడఁ బాటింపకున్నాఁడు. నాశాపనిమిత్తంబున వానికట్టి దారుణప్రకృతి గలిగెను. ఆదురాత్మునితో ఉంపు వలదు. వత్సా, లంకను వానికే వదలి వైచి నీవు కైలాసపర్వతం బునకుఁ బోయి యందు నివాస మేర్పఱచుకొనుము. అచట నదీమతల్లి ముందాకిని గలదు. ఆనదీజలంబులు మహానిర్మలంబులును గనకకమల కల్హారసుగంధిబంధురంబులునై యెంతయు హృద్యంబుగా నుండును. దేవకిన్నరగంధర్వాదులు విహారార్థులై యెప్పుడుఁ దన్నగరాజము నాశ్రయించి యుందురు. అందు నీకు సుఖమగు' నని హిత ముపదేశించెను. కుబేరుఁడు తండ్రిమాటను దలఁదాల్చి లంకకు వచ్చి భార్యా

పుత్త్రులను, మంత్రులను, బరివారంబును, ధనకనకవస్తువాహనంబులను వలసినంత వెంటఁగొని కైలాసంబునకుఁ జని యందు వసతి నిర్మించుకొని సుఖముండెను.

ప్రహస్తుఁడు కుబేరుని వీడ్కొని దశకంఠునొద్దకుఁ జని సంగతి యెల్ల వినిచెను. దశాస్యుఁడు పరమసంతోషమంది బంధుమిత్రపురస్సరంబుగా లంకాపురముఁ బ్రవేశించి దనుజరాజ్య పట్టాభిషిక్తుఁ డయ్యెను.

దశగ్రీవాదుల వివాహాదికము

దశగ్రీవునకు శూర్పణఖయను సోదరి గలదుగదా. ఆ కాంత వివాహయోగ్యయై యుండెను. ఆమెకుఁ దగు వరుని దశగ్రీవుఁడు విచారించి విచారించి యెందుఁ గానక తుట్టతుదకుఁ గాలకేయుఁడైన విద్యుజ్జిహ్వుఁడను వానిని నిశ్చయించి యతనికి నక్కన్య నిచ్చి వివాహమొనర్చి, తాను సమస్తరాజోపభోగంబుల నివ్వటిల్లుచుఁ గొండొకనాఁడు మృగయాభిలాష వనంబున కేగి వేటాడుచు నట నొక పురుషునిఁ గన్యాద్వితీయుని గాంచి యచ్చెరు వొంది తత్సమీపంబునకుఁ బోయి, 'అయ్యా, ఎవఁడవు? ఇందేల వచ్చితివి? ఈమృగశాబాక్షి యెవతె? నీ వెంట రానేల?' అని పల్కరించెను.

అతఁడు దశగ్రీవుని నింపాదిగాఁజూచి, 'నాయనా, హేమ యను పేరి యచ్చరమచ్చెకంటిని విందువుగదా? ఆలేమను భార్యగా దేవతలు నా కొసంగిరి. ఆ కాంతామణియందుఁ దగిలి యుసభోగార్థము హేమ మయంబును వజ్ర వైడూర్య రచితంబునైన పురవరం బొండు నిర్మించి యాయింతి తోడిదే లోకంబుగా నేనూతేండ్లందు సుఖముంటిని. మాకీపుత్త్రిక జనించెను. ఆమనోహరాంగి యంతట దేవకార్యార్థము నన్ను వదలిపోయెను. నా ప్రేయసి మఱల వచ్చునను పేరాసతోఁ బదునాల్గువత్సరంబులు కాచియుంటిని. అప్పటికి నది రాదయ్యెను. ఆకుసుమాంగి లేని యప్పురంబున నొంటిగా నుండనోపక మాయిరువుర ప్రేమఫలమైన యీపుత్త్రికను వెంటఁగొని తరలి యీసుతకుఁ దగువరు నవలోకించుచు భూపర్యటనం బొనర్చుచు నిందువచ్చితిని. కన్యాపితృత్వమునకన్న దుఃఖతరమైనది వేఱు లేదుగదా. ఈమెగాక మఱి యిద్దరు పుత్త్రులను హేమవలనఁ గాంచితిని. అందుఁ బెద్దవానిని మాయావి యందురు. రెండవవాఁడు దుందుభి యనఁబ్రఖ్యాతుఁడు. నన్ను మయుఁడందురు. ఇది నావృత్తాంతము. ఇఁక నీసంగతి వినవలతు'

నతనెను. నావుడు, 'మహాత్మా, పులస్త్యమహర్షిని వింటువా? వానికి విశ్రవసుఁడు జనించెను. అతనికి నేను బుట్టితి; నా పేరు దశగ్రీవుఁడు; మృగయావినోదినై యిటు వచ్చితి'నని పంక్తి-ముఖుఁడు చెప్పెను.

మయుఁడది విని, 'ఇతఁడు నా సుతకుఁ దగు వరుఁడు. మహర్షి వంశజునకు నితనికిఁ గన్య నిచ్చుట యుక్తము. కాదన్నను నన్నుద్రోచి యితఁడీకన్యను హరించును' అని తలపోసి దశగ్రీవునిచేయి పట్టుకొని, 'ఈకన్యారత్నమును మండోదరిని భార్యగా గ్రహింపు' మని దరహాస పూర్వకంబుగా నుడివెను. దశగ్రీవుఁడు వల్లె యనెను. మయుఁడు వారిరువురకు నగ్నిసాక్షికముగా ముడినైచి యల్లునకు నరణంబుగా శక్తి నొండొసంగెను.

రావణుఁడట్లు వివాహ మాడి భార్యతోడ లంకకుఁ జని దమ్ముల పరిణయము తలపెట్టి వైరోచనుని మనుమరా లగు వజ్రజ్వాల యను దానిని గుంభకర్ణునకును, గంధర్వరాజు శైలూషుని తనయను సరమ యను దానిని విభీషణునకును నిశ్చయించి యథోచితవైఖరి వారికి వివాహము లొనర్చెను.

అంతఁ గొంతకాలంబునకు మండోదరి గర్భవతియై సుతుని గాంచెను. వాఁడు పుట్టుచునే మేఘగర్జనంబుగాఁ దోప రోదన మొనర్చెను. ఆధ్వనికి లంకానగరమెల్ల జడీకృతమయ్యెను. ఆకారణంబున వానికి మేఘనాథుఁడను పేరిడిరి. వాఁడు దశగ్రీవాంతఃపురంబున రక్షస్త్రీసంరక్షితుఁడై కాష్ఠసంరక్షితవహ్నిచందంబునఁ బెంపొందుచుఁ దలితండ్రులకు నల్లారుముద్దుగా నుండెను.

కుంభకర్ణునకుఁ బితామహప్రేరణంబునఁ దీవ్రనిద్ర యాపాదిల్లెను. అతఁడానిద్ర నాపలేక కొలువుదీరియున్న యన్నకడకుఁబోయి, 'రాజా, నిద్రనాపికొనెను. తగు మందిరంబును నిర్మించి యి'మ్మని కోరెను. దశగ్రీవుఁడు తోడ్తోడ మందిరనిర్మాణ మాజ్ఞాపించెను. విశ్వకర్మనుబోని శిల్పులు చని రెండుయోజనంబుల నిడుపు నొక్క యోజనము వెడల్పు గల శాలను గట్టి యందుఁ జిత్రవిచిత్రంబుగాఁ గనకస్ఫాటిక స్తంభంబులు తీర్చి వైడూర్యసోపానంబులు దాపి కింకిణీజాలకంబులను దంతతోమరంబుల నమర్చి వజ్రమయ వేదికలు పొలుపొందఁ జేసిరి. కుంభకర్ణుఁడందుఁ బ్రవేశించి నిద్రావివశుఁడై యుండెను.

విభీషణుఁడు ధర్మబుద్ధిఁ బాయక నియమితకార్యంబులను శ్రద్ధా భక్తులతో నిర్వహించుచు విరామసమయంబుల శాస్త్రజిజ్ఞాసతోఁ బుచ్చుచు నెల్లరకు గౌరవపాత్రుఁడై వర్తించుచుండెను.

దశగ్రీవుని దుండగములు

దూతను జంపుట

వరోద్ధతికి దనుజరాజ్యాధికారము తోడయినంతనే దశగ్రీవుఁడు మైనుఱచెను. దేవర్షులను వధించుట యక్షగంధర్వులను జక్కాడుట నందనాది మహోద్యానవనంబులను రూపుమాపుట మత్తగజంబులో లె నదులుజొచ్చి కలఁచుట క్రీడావృక్షంబులను జంఝూనిలంబుకై వడి నుచ్చాటించుట నగంబులను వజ్రంబుపగిది భేదించుట వానికి సహజక్రీడ లయ్యెను.

కుబేరుఁ డాసంగతి విని చింతాక్రాంతుఁడై సహోదరవాత్సల్యంబు నఁజేసి దశగ్రీవునకుఁ గులానురూపధర్మంబుల నెఱిఁగించి హితముఁ గఱపఁ నెంచి వానియొద్దకు దూతను బంపెను. ఆదూత లంకకుఁబోయి మొదట విభీషణుని సందర్శించి వానివలన మర్యాదలు పడసి తా వచ్చినకార్యముఁ దెలిపెను. విభీషణుఁడు దూతనువెంటఁగొని పోయి రాజసందర్శనంబుఁ గలిగించెను. ఆదూత రాక్షసరాజునకు జయంబులు పలికి, 'రాజా, మీయన్న కుబేరుఁడు పంపఁగా వచ్చితిని. ఆయన తనమాటగా నీకిట్లు చెప్పు మనెను. 'నాయనా, నేను తపశ్చరణార్థము హిమవంతంబునకుఁ జని యందు నియతేంద్రియుఁడనై యుండఁగాఁ గొండొకనాఁడు నాకుఁ బార్వతీపరమేశ్వరుల సందర్శనభాగ్యము లభించెను. హైమవతీ రూప విలాసంబులు నాకు మహోశ్చర్యంబును గలిగించెను. అట్టే యామెను జూచితిని, నా వలకన్ను దగ్ధమాయెను. కారణముఁ దలపోసి నాయప రాధంబును గ్రహించి ఖన్నుఁడనై యాచోటు పాసి గిరితటాంతర మాశ్రయించి యందు నూఁటయెనిమిదేండ్లు మహోగ్రతపం బొనర్చితిని. మహేశ్వరుఁడు నాకుమెచ్చి వచ్చి, 'కుబేరా, దేవీరూపనిరీక్షణదోషంబున నీ వలకన్ను పింగళత్వమొందెను. అయినను నీతపస్సునకు మెచ్చితిని. ఈవ్రతంబును మొట్టమొదట నేనెంతో కష్టించి యనుష్ఠించితిని. నా వెనుక నీవు దానిని బాటించితివి. మనయిరువురకుఁదక్క నన్యుల కిది సాధ్యము గాదు. ఈవ్రతకారణంబున నీవు నేఁడుసుత నాకు సఖుఁడ వైతివి. నీకంటికి మాత్రము పూర్వస్థితి యిఁకఁ గలుగదు. దేవీప్రభావ

మట్టిది గావున నీకంటికైై జింతింపకుము. ఇది మొదలు ఏకాక్షిపింగళుఁ డను పేరు నీకు శాశ్వతమై యుండునని చెప్పి చనెను. అట్లునేను శంకరుని సఖ్యంబు సంపాదించుకొని యింటికి వచ్చి చూడఁగాఁ జిరసంవృద్ధమైన చైత్రరథవనంబు రూపుమాసి యుండెను. కారణము విచారించితిని. నీ కార్యముగాఁ జెప్పిరి. మతియుఁ దపోధనులైన ఋషుల నెందఱనో చంపితివఁట. దేవతలకు మహోపకృతిఁ దలఁచితివఁట. నన్నెంతో నిరాదరించితివఁట. ఇం దొండేనియు మన్నింపఁదగవు. బాలుఁడవనియు దమ్ముఁడవనియు నివియెల్ల సైచితిని. ఇఁక నేని యిట్టి కులదూషణ కార్యంబుల మానుము. దేవతలును ఋషులును గూడి నీవధోపాయంబుఁ జింతించుచున్నారు. విషమింపకమున్నే మేల్కొనుము.' రాజేంద్రా, మీయన్నగారి హితవచనంబులను విన్నవించితిని. చిత్తగింపనగు' నని చెను.

దశగ్రీవుఁడు దూతపలుకులు విని క్రోధమూర్ఛితుఁడై కన్నుల నిప్పులు రాల్చుచుఁ బండ్లు గీటుచు చేతులు పిసికికొనుచు, 'ఓరీ! నీ భావము తెలిసెను. ధూర్తుఁడవుగాని దూతవుగావు. నిన్నుఁ బంపిన వాఁడు భ్రాతగాఁడు, వానిసందేశము హితముగాదు. తాను సాధించిన మహేశ్వర సఖ్యంబును జాటుటకుఁగా నిన్నతఁడు పుత్తెంచెను గాని వేఱుగాదు. నీ ప్రల్లదంబులు మన్నింపఁగావు. జ్యేష్ఠుఁడనియు గురువనియుఁ దలఁచి వాని నింతకాలము సహించితిని. వాని కారణంబున ముల్లోకంబులకును దిక్పతులకును జేటువాటిల్ల నున్నది. ఇదిగో త్రైలోక్యజయపతాక నెత్తుచున్నాను జూడు'మని పలికి ఖడ్గంబును దూసి యా దూతశిరంబుఁ ద్రుంచి దాని నంటున్న రక్కసులకు భక్ష్యార్థమిచ్చి స్వస్త్యయనంబులతోడ రథమారోహించి త్రైలోక్య విజయ కాంక్షియై తరలెను.

ఆన్న నోడించి పుష్పక విమానమును హరించుట

దశగ్రీవుఁ డట్లు తనమంత్రులైన మహోదర, ప్రహస్త, మారీచ, శుక, సారణ, ధూమ్రాక్షు లనువారిని వెంటఁగొని లోకదహనార్థమో యన వెడలి పురంబులును వనంబులును నదీశైలంబులును ముహూర్త మాత్రంబున దాటి కైలాసగిరి చేరెను. ఆ పర్వతమందుఁ గాపున్న యక్షులు వానిని జూచియుఁ దనుఁజేని తమ్ముఁడను తలంపున నడ్డ గింపక కుబేరునకు సంగతి విన్నవించిరి. ఆ మాట విన్నంతనే ధనపతి మహోగ్రహమొంది దశగ్రీవునితోడి యుద్ధంబునకు నాజ్ఞాపించెను.

యక్షులు డీకొనిరి. ఇరుదెగలవారికి మహాసంకులయుద్ధమయ్యెను. ఆ సంక్షోభంబునకుఁ గుబేరుఁడున్న పర్వతము చలించుచున్నదో యనఁ దోఁచెను. జక్కుల వడికి దశకంఘని సచివులు వ్యధితచిత్తులైరి. రాక్షసేశ్వరుఁ డదిగాంచి మహోహ్వనాదంబు లొనర్చుచు యక్షులపైకి నుఱికెను. వానితోడ నతని సచివులు గూడ విజృంభించిరి. ఒక్కొక్క రక్కసుని వేగుఱువంతున జక్కులు ముట్టడించి గదలతో ఖడ్గంబులతో శక్తితోమరంబులతో ముసలంబులతోఁ బ్రహరించిరి. మహోదరాదులుక్కుచెడి దిక్కులఁ నిలిచిరి. దశగ్రీవుఁడు వారికిఁ దోడ్పడెను. వానిపై జీమూతధారగా యక్షులు శరవర్షంబు గురిపించిరి. పజ్జిక్కముఖుఁడు యంపవానలో దొప్పదోఁగసాగెను. వానికి నూపిరాడదయ్యెను. అట్లుండియు నతఁడు లవమాత్రమేని చలింపక మేఘుధారాశత సమృద్ధమైన మహామహీధ్రము పగిది నిలిచి కాలదండంబునుబోని దండంబును గైకొని యక్షసైన్యంబు నుఱుమాడెను. జక్కు లెల్లరు వికావికలైరి. అవయవంబులు లేగి కొందఱును, దలలు పగిలి కొందఱును, గుండియలు వ్రీలి కొందఱును, గూలి రణరంగమెల్లఁ బఱచిరి. హతశేషులు వాతోద్ధూతాభ్రశకలంబులువోలెఁ జెల్లాచెదరై దవ్వు చని మాసిరి. ఆ యుద్ధమును జూడ వచ్చిన ఋషిసంఘంబు లంతరిక్షమెల్ల నాక్రమించుటంజేసి యుద్ధనిహతులైన యక్షులు వీరస్వర్గంబునకుఁ బోవ సందు లేదయ్యెను.

యక్షవీరులపాటు విని ధనపతి మఱికొందఱను సంగ్రామంబునకుఁ బంపెను. వారిలో సంయోధకంటకుఁ డను పేరి మహాబలశాలి మును ముందుగాఁ బోయి మారీచుని గదిసి చక్రాయుధముచేత వాని నడిచెను. ఆవేటునకు రక్షోవీరుఁడు, పుణ్యక్షయంబున నేలరాలు గ్రహంబుపగిది దొల్లి ముహూర్తమాత్రంబునఁ దెప్పలోల్లి వైరిని మఱల నెదుర్కొనెను. అయిరువురకుఁ గొంతవడి మహాభయంకరమైన పోరు జరిగెను. తుదకు యక్షవీరుఁడు భగ్నాంగుఁడై పాటిపోవసాగెను. దశగ్రీవుఁడు వానిని దఱుముచు యక్షసైన్యాంతరముఁ జొఱనుండఁగా, సూర్యభానుఁ డను పేరి యక్షద్వారపాలకుఁడు రక్షోనాయకు నడ్డగించి తోరణంబునఁ బ్రహరించెను. పజ్జిక్కముఖుఁడు వ్రేటుపడి శైలము ధాతుసారమునట్లు దశవదనంబుల నెత్తురు గ్రక్కియు విధాతృవరబలంబునఁ ద్రుంగక సుంత సొమ్మసిల్లి తేఱి కోపంబు దీపింపఁగాఁ దత్తోరణంబునే యెడిచి లాగికొని దానిచేతనే యయ్యక్షుని తలమీఁద నొక్కటి వడ్డించెను.

వాఁడ్రవేటునకు నుగ్గునూచమై పొలకువ యాతెను. యక్షులు భయ భీతులై నదీగుహాంతరంబులు సొచ్చిరి.

యక్షు లట్లగుట కుబేరుఁడు విని మాణిభద్రుఁ డను మహా యక్షుని రావించి, 'మాణిచరా, దుర్వృత్తుఁడైన యారక్షఃపతిని సంహరించి యక్షవీరులకు శరణగు' మనెను. అతఁడు నాల్గువేల యక్ష శూరులతోడ రణరంగముఁ జొచ్చి గదాముసలప్రాసంబులతో శక్తి తోమరముద్గరంబులతోఁ బ్రహరించుచు డేగవలె నెగయుచు నొక్కఁడ నల్వురు రాక్షసవీరులతోడఁ దుములమగు యుద్ధము గావించెను. ఆ రణ కోలాహలంబునకు దేవతలును, గంధర్వులును, ఋషులును మహా విస్మయ మందిరి. అంతఁ బ్రహస్తుఁడు విజృంభించి సహస్రయక్షులను జంపెను; మహోదరుఁ డొక వేయిమందిని ద్రుంచెను; మారీచుఁడు రెండువేలు బలిగొనెను. ధూమ్రాక్షుఁడు మాణిభద్రు నెదుర్కొని వాని యురంబున ముసలంబుతోఁ గొట్టెను. యక్షవీరుఁ డాదెబ్బ సరకు చేయక పెనుగద నొండు గైకొని యెదిరి తలమీఁద మోఁదెను. ధూమ్రాక్షుఁడు విహ్వలుఁడై నేలఁబడెను. వానిపాటుఁ గాంచి దశాస్యుఁడు క్రోధ మూర్తియై మాణిభద్రుని డీకొనెను. ఆ యక్షశూరుఁడును రక్షోనాథుని పయి శక్తిత్రయము వైచెను. రాక్షసేశ్వరుఁడు గదతో మాణిభద్రుని మకుటంబున మోఁదెను. అది మొక్కపోయి సుంత ప్రక్కకు నొఱగెను. నాఁడుసుత వానిని భార్గ్వవాళి యనిరి. అతఁ డంత రణవిముఖుఁ డయ్యెను. దశగ్రీవుఁడు సింహనాదము గావించి ధనదుని వంక మఱలెను.

దశకంధరుఁడు తననెంక వచ్చుట కుబేరుఁడు దవ్వునుండి చూచి, శుక్రుఁడు, బ్రోష్ఠపదుఁడు అను తనమంత్రుల నిరువురను బద్మశంఖాది నిధుల యభిమాన దేవతలను వెంటఁగొని తమ్మునకు నెదురేగి, 'దశ కంధరా, తమ్ముఁడవని హితము పలికితిని; వినవైతివి. కర్మఫల మెవ్వరికిని దప్పదు. మరణాంతమునఁ గాని యీ రహస్యంబును గ్రహింపరు. మోహవశంబున విషముఁ ద్రావుచున్నావు. తత్ఫలము పరిణామమున నీకే తెలియును. తల్లిని వినవైతివి; తండ్రిని గర్హించితివి; గురువు నవమానించితివి. ఈ దుర్ణయఫలము యమునిబారి బడినప్పుడు విదిత మగును. శరీరములు బుద్బుదప్రాయములు. అవిగలనాఁడే యాత్మ కళ్యాణంబును సంపాదింపవలయును. అట్లు సేయని వాఁడు మరణాంత మునఁ దమ దుర్గతికై వగవక మానఁడు. రాజ్యముగాని ధనముగాని సౌఖ్యముగాని ధర్మమువలనఁ గలుగును. అధర్మంబునకు దుఃఖమే ఫలము.

మఱియుఁ బాపకార్యులు స్వాత్మాపఘాతకులు; వారి యెడ శుభ సంకల్పము లెన్నఁడు నుదయింపవు. సంకల్పమునుబట్టి కర్మమును, దానిఁబట్టి ఫలము నుండును. సత్సంకల్పము సుఖమును, దుస్సంకల్పము దుఃఖమును బుట్టించును. దుఃఖమే నరకము. మూఢా! నీవు నరకమును వరింపవుగదా. కాకున్న నీకిట్టి బుద్ధి యేల జనించెను? చాలుఁజాలు, దుష్టునితోడి సంభాషణంబును దొసఁగు దెచ్చు' ననెను.

ఆమాటలు విని మారీచాదులు మోము తప్పించి చనిరి. దశగ్రీవుఁడు వానిని ధిక్కరించి పలికెను. అంతఁ గుబేరుఁ డాగ్రహము వహించి గదతో రక్షోనాథుని తలపయి మోఁదెను. రాక్షసేశ్వరుఁడు చలింపక కుబేరునిఁ బైకొనెను. ఇరువురు నొండొరుఁ బ్రహరించుకొనుచు జడుపుగాని యలపుగాని లేక పెద్దయుం గాలము పోరిరి. ధనదుఁ డాగ్నేయాస్త్రంబును బ్రయోగించెను; దశగ్రీవుఁడు వారుణాస్త్రంబున దానిని వారించి రాక్షసమాయ నాశ్రయించి తిరోధానమంది వ్యాఘ్రుం బుగా నొకచోట, వరాహంబుగా నొకచాయ, జీమూతంబుగా నొక వంకఁ బర్వతంబుగా నొకదెస, యక్షుఁడుగా నొకవలన, దైత్యుఁడుగా నొకప్రక్క నానారూపంబులఁదోఁచి స్వమాయాబలంబును బ్రదర్శించి మహాస్త్ర మొండు కుబేరునితల గుఱిచేసి వైచెను. అయ్యస్త్రహతికి ధనదుఁడు విహ్వలుఁడై రుధిరంబులు గ్రక్కుచు మొదలు నరికిన యశోకంబుక్రియ నేలఁ గూలెను. అది గాంచి నిధిదేవతలు చింతా క్రాంతులై కుబేరుని జుట్టి నానోపచారంబుల వానిని దేర్చి చైత్రరథ వనంబునకుఁ గొనిపోయిరి. దశగ్రీవుఁడు హర్షోత్ఫుల్లనయనుఁడై నిజవిజయలక్షణంబుగాఁ గుబేరుని పుష్పకవిమానంబును హరించి, కాంచన స్తంభములతో వైడూర్యతోరణంబులతో ముక్తాజాలకంబు లతో మణిమయసోపానంబులతో నవరంజితిన్నెలతో సమలంకృతమై కామరూపముఁ గామగమనముఁ గలిగి విహంగమువలెఁ బఱచునదియుఁ గంటికిని మనస్సునకు నింపు గూర్చునదియు శీతముగాని యుష్ణముగాని లేక సర్వఋతువులందు హాయి గూర్చునదియునైన యవ్విమాన మెక్కి త్రైలోక్యవిజయ సంకల్పముతోఁ గైలాసమునుండి దిగెను.

నందీశ్వర శాపము

కైలాసాచలపాదంబున శరణవ మను పర్వతము గలదు. అనగము సువర్ణమయమై రెండనసూర్యునిపగిది వెలుఁగుచుండును. అది స్కందునకు జన్మస్థానము. పుష్పకవిమాన మచ్చోటుదాఁక హుటాహుటి వచ్చి

తటాలున స్తంభించెను. ఆ వింతకు దశగ్రీవాదు లచ్చెరువంది తలకొక యూహగా వితర్కింప సాగిరి. అంతలోన నట నొకవ్యక్తి దోచి, 'దశగ్రీవా, ఇందు రావలదు. ఇది శంకరుని క్రీడాపర్వతము. సుపర్ణ నాగ యక్షులకుగాని దేవగంధర్వరాక్షసులకుగాని మఱియే భూతంబు నకుగాని యీకొండ చొఱరాదు. దుర్మతీ, ఇందుండి తత్క్షణమే చనుము; ఒండుచో నశింతు' వనెను.

కరాళుడును, కృష్ణపింగళుడును, వికటుడును, వామనుడును మీదుమిక్కిలి ముండియు నైన యీవ్యక్తి యట్లు పలుకగా దశాస్యుడు విని తామ్రనయనుడై, 'ఏమి! శంకరుడా?' అని నిర్మర్యాదగా వచించి పుష్పకమునుండి దిగి శైలమూలముఁ జేరి యట శూలము ధరించి యపరశంకరుడో యననున్న నందీశ్వరుని గాంచి వాని కోతి ముఖంబునకు వికవిక నవ్వెను. వాని యహంకారంబునకు నందీశ్వరుడు కినిసి, 'దురాత్మా, నా వానర రూపంబునకు బిట్టు నవ్వితివి కావున వానరులచేతనే నీవును నీకులంబును నశించుగాక' యని శపించి, 'నిశాచరా, నీ యవజ్ఞకు నిన్నిందే యిప్పుడే నేనే పొరిగొనియుందు. స్వకర్మహతుని నిన్ను మఱలఁజంపనేల యని మిన్నకున్నాను' అనెను. నందీశ్వరుని నోట శాపము వెడలినంతనే వానిపయిఁ బుష్పవృష్టి కురిసెను; దేవదుందుభులు పెల్లున మ్రోసెను.

శివుని తిరస్కరించుట

ఆ శాపవచనంబును దశగ్రీవుడు నిరాదరించి, 'పశునాయకా, ఈకొండ నా విమానగమనమును నిరోధించెను. దీని నుమ్మూలింతుఁ జూడుము; ఎందు భవుఁడు నిరంకుశక్రీడావినోదియో యందే యతఁడు సంప్రాప్తస్వభయంబును గ్రహించుగాక' అని తన యిరువది బాహువులను జాడించి యా హస్తముల నప్పర్వతము క్రింద జొనిపి తన్నగంబు నట్టె యూచెను. ఆ యూఁపునకు నందున్న దేవతలును గణాధిపతులు నుట్టుట్లుగిరి. పార్వతియు భయకంపితయై మహేశ్వరుని గవుఁగలించు కొనెను. ఈశ్వరుడు సంగతి గ్రహించి తన పాదాంగుష్ఠంబును శైలము మీఁద లీలామాత్రంబుగా నూనెను. దశవదనుని హస్తంబులు కొండ క్రిందఁ జిక్కెను; ఎంత లాగినను రావు. ఆ విపరీతంబునకు రాక్షసేశ్వరుఁడును, వాని మంత్రులును భయవిస్మయములంది మ్రాన్పడి నిలిచిరి. తోని దురవస్థ నోర్వలేక తదనుచరులెల్లరు గుమిగూడి వానిచేతులుపట్టి తమశక్తికొలఁది యొక్కమ్మడి లాగిరి. ఆ బాధ సహింపలేక లంకేశ్వ

డుఁడు దశముఖంబుల నెలుగెత్తి యఱచెను. ప్రళయకాలధ్వనియో యనఁ ద్రిభువనభయంకరముగాఁ దటాలున నుప్పతిల్లిన యా మహా రావంబునకు నింద్రాదులు స్వస్థానంబులనుండి యదిరిపడిరి; సముద్రుఁడు సంక్షోభమందెను; పర్వతములు చలించెను; యక్షులును సిద్ధవిద్యాధరాదులును దహతహపాటు చెందిరి.

అట్లు విక్రోశించుచున్న రక్కసులతోనిని వానిమంత్రులు చూచి 'రక్షోనాయకా, నీలకంఠుని మహాదేవునిఁ గాత్యాయనీపతినిఁ బరితోష పెట్టుము. ఆమహనీయుఁడు దక్క నొండు శరణంబు గాన్పింపదు. ముక్కంటికిఁ బ్రణమిల్లి వానిని స్తుతింపుము. శంకరుఁడు పరమ దయాళువు; అయన తప్పక నీకుఁ బ్రసన్నుఁడై నీయార్తి నుడుపు' ననిరి. దశాస్యుఁడంత శంకరునకు శిరములతోడ నమస్కరించి వివిధ సామములచేత వానిని స్తుతింపసాగెను. ఇట్లు నేయేండ్లు గడచెను. అంత నొక్కనాఁడు శూలి వానినిఁ గనికరించి పాదాంగుష్ఠంబును సడలించి, 'దశాననా, నీ వీర్యపరాక్రమంబులకు మెచ్చితి; నీయఱపు చేత ముల్లోకంబులను భయాక్రాంతి మొనర్చితివి గావున నిన్నొక రావణుఁడంచురు; అనుజ్ఞ యిచ్చితి; ఇచ్చవచ్చినదారిఁ బొమ్ము'అనెను.

రావణుఁ డానచనంబులు విని, 'దేవదేవా! మహాదేవా! నాయెడఁ బ్రీతుఁడవేని నాకోరు వరం బనుగ్రహింపుము. దేవగంధర్వ రక్షోదానవనాగగుహ్యకులకును దదన్యులకు నవధ్యుఁడనను వరంబును బొందితిని. మనుష్యులా? తృణప్రాయులు; వారిసంగతియే తలంపరాదు. విరించి ప్రసాదంబున నాకు దీర్ఘాయువు గలదు. అందుఁ బ్రభవభాగమిప్పుడు గడచెను. ఎట్టిదుష్కర్మ మొనర్చినను మతి యేమి చేసినను నా యాయుశ్శేషము నశింపకుండునట్లు వరముఁ బ్రసాదించి దివ్యశస్త్ర మొం డనుగ్రహింపుము' అని వేఁడెను. శంకరుఁ డట్లేయగుఁగాక యని మహాదీప్తమైన చంద్రహాసఖడ్గ మొసఁగి, 'రావణా, దీని నెన్నఁడుగాని యనజ్ఞచేయ నలదు. అట్లు గావింతువేని తోడ్తోడ నిది నన్నుఁ జేరు' నని చెప్పెను.

రావణుఁ డంత మహాదేవునకు ప్రొక్కి యనుజ్ఞాతుఁడై విమాన మారోహించి భూమండలమెల్ల సంచరించుచు నందందుఁగల మహా వీరులను బీడించుచు యుద్ధదుర్మదాంధులై తనయాజ్ఞకు లోఁబడనివారిని దుది ముట్టించుచు శరణన్న వారిని విడిచిపుచ్చుచు దర్పబలోత్సిక్తుఁడై సమస్త రాష్ట్రంబులను స్వప్రతాపావనతంబులుగా నొనర్చుచుఁ దిరుగాడసాగెను.

వేదవతిని బలాత్కరించుట

రావణుఁడట్లు లోకసంచారముచేయుచుఁ గొండొకనాఁడు హిమాలయంబునకు బోయెను. అచట నొక చఱియయందుండి వింత కాంతు లెగసి వానికన్నుల మిఱుమిట్లు గొలిపెను. అతఁడు విస్మయమంది సంగతి యేమోయని యా చఱియ డాయఁబోయి యందు వల్కలములు గట్టి జడలు దాల్చి ధ్యానపరయై యున్న స్త్రీని గాంచి, 'అహో! ఏమి సౌందర్యము! ఈ కాంతామణి తనూచ్ఛాయ యపరంజికిఁగూడఁ గలుగదు; శరీరము శిరీషపేశలమై భ్రాలును; దేహకాంతియన్ననో వెలఁది వెన్నెలను మించుచున్నది; ముఖబింబమునకుఁ జంద్రమండలము సయితము సరిరాదు; బొమలన్ననో మరుని కోదండంబుల రీవి నొప్పారెను. ప్రత్యంగ మనోహరాంగక యనుటకన్న వేఱు విధంబున నీ బింబాధరను వర్ణింపరాదు. ఎవతయో? యేమి కోరి తపం బాచరించుచున్నదో యెఱుంగనగు' నని నిశ్చయించి, 'కళ్యాణీ, ఎన్నరిదానవు? నీ పొంసుఁ గాంచు పుణ్యాత్ముఁ డెవఁడు? ఏమి వలచి నవనీత కోమలమైన నీ తనూవల్లినిఁ గఠోరతపోవహ్నిని భ్రాఁచుదానవు? రాజ్యమును గోరుదువా? ముల్లోకంబులు నీ పాదాక్రాంతములుగా నొనర్తు; సిరినివలతువా? నవనిధులు నీముంగిట నుంతు; భోగంబులఁ గాంక్షింతువా? ఎల్లభోగంబులుఁ గూర్తు. నీ తలపేమో తెలుపుము. నీ వ్రతి మిఁకఁ జాలు. ఎలప్రాయంబును రిత్తపుచ్చకు. నీ సౌందర్యము పురుషులను గామోన్మాదమునఁ ద్రోయుచున్నది' యని పల్కరించెను. ఆ తపస్విని సుంత కనువిచ్చి దృష్టిసారించి లేచి యథావిధి వానికి నాతిథ్యమర్యాదలు గావించి, 'అయ్యా, బృహస్పతికిఁ గుశధ్వజుఁడను సుతుఁడు బ్రహ్మర్షి గలఁడు. ఆయన బుద్ధియందు గురువునకు సాటి యందురు. ఆ పుణ్యమూర్తి దినదినము వేదాధ్యయన మొనర్చువాఁడు. వాని వాఙ్మయినైన నేను కన్యగా జనించితిని. అయోనిజను గావున నన్ను వేదవతి యండ్రు. దేవగంధర్వయక్షరాక్షసపన్నగపతు లెందఱో నన్నుఁ గోరి నా తండ్రిని యాచించిరి. త్రిజగన్నాథుఁడైన శ్రీమహావిష్ణువు దక్క నన్యుఁడు నా కరగ్రహణంబునకుఁ దగఁడని నా తండ్రి చెప్పెను. దంభుఁడను రాక్షసుఁ డామాట విని కుపితుఁడై నిద్రావశుఁడై యున్న నా జనకుని నర్ధరాత్రంబునఁ జంపెను. పతివియోగదీనయై నా తల్లి భర్తతోడఁ జితిఁ జొచ్చి హుతాశనునకుఁ బ్రీతిఁ గూర్చెను. పితృసంకల్పమును దీర్పఁగోరి నారాయణుని గూర్చి తపోనిష్ఠ నున్నదానను.

శ్రీమన్నారాయణుఁడే నాపతి; అన్యునొల్లను. నీ మతము గ్రహించితిని; అడియాసలు మాని వచ్చినదారిఁ బొమ్ము' అనెను.

రావణుఁడు కందర్పశరపీడితుఁడై కదిసి, 'మోహనాంగీ, ఇట్టి గర్వము వలదు; నీ గుణసంపదకును నీ మాటలకును జతగాదు. త్రైలోక్య సుందరీ, నీ జవ్వనము వృథపోవుచున్నది. మానినీ, నేను లంకాధీశ్వరుఁడను. నా పేరు దశగ్రీవుఁడు. నీవు నాకు భార్యవై నిఖలభోగంబుల యథామతిఁ జూఱఁగొనుము. కాంతారత్నమా, విష్ణువు విష్ణువని కలనరింతువు. అతఁడెవఁడు? వీర్యంబుననొండెఁ దపోమహిమంబున నొండె వాఁడు నాకు సాటియగునా? వరాటుని వరింతువేల?' యని బసులు పలికెను. నాప్రసు వేదవతి కటకటంపడి, 'నిశాచరా, ముల్లోకంబులకు నధిపతియుఁ జరాచర సమస్త ప్రపంచ నమస్కృతుఁడు నైన యా మహావిష్ణువును భవదన్యులు బుద్ధిమంతులెవ్వరును దూలనాడరు. మదాంధకారము నీ కనుఁగప్పియున్న'దని తిరస్కారస్వరంబున వచించి యావలఁ బోనుండెను. రావణుఁడు తటాలున నామెను శిరోజములఁబట్టి తిగిచెను. వేదవతి యుగ్రహస్తుర్నిరీక్షణయై ఖడ్గంబునంబలెఁ దనచేతితోన యక్కుఱులు నంతవఱకు ఖండించి బంధవిముక్తయై రోషాగ్నిచేత వానిని దహింపనున్నదో యన మండుచు నగ్నిఁబోల్చి మరణోన్ముఖయై, 'నిశాచరాధమా! నీ హస్తస్పర్శఁగాంచి యీశరీరము మలీమసమయ్యెను. ఇఁక నిది యుండరాదు; హుతాశనునివలనఁగాని దీనికిఁ బవిత్రత గలుగదు. పాపీ! వనాంతరమునఁ దపమొనర్చు నన్ను నిష్కారణముగా ధర్షించితివిగదా! దృష్టిమాత్రమున నిన్ను భస్మీకృతునొనర్పఁజాలుదు. పురుషులను జంపుట స్త్రీకిఁ దగదని యూఱకుందు. శపింపరాదా యనినఁ దపోవ్యయమునకు వెఱతును. నేను దపోనిష్ఠనేని, నా వ్రేల్చినహోమంబు లగ్ని దేవునకుఁ బ్రియంబులగునేని, శ్రీవిష్ణుపాదపద్మములందు నా భక్తి నిశ్చలమేని యయోనిజగా జనించి సాధ్వినై నీకు మృత్యువునగుదుఁ జూడు'మని యగ్నిఁ జొచ్చెను. వెను నెంటనే పుష్పవృష్టి కురిసెను. రావణుఁడు భగ్నమనోరథుఁడై వడుపుతప్పిన సర్పంబువలె రోఁజుచుఁ జనెను.

యజ్ఞభంగము చేయుట

ఉశీరబీజమను ప్రదేశమొండు గలదు. అచ్చట మరుత్తు అను రాజుండెను. ఆ చోఁడు బృహస్పతి భ్రాతయైన సంవర్తుని ఋత్విక్కుగా వరించి యజ్ఞమారంభించెను. దేవతలెల్లరు వచ్చిరి. రావణుఁడు

విమానము మీఁద సంచరించుచుఁ దత్సమయంబున నటకు వచ్చెను. వానిసడి విన్నంతనే దేవతలు భయభ్రాంతులై యతనికంటఁబడ వెఱచి తిర్యగ్రూపంబులు దాల్చిరి. ఇంద్రుఁడు నెమలియయ్యెను; యముఁడు కాకిగా మాఱెను; కుబేరుఁడు తొండమూపు దాల్చెను; వరుణుఁడు హంస యయ్యెను; ఇతరు లాయా పక్షిరూపంబులు వహించిరి. అశుచి యగు కుక్క యజ్ఞవాటినినలె రావణుఁ డా క్రతుప్రదేశంబుఁ జొచ్చి మరుత్తును డాసి, 'రాజా, యుద్ధము చేయుదువా? జితోస్మి యందువా?' యనెను.

యజ్ఞక్రియాపరతంత్రుఁడై యున్న మరుత్తు తలయెత్తి వానిని గాంచి 'ఎవఁడవురా, నీవిట్లుపహాసంబు లాడుము' వన, 'రాజా, నన్నె ఱుంగవా? నా పరాక్రమంబును జవిచూడని ప్రాణి ముల్లోకంబులఁ గలదా? అన్నయగు కుబేరుని జయించి వాని విమానమును హరించి యజేయుఁడై విహరించు దశగ్రీవు నిప్పుడేని యెఱుంగు' మనెను. నావుడు, 'అహో! మహాధన్యుఁడవు; నీ యట్టి పుణ్యాత్ముల సందర్శనము నాబోంట్ల కగునా? అన్నను గెల్చిన వీరాగ్రణీ! నీవంటి శ్లాఘ్య పురుషుఁడు ముజ్జగాన గలుగఁడు. ధర్మమొనర్చి ప్రకటించుకొనువారు గలరు. దారాత్మ్యక మొనర్చి లజ్జించుటకు మాఱుగా ఘంకాకోట్లు వానిని కని విని యెఱుఁగ. దుర్మతీ! వరగర్వోద్ధతి విజృంభించుచున్నావు. నేను బ్రదికియుండఁగా నిందుండి నీవు జీవముతోఁ బోఁజాలవు' అని పలికి శరశరాసనంబులు గొని రణోన్ముఖుఁడు గానుంచెను.

అంత సంవర్తుఁడడ్డుపడి, 'రాజా, ఇప్పుడు నీకు యుద్ధము తగదు; మహేశ్వరవ్రతమును బూనితివి. దాని కెట్టియంతరాయముఁ గలుగ రాదు. విఘ్నము మొదవినచోఁ గర్తృవంశము దగ్ధమగును. మఱియు దీక్షితుఁడవు; దీక్షాపరులకుఁ గ్రోధము చెల్లదు. అది యటుండ నిమ్ము. జయాపజయంబుల నిశ్చయింపరాదు. ఈ రాక్షసుఁడో సుదుర్జయుఁడు. నాకుఁ దోచినంత చెప్పితి' నని మైత్రిపూర్వకంబుగా బోధించెను. మరుత్తు గురువాక్యంబులు పాటించి యుద్ధసన్నాహము మాని చాప శరంబులు విసర్జించి సుఖసమాప్తికిఁ గడఁగెను. అది గాంచి శుకుఁడను రాక్షసుఁడు 'జయ జయ రావణ' యని హర్షనాద మొనర్చెను. తోడ్తోడ సోఁకుమూక చెలరేఁగి యజ్ఞార్థము వచ్చిన ఋషులనుబట్టి చంపి వారినెత్తురులు ద్రావిరి. అంత రావణుఁ డచ్చోటు వాసి చనెను.

రావణుఁడు చన్నంతనే యింద్రాదులు బ్రదికితిమిరా యని సంతసించి స్వస్వరూపంబులు దాల్చి యాపత్కాలంబునఁ దమ్ము దాఁచి కాపాడిన మయూరాదులకుఁ గృతజ్ఞతఁ దెలుపుటకో యన వానికి నపూర్వవరంబు లిచ్చిరి. ఇంద్రుని వరంబున మయూరంబులకు నాఁటగోలెఁ బన్నగభయము వీడెను; మఱియు నల్లగానున్న వాని కుంచెలు వేయి కన్నులుగలిగి పెట్టని భూషణ మాయెను. కాకులకు రోగపీడా రాహిత్యమును మఱియుఁ బురుల వలని వధలేకున్నచో జిరజీవిత్వముఁ గలుగుటయు నవి పిండాన్నము గ్రహించునేని పితరులకు తుద్వ్యథ తీఱుటయు ధర్మరాజు వరంబునఁ బ్రాప్తమయ్యెను. హంసలు తొల్లి సీలవర్ణయుక్తములును నీలాగ్రపక్షములునై తృణాగ్రనిర్మములైన ముక్కులు గలిగియుండెను. వరుణుని వరంబున నాఁడుసుత యవి శుద్ధ ఫేనవర్ణంబును బడసెను. కుబేరుఁడు తొండకు హిరణ్యవర్ణముఁ బ్రసాదించెను. ఇంద్రాదు లట్లొనర్చి ముఖసమాప్తిఁ గావించి యాజ్ఞేనితోడ సురలోకంబునకుఁ జనిరి.

నానారాజులనుజయించుట—అనరణ్యశాపము

రావణుఁడట్లు మరుత్తును జయించి యుద్ధకాంక్షియై నానారాజ నగరంబులకుఁ బోయి, 'యుద్ధమునకు రమ్ము; లేదా ఓడితి ననుఁ' బని యొక్కొక్కనరేంద్రు నడుగ సాగెను. దుష్యంతుఁడు సురథుఁడు గాధిగయుఁడు పురూరవుఁడు మున్నగురాజులు లంకేశ్వరుని వరబలంబు లెఱిఁగి పరస్పరము కలియఁబలుకుకొని 'బ్రదికి యున్న శుభముఁ బడయవచ్చు' ననుఁ నానుడి ననుసరించి 'జితోస్మి' యనిరి.

అంత రాక్షసేశ్వరుఁడు అయోధ్యకు వచ్చెను. అత్తఱి యా నగరంబును అనరణ్యుఁడను రాజసింహుఁడు పాలించుచుండెను. రక్షో నాథుఁడు వానికిఁ గూడ నట్టిసందేశమునే బంపెను. ఆ యేఁడు కోపో ద్దీపితుఁడై యుద్ధమునకు రమ్మని బదులు చెప్పిపుచ్చెను. ఇరుసైన్యంబులకుఁ దీవ్రయుద్ధమాయెను. రాజుసేన రక్కసిమూకచేతఁబడి పహ్నాహుతి హవ్యంబుకరణి యయ్యెను. సాగరముజొచ్చిన నదులట్లు నిజబలము నశించుచుండుట యనరణ్యుఁడు గాంచి శక్రచాపంబునుబోని శరాసనంబుఁ గైకొని యెక్కుపెట్టి ధనుష్టంకార మొనర్చి రణరంగంబు సొచ్చి మారీచ శుకసారణప్రహస్తులను సింహము స్వల్పసత్త్వములఁ బోలెఁ బాఱఁదోలి దశకంఠునితలలు గుఱిచేసి యెనిమిదివందలబాణంబు లొక్కమ్మడి వైచెను. ఆ శరవ్రాతంబును రావణుఁడు లెక్కసేయక విజృంభించి యనరణ్యుని

శిరంబుమీఁదఁ జేకొలఁది తాడించెను. ఆ వ్రేటునకు నతఁడు విహ్వలుఁడై డొల్లి కూలెను. నేలఁబడిన యూనృపతిని రావణుఁడు చూచి నవ్వుచు, 'ఎదిరించిన ఫలంబుఁ గంటివా? నరాధిపా! ద్వంద్వయుద్ధంబున నాతోఁ బోరఁగల మగఁడు ముజ్జగానఁ గలఁడా? గర్వముపలనఁ జెడితివి' యని పరిహసించెను.

అనరణ్యుఁ డామాటలు విని, 'లంకాధిపా, కాలము మంచిది కానినాఁడు ఎవరు నేమియుఁ జేయనోపరు. నన్ను జయించితి వని ప్రగల్భములాడవలదు. కాలమునకుఁ జిక్కితిని గాని నీకుఁ గాదు. కాలమే యన్నియుఁ జేయును. అది యెఱుంగక యహంకారపడుట యజ్ఞానము.

ఉ॥ 'వాయువశంబులై యెగసి వారిధరంబులు మింటఁ గూడుచుం।
బాయుచు నుండుకైవడిఁ బ్రపంచము సర్వముఁ గాలతంత్రమై।
పాయుచుఁ గూడుచుండు నొకభంగిఁ జరింపదు కాల మన్నియుం
జేయుచునుండుఁ గాలము విచిత్రము దుస్తరమెట్టివారికిన్॥'

అను పెద్దలవాక్యమును వినియేని తెలివితెచ్చుకొనుటొప్పు. నా ప్రాణంబులు తరల నున్నవి. ఇప్పుడు నిన్ను నే నేమియుఁ జేయనోపను. వెన్ను చూపక వీరరణం బొనర్చితిని; సంగ్రామంబున నోడితిని. నీవు జయించితివి. అంతతో నుండుట ధర్మము. ధర్మమును ద్రోచివైచి నీ నోటితీటనోవ నన్నును నా యిక్ష్వాకుకులంబును దూలనాడితివి. ఇది దుస్సహము. రాక్షసాధమా! నేను దానపరుఁడనేని నాయొనర్చిన యజ్ఞంబులు నన్ను మన్నించునేని, తపస్వినేని నావచించుమాట తప్పదు. ఇక్ష్వాకువంశంబునఁ నే రాముఁడను పేరితో నేను పుట్టి రణరంగమున నీ ప్రాణంబులు పొరిగొందుఁ జూడు' మని నీరెలుంగునఁ బలికి యసువులు దొఱఁగెను. రావణుఁ డామాటలు పిల్లిశాపంబులుగాఁ దలఁచి లోలోన నవ్వుకొనుచు నందుండి పోయెను.

యమునిజయించుట

రావణుఁడట్లు విజయియై యయోధ్యానగరమునుండి వియన్మార్గంబున వచ్చుచుండఁగా మార్గమధ్యమున వానికి నారదుఁ డెదురయ్యెను. లంకేశ్వరుఁడు వానికి నభివాదన మొనర్చి తత్కుశల మరసి వచ్చిన కారణ మడిగెను. అనవుడు, 'రాక్షసేశ్వరా, శుభమగుఁగాక; నీ విక్రమోర్జితంబులకు సంతసింతు; ఒక్క యాసమాత్రము నన్ను వదలదు. విష్ణువు దైత్యులను వలె నీవు గంధర్వోరగులను బరిమార్చుట చూచి

యానందించు చెన్నడోగదా యని తమకింతును. నాయనా, నీవు దేవతలకుఁగూడ నవధ్యుఁడవు. నిన్నెవ్వరును జెనక నోపరు. నీవీ నరులను జంపుటఁ జూడ నాకెంతయు నాశ్చర్యవిషాదము లయ్యెను. ఏలయందువా? నరులు పుట్టిననాఁడే మృత్యుముఖముఁ జొచ్చి మృతప్రాయులై యుందురు. వారిని నీవు చంపుట చచ్చినవారినిఁ జంపుటగదా. అది యెట్లందువా? నరులు స్వహితజ్ఞానములేని మూఢులు. అడియాసలు పెంచి యీ యెండమావుల వెంటఁబడి నిరంతరముఁ బరిధావించుచుఁ దీఱని వ్యసనంబులకుఁ జిక్కి యుందురు. జరావ్యాధులు వారినిఁ బ్రతిక్షణము మ్రింగుచునే యున్నవి. అట్లుండియు ననిష్టములను మానరు. ఆఁకలిదప్పులకుఁ జిక్కి ముదిమికిఁ దలయొగ్గి శోకవిషాద సమ్మూఢులై యుత్తరక్షణంబున నేమి రానున్నదో నేరలేకుండియుఁ జిరజీవులవలె భావించుచు విచిత్రార్థసంపాదనంబున నొకనాఁటికిఁ దనియక వాదిత్ర నృత్యాదులందుఁ దవిలి యపరరాత్రమైనంత నేకస్నిటిధారలు గార్చుచు మాతాపితృసుతస్నేహంబులకును భార్యాబంధుప్రియంబులకును మోహపడి యాజంజాటములనుండి తప్పించుకొనలేక దురపిల్లుచు స్వయంకృతాపరాధములచేతనే మృతజీవులై యున్న మర్త్యులయెడ నీవృథాక్లేశమిఁకఁ జాలింపుము. రావణా, ఇందఱను జంపితివిగదా? ఈ చంపుట యెందులకు? వాఁడు నీకు వశులై యుండుటకుఁ గదా? ఒక్కరైన నట్లయిరా? ఎంతపిచ్చి! కాదన్న శరీరములు మాత్రము నీయధీనమగును. ప్రాణములు యముని యధీనము. భళీ! ఇఁక నిన్ను శవములరాయుఁడనక మానరు. ఎంత వెఱ్ఱివాఁడవు! నిగ్గును వదలి పిప్పిని సేకరించుచున్నావు. యముని జయింతు వేని సమస్తము జయించినట్లగును. అప్పుడు నీఁతాటి కెదురుండదు. ఇంతమాత్రము యోచింపక యెంతకాలము వృథపుచ్చితివి!' అని నారదుఁడు పలికెను.

ఆ ఋషివచనంబు లెల్ల విని రావణుఁడు నవ్వి తలయూఁచి 'మహాత్మా! విజయార్థము రసాతలంబునకుఁ బోవనున్నాను. నాగ లోకంబున నా యాజ్ఞనిలిపి యమృతార్థము సముద్రమును మథించి వచ్చి యనంతరము నీ యనినకార్య మొనర్తు' ననెను. 'దశగ్రీవా, నీకుఁ దక్కనన్యులకు యమలోకము చొరరాదు; ప్రేతరాజపురమార్గము మహా దుర్గమము', అని మఱియు నారదుఁడు వచించెను. ఆమాట విని రావణుఁడు నవ్వి, 'సురమానీ, సంశయింపవలదు; ఒక్క యమునినే గాదు, లోకపాలుర నెల్లర జయింతు నని యిదే ప్రతిజ్ఞాపూర్వకంబుగా

వచింతు. నీప్రీతికై నాకార్యక్రమమును మార్చితిని. ఇప్పుడే యమపురికిఁ జని సర్వభూతప్రాణిసంక్లేశకరుని వానిని మట్టుపెట్టుదు' నని మునికి నమస్కరించి దక్షిణాభిముఖుఁ డయ్యెను.

నారదుఁ డంత ముహూర్తకాలము ధ్యానగతుఁడై, 'చరాచరంబుగా జగత్త్రయంబు నశించువేళఁగూడ నెవఁడు ధర్మమును సంరక్షించునో, ఎవఁడు రెండవపావకునిభంగి దీపించుచు నెల్లరకర్మములకు సాక్షియై యుండునో, ప్రాప్తసంజ్ఞు లెవని యనుగ్రహము పేర్మిఁ జరించుచుందురో, ఎవనికి ముల్లోకంబులును భీతిల్లునో, సుకృతదుష్కృతంబులకు ననుమేయఫలంబు లెనఁడిచ్చునో, ఎవని కనుసన్నల మృత్యువు వర్తించుచుండునో యట్టి పరేతరాజు నితఁ డెట్లు జయించునో చూడ నయ్యెడు. యమసదనంబునకుఁ బోయి సర్వముఁ గన్నారఁ జూతుఁ గాక' యని నిశ్చయించుకొని యాదారిద్రొక్కి తత్పురము చేరి యట నానాప్రాణులకు నిగ్రహానుగ్రహంబులను నిర్ణయించుచున్న యముని గాంచెను. సమవర్తి యాబ్రహ్మర్షికి నర్ఘ్యమిచ్చి మర్యాదలు గావించి, 'మునివర్యా, త్రిలోకసంచారివి నీ వెఱుంగనిది గలుగదు. సకల ధర్మంబులు సక్రమంబుగాఁ బ్రవర్తించును గదా. మీ యాగారాకకుఁ గారణము గలదా?' యనెను. 'ధర్మరాజా, ఒక వింతసంగతివిని నీకుఁ దెలుప హుటాహుటి వచ్చితిని. ప్రతిక్రియ నూహింపుము. దశగ్రీవుఁ డనురాక్షసుని విందువుగదా. వాఁడు కండక్రొవ్వునఁజేసి కన్నెఱుంగక జయముఁ గోరి నీపయి దాడివచ్చుచున్నాఁడు. దండధరునకు నీ కేమి యగునో యనుభయము నన్ను నిలువనీయదయ్యెను.' అని నారదుఁడు చెప్పెను.

వారట్లు కలియఁబలుకుచుండఁగా దవ్వున సూర్యతేజస్సువంటి తేజస్సు దోఁచెను. ఆపెలుఁగునకు యమపురమందలి చీకట్లు విరిసి పాఱఁజొచ్చెను. యముఁ డది గాంచి, 'ఏమి యీవింత, యని యాశ్చర్యపడి, యది రావణ విమానతేజోవిశేష మగుట గ్రహించి సమరసన్నద్ధుఁడు కాసాగెను. అంతలోన రావణుఁడు యమపురి చొచ్చి జముని మందిరమువంకకు నడిచెను. మహోగ్రులును ఘోరాకారులు నైన కింకరు లొకచోటఁ గొందఱును గట్టి కొట్టుచుండిరి; ఆబాధకు సోర్వలేక వారయ్యోయని యఱచుచుండిరి; ఒకచోటఁ గొందఱు రౌరవంబునఁ బడి మ్రగ్గుచుండిరి; ఒకచోటఁ గొందఱు క్షారనదులఁ బడి తల్లడిల్లుచుండిరి; ఒకచోటఁ గొందఱు చురకత్తులఁ గడికోఁతలకు

హా యని విలపించుచుండిరి. పురుగులు తొలుచుటచేత బరితపించుచున్నవారును, భయంకరములైన కుక్కలు మూగి కండలు పెఱికి తినుటవలన బాధకు వాపోవువారును, గుండియలపయిబడు సమ్మెట ప్రేటులకు నెత్తురులు గ్రక్కుచు హాహాకారము లొనర్చువారును, వైతరణీ రక్తజలంబులలో ముంచి యదిమిపట్టుటవలన నూపిరాడక గిజగిజ తన్నులాడువారును, మండుసైకతంబున ప్రేల్వబడుచున్నవారును అసిపత్రవనాంతరంబున వేధితులై యుమ్మలించుచున్నవారును, ఏడ్చి యేడ్చి గొంతుక లెండి నీరో యని కుయ్యిడుచున్నవారును, ఆకటి జొక్కి యటమటించుచున్నవారును, శవమాత్రాకారంబున నున్నవారును, శుష్కభూతులును, వివర్ణులును, విరిసినతలతో బరుగులాడుచున్నవారును, మలపంకంబులఁ బొర్లాడుచున్నవారును, ఇట్లు నానావిధంబులఁ దమతమ దుష్కృతఫలంబు లనుభవించుచున్న ప్రాణులు వానికిఁ బురమందెల్లఁ గానవచ్చెను. ఒకచోటఁ గొందఱు సంగీత వినోదంబుల నుండిరి. ఒకచోట మఱికొందఱు గోక్షీరంబులు ద్రావుచుండిరి; ఒకచోటఁ గొందఱు మృష్టాన్నసంతుష్టులుగా నుండిరి. మఱియు గృహదానఫలంబుగా దివ్యసౌధాంతరంబుల విహరించుచున్నవారును, కన్యాదానఫలంబుగా సువర్ణమణిముక్తాసమలంకృతలగు ప్రమదారత్నంబులఁ గూడియున్నవారును, స్వధర్మానుష్ఠానఫలంబుగా దివ్యశరీరంబులఁ దేజరిల్లుచున్నవారును, అందందుఁ గానవచ్చిరి.

రావణుఁ డావిశేషములెల్లఁ జూచి స్వకృతాపరాధంబుగా నట్లు బాధపడుచున్నవారినెల్ల విడిచిపుచ్చెను. అతర్కితముగాఁ దటాలున బాధావిముక్తి గలిగినందులకై యా ప్రాణులెల్లఁ బరమానంద మొందెను. ప్రేతరక్షకులు రావణుని దౌష్ట్యంబునకుఁ గినిసి వానినిఁ దలపడిరి. హలహలా శబ్దంబులు దిక్కులందు విదిక్కులందుఁ బ్రతిధ్వనించెను. ప్రాసపరిఘశూల ముసలశక్తితోమరంబులు పుష్పక విమానముపయి జడివానవలెఁ గురిసి యందలి ప్రాసాదవేదికలను దోరణంబులను సుఖాసనంబులను జిందఱ వందఱ గావించెను. ఆ విమానము దేవనిష్ఠానుభూతము గావున క్షణములో యథాపూర్వమయ్యెను.

యమకింకరు లట్లు తమ తొలిపూనికను వ్యయించినంత రాక్షససైన్యము చెలరేగి వృక్షశైలంబులను గొని జమునిసేనను డీకొనెను. ఉభయసైన్యమట్లు పరిభూణించి బాహాబాహి, ముష్టాముష్టి తీవ్రయుద్ధము పెద్దయుం దడ వొనర్చెను. కాలునిభటుల ప్రేటులకు నసుర

రాజమంత్రులు శోణితదిగ్ధాంగులైరి. రాక్షసవీరహతులకు దండధరుని మొనయెల్లఁ బిండీకృతమయ్యెను.

శమనకింకరులు కొందఱు దశాస్యుని దాఁకి వానిపయి శూల వర్షము గురిపించిరి. రావణుఁడు జర్ఝరీకృతాంగుఁడై నెత్తుట జొత్తిల్లుచుఁ బూచిన యశోకమువలెఁ దోఁచియు లేశమాత్రముగూడ చలింపక కోపాగ్నులఁ బఱచుచు నస్త్రబలము నాశ్రయించి శూలగదాప్రాసంబులను, శక్తితోమరముసలంబులను, వివిధసాయకంబులను, శిలావృక్షంబులను యమయోధులపైఁ గ్రుమ్మరించెను. వారు ప్రత్యస్త్రముల చేత వానినెల్లఁ జూర్ణమొనర్చి మేఘుంబులు పర్వతముమీఁద నట్లు రావణునిపయి వ్రాలి భిండివాలంబులతో శూలంబులతో మర్దించిరి. సురవైరి కవచము వ్రీలెను; వానికిఁ బ్రత్యంగిమునుండి రక్తము చిమ్మ సాగెను. అంత లంకేశ్వరుఁడు విమానమునుండి దిగి శరచాపంబులు గొని యంతకునివలెఁ గ్రాలుచుఁ బగఱ నదిల్చి పాశుపతాస్త్రంబును సంధించి శంకరుఁడు త్రిపురంబులపయిఁబోలె యమచమూపటలంబు మీఁద వదలెను. ఆ దివ్యాస్త్రము విధూమజ్వాలామండలాకృతిఁబూని నిదాఘసమయంబునఁ గార్చిచ్చు కీకారణ్యంబునుబోలె విరోధినరూథినీచయంబునెల్ల బూతి యొనర్చెను.

స్వబలనాశమును శత్రువిజయంబును యముఁడు చూచి కనలుచు రథ మారోహించెను. కాలదండము మూర్తిమంతమై యగ్నులు రాల్చుచు వాని ప్రక్క నిలిచెను; కాలపాశము రూపుదాల్చి యొక ప్రక్క చేరెను; ముద్గరము సాకృతితో ధగధగమండుచుఁ గొలువు దీఱెను. ముజ్జగంబులు భీతిల్లెను. వాగెలను సడలించిరి; రథాశ్వంబులు నింగి కెగసి క్షణములో రణరంగమున నిల్చెను. మృత్యుసమాయుక్తమై మహావికృతముగానున్న యయ్యరదంబును గాంచి రాక్షసరాజసచివులు భయార్దితులై నిలువనోపమని పలుకుచుఁ బలుదెసలు పట్టిరి. దశగ్రీవుఁడు మాత్రము చలింపక నిలిచెను.

యముఁ డంతట శక్తితోమరంబులఁ బఱపెను. రావణుఁడు వానినెల్ల మార్గమధ్యంబునఁ దునిచి యెదిరి రథముమీఁద శరవర్షముఁ గురిపించెను. సమవర్తి యందులకుఁ గ్రోధమూర్తియై యసురయురంబున మహాశక్తిని వైచెను. రావణుఁడు శల్యపీడితుఁడయ్యుఁ బ్రతిక్రియ నేరకుండియు సంగరక్షోణి విడనాడక నిలిచి యేడుదినంబులు పోరి యెట్ట కేలకు స్మృతి దప్పెను. వానిని రణభూమినుండి దొలఁగించి సేదతేర్చిరి.

అతఁడు సుంత దిటవు తాల్చి మగుడ డీకొనెను. యమరావణులకు ఘోరయుద్ధము పొసఁగెను. ఒకరును వెనుదీయరైరి. వారియుద్ధంబున లోకప్రళయ మగునట్లు దోఁచెను. రావణుఁడు దంభోళిఁబోని చాప దండంబు గ్రహించి యంపవానఁ గురిసి యాకాశమెల్ల నిరవకాశ మొనర్చి మృత్యువుపయి నాల్గువిశిఖంబులు ఱువ్వి సూతుని నేడమ్ముల నొంచి వివిధసాయకంబులతో యముని మర్మంబులు గాడనేసెను. జముని నోటనుండి కోపాగ్ని జ్వాలాభీలమును ధూమసహితమునై వెడలెను. మృత్యువును గాలమును మహాసంరబ్ధులైరి. అందు మృత్యువు మునుపడ వచ్చి చేఁదోయిఁ గీలించి, 'దేవా, ఇతని నిఁక మననిచ్చుట పాడిగాదు; అనుజ్ఞయిమ్ము; ఈపాపిని బూది యొనర్తు; హిరణ్యకశిపుఁడు, నముచి, శంబరుఁడు, విసంధి, ధూమకేతువు, జవి, విరోచనుఁడు, దంభుఁడు, వృత్రుఁడు, బాణుఁడు మున్నగు రాక్షసవీరుల నెందఱనో గావుగొంటిని; రాజర్షులుగాని, గంధర్వులుగాని, దైత్యయక్షులుగాని, నాదృష్టి సోఁకి మనినవారు లేరు. నాచూపు పాఱినంతనే మహీతలంబు గూడ పర్వత సరిద్భ్రమంబులతోడ మహార్ణవములతోడ రూపుమాయును. ఈకూళ యనెంత ? నాయీ సహజశక్తికి ఋణముసేపు ఆటవిడుపగుఁ గాక' అని వేడెను.

ధర్మరా జవ్వచనంబులు విని మృత్యువును వారించి కాలదండముఁ జేతఁబూనెను. కాలపాశము విజృంభించెను; ముద్గరము మునుగాళ్ళ నుండెను. ప్రాణిలోక మెల్లఁ దల్లడిల్లెను. జ్వాలోగ్రమై లోకదహ నోత్తేజంబునఁ గ్రాలుచున్న యాదండంబును గాంచి రాక్షసులు మహా భయార్తులై రణరంగముఁ బాసి పఱుగులెత్తిరి. సంగరావలోకనార్థము వచ్చి మింటనున్న సురదేవర్షులును దదితరులను భీతులై కలంకఁ బాఱిరి. యముఁడు కోపకరాళుఁడై యాదండంబును గిరగిరఁ ద్రిప్పి దశాననునిపై వదలనుండెను.

అత్తఱి బ్రహ్మతటాలున నటఁదోఁచి, 'వైవస్వతా, శమింపుము, శమింపుము. ఈయమితవిక్రమము వలదు. నీదండ మమోఘము. దానిని వదలితివేని ముల్లోకంబులు రావణునితోడ నామావశిష్టము లగును. దీని నెదిరింప నేరికిఁ దరముగాదు. మృత్యువును దోడుగొని నేను దీనినిఁ దొల్లి సృష్టించితిని. సౌమ్యా, ఇది వ్యర్థము గారాదు. అట్లగునేని నాసంకల్పము వృథవోవును. దీనిని వదలితివేని దశాస్యుఁడు చచ్చును; అట్లయినచో వానికి నాయిచ్చిన వరములు కల్లయగును.

ఎట్లు విచారించినను మహానర్థకము దాపరింపనున్నది. నామాటఁ గాపాడక నీకుఁ దీఱదు. కావున నీవు దీని నుపసంహరించి నాకోర్కి-సేయు' మనెను. యముఁడంతటఁ దనచేతిని విడుననున్న దండంబును దటాలున నాఁపివైచి, 'స్వామీ, మీయాజ్ఞఁ బాటింతు; పాటింపక తప్పదు. ఈ కాపురుషుఁడు రణార్థియై వచ్చెను. వీనిని జంపనేని యితని యెదుట నుండనొల్ల' నని పలికి యంతర్ధానుఁ డయ్యెను. దశకంఠుఁ డది గాంచి యముని నోడించితి ననిసింహనాదము లొనర్చుచు నప్పురము వదలి పోయెను. నారదుఁడది యెల్లఁజూచి దేవతలను బ్రహ్మను గూడి త్రిదివంబునకుఁ జనెను.

రసాతల దండయాత్ర

రావణుఁ డట్లు రణశ్లాఘియై మారీచాదులను వెదకుచుఁ బోయెను. వారు తమతేఁడు జర్ఝరీకృతాంగుఁడై నెత్తుట జొత్తిల్లుటకు విషాదమును నతఁడు యముఁ బారినుండి . తప్పివచ్చినందులకు విస్మయము నంది వాని నభినందించిరి. దశగ్రీవుఁడు వారినెల్ల రథముమీఁద నెక్కించుకొని పయోనిధిఁ జొచ్చి రసాతలమునకుఁ జని యందు వాసుకిపాలితమైన భోగవతీపురము డాసి యట నాగుల నోడించి లోఁబఱచుకొని, యందుండి తరలి మణిమయపురంబుఁ జేరి తదధీశులైన నివాతకవచు లనెడి దైత్యు లను బోరునకుఁ జీరెను. వారును డీకొనిరి. దైత్యరాక్షసులకు వీడనిపో రొక సంవత్సరము జరిగెను. ఎవరికిని జయాపజయములు గలుగవు. వారి సంగ్రామక్షోభకుఁ బ్రపంచమెల్ల గగ్గోలుపడెను.

అంతలోన విరించి యటకు వచ్చి నివాతకవచులను బిలిచి, 'ఈ రావణుఁడు సురాసురుల కెల్ల నజేయుఁడు. మీరు నట్టివారలే. కావున మీకుఁ గలహము వలదు. ఉభయులును మైత్రిమై నుండుటొప్పు. సుహృదులు సర్వార్థములందు నవిభక్తబుద్ధి వర్తింతురు. మీరు నట్ల యుండఁబోలు' ననెను. అందులకు వా రియ్యకొనిరి. రావణుఁడు వారితో నగ్నిసాక్షికముగా మైత్రి యొనర్చి స్వపురంబునఁ బోలె నచట నొక్క-సంవత్సరపర్యంతము సమస్తభోగము లనుభవించి వెక్కు-మాయలు వారివలన నేర్చి యనంతరము యమ్మనగరమునకుఁ జని యటఁ గాల కేయులతోఁ బోరి వారినిఁ బరిమార్చి, మఱఁదియనియేని వెనుదీయక శూర్పణఖాభర్తను విద్యుజ్జిహ్వానిద్రుంచి నాల్గునూర్ల దైత్యులను హరించి వరుణాలయమువంక మరలెను.

వరుణుని జయించుట

వరుణపురము పాండురమేఘంబులవన్నెఁ దన్ని యపరశైలాసమో యన భాసిల్లుచుండును. రావణుఁ డాపట్టణమును డాయఁ బోయి యట క్షీరధారలు గురియుచున్న సురభిని జూచి, 'ఏయీవుపాలతో నిండుట వలన సముద్రమునకు క్షీరాబ్ధి యనుపేరు వచ్చెనో, ఏగోవువలన సాక్షా త్పరమశివుని వాహనము జనించెనో, ఏయీవు పాలకడలిలో జనించుటఁ జేసి చంద్రుఁడు శీతకరుఁ డయ్యెనో, దేని నురువు ద్రావి పరమర్షులు జీవిం తురో, దేనివలన నమృత ముత్పన్నమయ్యెనో, సురులకు స్వధ యేది గూర్చునో, యీ ధేనురత్నంబునకు నతఁడు ప్రదక్షిణ మొనర్చి చనిచని, నానావీరసంరక్షితంబును జలధారాశతాకీర్ణంబును శారదాభ్రనిభంబును నిత్యప్రహృష్టమునైన వరుణుని గృహోత్తంబును జొచ్చి బలాధ్యక్షులను దునిమి, 'యుద్ధార్థియై రావణుఁడు వచ్చియున్నాఁడు. యుద్ధ మొసఁగుటో జితోస్మి యనుటో రెంట నొకటి జరుగవలయును. ఈసంగతి మీ తోనికి వినిచి రండు' అని యందున్నభటులతోఁ జెప్పెను. అంతలోన వరుణుని పుత్త్రులును, పౌత్త్రులును గోపుష్కరులనెడి నాయకులతోడఁ గూడి వచ్చి రావణుని దాఁకిరి. ఇరుపక్షములవారికి మహాదారుణమును రోమహర్షణము నైన సంగ్రామము జరిగెను. వారుణబలమెల్ల క్షీణ ములోఁ గూలెను. నేలమీఁదనుండి తామును మింట విమానస్థుఁడై రావణుఁడును యుద్ధ మొనర్చుటవలనఁ దమబలము నశించెనని వారు ణులు తలంచి రథంబులెక్కి నింగికి నెగసి కదియఁబడిరి. వారికి దేవ దానవయుద్ధమునంటి యుద్ధము పొసఁగెను. రావణుఁడు పావకసమాన శరంబువలన వ్రేటువడి మోము ద్రిప్పెను. వారుణులు మహాహర్ష నాదంబులు గావించిరి.

దశగ్రీవుఁడు ధర్షితుఁ డగుట మహోదరుఁడు చూచి చావునకుఁ దెగించి గదఁగొని వరుణపుత్త్రులను గుదియలుపడఁ గొట్టి సింహనాద మొనర్చెను. వారు రథాశ్వసారథులను గోల్పోయి నేలఁబడి దెప్పటిలి సహజబలంబు పేర్మి మగుడ నింగి కెగసి విల్లులెక్కు వెట్టి శరపరంపరల మహోదరునిఁ జీల్చి చెండాడి, రావణుని గదిసి వజ్రకల్పంబులగు నిశిత సాయకంబుల వానిని గప్పిపుచ్చిరి. దశగ్రీవుఁడు క్రోధమూర్ఛితుఁడై కాలాగ్నికరణి వెలుఁగుచు మహాఘోరాస్త్రంబులను దండోప తండంబులుగ సారించి వారిమర్మముల నెల్ల గాడనేసి, ముసలంబులతో, భల్లంబులతోఁ బట్టసంబులతో శక్తిశతఘ్నితోమరంబులతోఁ దదీయు

లను జీకాకుపఱచెను. ఆవ్రేటులకు వారెల్లరు నేలఁగూలి జంబాల మగ్నమైన యఱువదియేండ్ల కుంజరంబులవలె లేవలేక తల్లడిల్లసాగిరి. వారిదురవస్థఁ జూచి తదీయులు వచ్చి వారినెల్ల నిండ్లకుఁ గొనిపోయిరి.

అట్లు రావణుఁడు వారుణులను గావించి సింహనాద మొనర్చి, 'ఏఁడీ వరుణుఁడు?' అనెను. అంతలోన వరుణునిమంత్రి ప్రభాసుఁడనువాఁడు వచ్చి, 'రాజా, జలేశ్వరుఁడు గాంధర్వమును వినుటకై బ్రహ్మలోక మేగియున్నాఁడు. ఆయన యిందు లేఁడు. నీకీ శృథాయాస మేల? వానిసుతులు పరాజితులైరి' అనెను. రావణుఁ డంత తన జయంబును వీటఁ జాటించి వరుణాలయమును వదలి సచివులతోడ విమానము మీఁద లంకాభిముఖుఁడై చనెను.

నానా స్త్రీలను జెఱపెట్టుట

రావణుఁ డట్లు చనుచుండఁగా మార్గమధ్యంబున రూపవతులైన రాజకోమలీమణులును, ఋషికన్యకలును, దేవతాంగనలును, గంధర్వకాంతలును వాని కంటఁబడిరి. అతఁడు వారినెల్లఁ గేశబంధములు పట్టి బలాత్కారముగా నీడ్చి విమాన మెక్కింప సాగెను. ఆ యింతులకై వారియాత్మబాంధవు లెందఱో రావణు నెదిర్చి ప్రాణంబులు గోల్పోయిరి. ఆ లలితాంగులు తమ విపద్దశకై దుఃఖబాష్పంబులు గార్చుచు మహారోదన మొనర్చిరి. వారి యశ్రుధారాప్రవాహం బవ్విమానంబును ముంచివైచునో యనఁ దోచెను. లతాలలితాంగములతోడఁ బూర్ణచంద్రముఖంబులతోడఁ, బీనపయోధరంబులతోడ, వజ్రవేదిమధ్యప్రభలతోడ, దీర్ఘకేశపాశములతోడ దీపించుచున్న యా నవలామిన్నలు శోకదుఃఖభయత్రస్తలై విహ్వలింపఁగా వారి నిశ్శ్వాసవాతంబున నవ్విమానము సందీపితమై మహాగ్నికుండమువలె నుండెను. కరిణీచయము సింహవశమైనట్లుగా వారు రావణునివశమై గావించిన విలాపము లిట్టివనరాదు. 'అయ్యో! ఈకూళనన్ను భక్షించునో' యని యొకతె యేడ్చెను. 'కటా! ఈరక్కసుఁడు నన్ను గడికండలు జేయునో' యని యొకతె విలపించెను. 'హా! శోదరా! నీచెల్లెలిగతి యిట్లయ్యె' నని యొకతె వందురెను. 'జననీజనకులారా! నాకై వగచి వాడినశింతురా!' యని యొకతె పల్లటిల్లెను. 'మృత్యుదేవతా! నీకు సాష్టాంగము. ఈ దుఃఖభాగినిని హరించి మానముఁ గాపాడు' మని యొకతె దుఃఖించెను. 'అయ్యో! సూర్యోదయము నక్షత్రంబులనువలె నీరక్కసుఁడు

మా రూపుమాపవచ్చెను. పరవధోపాయంబుల నిరంతరము రంజిల్లు నింతపాపాత్ముఁడు మఱియొండు గలఁడా !' యని యొకతె యడరెను. కొడుకులను దలఁచి యొకతెయు గూతును దలఁచి యొకతెయు మిగుల కుమిలి యేడ్చిరి. వారి యెడరుసకు మేర గాన్పింపదయ్యెను.

అట్లు వారు పెద్దయుందడవు దుఃఖించి, 'కటా ! ఈ రాక్షసుఁడు దుర్వృత్తమే నిజాచారముగా గ్రహించెను. ఇతనికి లజ్జ యను మాటే గలుగదు. పరదారాభిమర్శనము పాపకర్మమగునేని, మా సతీత్వ ముడివో దేని యీదుర్మతి మాయట్టి సతీమణికారణంబున నశించుగాక' యని యేక గ్రీవమున శపించిరి. దేవదుందుభులు మ్రోసెను. పుష్పవృష్టి గురిసెను. రావణుఁడు తేజోహీనుఁడయ్యెను.

సోదరీ నిరసనము

అట్లయ్యును రావణుఁడా శాపంబులఁ జెవిఁ జెట్టక వారినెల్ల హరించి తెచ్చి లంకానగరముఁ జొచ్చెను. అతఁడు వచ్చిరాకమున్న వాని చెల్లెలు శూర్పణఖ బోరున నేడ్చుచు వానిపాదముల వ్రాలెను. అతఁ డామెను లేవఁదీసి సాంత్వనంబులు పలికి, 'అమ్మా, సంగతియేమి' యని యడుగఁగా ఆరక్కసి కన్నీరు మున్నీరుగాఁ గార్చుచు, 'రాజా, నీ వలన విధవనైతిని. కాలకేయులతోడ నా భర్తను గూడ హరించితివి. కటా ! సోదరుఁడే నా సౌఖ్యములనెల్ల దూర్వారపట్టుటయ్యెను. ఇట్టి దెందేనిఁ గలదా ? ఈ సేతకు లజ్జింపవా ?' యని కఠోరంబుగాఁ బలెక్కను. రావణుఁ డాచెల్లెలి నోదార్చుచు, 'అమ్మా, వగవకు. నీకెందును భయముండదు. దానమానప్రసాదంబుల నీకుఁ బరితోష మొనర్తును. వీరులు రణరంగమందు వివశులై వర్తింతురు. చావు బ్రదుకులు తలంపరు. జయకాంక్షయే వారికిఁ బ్రధానమై యుండును. సంగ్రామమునందుఁ దనవారు పరులు ననెడి వివక్షకుఁ దడవుండదు. నా జామాత యని యెఱింగియు నట్లొనర్తునా ? ఆలాగు నీవు తలంప వచ్చునా ? సోదరీ, అనివార్య మశోచ్యము. దానికై వగవనేల ? ఇఁక నీకేది మేలో యది యొనర్ప సంసిద్ధుఁడను. మన పినతల్లికొడుకు ఖరుఁడు గలఁడు. అతఁడు చతుర్దశరాక్షససేవితుఁడై దండకారణ్యంబున వసింప నున్నాఁడు. వానికడ సుఖముండుము. నీయాజ్ఞ నతఁడు శిరమున దాల్చును. ఎందును నీకు చటఁ గొదువ యుండదు. ఖరునకు బలాధ్య తనిగా దూషణుని నియమింతును. వాఁడును నీకోరిన యుపచారము

లొనర్చు'నని పలికి యట్లొనర్చెను. శూర్పణఖయు వారివెంటఁ జని యందుండెను.

రావణ శుక్రాచార్యుల సంభాషణము

రావణుఁ డట్లు చెల్లెలిని బుజ్జగించి పుచ్చి కుమారుని మేఘనాదునిఁ జూడఁగోరి యతఁడు నికుంభిలావనమున నుండుట విని యటకుఁ జనెను. అత్తఱి మేఘనాదుఁడు మహాయజ్ఞ మొండు సంకల్పించి తీవ్ర వ్రతముఁబూని కృష్ణాజినముఁ గట్టి కమండలువుఁ దాల్చి శిఖాధ్వజుఁడై యూపశతాకీర్ణమును జైత్యోపశోభితము నైన జన్న మొనర్చుచు భయావహుఁడుగా నుండెను. లంకేశ్వరుఁడు సుతునిఁ గవుఁగిటఁ గూర్చి, 'నాయనా, సంగతియేమి?' యని ప్రణయపూర్వముగాఁ బలుకరించెను. శుక్రాచార్యుఁడు మాటనందుకొని, 'రాక్షసేశ్వరా, నీసుతుఁడు అగ్నిష్టోమము అశ్వమేధము రాజసూయము గోమేధము వైష్ణవము మున్నగు యాగము లొనర్చుటయగాక దుష్కరమైన మహేశ్వర యజ్ఞమున ముక్కంటిని మెప్పించి వానివలన నసన్యసాధ్యములైన వరంబులఁ బడసెను. ఎట్టి వరంబు లందువా? అంతరిక్షచరమైన దివ్య రథమును సంపాదించెను. అది మనోరథమువలెఁ గామగమై తన రాఁదను. మఱియుఁ దామసి యను మాయను గూడఁ బడసెను. దాని ప్రభావంబునఁ దలఁపుతోడఁ గటికచీఁకట్లు వ్యాపించును. దాని బలంబున నీసుతుఁడు గగనచరుఁడై యెవ్వరికి గోచరింపకుండి పోరు సల్పును. ఇవియునుంగాక యక్షయతూణీరంబును శరచాపంబులను శత్రువిధ్వంసకరమగు మహాస్త్రంబును గూడ గ్రహించెను. యజ్ఞ సమాప్తికై నీరాక చూచుచున్నాఁ' డనెను.

రావణునకు విభీషణుఁడు హితంబు చెప్పుట

ఆ వృత్తాంతమెల్ల రావణుఁడు విని ముఖము చిట్లించి, 'ఇంద్రాదులు మనకు శత్రువులు. వారిని బూజించితిరి. ఇది సరిగాదు. మించిన పనికిఁ జింతయేల? నాయనా, ఇఁక రమ్ము. ఇంటికిఁ బోద'మని సుతుని విభీషణుని వెంటఁగొని నగరు జొచ్చి పుష్పకవిమానమందు భామ్మ గద్దదలైయున్న సుదతీచయము నందుండి దించెను. వారిని జూచినంతనే విభీషణునకు లంకేశ్వరుని దుష్టభావము స్పష్టమై మేరలేని దుఃఖము గలిగెను. అతఁడు శోకకోపంబులఁ బట్టనోపక, 'అన్నా, యశస్సు

అర్థము కులము—ఈ మూటికి ముప్పు దెచ్చునట్టి యకృత్యములు నీవొనర్పనగునా? అయ్యో! వీరికై తదీయజ్ఞాతుల నెందఱు జంపితివో గదా. కటా! కర్మఫల మెన్నడును దప్పదు. కావునఁనే మధుఁడు మన కుంభీనసిని హరించి నీకుఁ దీఱని యవమానమును మూటఁ గట్టెను.' అని పలికెను.

రావణుఁడది విని, 'ఏమి! మధుఁడు కుంభీనసిని హరించెనా? ఎవఁడువాఁడు' అని కోపస్ఫూర్తి దీపింప నడిగెను. నావుఁడు, 'అన్నా, మేఘనాదుఁడు యజ్ఞము ముదవిలి యుండెను. కుంభకర్ణుఁడు నిద్రావశుఁడై యుండెను. నేను దపఃపరుఁడనై జలాంతరమం దుంటిని. అత్తరి మధుఁడు వచ్చి రాక్షసశ్రేష్ఠులైన నీ మంత్రులఁ గొందఱను సంహరించి నీ యంతఃపురమున నిద్రించుచుండిన కుంభీనసను మన పెదతాత మాల్యవంతుని దౌహిత్రి నపహరించెను. ఆ సంగతి తర్వాత వినియు మిన్నకుంటిని. ఏలయందువా? యుక్తవయస్సు వచ్చిన కన్నెను దగువరునకుఁ గూర్చుట యామె సోదరులకుఁ దప్పనివిధియై యున్నది. ఆపని మన ముపేక్షించితిమి. తత్ఫలముగానో నీదుర్వృత్తి ఫలముగానో యిట్టిది సంభవించెను. పాపఫలము తప్పదుగదా' యనెను.

బడబాగ్నికి సముద్రమువలె రావణుఁడాత్మకోపంబునకు నుడ్డుడికి, 'రావణవిర్భయుఁడైన యాతుంటరి యిఁక మనరాదు; నేఁడే వానిని వధించి సురలోకంబుపయి దాడి వెడలుదుఁగాక. రథమును దెమ్ము. కుంభకర్ణాది నిశాచరశూరులు నానాప్రహరణాయుధసన్నద్ధులై తరలుదురు గాక' అని యాజ్ఞాపించెను.

రాక్షసులు వేయియక్షౌహిణులు నానాప్రహరణంబులు గైకొని యుద్ధాభిరతులై వెడలిరి. మేఘనాదుఁడు దుముదారుదొరయై నడచెను. రావణుఁడు సేనామధ్యభాగంబునఁ బ్రచండ మార్తాండునిభంగిఁ దేజరిల్లెను; కుంభకర్ణుఁడు దశపృష్టభాగము ననుసరించెను. నేల యీనినట్లు ఖరంబులును నుష్ట్రంబులును హయంబులును దరలెను. చమూధూళికి నాకాశమెల్ల నిరవకాశమయ్యెను. విభీషణుఁడు మాత్రము లంకయందే నిలిచి ధర్మము లాచరించుచుండెను.

రావణుఁ డట్లు తరలి మధుపురము చేరినంత వానిరాక కుంభీనసి విని యతనితలంపు నూహించి భయవిహ్వలయై మునుముందు పోయి రాక్షసేశ్వరుని పాదంబుల వ్రాలెను. దశగ్రీవుఁ డామెను లేవఁ దీసి,

'అమ్మా, భయము వలదు. ఏమి వలయునో చెప్పు'మన, 'అన్నా కులస్త్రీలకు వైధవ్యమునకన్న మించిన కష్టము లేదు. పతిభిక్ష యొసంగుము. నా ప్రార్థనం ద్రోయరాదు. భయము వలదంటివి; కోరినది యిత్తు నంటివి. మాట దక్కించుకొనుము' అని వేడెను. రావణుఁ డామె ప్రణయమును విని, ''ఏఁడీ నీభర్త? వానిని తోడ్తోడ నాకుఁ జూపుము; అతఁడు నా వెంట సురలోక జయార్థము వచ్చుఁ గాక. నీయందలిప్రేమ నన్నుఁ గట్టివైచె' ననెను. కుంభీనసి బెనరు మాని మందిరాంతమున నిద్రించుచున్న మధుపును లేపి 'నా యగ్రజుఁడు రావణుఁడు సురలోకజయాభిలాషియై వచ్చి నిన్ను సాహాయ్యముఁ గోరుచున్నాఁడు. బంధుమిత్ర పరివారముతోడ నీవు వాని ననుగమించుట యొప్పు. స్నేహపాత్రుఁడైన నాయన్న నీయాదరంబునఁ బరితోషించు'నని చెప్పెను.

మధు వంతటఁబోయి లంకేశ్వరుని యుచిత మర్యాదలఁ బూజించెను. రావణుఁడు వానికి సంతసించి యూరేయి యందే పుచ్చి తెల్లవాఱి బయలుదేరి కైలాసగిరి చేరెను. అంతలోనఁ బ్రొద్దు క్రుంకెను. వారచట విడిసిరి. కొంతసేపటికిఁ కైలాసకాంతి బిల్లగట్టి తోఁచెనో యనఁ జంద్రుఁ డుదయించెను. ప్రకృతి సౌభాగ్యములు రజనీకరకరశోభితములై హృదయంబుల నాకర్షింపసాగెను. కర్ణికారంబుల సొంపుఁ గదంబగహనంబులపెంపుఁ బూచి బెడగారుచున్న పొందామరకొలకులసొరు మందాకినీజలములతీరు మహోద్దీపకములయ్యెను. రావణుఁడు విరాళికిఁ జిక్కి యటునిటుఁ బ్రచారముచేయుచు జంపకాశోకపున్నాగ వనాంతరంబులయందలి కిన్నరులగానము మేళముగాఁగ, మదరక్తాంతలోచన లగు విద్యాధరాంగనల కవుఁగిట పెనుగులాటలఁ జిక్కి పల్కుచున్న తత్ప్రియుల ప్రియభాషణంబులు పుంగళవాద్యంబులుగాఁగ మదనకోదండఘంటానినదంబులోయన నొప్పు వియచ్చరాప్సరోజనకాంచీకింకిణీధ్వనులు తాళమానములుగాఁగ బవన తాడితములై వర్షించుపుష్పంబులను జల్లుచుఁ బుప్పొడి బుక్కాముల లలఁదుచు నాకువీవనల నునుగాడ్పులు వీచుచు గగనకామినీమణి లేవెన్నెలపరికిణీదొడవి యీ పర్వతరాజును సేవించుచుండుట చూచి మరలుగొని చంద్రునివంకఁ జూచి యూర్చి యూర్చి కృశింపనాగెను.

రావణుఁడు రంభను ధర్షించుట

అత్తఱిఁ గాంతామణి యోర్తు నవరత్నభూషణభూషితయై దివ్య చందన మలఁది మందారపుష్పంబులు సిగను ముడిచి నెత్తావిపూస రంబులు ధరించి భావాభానమగువలగ్నంబును మణిమయకాంచీదామంబున బంధించి జలధరనీలవస్త్రంబును మేల్ముసుపు వైచి యాదారిఁ బోవ్రుచుండెను. అమరశ్రీవలె నున్న యా హోయలుమిన్నను దశగ్రీవుఁడు చూచి డాయఁబోయి తదీయరూపరేఖావిలాసంబులుఁగూచి,

'పీ. గండుమీలకుఁబుట్టి కామబాణములతోఁగలసి యాడెడునట్టి కన్నుఁగవయు
బిసకాండములశిక్కుఁబెళుఁగి లేదీగల మెచ్చక యున్నట్టి మృదుకరములుఁ
జిగురులతో సంధిచేసి యంబుజముల పైనెత్తిచనునట్టి పదతలములుఁ
గలకంఠములచేతఁ గఱచినవిద్య వీణలకిచ్చునట్టి తిన్నని యెలుంగుఁ

నత్తెఱుంగున రేఖయు నవ్విధంబు
గఱువచందంబు నమ్మెయి కలికితనము
నట్టిచెన్ను నిత్తరళాక్షి యంద కాక
కలవె యొరులకు నెందేనిఁ దలచి చూడ॥'

అని తలపోసి కామవశుఁడై హితాహితంబులు గూడ పాటింపక యయ్యింతి కరముఁబట్టి, 'వరారోహా, ఎవతెవు? ఎటకేగెదవు? ఎవనికి భోగసిద్ధిఁగూర్తువు? ఎనని యభ్యుదయకాలము నేఁడు సమకూఁతెను? పద్మోత్పలంబుల మెచ్చని నీవదనబింబము గురియుచున్న సుధామృత రసంబును నేఁడు పడయనోచిన పుణ్యాత్ముఁడెవఁడు? సువర్ణకుంభంబులఁ దలపించుచు నొండొంటి నొరసియున్న నీ పీనపయోధరములపయి వ్రాలి నేఁడు సుఖింపనున్న సుకృతి యెవఁడు? కనకచక్రప్రతిమంబులై స్వర్ణదామంబునఁ గట్టువడియున్న నీ జఘనము నెవ్వఁడారోహించి స్వర్గారోహణభాగ్యంబును గన నున్నాఁడో గదా? కామినీరత్నమా! శక్రుని వరించితివో విష్ణుని గోరితివో అశ్వినుల నలచితివో చెప్పుము. నేనిందుండఁగా నన్ను గాక ని వారికై యోనేల? తలోదరీ, ఈ శిలాతలంబున విశ్రమించి పథికశ్రమము వాసి చనుము. నన్ను మించినవాఁడు ముల్లోకములఁ గలుగఁడు. ఇదిగో దశాననుఁడు దోయి లొగ్గి నిన్ను యాచించుచున్నాఁడు. ముజ్జగంబులకుఁ బ్రభువైన యీ రావణుని లంకేశ్వరుని గూడి భువనత్రయంబును బాలింపుము' అని నిజప్రణయమును దెలిపెను.

ఆ కాంతారత్నము గడగడ నడఁకుచుఁ జేదోయి కీలించి, 'అయ్యా! నా పేరు రంభ. నీవు నాకు గురుఁడవు. కోడలితో నిట్లాడఁ దగదు. పరధర్షంబునుండి నా బోంట్లను రక్షింపవలసిన నీవే యిట్లు పలికిన నిఁక మాకుగతి యెవ్వరు?' అని తలవంచి నిలిచెను. రావణుఁడు పులకితశరీరుఁడై, 'వగలాడీ, నీకు నేను మామ నెట్లగుదు? నా సుతుని బెండ్లాడితివా?' యనెను. 'రాక్షసేశ్వరా! బొంకుటగాదు. కుబేరుఁడు నీకు సోదరుఁడు. ఆయనపుత్త్రునకు నలకూబరునకు ప్రియురాలనై యుందును. ఆ లోకపాలసుతునకై సంకేతస్థానంబునకుఁ జనుచున్న దానను. ఒడులయందు నా మది దగులదు. నన్ను వదలుము. ఆ ధర్మాత్ముఁడు నాకొఱకు నిరీక్షించుచుండు. నీసుతుని యాత్సుక్యంబునకు నీ వడ్డుపడుట పాడిగాదు. సజ్జనుల దారి మేలగును. నాకు నీవు పూజ్యుఁడవు. నీకు నేను రక్షణీయ' నని వినయపురస్సరంబుగాఁ బలికెను. రావణుఁడు వెక్కసపునవ్వు నవ్వి, 'వగలాడీ, నాకుఁ గోడల నంటివి. ఇందులకు నవ్వయ్యెడు. దేవలోకమర్యాద లెఱుంగనని తలంతువా? సురవేశ్యవు. దినమునకు నొకనిపొత్తు పడయుదువు. నీకులమునకే వావివరుసలు లేవు. నీపాతివ్రత్యప్రసంగ మిఁక జాలు' అని యయ్యచ్చర పూబోడిని శిలాతలగఁబునఁ బడవైచి బలవంతముగా రమించెను.

రంభ నలకూబరుని మ్రొల విలపించుట

రంభ యెట్టకేలకు రావణుని గవ్వంగిటనుండి వదలఁబడి, కరీంద్ర క్రీడామథితతరంగిణివలె నాకులపాటు చెంది గాలికిఁ దూగాడు పూఁదీవె క్రియ నసియాడుచుఁ జిక్కువడిన మాల్యాభరణములతో నలకూబరు నొద్దకుఁ జని వానిపాదంబుల వ్రాలి లజ్జావ్యసనభరంబునఁ బలుకాడ నోపకుండెను. అతఁడాప్రియురాలిదురవస్థను జూచి సంగతి యూహించి, 'ప్రేయసీ! పాదముల వ్రాలితివేల?' యనెను. రంభ నిట్టూర్పులు పుచ్చుచు వడఁకుచుఁ గేల్దోయి గూర్చి యుదంతమెల్ల వినిపింపఁ దలచి, 'హృదయేశ్వరా! దశగ్రీవుఁడు సేనాసమేతుఁడై సురలోకముపయి దాడి వెడలుచుఁ గైలాసగిరితటంబున విడిసెను. ఆసంగతి యెఱుంగక యా మార్గమున నీకడకు వచ్చుచుంటిని. ఆకూళ నన్ను నిరోధించి బలాత్కరించెను. గలరూపు విన్నవించితిని. కామమోహితుఁడై యాదుష్టుఁడు నామాటలు వినకుండెను. నీకోడల నంటిని; నీతులు పలికితిని; వేఁడుకొంటిని. ఏమి చేసినను వినక నన్నతఁడు బలవంతముగా

ధర్షించెను. నాయపరాధము సైరింప వేఁడును. అబలలగతి యిట్టిదే గదా' యని విలపించెను.

నలకూబరుఁడు రావణుని శపించుట

నలకూబరుఁడు కొండొకతడవు ధ్యానగతుఁడై సంగతియెల్ల నెఱిఁగి క్రోధాగ్ని దీపింప దోయిట జలము గైకొని యాపమించి యథావిధి ముఖాదికము స్పృశించి, ''కళ్యాణీ, ఒల్లనినిన్ను బలవంతముగా నతఁడు ధర్షించెఁగదా. ఒల్లని యే యువతినేని యతఁ డిక ముట్టునేని తత్క్షణము వాని తలలు ప్రీలి వేఁడుతునియ్యలై నేలఁ గూలుఁగాక'' యని శపించెను. తథాస్తు అని తెలుపుటకో యన దేవదుందుభులు మ్రోఁగెను. బ్రహ్మర్షులు హర్షించిరి. మునులు సెబాసనిరి. ఆ శాపవృత్తాంతమును రావణబంధిత్తలైయున్న పతివ్రతామణులును గన్యారత్నములును గర్ణాగర్ణికగా విని మనస్తాపంబులు కొంతమాని స్వస్థచిత్తలైరి.

రావణుఁడింద్రునిపయిదండెత్తుట

రావణుఁడంత సురేంద్రలోకమార్గము ద్రొక్కెను. రక్కసుల రావములు సముద్రమథనధ్వనులను ధిక్కరించి వారిరాకఁ దెలుపుటకో యన మునుమున్న నాకలోకము బ్రాఁకెను. ఇంద్రుఁడాసంగతి విని గద్దెమీఁదనుండి యులికిపడెను; కొలువున్న దేవతలముఖంబులు వెల్లబాతెను; దేవస్త్రీలు భయవిహ్వలలై మానముకొఱకు ప్రాణంబులను త్యజింప నున్యుక్తలైరి. సురలోక మెల్ల గోడుగోడు మనెను.

ఇంద్రకృత శ్రీమహావిష్ణుస్తోత్రము

ఇంద్రుఁడేమియుఁ దోఁపక హుటాహుటి విష్ణుపురొద్దకుఁ బోయి, (1) ఎవఁడు మొట్టమొదట విశ్వము నెల్ల సృష్టించెనో, ఎవఁడు సర్గానంతరం బావిశ్వంబునెల్లఁ బోషించుచున్నాఁడో, ఎవఁడు తుట్టతుదకు విశ్వసంహార్తయగుచున్నాఁడో, ఇట్లు సృష్టిస్థితిసంహారములకు మూడింటికిఁ గర్తయగుచు నెవఁడు మూఁడురూపంబుల వెలుంగునో యట్టి బ్రహ్మవిష్ణుహరాత్మకుఁడవైన నీకు నమస్కారము. (2) కూటస్థుఁడనైన నాకుఁ బ్రియహేయ మెట్లు పొసఁగు నందువా? ఆకాశమునుండి వచ్చు వర్షోదకము మొట్టమొదట నేకరసముగానే యుండును. అయిన నయ్యది ఊషరాది దేశంబులందుఁ బడి లవణాది రసాంతరంబును బొందుచున్నది గదా? అట్లే నిర్వికారుఁడవైన నీకు సత్త్వాదిగుణసంసర్గంబునఁ జేసి

బ్రహ్మాదిరూపంబులు గలుగుచున్నవి. (3) దేవా, నీవు అమేయుఁడవు అనఁగా అపరిచ్ఛిన్నుఁడవు; లోకమో పరిచ్ఛిన్నమైనదిగానున్నది. నీవో నస్పృహుఁడవు, అనఁగా ఎట్టికోరిక లేని వాఁడవు, అట్లుండియుఁ గోరినవారికిఁ గోరినకోర్కి లిత్తువు. నిన్ను జయించువాఁడే లేఁడు; ఎల్లరను నీవు జయింతువు. అతిసూక్ష్మరూపివి; అట్లుండియు వ్యక్తమైన యీస్థూలరూపంబునకెల్లఁ గారణమవుదువు. (4) స్వామీ, నీవు సర్వాంతర్యామివి గావునఁ బ్రతిన్యక్తిహృదయాంతరంబున నిత్యసన్నిహితుఁడవై యుందువు. అట్లున్నను నీరూపం బగమ్యముగావున నిన్ను దూరస్థునిగాఁ దలంతురు. నీవు పరిపూర్ణుఁడవును నిస్పృహావంతుఁడవును గావున నీకెట్టి యభిలాషయు లేదు. దానంజేసి నిష్కాముఁడవు. అట్లుండియు మహాతపస్వివై యుందువు. దేనింగూర్చి తపస్సు చేయుచుందువో యూహింపరాదు. పరదుఃఖంబుల లేశమాత్రముగూడ సహింపలేని మహాదయాళుఁడవు. అట్లుండియు నిత్యానందస్వరూపుఁడవుగాన నెట్టి దుఃఖము నెఱుంగవు. పురాణుఁడవు గాని జరత్వము మాత్రము నీకు లేదు. (5) స్వామీ, నీవు సర్వజ్ఞుఁడవు; నిన్ను మాత్రమెవ్వరు నెఱుంగరు. సర్వములకుఁ గారణమై యుందువు. (6) దేవా, రథంతరాది సప్తసామంబుల నుపగీతింపఁ బడుదువు; సప్తార్ణవజలంబుల శయనింతువు; మఱియు సప్తార్చివదనుఁడవై విరాజిల్లుదువు, సప్తలోకంబులకుఁ బ్రభుఁడవై యుందువు. (7) దేవా, ధర్మార్థకామమోక్షంబులనెడి నాల్గింటికి ఫలకమైన యేజ్ఞానముగలదో అది నీవేయై యున్నావు. కృతత్రేతాది చతుర్యుగకాల పరిణామంబును చాతుర్వర్ణ్యప్రచురశాలివియునై యుందువు. ఈసమస్తము చతుర్ముఖుఁడవైన నీవలననే కలుగుచున్నది. (8) ఎవరు అభ్యాసబలంబున విషయాంతరములనుండి తమమనస్సును నివర్తింతురో యట్టి యోగులు హృత్పుండరీకాంతంబున జ్యోతిర్మయ మూర్తివై యున్న నిన్ను మోక్షార్థము ధ్యానింతురు. (9) అజుఁడవు గావున నీకు జన్మములే లేవు. అట్లుండియు మత్స్యాది రూపంబుల గ్రహింతువు. నీవు చేష్టారహితుఁడవు. అట్లుండియు శత్రువులను సంహరింతువు. నిత్య ప్రబుద్ధుఁడవు; అట్లుండియు యోగనిద్రావశుఁడవై యుందువు. ఇట్టి పరస్పరవిరుద్ధచేష్టలు గల నీయాథార్థ్యంబు నెవ్వరెఱుంగఁగలరు? (10) మఱియుఁ గృష్ణాదిరూపంబులెత్తి విషయాదుల ననుభవింతువు; నరనారాయణాదిరూపములు దాల్చి దుశ్చరమైన తపంబొనర్తువు. దైత్యులను మర్దించి ప్రజలను గాపాడుదువు. ఉదా

సీనుఁడవైయుందువు. ఇట్టి పరస్పరవిరుద్ధంబులఁజేయ నీకన్న మఱి యెవరికి సామర్థ్యముగలదు? (11) స్థితిహేతువులైన మార్గంబులను ఆగమాదులు బహువిధంబులఁ బల్కుచున్నను వానికెల్ల నీయందే సమన్వయము. ఎట్లందువా? గంగాది ప్రవాహంబులు వివిధంబులుగా భిన్నంబులై వచ్చినను దుదకు వానికెల్ల సముద్రమే శరణము గదా. (12) నీయందే యెవరు చిత్తంబును నిల్పుదురో, నీకే సర్వకర్మంబుల నెవరు సమర్పింతురో, యట్టి రాగరహితులకు నీవే మోక్షసాధనము. (13) దేవా, నీమహిమంబు పృథివ్యాది ప్రత్యక్షప్రమాణంబుల ద్వారమున గమ్యమానమగుచున్నది. ప్రత్యక్షప్రమాణమైన పృథివియే అపరిచ్ఛేద్యమనగా ఆ పృథివికిఁ గారణభూతుఁడవై యప్రత్యక్షమూర్తివై యున్న నీవు అపరిచ్ఛేన్యుఁడ వని వేఱు చెప్పవలయునా? (14) స్వామీ, కేనలస్మరణమాత్రాననే నీవు నిన్ను స్మరించువానిని పవిత్రీకరింతువు. నీస్మరణమే యింతఫల మిచ్చుచుండఁగా నీదర్శన స్పర్శన భాగ్యము గన్నవానిగతి చెప్పవలయునా? (15) ఉదధిగర్భ మందలి రత్నంబులనైనను సూర్యునికిరణంబులనైనను లెక్కింపవచ్చును గాని నీచరిత్రలను లెక్కింప సాధ్యము గాదు. అట్టి అవాఙ్మానస గోచరంబులైన నీచరిత్రల సమగ్రంబుగా స్తుతింప నేరి తరము? (16) దేవా, నీవు పొందనిదిగాని పొందఁదగినదిగాని యేదియు లేదు. అట్టివాఁడవయ్యు నీ వవతారములు ధరింతువు. ఇట్టి నీజన్మకర్మములు కేవల లోకానుగ్రహార్థమేగాని వేఱుగాదు. నీవు పరమకారుణికుఁడవు గావున బదార్థ ప్రవృత్తి నీకుండుట వింతగాదు సుమా. (17) దేవా, నీ మహిమంబును గీర్తించి వాక్కు సంహృతమగుచున్నది. ఈ నచస్సంహరణము వాగ్వ్యాపారపరిశ్రాంతి వలననో గాక సమగ్రంబుగా స్తుతించుటకు శక్తిజాలకయో యగునుగాని నీ గుణములపారము ముట్టి గాదు. ఓ దేవా, శరణు; శరణు; రావణుఁడు యుద్ధకాంక్షియై వచ్చి యున్నాఁడు; వాఁడు సహజబలశాలి; దానికి బ్రహ్మ వరములు తోడయ్యెను. పరమేష్ఠివచనంబు లమోఘంబులు. అందువలన భయపడుదు. నీదయ నూతఁగొని నముచిని వృత్రాసురుని బలిని నరకాసుర శంబరాసురులను రూపుమాపిన నాకితఁడొక లెక్కగాదు. దేవా, సచరాచర భువనత్రయంబునకు నీవే దిక్కు; లోకంబులను స్థాపించితివి, సురరాజ్యపీఠంబున నన్ను నిలిపితివి. మహాత్మా, జగంబులెల్ల నీవలనఁ బొడమి నీయందు నిలిచి తుదకు నీయందే యడఁగును. ఆజ్ఞయిమ్ము.

వేయేల? నీ చక్రాయుధము వానిని దఱుగు నందాఁక మాకు బ్రతుకులు లే''వని దీనాతి దీనస్వరంబున మొఱ వెట్టెను.

శ్రీ విష్ణువు దేవేంద్రు నోదార్చుట

నావుఁడు, ''సురేశ్వరా, భయపడకు. సురాసురకోటి కితఁడు వధ్యుఁడు గాఁడు. చంపుదునా యనినఁ బరమేష్ఠినర మడ్డుపడుచున్నది. తద్వరబలోత్కటుఁడై వీఁడొనర్చు దుర్నయంబులు వినరాకున్నవి. కొడుకన్ననో తండ్రిని నించెను. వీరిరువురిబాధలకు ముల్లోకములు తల్లడిల్లుచున్నవి. వీరితోడి నా యుద్ధమున కిది సమయము గాదు. తుదకు నేనే వీనికి మిత్తి నగుదు. ఈమాట తప్పదు. వెఱపుమాని సురులతోఁగూడి వానికి యుద్ధ మొసంగుము, పొమ్ము' అని విష్ణువు చెప్పి వానినిఁ బంపెను.

దేవదానవ యుద్ధము

సురసైన్యంబులు తలపడెను. వానిని గాంచినంతనే రాక్షసులు హర్షకోలాహలములు గావించి చెలరేఁగిరి. ఇరుదళంబులకు ఘోరయుద్ధ మొనరెను. దశగ్రీవుని మంత్రులైన మారీచప్రహస్తమహాపార్శ్వ మహోదరాదులును సుమాలియుఁ దమతమబలంబులతో రణక్షోణి ప్రవేశించి వాయువు మేఘంబులనువలె నిర్జరసైన్యంబును జించి చెండాడిరి. దేలతలసేనయెల్లఁ బాటిపోవసాగెను.

అష్టమవసువు సావిత్రుఁ డనువాఁడు నిర్జరులదురవస్థఁగాంచి విక్రమించి రణాజిరము చొచ్చెను. వానికి నాదిత్యులును దృష్టయుఁ బూషుఁడును దమతమ యోధాగ్రేసరులతోడ సాయపడిరి. దేవరాక్షసులకు నిట్టి దనరాని పోరుజరిగెను. అసురులు నానాప్రహరణంబులతో నమరులను వేలకొలఁదిగాఁ బడఁగొట్టి అంకెలువెచ్చిరి. సుమాలి మఱియొక ప్రక్కఁజేరి దేవబలంబును గగ్గోలు గావించెను. హతశేషులూపిరి యాడక దిక్కులు పట్టిరి. వారిని సుమాలి వెంబడించెను. సావిత్రుఁడదిగాంచి సుమాలిని దాఁకెను. వారిరువురయుద్ధము తలఁచిన నేఁడును మేనుపులకరించును. అట్లు పెద్దకాలము పోరుజరిగెను; ఎవరును వెన్నుజూపరైరి. సావిత్రుఁడు విజృంభించి నిశితాంబరంబులు వెడచల్లి వైరిరథంబును గూల్చి కాలదండమునుబోని గదాయుధముచేత సుమాలి శిరంబునఁ జఱచెను. ఆప్రేటునకు వానితల ప్రక్కలయ్యెను. వాని ఎమ్ములును శరీరమును నెత్తురుగుజ్జయ్యెను. వానిని గుర్తించుటగూడ

సాధ్యము గాకుండెను. వానిపాటునకుఁ బదనుచేరులైన రక్కసులు గుండియలు వ్రీలి బిట్టఱచుచుఁ బాఱఁజొచ్చిరి.

సుమాలిపాటును రాక్షసుల యలజడియు మేఘనాదుఁడు గాంచి క్రోధపరీతుఁడై రథ మారోహించి ప్రళయాగ్నివలెఁ గ్రాలుచు దానవులను గ్రమ్మరించి సురసైన్యముఁ జొచ్చి కార్చిచ్చు కాననంబునుబోలె శరాగ్నుల దహింపసాగెను. నిర్జరులు వానిధాకకు నోర్వలేక విచ్చి పాఱఁజొచ్చిరి. ఇంద్రుఁ డంతమునుపడ వచ్చి, "భయపడకుఁడు; పాఱి పోకుఁడు, మరలుఁడు, మరలుఁడు. ఇదిగో నాకొడుకు రణముఁ జొచ్చుచున్నాఁడ"ని కేకలువైచి తనసేనకు ధైర్యము గొలిపెను. అంతలోన వాని సుతుఁడు జయంతుఁడు మహోద్భుతకల్పితమైన రథమెక్కి యాహవోన్ముఖుఁ డయ్యెను. త్రిదశులును దెంపువహించి మరలి వానికిఁ దోడయిరి.

జయంత మేఘనాదుల యుద్ధము

జయంతమేఘనాదులకుఁ బ్రచండాహవము జరిగెను. అసురవీరుఁడు కనకభూషితాశుగంబులు వైచి జయంతసారథిని గోముఖుని నొప్పించెను. శచీసుతుఁడు రావణసారథి నల్లే యొనర్చెను. మేఘనాథుఁడు క్రోధసమావిష్టుఁడై నేత్రగోళంబుల నిప్పులు రాల్చుచు శరవర్షముఁ గురిసి యింద్రసుతుని ముంచివైచి సురసైన్యంబుపయి శితధారాభయంకరములైన నానాయుధంబులు పఱచి మాయాబలము నాశ్రయించి పెంజీకట్లు గప్పెను. ఆగాఢాంధకారములోఁ దమవారినిఁ బగవారిని గుర్తింపరాక యమరులు నిర్విణ్ణులై నిలిచిరి. రక్కసులుక్కుమీఱి యమరుల నెచ్చటివారి నచ్చటనే తఱిగిరి. మేఘనాథుఁడు వివిధాయుధములు పఱపి శచీసుతుని బహుప్రకారములఁ గలఁచెను. అతఁడు దిక్కుఁ దోపకుండెను. జయంతుని దురవస్థను వాని మాతామహుఁడు పులోముఁడు చూచి హుటాహుటి వచ్చి యాచీకటిలో నెల్లరఁ గనుభ్రామి మనుమ నెత్తుకొనిపోయి సాగరాంతమున డాఁగెను. జయంతుని కానక సురసైన్యము వితాకు చెంది బరాబరియయ్యెను. రాక్షససైన్యమందు హర్ష నినాదంబు లుప్పతిల్లెను.

దేవేంద్ర రావణుల యుద్ధము

ఇంద్రుఁడు నిర్జరుల కలవరముఁగాంచి నిజసుతవినాశమును శంకించి యాహవముఁ జొచ్చెను. ఆదిత్యులును రుద్రులును వసువులును

సాధ్యులును మరుద్గణమును బురందరుని జుట్టి నిలిచిరి. మేఘుంబులు ప్రళయగర్జలు గావించెను; వాయువులు నిర్ఘాతధ్వని వీచెను; భాస్కరుడు తేజంబును బాసెను; ఉల్కాపాతంబులు గురిసెను; వివిధ వాద్యంబులు బోరుకలంగెను.

అంతలోన రావణుఁ డాసంగతి విని విశ్వకర్మనిర్మితమహాభోగ విషజ్వాలాజాజ్వల్యమానస్యందనం బారోహించి దైత్యసేనాపరివృతుఁడై కుమారుని వారించి తానుఁ దలపడెను; దేవదానవులకు శస్త్రాశస్త్రీ బాహాబాహి ముష్టాముష్టి భయంకరముగా నాజి వాటిల్లెను. కుంభకర్ణుఁ డొక ప్రక్క రణాంగణముఁ జొచ్చి చేజిక్కినవారి నొడిచి పట్టుకొని దంతంబులతోఁగొఱికి భుజంబులతోఁ దాడించి కాలఁదన్ని పెక్కునిర్జరులను జంపివైచెను. రుద్రులు క్రోధసంమూర్ఛితులై శస్త్రాస్త్రంబుల నెడలేక ప్రయోగించి నిశాచరులను నురుమాడిరి. మరుత్తులొకవంక విక్రమించి నానాతీవ్రప్రహరణంబుల రేగ్రిమ్మరులను గసిమసి చేసిరి. రక్కసులు గొందఱు కరచరణంబులు దెగి నేలఁగూలిరి; కొందఱు రథంబులక్రిందఁబడి నలిగి చచ్చిరి; కొందఱు వాహనంబులతోడ డొల్లిరి; గుట్టుపురౌతులు కొందఱు తురంగములమీఁదనే మడిసియుఁ గాసెబలంబునఁ గ్రిందఁబడక యల్లే నీల్గుగొని యుండిరి; మఱికొందఱు భయపడి పఱచు నొంటెల త్రోక్కిళ్లకు నెత్తురుగుజ్జయిరి. రక్తంబులు వఱదలై పాఱెను. గృధ్రకంకకంబులు రుధిరమాంసాతురములై గుంపులు గుంపులుగాఁ గూడెను.

నిశాచరబల మట్లగుట దశగ్రీవుఁడు చూచి మహాగ్రహోదగ్రుఁడై భూరిచాపంబును గైకొని ధనుష్టంకారము గావించి సురసైన్యము జొచ్చి నిశితభల్లంబుల వారిని నూర్లకొలఁది కూల్చి యింద్రునిదాఁకెను. పాకశాసనుఁడును మహాకోదండమును గ్రహించి దశదిశావిస్ఫారముగా జ్యానాదమొసర్చి యగ్నులంబోని శరంబుల వేనవేలు రావణునితలలు గుఱిచేసి వైచెను. దశకంఠుఁడును శక్రుని నంపవానలో ముంచెను. ఆ యోధాగ్రేసరుల బాణమండలము పర్వినభోంతరాళమెల్లఁ గప్పటం జేసి రవికిరణ ప్రసారమునకు సందు లేదయ్యెను. ఆ కారణంబున రణరంగమెల్ల నిరులుగవ్వెను.

ఆ చీఁకటిలో సురాసురవీరులు బలోన్మత్తులై ప్రాణంబులకుఁ దెగించి పోరి యొండొరులఁ జంపుకొనిరి. ఎట్టకేలకు రాక్షసబలంబున దశాంశము మాత్రము మిగిలెను. రావణుఁ డందులకుఁ దీవ్రకోప మూని

బొబ్బరించి, ''సూతా, సురలోకమెల్ల నేఁటితో నామాత్రశిష్టముగును. శత్రుసేనాంతరమునకు రథమును బోనిమ్ము. శత్రుసేనఁ దుంపఁ, ధనదుని దగ్ధమొనర్చి, వరుణుని గావుగొని, యముని సమయించి, యమదూతలఁ బరిమార్చి జయలక్ష్మిని బడయునందాఁక మగలరాదు. జాగువలదు, పోనిమ్ము రథమును; ఈ నందననీమ నుండి యుదయపర్వత ప్రాంతమునకుఁ దోలుము'' అని భీషణస్వనంబున నాజ్ఞాపించెను. మాటతోడ సారథి వాగెను సడలించెను. హయంబులు చెంగలించి మనోజవంబున రథంబును గొని పోయి శత్రుమండలి మధ్యభాగంబున నిలిచెను.

దశకంఠుని నిశ్చయము నింద్రుఁడు గ్రహించి సమరక్షోణినున్న దేవతలనెల్లఁ గలయఁ జూచి, 'నిర్జరులారా, చూడుము, చూడుము. సర్వకాలంబున సముద్రంబును దరంగంబులట్లు రావణుఁడు నిజ సైన్యంబుతో వచ్చి సురప్రతతిను జొచ్చినాఁడు. వరదానబలంబున నితనికి మరణభయమే లేదు. వీనిని జంప సాధ్యముగాదు. కావున నితని బట్టి బంధించుట మేలు. ఆప్రకార మొనర్చి జగత్త్రయంబునకు సుఖమును గూర్తు' నని చెప్పి యుత్తరభాగమున నున్న రావణుని దక్షిణకోణమునకుఁ బోయి చుందలి రక్కసుల పీఁచ మడఁపసాగెను.

రాక్షసేశ్వరుఁడు సురసేనామధ్యగతుఁడై యడ్డము వచ్చినవారి నెల్లఁ దునుమాడుచు నూఱుయోజనంబులు చనెను. అందాఁక నిర్జర సైన్యము వినష్టమై ధరాతలంబునఁ బఱచెను. ఇంద్రుఁడది దవ్వునుండి చూచి తెంపుచేసి దశాననుని ముట్టడించెను. ఆ వ్యూహకౌసల్యమునకు రావణుఁడు సంభ్రాంతుఁ డయ్యెను. దానవులును రాక్షసులును, 'చచ్చితిమి, చచ్చితిమి' అని హాహారావములు గావించిరి.

మేఘనాదుఁడు దేవేంద్రుని బంధించుట

ఆ కలకలము విని మేఘనాదుఁడు క్రోధమూర్తియై శతాంగం బధిరోహించి సురసైన్యముఁ జొచ్చి యీశ్వరప్రసాదలబ్ధమైన మహా మాయను బ్రయోగించి యెల్లరకన్నులు గప్పి యింద్రు దాఁకి శరవర్షముఁ గురిసెను. పాకశాసనుఁడు కటకటంబడి విల్లుపూని ప్రతిశరంబులు సంధించి వైరిని వెదకి యెందునుగానక, 'కటా! చేఁజిక్కియు నితఁడు మాయాబలంబునఁ దప్పించుకొనుచున్నాఁడు' అని చింతఁ గూటి నిర్వీర్యుఁడువోలె నుండెను. రావణి విజృంభించి క్రూరనారాచంబుల మాతలిని వొంచి మహేంద్రునిపయి గుంభవర్షమట్లు నిశితభల్లంబులు గురిసెను. ఇంద్రుఁ డింత రథసారథులను వదలి ఐరావత మెక్కి

విరోధిని వెదుక నారంభించెను. మేఘనాదుఁడు మాయాబలంబున నంతరిక్షమందే యదృశ్యుఁడై యుండి శత్రుని మాయాపరిక్షీప్తునిగా నొనర్చి నలువలంకులనుండి తీవ్రసాయకములు ఱువ్వి వానిని బరిశ్రాంతుని జేసి మాయాశక్తిచేతఁ గట్టివైచికొని పోయెను.

యుద్ధము మానుమని మేఘనాదుఁడు తండ్రికిఁ జెప్పుట

సురనాథుఁడట్లు కొనిపోఁబడుట యమరవర్గము చూచి, 'అహో! ఎవఁ డీమాయావి? ఎందును గానరాఁడు; మనతోడు మాత్రము బద్ధుఁడై జీవచ్ఛవమునలె వెంటఁ జనుచున్నాఁడు. ఇఁక మనబ్రతుకు లేల?' యని రోషావేశులై మైమఱచి రావణునిపయిఁ బడిరి. దశగ్రీవుఁడు నిర్జర గణార్దితుఁడై ప్రతియుద్ధంబునకు నోపకుండెను. తండ్రి యట్లు శరజర్ఝరీకృతాంగుఁడై ససిచెడి యుండుట మేఘనాదుఁడు చూచి, 'నాయనా, యుద్ధము విరమించి రమ్ము; జయలక్ష్మిని గ్రహించితిమి; మనసేనలను మరలింపుము; ముల్లోకముల తోడు పట్టువడెను; అమరుల దర్పంబు లడఁగంజెను; ఇఁక జగత్త్రయంబు నశాత్రవముగానేలు' మని యనన్యదృగ్గోచరుఁడుగా నుండి పలికెను.

ఆమాటలు విని బృందారకులు రణముఁ జాలించిరి. నిశాచరపతి దీర్ఘనిశ్వాసము పుచ్చి, 'నాయనా, మనకులము నుద్ధరించితివి. నీ బల పరాక్రమము లిట్టివని సురేంద్రుఁడే చాటును. నీరక్షముమీఁదనే సుత్రాముని లంకకుఁ గొని పొమ్ము. మనసైన్యమునెల్లఁ గూర్చికొని నీయడుగులలోనే వత్తు' నని చెప్పెను. అతఁడట్లే యొనర్చెను. అంతలోన రావణుఁడు వచ్చి వీరుల నెల్ల నభినందించి వారివారి యిక్కవలకుఁ బంపెను.

దేవతలు బ్రహ్మకు మొఱ పెట్టుట

దేవతలు తనవల్లభునిగనికిఁ బరమదుఃఖితులై ప్రజాపతియొద్దకుఁ బోయి, 'తండ్రీ! నీ వరబలంబున మాకీదురవస్థ సంప్రాప్తించెను. ఇంద్రుని బంధించి ముల్లెమూటగా రక్కసులు గొనిపోయిరి. లంకేశ్వరుఁడు మాకు వధ్యుఁడు కాఁడు. ఇంతలో మాయగచాట్లు తీఱవు. అతని కొడుకునకు మహేశ్వరుఁ డిచ్చినవరంబుల బల మింతనరాదు. మాయాబలవత్తరుని వానిని మేమేమి సేయఁగలము? ఎవనివరమువలన నింద్రునకు నిట్టిపాటు గలిగెనో యా వరదాతవు నీవే మమ్మిఁక రక్షింప నగు'నని సాగిలఁబడి మ్రొక్కిరి.

బ్రహ్మ రావణునకు వరంబులిచ్చి యింద్రుని విడిపించుట

ప్రజాపతి వారికెల్ల నూఱటపల్కి లంకానగరమునకుఁ బోయి మింటనుండి, 'వత్సా, రావణా, నీ బలమును నీ సుతుని కౌసల్యంబును మెచ్చితిని. విక్రమౌదార్యంబుల నీకొడుకు నీకు సాటియో మిన్నయో చెప్పరాదు. స్వతేజోబలంబులచేత ముల్లోకములను గెల్చి నీ ప్రతిన నిలుపుకొంటివి. నేఁడు మొదలు నీకొడుకు 'ఇంద్రజిత్తు' అనుపేర నొప్పును. ఇఁక నీకెదురు గలుగదు. వేల్పులఱేనికై వందరుచున్న యీ సురలకు సంతసముఁగూర్పు' మనెను. పరమేష్ఠి యట్లుచెప్పఁగా, 'దేవా, ఇంద్రుని వదలుమనుదువేని యమరత్వమును నాకుఁ బ్రసాదింపుము' అని యింద్రజిత్తు కోరెను. బ్రహ్మ యది విని, 'వత్సా, సర్వామరత్వ మెవ్వరికిని గలుగదు. 'జాతస్యమరణం ధ్రువ'మ్మని వినవా? అసాధ్యంబును గోరి ఫలమేమి' యనెను. 'అట్లగునేని వీతి హోత్రుని హవ్యమంత్రములతో నేను యజించుచో నయ్యగ్నికుండము నుండి రథాశ్వములు పుట్టి వచ్చుఁగాక. ఆరథముమీఁద నేనున్నంత కాలము నాకు రణాంగణంబున మృతి గలుగకుండుఁగాక. ఈ వరము ననుగ్రహింతువేని నీకోరినట్లు సేయుదు' నని యింద్రజిత్తు చెప్పెను. బ్రహ్మ సుంత యాలోచించి. 'వత్సా, అట్లే యగుఁగాఁబొమ్ము. హోమమును సంకల్పించి పరిసమాప్తి గావింపకమున్నే రణరంగముఁ జొత్తువేని నీకు వినాశము దప్ప'దనెను. అంత రాక్షసులు వజ్రిని విడిపించిరి. 'అహో! ఎల్లరుఁ దపస్సుచేత మెప్పించి వరములు పడయుదురు. ఇతఁడు విక్రమముచేత మెప్పించి వరములు పడసెగదా' యని యమరులు మేఘనాదుని బ్రశంసించిరి.

బ్రహ్మ యింద్రు నాశ్వాసించుట

ఇంద్రుఁడు తా ననుభవించిన యవమానంబునకుఁ గడుంగడు దీనతఁగాంచి పలుకనోఁపక యట్టె నిలిచెను. ప్రజాపతి వాని వగ గ్రహించి, 'అపరేంద్రా! దైన్యము వలదు. కర్మఫలము తప్పదు. నీ యీ పురవస్థకుఁ గారణము వినుము. తొల్లి నేను ప్రజలనెల్ల నేక వర్ణులుగా నేకరూపులుగా నొక్కభాష మాటాడు వారినిగా సృజించితిని. అందువలన వారిలోఁ బరస్పర మేర్పఱుపరాకుండెను. అది తలపోసి వారికంటె వైశిష్ట్యముగా సృజింప సంకల్పించి ప్రజల ప్రత్యంగమందలి గుణంబు లేరి యేరి గూర్చి యొకస్త్రీని పుట్టించి యీ యింతికి అహల్య యను సార్థకనామ మిచ్చితిని. సార్థకనామ మెట్లందువా? హలమనఁగా

వైరూప్యము; హలశబ్దభవము హల్యము; హల్యము లేనిది యహల్య యగును. అట్లాపడతుకను గుణరూపవిశిష్టగా నిర్మించినతర్వాత, 'అహో! ఈ కళ్యాణి నెవనికిఁగూర్తునా?' యను చింత వొడమెను. నీవక్కాంతారత్నమును జూచి యాత్మపద గౌరవమును భావించి, 'ఈ కన్నె నాకుఁ దక్క నన్యునకుఁ బత్ని కాఁదగ'దని మనసారఁ గోరితివి. తగినవరుని గానక నేనాయింతిని గౌతమర్షి యొద్ద నిల్లడ యుంచితిని. ఆ మహాత్ముఁడు మది చలింపక పెక్కేండ్లాపడతు కను గాపాడెను. వానిబుద్ధినైర్మల్యంబునకును దత్తపస్సిద్ధికిని మెచ్చి యా యింతిని వానికే పత్నిగాఁ గూర్చితిని. అది విని నీవు మత్సరించి యా ముని యింటలేనితఱిఁ దదీయాశ్రమముఁ జొచ్చి యందు నగ్నిశిఖ వలెఁ దేజరిల్లుచుండిన యహల్యను గాంచి కామమోహితుఁడవై యా సుందరిని గూడి తిరిగి వచ్చుచుంటివి. నిన్నాముని చూచి నీయకార్యమును గ్రహించి, 'కామమోహితుఁడవై హితాహితంబులు పరికింపక పరదారాగమన మొనర్చితివి గాన విఫలుఁడ వగుము. చోరుఁడవై నా యాశ్రమముఁ జొచ్చితివి గావున రణరంగమున వైరికిఁ జిక్కి బందివగుము. ఇఁక నెవఁడు జారత్వ మొనర్చినను దత్ప్రాతకంబున సగము నీకు దాపరించుచుండును. పదగౌరవంబునకుఁ ద్రుళ్ళితివి గావున నీ యింద్రపద మస్థిరమగుఁగాక. ఇంద్రత్వ మింతయొనర్చేఁ గావున నెవనికిఁగూడ నది యశాశ్వతమగుఁగాక' యని నిన్ను శపించి, 'దుర్భగా! ఇంద్రియలోలవైతివి గావున ససిచెడి యాయాశ్రమము పొంతనే పడియుండుము. ఏ సీరూపయౌవన సంపదలకు మురిసి యిట్లూనర్చితివో యవి నీకేగాక లోకసామాన్యమగుగాక. నీ యుబుసుపోక లడఁగుఁగాక' యని యహల్యను దిట్టెను. వాసవా! అదిసుత స్త్రీలు సహజరూపవతులైరి. అహల్య యట్లు శాపదగ్ధయై చింతపడి పతి చరణంబుల వ్రాలి, 'నాథా! ఇంద్రుఁడు నీ రూపమున వచ్చి మోస గించెను. నా యజ్ఞానమును సైరింపు' మని గౌతముని ప్రార్థించెను. ఆ దయామయుఁడు కనికరించి, 'మానినీ! నీచరిత మింతనాదు. దానినిఁ బోకార్చ నొరుల తరముగాదు. శ్రీమహావిష్ణు వొక్కఁడే యందులకు నోపును. ఆ భగవంతుఁడు ధర్మరక్షణార్థము రాముఁ డను పేర నిక్ష్వాకువంశంబున జనించి యిందు వచ్చును. అప్పుడు వాని పాదధూళి నీపయి సోకును. అంతట నీపాపము పరిహృతమగును; నీవు యథాపూర్వ మగుదువు. ఆమహాత్మునకు యథావిధి యాతిథ్య

మొసఁగి పరిశుద్ధవై నన్నుఁ జేరుదువు, పొమ్ము' అని శాపపరిహార మనుగ్రహించెను. ఇంద్రా! సంగతి వింటివా? కర్మఫల మెవ్వరికిని దప్పదు. నీ సుతునకై నగచుచున్నావు. అతఁడు సాగరాంతమున వాని మాతామహునియొద్ద సుఖమున్నాఁడు. సురేంద్రా, వైష్ణవయజ్ఞ మొనర్చి సర్వకలుషంబులు పాచికొని నాకమునకుఁ బొమ్ము' అని పలికి బ్రహ్మ యంతర్హితుఁడయ్యెను. ఇంద్రుఁడట్లు గావించి స్వర్గలోకమునకుఁ జని యథావిధి సురరాజ్యంబును బాలింపఁ దొడఁగెను.

రావణ కార్తవీర్యార్జునుల యుద్ధము

రావణుఁడు నర్మదను జయించి మాహిష్మతీపురముపయి వెడలెను. ఆనగరంబును గార్తవీర్యార్జునుఁడను మహాతేజశ్శాలి శరకుండంబున నుంచిన వీతిహోత్రుఁడో యన నొప్పుచున్న వాఁడు పరిపాలించు చుండెను. ఆసమయంబున నతఁడు జలక్రీడావినోదియై సుందరీమణులను గూడి నర్మదానదికిఁ బోయియుండెను. రావణుఁ డాప్రోలు చేరి రాజ సచివులను బిలిచి, 'ఏఁడీ మీ యేఁడు? రావణుఁడు యుద్ధార్థము వచ్చె నని యతనికిఁ దెలుపు' మనెను. 'రాక్షసేశ్వరా, మారా జిందు లేఁడు' అని వారు చెప్పిరి.

రావణుఁడు నర్మదలో నీరాడి శివపూజ సేయుట

అంత రావణుఁడు వింధ్యపర్వతమునకుఁ బోయెను. ఆనగేంద్రము భూమిని వ్రచ్చి పుట్టి తనయున్నత్వంబును జూపుటకుఁగా మిన్నేరయు చున్నదో యన నుండెను. దానిశిఖరంబులు సహస్రాధికమై రవి మార్గంబును నిరోధించుటకుఁగాఁ గొండలతాయఁడు చాచిన బాహువులో యన నొప్పెను. ఆ గిరిగుహలు సింహశార్దూలాదిక్రూరసత్త్వంబులకు నిలయములై డాయరావయ్యెను. అందలి సెలయేళ్ళధ్వనులు నగాధిపుఁడు గావించు మహోట్టహాసంబులుగాఁ దోచెను. దేవదానవ గంధర్వులు తమతమప్రియలఁగూడి సలుపు వినోదక్రీడలకు నంసు మేర గలుగదు. స్ఫటికనిర్మలజలంబులు వాకలు గట్టి పాఱుచు శైలేంద్రుని పేరురంబునఁ గ్రాలు ముత్యాలహారముల పేరులోయన నొప్పెను. మఱియు నచ్చటి చఱియలు నాల్కలల్లార్చుచుఁ బడగలు విచ్చుచు ముడుచుచు బుస గొట్టుచున్న వివిధపన్నగములతో నిండి మహాభయంకరముగా నుండెను.

నర్మదానదం బా వింధ్యగిరియందుఁ బుట్టి పశ్చిమముఖముగాఁ బ్రవహించుచుండును. ఆ నదజలంబులందు మునుఁగుచుఁ దేలుచుఁ

గూయుచుఁ జక్రవాక హంస కారండవ జలకుక్కుటంబులు గావించు రట్టడిఁజూడఁగా, ధ్యానభంగము గలిగినప్పు డింద్రియలోలుఁడు చేయు కోలాహలధ్వనులు జ్ఞప్తికి వచ్చుచుండెను. మహిషాదివన మృగంబులు వడదాకి డప్పిగొని తండోపతండములుగా వచ్చి యా నదీతోయంబులను గలఁచుచున్నను దాని యడుగుభాగమందలి వివిధ శిలాలింగములు స్పష్టముగా నగపడుచుండుటఁ జూడఁగా నింద్రియము లకును నింద్రియార్థములకును సంయోగము గలుగుచున్నను స్థిర ప్రజ్ఞుని యంతరంగము వికారరహితమై స్ఫటికస్వచ్ఛముగానుండు ననుటకుఁ నయ్యది నాదృశ్యమో యన నొప్పెను.

ఆ నదీమతల్లి నిర్మలతోయములాడి పులిన శ్రోణీతలంబుపయిఁ దెల్లనినురుగుఁబట్టముఁ గట్టి జక్కువగబ్బిగుబ్బలమీఁద సంపుల్లద్రు మోత్తంసంబును సవరించి రాయంచబారనెడి మొలనూలు బిగించి పూఁబొడిగంధ మలఁది వికచారవిందనేత్రంబులఁ గ్రీగంటిచూపులు నెఱపుచుండుట రావణుఁడుచూచి పుష్పకవిమానమునుండి దిగి ప్రియు కవుంగిటంబలె నయ్యేటి యెదపై వ్రాలి యందలి సైకతప్రదేశములందు సచివులతోడఁ గూర్చుండి, 'అహో! గంగయేల?' యని యాత్మ సంతోషంబును వెలిపుచ్చి శుకసారణులవంక మరలి, 'అదిగో చూడుము, తపనుఁడు లోకసంతాపకరుఁ డయ్యు నాకుఁగా శీతకరుఁడై మింటనిలిచి నాయజ్ఞకు వేచి యున్నాఁడు. వాయువు నాకు శ్రమపరిహారిగా నర్మదా జలకణ శీతలంబులును సుగంధబంధురంబులు నగు వాతాంకురంబులను మెలమెల్ల వీచుచున్నాఁడు. అహో! ఈతరంగిణి నర్మవర్ధినియై నక్రమోనవిహంగోర్మికలతోఁగూడి తిరస్కృతి శంకించు నంగనామణి నలెఁ దోఁచుచున్నది సుమా. మంత్రులారా! నా నరేంద్రులతోడను మహేంద్రాదిదేవతలతోడను బోరి మీరెల్లరు శస్త్రాంకితశరీరులును రుధిరచందనదిగ్ధాంగులునై యున్నారు. శర్మదయైన యీనర్మదయందుఁ గ్రుంకి మలినంబులు వాసి సుఖముండుఁడు. అదిగో, శరదిందు శుభ్రమైన యా పులినతలంబున నేను శంకరునకు నంతలోనఁ బుష్పోహారమొనర్చి వత్తు' ననెను.

ప్రహస్తాదులు చని వామనాదిదిగ్గజంబులు గంగానదినిఁబోలె నర్మదాతరంగిణిని గలఁచి జలకములాడి రావణుఁడు గావించు శివ పూజార్థము పుష్పంబులు గొనివచ్చి రాశివోసిరి. లంకేశ్వరుఁ డంత నీరములాడి విధిప్రకారము జపించి వచ్చి తడివస్త్రము విడిచి పీతాం

బరముఁగట్టి లింగార్చనంబునకై తగుచోటు వెదక సాగెను. వానివెంట నతని మంత్రులు సువర్ణమయపూజాలింగమును మోచికొని తరలిరి. పరిసరప్రదేశములెల్లఁ బరీక్షింపఁబడెను. తుదకొకచోటు నిర్ణీత మయ్యెను. అచట సైకతవేదిని గల్పించి దానినడుమఁ బూజాలింగము నుంచి గంధపుష్పాక్షతల నర్చించిరి. రావణుఁడంతఁగొంతవడి నంతర్ధ్యాన గతుఁడై యుండి తర్వాత శివార్చనకుఁ దొడఁగెను.

నర్మద ప్రాజ్ముఖి యగుట

అత్తఱిఁ దన్నదీజలంబు లుబికి బూరటిల్లి పొరలి రావణుని పూజాద్రవ్యముల నెల్ల ముంచి కొట్టుకొనిపోయెను. దశగ్రీవుఁ డంతతోఁ పూజమాని, ప్రియకాంత ప్రతికూలయగుకరణిఁ బశ్చిమముఖయైన యేఱు ప్రాఙ్ముఖియగుటఁగాంచి, 'ఏమీ యీవింత! విభ్రాంతవిహంగ మయయ్యు నిత్తరంగిణి సహజశాంతగుణంబు పేర్మి నిర్వికారయగు నంగనక్రియఁ దోచుచున్నది. కారణ మూహింపరా' దని తలపోసి శుకసారణులకు వ్రేలితో సైఁగ చేసెను.

వారు జేనిభాషమును గ్రహించి మింటికెగసి పశ్చిమముఖులై నదిమీఁదుగా నర్ధయోజనము చని యట నున్నతసాలమునుబోని పురుషుఁ డొకఁడు మనవ్యాకులతేజోవిలసితుఁడై మూర్ధజంబులు నీటఁ దేలియాడుచుండ స్త్రీలఁ గూడి జలక్రీడలు సల్పుచుఁ గనకాచలము తనవేయిపాదంబులతో మేదినీతలంబునువలెఁ దనవేయిహస్తములతోఁ దటినీమణి నాకవెట్టి యుండుటయుఁ దత్కారణంబునఁ బ్రవాహము ముందునకుఁ బోలేక పొంగి మరలుటయుఁ జూచి యాశ్చర్యమగ్నులై వచ్చి సంగతియెల్ల దశగ్రీవునకు విన్నవించిరి.

రావణ కార్తవీర్యార్జునుల యుద్ధము

రావణుఁడు సంగతి విని యదియంతయుఁ గార్తవీర్యార్జునునిపనిగా గ్రహించి యుద్ధలాలసుఁడై యతనిపయికిఁ దరలెను. వాయువు చెలరేగి కెంధూళు లెగఁజిమ్మి ప్రచండగతి వీచెను. మేఘంబులు సకృత్తుగా ఘోషించుచు రక్తవర్షములు వర్షించెను. ఆ యశుభసూచకంబులను లంకేశ్వరుఁడు లక్ష్యపెట్టక చని, కరణీగణంబుతోడ గజేంద్రముపగిది స్త్రీలబృందముతోడ జలకమాడుచున్న నరేంద్రుని గాంచి, రోష రక్తలోచనుఁడై వాని యమాత్యులను జీరి తనరాక వారిచేని కెటింగింపు మనెను. వారామాట విని, 'భళీ! భళీ! సంగ్రామమునకు మంచివేళ

నిశ్చయించి వచ్చితివి! కలువకంటులఁ గూడి సలిలక్రీడల నుండువానిని గయ్యమునకుఁ బిలుతువా! నీమగటిమిని స్త్రీలకుఁజూపఁదలచితివా? చాలుఁజాలు. ఈ రేయి నిదానింపుము; జోపకడ రమ్ము; నీభుజకండూతి తెమలును. యుద్ధతృష్ణాతిశేకంబున మామాట వినవేని మాతోఁ బోరునకురమ్ము. తర్వాత మారాజు నొద్దకుఁ బోనగు' ననిరి.

రావణమంత్రులు విజృంభించి యర్జునుసచివులను డాఁకిరి. హాల హాలాశబ్దములు పెచ్చుపెరిఁగెను. నదీతటంబులు ప్రతిధ్వనులను రెట్టింపుగా నీని వింతఁగొలిపెను. అర్జునునిమంత్రులు కసెలు శరంబులు శూలత్రిశూలంబులుఁ గొని రావణసచివులను నొప్పించి సక్రమీన మకరసంకులంబగు సాగరమువలె గర్జించిరి. ప్రహస్తశుక సారణాదులు రోషాగ్నులను గ్రుమ్మరించుచు వివిధాయుధములను బఱపి యరివర్గంబును దుత్తునియలు గావించిరి. ఆసంగతి హైహయుఁడు ద్వారపాలకులవలన విని భయపడవలదని స్త్రీ జనంబునకుఁ బలికి గంగాతోయంబులనుండి యంజనగజంబువోలె నర్మదానీరంబులనుండి లేచి యుగాంతకాలాగ్ని కరణి మండుచు హేమాంగదము ధరించి గదఁ బూని దివాకరుఁడు పెంజీకట్లపయికివలె నప్పిశితాశనులపైకి నుఱికెను. గదఁ ద్రిప్పుచు గరుడవేగంబున నచ్చుచున్న యయ్యర్జునుని రావణమంత్రులు భాస్కరుని వింధ్యాచలమట్లు నిరోధించిరి. వారికి బెట్టిదంపుసంగరము జరిగెను. ప్రహస్తుఁడు లోహమయమహోముసలంబును ద్రిప్పి యర్జునుని పయి వైచి యార్చెను. ఆ ముసలము మంటలు గురియుచు లోకదహన మొనర్పునున్నదో యను శంకఁ గలిగించుచు మహోద్ధతి వచ్చెను. కార్తవీర్యుఁడు నేర్పుమెయి దాని తాఁకును దప్పించుకొని పంచ బాహుశతోచ్ఛ్రయంబును మహాభారవంతము నైన గదను జేతఁబట్టి ప్రహస్తుని మీఁదికి నురువడించి వానినొక్కటి వడ్డించెను. వజ్రహతికి శైలంబువలె నతఁ డావ్రేటునకు నేలఁగూలెను. శుకసారణాదులు భీతిల్లి పాఱిరి.

రావణుఁ డదియెల్లఁ జూచి రోషావిలుఁడై కార్తవీర్యు నెదుర్కొనెను. ఇరువదిహస్తములవాఁడును వేయిహస్తములవాఁడు నట్లు విడివడి గదిసి సంరబ్ధసాగరంబులక్రియఁ బొదువిడిచివచ్చిన కొండలరీతి మండుచండభానులకైవడి మంటలులియుచున్న గార్చిచ్చులవలె మాతంగికై పోరు మదగజంబులతేవ ఘూర్ణిల్లుమేఘంబులచందాన విడివడిన సింహములపగిది నాఁబోతులరహిఁ బ్రలయాంతరుద్రులువోలెఁ

బోరసాగిరి. వారి గద లొండొంటిఁ దాఁకి ప్రమోయప్రమోతలు పిడుగు శబ్దంబులను మించెను. గదాయుగసంఘర్షణంబున జనించిన నహ్ని జ్వాలలకాంతి యంతరాళమునెల్ల వెలిగించెను. ఆ వేడిమి సహింప నోపక రాజభటులును రాక్షసస్త్రైన్యంబును దవ్వు చనెను. అర్జునుఁడు కోపోద్దీపితుఁడై లంకేశ్వరునివక్షఃపీఠిపయి గదతోఁ దాటించెను. రావణుఁడు నల్లే యొనర్చెను. అట్లు వారు పరస్పరము జయింపఁగోరి యొండొరు నతిక్రమింపఁ దలఁచి పెద్దయుంగాలము పోరిరి. ఒక్కరు సలసటఁ జెఁదరు; నొప్పికి లొంగరు. వారిపోరు బలీంద్రులయుద్ధమును దలపించెను. కొమ్ములతోఁ గోడెలును దంత్రాగ్రంబులతో మత్తేభంబులు నొండొంటి నుఱుమాడుకొనుచందాన వారు పెనఁగులాడిరి. ఎట్టకేలకు స్త్రైహాయుఁడు గదతో రావణునియురంబున మరల మోఁదెను. గద రెండుగాఁ దునిగిపడెను; రావణుఁడు నెత్తురులు గ్రక్కి- నాల్గుమూరలు వెనుకకు దొల్లెను. వరబలంబునంజేసి యతఁడు చావఁడు. గరుత్మంతుఁడు పన్నగంబుపైకివలె నర్జునుఁడు వానిమీఁదికి దుమికి యతని నొడిచిపట్టి వామనుఁడు బలినట్లు బంధించెను. సిద్ధచారణులు సాధు వాక్యంబులు పలికిరి. అర్జునునిపయి సుమవృష్టి గురిసెను.

కార్తవీర్యార్జునుఁడు రావణుని బందిసేయుట

మృగంబును వ్యాఘ్రమట్లు గజంబును సింహమువలె రావణుని స్త్రైహాయుఁడు బట్టి బంధించి యంబుదస్వనంబున హర్షనాదంబులు గావింపఁగా నాధ్వనికిఁ బ్రహస్తుఁడు కనువిచ్చిచూచి సంగతి గ్రహించి కోపవివశుఁడై లేచి యసురసేనాశేషము నెల్లఁగూర్చి యంబురాశిని గాలుమబ్బులట్లు కార్తవీర్యుని ముసరి 'వధలు వధలు నిలు నిలు' మని కేకలు పెట్టుచు శూలంబులను ముసలంబులను విసరెను. స్త్రైహాయుఁడయ్యాయుధములనెల్ల జేసేతల నందుకొని వానిచేతనే యారక్కసుల నుక్కడించెను. వారు లుకలుకలై పెనుగాలికి నులిమబ్బులకైనడి విడిసి పాఱిరి. అంత నతఁడు రావణుని బందిగొని తన పురముఁ బ్రవేశించెను.

పులస్త్యుఁడు రావణుని వదలి పెట్టించుట

దేవతలు దివిఁజేరి, 'అహో! గాలిని మూటఁగట్టినట్లు రావణుని బంధించి కార్తవీర్యుఁడు కొనిపోయెను. ఇతని శక్తి సామర్థ్యము లేమన వచ్చు'నని చెప్పుకొనుచుఁ దమసంతోషంబులను వెలిబుచ్చుచుండిరి.

పులస్త్యుఁ డాసంగతి విని పుత్రికృతస్నేహంబునఁ జాలిచెంది మాహిష్మతీపురమునకు వచ్చి తనరాక కార్తవీర్యునకుఁ దెలిపెను. పులస్త్యుఁ డన్నంతనే కార్తవీర్యుఁడు శిరంబున నంజలి పుటముఁ జేర్చి యర్ఘ్యమధుపర్కంబులు గైకొని పురోహితసహితంబుగా నెదురేగి, భాస్కరునివలె వెలుఁగుచున్న యమ్మునీంద్రునకు నమస్కరించి వానిని సముచితవిధంబున నర్ఘ్యపాద్యాదుల గౌరవించి, 'ఋషిసత్తమా, మీ యాగమంబున నా యీపుర మయ్యమరావతీతుల్య మయ్యెను. నేను పవిత్రుఁడనై తిని. మహాత్మా, నేఁడు నావ్రతము లెల్ల ఫలించెను; నా జన్మము సాఫల్య మొందెను. తండ్రీ, ఈ రాజ్యము నాయీపుత్రాదు లెల్లరు నేనును మీవార మేగదా. కార్యముగలదేని యాజ్ఞాపింపనగు' ననెను.

పులస్త్యుఁడు సంతసించి, 'రాజేంద్రా, ధర్మము చక్కఁగాఁ బ్రవర్తిల్లునుగదా. అగ్నులు యథావిధి వ్రేలునుగదా. పుత్త్రాదులు సుఖముందురుగదా. అర్జునా, నీబల మసదృశము. ఎవనిమాట చెప్పి నంతనే సాగరము నిస్తరంగమై నిలుచునో, ఎవనిపే రుచ్చరించినంతనే వాయువు వీచుట మానునో, యట్టి రణదుర్జయుని నా పౌత్త్రుని రావణుని ముల్లెమూటఁగాఁ దెచ్చిన నీశక్తి నేమని కొనియాడుదు? ఆ పుత్రకుని యశఃపూరమెల్ల గ్రోలివైచితి వనుటకన్న వేరుగా నిన్నుఁ బొగడరాదు. రాజేంద్రా, ఆ బడుతను నిటనుము. అందునిమిత్తము వచ్చితి' ననెను.

ఆ మాటతోడఁ గార్తవీర్యుఁడు రావణుని వదలిపెట్టుటయే గాక మీఁదుమిక్కిలి యతనిని దివ్యాభరణవస్త్రంబుల సత్కరించెను. పులస్త్యుఁడు పరమసంతోష మొంది వారిరువురకు నగ్నిసాక్షికముగా మైత్రి గావించెను. హైహయుఁడు ఋషికి ప్రేమక్కి చనెను. పులస్త్యుఁ డంత రావణుని సందిటఁ గూర్చి, 'నాయనా, శక్తిసంపదలకు మేరలేదు. ఒకరిని మించి యొకరుందురు. ఇది లోకసహజము. వరబలము గలదని గర్వింపవలదు. వరములు సయితము తపోబలమునుబట్టి యుండును. ఈరహస్యము నీవు గ్రహించుటకై నేఁడిట్టిది నీకుఁ బొసఁగెనని యెఱిఁగి జాగరూకుఁడవై వర్తింపు' మని పెక్కుధర్మములం బోధించి వానిని వీడ్కొనెను. దశగ్రీవుఁడు లజ్జానమ్రవదనుఁడై లంకానగరముఁ జొచ్చెను.

వాలిపయి రావణుఁడు దండెత్తుట

లజ్జ యింకను మాయలేదు. హైహయునిబ్రేటులవలని గాయము లింకను మానలేదు. అంతలోననే రావణునకు రణోత్సుక్యము మరలఁ దలసూపెను. నైజము నిలువనీయదుగదా. రావణుఁడు ససైన్యముగాఁ దరలి ధాత్రీమండలమెల్లఁ గ్రుమ్మరుచు బలాఢ్యుఁ డని విన్నంతనే తనమనలు వివరింపక కన్నవారినెల్లఁ గయ్యమునకుఁ జీరసాగెను. ఇట్లు తఁడు దరోద్ధతుఁడై కన్నవారిని విన్నవారిని బీడించుచు కొండొకనాఁడు కిష్కింధకు వచ్చి తన్నెతయైన వాలిని రణభిక్షఁ గోరెను. లంకేశ్వరుని రాకను వాలిమంత్రులు సుగ్రీవాదులు విని వచ్చి, 'రాక్షసేంద్రా, నీకుఁ బ్రతిబలుఁడు వాలి యిప్పు డిందు లేఁడు. నినొన్నర్చువానరులు మఱెవ్వరుఁ గలుగరు. రావణా, వానరేశ్వరుఁడు చతుస్సముద్రములందు వార్చి రాఁ జనెను. ముహూర్తకాలము సైరింపుము. ఆయన వచ్చుతఱి యయ్యెను. ఇంతలో నయ్యస్థిరాశిని వీక్షింపుము. అది వాలితోఁ బోరి చచ్చినవారి యెమ్ములప్రోవు. దశగ్రీవా, అమృతము ద్రావి వచ్చినను వాలిచేతబడి బ్రదికి పోవుట కల్ల. ప్రాణంబులు నీకుఁ దీపగునేని వచ్చినదారిఁ బట్టుము. వానరేశ్వరుఁ డిప్పుడు దక్షిణసముద్రతీరంబున వార్చుచుండు. వలతువేని యటకుఁజను' మనిరి.

వాలి రావణుని భంగపఱచుట

రావణుఁ డామాటలకు మండిపడి విమానమెక్కి దక్షిణార్ణవము నకుఁ బోయెను. ఆసముద్రతీరమున హేమాద్రియంతటివాఁడు కూర్చుండి సంధ్యవార్చుచుండెను. ఆతఁడే వాలిగా యని రావణుఁడు తలఁచి వాని నల్లేపట్టి బంధించు తలఁపుతో విమానము దిగి కాలుకాలు గద లింపక మెల్లగా డాయఁ బోయెను. వాలి యదృచ్ఛగాఁ గ్రీగంట రావణునిఁ జూచి యతని దుర్భావమును గ్రహించి 'సరిసరి, కానిమ్ము' అని లోలోన నగచుచుఁ జూడనట్లు నటించి నిగమమంత్రములఁ బఠింప సాగెను. రావణుఁడు తటాలునఁ దనహస్తంబులను వాలిచంకలఁ దూర్చి యతనిని లేవనెత్త నుంకించెను. కపీశ్వరుఁడు నిజకక్షాంతరములను బిగించి తివ్వున నింగి కెగసెను. గరుడుని కాలఁజిక్కిన పాముక్రియ వాలిచంకలలో రావణుఁడు దగులుకొని వ్రేలాడసాగెను. వాలి గగనంబు నకు నెగసి గోళ్ళతో నసురుమేనెల్ల నక్కుచు తివ్వునఁ దూర్పుకడలి వంకఁ జనెను. ప్రహస్తాదులు తమరాజుపాటుఁ జూచి వానిని విడిపించుటకై వాలివెంటఁ బఱిరి. ప్లవగేశ్వరుఁడు కొంచెము వడిచేసెను.

వానిబాహువులనుండియు నూరువులనుండియు జనించిన గాలి సుడి తిరుగుచు వీచెను. ఆ గాలివడికిఁ బర్వతములుగూడ బీటలువాఱి దొర్లఁ జొచ్చెను. రాక్షసేశ్వరుని మంత్రులు పండుటాకులవలెఁ గొట్టుకొని పోసాగిరి. వారు కొంతసేపు పెనఁగులాడి లాభము చాలదని తమయత్న మును మానిరి. వానరనాయకుఁడు తూర్పుసముద్రమున వార్చి యందుండి యుత్తరసాగరమునకుఁ బోయి యావలఁ బశ్చిమసముద్రము దాఁకి కిష్కింధకు వచ్చి దిన నిష్ఠాసమాప్తిఁ గావించుకొని యీ నగరోపాంత ప్రదేశమునఁ జంకలు సడలించెను. దశగ్రీవుఁడు సగమేదినప్రాణములతోఁ గ్రిందఁబడి లేచి నిలిచెను. వాలి యేమియు నెఱుఁగనివాఁడు ఎలెఁ మురలి చూచి 'అసురేశ్వరులా ! ఎప్పుడు దయచేసితిరి ? సేమమా ? ఎందుఁ బోవుచున్నారు ? కార్యమేదేనిఁ గలదా ?' యని యడిగెను.

ఆ మాటలు పుంటిపై ముల్లడచినట్లు గాఁగా దైత్యపతికిఁ గొఱవ ప్రాణములు గూడ నెగసినట్లయ్యెను. 'అహో ! ఏమిబలము ! ఏమి వీర్యము ! ఇతఁడు జంకపిల్లనుబోలె నన్నుఁ జంకలలో నిఱికించుకొని నాల్గు సముద్రాలు క్షణములో జుట్టినచ్చెఁ గదా'యని రావణాసురుఁడు మహాశ్చర్యమగ్నుఁడై, 'వానరేశ్వరా ! నీ బలమింతనరాదు. నీ వేగము నకు మనస్సుగూడ తలవంచును. హరిపుంగవా ! నీశక్తిని జవిచూచితి. నీతోఁ జిరసఖ్య మొనర్తు. నేఁడుసుత మన యిరువురకు నెందును భేద భావ ముండరాదు' అని వచించి యగ్నిసాక్షికముగా వానితోఁ జెలిమి యొనర్చి చేతఁ జేయి పెట్టించుకొని కిష్కింధానగరమున సర్వోప భోగము లనుభవించుచు నొక్కమాసము పుచ్చెను. శుకసారణాదులు రాజును వెదకుచు దేశదేశంబులు దిమ్మతిరిగి యెట్టకేలకుఁ గిష్కింధఁ జేరి యట దమ యేలికను గాంచి సంతసించి వాలి యనుమతిఁ బడసి రావణుని లంకకుఁ గొనివచ్చిరి.

దైత్యుల విశృంఖల చర్యలు

రావణుఁడు లంకఁ జేరి దనుజరాజ్యము నెల్లఁ గనుసన్నలఁ బాలించు చుండెను. వానిమాటకు మాఱు గలుగదు. వాని యనుచరులు చెలరేఁగి విశృంఖలవృత్తి ననుసరించిరి. ఇంద్రుఁడు గొడుగుపట్టువాఁడయ్యెను ; వాయువు పంకావాఁడయ్యెను ; కుబేరునకు సరాబు సని ఘిచ్చిరి ; వరుణుఁడు ముంగిటఁ గలయంపి చల్లువాఁడయ్యెను ; అగ్నికి బానస ములోఁ బనిపెట్టిరి ; యముఁడు దండముగొని ద్వారమునఁ గాపుండు

టయ్యెను. నైఋతిచేతికి నూడపమిచ్చిరి. సూర్యచంద్రులు కాల్దివిటీలు పట్టిరి. సురవేశ్యలకు లంకానగరమే కాపురమయ్యెను.

అసురులు కొందఱు చని వసవనాంతరము దిరిగి యందందుఁ గానవచ్చు మునిపల్లెలు చొచ్చి యందలివారిని బట్టి కొట్టి బాధింపు చుండిరి. మఱికొందఱు దేశదేశంబులు గ్రుమ్మరి చక్కని కన్నెలఁ బట్టితెచ్చి తనికిఁ గానుకలిచ్చి వానిమెప్పు వీలువసాగిరి. మర్త్యామర్త్య లెల్లరు మానప్రాణముల మీఁద నాస వదలిరి. ఏ ప్రాణికిని దిగులు గూడు తప్ప సుఖజీవనము గలుగదయ్యెను.

సీ॥ మునిపల్లె లెల్లెడ మెఁదలంటఁజనుటయ్యె
యజ్ఞ యాగము లంత మందుటయ్యె
సుందరీమణులెందు బందిలోఁ బడుటయ్యె
మానవతి బ్రదుకు మానుటయ్యె
జీవరాశికి దుఃఖ జీవిక విధియయ్యె
నెల్లలోకముఁ దల్లడిల్లుటయ్యె
దైవమా యనిపల్క దండనఁబడుటయ్యె
నోరెత్తియాడిన నేరమయ్యె

గీ॥ ఆలసుబోండ్లకంటను దడియూఁదయ్యె
వాయిలేనిబిడ్డల గో డవారియయ్యెఁ
దలఁపఁ బంటయు వంటయుఁ దక్కువయ్యె
రక్కసుల నిరంకుశపు వర్తనము పేర్మి.

పూర్వకాండము
సంపూర్ణము.

శ్రీ శారదాంబాయైనమః

శ్రీ దొడ్డ రామాయణము

బాలకాండము

సీ॥ ఓం నమో భగవత ఉత్తమశ్లోకాయ
నమ ఆర్యజనరతుణవ్రతాయ,
నమ ఉపశిక్షితసమదర్శనాత్మనే
నమ ఉపాసితభువనత్రయాయ,
నమ ఆగమార్థనిర్ణయనూక్తినియమాయ
బ్రహ్మణ్యదేవాయ భావితాయ,
నమ ఆదిపురుషాయ నవనీతహృదయాయ
రాజాధిరాజాయ రఘుకులాయ,

గీ॥ మునిమనోబ్జసారంగాయ మోక్షదాయ,
ఆర్తసంత్రాణదీక్షాయ అవ్యయాయ,
పరమపావననామాయ భద్రకాయ,
రామచంద్రాయ నిర్జితరావణాయ.

ప్రథమ మండలము

అయోధ్యానగరము

సరయూతీరంబునఁ గోసలదేశముగలదు. దానికి నయోధ్యానగరము రాజధానిగా నుండెను. ఆ పట్టణమును దొల్లి వైవస్వతమనువు నిర్మించెను. అది పదునెండు యోజనంబుల నిడుపును మూఁడు యోజనంబుల తనర్పుఁ గలిగి తీర్చిదిద్దినవీధులతోను బ్రతివీధికి నిరువంకలందు వన్నెవన్నె పొదరిండ్లతోను నొప్పారుచుండెను. ఆ లతాగృహంబులు పూఁచిన తమ వల్లికాహస్తంబులను జాచి నెత్తావి విరిజొంపంబులను వెదచల్లుచు బాటసారులకుఁ బుష్పాంజలు లర్పించుటకై నగరలక్ష్మి నియమించిన చేటికలో యనఁ దోఁచుచుండెను. ఆ పూఁబొదల నడుమ నందందుఁ స్థాపించిన జలయంత్రములు తుషార శీకరంబులను జిల్కరించి పథికశ్రేణికి ననాయాచితశ్రీతోఁ బచారంబులఁ గూర్చు

చుండెను. ఆ యంత్రముల చేరువనున్న స్నిగ్ధచ్ఛాయావృక్షంబులు, నిజశాఖాగ్రంబుల నుయ్యెలలాడుచుఁ గలకలమధురస్వనంబులఁ బలుకు శుకపికంబులతో నిండి, సంగీతపుర చ్చలో యనఁ జెలువారుచుండెను. ఆ తరువులనీడలందు విశ్రమార్థము తీర్చిన వింతరంగులచలువరాతి తిన్నెలు డాయవచ్చినవారిని గదలనీయ వనుట యతిశయోక్తి కానేరదు.

చ॥ పరిపరిదేశశిల్పకము భావనచేసి సమస్తవాస్తువుల్
సరిగ గణించి కౌలముఁబ్రజారుచులన్ మదినిల్పి వృద్ధి వి
స్తరముల కిమ్ముచూపి కడుశ్రద్ధయు నేర్పును జోడుగాఁగ న
ప్పురమును గట్టి రయ్యలకపోలికి నుద్దిగనుండనో యనన్॥

ఆ నగరమందలి ప్రాసాదంబులు సృష్టియందుఁగల వివిధవర్ణ శిలారత్నములతో నిర్మితములై మిన్నుఅయుచు రవికిరణప్రసారంబున వింతవింతవన్నె లీనుటంజేసి సూర్యునకు సహస్రకరుఁ డనుబిరుదు రూఢి యయ్యెనోయని యూహింతురు. అందలి గోపురంబుల చెలువంబును హాటకమయ కవాటంబుల హరుపును క్రీడాపర్వతంబులయుఁ గూటాగారంబులయు శృంగారగరిమంబును గన్నారఁ జూచిసంతసింప నగునే గాని వేఱు గాదు.

ఆ నగరవిపణిశ్రేణుల విలాసంబును జూడని కన్నులకల్మి కల్మిగా దనవచ్చును. ఒకచోట నవరత్నరాసులు వింతవింతకాంతులఁ బిసాళించుచుండ, ఒక క్రేవ గస్తూరికాదిద్రవ్యంబుల భుగభుగవాసన లెగయుచుండ, ఒకవంక జీనిచీనాంబరములును జరీబుటాజిలుఁగువలువలునుఁ దళతళకాంతులీనుచు నేతగాండ్ర నైపుణ్యంబును బ్రబర్శించుచుండ, ఒకచాయఁ బలురంగుల పూసరంబులు కమ్మనిత్రావులఁ జూఱలిచ్చుచుఁ బ్రకృతిలీలాసంపదను బ్రకటించుచుండ, ఒకచక్కఁ రకరకంబుల ధాన్యపుదిప్పలు చిఱుగొండలంబోలి రాజ్యభాగ్యంబును జాటుచుండ, ఒకదెస దేశదేశాంతరాగతములైన వివిధవస్తువులు వాణిజ్యప్రాబల్యమును దెలుపుచుండ నప్పురి బేరివాడలు సకలభాగ్య సౌభాగ్యనిధానములై పరిఢవిల్లెను. వేయేల ?

"సీ॥ శ్రీకరోదయవధూలోకనప్రభా
నాటితబహుచంద్రనాటనంబు,
సమ్మర్దదళితభూసారత్నమంజరీ
యోజితరథ్యాప్రపూజనంబు,

కైలాసశైలసంకాశసౌధనివేశ
కామదీకవచితగగనతలము,
విస్తీర్ణవిపణీవిన్యస్త వస్తువ్రజ
ప్రకటిత రత్నగర్భాజఠరము,

తే॥ విపులపవమాన తాండవవేపమాన
లాంఛనధ్వజపట్టపల్లవలలామ,
శూలిరచితకశాకృత్య హేలిహాయము,
దీపితంబగు శ్రీయయోధ్యాపురంబు."

మఱియు సాంగోపాంగముగాఁ జతుర్వేదంబు లధ్యయనించి, షట్ఛాస్త్రంబులు గఱచి, గుణకర్మవిభాగ మెఱిఁగి, యాశ్రమ యోగ్యంబుగా నిష్కామకర్మము లాచరించి చిత్తశుద్ధిఁ బడసి యథా క్రమము శ్రవణమననధ్యానంబు లనుష్ఠించి, తత్త్వసాక్షాత్కారసిద్ధిని గాంచి జగత్కళ్యాణార్థము వర్తించు విప్రవర్యులతోడను, బరపీడా సమార్జితభోగంబులకుఁ జిక్కక, యథాశాస్త్రము దుష్టశిక్షణశిష్టరక్షణ రూపమైన తమధర్మంబున నప్రమత్తులై యిహపరంబుల రెంటిని సాధించుచుండు క్షత్రియశిఖామణులతోడను, రాజ్యాంగమందుఁ దమకు గల హక్కు బాధ్యతలను గ్రహించి నీతినిబద్ధవ్యాపారంబులు సాగించుచు విశ్వాసపాత్రులై కుబేరసంపదల బెడగారుచుండు వైశ్యబృందంబు తోడను, స్వధర్మము నెడయక ప్రజాసేవయే భగవత్సేవగా భావించి శారీరకకర్మంబును మన్నించుచు సోమరిపోతులకుఁ దలవంపులు గలుగ రాజ్యలక్ష్మికిఁ గూర్మిసుతులై చరించు శూద్రకోటితోడను, గులశీల రక్షణగృహదేవతలో యన నెలసి మానవతులై మాతృప్రేమరసంబు లొలికించుచు నిసర్గమధురిమకు మెఱుఁగులు రాయుచు నుడివోని సతీత్వంబునఁ బెంపెసలాడుచుండు స్త్రీజనంబుతోడను, సకలశాస్త్రవిద్యల గడితేఱి కొదమసింగంపుశౌర్యంబుతో దీపించుచు రాజభక్తికి ప్రాణము లిచ్చి నాయకుల కనుసన్నల మెలఁగుచుండు భటాగ్రేసరులతోడను, రాష్ట్రైకకుటుంబభావము మెఱయఁ బరస్పర మవ్యాజవాత్సల్యము నెఱపుచు నఱమఱలు లేక సుఖముండు ప్రకృతివర్గంబుతోడను, గ్రిక్కిరిసి యప్పురవరంబు సాటిలేక సర్వవిధబలసమున్నతమై శోభిల్లెను.

రాజ్యాంగము

1. రాజు

ఆ కోసలదేశంబు నిక్ష్వాకువంశరాజన్యులు వంశానుక్రమముగాఁ బాలించుచుండిరి. ప్రకృతచరిత్రకాలమున దానిని దశరథుఁ డను మహారాజు అయోధ్యానగరము రాజధానిగా నేలుచుండెను. ఆరాజ శిఖామణి వేదవేదాంగతత్త్వవేత్తయు దూరదర్శియునై ధర్మమెడయక బహుయజ్ఞములాచరించుచు మహాగాంభీర్యముతో వర్తించుచుండెను. ఆఁడు ట్లనుల్లంఘ్యశాసనుఁడును దురాసదుఁడునై యుండినను వాని యెడఁ బౌరజానపదులకుఁ గలప్రీతి యింతనరాదు.

2. మంత్రులు

దశరథునకు ధృష్టి, జయంతుఁడు, విజయుఁడు, అర్థసాధకుఁడు, సిద్ధార్థుఁడు, సుమంత్రుఁడు, అశోకుఁడు, మంత్రపాలుఁడు అనువారు మంత్రులుగా నుండిరి. వారెల్లరు నీతివిద్యానిపుణులును జితేంద్రియులును దృఢవిక్రమములునై యథానచన మొనర్చుచుఁ దేజఃక్షమాయశఃకీర్తులతోఁ గ్రీడించుచుండిరి. మతియుఁ గోపవశంబునఁగాని కామపరితంత్రత వలనఁగాని యర్థసంపాదననిమిత్తమునఁగాని వారు కల్ల వచింపరు. స్వపరరాజ్యంబులందుఁ ద్రికాలవిషయంబులు వారెఱుంగనివి గలుగవు. ధర్మాచరణంబునఁ బక్షపాతమును గోశసంగ్రహణంబునఁ బరాఙ్ముఖను వారియెడఁ జూతమన్నను గానరావు. వారిమాట యన్నంతనే వేద వాక్యముఁగాఁ బ్రజలు తలఁదాల్తురు. వేయేల! నిష్కామకర్మయోగమును బ్రచురించుటకై భగవంతుఁడు వారిని సృష్టించి యందు నిల్పెనో యన నొప్పిరి.

3. గురువులు

దశరథునితపఃఫల మెట్టిదో గాని వానికి సచివులట్లు గురువులును సంప్రాప్తమైరి. అందు వశిష్ఠవామదేవులు ముఖ్యులు. ఆబుుషిసత్తము లిఱువురు వానికిఁ బురోహితులై కందోయికరణి వెలయుచు నతని యభిమతంబులఁ గురియింతురు. జేఁడును వారి హితవచనంబుల నాజ్ఞా రూపంబున భావించి వర్తించుచుండెను.

ధర్మ పరిపాలన ఫలము

అట్లు సత్యసంధులైన మంత్రులెనమండ్రుగురు దీక్షాక్షభుజంబులు వోలెఁ జెలువారఁగా మహాతపోధనులగు ఋష్యశృంగాదులిరువురును గురువులై నేత్రద్వయముపగిది నొప్పారఁగా దశరథుని యేలుఁబఱి ధర్మపూతమై యుండెనని చెప్పనలయునా? ధర్మము సురక్షితమగుటంజేసి కాలవర్షములు గురియుచు వానిరాజ్య మెల్ల ధనధాన్యసమృద్ధమై నిత్యకళ్యాణముఁ బచ్చతోరణముగా శోభిల్లెను. వసుంధర యట్లు నిత్యసస్యాఢ్య యగుటంజేసి గోవులు కుండలఁ బిదుకుచుండెను; లేమి యెట్టిదో ప్రజలెఱుఁగరైరి; చురాశాపిశాచంబులు నిలువనీడఁ గానక యారాజ్యమునుండి స్వపరివారముతోడ వలసపోయెను; రాగద్వేషములు చన్న కారణంబున జనులెల్లరు నిష్కపటులై స్వభావధర్మమును మెట్టి లోకైకకుటుంబ భావము గలిగి కుటిల తలఁపులులేక దీర్ఘాయుష్మంతులై సుఖముండిరి. రాజ్యమెల్లఁ బ్రశాంతముగా నుండెను.

తే॥ గీ॥ శాస్త్రశిక్షిత ప్రజ్ఞాఢ్య సచివులుండఁ
బరమధర్మజ్ఞులైనట్టి గురువులుండ
రాష్ట్రరంజనపరులైన రాజులుండఁ
బ్రజకు శుభపరంపర సదా ప్రబలకున్నె?॥

దశరథుని సంతాపము

యోగభ్రష్టులలో భోగవాసనగలవారు మహారాజులుగా జనింతురు. మహారా జన్నంతనే వానికి నెందుఁ గొదువయుండదని సామాన్యులు తలంతురు. దైవగతి యట్లుగాదు. కోరిక కలంతకాలము గొదువ తప్పదని పరమేశ్వరుఁడు లోకంబునకు వేవిధములఁ జాటుచున్నాఁడు. జనులు కన్నులుండియు గ్రుడ్డివారై యీమర్మమును గ్రహింపలేక మరుమరీచికలవెంటఁ బరుగెత్తుదురు. సమస్తైశ్వర్యములున్నను వివిధ భోగము లనుభవించుచున్నను మర్త్యునకు నెండే నొకటి కొదువయుండు ననుటకు దశరథుని చరిత్రమే నిదర్శనము.

దశరథునకు వలసినంతరాజ్యముగలదు; ఎల్లభోగములును వాని యధీనములు; మంత్రులన్ననో యసదృశప్రజ్ఞావంతులేగాక స్వామి హితైకమతులు; గురువులో గురువును మఱిపింతురు. ప్రకృతివర్గమో కనుసన్నల మెలంగును; ఏకాలమందును వానిరాజ్యమందెట్టి యరిష్ట

ములు గలుగవు. ఇట్టి సిరిసంపదలతో సకలైశ్వర్యములతోఁ దులతూగుచు నెట్టి యుపద్రవములు లేని రాజ్యమందు నెలవై యెల్లయర్థములుఁ గోర్కిమీఱునట్లు గల్గినను దశరథుని దీఱనిమఃఖ మొండు బాధించు చుండెను. ఇదే దైవచిత్రము.

దశరథునకుఁ బెక్కుభార్య లుండిరి. అందుఁ గౌసల్యాదేవి పట్టమహిషి; సుమిత్రాదేవి రెండవభార్య; కైకేయి ప్రియురాలు. ఇందఱలో నొక్కతెయైనను వంశాంకురంబును గాంచు నోము నోచ కుండెను. ముదిమి పైకొనెను; సంతానము గలుగునట్టియాసయు సన్న గిల్లెను. ఈ యనపత్యదోషము వానినిఁ బాయక యేర్చుచుండెను.

ఉ॥ అంకెకుదారినట్టి సగరాదినరేంద్రులు ప్రోదిచేసి నా
యంకమునంగుఁగూర్చిన మహాయతకోసల రాజ్యభార మే
నింక వహింపఁజాల వయసేగుట నన్యునిపైనిమోప వం
శాంకురమింతలేదు, వగపయ్యెడు భావిగతిందలంచినన్॥

అని యా తేఁడు దురపిల్లుచు గొండొకనాఁడు కులగురువులను మంత్రులను ద్విజోత్తములను రావించి వారికిఁ దగుమరియాదలు సలిపి,

"ఉ॥ దానములం దపంబుల సదక్షిణయజ్ఞములన్ విహీనసం
తానుల కూర్ధ్వలోకసుపథంబులు వశ్యముగావు, లబ్ధసం
తానుల యెందుఁ బూజ్యు లిది తథ్యము గావున నొండు దక్కి సం
తానము నాకు నయ్యెడువిధం బొనరింపుము ధర్మసంస్థితిన్॥"

అదియునుంగాక జనులు ప్రాయికంబుగా రజస్తమోగుణవృతులై యుందురు. ఆగుణంబులకు విశృంఖలవృత్తి గలిగెనేని రాజ్యమెల్ల తాఁ అ మూఅగును. అట్టిగుణములను శాసించుచు సత్త్వాభివృద్ధి గలిగించుటయే రాజ్యపాలనమందుఁగల పరమరహస్యము. అందులకే రాజులుండుట. ఈ రజస్తమస్సులు తటాలున మూఅవు. వానికిఁ గ్రమక్రమముగాఁ బరిణామమును గలిగింపవలయును. పరిపాలనావిధాన మవిచ్ఛిన్నముగా నుండనిచోఁ బూర్వోక్తకార్యము సాధ్యముగాదు. విధానమందు దుడుకు మార్పులు గలుగకుండవలయు నన్నచో రాజవంశమునకు విచ్ఛిత్తి గలుగ రాదు. ఆ కారణంబున రాజులు సంతానము నభిలషింతురు. ఎట్లు విచా రించినను సంతానము నాకు నిహపరంబులకు రెంటికి నవశ్యముగా నున్నది. ఈపుణ్యము నోచనైతిని. కర్తవ్యమును సర్వజ్ఞులు మీరే యూహింపనగును. అయిన నొక్కటి తోఁచుచున్నది. పూర్వదుష్కృత ములు ప్రాణులయభ్యుదయంబులకుఁ బ్రతిబంధకము లగు నందురు. ప్రతి

బంధకములు విధివిహితప్రాయశ్చిత్తములవలనఁ దొలఁగు నని విందు. కానినాఁడు ప్రాయశ్చిత్తశాస్త్రమే నిరర్థకమగును. నా యనపత్య దోషము మదీయపూర్వదుష్కృతఫలముగాని యొండుగాదు. ఈ పాప నివారణమునకుఁ బ్రాయశ్చిత్తము గలుగక మానదు. రాజులకు హయమేధయాగము నిఖలదోషహరమే గాక సర్వాభీష్టప్రదమనిగూడఁ బెద్దలు వచింతురు. అది నాకు యుక్తమేని యానతీయనగును. వేఱొండుపాయము గలచో విచారింపవేఁడుదు' నని ధర్మార్థసహితంబుగా వచించెను. వాని తలంపు విని, 'రాజేంద్రా, నీసంకల్పము మాకుఁ బర మాంగీకారము; నీకోరిక ధర్మయుక్తమగుటఁ జేసి శీఘ్రఫలకారియగును; యాగ మారంభింపు' మని వారెల్లరుఁ జెప్పిరి.

దశరథుఁడు పుత్రార్థము యజ్ఞమొనర్చుట

దశరథుఁడందులకు సంతసించి, 'అమాత్యులారా, వింటిరిగదా, యాగోపకరణంబులు గూర్చి యశ్వము నధ్వర్యునితోడ సరయూకముగా వదలనగును. సరయూనదియుత్తరతీరమున యజ్ఞశాలను నిర్మించి శాంతికర్మములు కల్పోక్తప్రకారము జరిపింపవలయును. లోపంబులు గలుగవేని నిట్టిక్రతువులకు నెల్లరాజులు సమర్థులు. విఘ్నవిద్వాంసులైన బ్రహ్మరాక్షసులు యజ్ఞభంగార్థము సందులు నెమకుచుందురు. యజ్ఞము దోషగ్రస్తమేని కర్త వెనువెంట నశించును. అందువలన నిట్టిక్రతువులు సమస్తరాజయోగ్యములు గావు. మీ తోడ్పాటును నమ్మి యిది తలపెట్టుచున్నాను. సమస్తభారము మీపయినున్నది' అని పలికెను. మంత్రులు తమ యొడంబాటును దెలిపిరి. బ్రాహ్మణులు దశరథుని దీవించి యనుజ్ఞాతులై చనిరి. అంత రాజు మంత్రులను మరల రప్పించి యంతఃపురమునకుఁ జని కౌసల్యాదులకు సంగతి వినిచి వారిని దీక్షావహింపు మనెను. వారును బతివచనంబులకు వికసితవదనార విందలైరి.

దశరథునకు సుమంత్రుని హితవచనము

దశరథునకు సుమంత్రుఁడను సారథి గలఁడు. అతఁడు నయో బుద్ధులఁ బెద్దయై జోనికి బహిఃప్రాణముగా నుండెను. సుమంత్రుఁడు జోనిసంకల్పమును విని యేకాంతముగా వానిని సందర్శించి, 'దేవా, మీసంకల్పమును వింటిని. దీనింగూర్చి భగవానుఁడు సనత్కుమారుఁడు

తొల్లి ఋషులకుఁ జెప్పినవచనంబులఁ బురావృత్తముగా వింటిని. అవి విన్నవింతు నవధరింపుము.

ఋష్యశృంగుని చరిత్ర

'కశ్యపప్రజాపతికి విభండకుఁడను సుతుఁడు గలఁడు. వానికి ఋష్యశృంగుఁడు జనించును. ఆమునికుమారుఁడు పుట్టువుదొట్టి యరణ్యమునందే నివసించుచుండును. ఆకారణమున వానికి లౌకికజ్ఞానము బొత్తిగా నుండదు. అతఁడు ద్విజాతిబ్రహ్మచారి యగును. వానికాలమెల్ల నగ్నిహోత్రకార్యములందుఁ బితృజనశుశ్రూషలందుఁ గడచుచుండును.

'ఋష్యశృంగుఁడు ప్రథమబ్రహ్మచర్యవ్రతస్థుఁడై యుండునప్పుడు రోమపాదుఁ డను సంగరాజు ధర్మాతిక్రమమొనర్చును. తత్ఫలముగా వానిరాజ్యమెల్ల ననావృష్టి వ్యాపించి సర్వభూతభయావహముగాఁ జిరకాలము బాధించును. రాజు దుఃఖదీనుఁడై శాస్త్రజ్ఞులను రావించి పాపప్రాయశ్చిత్తము వేఁడును. వారు దీర్ఘాలోచనముఁ గావించి, 'రాజా, ఋష్యశృంగు నేవగనేని యిందు రప్పించి వానికి నీపుత్రికను శాంతాదేవి నిచ్చి వివాహముఁ గావింపుము; వర్షప్రతిబంధకములు దొలఁగు' నని చెప్పుసురు. ఆబుుషికుమారుని దోడితెచ్చుటకుఁగా రోమపాదుఁడు తనమంత్రిపురోహితులను నియమించును. వారు రాజాజ్ఞకు వ్యథిత మనస్కులై ఋషివలని భయమును తొలఁగించుటకుఁ దగిలి యుపాయాంతరమునఁ గార్యమును సాధింతు మందురు. రాజు సమ్మతించును. మంత్రులు మునిసుతునికొఱకు వేశ్యాంగనలను వరలింతురు. ఆ హోయలుక త్తికలు చని యచ్చికబుచ్చికములచేత ఋష్యశృంగు నాకర్షించి యతనిఁ దోడి తెత్తురు. రాజు వానికిఁ దనకూతునిచ్చి పెండ్లిచేయును. అంగదేశము సుఖనంతమగును. దేవా, భగవానుఁడు సనత్కుమారఋషీంద్రుఁ డిట్లు చెప్పెనఁట. నా విన్నది విన్నవించితి' ననెను.

దశరథుఁ డావృత్తాంతము విని హృష్టచిత్తుఁడై, 'సుమంత్రా, ఋష్యశృంగుఁడు జితేంద్రియుఁ డని చెప్పితివి. అతఁడెట్లు వారాంగనలకు వశుఁడయ్యెను? వానినెట్లు పడపుఁగొమ్మలు తోడితెచ్చిరి? ఇది సాకల్యముగా వినఁ గుతూహలమగు' ననెను. నావుఁడు సుమంత్రుఁ డిట్లనియెను. 'దేవా, మంత్రుల పంపున రూపనవయోవిలాసచతురలగు వేశ్యాంగనలు కొందఱు తరలి విభండకాశ్రమముఁ జేరి ఋష్యశృంగు

నకై వేచియుండిరి. ఒకనాఁ డమ్మునితనయుఁడు యాదృచ్ఛికముగా నమ్మినూరులున్న యెడకు వచ్చి వారి చిత్రవేషములు చూచి యాలాప గతులు విని యాశ్చర్య పరవశుఁడై వారిని డాయఁబోయెను. ఆ సుంద రాంగనలు భయనయంబులు నటించి, 'అయ్యా! ఎవఁడవు? కుల మెయ్యది? ఎందుండి వచ్చెదవు? క్రూరమృగాకులమైన యీ గహ నాంతరమున నొంటఁ జరింతువేల? నీ రూపరేఖావిలాసంబులు మాకు వింతసంతసంబులను బొంగించు చున్నవి. వినఁదగునేని నీ చరిత దెలుప వేడుదు' మని యతని బల్కరించిరి. ఋష్యశృంగుఁడు తనకత యెల్లఁ జెప్పి, ''అదిగో మా యాశ్రమము చేరువనున్నది. అటకు వచ్చి మా యిచ్చు నతిథిసత్కారంబుల గ్రహింపఁ గోరుదు'ననెను. ఆ విలా సినులు తదాశ్రమదర్శనోత్కంఠలై చని యట నర్ఘ్యపాద్యములును గందమూల ఫలంబులును గైకొని, విభండకమహర్షి వలని నెఱపు త్వరింపఁగా నందుఁ దడవుసేయ నోడి పయనమై, తాము తెచ్చిన మోదకాదిస్వాదుభక్ష్యంబులను వానికిచ్చి, 'ఋషికుమారకా, ఇవి యపూర్వఫలములు మహారుచిరంబులు; వీనిని భుజింపుము, శుభ మయ్యెడు. వ్రతచర్యాపరతంత్రులము గావున మేమిందు మసలరాదు' అని పలికి యాలింగనసత్కారపురస్సరంబుగా నతని వీడ్కొని యథా స్థానము చేరిరి.

'ఋష్యశృంగుఁ డా భక్ష్యంబులు ఫలంబులుగా యని తలంచి వాని నారగించి సంతుష్టుఁ డయ్యెను. అదిసుత యా కాంతలను వెండియుఁ జూచు కుతూహలము వానినట నిలుననీయదయ్యెను. అతఁడు నాఁటిరేయి యెట్లో గడపి వఱువాత బయలుదేరి పూర్వసమాగమ స్థలంబునకుఁ బోయెను. ఆ లీలావతులు వానిఁ జూచి లోలోన సంత సించి, 'సోమా, మా యాశ్రమపదము భవత్సమాగమమును గోరు చున్నది. మా సత్కారపూజ లంగీకరించి మమ్ము గృతార్థలఁ జేయఁ బ్రార్థింతు' మని వినయమధురంబుగాఁ బల్కిరి. అతఁడు సమ్మతించెను. వారు క్రమక్రమముగా వాని నంగదేశము చేర్చిరి. రాజేంద్రా! పరిశుద్ధ దర్పణముగూడ మాలిన్యస్పర్శమువలనఁ గప్పుదాల్చునుగదా.

'చ॥ కులుకుమిటారిచన్నవయుఁ గుందరదంబులు గెంపుమోవియున్,
బొలుపగు మేనుదీవెయును బున్నమచందురుఁబోలు మోమునున్,
దళుకుమెఱుంగు గాంతియు సుధామధుగోక్తియు హంసయానముల్,
గల నవమోహనాంగకలఁ గాంచిన బ్రహ్మయు రిమ్మచెందఁడే?'

'అట్లు ఋష్యశృంగుఁడు వచ్చినంతనే రోమపాదుఁ డెదురేగి వానికి వినయపూర్వక దండప్రణామములు గావించి యర్ఘ్య మొసఁగి, 'మహాత్మా, వ్యాజరూపంబున నిన్నిటకు రప్పించి విభండకమహర్షికి సుతవియోగమును గలిగించిన నా యీ యకార్యంబునకు నన్నా మునీశ్వరుఁడు శపింపకుండునట్లు నాకు నభయప్రదాన మనుగ్రహింపు' మని వేఁడి యా వరమును బడసి ప్రసన్నహృదయుఁడై శాంతాదేవిని వానికిఁ గూర్చి కృతకృత్యుఁడయ్యెను. ఋష్యశృంగుఁ డంగదేశంబునఁ గాలూనినంతనే జగత్సమాహ్లాదకరముగా వర్షించెను. దేశమెల్ల నూత్న వికాస మొందెను.

'రాజేంద్రా, ఋష్యశృంగునిసంగతి విన్నవించితిని. దీనికిని నీ పుత్త్రాభ్యుదయసిద్ధికిని సంబంధ మేమని యడుగ వచ్చును. ఆ విషయ మును గూర్చి సనత్కుమారుఁడు వెండియు నిట్లనియెనఁట. 'ఇక్ష్వాకు వంశమున దశరథుఁడను పరమధార్మికుఁడు జనించి కోసలదేశంబునకు రాజగును. ఆ యేనికి రోమపాదునితో గాఢమైత్రి పొరయును. దశరథుఁడు తన సుతను శాంతాదేవిని రోమపాదునకుఁ బుత్త్రికగా నిచ్చును. కొండొకకాలంబునకు దశరథుఁడు సంతానార్థము యజ్ఞ మొండు సంకల్పించి శాంతాపతియైన ఋష్యశృంగుని ఋత్విక్కుగా వరించి ప్రసవార్థము స్వర్గార్థము జన్న మొనర్చును. వానికి మహావిక్రమ వంతులును వంశప్రతిష్ఠాపనకరులు నైన కొడుకులు నలుగురు గలుగుదురు. 'రాజాగ్రణీ, సర్వజ్ఞుఁడైన యమ్మహర్షి తెలిపిన యొయ్యక మేరకుఁ జేయుటొప్పు. యథాచిత్తము''.

యాగప్రకరణము

దశరథుఁడు సుమంత్రుని విని తలయూచి వసిష్ఠునియనుమతిఁ బడసి యంతఃపురజనముతోడను మంత్రిసత్తములతోడను దరలి నదీవన పర్వతంబులు దాఁటి యంగదేశముఁ జేరి, ఋష్యశృంగు నపరవితి హోత్రునివలెఁ దేజరిల్లుచున్నవానిని సముచితవిధంబున సందర్శించి సదంపడి రోమపాదుని జేరెను. అంగరాజు తన చిరమిత్రమున కెంతయు సంతసించి వానిని గొన్నాళ్ళు తనమందిరమునుండి కదలనీయఁడయ్యెను. దశరథుఁడు శాంతాదేవికి జనకపితయగుట ఋషికుమారునకుఁ దత్పూర్వము తెలియదు. ఆ సంగతి ఋష్యశృంగుఁ డప్పుడా యంగరాజువలన విని యానందించి కోసలేంద్రునకుఁ బ్రతిపూజ లొనర్చెను.

ఇ ట్లేడెనిమిది దినములు చన్నంత నొకనాఁడు దశరథుఁడు రోమపాదుని డాసి, 'మిత్రమా, కార్య మొండు తలపెట్టి తన్నిమి త్తము శాంతా ఋష్యశృంగులను వెంటఁగొనిపో వచ్చితిని. అనుమతిఁ గోరుదు' ననెను. అంగరాజు వల్లె యని యల్లునిని దనయను సాకేతపురంబునకుఁ దరలించెను. తోడు మరలివచ్చుట నయోధ్యావాసులు దూతవలన విని మహోత్సుకులై నగరమెల్లనలంకరించి దశరథాదులు వచ్చినంతనే వారిని సమస్తమంగళవాద్యంబులతో నెదుర్కొని సముచితసత్కారంబులఁ బురఃప్రవేశ మొనర్చిరి.

అంతలో వసంతకాలము వచ్చెను. దశరథుఁడు తన చిరసంకల్పం బును నెఱవేర్చువాఁడై ఋష్యశృంగుని శిరముతోఁ ద్రెవ్వుకొ, 'మునీంద్రా, సంతానార్థము యజ్ఞ మొకటి పెద్దలయాజ్ఞాప్రకారము సంకల్పించితిని; ఋత్విక్కుగా మిమ్ము వరింతు' నని విన్నవించెను. ఆమునితనయుఁ డా ప్రణయము నంగీకరించెను. అంత దశరథుఁడు సుయజ్ఞ, వామదేవ, జాబాలి, కాశ్యప, వసిష్ఠాది తపోధనులను రావించి వారిని యథోచిత గతిఁ బూజించి, 'మహానుభావులారా, అసపత్నదోషంబునఁ బరితపించు నాకు సుఖంబును మనశ్శాంతియుఁ గడుదూర మగుట మీకు విదితము. సంతానార్థము హయమేధయాగంబును మీయనుమతితోఁ దలపెట్టితిని. విభండక మహర్షి తనయుఁడు ఋష్యశృంగుఁడు నాయెడఁ బ్రసన్నుఁ డయ్యెను. ఆ మహోత్ముఁడు నాయజ్ఞంబును యథాశాస్త్రము నిర్విఘ్నుఁ బరిసమాప్తి నొందించి నా చిరమనోరథము నీడేర్పనోపు' ననెను. వారును తము పరితోషంబును దెలిసి తేనిని దీవించి కార్యమునకుఁ బ్రేరేచిరి.

ఆసంవత్సరమంతయు నట్లు గడచి మరల వసంతము వచ్చెను.

చ॥ కీసలయముల్ మెసంగి తమకించి యథామలిఁ బాడెఁ గోయిలల్,
బిసరుహరాజివాసనలఁ బిచ్చిలి వీచెను బిల్లతెమ్మెరల్,
ప్రసవమనోజ్ఞభూషణయుఁ బల్లవరాగపరీతచేలయుం,
బొసఁగె వసుంధరారమణి, పొంపిరిపోయెను సృష్టి యెల్లెడన్॥

దశరథుఁ డంతటఁ దన కులగురువును వసిష్ఠుని రప్పించి,

క॥ హితుఁడవు మాకుఁ గులపుఁ
హితుఁడవు మహిమాతిశయసహితుఁడవగుట మో
పితి నీపయిఁ గ్రతుభారముఁ
గృతకృత్యుఁడ నగుదు నీదుకృప గురువర్యా!

అని వచించి తదనుజ్ఞాతుఁడై దేవతారాధననిమిత్తము యజన శాలఁ బ్రవేశించెను.

వసిష్ఠుఁ డంత యజ్ఞకర్మనిష్ఠితులైన బ్రాహ్మణవృద్ధులను, యాగోచిత పదార్థసంపాదనాధికృతులైన పెద్దలను, గర్మాంతికులను, శిల్పక వర్ధక ఖనకగణకులను, నటీనర్తకులను, శాస్త్రప్రయోగవేత్తలను, దదితరులను, బిలిపించి సభగూర్చి, 'సభాసదులారా, మ్రోనిసంకల్పమును వింటిరి గదా. అది యేతన్మాత్రకార్యము గాదు. త్రయీధర్మమూర్తులగు ద్విజోత్తములు వేలకొలఁది రానున్నారు. దేశదేశాంతరములనుండి రారాజులు పెక్కురు వత్తురు. పౌరజానపదులకు లెక్కయే యుండదు. బ్రాహ్మణులకుఁ దగువసతిగృహములు కట్టవలయును. నరపాలురకు యథోచితముగా విడుదులను నిర్మింపవలయును. ఇతరవర్ణములకుఁగా నెన్ని శాలలఁ దీర్పవలయునో తెలియరాదు. వారివారికిఁ దగినట్లుగా స్నానపానాదులకు భక్ష్యభోజనంబులకు నేర్పాట్లు జరుగవలయును. ఎవరికి నెందుఁ గొఱఁత గలుగరాదు. ఎల్లరకుఁ దగినట్లు మరియాదలు గావింపవలయును. ఈభారమునెల్ల మీఁడు మనపయి మోపెను. కీర్తికి నపకీర్తికి మనమే కాధ్యుల మైతిమి. రాజ గౌరవంబును గార్య భారంబును దలఁచి సొంతపనిగా దీనిని భావించి యెల్లరు వర్తించునది. స్నేహవశంబుననొండె మతేదేని నిమిత్తముననొండె బుట్టపురువునకుఁ గూడ ననాదరణము గలుగరాదు. వేయేల ? మనరాజభక్తికి మన ప్రతిభావిశేషంబునకు మనకార్యదక్షతకు మనయైకమత్యమునకు మన మనోనిశ్చయమునకుఁ బరీక్షాసమయము వచ్చినదని గ్రహింపుఁడు. ఎట్లునిర్వహింతురో తెలియ' దని చెప్పి వారివారి నయ్యాపనులందు దిట్టపఱచి, సుమంత్రుని బిలిచి, 'మంత్రివర్యా, చతుస్సముద్ర ముద్రిత వసుమతీవలయంబునఁ గల నరేంద్రులకెల్ల సందేశమును బుత్తెంపుము. సమస్తదేశజనులను బిలిపింపుము. సకలవేదశాస్త్రనిపుణుఁడును మహాభాగుఁడునైన మిథిలాపతి జనకమహారాజు మనకెనిమిది జిరమిత్రము. ఆ జనపాలునొద్దకు నీవు స్వయముగా మొట్టమొదటఁ జని సంగతి విన్నవించి వానిని దోడితెమ్ము. కాశీనాథుఁడు మనరాజునకుఁ బరమాప్తుఁడు. అంగాధిపునిసంగతి తెలిసియేయున్నది. కేకయరాజుఁ గూర్చి వేఱ చెప్పనక్కఱ లేదు. వీరినెల్ల నీవు స్వయముగా నాహ్వానింపవలయును. ప్రాచీ ప్రభువులకు సింధురాజులకు సౌవీరసౌరాష్ట్రదాక్షిణాత్యపార్థివులకుఁ దగురూపంబున సందేశ మందించి వారు సబాంధవముగా వచ్చునట్లాన

ర్పుము. బ్రాహ్మణాదులకు నెఱుకచేయుము. దేశమందెల్లఁ జాటింప నాజ్ఞాపింపుము' అని నచించెను. సుమంత్రుఁడట్లే యని ప్రాచ్యాది దేశాధీశుల యొద్దకు నాంతరంగికులను బంపి యితరులకు నేర్పాట్లు గావించి తాను స్వయముగా జనకాదులకొఱకుఁ దరలెను. ఎల్లరును తమతమ నియమిత కార్యములను గూర్చి ప్రతిదినము వసిష్ఠునకు శ్రుత పఱుచుచు వానియాజ్ఞలు పడయుచు శ్రద్ధాభక్తులతో వర్తించిరి. ఎల్లకార్యములును గడపుమేరకు సమాప్త మయ్యెను.

యజ్ఞారంభము

యాగారంభమునాఁటికి ద్విజోత్తములు వేనవేలు గూడిరి; భూపతులు పెక్కండ్రు సపరివారంబుగా వచ్చిరి; పౌరజానపదులు వెల్లి విరిసిరి. మణిమాక్తిక ధనకనక వస్త్రాద్యుపాయనంబులు రాసులుపడెను. బ్రాహ్మణసత్తములు ఋష్యశృంగుని మున్నిడుకొని యజ్ఞ మారంభించిరి. వేదమూర్తులైన యాజకులు శాస్త్రవిధి న్యాయంబులఁ బొల్లుపోనీయక ప్రవర్గ్యము ఉపసత్తు మున్నగు కర్మంబు లొనర్చిరి. మునిపుంగవులు కర్మాధిదేవతలను బూజించి ప్రాతస్సవనాదులఁ గావించిరి. ఇంద్రుఁడు తన హవిర్భాగమును గ్రహించెను. మాధ్యందినసవనము యథాక్రమము జరిగెను. రాజార్థము తృతీయసవనంబును యథాశాస్త్రము నిర్వర్తించిరి. యాగప్రక్రియ యెల్ల సక్రమముగా జరుగనాగెను.

భోజనాదికము

భోజనశాలలందు నిసుము చల్లినను రాలదయ్యెను. వచ్చువారికిఁ బోవువారికిఁ దెంపు గలుగదు. ప్రతిపదార్థము రుచ్యమై యెంతభుజించినను దనివిపోకుండెను. కొసరికొసరి వడ్డించుచుండిరి. చాలుఁ జాలు వలదు నలదన్నమాటలు తప్ప యెండు వినరాకుండెను. పండితులొకవంకఁ దమప్రాగల్భ్యమును బ్రదర్శించుచుండ, హేతువాదకులొక ప్రక్కఁ దమప్రతిభావిశేషంబును వెల్లడించుచుండఁ గవీంద్రులొకచాయ నవనవకల్పనలచేత భావప్రపంచంబును బ్రతిష్ఠించుచుండ, నైయ్యాకరణులొకచక్కి మహాకవిప్రయోగములను విమర్శించుచుఁ బూర్వపక్ష సిద్ధాంతము లొనర్చుచు స్వమతస్థాపనార్థము పోరాడుచుండ, రసికులొకయోరఁ గవిహృదయంబులు విచ్చి ప్రచురించుచుండ, జ్యోతిష్కులొకచోట గోళగోళాంతర రహస్యంబులను జాటుచుండ, వైదికులొకవలను శ్రుతులకు స్వరములు మేళవించి పదక్రమజటాఘనములు

పలుకుచుండఁ, గాయకు లొకక్రేవ నవనవరాగంబులు గూర్చి మధుర మధురంబుగాఁ బాడుచుండ దద్బోధనశాలలు వివిధ కళాదేవతల కొలువుకూటములో యన శోభిల్లెను.

మ॥ అవనీమండల మట్లె యీసె ననఁగా నాబాలవృద్ధంబుఁ ద
త్సవనార్థం బరుదెంచి యందు బహుమృష్టాన్నాది సంతుష్టులై,
భవసాఫల్యము నాఁడు గల్గె ననుచున్ భావించి యాజన్మ మా
జవనంబుం గొనియాడుచుండుదురు వాచాసూఢి దీపింపఁగాన్॥

యజ్ఞవేదికా నిర్మాణము

యజ్ఞశాలయందుఁ గొన్నికంబములను నాటు సంప్రదాయము గలదు. ఆ కంబములను యూపములందురు. ఒక్కొక్కయూపము నిరువదియొక్క మూర పొడవుండును. ప్రతి యూపంబు నెనిమిదియంచులుగాఁ దీర్తురు. యజ్ఞముంబట్టి యూపసంఖ్య యుండును. అశ్వమేధ యాగంబున కిట్టి యూపంబు లిరువదియొండు వలయును. అందు నాఱు మారేడి యూపంబులు, నాఱు మోదుగయూపంబులు, రెండు దేవదారు యూపంబులు, నొక్కటి విరిగియూపంబుగా నుండును. యజ్ఞకోవిదులట్టియూపంబులను సంతరించి వానికి బంగారు పొదివి వస్త్రగంధ పుష్పంబుల నలంకరించి బారెఁడేసి దూరమున నొక్కొక్కటి స్థాపించి యాయాదేవతోద్దేశంబుగా మృగపక్షిపన్నగములను గట్టిరి. యాగీ యాశ్వము బంధింపఁబడెను. శుల్బకర్మజ్ఞులైన విప్రులు యథాశాస్త్ర మిటుకలు చేసి యాఱుప్రస్తారములు దీర్చి ప్రతి ప్రస్తారమునకు మూఁడేసి యిటుకలుచొప్పునఁ గూర్చి బంగారు తెక్కల గరుడపక్షిరూపంబున యజ్ఞవేదికను నిర్మించిరి.

యజ్ఞదానాదికము

కౌసల్యాదేవి సపత్నులతోడ నచ్చి యజ్ఞీయాశ్వమునకుఁ బ్రదక్షిణ మొనర్చి బంగారు సూదులు మూఁడు దానిమేనఁ గ్రుచ్చి ధర్మకాంక్షఁజేసి స్థిరచిత్తయై యా రాత్రి యొంటరిగా నుండెను. తెల్ల వాఱి దశరథుఁడు తన ఋత్విగ్బ్రహ్మకుఁ బట్టమహిషిని హోతకు వావాతను, ఉద్గాతకుఁ బరివృత్తిని, అధ్వర్యునకు బాలాకలిని దాన మొసఁగెను. వా రానల్వురు స్త్రీలను శాస్త్రమర్యాదవలన గ్రహించి తత్ప్రతి ద్రవ్యదానమును జేకొని వారిని మరల జేసి కిచ్చిరి.

యజ్ఞాశ్వహోమాదికము

అధ్వర్యుడంత యజ్ఞాశ్వంబు వపను దీసి హోమము మొనరించెను. దశరథుఁడు నిజపాపనివృత్తికై తద్వసాధూమగంధము నాఘ్రాణించెను. ఋత్విజులు పదునార్గు రంతట నయ్యశ్వావయవములను యథా శాస్త్రము మంత్రపూర్వకముగా వేల్చిరి.

ఇతర యాగములందు హవిస్సును జువ్వికొమ్మలందు సంస్కరింతురు. అశ్వమేధంబునఁ బ్రబ్బలి తీఁగెలందు దానిని సంస్కరించుట సంప్రదాయము. కల్పసూత్రములనుబట్టి వేదోక్తులనుబట్టి హయమేధ యాగము మూఁడుదినములు నడచును. అందుఁ దొలిదినము చతుష్టోమ మనియు, రెండవదినము ఉక్థ్యమనియు, మూఁడవదినము అతిరాత్ర మనియుఁ బేర్కొందురు. మఱియు జ్యోతిష్టోమము ఆయుష్టోమము అతి రాత్రద్వయము అభిజిత్తు విశ్వజిత్తు మున్నగుమహాక్రతువులు శాస్త్రాంత రములందుఁ గలవు.

దశరథుడు వానినెల్ల ఋత్విక్కులప్రేరణంబునఁ గావించి, హోతకుఁ దనరాజ్యమందుఁ దూర్పుభాగంబును, బ్రహ్మకు దక్షిణ భాగంబును అధ్వర్యునకుఁ బశ్చిమభాగంబును ఉద్గాతకు నుత్తరభాగం బును విధివిహితంబుగా దక్షిణార్థ మిచ్చి క్రతుసమాప్త మొనరించెను. ఋత్విక్కులు తేని గుణశీలత్యాగంబులకు మెచ్చి

చ॥ జపముల పీతిహోత్రముల జన్మముఁ బుచ్చెదు మాకు రాజ్యముల్
నృపతికులావతంస! యగునే? వల దీకయిగాళ్లి సంకెలల్;
కృపదయివాఅ నిందులకు నెయ్యదియో యిసుమంత యిచ్చి మా
కుపకృతమైన రాజ్యమును నొందుము నీ క్రతువుల్ ఫలించెడన్.

అని యేకగ్రీవముగ వచించిరి. దశరథుఁ డంతట గోసువర్ణరజ తంబుల వారిని యథోచితముగా సత్కరించెను. వారును బరమపరితోషులైరి. ఇతర బ్రాహ్మణులకు బొక్కసమెల్ల వ్యయమయ్యెను. ఆ విప్రులు వాని వినయనయదాతృత్వాది కళ్యాణ గుణంబులకుఁ బరమప్రీతులై కల్పోక్తాశీర్వచనంబులను వానిపయిఁ గురిసిరి.

పుత్రకామేష్టి

అశ్వమేధయాగమును దశరథుఁడట్లు సమాప్తము గావించి ఋష్యశృంగుని సమీపించి దోయిలొగ్గి, 'మునీంద్రా, సీయనుగ్రహము

పేర్మి హయమేధయాగము నిర్విఘ్నముగాఁ బరిసమాప్త మొందెను. పుత్త్రిప్రతిపాది యగు సత్కర్మము మాత్రము మిగిలియున్నది. దానిని జరిపింప భవదన్యులు సమర్థులు గారు. నాప్రణయము మనస్కరించి నన్ను సఫలమనోరథునిగా నొనర్పు' మని ప్రార్థించెను. ఋష్యశృంగుఁడు హర్షించి, 'రాజేంద్రా, వంశకర్తలగు పుత్త్రుల నల్వురఁ బడయుదు' వని మహాప్రియవాక్యమును బలికి క్షణమాత్రము ధ్యానగతుఁడై కనుపించ్చి, 'రాజచంద్రమా, అథర్వశిరఃప్రోక్తమగు పుత్త్రికారకమంత్ర మొండు గలదు. ఆ మంత్రపూర్వకంబుగా యాగ మొకటి నీవలనఁ జేయింతు' నని చెప్పి యాక్రతువు నారంభించి మంత్రదృష్టకర్మప్రకారము హోమము గావించెను.

యజ్ఞార్థము వచ్చిన బ్రహ్మతో దేవతలు మొఱపెట్టుట

హవిర్భాగములను బరిగ్రహింప దేవతలును యాగమును జూచుటకుఁగా గంధర్వ సిద్ధచారణాదులును వచ్చిరి. నలువయు నరు దెంచెను. నిర్జరాదులు పరమేష్ఠిని గాంచి, 'తండ్రీ, మీమాటను నమ్మి యిన్నాళ్ళు సైరించితిమి. రావణుని దుండగములు నానాటికిఁ బెచ్చు పెరుగుచున్నవి. వాని ధాకకు నిఁక నిలువరింప నోపము. ఇదంతయు నీవు వాని కిచ్చిన వరంబుల ఫలము. ఆలోకవిద్రావణుఁడు ముజ్జగంబులను బీడించుచు దిక్పాలురను ద్వేషించుచు నుండుటయ గాక యింద్రుని పదచ్యుతికి నెసరుపెట్టి యున్నాఁడు. వానిఁజేసి మహర్షుల తపంబులు సాగవు; గంధర్వుల విహారంబు లుడిగెను. వాయువు యథాగతి వీవఁడు; సముద్రుఁడు నిస్తరంగుఁడై మనుకరించుచున్నాఁడు; ఎప్పుడేమి సంభవించునో యని మేమెల్లరమును బిక్కిటఁ బ్రాణములఁ బట్టుకొనియున్నాము. ఆకూళ యుండునందాఁక మాకు లగ్గు గలుగదు. వెఱవ్వఁ దలఁప వేడుదు' మని సాగిలఁబడిరి.

దేవతలను బ్రహ్మ యోదార్చుట

పరమేష్ఠి వారి దీనాలాపము లాలకించి, 'నిర్జరులారా, దేవత్వము వచ్చినంతమాత్రానే మీరు సుఖదుఃఖాదులకు నతీతులు గాఁజాలరు. దేహాభిమానమున్నంతవరకు సుఖదుఃఖాదిద్వంద్వ కోలాహలము తొలఁగదు. కావున మీభ్రాంతిని వదల నగును. మఱియు మీక్లేశములెల్ల నావలనఁగలిగెనని మీరు భావించుచున్నారు. ఇది భ్రాంతిమూలకము గాని వేఱుగాదు. రావణుఁడు నన్ను గూర్చి తపంబాచరించుటయు

వాంఛితార్థములను బడయుటయు సత్యమేగాని వానియభీష్టముల నేనిచ్చితి నని మీరుతలంచుటమాత్రము సరిగాదు. తపస్సునకు ధ్యానము ముఖ్యాంగమగును. ధ్యానమునకు మనోనిశ్చలత్వము వలయును. మనస్సు సహజచంచలము గావున నెల్లరకు దానిని బంధించుట సులభకార్యముగాదు. మనస్సును గట్టివై చుటకు దానిని దేనియందై ననునిలుపవలయును. ఇతరోపాయము గలుగదు. ఒకదానియందు మనస్సును నిలిపి ధ్యానించుటను సాలంబనధ్యాన మందురు. ఇట్టిచోట్ల మేము ధ్యానమునకు లక్ష్యభూతులమై నిమిత్తమాత్రులమగుచున్నాము. అంతియగాని వేఱుగాదు. ధ్యానమూర్తులు వాంఛితార్థముల నిచ్చుటయే సత్యమైనచో వారు తమకు ముప్పగలుగు వరంబు లిత్తురా? మఱియు మేమెల్లరము లోకకళ్యాణార్థ ముందుము. అట్టి మేము లోకోపద్రవ కరంబులైన వరంబుల నిత్తుమా? అట్లుచేయుట మాకే హాని గదా. కావున మా వరంబులబలంబున రావణాదు లిట్లొనర్చుచున్నారను నింద మాకు మూటగట్టవలదు.

తపస్సు - వాంఛితార్థసిద్ధి

అట్లగునేని తపోనిష్ఠులకు వాంఛితార్థసిద్ధి యెట్లు గలుగునంచురా? ఆ రహస్యము వినుము. ప్రతికర్మమునకు ఫలము మాత్రము భగవన్నిర్ణీతము. ఫలరహితమైన కర్మమే గలుగదు. తపస్సుగూడ నొకవిధమైన కర్మమే గావున దానికిని ఫలము తప్పక కలుగును. కర్మములన్నో వారివారి ప్రారబ్ధవాసనల ననుసరించియుండును. వాసనలు గుణములను బట్టి యుండును. గుణరహితమైన వస్తువే గలుగదు .కావున గుణములు వాసనారూపంబునఁ గర్మప్రేరకంబులగును. వేయేల? సృష్టియెల్ల గుణముల కార్యమేగాని వేఱుగాదు. ఈగుణములు సత్త్వరజస్తమస్సులని మూఁడు విధములు. ఏగుణము పెంపుగా నుండునో యావిధమైన వాసనయు దాని ననుగుణమైన కర్మమును గర్మానుగుణమైన ఫలమును గలుగుచుండును. కావునఁ బ్రాణులే తత్తత్కర్మ ఫలములను గలిగించుకొనుచుఁ దత్ఫలము ననుభవించుచున్నారు. సత్త్వగుణ భూయిష్ఠులకు మోక్షము పరమప్రాప్యమగును. రజోగుణవంతులకు భోగభాగ్యోన్నతులు పరమప్రాప్యములుగా నుండును. తామసులకుఁ బరాపకర్షణము సంతోషకరమై యుండును. ఎవరు దేనినిగోరి ప్రయత్నింతురో వారు దానినే పడయుదురని మున్నే సూచించియున్నాను. మే మిత్తుమనుట నామమాత్రము.

ఈయత్నసిద్ధి యుద్యమవేగమునుబట్టి యుండును. ఉద్యమము తీవ్రమనియు సామాన్యమనియు మందమనియు ముత్తెఱఁగులు. తీవ్రోద్యమము సద్యఃఫలకారియగును. తక్కినవి రెండును గాలాంతరమున ఫలించును.

రావణుఁడు రజోగుణభూయిష్ఠుఁడు గావున వానికిఁ దైర్యలోకాధిపత్యాదులందు రుచి జనించెను. ఆ తలంపుతో నతఁడు మహాతీవ్రతపం బాచరించి సిద్ధిగాంచెను. ఇట్టికోరికగలవారు తమకు నెమరుగాని చావు గాని యెల్లరు. రావణుఁ డట్టికోర్కితో దేవదానవయక్షరాక్షస గంధర్వాదులవలనఁ దనకు మరణము గలుగకుండునట్లు సంకల్పించి మహోగ్రతపంబొనర్చెను. వానిసంకల్పము సద్యఃఫలకారి యయ్యెను. తత్ఫలంబుగా మీకిట్టి యగచాట్లు గలిగెను. ఇవి మీకు సహింపక తీరదు.

గత్యంతరములేదా యని దిగులుపడవలదు. ప్రాణిమాత్రులకు సర్వామరత్వము గలుగదు. కావున రావణునకుఁ జావు గలదు. వాని నెదుర్చువారెన రందువా? దేవాదులవలనఁ జావులేకుండునట్లు వాఁడు సంకల్పించెనేగాని మర్త్యమాత్రునిఁ గలలోఁ గూడఁ దలఁపఁడు. ఆ కారణంబున వాఁడు తుదకు మర్త్యునివలనఁ జావనున్నాఁడు' అని పలుకుచుండఁగా

శ్రీ మహావిష్ణు సందర్శనము

సీ॥ నీలమేఘముఁడాలు నిరసించి చెలువాయు
కమనీయతర దేహకాంతివాఁడు
అంభోజములచొప్పు నపహసించుచు నొప్పు
శ్రవణాంత దీర్ఘనేత్రములవాఁడు
నిండుచందురుసొరు నిగనిగల్ వెదచల్లు
మొలకనవ్వుల తేఁట మొగమువాఁడు
క్రొమ్మించు నునుదళ్కుఁ గిమ్మించుసొబగారు
పసఁపుఁబుట్టముతోడఁ బరగువాఁడు,

గీ. శంఖచక్రములు గ్రాలు హస్తములవాఁడు,
డంబుమీఱు శ్రీవత్సవక్షంబువాఁడు,
పక్కిరాయనిపై నెక్కిపరచువాఁడు,
శ్రీమహావిష్ణువఁట దోఁచెఁ జెలువుమీఱి.

శ్రీ విష్ణువునకు దేవతలు మొఱలిడుట

అట్లు వైకుంఠంబునుండి వచ్చిన యమ్మహానుభావునకు నింద్రాదులు ప్రణమిల్లి, 'శ్రీతజసరక్షకా, లోకంబులయోగక్షేమంబులు భవదధీనములు. నీవే మాకు దిక్కు. రావణుఁడు విరించివరగర్వోద్ధతుఁడై మమ్ముఁ బెట్టుబొము లెన్నరాదు.

సీ॥ అమరల నిర్జించె నతివల బంధించె
నందనోద్యానము నలువఁబాపె,
దాపసుల నదల్చెఁ దపముల మఱిపించె
నాశ్రమసీమల నడఁగఁ ద్రొక్కె,
యాజుల గర్జించె నగ్నిహోత్రము లార్పె
సవనతంత్రంబుల జక్కడంచె,
జక్కుల మర్దించె శమనుని నోడించె
ముల్లెగా నవనిధుల్ గొల్లలాడె,

గీ॥ వెలుఁగురాయనిఁ గనుసన్న మెలఁగఁజేసెఁ,
జలువఁజేనికిఁ గాల్బంటుకొలువు నిచ్చెఁ
బవనుచేతిలో సీవిరుల్ పట్టపెట్టెఁ
జెప్పరాదు మాకడగండ్లు శ్రీనివాస.

దేవా, స్త్రీలు మానంబునకై ప్రాణంబు లుంకున పెట్టుచున్నారు ఆ దీనురాండ్ర దుఃఖారావములు వినవా? ధర్మము దిక్కోఁది మిణకరించుచున్నది. దాని మురవస్థయేని గనవా? మా మొఱ లాలకింపవా? మాయెడఁ గనికర ముదయింపదా? నాఁడు మాకిచ్చిన మాటను దలంపవా? నిర్జరాదులు రావణునిఁ జెనక నోపరు. నడుమనివలన వానికి మరణము సిద్ధము. మానిమిత్తమును లోకరక్షణార్థమును నీవు మనుజావతారంబును గ్రహింపక తప్పదు. అందులకు సమయముఁగూడఁ బ్రత్యాసన్నమై యున్నది. దశరథుఁడు పుత్త్రార్థియై యీయాగ మొనర్చుచున్నాఁడు. ఆ జోడు ధర్మపరతంత్రుఁడు; అతనిభార్యలు మున్గురు శ్రీహ్రీకీర్తులకు నెనయగుదురు. దీనజనకల్పకా, నీ యాత్మను నాల్గుగా విభజించి నలువురు పుత్త్రులుగా వారియం దవతరింపనోపును. నీయవతారంబునఁ గాని మాకుఁ బ్రమకులు గలుగవు' అని బహుభంగుల హరిని ప్రార్థించిరి.

శ్రీ విష్ణువు దేవతలనోదార్చుట

విష్ణువు వారి ప్రణయంబులు విని, 'వేల్పులారా, భయంబులు మానుఁడు; శుభ మగును. మీకోరినట్లు మర్త్యావతారమెత్తి లోక కంటకుఁడైన రావణుని బుత్త్రమిత్రజ్ఞాతిసహితంబుగా వధించి దేవర్షి సాధుజన స్త్రీలోకశ్రేయస్కరంబుగా సాగరమేఖలావలయిత ధాత్రీ తలంబును బాలించుచు భూలోకంబునఁ బదునొకండువేల దివ్యవర్షంబులు నివసింతును. సుఖముండు' మని యభయంబు వారి కిచ్చి యంతర్హితుఁడయ్యెను.

ప్రాజాపత్యపురుషుఁడు దశరథునకుఁ బాయసమిచ్చుట

అట హోనుము పరిసమాప్తమైనంతనే యయ్యాహవనీయాగ్ని కుండమునుండి యొక పెనుభూత ముదయించెను. ఆ భూతము శైలశృంగ సమున్నతమై నీలరక్తాంబరము దాల్చి రక్తాస్యముతో, సింహరోమంబులఁ బోలు గడ్డము మీసము తలనెఱ్ఱికలతో, సూర్యతేజంబున మెఱయు దివ్యాభరణములతో దీప్తానలజ్వాలామాలికను ధిక్కరించు తేజస్సుతో మహాభయంకరముగాఁ జూపట్టుచు సువర్ణపాత్రము నొండు చేదోయి నిడికొని దశరథుని కభిముటి నిలిచి, 'రాజా, ప్రజాపతిపంపున వచ్చితి' నని దుందుభిస్వరంబునఁ బలికెను. సభాస్తారులెల్లరు నిర్ని మేషులైరి. దశరథుఁడు కేలుమోడ్చి భయభక్తులు పిరిగొన లేచి, 'దేవా, స్వాగతము; ఆజ్ఞ వేఁడుదు' ననెను. ప్రాజాపత్యపురుషుఁడు మఱికొంత డాయ వచ్చి, 'రాజా, దేవతల నారాధించిన ఫలంబుగా నీకీపాయసము సంప్రాప్తమయ్యెను. ఇది విష్ణునిర్మితము; దీన నీకు సంతానాదిసకలైశ్వర్యములు సమకూడును. దీనిని గోనిపోయి యనురూపులగు నీపత్నులకు నొసంగుము. వారు దీనిని సేవించి హయమేధపుత్త్రికామేష్టిఫలంబులో యన నొప్పారు తనయులను బడయుదురు. నీమనోరథము నెఱవేఱు' నని చెప్పి యాపాత్రనిచ్చి యయ్యగ్నికుండమం దేతికోహితుఁడయ్యెను. దశరథుఁ డాపాయసపాత్రను నొదల గ్రహించి రాజవర్గంబును సముచిత సత్కారంబుల వీడ్కొని యంతఃపురమునకుఁ బోయెను.

వానరావతారఘట్టము

అంత బ్రహ్మ యింద్రాదులను బిలిచి, 'వేల్పులారా, భగవంతుఁడు శ్రీమన్నారాయణమూర్తి మనమొఱ లంగీకరించి ధర్మరక్ష

కార్థము లోకహితంబు పొంచె మర్త్యలోకంబున నవతరింపనున్నాఁడ. అవతారము లీలామాత్రము గావున సర్వేశ్వరుఁడయ్యు నమ్మహాను భావుఁడు మర్త్యుల మర్యాద వర్తింపక తప్పదు. మీ కార్యార్థము వానికిఁ గామరూపులును మహాబలశాలులు నైనవారు తోడ్పడనలసి వచ్చును. ఒక చోట వాయుజననులతోఁ బనివడును; ఒక చోట నీతి శాస్త్రవేత్తల యక్కఱ గలుగును; ఒక్కొక్కసారి చతురుపాయ విదులు వలసివత్తురు; అజరామరణులొకతఱి యనసరమగును. దేవాంశ సంభూతులు దక్క నన్యు లిందులకుఁ జాలరు. మీకుఁ బార్వతీశాపము గలదు. ఆకారణంబున మీకు స్వక్షేత్రసంతానము చేకూఱదు. గంధర్వ యక్ష ఋక్ష పన్నగ కిన్నర వానర విద్యాధరాప్సర స్త్రీలయందు మీరు మీయంశంబుల నవతరింపనగు. రాక్షసులకు వానరులచేత మృత్యువు సిద్ధము. అట్లు నందికేశ్వరశాపము గలదు. అది నేఁడు సార్థకము గానున్నది. ప్రాయికంబుగా వానరరూపజననము యుక్తము. ఈ సంకల్పముచేతనే భల్లుకేశ్వరుని జాంబవంతుని మదీయ వక్త్రజృంభ ణంబునఁ బుట్టించితి' ననెను.

అంత దేవేంద్రుఁడు వాలిని, సూర్యుఁడు సుగ్రీవుని, సురా చార్యుఁడు తారుని, గుబేరుఁడు గంధమాదనుని, విశ్వకర్మ నలుని, వైశ్వానరుఁడు నీలుని, అశ్వినీదేవతలు మైందద్వివిదులను, దమతమ యంశంబులఁ బుట్టించిరి. వరుణునకు సుషేణుఁడుఁ, బర్జన్యునకు శరభుఁ డును జనించెను. వాయువువలన మహాబలపరాక్రమబుద్ధిసంపన్నుఁడును వజ్రకాయుఁడునైన హనుమంతుఁ డుద్భవించెను. అన్యదేవతలు వేనవే లితరులను గనిరి. వారెల్లరును గోతిమూతులు దాల్చి బలపరాక్ర మంబులఁ దండ్రులను దలపించుచుఁ గామరూపులై రావణవధార్థము బాల్యముదొట్టి వ్యాయామక్రీడలరూపంబున సాము నేర్చుచున్నారో యన శైలంబుల నూటాడుచు వృక్షంబులఁ బెకలించుచు సముద్రంబు లంఘించుచు భూమి ద్రవ్వుచు నంతరిక్షంబునఁ జరించుచు మత్తమాతంగ సింహశార్దూలాది నన్యస త్త్వంబులతోఁ జెల్లాడుచు వైనందినవర్ధమాన తేజోవిక్రాంతులై, వాలిని రాజుగా సుగ్రీవుని యువరాజుగా నలనీల హనుమంతులను మంత్రులుగా మతికొందఱను యూథపతులుగా నియమించుకొని ఋష్యమూకపర్వతంబునఁ గొందఱును బర్వతాంతరంబులఁ గొందఱును గీకారణ్యంబులఁ గొందఱు నాశ్రయించిరి.

శ్రీరాముల జననము

దశరథుఁడట్లు పాయసపాత్రను గొనిపోయి సంతోషచంద్రికలు గురియుచున్న దేవేరులఁ జేరి పాయసంబును దైవచోదితబుద్ధిఁ జేసి విభాగించి,

గీ॥ సగమొసంగెఁ గౌసల్యకు సగములోన
సగము నిచ్చె సుమిత్రకు మిగతలోన
సగముఁ గైకేయికి నిడి యా సగము తెచ్చి
మరల నిచ్చె సుమిత్రకు మమతతోడ.

ఆ పాయసంబును వారు సేవించి సూర్యాగ్ని తేజోవిలాసనతులై కాలక్రమంబున గర్భంబులు దాల్చిరి. బ్రోద్దులు నిండెను. చైత్రశుక్ల నవమీ బుధవార పునర్వసుచతుర్థపాదంబునఁ గర్కటలగ్నమందు రవి గురు శని శుక్రాంగారకులు స్వోచ్చస్థానంబుల నలంకరించి గురు వుతోఁ జంద్రుఁడు రవితో బుధుఁడుఁ గూడి తనరారు శుభముహూర్తం బున జగన్నాథుఁడు సర్వలోకనమస్కృతుఁడు మహాభాగుఁడు శ్రీమన్నారాయణమూర్తి సమస్తశుభలక్షణలక్షితుఁడై లోకకళ్యా ణార్థము కౌసల్యాదేవిగర్భంబున నవతరించెను. మఱునాఁడు దశమీ గురువారపుష్యమీనాదిత్రంబున మీనలగ్నమందుఁ గైకేయీగర్భంబున సత్యపరాక్రముఁడగు సుతుఁ డుదయించెను. ఆనాఁడే సూర్యోదయా నంతరము ఆశ్లేషానక్షత్రంబునఁ గర్కటలగ్నమందు సుమిత్రాదేవి కవలను బ్రసవించెను.

మ॥ మొగసెఁ నిర్జరదుందుభుల్ సకలదిఙ్మోహైకడక్కాలుగాఁ,
గురిసెఁ గల్పకపారిజాతతరువుల్ క్రొంబూలవర్షంబులఁ,
విరిసెం బ్రాణుల దుర్వ్యథాపటల ముద్విగ్నంబుగా నెల్లెడఁ,
సరసీజాయతిలోచనుండు నరుఁడై జన్మింప ధాత్రీస్థలిఁ.

చ॥ చెలఁగెను వేదఘోష, బుషిసీమలఁ గ్రమ్మినచెట్ట లొక్కటఁ
దొలఁగెను, హోమకుండములు ధూపశిఖాపరిబద్ధకాంతులఁ
వెలిఁగెను, బ్రాణమానభయవివ్వలచిత్తల దీనరావముల్
మలఁగెను, జీవరాశికి నమందసుఖంబు గల్గె వేల్మిడిఁ.

ఆ శిశువులకుఁ బదునొకండు దినములు యథాసుఖము గడచెను. అంత దశరథుఁడు పుత్రనామకరణమహోత్సవంబును సంకల్పించి త్రికాలజ్ఞుఁడగు కులగురువును సర్వశాస్త్రవేత్తలగు మహాత్ములను రప్పించెను. వసిష్ఠుఁడు రాకుమారుల రూపలావణ్యాదిలక్షణంబులను

బరిశీలించి కౌసల్యానందనునకు శ్రీరాముఁడనియుఁ గై కేయీతనయునకు భరతుఁడనియు, సుమిత్రాసుతులకు లక్ష్మణశత్రుఘ్నులనియుఁ బేరిడెను. ఎల్లరు నందులకు సంతసించి యా శిశువులను దీవించి చనిరి.

ఆ రాజపుత్త్రులు నలువురు శుక్లపక్షచంద్రులువోలె నానాఁటికి వర్ధిల్లుచుఁ బరస్పరప్రేమైకమతులై కాలక్రమంబున నెల్లవిద్యలు గఱచి దయాదాక్షిణ్యంబులు గలిగి విజ్ఞానకార్యదీక్షాకౌశలంబుల నివ్వటిల్లి సర్వజనహృదయపీఠంబు లధివసించిరి. లక్ష్మణుఁడు పిన్ననాటనుండి రామునెడ స్నిగ్ధభక్తిగౌరవంబులు గలిగి వానికి రెండవప్రాణమువలె నుండెను. లక్ష్మణునియెడ రాముఁడుగూడ నట్లే నర్తించెను. తమ్ముని విడిచి యతఁడు నీరేనియుఁ గ్రోలఁడు; నిద్రానస్థయంబు సయితము వానిని బాయఁడు. శత్రుఘ్నుఁడు భరతుని దవిలి వానికిఁ బ్రాణంపుఁ బ్రాణంబుగా నుండెను. భరతుఁడు వానినిఁ దనసర్వస్వముగా భావించెను. తమ్ములు ముగ్గురు రాముని గురుభావంబున మన్నించుచు వాని ననువర్తించుచుండిరి.

సీ॥ అవనీతలంబుపై నవతరించినవాఁడె,
ధర్మంబు నాల్గుపాదముల నిలిచె,
వచ్చిరానినుడుల నుచ్చరించినవాఁడె
సత్యంబు నిర్వక్రచార మొందె,
ఏజోయనూత్రంబు నఱుతఁ గూర్చినవాఁడె
ప్రాణమిచ్చినదముల్ ప్రబలమయ్యె,
విలువిద్య సేర్వంగ విల్లుబూనినవాఁడె
దుష్టాత్మకులయెడల్ దోహళించె,

తే॥ విశ్వ మెల్లెడ నూతనవిభవ మందెఁ
గోసలంబుసౌఖ్యశ్రీ నివాసమయ్యె,
బలుకఁ దరమొకో శ్రీరామభద్రమహిమ,
నలువకైన వేయితలల చిలువకైన.

అని జనులెల్లరుఁ బ్రశంసింపసాగిరి.

ద్వితీయ మండలము

విశ్వామిత్ర సమాగమము

అట్లు పుత్త్రులు యుక్తవయస్కులై రాజవిద్యలందుఁ జిత్రశ్రములై యున్నంత దశరథుఁడు వారికి వివాహములు తలపెట్టి కొండొకనాఁడు

వసిష్ఠాదిపురోహితులను రాజబంధువులను గూర్చి మంతనముచేయు చుండెను. అత్తఱి విశ్వామిత్రమహర్షి యటవచ్చి తన రాకను ద్వారపాలకునివలన తెలిసికొని దెలిపెను. దశరథుఁడు వసిష్ఠాదిసహితంబుగా నమ్మునికి నెదురేగి మర్యాదలతోడ వానిని దోడితెచ్చెను. కౌశికుఁడు యుక్తాసనంబున సుఖోపవిష్టుఁడై వసిష్ఠాదులను గుశలమరసి, 'రాజేంద్రా, పురకోశంబులు పదిలమేగదా. దైవికమానుషికకర్మంబులు నిరాతంకముగా వర్తిల్లునుగదా' యని ప్రస్తావించెను. కోసలేంద్రుఁడు కరములు జోడించి, 'ఋషిచంద్రమా, మీ కటాక్షవీక్షణమునకుఁ బాత్రులైన మాబోంట్లకుఁ గొదువయుండునా? మీ రాకంబట్టి ధన్యుఁడ నైతిని. మీ సందర్శనము పేదకుఁ బెన్నిధి యబ్బినట్లు మాకయ్యెను. రాజర్షిత్వంబును మెచ్చక బ్రహ్మర్షిత్వంబును సాధించిన మీ ప్రభావము పఱచినంతదూరము వ్యతిక్రమములు గలుగునా? మీ పాదధూళి సోఁకి నేను ధన్యధన్యుఁడ నైతిని.

చ॥ చెలిమియుఁ బుత్త్రభావమును జేసి మహాత్ములు వత్తు రంతెకా,
కలుగునె సిద్ధమూర్తులకుఁ గార్యము లన్యసహాయసాధ్యముల్?
తెలిసియుఁ బల్కఁగా వలసి ధీరతఁ బల్కుదుఁ గార్య మున్నచో
సెలవిడనోపు మీ మతముఁ జేయుదుఁ దప్పక చూనిసత్తమా.

అని భయభక్తులతోడ విన్నవించెను.

విశ్వామిత్రుఁడు తొనికి మెచ్చి, 'రాజేంద్రా, ఇక్ష్వాకువంశంబునకును భవదీయవ్యపదేశకుఁడైన వసిష్ఠమహర్షికినిఁ దగినట్లు వచించితివి. కశ్చిత్ఫలమునుగోరి యాగదీక్షను బూనితిని; కామరూపులగు రాక్షసులు నాకార్యమునకు విఘ్నమాచరించుచున్నారు. యజ్ఞసమాప్తికాలము వేచియుండి వారు వేదిమీఁద రుధిరమాంసంబులు వర్షింతురు. వారివలనఁ బెక్కుసారులు భంగపడితిని. యజ్ఞపరినిష్ఠులకుఁ గోపము తగదు గావున వారు నా శాపాగ్నికి గుఱిగాక యింతకాలమున్నారు. ఉపాయాంతరమునఁ గార్యమును సాధింపనలసియున్నది. అందులకుఁగా నిందు వచ్చితిని. క్రతురక్షణార్థము శ్రీరాముని గోరుదు. కాక పక్షంబులువీడని బాలుఁడని యతని శంకింపనలదు. వాని యండ నేనుందు. మదీయ దివ్యతేజఃపరిరక్షితుఁడై యతఁడు రక్కసుల నుక్కడంచును. దశరథరాజేంద్రా, నీసుతునికీర్తి యీ రేడుజగంబులు నిండును; శ్రేయఃపరంపరలు వానిని వరించనున్నవి. పుత్త్రుల యభ్యుదయమునకన్న వాంఛనీయము తండ్రులకుఁ గలుగదుగదా. అన్యులు

లేరాయని శంకింతువా? అన్యులు నాకార్యమునకుఁ జాలరు. దుర్మదాంధులైన యీ రాక్షసులు నిజపాపకాలపాశంబులఁ గట్టువడి మృతప్రాయులై యున్నారు. భాసచేసి చెప్పుచున్నాను. నామాట నమ్ము. పుత్రీవాత్సల్యంబును బైకొనసీయకు. నీసుతుని నీవెఱుంగవు. వాని సంగతి నాకును వసిష్ఠునకును వామదేవునకును స్పష్టము. అతఁడు పదినాళ్ళు నా వెంటనున్నఁ జాలుఁ; నా యభీష్టమొనర్పుము. ఎంతయు నీకు మేలగును.

కం॥ వచ్చినకార్యము పో నీ
విచ్చియు నర్థంబుగల్గ, దినవంశ్య, తఱిం
బుచ్చక యనుమానింపక
చెచ్చెరఁ బుత్తెమ్ము వాని శీఘ్రమ చనెదన్.

అని తాను వచ్చినపనిఁ దెలిపెను.

దశరథుఁడు నివ్వెఱఁగంది, 'మునీంద్రా, మీ వచనము వజ్రసారమై నా హృదయంబు నగల్చుచున్నది; మూర్ఛయయ్యెడు. పదితూఱ్ఱేండ్లనియు నిండని కూన యేడ? రాక్షసయుద్ధమేడ? ఋషికార్యము రాజులకు విధి యందువా? నేనే ధనుష్పాణినై మీ వెంట వచ్చి మీ సనిఁ జక్కఁబెట్టుదు; అనుగ్రహింపుము. రామునియందు నా ప్రేమయెల్ల మూర్తీభవించియుండు; వానిని బాసి జీవింపఁజాల. పడరానిశ్రమ లోర్చి పెక్కుఁనతోపవాసములు సలిపి ముదిమిముప్పునఁ గానక కన్న చిన్నిపాపను విడనాడుమని మీరుమాత్రము చెప్పఁగలరా? అది యటుండనిమ్ము. తపోధనా, మీ వచించు రక్కసు లెవ్వరు? వారి వృత్తాంతమేమి? వారి శౌర్యసంపద లెట్టివి?' యనెను. నాప్రుఁడు, 'రాజా, వినుము. పులస్త్యబ్రహ్మవంశంబున విశ్రవసువనువాఁడు జనించెను. వానికిఁ గుబేరుఁడు రావణుఁడు ననుతనయులు గలిగిరి. అందు రావణుఁడు బ్రహ్మనుగూర్చి ఘోరతపమొనర్చి యభీష్టవరములు పడసి మహాగర్వోద్ధతుఁడై యున్నాఁడు. అతనిని వినియుందువు. వానికి మారీచసుబాహువు లనుపేరి యనుచరులు గలరు. యజ్ఞములకు విఘ్నమొనర్చుట వారికి దినకృత్యముగా నున్నది. ఆ చెనఁటుల వలన నా కార్యము చెడుచున్న'దని యా ఋషి చెప్పెను.

ఆ రక్కసులపేర్లు విన్నంతనే దశరథుఁడు డీలుపడి, 'గాధేయా! రావణుఁ డన్నంతనే గుండియ లవియుచున్నవి. ఆ దురాత్ము నెదిరింప

నాకును లాభము చాలదు. నా సంగతి యటుండనిమ్ము. సుబాహుడు లెక్కి వచ్చినను వానిని మార్కొన నేరడు. మారీచసుబాహులు సుందోప సుందుల తనయులు గదా. ఆ సంగ్రామకాలురను వారింప మముబోంట్ల తరమా? ధర్మజ్ఞా, నాయెడఁ బ్రసన్నుఁడ వగుము. మాకు గురువును దైవమును సమస్తము మీరేగదా. మీయాజ్ఞ సేయ నిమ్మహదభాగ్యుఁడు నోచఁడు. దయానిధీ, నన్నును నా కూనను నిండుమనంబున ననుగ్రహింపుము' అని కేలొగ్గెను. ఆ మాటలకు విశ్వామిత్రుఁడు చిఱునవ్వు దాల్చి, 'దశరథా! కేవల పుత్త్రికృతస్నేహము నిన్నిట్లు పలికించుచున్నది. ఇట్టి వట్టి భయంబులు వలదు.

'అహం వేద్మి మహాత్మానాం రామం సత్యపరాక్రమం।
వసిష్ఠోఽపి మహాతేజా యే చేమే తపసిస్థితాః॥'

'దశరథా, రాముఁడు నీకుఁ బుత్త్రుఁడై జన్మించుటంజేసి వానినిఁ గేవల మర్త్యమాత్రునిగా భావించుచున్నావు. ఇంతకన్న వెఱ్ఱితనము గలదా? రాముఁడు పరమాత్మయేగాని రెండవఁ డగాఁడు. లోకకళ్యాణార్థము భగవంతుఁడు లీలామానుషవిగ్రహమును దాల్చెను. నీ తండ్రితనము నిమిత్తమాత్రము. ఈరహస్యము రాగద్వేషభూయిష్ఠమైన హృదయము గలిగి నిరంతరభోగలాలసులై కేవలకర్మపరతంత్రులుగా నుండు నీయట్టి వారికి సుంతయు గోచరింపదు. బహుగుణోపాసనాపరిణత బుద్ధులును సత్త్వగుణప్రధానులు మోక్షైకనిష్ఠాగరిష్ఠులు నగు తపోనిధులకు మాత్రమే యీగుట్టు తెలియవచ్చును. మన యిరువురకు నిట్టి తారతమ్యము గలదు. అందువలన నీజ్ఞానచక్షువు మోడ్చి యుండుటయుఁ దత్కారణంబునఁ గలహపు నీకుఁ దెలియరాకుండుటయు నగుచున్నది. కన్న నాటినుండి క్షణమునేపుగూడ బాయకుండునట్టి తండ్రికిఁ దెలియరాని సుతుని విశేషంబు తెన్నడుగాని వానినిఁ గని విని నేరని నీకెట్లు తెలియవచ్చునందువా? నీ దృష్టిదొల్ల బాహ్యమేగాని యాంతరము గాదు. మతియు నయ్యది పుత్త్రివాత్సల్య నిరుద్ధమైయున్నది. మాబోంట్ల సంగతి యట్టిదిగాదు. కామాదులు మాదృష్టిని గప్పవు. అదియునుగాక మాదృష్టి నిరంతరము తత్త్వపరమైయుండును. అందువలన మాకు సమస్తము హస్తామలకముగాఁ గాన్పించుచుండును. ఆత్మలాభార్థినై నిన్ను మోసగింప నిట్లనుచున్నానని తలంపనలదు. ఈరహస్యము తపోనిష్ఠుల కెల్ల స్పష్టము. వలతువేని నీకులగురువును నిరంతరము నీ మేలు గోరుచుండు వాఁడును నైన వసిష్ఠమహర్షి నడుగుము. ఏకారణముచేత

నైనను అనఁగా మాలిమిఁ జేసిగాని మా యింపుపురకుఁ గల బ్రాహ్మణత్వముఁ జేసిగాని వానిని సంశయింతువా? అట్లగునేని ప్రకృతము నీయాస్థానము నలంకరించుచున్నట్టియు అహంకార మమకారస్పర్శగూడ లేనట్టియు బ్రహ్మవేత్తలలో నగ్రేసరులైనట్టియు వామదేవ మార్కండేయ ప్రభృతులనేని యడుగవచ్చును. వీరెల్లరు నామాట సరియని వచింతురేని సంశయము లెల్ల మాని శ్రీరాముని నావెంటఁ బంపనగును' అని వచించెను.

దశరథుఁడీ భావంబులను గ్రహింపక కేవల ప్రాకృతబుద్ధియై పదంపడి,

'సీ॥ కూఁకటివేణికిఁ గురులు కూడనివాఁడు
తల్లిదండ్రులమాల్కిఁ దనరువాఁడు
సోఁకుమూఁకల నెంతుఁ జూచియుండనివాఁడు
పరులన్న నెడముగాఁ బఱచువాఁడు
విలుపట్టి శరమింత వేయనేరనివాఁడు
కష్టంబు లెట్టివో గననివాఁడు
ఇలువాసి యడుగైన నిడి యెఱుంగనివాఁడు
కడిఁదినోములు నోచి కన్నవాఁడు,

తే॥ మాకు నల్లాయముద్దుగా మనెడువాఁడు
రాముఁ డాపాపఁ గొనిపోయి రక్కసులకు
నప్పగింపఁగా నాచేతు లాడవయ్య!
కరుణమై నన్ను మన్నింపు గాధితనయ!'

అని యొడ్డుకొనెను. విశ్వామిత్రుఁడు రోషకషాయనేత్రుఁడై, 'రాజా! నీ కెంతయు సంతసింతు. ఆడితప్పుట రాఘునకుఁబున నేఁడు గంటి; చాలుఁజాలు. నీ మలికితము మానుము.

శా॥ రారే మానులు, వారి యిచ్చితములక్ రాజాగ్రణుల్ దీర్పరే,
ఏరీ యీక్రియఁ బల్కి లేదనెడు ధాత్రీశుల్ త్రిలోకంబులక్?
నీ రాముం డటురాకయున్నఁ గ్రతువుల్ నింపారఁగాఁ బోలవే?
వారుక్ పీరనసేలఁ? బోయెద మృషావాదీ, సుఖంబుండుమా.

అని చివ్వున లేచెను.

దశరథునకు వసిష్ఠుఁడు హితంబు చెప్పుట

వసిష్ఠుఁడు ప్రమాదమును శంకించి గాధేయునాపి, 'రాజేంద్రా, ధర్మమూర్తి వనెడు నీకీర్తి ముల్లోకము లావరించియున్నది. దానిని వాడనీయవలదు. ఆశితప్పుట యిష్టాపూర్తివధ యగును. ఒండువిచారింపక మునివెంట రాముని బంపుము. నీ సుతుఁడు కృతాస్త్రుఁడని గాని యకృతాస్త్రుఁడనిగాని జింతింపవలదు. సుధారసంబునకుఁ బానకగుప్తియట్లు రామునకు గాధేయసంరక్షణము గలదు. విశ్వామిత్రుఁడేతన్మాత్రుఁడుగాఁడు. శూరులకు శూరుఁడును, జ్ఞానులకు జ్ఞానియు మహాతపస్సంపన్నుఁడునునై యీమహాని దనరారును. విలువిద్యయం దితని సాటిగలుగఁడు. ముజ్జగంబులఁగల వివిధాస్త్రంబులు వీని యఱచేతనున్నవి. ఎవడు పరమశివుని మెప్పించి సకలాస్త్రంబులఁ బడసెనో, నూతనాస్త్రంబుల సృష్టించుశక్తి యెవనికిగలదో యట్టి యీతపోధనుఁడు రక్కసులవలన వెఱచి సహాయార్థియై యిందు వచ్చెనని భావింపవలదు. ఇదంతయు నీసుతుని యభ్యుదయార్థముగా గ్రహింపుము; జాగువలదు. తోడ్తోడ రాముని దరలింపు' మనెను.

దశరథుఁడు రామలక్ష్మణులను విశ్వామిత్రుని వెంటఁ బంపుట

దశరథుఁడు శాంతచిత్తుఁడై రామలక్ష్మణులను రప్పించి వారికి మంగళస్నానంబులు గావించెను. వసిష్ఠుఁడు వారిని శుభమంత్రాభిమంత్రితులుగా నొనర్చెను. అంత దశరథుఁడు కౌసల్యాసహితుఁడై యా సుతుల నిద్వరను విశ్వామిత్రునిచేత నుంచెను. వాయువు పరాగరహితమై భావిశుభోదర్కముగా సుఖముగా వీచెను. పుష్పవర్షములు గురిసెను; దేవదుందుభులు మ్రోసెను; దిశలెల్లఁ దెలివొందెను.

రాముఁడు బలాతిబలవిద్యలను గ్రహించుట

రామలక్ష్మణులు ధనుష్పాణులును బద్ధగోధాంగుళిత్రాణులునై కైదువులు ధరించి విశ్వామిత్రు ననుగమించి యాఱు కోసులు చని సరయూ తీరము చేరిరి. అంత గాధేయుఁడు రాముని బిలిచి, 'వత్సా, ఆచమింపుము, జాగువలదు. సర్వమంత్రసమిష్టిరూపంబగు బలాతిబలవిద్యనిత్తును, గ్రహింపుము. దానికలిమిం జేసి శ్రమముగాని జ్వరముగాని రూపవిపర్యయముగాని నీకుఁగలుగవు; నిద్రావస్థయందేనియు నిన్ను రాక్షసులుగూడఁ జెనక నోడుదురు; భుజబలంబున నీకు సాటియుండఁడు;

అది యిది యనవేల? ఎందును నీకు సరియుండదు. సౌభాగ్యంబునకుఁ బరమావధివై దాక్షిణ్యంబునకు నిధివై జ్ఞానబుద్ధినిశ్చయంబుల నసదృశుఁడవై యుత్తరప్రత్యుత్తర చాతుర్యంబున నొజ్జవై వెలయుదువు. ఈ విద్యలు రెండును నిఖిలమంత్రజ్ఞానంబునకు మాతృస్థానములు. నీవు దక్క నొరులు వీని గ్రహింపఁ దగరు. ఇని నీకు బహుఫలకారిణులగు' ననెను. రాముఁ డాచమించి శుచియై మునివలన బలాతిబల విద్యను గ్రహించెను. అంతలోన,

"శా॥ శ్రేణుల్ గట్టి నభోంతరాళమునఁ బారెంబట్టుఁ బుష్పాసు పా
పాణవ్రాతము కోష్ణమయ్యె, మృగతృష్ణావార్థి లింకెన్, జపా
శోణంబయ్యెఁ బతంగబింబము, దిశాస్తోమంబు శోభాదరి
ద్రాణం బయ్యె, సరోజషండములు నిద్రాణం బయ్యెం గడున్."

అంగదేశ వృత్తాంతము

వారంత నాఁటికిఁ బ్రయాణముఁ జాలించి తృణశయనంబులఁ బరుండి యారాత్రి యందు సుఖముగాఁ గడపిరి. వఱువాత విశ్వామిత్రుఁడు లేచి, 'రామా, ప్రాతఃకాలసంధ్య ప్రవర్తిల్లుచున్నది. దైవవిహితంబులైన యాహ్నికంబులను దీర్పనగు' నని పలుకరించెను. రామలక్ష్మణులు మేల్కాంచి నీరాడి వార్చి వచ్చి ఋషికి నమస్కరించి గమనాభిముఖులై నిలిచిరి. కౌశికుఁడు వారిని వెంటఁగొని తరలెను. కొంతనడికి వారు త్రివేణీ సంగమము చేరిరి. అచట ఋష్యాశ్రమ మొండు గానవచ్చెను. రామలక్ష్మణులాయాశ్రమమును జూచి మహానంద మొంది, 'మహాత్మా, ఇది యెవరి యాశ్రమము? ఇందెవ్వరు వసింతురు?' అని యడిగిరి. విశ్వామిత్రుఁడు, 'నత్సలారా, పూర్వము మహేశ్వరుఁడు నియమసమాహితుఁడై యిందు దీర్ఘకాలము తప మొనర్చుచుండెను. వానికిఁ బార్వతి శుశ్రూషలు గావించుచుండెను. ఆ యిరువురకు వివాహము సంఘటింప నెంచి దేవతలు మన్మథు నాశ్రయించిరి. మథుఁడు సురలకుఁ బ్రీతిసేయఁ గోరి స్థాణువును ధర్షించెను. విషకంఠుఁ డది గ్రహించి హుంకరించెను. ముక్కంటికంటి మంటకుఁ దుంటవిల్తుఁడు భస్మీభూతుఁ డయ్యెను. అదిమొద యతఁడతనుఁడుగా నున్నాఁడు. అంగజుఁ డిందు తనయంగంబులను దొఱఁగిన కతనంబున నిది యంగదేశ మనఁబడుచున్నది. ఇది యా పరమశివుని యాశ్రమము. అదిగో చూడుము. పరమేశ్వరుని శిష్యులు నిత్యపుణ్యులు

వచ్చుచున్నారు. మన మీ రాత్రి యిచటఁ గడపి రేపు గంగానదిని దాటుదము. రామా,

గీ॥ గగనసాటకశాలలోఁ బగటిపూట,
వేయిచేతులదేవర వేసమాడి,
దిచ్చుమొగమైనయంతనే దించినట్టి
జాజుపఱిజాయనఁగ జాలె సంజచాయ.

సాయంసంధ్యాహ్నికములు దీర్చిరండు; ఆశ్రమముఁ బ్రవేశించుదము' అనెను. వా రట్లు గావించి వచ్చిరి. అంతలోన నాశ్రమవాసులఱుదెంచి కౌశికునకును రాజపుత్త్రులకును మర్యాదలు గావించి వారిని మువ్వురనుఁ దోడ్కొనిపోయిరి. గాధేయుఁడు వచించు మనోహర కథలతో రేయెల్ల వారికిచట హాయిగాఁ జనెను.

గంగాతరణము

తెల్లవాటినంత విశ్వామిత్రాదులు కాలకృత్యములు దీర్చి పయనమైరి. ఆశ్రమవాసులు వారిని గంగాతీరమువఱకు సాగనంపి నదీతరణార్థము నావయేర్పాటుచేసి మరలిరి. విశ్వామిత్రాదు లాపడవ యెక్కి నల్దెటికి వచ్చిరి. అచ్చట వాహినీతలము తరంగాఢ్యలమై ఘూర్ణిల్లుచుండెను. రాముఁ డదిగాంచి, 'మహాత్మా, ఇట వీచీకల్లోలము మెండుగానున్నది. అలలు గెలుపుఁగోరియో యన నొండొంటిఁ బైకొను చున్నవి. ఆరొదకుఁ జెవులు గీడ్పడుచున్నవి; కారణ మేమో' యనెను.

నావుఁడు, 'నత్తా, బ్రహ్మదేవుఁడు మనస్సంకల్ప మాత్రంబున సరోవరమునొండు కైలాసపర్వతంబున నిర్మించెను. అది మనస్సంకల్పజ మగుటంజేసి దానిని మానససరోవరమందురు. అందుండి యొక ప్రవాహము వెడలెను. అది సరస్సునుండి వచ్చుటంజేసి దానిని సరయూనది యందురు. గంగాసరయూనదు లిచటఁ గలియుచున్నవి. సంగమస్థానము గావున నిటఁ బరస్పరజలసంఘర్షణము తుములమై ధ్వనించుచున్నది. ఈ నదీమతల్లులకుఁ బ్రణమిల్ల నగు'నని విశ్వామిత్రుఁడు చెప్పెను. రామలక్ష్మణు లట్లు గావించిరి. అంతలోనఁ బడవ దరిచేరెను. వా రాయోడఁ దిగి యేటి దక్షిణపుగట్టునఁ దరలిరి.

మలినకరూశదేశంబుల వృత్తాంతము

వారట్లు పోవుచుండఁగా ఘోరకాంతార మొకటి యడ్డు వచ్చెను. రాముఁడాయరణ్యమును జూచి, 'మునీంద్రా, ఈ కాన నంబునఁ గటికి చీఁకట్లు తాండవమాడుచున్నవి. మారేడుమ్రాకులును రేగుచెట్లును కలిగొట్లును చండ్రలును మద్దులును గ్రిక్కిరిసి పెనఁగొని నింగి ముట్టుచున్నవి. రవికిరణంబులకుఁగూడ నిందు సందు గానరాదు. గజఘీంకారములు సింహగర్జనంబులు బెబ్బులిబొబ్బరింతలు మారు మ్రోయుచున్నవి. శకుంతారావములు వీనుల నగల్చు చున్నవి. చూచుటకుఁ గూడ నిది మహాభయంకరముగా నున్నది. దీని పేరేమి?' యని యడిగెను.

'నత్తా, తొల్లి దేవేంద్రుఁడు వృత్రాసురుని సంహరించెను. ఆ కారణంబున వానికి బ్రహ్మహత్యాదోషము సంప్రాప్తమయ్యెను. ఆ దోషఫలంబుగా వానికి దురంతక్షుద్వ్యాధ చారొక్కనెను. దేవతలును మునులును గూడ తద్దోషపరిహారమును గూర్చి యాలోచించి గంగోద కంబుల వానిని దీర్థమాడించి కలశోదకంబులను వానిపయిఁ బ్రోక్షించిరి. పాకశాసనుఁడు శుచియై యాకఁటిబాధను బాసెను. మునీంద్రాదుల ప్రసాదంబున శచీపతి తన మలినకారూశంబుల నిందు వదలుటఁజేసి యీ ప్రదేశంబులు మలినకరూశంబులందురు. ఈ తావులు నిర్జరేశ్వరుని వరప్రభావంబునఁ జిరకాలము ధనధాన్యసమృద్ధములై పెంపెసలారు చుండెను.

తాటకావృత్తాంతము

'ఇట్లుండఁ దాటకయను యక్షాంగన సహస్రగజబలశాలిని సుందుఁడనువానిఁ బెండ్లాడి వానివలన మారీచుఁడను సుతునిఁ బడసెను. మారీచుఁడు పుట్టునుదొట్టి ప్రజాక్షోభకరుఁడై యీ ప్రదేశంబులరెంటి నిర్మానుష్య మొనర్చెను. ఆచోట నిమ్మహారణ్యము పెరిగెను. ఈ కాన నంబునఁ దాటక నసించుచున్నది. ఆ రక్కసి యాఁబ్రోసులనేల నావ రించును. అది మన దారిలోనే యుండును. ఆ దుష్టచారిణిని బరిమార్చి యీప్రదేశంబు నిష్కంటక మొనర్పుము. ఆ క్రూరురాలికి వెఱచి యెవ్వరు నిందురారు' అని గాధేయుఁడు చెప్పెను.

నావుఁడు, 'మునీంద్రా, యజ్ఞులు స్వల్పవీర్యులందురు. తాటకకు సహస్రనాగబలమెట్లు గలిగె'నన విశ్వామిత్రుఁ డిట్లనియెను. 'వత్సా, సుకేశుఁడను యక్షనాయకుఁడు పుత్రార్థము బ్రహ్మనుగూర్చి శుభాచారపురస్సరముగా దీర్ఘతపమాచరించి విరించి వరప్రసాదంబున వేయు యేనుగుల బలముగల పుత్రికను దాటకను బడసి దానినిబెంచి జర్ఝరాత్మజునకు సుందునకు వివాహమొనర్చెను. వారికిఁ బుత్త్రుఁడు జనించెను. సుందుని దుండగములు దుస్సహములయ్యెను. వాని నగస్త్యుఁడు సంహరించెను. పతివధకుఁ బగఁబూని యా మహర్షిని మ్రింగుటకై పుత్త్రుని వెంటఁగొని తాటక యాశ్రమము వచ్చెను. అగస్త్యుఁడు వారిని శపించెను. అంత వారు రాక్షసులై యిందున్నారు. తాటకను వధింప భవదన్యులకుఁ దరముగాదు. ఈ పని గావించి గోబ్రాహ్మణహిత మొనర్పుము. స్త్రీవధయని శంకింపవలదు. చాతుర్వర్ణ్యహితముపొంచు స్త్రీల వధ సయితము రాజులకుఁ గర్తవ్య మగును. ఇది శాస్త్రసిద్ధము. శిష్టరక్షణమునకన్న బరమధర్మము రాజులకుఁ గలుగదు. దుష్టశిక్షణంబునఁ గాని శిష్టరక్షణము చేకూఱదు. ధర్మాచరణముపట్ల స్త్రీవధయని వెఱచువాఁడు రాజుగాఁదగఁడు. భూపాలురకర్మములెల్లఁ బరోపకారార్థములు గాని యాత్మార్థములుగావు. ఆత్మార్థముగాని కర్మము ఫలాభిసంధిరహితముగా నుండును. అభిలాషలేనివాఁడు ఫలము తత్కర్తకుఁ బొరయదు. ఈ తత్త్వరహస్య మెఱిఁగి రాజులు నిష్కామకర్మ పరతంత్రులై తమ ధర్మంబుల నిర్వర్తింతురు. పూర్వము విరోచనుని పుత్త్రిక మంథర జగత్సంహారంబును యత్నించెను. ఆ దురాత్మను నజ్ఞి వధించెను. ఇట్టి పురాణగాథలు వినవా? శుక్రునితల్లి భృగుపత్ని యింద్రశూన్యముగా లోకమును గావింప సమకట్టెను. శ్రీమహావిష్ణువు దానిని గడతేర్చెను. ఇట్టి నిదర్శనము లెన్నోగలవు. ధర్మవిషయమున స్త్రీపురుషవిభేదము గలుగదు.'

నావుఁడు, 'మునీంద్రా, నాతండ్రిపంపునను భవన్నియోగంబునను లోకహితముపొంచు మీ వచనమొనర్తు' నని రాముఁడు వచించి విల్లెక్కుపెట్టి ధనుష్టంకార మొనర్చెను. ఆ ధ్వనికి వనాంతరమృగజాలమెల్ల వితాకుచొందెను. తాటకయుఁ దత్తరిల్లి క్రోధమూర్ఛితయై బిట్టార్చుచు వచ్చెను.

తాటకావధ

ఆ యసురను జూచి, 'లక్ష్మణా, దీని ఘోరాకారంబును జూచి నంతనే శూరుల ధైర్యకవచంబులు జాఱుట వింతగాదు. అయినను స్త్రీ వధకుఁ జేతులాడవు. ముక్కును జెవులును దటిగి దీనిని పంపుదు' నని రాముఁడు పల్కునంతలోన నప్సాలసుదిండి బిట్టఱచి బాహువులుచాచి యతనిపైకి నుఱికెను. విశ్వామిత్రుఁడు హుంకరించి రామలక్ష్మణులకు జయవచనముఁ బలికెను. తాటక చెలరేగి దుమ్ము చీఁకట్లు పఱపి యగతర్థానయై శిలావృష్టిని గురిపింపసాగెను. రాముఁడు కోపప్రచండుఁడై శరజాలంబున ఘాలవానను వారించెను. రక్కసి యుక్కుమీఱి వానిమీఁదికిఁ బఱతెంచెను. రాముఁడు దాని కరద్వయమును దెగవైచెను; లక్ష్మణుఁడు దాని ముక్కుఁజెవులు ద్రుంచెను. తాటక బొబ్బరించుచుఁ బలునాయలు దాల్చి వేవిధంబుల వారిని గాఢింపఁజొచ్చెను. సంధ్యయు సమీపించెను. విశ్వామిత్రుఁడు రాముని బిలిచి, 'వత్సా, జాలి యిఁకఁజాలు. సంజవేళ యయ్యెను. ఈ పాతకి యిఁక విజృంభించును.' అని హెచ్చరించెను. రాముఁడు శబ్దవేది గావున నడివట్టి క్రొవ్వాడికోల యేసి తాటక నరికట్టెను. ఆ పిశితాశని తన మాయలుడిగి అంపిల్లుచు రివ్వున వానిపైకి నుఱికెను. రాముఁడు శితభల్ల మొండు దానియురముఁ గుఱిచేసి వైచెను. ఆ వ్రేటునకు నయ్యసుర గుండియలు వ్రీలి దిక్కులు వ్రక్కలుగా నఱచి నేలఁగూలి యసువులు దొఱఁగెను.

దేవతలు పరమానందభరితులై యింద్రపురస్సరముగా వచ్చి, 'మునీంద్రా, శుభము, శుభము. మాకు మహాప్రీతిని గూర్చితివి. రాముని యెడ సంపూర్ణముగాఁ బ్రసన్నుఁడవగుదువుగాక. నీ యుపదేశంబునకు నతఁడెంతయుఁ బాత్రుఁడు. భృశాశ్వపుత్రులను వానికి ననుగ్రహింపుము. వానినలన మాకెల్ల మహోపకారము గానున్న' దని గాధేయునికి వచించి చనిరి. విశ్వామిత్రుఁడు రాముని శిరము మూర్కొని వానిం బ్రశంసించెను. అంతలోన,

''కం॥ ధరణీదిశాప్రసారిత
గురుకరనికరంబు లుడిచికొని దీర్ఘనిరం
తరగతి ఖిన్నుఁడవోలెను
హరిదశ్వుఁడు విశ్రమించె నస్తాద్రిదరిన్.''

ఆ రేయి వారచ్చటఁ బుచ్చిరి.

గాధేయుఁడు రామునకు నాస్త్రప్రదానము చేయుట

తెల్లవాఁటి గాధేయుఁడు రాముని బిలిచి, 'వత్సా, నీయెడ నెంతయుఁ బ్రీతుఁడనైతిని. దండచక్రము కాలచక్రము ధర్మచక్రము విష్ణుచక్రము అను చక్రంబులను, ఐంద్రాస్త్రము వజ్రాస్త్రము శూలము బ్రహ్మశిరోనామకాస్త్రము ఐషీకము బ్రహ్మాస్త్రము అను మహాస్త్రంబులను, మోదకియు శిఖరంబు ననుగదాద్వయంబును, ధర్మపాశము కాలపాశము వరుణపాశము అను పాశత్రయంబును, వారుణము పైనాకము నారాయణము అను దివ్యాస్త్రంబులను, శుష్కాశనిని ఆర్ద్రాశనిని శిఖరమనెడి యాగ్నేయాస్త్రంబును, ప్రమథనమనెడి వాయవ్యాస్త్రంబును, హయశిరోనామకాస్త్రంబును, క్రౌంచాస్త్రంబును, విష్ణుశక్తి రుద్రశక్తి అను శక్తిద్వయంబును, కంకాళ కాపాల కంకణంబులను, వైద్యాధరాస్త్రంబును, నందనమనెడి ఖడ్గరాజంబును, మానవ ప్రస్వాప ప్రశమనామక గంధర్వాస్త్రంబులను, సౌర దర్పణ శోషణ సంతాపన విలాపన మదన మోహాస్త్రంబులను, తామస సౌమనస సంవర్ద మూసలాస్త్రంబులను, సత్య మాయాధరంబులను, తేజఃప్రభ శిశిర సుదామన భగ మానవాస్త్రంబులను నీకొసఁగ నిశ్చయించితిఁ, బ్రతిగ్రహింపుము. ఈ యస్త్రంబులు కామరూపంబులును మహాబలసంపన్నంబులు నగును. ఇవిగలుగునేని సురాసురు లేకమై వచ్చియు వ్రేలుగదలింపఁ జాలరు. వీనినెల్లఁ బడయుము; నీకన్యుఁడు ధానుష్కుఁడు గలుగఁడు' అని చెప్పి మంత్రగ్రామంబును జపించెను. అస్త్రదేవతలెల్లరు వచ్చి కేలొగ్గి నిలిచిరి. ఋషిపుంగవుఁడు వారింజూచి, 'అస్త్రదేవతలారా, మిమ్ము రామునకు నిచ్చితిని' అనెను. ఆ దేవతలు రామునకు మ్రొక్కి, 'కింకరులము సెలవు' అనిరి. రాజపుత్త్రుఁడు కరతలంబున వారిని స్పృశించి, 'నాకు మనోవర్తనులరై యుండుఁ'డని పలికి మునికి ననుస్కరించి, 'మహాత్మా, ఉపసంహారంబునుగూడఁ బ్రతిపాదింపు' మని వేడెను.

విశ్వామిత్రుఁడు హర్షించి, సత్యవంతము సత్యకీర్తి ధృష్టము రభసము ప్రతిహారతరము పరాఙ్ముఖము అవాఙ్ముఖము లక్ష్యము విషమము ధృఢనాభము సునాభము దశశీర్షము శతోదరము పద్మనాభము మహానాభము దుందునాభము జ్యోతిషము కృశనము నైరాశ్యము విమలము యోగంధరము హరిద్రము దైత్యము ప్రశమనము శుచి బాహువు మహాబాహువు నిష్కలి విరుచి సార్చిస్మాలి ధృతిమాలి

వృత్తిమంతము రుచిరము పితృసౌమనసము విధూతము మకరము కర వీరకదము ధనము ధాన్యము కామరూపము కామరుచి మోహము ఆవరణము జృంభకము సర్వనాభము సంతానము నరణము అనునట్టి యుపసంహారాస్త్రములు నిచ్చెను. ఆ మంత్ర దేవతలు దివ్యభాస్వర దేహములతోఁ గొందఱును, అంగారక తేజంబులతోఁ గొందఱును, చంద్రార్క కాంతులతోఁ గొందఱును, భూమవర్ణములతోఁ గొందఱును వచ్చి కై మోడ్పుల రాముని నెదుట నిలిచిరి. దాశరథి సంతసించి, 'అస్త్ర దేవతలారా, తలంపుతోడ రండు సొండు' అనెను. వారతనికి ప్రమొక్కి చనిరి.

సిద్ధాశ్రమము

అంత రామలక్ష్మణులు విశ్వామిత్ర సహితులై యందుండి తరలిరి. మార్గమధ్యంబున వారికి మఱియొక మహారణ్యము గానవచ్చెను. రాముఁడు మహర్షి వంక మరలి, 'మహాత్మా, ఈ కాఱడవి పెంజీకట్లు గ్రక్కుచున్నది. ఇంత దట్టముగానున్నను వెఱపను మాట యిందుఁ దోఁపదు. ఇది ఋష్యాశ్రమము గానోపు. బ్రహ్మఘ్నులైన రాక్షసులు మీ యాగంబునకెందు విఘ్నమొనర్తురో, క్రతురక్షణార్థ మెచ్చటకు మమ్ముఁ దోడితెచ్చితిరో యయ్యాశ్రమమిదిగా నుండునా?' యనెను. 'రామా, వినుము. సర్వలోకనాథుఁడు శ్రీమహావిష్ణువు తపశ్చరణార్థ మెందు యుగయుగంబులు వసించెనో, ఎందుఁ గాశ్యప మహర్షి ఘోర తప మొనర్చి సిద్ధిఁ బడయుటవలన నేది సిద్ధాశ్రమమను సార్థకనామము వహించెనో, బలిచేత నిరాకృతుఁడై రాజ్యచ్యుతిని గాంచి పాతివచ్చి యెచట దేవేంద్రుఁడు విష్ణువును రాజ్యప్రదాన మర్థించెనో, పురందరుని యార్తి భాపుటకును గాశ్యపుని కిచ్చిన వరమును జెల్లించుటకును వామనావతార మెత్తుదు నని విష్ణుదేవుఁ డెందు వాగ్దాన మొనర్చెనో యా పుణ్యాశ్రమమిది. ఇందే నేను వసింతును. యాగవిఘ్నకారులైన రాక్షసుల సంహరించుట జరుగవలసియున్న' దని విశ్వామిత్రుఁడు చెప్పెను.

అంతలో నయ్యాశ్రమము సమీపించెను. మునిశిష్యు లెదురు వచ్చి మహర్షిని బూజించి రామలక్ష్మణులకు నాతిథ్యమిచ్చిరి. ఎల్లరు గొంతవడి విశ్రమించి మార్గాయాసముఁ దీర్చుకొనిరి. అంత రాముఁడు మహర్షిని డాసి, 'మహాత్మా, యాగదీక్షఁ బూనుము. మీ క్రతుసిద్ధిం

జేసి యాశ్రమాభిదానము సార్థమగుఁగాక. మీమాటయు సత్యమగుఁ గాక' యని విన్నవించెను. గాధేయుఁడు దీక్షవహించెను.

మారీచాదుల సంహారము

వటువాత రామలక్ష్మణులు కౌశికుని డాయఁబోయి, 'ఋషి చంద్రమా, రాక్షసులు క్రతువిఘ్నార్థము వచ్చుతరుణము మాకుఁ దెలుపనగు' ననిరి. మునిశిష్యులు వారి కార్యతత్పరతకు సంతసించి, 'రఘువంశతిలకులారా, దీక్షఁబూనుటఁజేసి మహర్షి మౌనవ్రతుఁడు. మీకుఁ బలుకఁడు. నేఁడు మొదలుకొని యాఱురాత్రులు క్రతువును రక్షింపవలయు' ననిరి. రామలక్ష్మణులు విల్లెక్కుడింపక నిర్మేషులై కాచియుండిరి.

అయిదుదినములు యజ్ఞము నిర్విఘ్నముగా జరిగెను. ఆఱవ నాఁడు ఋత్విజులు సమిత్కుశపాత్రహోమపాత్రంబులను సిద్ధపఱచి యథావిధిఁ గూర్చుండి సమంత్రకంబుగాఁ క్రతువును సాగించిరి. యజ్ఞ వేది ధగధగకాంతుల వెలుచుండెను. అంతలో హుతాత్తుగా రక్తధార లా వేదిపై వర్షించెను. రాముఁడది గాంచి కోపోద్దీపితుఁడై యాగశాల యెల్లఁ గలయం బరికించి మండగీడుల నెందుఁగానక మింటివంకఁ జూపు సారించి, 'సౌమిత్రీ, అదిగో రాక్షసులు నింగినుండి యీ యకార్యముఁ గావించుచున్నారు. మేఘమండలంబును ఝుంఝూనిలమువలె వీరిని మానవాస్త్రంబునఁ బొఱఁజిమ్ముదు' నని శరంబు సంధించి మారీచుని వక్షము గుఱిచేసి యేసెను. ఆ కోల వాని నువ్వెత్తుగాఁ గొనిపోయి నూఱామడదవ్వున సముద్రాంతమునఁ ద్రోసెను. దాశరథి యంత నాగ్నేయాస్త్రమును ప్రయోగించి సుబాహువక్షంబును జీల్చెను. వాఁడు నడగొండవలెఁ గూలి యసువులు వదలెను. రాముఁ డట్లు మారీచసుబాహువుల పీఁచ మఁడచి వాయవ్యాస్త్రమును వదలెను. దానివడికి శోకుమాకలెల్ల ఛిన్నాభిన్నమై యెందలివార లందే ప్రందిరి. విశ్వామిత్రుఁడు యజ్ఞశేషమును సమాప్తి గావించి దీక్షమాని వచ్చి, 'రామా,

క॥ అన్నంత యొనర్చితి నా
జన్నంబును దీఱె మాట సత్యంబయ్యెన్
నిన్నేనయించెడు విల్తుఁడు
మున్నీరొడ్డాణమైన భూమిం గలఁడే?'

యని ప్రశంసించెను. ఆశ్రమవాసులును వారి నెంతయు శ్లాఘించిరి. రామలక్ష్మణులు నాటిరేయి నిద్రించి జాగరణశ్రమముఁ బాసిరి.

మిథిలాగమనము

తెల్లవారినంత రామలక్ష్మణులు ఆహ్నికములు దీర్చి ఋషికడకు వచ్చి, 'మహాత్మా, సేవకులము; ఆజ్ఞ వేఁడుము' మనిరి. అందున్న మునీంద్రులెల్లరు వారి వినయమధుర వచనంబులకు సంతసించి గాధేయునిఁ బురస్కరించుకొని, 'రాకుమారులారా, మిథిలాధీశుఁడు జనకమహారాజు గొప్పయజ్ఞముఁ దలపెట్టెను. అటకుఁ బోనున్నాము. వానియొద్ద మహాద్భుతమైన ధనూరత్నము గలదు. తొల్లి దేవరాతుఁడను మిథిలాపతి యాగమొనర్పగా దేవతలు వానికి మెచ్చి పసదనముగా దాని నిచ్చిరి. ఆవింటి లావింతనరాదు.

శా॥ ఆవింటిం గన వచ్చినట్టి యల మర్త్యాసుర్య దైత్యేంద్రుల
భావింపంగను రాదు, వచ్చి కని విభ్రాంతాత్ములై పోయి రం
దేవాఁడుఁ దనకేల దాని నిడిన ట్లిన్నాళ్ళుగా లేదహో!
లావుంజేయము విశ్వమందుఁ గలదో లాగెంతయుం బోఁచెడిన్.

ఆ కార్ముకంబును మోపెట్టలేనివాఁడు ధానుష్కుఁడు గాఁజాలఁడు' అనిరి. అది విని రామలక్ష్మణులు ధనుర్విలోకన కుతూహల మందిరి. విశ్వామిత్రుఁ డంత ననదేవతలను వీడ్కొని సిద్ధాశ్రమంబునకుఁ బ్రదక్షిణంబుఁ గావించి రాసుతులతోడఁ దరలి జాహ్నవీతీరముంబట్టి హిమాచలమార్గముఁ ద్రొక్కెను. బ్రహ్మవాదులును దమతమ యగ్ని హోత్రసంభారంబులను సూఁబుండ్లమీఁద నింపి గాధేయుని నెంబడించిరి. ఎల్లరు సూర్యాస్తమయమునకు శోణనదముఁ జేరి యందుఁ గ్రుంకులిడి యగ్నిహోత్రంబులు గావించి సుఖోపవిష్టులైరి.

గిరివ్రజపుర వృత్తాంతము

శోణనదతీరంబున మహారణ్య మొండు గలదు. అది జీబుకొని పొడయెండనుగూడఁ బొలయనీయక వనలక్ష్మికి నాటపట్టయిన నత్యంత శోభాకరముగా నుండెను. రాముఁడా కాననముఁ జూచి, 'మహాత్మా, ఈ వననీమ యెవ్వరి' దనెను.

అనవుడు, 'వత్సా, కుశుఁడను బ్రహ్మపుత్త్రుఁడుండెను. అతఁడు నిర్విఘ్నవ్రతసంపన్నుఁడును సజ్జనప్రతిపూజకుఁడునై విదర్భరాజ తన

యను బెండ్లాడి యా యింతివలనఁ గుశాంబుఁడు కుశనాభుఁడు అధూర్త రజసుఁడు వసువు అను పుత్త్రుల నాత్మసదృశుల నల్వుర్గాంచి యా సుతులు యుక్తవయస్కులైనంత వారికిఁ బనరాజ్యంబును బంచి యిచ్చెను. అందుఁ గుశాంబుఁడు కౌశాంబీనగరంబును, కుశనాభుఁడు మహోదరపట్టణంబును, అధూర్తరజసుఁడు ధర్మారణ్యంబును, వసువు గిరివ్రజపురంబును దమకు వాసస్థానములుగా నేర్పరచికొని రాజ్యమును బరిపాలించుచుండిరి. ఈ శోణనదం బీ వసుదేశంబున నుత్పన్నమై ప్రవహించును. వసుదేశంబును మగధదేశమనియు వచింతురు. ఆకారణంబున ని ట్లోయనతిని మాగధియనియుఁ జెప్పుదురు. ఇది యైదుకొండల నడుమఁ బూదండవలె విరాజిల్లుచు బశ్చిమాభిముఖముగాఁ బ్రవహించుచుండును.

'కుశనాభుఁడు ఘృతాచియను భార్యయందు లోకోత్తర సౌందర్యనతులగు పుత్త్రికల నూర్గురఁబడసెను. ఆకాంతారత్నములు కొండొకనాఁడు యథోచితాలంకృతలై యుద్యానవనముఁ జొచ్చి ప్రావృట్పయోధరంబున విద్యుల్లతలువోలె విహరించుచు నాటపాటలఁ దవిలి యుండిరి. వారి రూపవయోవిలాసంబులకు వాయుదేవుఁడు మోహనశుఁడై యా సుందరీమణులను సమీపించి, 'కామినీరత్నములారా, మీ సొబగు ముల్లోకంబులఁ గానరాదు. మీ వలపునకు జరామరణపరాధీనులైన మర్త్యమాత్రులు దగరు. నన్నుఁగూడి యుడివోని యెల ప్రాయలై యమరసుఖంబులు చూరగొనుఁ' మని వారిని బ్రణయించెను. ఆ మాటకు నజ్జనరాండ్రు నవ్వి, 'సురోత్తమా, నీవు సర్వప్రాణులకు నంతశ్చరుఁడవు. అట్టిమహిమాఢ్యులు భవాదృశులు మమ్మిట్లు పరిభవింపనగునా? ఈ యవినయంబునకుఁ బదచ్యుతియే తగుపరిహారము. అపని సేయఁ గుశనాభతనయలకు దుష్కరముగాదు. ఆత్మతపోనష్టమునకు మెఱచి మిన్నకుందుము. మాతండ్రి నీకు మృత్యువు గాకుండుగాక. కన్నెలు పితృపరాధీనలు. తండ్రి యిచ్చునతఁడే వారికి భర్తయగు' ననిరి.

'ప్రభంజనుఁడు నిజప్రణయతిరస్కారంబునకు నలుకయు సిగ్గును దాల్చి ప్రతీకారముఁ జింతించి యయ్యంగనామణుల గాత్రంబులు సొచ్చి వారినెల్ల గుబ్జలుగా నొనర్చెను. అంగవైరూప్యమునకు నయ్యెలనాగలు దైన్యమంది లజ్జాభ్రాంతులకుఁ జిక్కి యిలుదూఱి సొగయసాగిరి. పుత్త్రికల దీనావస్థకుఁ గుశనాభుఁడు వ్యసనకలుషితాంతరంగుఁడై సుతలను

డాసిఁ 'తనయలారా, ఈ గుజ్జుతనము మీకు రానేల? సంగతియేమి? ఇట్లు ధర్మాత్మిక్రమ మెవరిచ్చినవాఁడెవఁడు?' అని యడిగెను. వారు బదులాడక పొరలిపొరలి యేడువసాగిరి. కుశనాభుఁడు వారి నెంతయు బుజ్జగించి వినరము వినుపింపగోరెను. వారు దుఃఖము నెట్టకేలకు నడంచుకొని తండ్రికిట్లొక్కి, 'నాయనా, వాయుదేవుఁడు ధర్మాతిక్రాంతుఁడై యశుభమార్గముఁ ద్రొక్కి మమ్ముఁ బ్రధర్షింపవచ్చెను. పితృపరాధీనల మనియుఁ దండ్రినిమెప్పించి మమ్ముఁ బడయనగుననియు వాని నొడ్డుకొంటిమి. ఆపాపానుబంధుఁడు మావిజ్ఞాపనములు ద్రోచిపుచ్చి మమ్మిట్లు భంగపరచె' నని డగ్గుత్తికతోఁ బలికి విలపించిరి. కుశనాభుఁడు వివరము విని, 'పుత్త్రికలారా, అంతటివాఁడు మీకు మనోవికారముఁ గలిగింప నోపఁడయ్యెఁగదా. మీ సౌశీల్యమునకు నిదే ప్రబలనిదర్శనము. భంగపాటు చెందియు వానినిగోపింపక క్షమాప్రదీపకులైతిరి; నా కులగౌరవంబులు కాపాడితిరి.

మ॥ వ్రతము ల్దానములుం దపశ్చరణశాస్త్రిమ్నాయతత్త్వార్థకో
న్నతులఁ బాటికి రావు సుమ్ము క్షమకుం దథ్యంబుగానెందుఁ దత్
స్థితికై మీరు ప్రమోదగర్వగరిమం జెన్నార నాఁగాక యో
సుతలారా! వ్యసనవ్యథాకలితలై శోకింపగాఁ జెల్లునే?

అని వారి నోదార్చి తత్పరిణయంబులఁగూర్చి మంత్రుల నాలోచించుచుండెను.

ఆ కాలంబునఁ జూళియను నక్షలితబ్రహ్మచారి పరమేష్ఠింగూర్చి తీవ్రతపంబు సేయుచుండెను. వానిని సోమద యను గంధర్వాంగన బరిచరించుచుండెను. ఆ బ్రహ్మచారి యూసపర్యలకు మెచ్చి, 'సోమదా, ఇచ్చువచ్చినవరముఁ గోరు' మనెను. ఆకాంతామణి సంతసించి, 'మునివర్యా, నీయందు బ్రహ్మవర్చస్సు తేజరిల్లును. అట్టి తేజశ్శాలియైన పుత్త్రుని నాకనుగ్రహింపు' మని వేడెను. అతఁడు ప్రసన్నుఁడై సంకల్పమాత్రంబున నొకపుత్త్రుని మహాతేజోవంతుని బుట్టించి యాయింతి కొసఁగెను. ఆకుమారుని బ్రహ్మదత్తుఁ డందురు. వాఁడు కాంపిల్యనగరమధిష్ఠించి సర్వజనాహ్లాదకరముగాఁ బాలించుచుండెను. వానిసంగతి కుశనాభుఁడువిని యతని రప్పించి తనసుతల నూర్వుర వానికిచ్చి పెండ్లి యొనర్చెను. వరునిప్రసాదంబున వారు కుబ్జత్వముఁ బాసి యథాపూర్వమైరి. కుశనాభుఁడు పరమానంద మొంది యల్లునిని దనయలను

సముచితసత్కారంబులఁ బంపెను. వారు కాంపిల్యానగరము చేరి సోనుదకు నేత్రోత్సవమొనర్చుచు సుఖముండిరి.

గాధేయ జననము

'కుశనాభుఁడట్లు పుత్త్రికల నత్తవారింటికిఁ బంపి పుత్త్రార్థము పుత్త్రికామేష్టిఁ గావించెను. అతనికి వానితండ్రి కుశుఁడు ప్రత్యక్షమై, 'నాయనా, ఆత్మసదృశతనయుని గాధియనువానిని బడయుదువు. వాని వలన నీకు శాశ్వతకీర్తియగు' నని చెప్పి చనెను. కొన్నాళ్ళకు ఘృతాచి చూలుదాల్చి గాధిని గనెను. వానికి నేను జనించితిని. కుశవంశమునఁ బుట్టిన కతన నన్నుఁ గౌశికుఁడందురు.

కౌశికీ నది వృత్తాంతము

'రామా, నాకు సత్యవతి యనుపేరి యగ్రజాత గలదు. ఆమెను ఋచీకుఁడు వివాహమయ్యెను. పెండ్లియైన కొండొకకాలంబునకు భర్త పరమపదమొందెను. వానిని సత్యవతి సశరీరగా స్వర్గలోక మనుగమించియు లోకహితార్థము మరలవచ్చి హిమవంతము నాశ్రయించి కౌశికీనామపుణ్యనదీరూపంబునఁ బ్రవర్తిల్లుచున్నది. ఆమెయందలి యాదరంబునఁజేసి నేను హిమాచలప్రాంతముల వసింతును. క్రతు నిమిత్తము సిద్ధాశ్రమంబునకు వచ్చితిని. నీ తేజంబుపెంపున నాయజ్ఞము కొనసాగెను.

'రామా, గిరివ్రజవృత్తాంతంబును బ్రసంగవశంబున నాచరితను వింటివి. అదిగోచూడు.

చ॥ తరువులు దాల్చి నిశ్చలన ధర్మము గుంభకయోగమూని నాఁ,
బరుగులు మాని కూర్కొ మృగపక్షులు, మిన్నెలనాగ తారకా
తరళవిలోకనంబుల సుధాకరునిం దనివోఁ జూచెడిన్
సురిగెను జీకటుల్ దివిరి సోకుఁడు లెల్లడఁ దాఁకకొడిసిన్.

పూర్వరాత్రము చననున్నది. జాగారము రేపటి పయనమునకు నాటంకమగు నిద్రింపుము' అని విశ్వామిత్రుఁడు చెప్పెను. రామ లక్ష్మణులు సంతోషమూర్ఛితులో యన నిద్రించిరి.

మఱునాఁడు రాముఁడు ప్రాతరాహ్నికములు తీర్చి లక్ష్మణుని గూడినచ్చి, 'మహాత్మా, శోణనదమందలి సైకతప్రదేశములు గాన్పించుచున్నవి. వీనిఁబట్టి చూడగాఁ బ్రవాహము లోతుఁగాఁ దోఁపదు;

రేవు చూచి కాల్నడ దాఁటనగు' ననెను. విశ్వామిత్రుఁడు నల్లె యని రాకుమారులతోడఁ దరలి శోణనదము దాఁటి మార్గపధ్యనుందలి విశేషంబులను వారికిఁ జెప్పుచు మధ్యాహ్నవేళకు గంగాతీరము చేరి యట వసతులేర్పఱిచికొని తర్పణహోమాదిక్రియలుగానించి హవిర్భాగము నమృతముకరణి నారగించి సుఖోపవిష్టుఁడయ్యెను. రాముఁడు గాధేయునిఁ జేరి, 'మహాత్మా, గంగానదిని ద్రిపథగ యందురు. ఆపే రెట్లువచ్చెను? ఈ శైవలిని ముల్లోకములావరించి సముద్రుని గలియునట. ఆ వృత్తాంతము వినఁ గుతూహలమగుచున్నది' అని యడిగెను.

దేవతలు నిస్సంతానవంతులగునట్లు పార్వతి శపించుట

నావుడు, 'వత్సా, ఎల్లధాతువులకు నిధానంబును మహోన్న తుఁడునైన పర్వతరాజు హిమవంతుఁడు గలఁడు. వానికి మేరుతనయ యైన మనోరమవలన నప్రతిమానరూపవతులు పుత్త్రికలిద్దఱు జనించిరి. అందుఁ బెద్దకూఁతు గంగయందురు. రెండవసుత యుమ నాఁబడు. దేవతలు స్వహితార్థమును త్రిలోకశ్రేయఃప్రాప్తిని గోరి హిమవంతుని ప్రార్థించి గంగను స్వర్లోకంబునకుఁ గొనిపోయిరి. ఉమ రుద్రునిగూర్చి దీర్ఘతప మొనర్చి వానిని వివాహమయ్యెను. శివుఁడు వఁపు దగిలి పార్వతితో నూఱుదివ్యవత్సరములు క్రీడించెను. వారికిఁ బెనుభూత మొండు జనింపనుండెను. దేవత లందులకు బెగ్గడిల్లి బ్రహ్మను దోడ్కొని ముక్కంటి యొద్దకుఁ బోయి, 'మహాదేవా! లోకశరణ్యా! ప్రసన్నుఁడ వగుము. నీ తేజస్సును ముల్లోకంబులుగూడ ధరింపఁజాలవు. జగత్క్షేమార్థముఁగోరి యద్దానిని నీయందే ధరించి వేదోక్తయోగయుక్తుండవై భార్యతోడఁ దపంబు సేయనోపు'నని మ్రొఱలిడిరి. మహేశ్వరుఁడు నిర్జరులప్రణయంబాకర్ణించి, 'సురలారా, మీ యభీష్ట మగుఁగాక; మీకును లోకంబులకును సుఖంబగుఁగాక; నా తేజస్సు స్వస్థానమునుండి చ్యుతమయ్యెను. దానిని ధరింప నెవ్వరో చెప్పనగు' ననెను. 'భూమి మీఁద వదలు'మని దేవతలు చెప్పిరి. శివుఁ డట్లొనర్చెను. అది గిరివన సహితంబుగాఁ బుడమియెల్లఁ గ్రమ్మెను. దేవతలు కలగుండు చెంది యగ్నిఁ జేర్చి, 'వాయుపూర్వకంబుగా శివరేతస్సును ధరింపు' మనిరి. అతఁడట్లు గావించెను.

'పార్వతియు, దనకుఁ బుత్త్రసంతానాంతరాయమగుటఁ గాంచి దేవతలకుఁ గినిసి, 'అమరులారా! మీ యపచారఫలంబుగా మీకు

స్వభార్యలందు సంతానము లేకుండుఁగాక' యని శపించి, 'ధాత్రీ! నా సుతోదయంబును సహింపనైతివి గావున నీవు మత్కోపకలుషీకృతవై నానారూపంబులు దాల్చి పెక్కురాజులకు నుంపుడుగత్తె వగుచుఁ బుత్త్రిప్రీతికిఁ దవ్వగు' మని భూదేవిని దిట్టెను. శివుఁడు సతీ ద్వితీయుఁడై చని హిమాద్రిశిఖరంబునఁ దపస్సునకుఁ దొడఁగెను.

షణ్ముఖజననము

'దేవతలు కొండొకనాఁడు మరల బ్రహ్మకడకు నచ్చి, 'పితామహా, ఉమాశివులకు జనించుసుతుఁడు దేవసేనానియగు నని వరమిచ్చితివి. త్రిశూలి తపోనిష్ఠుఁడయ్యెను. ఇఁక వానివలన మేము సేనానాయకుని బడయువిధము దోఁపదు. కార్యవిధానజ్ఞుఁడవు; నీకన్న మాకు దిక్కు గలుగరు. కర్తవ్యము విచారింపు' మనిరి. చతురాస్యుఁడు వేల్పుల నూరార్చి, 'పార్వతీశాపము తప్పదు; ఇఁక మీకు మీ కళత్రంబుల సంతానముకల్ల. హరిహరోత్రుఁడు వియద్గంగయందు సుతుని జనింపనోపు; అతఁ డరిందముఁడై యమరసేనాధిపత్యము వహించును. ఆకుమారుని గంగ ధరించుటకు నామె చెలియలు పార్వతి పరితోషించును' అని చెప్పెను.

'అమరులంతఁ గైలాసంబునకుఁ జని యందున్న యగ్నిదేవుని బుత్రోదయంబునకు నియోగించి, 'రుద్రవీర్యంబును గంగయందు విసర్జించి దేవహిత మొనర్పు' మని వానిని గోరిరి. ఆసంగతి యగ్ని గంగకుఁ దెలిపి, 'యమరులకుఁ బ్రియము సేయు' మనెను. గంగ యందులకు సమ్మతించి దివ్యాంగనారూపముఁ దాల్చెను. వైశ్వానరుఁ డంత తన యవయవంబుల నున్న రుద్రవీర్యంబును స్రవించెను. అది గంగ సర్వాంగములు వ్యాపించి తచ్ఛరీరంబునెల్ల నుడ్డుడికింపసాగెను. గంగ యా వేడిమిఁ దాళఁజాలక 'ఇది ధరింప నావలనుగా' దనెను. దానిని హిమవత్ప్రాంతమున వదలుమని యగ్ని చెప్పెను. గంగ యట్లొనర్చెను. ఆ తేజోరక్తాదికము భూగతమై నానావిధధాతువర్ణముగాఁ బరిణమించెను. ఆ తేజస్సునుండి బాలుఁడొకఁ డుద్భవించెను. కృత్తిక లార్గురు బాలిచ్చి వానిని బెంచిరి. ఆఱుముఖములతోఁ జన్మించినందున వానిని షణ్ముఖుఁ డందురు. వేల్పు లాతనిని సురసేనాధిపత్యమునకు నియమించిరి.

గంగావతారచరిత్ర

'వత్సా, కథానుషంగికముగా షణ్ముఖావతారచరిత్ర చెప్పితిని. గంగావతారచరిత్ర వినుము. తొల్లి సగరుఁడనురాజు అయోధ్యాధిపతి యుండెను. అతఁడు విదర్భరాజతనయను కేశియను కాంతను జ్యేష్ఠ భార్యగాఁ గాశ్యపపుత్త్రిని సుమతిని ద్వితీయపత్నిగా గ్రహించి సంతానార్థియై సతులతోఁడ హిమవంతంబునకుఁ జని యట భృగుప్రస్రవణంబున శతవర్షంబులు ఘోరతపంబొనర్చెను. భృగుమహర్షి ప్రసన్నుఁడై, 'వత్సా, సగరా, నీతపస్సునకు మెచ్చితిని; నీకుఁ బుత్త్రిలాభమగు; ఒక భార్యయందు వంశకర్తయగు సుతుఁడును, మఱియొకసతియందు నఱువదివేలు తనయులును జనింతు' రనెను. కేశిసుమతు లది విని, 'మహాత్మా, మాలో నెవతె వంశకర్తను గాంచు' నని వేఁడిరి. మీమీ కోర్కెలు తెలుపుఁడని యాబుషీంద్రుఁ డడిగెను. వంశకర్తను గేశి కోరెను; సుమతి యఱువదివేల తనయుల నభిలషించెను. అట్లేయని యామౌని వారి నాశీర్వదించి పంపెను.

'కొండొకకాలంబునకుఁ గేశి యసమంజసుఁడను తనయుని గాంచెను. సుమతి గర్భపిండమును బ్రసవించెను. ఆతుంబమును భేదించి యాతునియలను నేతికడవలందుంచి దాదులు పోషించుచుండిరి. అవి క్రమక్రమముగా నవయవములు దాల్చి పురుషాకారంబుల వర్ధిల్లెను. అసమంజసుఁడు బాల్యముదొట్టి చెనటియై పసికూనలఁబట్టి సరయూ జలంబుల ముంచుచు నూపిరాడక వాఱుతల్లడిల్లుట చూచి యానందించుచుండెను. ఆదుండగములు విని సగరచక్రవర్తి వానిని నగరమునుండి వెడలనడచి యతనిసుతుని నంశుమంతుని దగ్గరతీసి పెంచుచుండెను.

సగరుఁడు యజ్ఞము సేయుట

'ఇట్లుండఁ గొండొకకాలంబున సగరునకు యాగాభిలాషము జనించెను. పెద్దలు చేరి హిమాచలవింధ్యాద్రులమధ్యభాగంబున యజ్ఞప్రదేశమును నిర్ణయించిరి. సగరుఁడు క్రతు వారంభించి యజ్ఞాశ్వమును వదలి దాని వెంట నంశుమంతునిఁ బంపెను. మఱునాఁడు యజనశాల యందు ఉత్కృష్టమొనర్చుచుండిరి. ఋత్విజులకుఁ గొన్నియశుభసూచనలు గానవచ్చెను. వారు సంగతి గ్రహించి, 'రాజా, పర్వణిసమయంబున నెవఁడో యశ్వమును హరించి గొనిపోవుచున్నాఁడు. హర్తను వెంటనే దునుమాడి హయమును గాపాడుము. కానిచో యజ్ఞచ్ఛిద్రమగును;

తత్ఫలముగా మనయెల్లరకు ముప్పు వాటిల్లు' ననిరి. సగరుఁడు తన యరువదివేల సుతుల రప్పించి, 'నాయనలారా, యజ్ఞము దవిలి పరాకుచెందితిని. యాగాశ్వము నెవఁడో హఠాత్తుగా హరించెను. మీరెల్లరుఁ జని చతుస్సముద్రముద్రితధరామండలంబున యాగాశ్వ మెందున్నను దానిని గొనిరావలయును. ఆ మ్రుచ్చు భూగర్భంబున డాగుఁగాక; వానిని విడువవలదు. యజ్ఞదీక్ష నన్నుఁ గదలనీయదు. అశ్వమును దెచ్చునందాఁక యిఁదేయుందు; పోయిరండు; శుభమగు' ననెను.

సగరయజ్ఞాశ్వహరణాదికము

'వారు తరలి పుడమియెల్లఁ గలయ వెదకిరి. ఎందును గుఱ్ఱము పొలఁకువయే గానరాకుండెను. అంత వారు భూగర్భంబును బరిశోధింప నిశ్చయించి వజ్రంబులఁబోని శూలములతో హలాయుధములతో నొక్కొక్క రొక్కయామడేసి దూరము పృథివిని ద్రవ్వి పాతాళముఁ దాఁకిరి. అచటి దేవదానవగంధర్వ లా విపరీతంబునకు భీతిల్లి పితామహు నొద్దకు బఱచి సంగతి విన్నవించి యతనిశరణు వేడిరి. వేల్పుపెద్ద ప్రసన్నుఁడై, 'భయము వలదు; శ్రీమన్నారాయణుఁడు కపిలావతార మెత్తి సమస్తక్ష్మామండలంబును ధరించుచున్నాఁడు. కపిలునిక్రోధాగ్నిఁ బడి సగరాత్మజులు బుగ్గియగుదురు. ప్రతికల్పంబున నిట్లగు. వెఱపులు మాని మీతావులకుఁ జనుఁడు' అని ధైర్యమూలొక్కల్పి వారిని బంపెను. సగరపుత్త్రులు పాతాళమెల్ల శోధించి యెందును యజ్ఞాశ్వమును గానక విఫలమనోరథులై మరలి వచ్చి తండ్రికి సంగతి వినిచిరి.

'అది విని సగరుఁడు మండిపడి, 'విశ్వంభరాతలమెల్ల దూళీపాళీ కరించి తూర్పాఱుఁబట్టుడు. ఎందున్నను హయంబును హర్తతోడఁ బట్టితెండు. అందాఁక మరలవల' దని చెప్పి తనయులఁ బుచ్చెను. వారు చని భూభాగము గుద్దళించి తద్గర్భముఁ జొచ్చి యట ధరామండలంబును శిరంబున మోయుచున్న విరూపాక్షదిగ్గజంబును గాంచి దానిని బ్రదక్షిణించి, యందుండి తూర్పుదెస భేదించుచుఁ బోయి దక్షిణదిక్కుంభిని మహాపద్మంబును వలగొని పశ్చిమాభిముఖులై తరలి సౌమనసదిక్కరికి నెరగి, యుత్తరదిశయందున్న హిమపాండురవర్ణదిగ్దంతిని భద్రంబును జుట్టి యీశాన్యదిక్కునకు నడచి యటఁ గపిలమహర్షిని గాంచిరి. వాని చెంత యాగీయాశ్వము మేయుచుండెను. దొంగ యతఁడే యని వారు

నిశ్చయించుకొని క్రోధపర్యాకులేక్షణులై ఖనిత్రలాంగూలంబులతో శిలా వృక్షంబులతో నమ్మునిపయికి నురవణించిరి. కపిలుఁడు వారిమర్మయముఁ జూచి హుంకరించెను. క్షణములో వారెల్లరు భస్మరాసులైరి.

'సుతులెన్నాళ్ళకు రామికి సగరుఁడు చింతావ్యాకులుఁడై తదన్వేషణార్థ మంశుమంతుని బంపెను. అతఁడు వెడలి పినతండ్రులు చన్నమార్గముఁ బట్టిపోయి యొక్కొక్క దిక్కుంభిని సందర్శించుచుఁ దదీయాశీర్వచనంబులు బడయుచుఁ జనిచని యెట్టకేలకు సగరపుత్త్రిభస్మ రాసులు జేరి సంగతి గ్రహించి దుఃఖపగీతుఁడై పెద్దయుం దడవు విలపించి పితృతర్పణంబులకు సమకట్టెను. ఎందును జలంబులు గానరావు. అతఁడేమియుఁ దోఁపక శూన్యహృదయుఁడై నింగివంక దృష్టి సారించి చూచుచుండెను. వాని మేనమామ గరుత్మంతుఁడు వానికిఁ బ్రత్యక్షమై, 'పురుషాగ్రణీ, నీ పినతండ్రులచావునకు నగవవలదు. అది లోకహితప్రాపకముగాని యొండుగాదు. వారు కపిలమహర్షికోపానలంబున దగ్ధులైరి. వారికి సలిలక్రియలు లౌకికజలంబులఁ గారాదు. వియద్గంగాతోయంబులఁ బితృతర్పణంబు లొనర్పనగును. లోకపావని గంగాదేవి యీభస్మరాసులపైఁ బ్రవహించునేని నీ పినతండ్రులకు స్వర్గప్రాప్తి యగును. అదిగో యీగాశ్వము, దానిని గొనిపోయి నీతాత జన్నంబును సమాప్తిగావింపు' మని పలికి చనెను.

'అంశుమంతుఁడు యాగాశ్వంబును వెంటగొని తాతయొద్దకు వచ్చి యుదంతమెల్ల వానికి వినిచెను. అతఁడు మహాచింతాక్రాంతుఁడై యజ్ఞశేషము యథాకల్పము పూర్తిచేసి గంగావతారోపాయము నేరక నిర్విణ్ణుఁడై ముప్పదివేలేండ్లు రాజ్యమేలి పుత్త్రిశోకముతోన మఱణించెను.

'అంశుమంతునకుఁ బట్టముఁ గట్టిరి. వానికి దిలీపుఁ డుదయించెను. ఆ సుతుఁడు యుక్తవయస్కుఁడై నంతట నంశుమంతుఁడు వానికి రాజ్యమొప్పగించి గంగావతరణార్థియై హిమగిరికిఁ జని యట ముప్పదివేల వర్షంబులు మహోగ్రతపం బొనర్చి యిష్టసిద్ధిఁ బడయకయే స్వర్గతుఁడాయెను. తాతల దుర్మరణంబునకునుఁ దండ్రి తపోవ్యయమునకును దిలీపుఁడు వగచి యుపాయాంతరము దోఁపక ముప్పదివేలయేండ్లు పుచ్చి సుతునకు భగీరథునకు రాజ్యంబును మనోవ్యథావ్యాధికి శరీరంబు నొప్పగించెను.

గంగావతరణము

'భగీరథునకుఁ బుత్రసంతానము గలుగదు. అతఁడు రాజ్యమును మంత్రులయధీన మొనర్చి హిమాచలప్రత్యంతపర్వత మైన గోకర్ణాద్రికిఁ జని యందు జితేంద్రియుఁడై యూర్ధ్వబాహుఁడై బూని బ్రహ్మను గూర్చి పంచాగ్ని మధ్యంబునఁ దీవ్రతపం బొనర్పసాగెను. రామా! ఆ తపస్సు నేమని చెప్పుదు?

సీ॥ ఒకమిడుంగుఱు లేచి యుదధిలోపల వ్రాలి,
రెండవయూర్వమై దండుమిగాఁ,
ఒకమిడుంగుఱు లేచి యూర్ధ్వలోకముఁ బ్రాకి
దివ్యవిద్యుల్లతాదీప మయ్యె
ఒకమిడుంగుఱు లేచి యొడుపీఁది వెడనిల్చి
యత్యర్కచంద్రమై యతిశయిల్లె
ఒకమిడుంగుఱు లేచి యురగభూములు దాఁకి
చిత్రమాణిక్యమై చెలువుఁగాంచె

గీ॥ ముక్కుపయికి వ్రే లెగసెను ముసుల కెల్ల
వేల్పు లాశ్చర్యసంతోషవివశు లైరి
చెడమి నూత్నవికాస మెల్లెడల బడసి
సగరపౌత్రసాత్వికతపోజ్వాలఁజేసి.

'పరమేష్ఠి వానికిఁ బ్రీతుఁడై సురసమేతంబుగా వచ్చి, 'వత్సా, వరముగోరు' మనెను. భగీరథుఁడు బద్ధాంజలియై, 'దేవా, నాయెడఁ బ్రసన్నుఁడవేని నాతపము ఫలవంత మేని, మదీయ ప్రపితామహుల భస్మరాసులు గంగాపుణ్యోదకప్లుతము లగుఁగాక. అక్షయపదము వారికి లభించుగాక. ఇక్ష్వాకునంశ మవిచ్ఛిన్నమగుగాక' అని వేఁడెను. భగీరథుని యౌదార్య సౌశీల్యంబులకు హిరణ్యగర్భుఁడు సంతసించి, 'దృఢవ్రతా, నీయిచ్ఛయగు. గంగాపతనంబునకు భూదేవి యోర్వదు. ఫాలాక్షుఁడు దక్క నొండు గంగను ధరింపనోపఁడు. హరుని ప్రార్థింపు' మని పలికి, గంగను సంప్రతించి, 'దేవీ, సమయమెఱిఁగి భూమికి నవతరింపు' మని చనియెను.

'అంత భగీరథుఁడు నిరాలంబనిరాశ్రయవాయుభక్షణయూపకఠోర దీక్షఁ బూని ధ్యేయాకారితచిత్తవృత్తుఁడై రాత్రిందివము సంవత్సర పర్యంతము మహోగ్రతపం బొనర్చెను. వానికి ముక్కంటి ప్రసన్నుఁడై,

'వత్సా, నీకు మెచ్చితిని; ప్రియ మొనర్తు; గంగను దలఁదాల్తు' నని పలికి తిరోహితుఁడయ్యెను.

సీ॥ రంగదుత్తుంగతిరంగపఙ్క్తులతోడఁ
బ్లవమానహంసరాట్పటలితోడఁ
మత్స్యకచ్ఛపశింశుమారకాండమతోడ
గాంగేయసీరేజగణముతోడఁ
భాండురాంబుదఖండడిండీరములతోడఁ
జటులసంప్లుతిసమార్భటులతోడ
హరికాంతకాంతశీకరరత్నములతోడ
నరిదిలె మ్మెరపరంపరలతోడఁ

గీ॥ గగనకామినీకంఠముక్తాస్రజంబు
ద్రెస్సి పఱచి యిలకు జాఱు తెఱఁగుదోప
వింతవింతహాయలు మీఱ వింటిసుండి
హరజటాజూటమున వ్రాలె నభ్రగంగ.

'అట్లు మిన్నేఱు వ్రాలి నిజఝరీవేగంబునఁ బరమేశ్వరునిగూడఁ బాతాళంబునకుఁ గొంపోవనుండెను. భూర్జటి దానిగర్వోద్ధతికిఁ దామసించి యన్నదిని దిరోభవించెను. గంగానది యందుఁ జిక్కి,

మ॥ తిరుగుఁ దిమ్మరుఁ దల్లడిల్లు నులుకుం దీడించు నుల్లూగు ను
డ్డురలుఁ ఘూర్ణిలుఁ బిక్కటిల్లు నుఱుకుఁ డుల్లుఁ మిటారించు బ
మ్మెరవోవుఁ మఱుదెప్పరిల్లు నెగయుఁ మిట్టాడు ఓట్టార్చు నా
హరజూటాంతరబంధనంబెడయఁగా నత్యంత ముద్వేగయై.

'అట్లానది కపర్దితలముడినుండి నిర్గమింప నిఖిల ప్రయత్నంబులు గావించి వెఱవుగానక తన్మోహితయో యన నఁదే పెక్కేండ్లు పరిభ్రమించు చుండెను. ఎన్నాళ్ళకు గంగ రాకుండుటగాంచి భగీరథుఁడు శివునిగూర్చి మరల లోకోత్తరతపం బొనర్చెను. నిటలాక్షుఁడు వాని యెడ జాలివడసి యా తరంగిణిని బిందుసరోవరమందు డించెను. అందుండి యది యేడుపాయలుగాఁ జీలి హ్రాదిని పావని పలిని యను మూఁడు శాఖలను దూర్వ్యముఖంబుగా, సుచక్షువు సీత సింధు వను మూఁడు శాఖలను బశ్చిమముఖంబుగాఁ బ్రవహింపఁజేసి నడిమిశాఖయైన దాను భగీరథుని వెంటనంటి యొకచో ధృతంబుగా, నొకచోఁ గుటిలంబుగా, నొకచో మందమందంబుగా, వేఱొకచో నమ్రముగా, నింకొకచో మహోద్భతంబుగా, నానాగతులఁ బ్రవహించుచు, నిజజలావగాహ

మాత్రవిగతశ్రములై జనులుగావించు స్తోత్రపాఠంబులు వినుచుఁ జనిచని జహ్నుమహర్షి యజ్ఞవాటిని నీటముంచెను.

గంగకు జాహ్నవి యను పేరువచ్చుట

ఆమహర్షి దాని కావరంబునకుఁ గనలి తజ్జలంబులెల్ల గ్రోలెను. గంగ నామావశిష్ట యయ్యెను. ఋషులు వచ్చి లోకహితార్థము జహ్నుమహర్షిని ప్రార్థించిరి. ఆతపోధనుఁడు కరుణించి గంగను నిజశ్రోతోమార్గంబున వెడలించెను. ఆనది యట్లు బహిర్గతయై భగీరథు ననుసరించి సముద్రము గుండఁ బాతాళముఁ జొచ్చి యందున్న సగర పుత్త్రభస్మరాసులను దడిపెను. ఆప్రేతలు తమపాపంబులఁ దొలఁగి దివికిఁ జనిరి. గంగానది జహ్నుమహర్షి కర్ణబహిర్గతయైన కారణంబున దానిని జాహ్నవి యందురు.

గంగకు భాగీరథి యను పేరువచ్చుట

'అంతఁ బరమేష్ఠి భగీరథునకుఁ బ్రత్యక్షమై, 'రాజా, నీ ముత్తాత కును, దాతకును, దండ్రికిని, ముగ్గురకుఁ దరముగాని కార్యంబును సాధించితివి. అఱువదివేల ప్రేతలకు స్వర్గమిచ్చితివి. ప్రథినఁ గాచి కొంటిని. ఎంతయు శ్లాఘాపాత్రుఁడవు. నీ వలన భూమియెంతయు భావన యయ్యెను. నీ కారణంబున గంగానది పుడమికి నవతరించెను. కావున నేఁడుకోలె నయ్యది భాగీరథియనియు నాఁబడు. ఆ నదీ పుణ్యోదకము లాడి తన్నీరంబులఁ బితృతర్పణంబు లొనర్చి చరితార్థుఁడవై చను'మని వచించి యంతర్హితుఁడయ్యెను. భగీరథుఁ డట్లు గావించెను.

'వత్సా, ఈ గంగావతరణోపాఖ్యానము ధన్యము యశస్కరము నాయుర్వర్ధనము స్వర్గ్యము నగు. దీనిని విన్నను వినిపించినను సర్వ పాపక్షయ మగును' అని విశ్వామిత్రమహర్షి నుడివెను.

అంతలోన సూర్యాస్తమయ మయ్యెను. రామలక్ష్మణులు చని దివసాంతకృత్యములు దీర్చి ఫలంబు లారగించి సరుండిరి. నాఁటి రేయి యెల్ల గంగాచరిత్రస్మరణములో వారికి నిమిషప్రాయముగాఁ గడచెను.

ఉ॥ అల్లనఁ బ్రోసె నీలి తెఱ నవ్వల రేయెల నాగ, నేర్పు సం
ధిల్లఁగఁ బుల్లుబట్టువులు దెల్పిరి వేగుపరాకు, లుల్లస
త్పల్లవరాగరమ్యమగు పయ్యెద కొల్లనుఁ జీరియాడఁ దొ
ట్టిల్లుచు నయ్యుషాంగన వడిఁ జనుదెంచెను దూర్పుకొండకున్.

రామలక్ష్మణులు లేచి ప్రాతరాహ్నికములు దీర్చి విశ్వామిత్రుని కడకువచ్చి, 'మహాత్మా, ఋషులు మీరాక విని నదీసుఖతరణార్థము పడవను సిద్ధపఱచి' రని తెలిపిరి. గాధేయుఁడు పయన మయ్యెను. వారెల్లరుఁ బడవమీఁద గంగానదిని దాఁటి తీరంబున నించుక విశ్రమించి విశాలానగర మార్గముఁ బ్రొక్కిరి.

విశాలానగర వృత్తాంతము

అట్లు విశాలానగరమునుబట్టి చనుచు, 'మహాత్మా, ఆ నగరము నకు నట్టిపేరెట్లు వచ్చె' నని రాముఁడు ప్రస్తావింప విశ్వామిత్రుఁ డిట్లనియెను.

సముద్ర మథనాదికము

'వత్సా, తొల్లి కృతయుగంబునఁ గశ్యపుఁ డను ప్రజాపతి యుండెను. వానికి దితి యదితి యను భార్యలిద్ద ఱుండిరి. అందు దితి మహాబలసంపన్నులైన దైత్యులఁ గాంచెను. అదితికి ధర్మనిరతు లగు దేవతలు జనించిరి. వారట్లు జనించి యజరామరణంబులును, నిరామ యత్వమును గోరి తదర్థము పాలవెల్లిని ద్రచ్చి యమృతము సాధింప నిశ్చయించి మంథరగిరిని గవ్వము వానునికి ద్రాఁడుగాఁ జేసి నిరవధిక పరాక్రమోత్సాహంబులతో క్షీరాబ్ధిని మథింప నాగిరి. అట్లు వేయి సంవత్సరంబులు మథింపఁగా నందుండి కీలికీలాయతమైన హాలాహల ముద్భవిల్లి లోకంబును దేవాసురమానుషంబుగా దహింపసుండెను. నిర్జరులు భీతిల్లి శంకరుని శరణు జొచ్చిరి. అంతలోన హరియు నటఁ దోఁచి, 'త్రిలోచనా, దేవతలకెల్ల నగ్రజుఁడవుగదా. అగ్రపూజగా నివ్విషంబును గ్రహించు టొప్పు' నని చిఱునగవుతోఁ బ్రస్తావించి చనెను. పరమేశ్వరుఁ డావిషంబు నమృతప్రాయముగా మ్రింగెను.

కూర్మావతారాదికము

'మరల దేవదానవులు మథనక్రియకుఁ గడఁగిరి. అత్తఱిఁ గవ్వ ముగా నున్న మంథానపర్వతము పాతాళంబునకుఁ గ్రుంగెను. దానిని

లేవనెత్త లేక వారెల్లరు దీనులై చేతులు పిసికికొన సాగిరి. ఎట్టకేలకు దేవతలు దానామోదరుని ప్రార్థించిరి. విష్ణువు కూర్మరూపముఁ దాల్చి తఱిగొండను వీపున వహించి క్షీరసాగరంబునఁ బఱుండెను. సురాసురులంత వేయిసంవత్సరంబు లహోరాత్రంబులు ద్రచ్చిరి. అసముద్రాంతము నుండి ధన్వంతరియు నప్సరసలు నుచ్చైశ్రవహయమును గౌస్తుభరత్నము నమృతము నొక్కటొక్కటిగా వెడలెను. అమృతార్థము దేవదానవులకు ఘోరసంగ్రామ మొనరెను. విష్ణువు మోహినీరూపంబున వచ్చి సుధారసమును హరించెను. దేవతలు విజృంభించి దానవులను ద్రచ్చి వందఱలాడిరి.

దేవేంద్రుఁడు దితిగర్భమును ద్రవ్వుట

'దితి తనసుతవినాశనంబుకుఁగా వెలవెల్లనై వెచ్చనూరి కాశ్యపునితో, 'నాథా, సవతికొడుకులు నాసుతుల నోర్చి వధించిరి. ఇది దుస్సహము. ఇంద్రుని జయింపనోపు పట్టిని నాకుఁ బ్రసాదింపు' మని వేఁడెను. ఆముని యల్లే నరమిచ్చి తిన్నిద్ధికిఁగాఁ బరిశుద్ధమనంబునఁ దపంబొనర్పు మని చెప్పి నిజతపశ్చరణార్థము చనెను. పతివచనముఁబట్టి దితి కృతనిశ్చయయై కుశప్లవంబున దారుణతపం బొనర్పసాగెను. దేవేంద్రుఁడటకువచ్చి యగ్ని సమిత్కుశజలంబులను గందమూలంబులను సమకూర్చుచు నామె నుపచరించుచుండెను. ఇట్లు తొమ్మిదివందల తొంబది సంవత్సరములు చనెను. దితి వాని పరిచర్యకు మెచ్చి, 'ఇంద్రా, నా తపంబిఁక బదియేండ్లకు నిండారును. నీతండ్రినరముమేరకు నాగర్భంబున లోకోత్తరపురుషుఁడు జనించును. జయోత్సుకుఁడైన యాసట్టిని నీయెడ సమాధానపఱతు. త్రైలోక్య విజయుఁడైన యాతమ్మునిఁ గూడి సుఖముండు' మని వచించి నాఁటి మధ్యాహ్నము ప్రాల్మాలి తలగడవంక పాదము లుంచి నిద్రించెను. అపసవ్యంబుగాఁ బఱుండుటఁజేసి దితి యశుచియగుట యింద్రుఁడు గాంచి సమయము దొరకినందులకు సంతసించి యోనిమార్గంబున నామెగర్భముఁ జొచ్చి యందున్న పిండమును సప్తఖండములుగా వజ్రంబునఁ దుండించెను. కులిశహతులకుఁ బిండము విలపించెను. అప్పుడు దితి మేల్కాంచి సంగతి గ్రహించి 'ఖండింపకు ఖండింపకు' మని యింద్రుని బ్రతిమాలెను. పాకశాసనుఁడు గర్భమునుండి వెడలివచ్చి, 'తల్లీ, నీగర్భంబున శక్రహంత జనింపనుండుట వింటిని; నాఁడుసుత వెఱపు దోఁచి యిన్నాళ్ళు కాచితిని. అపసవ్యంబుగా నిద్రించుటఁజేసి యశుచివైతివి. అది యవ

కాశముగా నీసుతుని భేదించితిని. ఆత్మరక్షణ మెల్లరకుఁ గర్తవ్యము. తదర్థమిట్లు చేయవలసివచ్చెను. ఒండు తలంపకు; క్షమింపు' మనెను.

'ఆకార్యంబునకు దితి లోలోన మలమలమఱుగుచుండియు నింద్రుఁడు దురాధర్షుఁడైనకతన వానికిఁ గినియనోడి, 'బలసూదనా, నా యపచారమింత తెచ్చెను. ఇందు నీదోషమేనియు లేదు. చన్నదానికై వగచియు ఫలములేదు. అయిన నొండు ప్రియంబు నీవలనఁ గోరుదు. ఈసప్తఖండంబులు దివ్యరూపములు దాల్చి సప్తమారుతులై వాతస్కంధంబున సప్తవాయుస్థానంబు లధిష్ఠించి యందొకటి బ్రహ్మలోకంబునను రెండవది స్వర్గంబుననుమూఁడవది యంతరిక్షంబుననుడక్కినవి నాల్గును నాల్గుదిశలను శాలించుటకు ననుగ్రహింపుము' అని యాచించెను. సురేంద్రుఁడందులకు సమ్మతించెనఁట. నాఁడు దితి తపంబొనర్చినచోటనే విశాలానగరమును నిర్మించిరి.

'వత్సా, విశాలానగర ప్రదేశమాహాత్మ్యమును జెప్పితిని. ఆ పేరు దానికి వచ్చినవిధము వినుము. ఇక్ష్వాకువంశ్యుఁడు అలంబసుఁడను వాఁడుండెను. వానికి విశాలుఁడను సుతుఁడు జనించెను. అతఁడు తనపేర నప్పురంబును నిర్మించెను. విశాలునకు హేమచంద్రుఁడు వానికి సుచంద్రుఁడు, వానికి ధూమ్రాస్వుఁడు, వానికి సృంజయుఁడు, వానికి సహదేవుఁడు, వానికిఁ గుశాశ్వుఁడు, వానికి సోమదత్తుఁడు, వానికిఁ గాకుత్స్థుఁడు, వానికి సుమతి జనించిరి. ఆ సుమతి యిప్పుడు విశాలానగరంబున నున్నాఁడు. వీరెల్లరు వైశాలికులనఁ బ్రసిద్ధిగాంచి ధర్మతత్పరులై దీర్ఘకాలము మనిరి. ఈరాత్రి యందు విశ్రమించి యెల్లి మిథిలకుఁ బోవుదము' అనెను.

అంతలోన విశాలానగరము సమీపించెను. విశ్వామిత్రాదులు వచ్చుట చారులవలన సుమతి విని యెదురేగి మహర్షికిఁ బూజలొనర్చి, వానిపార్శ్వంబున ధనుఃఖడ్గతూణీరధారులై సముపస్థిత యౌవనంబున నివ్వటిల్లుచు సౌందర్యంబున నశ్వినులంబోలి మూర్తీభవించిన పరాక్రమదేవతలోయన నొప్పారుచున్న రాకుమారులఁగాంచి, 'మునీంద్రా, ఎవరువీరు? ప్రమాణేంగితచేష్టితంబుల నియ్యురువురును బరస్పరసదృశులై వెలయుదురు. పాదచారులై వీరిందు రానేల?' అని యడిగెను. గాధేయుఁడు వారివృత్తాంతము చెప్పెను. సుమతి యత్యధికప్రమోద మొంది రామలక్ష్మణుల నెంతయుఁ గారవించెను. అట్లు కౌశికుఁడును

రాసుతులును సుమతిసత్కృతులంది యా రేయి యందుఁ బుచ్చి తెల్ల వాఁతి మిథిలాభిముఖులై తరలిరి.

అహల్యావృత్తాంతము

వారట్లు పోవుచుండఁగా మార్గమధ్యంబున మహారమ్యమైన యుపవనం బొండు గానవచ్చెను. ఆ వనంబు మహామనోహరముగా నున్నను నరసంచార మనుమాట యందు గానరాకుండెను. అది వింత దోఁప, 'మహాత్మా, ఇది ఋష్యాశ్రమముగాఁ దోఁచుచున్నది. ఇట్లుండియు నిచ్చట మునులెవ్వరును గానరాఁ. కారణ మేమో యూహింపరాకున్న'దని రాముఁడడిగెను.

'వత్సా, ఇది గౌతమాశ్రమము. ఆ ఋషి యింటలేనితఱి వజ్రి గౌతమవేషంబున నిటకు వచ్చి యతనిభార్యయైన యహల్యను డాసి, 'విలాసినీ, నా మనంబు సేయుము. కాముకులు ఋతుకాలంబును బ్రతీక్షింప' రనెను. అతఁ డింద్రుఁ డగుట యా దుష్టమతి యెఱింగియు సురరాజకుతూహల ప్రేరితయై తదభీష్టముఁ దీర్చి, 'నిర్జరేశ్వరా, నీవలనఁ గృతార్థనైతిని; హుటాహుటి నపక్రాంతుఁడవగుము. ఉభయరక్షణము గార్య' మని చెప్పెను. శచీపతియు నాత్మసంతోషంబును దెలిపి పర్ణశాలనుండి చనుచుండెను. అంతలోన గౌతముఁడు వానికెదురై యా కుహనావేషధారిని గుర్తించి, 'దుర్మతీ! నా పరోక్షమున నా రూపు దాల్చి యకార్య మొనర్చితివి గావున విఫలుండవగు' మని శపించెను. ఆ మాటతోఁడ నింద్రుని వృషణంబులు నేలరాలెను. అంత గౌతముఁడు పర్ణశాలఁజొచ్చి భార్యను బిలిచి, 'పాపినీ! కామమోహితవైతివి; తగు ప్రాయశ్చిత్తమునఁ గాని నీకుఁ బరిశుద్ధి గలుగదు. వాయుభక్షణ మాత్రురాలవై భస్మశయన మాశ్రయించి యదృశ్యరూపంబున నిట వర్షసహస్రముండుము. దశరథాత్మజుఁడు రాముఁడిందు వచ్చును. వానికి నాతిథ్య మొసంగుము. ఆ పుణ్యవిశేషంబున నీ లోభమోహంబు లెడసిపోవును. పవిత్రీకృతవై యప్పుడు యథారూపంబున నా కడఁ జేరుదువుగాక' యని యా ఋషీంద్రుఁ డచ్చోటు వదలి సిద్ధచారణ సేవితంబగు హిమవంతంబునకుఁ జనెను' అని విశ్వామిత్రుఁడు వచించెను.

వారట్లు మాటాడుచు నాశ్రమముఁ జొచ్చిరి. ఎవ తెతన పుట్టువు దొట్టి నిర్మాతృప్రయత్నసారమోయన నొప్పి తపఃప్రభామండలంబున

నయ్యాశ్రమంబెల్ల నెలిగించుచు సురాసురులకుఁ గూడఁ దేటిచూడరాక యుండెనో, ఏ కాంతామణి పతిశాపవశంబునఁ దుషారమేఘుంబుచాటున దోఁచు పూర్ణచంద్రప్రభంబోలె, ధూమపరీతమైన యగ్నిశిఖచందంబున, జలాంతర సూర్యకాంతివలె, వేయు సంవత్సరములుండెనో యా యహల్య రామపాదధూళి సోకినంతనే స్వస్వరూపముఁ దాల్చి శోభిల్లి తన శాపావధిని గ్రహించి వారికి నాతిథేయసత్కారము లొనర్చి రాము నిట్లు స్తుతించెను.

అహల్యాకృత రామస్తవము

"అహో! కృతార్థోఽస్మి జగన్నివాస! తే
పదాబ్జసంలగ్నరజఃకణాదహం;
స్పృశామి యత్పద్మజశంకరాదిభిః
విమృగ్యతే రంధితమానసైస్సదా॥ 1

అహో! విచిత్రం తవ రామ! చేష్టితం
మనుష్యభావేన విమోహితం జగత్,
చరస్యజస్రం చరణాదివర్జితః
సంపూర్ణ ఆనందమయోఽతిమాయకః॥ 2

యత్పాదపంకజపరాగపవిత్రగాత్రా
భాగీరథీ భవవిరించిముఖాన్ పునాతి,
సాక్షాత్స ఏవ మను దృగ్విషయో యదాస్తే
కిం వర్ణ్యతే మమ పురాకృతభాగధేయమ్॥ 3

మర్త్యావతారే మనుజాకృతిం హరిం
రామాభిధేయం రమణీయదేహినం
ధనుర్ధరం పద్మవిశాలలోచనం
భజామి నిత్యం న పరాన్ భజిష్యే!॥ 4

యత్పాదపంకజరజః శ్రుతిభిర్విమృగ్యం
యన్నాభిపంకజభవః కమలాసనశ్చ
యన్నామసారరసికో భగవాన్ పురారిః
తం రామచంద్ర మనిశం హృది భావయామి॥ 5

యస్యావతారచరితాని విరించిలోకే
గాయంతి నారదముఖా భవపద్మజాద్యాః
ఆనందజాశ్రుపరిషిక్తకుచాగ్రసీమా
వాగీశ్వరీ చ తమహం శరణం ప్రపద్యే॥ 6

సోఽయం పరాత్మా పురుషః పురాణః
ఏష స్వయంజ్యోతి రనంత ఆద్యః
మాయాతనుం లోకవిమోహనీయాం
ధత్తే పరానుగ్రహ ఏష రామః॥ 7

ఆయం హి విష్ణోర్ధ్రువసంయమానా
మేకః స్వమాయాగుణబింబితో యః
విరించి విష్ణ్వీశ్వర నామభేదాత్
ధత్తే స్వతంత్రః పరిపూర్ణ ఆత్మా॥ 8

నమోఽస్తు తే రామ! తవాంఘ్రిపంకజం
శ్రియా ధృతం వక్షసి లాలితం ప్రియాత్
ఆక్రాంత మేకేన జగత్త్రయం పురా
ధ్యేయం మునీంద్రై ర్భిమానవర్జితైః॥ 9

జగత్తా మాదిభూత స్త్వం జగత్త్వం జగదాశ్రయః
సర్వభూతే ష్వసంయుక్త ఏకో భాతి భవాన్ పరః॥ 10

ఓంకారవాచ్య స్త్వంరామ వాచా మవిషయః పుమాన్
వాచ్యవాచకభేదేన భవా నేవ జగన్మయః॥ 11

కార్యకారణకర్తృత్వఫలసాధనభేదతః
ఏకో విభాతి రామ త్వం మాయయా బహురూపయా॥ 12

త్వన్మాయా మోహితధియా స్త్వాం న జానంతి తత్త్వతః
మానుషం త్వా మభిమన్యం తే మాయినం పరమేశ్వరమ్॥ 13

ఆకాశవ త్త్వం సర్వత్ర బహిరంతర్గతోఽమలః
అసంగోఽవ్యాచలో నిత్యశుద్ధబుద్ధః సదవ్యయః॥ 14

యోఽపి న్మూఢాహ మజ్ఞాతే తత్త్వం జానే కథం విభో
తస్మా త్తే శతశో రామ! నమస్కుర్యా మనన్యధీః॥ 15

దేవ! మే యత్ర కుత్రాపి స్థితయా అపి సర్వదా
త్వత్పాదకమలే సక్తా భక్తి రేవ సదాస్తు మే॥ 16

నమస్తే పురుషాధ్యక్ష! నమస్తే భక్తవత్సల!
నమస్తేఽస్తు హృషీకేశ! నారాయణ నమోఽస్తుతే॥ 17

భవ భయహర మేకం భానుకోటిప్రకాశం
కరధృతశరచాపం కాలమేఘావభాసం
కనకరుచిరవస్త్రం రత్నవత్కుండలాఢ్యం
కమలవిశదనేత్రం సానుజం రామమీడే॥ 8

రామలక్ష్మణులంత నామెకు మ్రొక్కి చననుండిరి. అంతలోన గౌతమమహర్షియు నటకు వచ్చి స్వతపోబలంబునను రామసందర్శనంబు నను విశుద్ధమై యున్న యహల్యను గ్రహించి గాధేయునకును దాశరథికిని యథోచిత మర్యాదలు గావించెను. రామలక్ష్మణులు గౌతమునకు మ్రొక్కి తదనుజ్ఞాతులై విశ్వామిత్రునివెంట నీశాన్యదిక్కు పట్టి చని జనకుని యజ్ఞవాటిఁ జేరిరి.

జనకుని యజ్ఞము

ఆ యజ్ఞశాల 'యనవరతపదక్రమపఠ్యమాన మహోద్విజ వేదధ్వనులను అవిచ్ఛిన్నహూయమానాగ్నిహోత్రస్వాహాశబ్దంబులను అనేకమునిగణప్రణీతవచనవిషయవిభాగ వినిర్ణయన్యాయ నిపుణ విద్వత్సభాసంభాషణఘోషంబులను, ప్రతిపక్షదుర్వినీతభేదప్రమాణ విచార్య మాణనేదార్థమీమాంసక గోష్ఠీవివాదనాదంబులనుం జేసి మ్రోయుచు, యజ్ఞప్రయోగప్రవీణులైన యాజ్ఞికులతో మహాతపోధనులతో, నగ్ని హోత్రసంభారశకటీశతంబుతో నిండియుండెను. రామాదులకు నట విడియుటకేని తావు దొరకదయ్యెను. వారదిగాంచి కొండొక వివక్త ప్రదేశంబున బస చేసిరి.

జనకుఁడు విశ్వామిత్రాదుల సందర్శించుట

జనకమహారాజు విశ్వామిత్రాగమనంబు విని శతానందునితోడఁ జని యా ఋషికి ఋత్విక్పూజలు గావించి యర్ఘ్యాదు లర్పించి సంభావితుఁడై 'మునీశ్వరా, దేవతలకృపవలన యజ్ఞము యథావిధి నర్థిల్లుచున్నది. మీ రాక యాగఫలంబుగా భావింతు. ధన్యుఁడనైతిని. క్రతుకార్య మింకను ద్వాదశదివసంబులు జరుగవలయుననియు భాగార్థులైన దేవతలసందర్శనము యజ్ఞాంతమునఁగాని సిద్ధింపదనియు విబుధులు వచింతు' రని వచించి గాధేయునిచెంత నున్న రాకుమారులఁజూచి,

సీ॥ కనుపండువొనరించు కలికికాంతులతోడఁ
జంద్రమండలనిభాస్యములతోడ
శ్రవణాంతదీర్ఘ నేత్రాంబుజములతోడ
సమదసింహపరాక్రమములతోడ
గజరాజగమనవైఖరిమించు నడతోడఁ
గమనీయకౌకపక్షములతోడఁ
గవలకుపాటియై గ్రాలుమూర్తులతోడఁ
గరగతచాపఖడ్గములతోడ

గీ॥ నవతరించిన సురవర్యులనఁగ నొప్పి
నూర్యచంద్రులదీప్తికి శోభగూర్చు
సురుచిరాకారవిజ్ఞానశుద్ధమతులు
పీర లెవ్వరో వీన నోర్తు విశ్రుతాత్మా !

అని యడిగెను. విశ్వామిత్రుఁడు మందస్మితవదనారవిందుఁడై, 'జనక రాజా,

సీ॥ తాటక మర్దించి తాపసకోటికిఁ
బ్రాణదాన మిడిన దాతృవరులు
మారీచుని సుబాహు ఘోరాజిఁ బోకార్చి
సవనంబుఁ గాచిన శౌర్యనిధులు
పాదాంబురుహధూళిఁ బాపంబు నెడయించి
యల యహల్యను దేర్చినట్టి ఘనులు
దశరథావనినాథు తపము ఫలింపఁగా
నవతరించిన యనఘాత్మవరులు

గీ॥ కాలకంఠునిచాపంబుఁ గాంచువేడ్క
నిందు వచ్చిన ధార్మికు లిద్ధచరిత,
రమ్యసుగుణాభిరాముఁడు రాముఁ డితఁడు
మిత్రవంశవర్ధనుఁడు సౌమిత్రి యితఁడు॥

అని వచించెను. ఆ వచనంబులు సుధామయములై దోఁప శతానందుఁడు పరమానంద మొంది, 'నా తల్లి యహల్యాదేవి కృతార్థయయ్యెనా ? ఆమె సపర్యలు గాంచితిరిగదా. నాతఁడ్రియైనగౌతముని సత్కృతులందెఁ గదా' యనెను. గాధేయుఁడు వానిని విని, 'శతానందా, అసంగతి యడుగవలయునా ? రేవణాదేవి భార్గవునిఁబోలె నహల్యాదేవి గౌతమునిఁ గూడె' ననెను.

అంత శతానందుఁడు రామలక్ష్మణులకు స్వాగతము పలికి, 'ఈ మహర్షి తోడ మీ రిటకు వచ్చుట దైవయోగము గాని వేఱుగాదు. ఈ యనఘుఁ డేతన్మాత్రుఁడు గాఁడు. వీని చరిత్రము లోకోత్తరమై మముబోంట్లకు మార్గప్రదీపకముగా నుండును. ఇట్టి యచింత్య తపో మహిమాఢ్యుఁడు బ్రహ్మర్షి మీకు రక్షకుఁడును శుభదాయకుఁడు నగుట మీరు ధన్యులరని వచింప నేల ? ఈ మహామహుని యుదంతము సంగ్రహముగా వచింతు వినుము.

విశ్వామిత్రుని చరిత్ర

బ్రహ్మకుఁ గుశుఁడు వానికిఁ గుశనాభుఁడు వానికి గాధియు జనించిరి. ఆ గాధి కీమహనీయుఁ డుదయించెను. ఈ పుణ్యమూర్తి బాల్యమందే సనుస్తవిద్యలు గఱచి ధర్మజ్ఞుఁడును ధర్మాత్ముఁడునై ప్రజాహితంబుగా రాజ్యమేలుచుండెను. ఒకనాఁడు వేటతమకము చెలరేఁగఁగా నీ యనఘుఁడు చతురంగబలంబుఁగూర్చి యక్షౌహిణీ సేనాసమావృతుఁడై తరలి నదీనదంబులు సేవించుచు నానానగరంబులు విలోకించుచు వివిధపుణ్యాశ్రమంబులు సందర్శించుచుఁ జనిచని బహువృక్షమృగాకీర్ణము సిద్ధచారణసేవితము దేవదానవకిన్నరాది సంశోభితమునై వాతాంబుపర్ణమూలాశనంబుల మనుచు జపహోమక్రియలఁ దవిలియున్న వాలఖిల్యవైఖానసాది మహర్షులచేతను బ్రహ్మర్షులచేతను వేదివహ్నులకరణిఁ దేజరిల్లుచున్న తపస్సిద్ధులచేతను నిండి యపర బ్రహ్మలోకమువలె నున్న వసిష్ఠాశ్రమము చొచ్చెను. వసిష్ఠు డీమునీంద్రునకు స్వాగతమిచ్చి యుచితాసనఫలమూలాది సత్కారంబుల నిమ్మహోత్ముని బడలికలువాపి యెంతయు మన్నించెను. ఉభయులును శుభకథలఁ దడవుపుచ్చిరి. అంత వసిష్ఠుఁడు దరహాసపూర్వకంబుగా, 'రాజా, అతిథిశ్రేష్ఠుడవును బూజనీయుఁడవునైన నీవు మాకు విందవైతివి. ఇది మాప్రాప్తము. కొండంత దేవరకుఁ గొండంతపత్రి పెట్టఁజాలరు. నా యలఁతి సత్కారంబులను నీవు నీ చతురంగబలసమేతంబుగా గ్రహించి నన్ను సంతోషపెట్టఁగోరుదు' ననెను. వసిష్ఠునియూదార్యంబునకు నీయన సంతసించి, 'మునీంద్రా, మీ సందర్శనమాత్రాననే మాకు సమస్తము జేకూరెను. మీ ప్రేమయేఁజాలు పోయివచ్చెద' ననెను. వసిష్ఠుఁ డంతతోమిన్నకుండక పట్టుపట్టెను. ఎట్టకేల కీ యనఘుఁడు వానిప్రణయ మంగీకరించెను.

వసిష్ఠ విశ్వామిత్రుల వైరము

వసిష్ఠుఁ డంత శబల యను తన ధేనువును బిలిచి, 'వత్సా, విశ్వామిత్రరాజమౌళికి సేనాసహితంబుగా నాతిథ్యమును నిశ్చయించితిని. షడ్రసోపేతములైన సమస్తభోజనపదార్థములఁ గూర్పు' మనెను. మాటతోడ మకరందములు నిక్షురసంబులును వివిధపానకంబులును నానాభక్ష్యవిశేషంబులును దధిక్షీరఘృతంబులును సూపంబులును బహురూపంబులైన యుపదంశంబులును మితిమీఱి సిద్ధమయ్యెను. ఈమాన

నీయుఁడు సబలంబుగా విందారగించి సంతుష్టుఁడై, 'ఋషిచంద్రమా, రాజు రత్నహారి యనుట సుప్రసిద్ధము. నీ హోమధేనురత్నంబును గోరితిని. ఇది ధర్మవ్యతిక్రమముగాదు. నీ హోమాదిక్రియలకుఁ దఱుగు లేకుండుటకుఁగా లక్షగోవులిత్తును. శబలాధేనువును నాకొసంగు' మని యడిగెను. అది విని, 'రాజేంద్రా, మానవంతునకుఁ గీర్తివలె నా కీ శబల యున్నది. లక్షగాదు నూఱుకోట్లు గోవులనిచ్చినను రజితరాసులఁ గ్రుమ్మరించినను దీని నీయనోపను. హవ్యకవ్యంబులు నగ్నిహోత్రంబును బలిహోమంబులు నవియివి యనఁనేల నా జీవయాత్రయంతయు దీని యధీనము. ఇదే నా సర్వస్వ' మని వసిష్ఠుఁడు పలికెను. ఈ ధీరాగ్రణి యంతతోఁ దనివిచెందక, 'మునీంద్రా, ఇది రాజదృష్టి నాకర్షించెను. నీవు మోడిసేయుట యుక్తముగాదు. సర్వభూషణభూషితంబులైన గజంబుల నాలుగువేలును, హేమకింకిణీకలిత హయోత్తమంబులతోడి సువర్ణ రథంబుల నెనిమిదివందలును, వాజిరత్నంబులఁ బదునొకండువేలును, గోవులనొక్కకోటియు, నీకొసంగుదును. మాఱుతలంపక యీ శబలనిచ్చి నాకు సంతోషము గూర్పుము. ఉచితంబుగా బ్రాహ్మణ ధనంబును గ్రహింపరాదు. ఏదికోరినను బదులాడకయిత్తు' ననెను. ఎన్నివిధముల బ్రబోధించినను వసిష్ఠుఁ డియ్యకొనక, 'రాజా, నాకు సకలకర్మాధారభూతయుఁ గామదోగ్ధ్రియు నైన యీ గోవును నీవుగోరుట తగదు. నీ రాజ్యమెల్ల నర్పించినను దీనినిఁబాయఁజాల' నని ఖచితముగా బదులాడెను.

ఈ గాధేయుఁ డందులకుఁ గోపోద్వేగియై గోవును బలాత్కారంబుగాఁ గొనిపోవ నుంకించెను. అది విచారకృశయై, 'కటా! దీను రాలిని నన్నిట్లు రాజు బలాత్కరించుటఁ గన్నారఁ జూచుచు వసిష్ఠ భగవానుఁడు మిన్నకున్నాఁడు ఈ మహానుభావుఁడు నన్నుఁ ద్యజించెఁ గాఁబోలు. మహర్షికి నేనేమి యెగ్గొనర్చితి? భక్తిమై ప్రియంబులు గూర్తుగదా!' యని లోలోన వంది వెచ్చనూర్చి తన్ను చుట్టియున్న భటవర్గంబును విదళించినైచి కుప్పించి యెగచి వసిష్ఠునిపాదమూలముఁ జేరి, 'బ్రహ్మపుత్రా! నీకష్టైదుట నన్నిట్లు రాజభటులు బలవంతముగాఁ గొనిపోవనున్నారు. నీ శబలను విడనాడితివా?' యని వ్యసనకలుషిత స్వరంబునఁ బలికెను. వసిష్ఠు డామాటలు విని 'శబలా! నా కెట్టి యపకారమునుఁ జేయవు; నిన్నుఁ ద్యజించిన వాఁడఁ గాదు. ఈ రేఁడు మహాబలశాలి; ఇతనినోర్చుబలము నాకుఁ గలుగదు. ఏమి సేయనగు'

నసెను. అందులకు శబలాధేనువు జొటజొట కన్నీరు నించి, 'బ్రహ్మబలమే బలముగాని క్షత్రబలము నొకబలమా? మహాత్మా! నీ బల మప్రమేయము; నీ తేజస్సు దురాసదము. భవదీయ బలసంభృతమైన నన్ను నియోగింపుము; ఇతని బలదర్పంబులఁ జూతు; రాజులకుఁ గఱటిదనము గారాదని యిత్తఁ డెఱుంగుఁగాక' యని విన్నవించెను. వసిష్ఠుఁడు తల యూచి మిన్నకుండెను.

అంత శబలాధేనువు హుంభారావముఁ గావించెను. ఆ శబ్దము తోడఁ దండోపతండములుగాఁ బహ్లవ లుప్పతిల్లి యారాజ్యసైన్యంబును రూపుమాపిరి. ఈ ధార్మికోత్తముఁడు కోపోద్దీపితుఁడై రథ మధిష్ఠించి నానాస్త్రంబులఁ బహ్లవులను సంహరించెను. శబలాధేనువు మరల హుంభారావముఁగావించెను. ఆ రావముతోడ హేమకింజల్క దేహచ్ఛాయా సుభగులును సువర్ణాంబరధరులు నైన యవనశకులు వేనవేలుగా నుద్భవించి నిమిషార్ధమునకు దుప్పులు దొడవి తేజోవీర్యరాసులోయన నొప్పుచుఁ జెలరేగి రాజబలశేషంబును దాఁకి దానినెల్ల నిర్దగ్ధ మొనర్చిరి. ఈ వార్తయుఁ గడచి గాంచి మహోగ్రుఁడై వివిధాయుధంబులఁ గురిపించి వారిని మట్టుపెట్టెను. శబల మరల హుంభాయనెను. దాని పొదుగు నుండి పహ్లవులును, యోనినుండి యవనులును శకృత్తునుండి శకులును రోమకూపంబునుండి మ్లేచ్ఛకిరాతహారీతకులును ముఖంబునుండి సూర్యాగ్నిదీప్తిమంతులైన కాంభోజులును జనించి వైరిమూలబలంబును ముట్టడించి దానినెల్ల నుగ్గునూచ మొనర్చిరి. కౌశికుని తనయులు నూర్వురు నదిగాంచి యాగ్రహావిశులై యాయుధంబులఁ గొని వసిష్ఠుని మీఁదికి నుఱికిరి. ఆ తాపసి హుంకరించెను. వారు భస్మీభూతులైరి.

విశ్వామిత్రుఁడు రాజ్యమును సన్యసించుట

పుత్త్రనిరయంబును గాంచి యీ గాధేయుఁడు గోరలుతీసిన సర్పంబుపగది నుత్థితయుఁడిగిన సముద్రముక్రియ రాహుగ్రస్తమైన సూర్యబింబమువలె నుద్వేగదర్ప తేజంబులు మాని లజ్జించి తెక్కలు డుల్చినపక్షివలె నిరాధారుఁడై హతశేషుఁడైన తన తనయునకు రాజ్య మప్పగించి హిమవత్పర్వతంబునకుఁ జని యట మహేశ్వరునిగూర్చి ఘోరతపంబు గావించెను. ఆ ముక్కంటి ప్రసన్నుఁడై వరముగోరు మనెను. ఈ ధృఢవ్రతుఁడు ధూర్జటికి మ్రొక్కి, 'దేవా! నా తపంబును మెచ్చితివేని నాకు ధనుర్వేదంబును సాంగోపాంగంబుగా సరహస్యంబుగా

ననుగ్రహింపుము. మఱియు దేవదానవ యక్షగణోగంధర్వమహర్షుల యందుఁ గల సర్వాస్త్రంబులు నాకు స్ఫురించునట్లుఁ గరుణింపు' మనెను. పరమేశ్వరుఁడు నట్లే యగుఁగాక అని పలికి యంతర్హితుఁ డయ్యెను.

విశ్వామిత్రుఁడు మరల వసిష్ఠుని దార్కొనుట

ఈ ధీరుఁ డంత హరవరగర్వోద్ధతుఁడై పర్వకాలసముద్రముభంగి విజృంభించి వసిష్ఠాశ్రమపదముఁ జొచ్చి సర్వదహనశీలంబులైన యస్త్రంబుల దానిని దగులఁ బెట్టెను. ఆ వేడిమికి నయ్యాశ్రమవాసులు పాఱఁజొచ్చిరి. అందలి మృగపక్షిజాతంబు లుదిలకొని నెఱవు దోఁపక దుముకుచు నెగయుచు నఱచుచుఁ బడిచచ్చెను; క్షణములో నయ్యాశ్రమ మెల్ల నిర్జీవమై యూసరక్షేత్రముగా మాఱెను. వసిష్ఠుఁ డది గాంచి పఱచుచున్న తన శిష్యవర్గంబును మరల్చి యీ యుద్ధతునివంక మరలి రోషావేశుఁడై, 'మూఢా! చిరసంవృద్ధమైన యాశ్రమంబును బాఁడు చేసితివి; ఇఁక నీ జీవము దుర్లభ' మని పలికి ప్రళయాగ్నికరణి నెలుఁగు చున్నదియు యమదండంబును బోనిదియు నైన తన దండంబును జేఁబూనెను. ఈ ధార్మికోత్తముఁడు వాని నదల్చి యతనిపై నాగ్నేయాస్త్రంబును వైచెను. వసిష్ఠుఁడు నిజదండంబును విసరి, 'క్షత్రియాధమా! చూపు నీనామర్థ్య' మనెను. జలంబుల సగ్నివలె బ్రహ్మదండంబున నాగ్నేయాస్త్రము శమించెను. ఈ కుశికనందనుఁడు పెల్లు కినిసి వారుణాస్త్రంబును రౌద్రాస్త్రంబును ఐంద్రాస్త్రంబును పాశుపతంబును ఐషీకాస్త్రంబును మానవమోహనాస్త్రంబులను గాంధర్వాస్త్రంబును స్వాపన జృంభణ మారణ సంతాపన విలాపన శోషణ దారుణాస్త్రంబులను వజ్రాస్త్రంబును బ్రహ్మపాశ కాలపాశ వరుణపాశంబులను పైనాకదైవతంబులను శుష్కార్ద్ర దండ పైశాచ క్రౌంచంబులను ధరచక్ర కాలచక్ర విష్ణుచక్రంబులను వాయవ్య మథన హయశిరోనామకాస్త్రంబులను గంకాల ముసలంబులను శక్తిద్వయంబును వైద్యాధర కాలాస్త్రంబులను త్రిశూలకాపాల కంకణంబులను దదితరంబులైన నానాస్త్రంబులను బరఁగించెను. వసిష్ఠుఁడు వానినెల్ల దన దండంబున హరించెను. ఈ వీరాగ్రణి యుపాయాంతరము గానక తెంపు వహించి బ్రహ్మాస్త్రంబును బ్రయోగించెను. దేవతలును దేవర్షిగంధర్వాదులును సంభ్రాంతులైరి. ముల్లోకంబు లుడ్డుఁడికెను. వసిష్ఠుఁడంత త్రైలోక్యమోహనంబును మహారౌద్రంబునైన రూపముఁ దాల్చి నిజ

తపోవిశేషసమున్నతంబైన యా బ్రహ్మదండంబునఁ దద్బ్రహ్మాస్త్రంబును మ్రింగెను. వాని రోమకూపంబులనుండి ధూమజ్వాలలు రికిలెను; బ్రహ్మదండము విధూమకాలాగ్నికరణిఁ బ్రజ్వరిల్లెను. మునులెల్లరు విషాదపరులై గుమికూడి వచ్చి, 'మహాత్మా! నీ బలమమోఘము; విశ్వామిత్రుఁడు నిగృహీతుఁడు; శాంతింపుము; బ్రహ్మాస్త్రంబులు బ్రశాంతములైనవు' అని వేడిరి. ఆబ్రహ్మర్షి యట్లొనర్చెను. ఈయుక్కిరి నిజపరాభవంబునకు నిట్టూర్పులు పుచ్చి, 'అహో! హరవరదత్తంబులైన మహాస్త్రంబులుగూడ నిమ్మునిమ్రోల మస్తకములు వ్రాల్చెఁగదా. బ్రహ్మబలమే బలము. ఛీ! క్షత్రబలమునొక బలమా? నిజము గ్రహించితి' నని విసివి క్షత్రధర్మంబును నిరసించి భార్యాసమేతుఁడై దక్షిణదిశకుఁ జని బ్రహ్మత్వంబును గోరి నలువంగూర్చి వేయివత్సరంబులు మహోగ్రతపంబొనర్చెను. పితామహుఁడు ప్రసన్నుఁడై 'విశ్వామిత్రా! రాజర్షివైతివి లెమ్ము' అని పలికి యంతర్హితుఁ డయ్యెను. ఆ వచనంబుల కీషునుఁడు సంతసింపక ఇంతయా మదీయతపఃఫలము' అని కటకటంబడి మగుడఁ గఠోరతపశ్చరణంబునకు దొరకొనెను.

విశ్వామిత్రుఁడు త్రిశంకునకు సశరీర స్వర్గమిచ్చుట

అయ్యవసరంబునఁ ద్రిశంకుఁ డను నిక్ష్వాకువంశరాజుండెను. అతఁడు సశరీర దేవలోకప్రాప్తికై మఖమొనర్పఁ గోరి తనసంకల్పంబును స్వకులాచార్యుఁడైన వసిష్ఠునకు విన్నవించెను. ఆ ఋషిచంద్రుఁ డతని విని, 'రాజా! నీ కోరిక దుర్లభము. ఈ యూహ మానుము' అని హితముపదేశించెను. త్రిశంకుఁ డామాటను ద్రోసిపుచ్చి దక్షిణదిశకు జని క్రతుకర్మసిద్ధికిఁగా వసిష్ఠపుత్త్రులకు నూర్ధ్వరకు మ్రొక్కి, 'మునిపుత్త్రకులారా! మహాక్రతువొండుసంకల్పించి వచ్చితిని. తన్నిర్వహణార్థము గురుపుత్త్రులను మిమ్ము వేఁడుదు' ననెను. సంగతి యేమని వారతని నడిగిరి. 'సశరీర దేవలోకప్రాప్తిఁ గోరి యందులకు నుభవగు యజ్ఞంబును గావింప నుద్దేశించితిని. తగుజన్నంబును నిర్దేశించి నావలన దానినిఁ జేయించి నన్నుఁ జరితార్థుని నొనర్పుఁడు. నాగురువు వసిష్ఠుఁడు నాయాశయంబును నిరసించెను. గత్యంతరముఁ గానక యంతటివారైన మిమ్మునాశ్రయించితిని. ఇక్ష్వాకులకు వసిష్ఠుఁడే యేడుగడ. అట్లుండియు వారు నన్ననుగ్రహింపరు. మీరే నాకిఁక దిక్కు' లని మ్రొక్కెను. వాసిష్ఠులాకతయెల్ల విని, 'దుర్మతీ! ఆచార్యునిమాట రాజులు జవదాఁటరు. అందునను నీవు ఇక్ష్వాకువంశ్యుఁడవు; మీగురువు వసిష్ఠభగవానుఁ

జేతన్మాత్రుఁడుగాడు. ఆయన కాదన్నది మావలన నగునా? నీ విట్లు చేయుటవలన గురునును దిరస్కరించినవాఁడవై తివి. నీ జడబుద్ధిని మాని వెంటనే సీనగరంబునకుఁ బొమ్మ' నిరి. ఆతఁడు వారి హితవచనంబుల మన్నింపక, 'గురువు నిరాకరించుఁగాక, గురుపుత్త్రులు తిరస్కరింతురు గాక; అన్యయాజక సాహాయ్యంబుననేని నాయర్థంబును సాధింతుఁగాని యుజ్జగింప' ననెను. వాసిష్ఠులు వాని యవినయంబునకుఁ గోపగించి, 'ఛీ! మూర్ఖా! చండాలుఁడ వగు' మని శపించిరి.

ఉ॥ ఆమని పుత్త్రికోపదహనార్చుల మాడుటనోయనంగఁ ద
ద్భూమిపుదేహ మొందె మసిఁబూసినచందముఁ గట్టువస్త్రముల్
భూమసవర్ణమయ్యె మెడఁదోఁగెడుభూషలు లోహమయ్యెఁ బ్రా
చీముఖమండలాగ్రమునఁ జేపుఱుగ్రమ్మెడు నంతలోపలన్.

త్రిశంకుఁడు తన చండాలత్వంబునకు ఖిన్నుఁడై నిజపరివారము నెల్ల డించి యేకాకిగా నిమ్మహోత్పాతనికడకు నచ్చెను. ఈ గాధేయుఁడు త్రిశంకువును గుఱుతించి, 'వత్సా! సంగతి యేమ'ని యడిగెను. 'మహాత్మా! బొంకి యెఱుఁగ; ఋత్త్విగ్భర్మంబు నుజ్జగింపను; వెక్కు జన్నంబులు గావించితిని; గురువులను బెద్దలను యథామతిఁ బూజించితిని. ధర్మైకదృష్టిఁ బ్రజలను బరిపాలించితిను. ఇట్లుండియు నాకు నాగురువు వసిష్ఠుడును వ్యాపుత్త్రులును బరితోషింపరు. పౌరుషము నిరర్థముగాఁ దోఁచెను. సర్వము దైవాధీనము; దైవోపహతుని నన్నుఁ బ్రసాదింపుము; నీకన్న దిక్కు గలుగదు' అని దీనాలాపపూర్వకంబుగాఁ దనవృత్తాంతమెల్ల నెఱిఁగించెను. ఈ దయానిధి త్రిశంకునియెడఁ గనికరమూని, 'వత్సా! భయపడకు; నేను రక్షకుఁడనై నీయభిమతంబుఁ గావింతు; ఈనీ చండాలరూపంబుననే నీకు సశరీరస్వర్గప్రాప్తిఁ జేకూర్తు' నని వానికి నభయహస్తమిచ్చి, తనపుత్త్రులను రప్పించి 'సుతులారా! వలయు యజ్ఞోపకరణంబుల సమకూర్పుము; నామాటఁగాఁ జెప్పి బహుశ్రుతులగు ఋషులను ఋత్విజ్యత్రిశిష్యనర్గంబుతోడ రావింపుఁడు; నావచనము నిరాకరించువానిని నాకెఱిఁగింపు' మని యాజ్ఞాపించెను.

వారు నానాదేశంబులకుఁ జని బ్రహ్మవేత్తలకు సంగతి తెలిపి వచ్చి 'నాయనా! మీయాజ్ఞ యెయినర్చితిమి; ఎల్లరు రానున్నారు గాని మహోదరుఁడు మాత్రము రాఁడు. మఱియు వాసిష్ఠులు మా పిలుపు విని 'భళీభళీ! చేయునది యజ్ఞము, చేయువాఁడు చండాలుఁడు, చేయించునది ఋత్రియుఁడు; దేవతలు హవిర్భాగంబులఁ జేసేతల గ్రహింతురులే.

విశ్వామిత్రుని యేలుబడిలోని బ్రాహ్మణమహనీయులు చండాలభోజన మూరగించి సశరీరస్వర్గముఁ బడయుదురపో' యని పరిహసించిరి. వారి నేల యింతనరా' దని చెప్పిరి.

ఆమాటలు విని యీ చండశాసనుఁడు మండిపడి, 'ఔరా! తపశ్శాలిని నన్ను నిష్కారణంబుగా నిందించిరా? వాసిష్ఠులారా! మీగర్వము దుర్భరము. మీరు మీ యపరాధానలభస్మీభూతులై యమలోకంబునకుఁ బోవుదురుగాక; మఱియు సప్తశతజన్మంబులు శవాశనులుగాఁ బుట్టి శ్వపచులై విరూపంబులతో భూలోకంబునఁ జరింతురు గాక; మహోదరుఁడు లోకదూష్యుఁడగు కిరాతుఁడగుగాక' యని వారిని శపించెను.

తక్కినబుష్యాదులు రెండుమూఁడుదినములలో వచ్చిచేరిరి. వారి నెల్లఁగూర్చి 'ఇతఁడు త్రిశంకుఁడు; ఇక్ష్వాకునంశజుఁడు; దయార్ద్రధర్మ పరుఁడు. శాపవశంబున వీనికిఁ జండాలత్వము దాపరించెను. ఇతఁడు స్వశరీరస్వర్గప్రాప్తిఁగోరి నన్ను శరణిల్లెను; మాట యిచ్చితిని; తదర్థము క్రతువారంభింపు' మని యీయన చెప్పెను. వారామాట విని దిగాదు పడి యొండొరు గుసగుసలాడి 'కటా! ముప్పు దప్పదు; పరమ కోపనుఁడు; అడ్డు చెప్పినచో శపించు' నని తలపోసికొని యెట్టకేలకు సమ్మతించిరి.

ఈయన యాజకుఁడై నిల్చెను. మంత్రకోవిదులు కల్పసూత్ర ప్రకారము సమస్తకర్మములను గావించి హవిర్భాగగ్రహణార్థము సర్వదేవతల నాహ్వానించిరి. ఎవ్వరు రారైరి. వేల్పుల సమ్మెకట్టునకు గాధేయుఁడు క్రోధావిష్టుఁడై త్రిశంకునివంక మరలి, 'వత్సా! ఇదిగో విశ్వామిత్రుఁడు స్వతపోమహిమంబున నిన్ను సశరీరంబుగా స్వర్గంబునకుఁ బంపుచున్నాఁడు, పోపొమ్ము' నెను. ఎల్లరు నిర్నిమేషులై చూడ సాగిరి; త్రిశంకుఁడు శరీరముతోడ స్వర్గమునకుఁ దరలెను. అట దేవేంద్రుఁడు వానిఁ జూచి, 'త్రిశంకూ! ఇందుండఁ దగవు; భూతలంబునకుఁ బో; మూఢా! గురుశాసనధిక్కారఫలంబుగాఁ దలక్రిందుగాఁ బడు' మని పలికి వాని నందుండి త్రోసెను. త్రిశంకుఁడు దలక్రిందుగా వ్రాలుచు, 'హా! విశ్వామిత్రా! హా! గాధేయా! త్రాహి! త్రాహి' యని కుయ్యిడసాగెను. అ ఆర్తరావమును గాధేయుఁడు విని, 'నిలు నిలు' మని పలికి యపరబ్రహ్మయోయన నూతనసృష్టికి దొడఁగి సప్త మహర్షులను సప్తవింశతినక్షత్రంబులను సృజించి రెండవయింద్రుని

బుట్టించుటో స్వర్గ మనింద్రమగుటో యొకటి తప్పదని నిశ్చయించుకొని నిర్జరనిర్మాణంబునకుఁ బ్రారంభించెను.

దేవతలు భీతిల్లి యాకౌశికునొద్దకు వచ్చి 'మునీంద్రా! నీవెఱుంగని ధర్మము గలుగదు. త్రిశంకుఁడు గురుశాపహతుఁడు. అట్టివాఁడు శరీరము తోడ దివికి రాఁజన' దని సానునయంబుగా వచించిరి. ఈయన తల యూచి 'నామాట వమ్ము గారాదు; మిమ్ముఁ జిన్నపుచ్చఁ గూడదు. నా నిర్మించిన నక్షత్రాదులు లోకంబులున్నంతకాలము శాశ్వతంబుగా నుండవలయును. ఇది మీకు సమ్మత మేని నా యుద్యమము నుజ్జగింతు' ననెను. వారు బదులాడనోడి 'అట్లేయగుఁగాక; అయిన నొక్కటి మోరుదుము. నీ నిర్మించిన నక్షత్రంబులు జ్యోతిశ్చక్రంబునెలుపల నుండుఁ గాక; త్రిశంకుఁడు వాని మధ్యఁ దలక్రిందుగా నమరతేజంబునఁ దనరారు గాక! వాని నవి యట స్వర్గంబున బలె ననుసరించుఁగాక' యనిరి. ఈయన సమాధాన పడెను. యజ్ఞమట్లు పరిసమాప్తమయ్యెను. అనంతర మీ తపోధనుఁడు యజ్ఞార్థము వచ్చిన మునులను బంపివైచి యాశ్రమవాసు లను బిలిచి 'నిర్విఘ్న తపశ్చరణమును గోరి యిందు వచ్చితిని. ఇట నాసంకల్పము భంగమయ్యెను. పశ్చిమదిశయందుఁ బుష్కరతీర్థములతో నిండిన దివ్యతపోవనంబులు గలవు. అందుఁ జనుద' మని వారిని వెంటఁ గొని తరలి యచ్చోటు చేరి యందు

సీ॥ నీహారనిర్ఝలనీరముల్ గలచోటు
ఫలమూలబుద్ధమై మలయుచోటు
నీడయిరుల్ గప్పి నింపొదియగుచోటు
పూఁదేనెసోనలు పొలయుచోటు
కమ్మనితెమ్మెరల్ గవచి పీచెడుచోటు
హాయిగా లేయండ గాయుచోటు
నిశ్శబ్దనిలయమై నివ్వటిల్లెడుచోటు
పరదుష్ప్రవేశమై పరఁగుచోటు

గీ. నిరతనిర్వ్యాకులాత్యుగ్రతరసమాధి
యోగనిష్ఠానుకూలమై యుండుచోటు
వెదకి వెదకి యాఘోరాటవీతలంబుఁ
గడకు తనయిచ్చవచ్చిన కడను గాంచె.

అట్లు యోగ్యస్థానంబును నిర్ణయించుకొని యచట ఫలమూలా శనుఁడై మహోగ్రతపం బొనర్పసాగెను.

అంబరీషోపాఖ్యానము

అత్తఱి నయోధ్యాపతి యంబరీషుఁడు యాగ మొండు ప్రారంభించెను. ఆ యజ్ఞపశువును దేవేంద్రుఁడు తెక్కలికొని చనెను. ఆ సంగతి పురోహితుఁడు గ్రహించి రాజునకు సంగతి తెలిపి, 'రాజా, ఇది నీ దుర్నయఫలము; అరక్షితులైన రాజులను దోషంబులు హరించును. దోషపరిహారార్థము మహత్తరప్రాయశ్చిత్తము కర్తవ్యము. యజ్ఞపశువును వెదకించి తెప్పించుటో తత్ప్రత్యామ్నాయంబుగా నరపశువును బంధించి యాగసమాప్తిచేయుటో రెంట నొకటి తప్ప' దనెను. అంబరీషుఁడు సంగతి విని పర్యాలోచించి యింద్రాపహృతమైన యజ్ఞపశువును సాధించి తెచ్చుట కానిపని యని నిశ్చయించి నరపశువు నిమిత్తము వేనవేలగోవులతోడఁ దరలి నానాదేశంబులు గ్రుమ్మరి వివిధనగరంబులును బెక్కుగ్రామంబులును బహు పుణ్యాశ్రమంబులును గలయ విచారించి యెందును వాంఛితార్థంబును బడయక యెట్టకేలకు భృంగతుంగపర్వతముఁ జేరి యట మిత్రసహశత్రసహితంబుగానున్న ఋచీకమహర్షిని సందర్శించి యెఱిగి సంగతి విన్నవించి, 'మహాత్మా, నా యాగార్థము నీసుతులలో నొకరి ననుగ్రహింపుము; వేనవేలు గోవు లిత్తు'ననెను.

ఋచీకుఁడు తలయూచి, 'రాజేంద్రా, జ్యేష్ఠకుమారు నీయరాదు గదా!' యనెను. ఆమాట వానిభార్య యందికొని, 'తండ్రికిఁ బెద్ద కొడుకు ముద్దు, తల్లికిఁ జిన్నకొడుకు ముద్దు' అని పలికెను. ఆ ఋషికుమారులలో నడిమివాఁడు శునశ్శేపుండు తన తలిదండ్రుల పలుకులు విని, 'రాజా, రెంటకుఁ జెడిన రేవఁడ నేనున్నాను. గోశతంబున నన్ను విలిచికొని పో'మ్మనెను. అంబరీషుఁడు సంతసించి యట్లు గావించి వానిని రథమెక్కించుకొని మధ్యాహ్నంబునకుఁ బుష్కరతీర్థము చేరి యందు సుంత విశ్రమించెను.

అటఁ దనమేనమామ విశ్వామిత్రుఁ డుండుట శునశ్శేపుఁడు విని వానియొడిలో వ్రాలి, 'మునీంద్రా, రక్షింపుము, రక్షింపుము. అన్యశరణంబు నాకుఁ గలుగదు. రాజు కృతకృత్యుఁడు గావలయును; నేను దీర్ఘాయుష్మంతుఁడనై చిరతపంబు సలిపి నాకలోకముఁ బడయవలయును. ఈయుభయముఁ గూడునట్లు ప్రసాదింపు' మని సంగతి యెల్ల వివరించెను. ఈ గాధేయుఁడు వాని నోదార్చి తన కొడుకులను

బిలిచి, 'పుత్త్రులారా, శుభార్థులై సుతులను గాంతురు. శుభంబులు ధర్మఫలంబులు. ధర్మములలో నెల్లఁ బరోపకార ముత్తమోత్తమము. 'పరోపకారార్థ మిదం శరీర'మ్మని చెప్పిరిగదా. ఇట్టి ధర్మాచరణంబు నకు నవసరంబులు వలచినప్పుడెల్లఁ గలుగవు. అట్టిది నేఁడు మనకు నయాచితంబుగా లభించెను. అదియు సామాన్యమైనదిగాక శరీరత్యాగ పూర్వకమైనదిగా నున్నది. పరలోక మంగళంబునకు నింతకన్న మంచికాలము దొరకదు. పుణ్యవిశేషంబున నిది సంప్రాప్తమయ్యెను. ఇంటికి వచ్చిన సిరినిఁ గాలఁ దన్నరాదు. సంగతి వినుఁడు. ఈ బాలుఁడు మునిసుతుఁడు; నన్ను శరణుచొచ్చెను. వీనికిఁ బ్రాణ దానమిచ్చి శుభంబుఁ బడయుఁడు. అంబరీషుఁడు యాగార్థము నర పశువును గోరెనఁట. తదర్థము వీని నితనితలితండ్రు లిచ్చిరఁట. ఆ జేని కోర్కిఁ దీర్చి యగ్నిదేవునకు సంతుష్టి యొనర్పుఁడు. ఇతఁడు రక్షితుఁ డగును; యాగము పూర్తినొందును; దేవతలు తనియుదురు. మీరు మీ తండ్రిపనుపు నొనర్చి పితృఋణముఁ దీర్చినవారగుదు' రనెను.

ఈ మహర్షికుమారులు మధ్యమ్యందాము లామాటలు విని, 'నాయనా, కడుపారఁగన్న సుతులను బలియిచ్చి పరజనపుత్త్రులఁ గాచు తండ్రియుండునా? ఇట్టినీఁత సిద్ధాన్నంబును గాలఁ దన్నివైచి శ్వమాం సంబును దినుటగదా' యని పరిహాసపూర్వకముగాఁ బలికిరి. ఈ తపో ధనుఁడు మహోగ్రుఁ డొంది,

చ॥ గురువులమాటఁ బుత్త్రికులు గూర్తురు ప్రాణములిచ్చియైన ని
క్కరణిని మాఱుమాటఁ బలుకన్ సహసింపరు, ధిక్కరించి యా
డిరి పరధర్మగర్హితపుసేవ సహింపఁగ నౌనె దీని? మీ
గరువమె మిమ్ము క్రిందఁ గమకట్టెఫలంబది దప్పఁ బోరికిన్.

మీ పాపఫలంబుగా మీరుగూడ వాసిష్ఠులవలె శ్వపచులై వేయేండ్లు భూమండలంబునఁ గ్రుమ్మరుదురు' గాకయని శపించి శునస్సే ఫునకు రక్షయొకటి యిచ్చి, 'మునిపుత్త్రా, వైష్ణవంబగు యూపస్తంభ మును నిన్నుఁ జేర్చునప్పుడు రక్తమాల్యానులేపంబులు దాల్చి దర్భపాశ బద్ధుఁడవై యింద్రోపేంద్రగాథల గానమొనర్పుము; మేలగు' నని చెప్పి యా మంత్రము లుపదేశించి వానిని బంపెను.

అంబరీషుఁడు యాగమారంభించి సదస్యుల యనుమతిం బొంది రక్తాంబరమాల్యధారియైన శునస్సేఫుని యూపస్తంభమునకు దర్భపాశం బులతో బంధించెను. ఆ మునికుమారుఁడట్లు బద్ధుఁడైనంతనే యా

మంత్రంబుల జపించెను. ఇంద్రుఁడు ప్రసన్నుఁడై వానికి దీర్ఘాయువులిచ్చి చనెను. అంబరీషుఁడు తనయజ్ఞము దేవేంద్రప్రసాదంబున బహుగుణ ఫలవంతంబుగా భానించి దానినంతతోఁ బరిసమాప్తి యొనర్చెను.

ద్వితీయభంగము

ఈ మహోత్సుఁడట్లు గావించి తన వ్రతభంగంబునకు సుంత విసివి మరల వేయిసంవత్సరంబులు తీవ్రతపం బొనర్చి వ్రతాంతస్నాతుఁడయ్యెను. అంతలోన బ్రహ్మదేవుఁడు సురపురోగముఁడై యటకువచ్చి, 'కౌశికా, నీతపంబుచేర్మి ఋషివైతివి సుమా' యని పలికి చనెను. ఈ గాధేయుఁ డామాటకుఁ దనివిచెందక మరలఁ దపశ్చరణంబునకుఁ గడఁగెను. అట్లు ఘోరతపం బాచరించుచుండఁగాఁ గొండొకనాఁడు మేనక పుష్పకతీర్థంబునకు స్నానార్థమువచ్చి యందుఁ దోయములాడుచుఁ గాఱుమబ్బులోని మెఱుఁగుఁదీవెవలె వీనికంటఁ బడెను. తోడ్తోడ వీనికి వలపు చెలరేఁగెను. మోహము దుర్వ్యయముగదా.

"ఆ॥వె॥ ఎంతశాంతులయ్యు నెంతజితేంద్రియు,
లయ్యుఁ గడువివిక్తమైనచోట,
సతులగోష్ఠి గలుగ సంచలింతురెందుఁ,
గామునకు నోర్వ గాదుసుమ్ము."

అంత నిత్తాపసి యా పూఁబోడి నియ్యపఱచి దానివలపునకుఁ జిక్కి యదే లోకంబుగా పదియేండ్లు గడపి కనువిచ్చి చూచి యాత్మదోషంబునకు సిగ్గునంబోలెఁ జింతాశోకపరాయణుఁడై, 'కటా! అమరుల పన్నుగడ నేరక వెఱ్ఱినైతిని; తపోవిఘ్నమయ్యెను; పదియేండ్లు వృథచనె' నని పశ్చాత్తాపపడి, తనమ్రోల వడఁకుచు నిలిచియున్న మేనకను బుజ్జగించి పంపివైచి, యందుండి హిమాద్రికిఁ జని కౌశికతీరంబున దృఢసంకల్పపూర్వకంబుగా ఘోరతపం బారంభించెను.

అట్లు వేయిసంవత్సరములు చనెను. ఆ తపోవిశేషంబునకు ఋషులు బెగ్గడిల్లి పితామహునిడాసి మొరలిడి వానినిఁ దోడితెచ్చి, 'మునీంద్రా, నీతపఃఫలంబుగా మహర్షివైతి' వని వానినోటఁ జెప్పించిరి. ఆమాటకు నిమ్మహాధీరుఁడు సంతోషదుఃఖములు పొరయక, 'దేవా! మహర్షినేని జితేంద్రియుఁడనేగదా' యని సవినయంబుగా నడిగెను. 'గాధేయా! జితేంద్రియత్వము నీకింకను సిద్ధింపదని' వేల్పుపెద్ద పలికి చనెను.

తృతీయభంగము

ఈ ధీరుఁడంత నెట్టించిన పట్టుదలతో వాయుభక్షణవ్రతియై నిరాలంబముగా వేసవియందుఁ బంచాగ్నిమధ్యంబునను వర్షాకాలంబున బట్టబయిటయు శిశిరంబున జలాంతరమందును రాత్రిందివము కఠినతపం బొనర్పసాగెను. అట్లు వేయేండ్లు మరలఁ గడచెను. ఆ తపస్సునకు నింద్రాదులు భయాక్రాంతులై తద్విఘ్నమును సంకల్పించి వివిధో పాయంబు లాలోచించి, 'ఎల్లయనర్థములకుఁ గామము బీజమైయున్నది. కామమును జయించినఁగాని సంకల్పరహితుఁడు గాఁడు; సంకల్ప రహితమైనఁగాని జితేంద్రియత్వము సిద్ధింపదు. కామోద్దీపనమునకు వనితారత్నమును మించినది గలుగదు. కావున వన్నెలాఁడి నొకర్తు కను బంపి విశ్వామిత్రుని గలంచి చూతము. ఆ ఋషి యందులకుఁ గలఁగినను గలఁగకున్నను మన యీప్సితము సిద్ధించును. ఎట్లందురా? కలఁగునేని తపోభ్రష్టుఁడగును. కలఁగఁడేని వానితపస్సు మోక్షార్థ మగునే గాని యింద్రాదిపదవులఁ గూర్చినది గాఁబోదు. మన పదవులకు సేగిలేకుండుటే గదా మనయభిమత మని నిశ్చయించి రంభను రావించి, 'అప్సరోరత్నమా, మనయెల్లరకుఁ బెద్ద యెగ్గు రానున్నది. విశ్వా మిత్రుని బూవింటిదొరబంటుగా నొనర్చి సురకార్య మొనర్పుము' అనిరి. ఆ మచ్చెకంటి యంజలి యొనర్చి, 'దేవా! గాధేయుఁడు చండ కోపనుఁడు. వానిని డాయుట దవానలంబున నురుకుటగును. నాయెడఁ గరుణింపు' మని పలు వగల వేఁడెను. త్రిదశాధీశుఁడు ప్రసన్నుఁడు గాఁడయ్యెను. ఆ కాంత గత్యంతరముఁ గానక జగన్మోహనరూపముఁ దాల్చి పుష్కరతీర్థమునకు వచ్చి,

"సీ॥ తతనితంబాభోగధవళాంకుశములోని
యంగదట్టపుఁగావిరంగువలన
శశికాంతమణిపీఠిజాజువాఱఁగఁగాయ
లుత్తుంగకుచపాళిన త్తమిల్లఁ
దరుణాంగుళీధూతతంత్రీస్వనంబుతో
జిలిబిలిపాటముద్దులు నటింప
నాలాపగతిఁ జొక్కి యరమోడ్చుగనుదోయి
రతిపారవశ్యవిభ్రమముఁదెలుప

గీ॥ బ్రౌఢిఁ బలికించుగీతప్రబంధములకు
గమ్రకరపంకరుహరత్నకటకఝుణఝు
ణధ్వనిస్ఫూర్తి తాళమానములు గొలుప
నింపు దళుకొత్త వీణ వాయింపుచుండె."

ఆ మిటారికి వసంతకందర్పులు తోడై నిల్చిరి. శారికాకీరంబులు మధుర మధురంబుగాఁ గూయసాగెను. మధుపఝంకారపటహధ్వనులు చెలరేఁగెను. గానాలాపతరంగంబు లతిహృద్యంబుగా వీచెను. ఈ విశ్వామిత్రుని మనఃకర్ణంబులకు సుంత విక్షేపము గలిగెను. ఈయన బహిర్ముఖుఁడై యీ గానంబు నాలకించి,

"శా॥ నానాగాయనగాయనీమణులగానంబుర్వి నాలింపమో
నానాఁటఁ నగఖేదివీఁటఁ గలగంధర్వాప్సరోగీత వి
ద్యానైపుణ్యము లెన్నియేని వినమో యంచైన నించైన విం
చై నాదంబొనఁగూర్చునే మదికి నిట్లానందసందోహముఁ."

అని తలఁచి యీవంక కన్నుసారించెను. అచ్చటకు సమీపంబున నొకానొక కాంతారత్నము గానవచ్చెను. ఆ యింతి రంభ యగుట యీ బుషి గుఱుతించి యదంతయు నింద్రునిజాలమగుట గ్రహించి, 'దుర్భగా! కామక్రోధజయంబునకు సమకట్టి తపంబొచరించుచున్న నన్నుఁ బ్రలోభింప యత్నించితివి గావునఁ బదివేలవత్సరంబులు శిలవై యుందువుగాక. మత్కోపకలుషీకృతను నిన్ను మహాతపస్వీజోవంతుఁడైన కొండొక బ్రాహ్మణుఁ డుద్ధరించుఁ బొమ్ము' అని శపించెను.

బ్రహ్మత్వ సిద్ధి సాధన విచారము

విశ్వామిత్రుఁడట్లు శపించి పదంపడి, 'కటా! ఎంత ప్రమాదమొనర్చితిని! రాగద్వేషంబు లింకను నాయందు నిర్బీజములు గాకున్నవి. ఇవి నశింపవలయునన్నచో నహంకారమమకారంబులు సవాసనానిర్మూలము గావలయును. చిత్తము పరిశుద్ధమైన గాని యివి నట్టుమాయవు. చిత్తశుద్ధిలేని తపస్సు నిరర్థకము. ఇన్నాళ్ళు నేను శ్రమించినను నా చిత్తము సమగ్రముగా శుద్ధముగాకున్నది గదా.

'శరీరంబులు తన్మాత్రల సమ్మేళనంబున నేర్పడుచున్నవి. శరీరంబుల వైచిత్రియుఁ దన్మాత్రలమార్పువొక్క వైచిత్రియే గాని వేఱు గాదు. ఈకూర్చునది యెవ్వరు? ఎవ్వరోగాదు; ఆ యీ జీవియొక్క ప్రాక్తన సంస్కారంబులు కూర్చుచుండును. ఆ సంస్కారంబులు త్రిగుణాత్మికంబులు. ఏగుణము బలవత్తరమో ఆవిధసంస్కారంబును దద్విధ మాత్రలు గలుగుచుండును. గుణముల మార్పుతోడి సంస్కారంబులును వానివెంటనే మాత్రలును మాఱుచుండును. కావున శరీరతత్త్వ పరిణామమనఁగా గుణపరిణామమే యగుచున్నది.

సర్వము యత్నసాధ్యము

ఈ గుణపరిణామము ఆహారవ్యవహారంబులబట్టి జరుగును. ఏ గుణాభివృద్ధిఁగోరుమరో తదనుకూలమైన ఆహారాది నియతి నాచరింప వలయును. తపస్సుగూడ నిట్టివ్యవహారమే యగును గావున దాని ననుష్ఠించితిని. తత్ఫలముగా నింతమాత్రము చేకూరెను. అహో! చిత్తశుద్ధి యెంత కష్టసాధ్యము! అయినను జింతవలదు. నాపుట్టినది క్షత్రవంశము. అది రజఃప్రధానమైనది. అట్లుండియు శ్రమపడి క్రమక్రమంబుగా రాజర్షిత్వ మహర్షిత్వంబులను సంపాదించితిని. దీనింబట్టిచూడఁగాఁ గేవల రజఃప్రధానమైన చిత్తము చాలవఱకు మాఱి యింతవరకుఁ బరిపక్వమయ్యెనని స్పష్టము. పురుషకారంబున సర్వము సాధ్యమనుట నెల్లడించితిని. ఇఁక బ్రహ్మత్వము సిద్ధింపవలసియున్నది. ఇంతదూరము సాధించినవానికి నదియుఁజేకూరదా? వర్షశతంబులు గడచుఁగాఁక; సిద్ధిపర్యంతము నాపూనిక వదలఁజాల. ఇఁక నిరాహారుఁడనై కుంభకయోగమూని తపంబొనర్తును. తట్టాలున నేదియు సిద్ధింపదనియు నభ్యాసయోగబలంబున క్రమాభివృద్ధి గలుగకమానదనియు బురుషకారము నాశ్రయించి చిత్తశుద్ధిఁ బడసి శ్రవణమననధ్యానంబులఁ దవిలి చిత్తైకాగ్ర్యమొంది జితేంద్రియుఁడును నిర్మలాంతఃకరణుఁడునై యొక జన్మంబుననే బ్రహ్మర్షి గావచ్చుననియు సిద్ధియంతయు ప్రయత్నమును బట్టియుండుననియు నిప్పటికి గ్రహించితిని. అహో! దేవత లెంత ప్రమాదపడిరి. ఇంద్రాదిపదవులఁ గోరి నేనిట్లు తపంబొనర్చుచున్నానని వారి విశ్వాసము. ఆ తుచ్ఛములకు నింతశ్రమ వలయునా? నా గుట్టు గ్రహింపనోపక స్వపదరక్షణార్థ మిట్లొనర్చిరి. అయినను నాకిది మేలే యయ్యెనుగదా. ఈ పరీక్షలకు నిల్చినఁగదా నిగ్గుతేలును. బంగారువన్నె యెరపుఁజూతిమీఁదఁ గదా తెలియు'నని వితర్కించుకొని యందుండి తూర్పుదెసకుఁ జని,

"సీ॥ ఇంద్రియార్థంబులం దింద్రియవ్యాపార
ముడిగించి క్రియలెల్ల విడిచి పుణ్య
పాపబంధంబుల నోపి బంధింపఁగఁ
బడక మనోవృత్తి నొడిచి నాకు
నిది ప్రియం బప్రియం బిది నింద యిది
మహాస్తుతి యిది యనక సంతత నిశాంత

సంతోషయుక్తుఁడనై సంతయు
భయమును శీతాతపంబులు వాతగతియు

గీ॥ నెఱుఁగ కివ్విధమున మఱచి శరీరంబు
మరణజీవితముల కురువిషాద
తోషవృత్తులఁడిగి భీషణాటవినుండి
చేసెదను తపంబు భాసురముగ."

అని నిశ్చయించుకొని మరల దుష్కర తపం బారంభించెను.

ఈ మహాత్ముఁడట్లు శతవర్షంబులు తపంబుసలిపి వ్రతస్నాతుఁడై భుజింపబోనుండఁగా నింద్రుండు బ్రాహ్మణవేషంబున నటకు వచ్చి, 'అయ్యా! ఆకటఁ జావనున్నాను. పిడికెఁడన్నము పెట్టి నన్ను రక్షింపు' మని యాచించెను. ఈ జితేంద్రియుఁడు తాను గుడువనున్న యన్నము నతనికిచ్చి మరలఁ దపశ్చరణుఁ డయ్యెను. వీనిమూర్ధంబునుండి ధూమ మెగసి ముల్లోకంబు లావరించెను. ఆ తపస్సాగ్నికి దేవగంధర్వాదులు వితాకుచెంది బ్రహ్మను సందర్శించి, 'స్వామీ! మా మాయలీక సాగవు; విశ్వామిత్రుఁడు సుంతయుఁ జలింపఁడు. వాని తపోవహ్ని వేడిమికి దిశలెల్ల వ్యాకులపడుచున్నవి; పుడమి కంపిల్లుచున్నది; వాయువు యథాగతి వీవఁడు; సూర్యుఁడు ప్రభాహీనుఁడయ్యెను; ప్రతీకారము దోఁపదు; ఇతఁడు నిజతపఃకీలల జగత్త్రయంబును భస్మీకరింప నున్నాఁడో యని భయమయ్యెడు. దేవా! సృష్టికి ముప్పు వాటిల్లక మున్న యితని యభిమతంబులు దీర్చుటొప్పు; ఆలసించినఁ గీడుతప్పదు. దేవరాజ్యంబును గోరునో యని తహతహపడుచున్నా'మని మొఱలిడిరి.

పితామహుఁడు చిఱునవ్వు వహించి యమరాదులను వెంటఁ గొని యీ స్థిరప్రతిజ్ఞునికడకు వచ్చి, 'గాధేయా, నీ తపస్సును మెచ్చితిని; బ్రాహ్మణత్వంబును సాధించితివి; చిరాయువిచ్చితి' ననెను. ఆ మాటకు నిమ్నహోత్ముఁడు సంతసించి పరమేష్ఠికి నమస్కరించి, 'స్వామీ! నాకు బ్రహ్మత్వసిద్ధి గల్గెనేని యోంకార వషట్కార వేదోపదేశాధికారము గూడఁ గలిగినట్లేగదా; వసిష్ఠుఁడు నా బ్రహ్మత్వంబు నంగీకరింప వలయునుగదా! ఇవి యగునేని నా తపంబును విరమింతు' ననెను. అట్లే యగునని బ్రహ్మ చెప్పెను. వసిష్ఠుఁడు దేవప్రసాదితుఁడై యీ యనఘుని బ్రహ్మత్వ మంగీకరించెను. ఇరువురకుఁ జిరసఖ్య మొదవెను. రామా! ఈ మహనీయుఁ డింతటివాఁడు."

జనకుఁడా కథయెల్ల విని పరమానందభరితుఁడై 'మహాత్మా! మీ చరితామృతము వినవినఁ జవులూరుచున్నవి. కాకుత్థ్సులతోడి మీ యాగమంబు నన్ను ధన్యునొనర్చెను. అనుగృహీతుఁడ నైతిని. అదిగో ప్రదీచి లంబమానరవిమండలమై తోఁచుచున్నది. కాలోచిత క్రియలకు సమయమయ్యెను. తెల్లవాఱి పునస్సందర్శనభాగ్యంబును బడయుదు; అనుజ్ఞ వేఁడుదు'నని వారియనుమతిఁ బడసి నిజమందిరంబునకుఁ జనెను. రామలక్ష్మణులంత దినాంతకృత్యములు దీర్చి యా రాత్రి మునితోడ సుఖముండిరి.

శివధనుర్భంగము

"మ॥ ఉరుసంధ్యాతపశోణమృత్కలితమై యొప్పారు బ్రహ్మాండమ
న్దరిడిం గాలపుహొంతగాఁడు చరమాగస్కంధముంజేర్చు ని
బ్బరపున్సంగడమోయనన్ శశి డిగెం బ్రాగ్భాభృత్కటా
తరబాహ్యప్రసంగడంబనఁగ మార్తాండుండు దోఁచె న్దివిన్."

అట్లు సూర్యుఁ డుదయించినంతనే వేదవేదాంగపారీణులగు బ్రాహ్మణులును దపోమూర్తులగు మునీంద్రులును దేశదేశాంతాగతులైన రాజచంద్రులును సభాప్రదేశమెల్ల నిండిరి. విశ్వామిత్రుఁడును రామలక్ష్మణులతోడ వచ్చి యుచితాసన మలంకరించెను. జనకుఁడు ప్రవేశించి సభాస్తారులకుఁ బ్రొక్కి కూర్చుండెను. విశ్వామిత్రుఁ డంత జనకమహారాజును సంబోధించి,

మ॥ శివచాపంబును గూర్చి చెప్ప కతలం జిత్తంబు రంజిల్లి యీ
యువకుల్ వచ్చిరి రామలక్ష్మణులు వీక్షోత్సాహసంరంభులై,
యవనీనాథులు మానివర్యులు నదే యాసింత్రు పేరాసతో
నవునే మామదిఁ జేయుఁగా నిటు విదర్భాధీశ మీకియ్యెడన్.

అని ప్రస్తావించెను. ఆ మాట విని జనకుఁడు లేచి, 'మహాత్మా, మీ యిచ్చకు వేఱు గల్గునా?' యని ముక్కంటి వింటిని గొనిరానాజ్ఞాపించెను. ఐదువేలభటులు చని యెనిమిదిచక్రముల బండిని దాని మీఁదనున్న పెద్దయినుపపెట్టెతోడ లాగి తెచ్చి సభామధ్యంబున నిలిపిరి. మిథిలేశ్వరుఁ డా బండిని డాయఁ బోయి, 'మహాత్ములారా, ఈ ధనుర్వృత్తాంతము సుంత మీరవధరింపనగును. తొల్లి దక్షప్రజాపతి యాగమొండు గావించి తత్ హవిర్భాగంబును శివునకు నిరాకరించెను. హరుఁ డా పరిభవంబును సైపక ధనుర్ధరుఁడై తన్నుఁ గాదని

హవిర్భాగంబును గ్రహించిన దేవతల శిరంబులు దఱుగ నుంకించెను. వారు జడిసి శూలికిఁ బ్రియ మొనర్చిరి. ఫాలాక్షుఁడు ప్రసన్నుఁడై తన చేతి చాపంబును వారికిచ్చెను. దేవత లా కార్ముకంబును శిబిచక్ర వర్తికి నాఁబవతరమువాఁడును మాకుఁ బూర్వపురుషుఁడు నైన దేవ రాతునకు నొసంగిరి. ఆయన దానినిఁ బదిలముగా దాచియుంచెను. అది యిప్పుడు నా యధీనమయ్యెను. నేనొకయాగమును సంకల్పించి యజనశాలానిర్మాణార్థము భూమిని జక్కఁజఱుచుటకుఁగా దున్నించు చుంటిని. అప్పుడు నాఁగటిచాలులో నొక కన్యారత్న ముద్భవించెను. ఆ బాలికను బుత్త్రికనుగా గ్రహించి పెంచుచున్నాను. నాగటిచాలు నకు సీత యని సంస్కృతంబున వచింతురు. నాగటిచాలులోఁ బుట్టిన కారణంబున నామెకు సీత యను పేరు పెట్టితిని. ఆమె యయోనిజ గావున సామాన్యులామె కరగ్రహణంబునకుఁ జాలరు. ఈ శివచాపంబు నెవఁడు మోపెట్టునో యతఁడే యామె నరుఁడని నిశ్చయించితిని. నా ప్రతిజ్ఞ విని పెక్కురాజులు వచ్చి చాపంబును జూచి కొందఱును, దానిఁ గదలింపనోపక కొందఱును, నిరుత్సాహులై యంతతోఁ జనక దౌష్ట్యంబుచేసి నా పుత్త్రికను హరింప సమకట్టి వారెల్లరు నేకముఖమై మిథిలానగరంబు నొక్క సంవత్సరపర్యంతము ముట్టడించిరి. నా సైన్య సాధనంబులు సన్నగిల్లెను; వెఱవుతోఁబదయ్యెను. అంత నేను దేవతలఁ గూర్చి తపం బొనర్చితిని. వారు నాయెడఁ బ్రసన్నులై నాకుఁ జతు రంగబలంబును బ్రసాదించిరి. ఆ బలసహాయ్యంబున వీర్యసంధిగ్ధులైన వైరినృపతుల నోడించితిని. వారు ముట్టడిమాని దిక్కులు బ్రాకిరి. మహోత్కులారా, ఎవఁడీ చాపంబును మోపెట్టునో యా వీరుఁడు సీతను బడయు' నని వచించెను.

అనవుఁడు విశ్వామిత్రుఁడు తలయూచి రాముని వంకఁ జూచి, 'వత్సా, ముక్కంటివింటిని జూడఁ దమకింతువుగదా! అదిగో చూడు' మనెను. రాముఁడులేచి విల్లున్న మందస వంకకుఁ దరలెను. సభాస్థారు లెల్లరు నిర్నిమేషులై వానిని జూడసాగిరి. రాముఁడట్లు చని యవలీలగా నొక వ్రేలితో మందస మూఁత యెత్తివైచి,

"మ॥ కలభం బాతత చండతుండమున వీఁకన్ శేషనాగేంద్రునిన్
బలిమిం బట్టినభంగి రామధరణీపాలుండు కోదండమున్
బలుముష్టిన్ వడిఁ బట్టియెత్తి తెగ విస్ఫారంబుగాఁజేసి ని
శ్చలుఁడై యల్లన లక్ష్యకంబు వదలెన్ జాపంబు భగ్నంబుగాఁ.

క॥ నారులఁ బట్టినవారికి
నారయ ధర్మ్ములు గలవె యన నారిఁ గరం
బారంగఁ బట్టి రాముఁడు
పౌరులు చూడంగ ధనువు భగ్నము చేసెన్.

మ॥ ధను వుద్యద్దతి రాముఁడట్లు విఱువం దద్ఘోరఘోషం బొగిన్
ఘననిర్ఘాతనిపాదజాతనినదోగ్రధ్వానమై మ్రోసినన్
విని యస్థానమువార లెల్ల వడిఁ బృథ్వీం ద్రెళ్ళి మూర్ఛిల్లి రా
జనకాధీశుఁడు రామలక్ష్మణులు విశ్వామిత్రుఁడుం దక్కఁగన్.

చ॥ కులగిరు లెల్ల బెల్లగిలెఁ గుంభిని యల్లల నాడె దిగ్గజం
బులు బెదరెన్ భుజంగపతి బొమ్మరవోయెఁ బయోధు లన్నియుం
గలఁగె దిగంతముల్ వగిలెఁ గన్కనిఁ దారలు రాలె సూర్యచం
ద్రులగతి తప్పె మేఘములు దూలె నజాండము మ్రోసె నయ్యెడన్."

అచింత్య మహోద్భుతమైన రామప్రభావబలంబునకు జనకుఁడు మహావిస్మయమంది, 'మునివర్యా! ఈ వింటినిమో పెట్టనోర్చు వీరుడుం డునా యని శంకించితిని. నా భ్రాంతి నేఁడు తీఱెను. నా ప్రతిజ్ఞ సఫల మయ్యెను. నేను కృతకృత్యుఁడనైతిని. అనుజ్ఞయేని యయోధ్యకు నా మంత్రులు చని దశరథమహారాజునకు సంగతి వినిపించి వారిని దోడి తెత్తు' రనెను. విశ్వామిత్రుఁ డట్లేగావింపు మనెను.

దశరథాగమనము

జనకరాజ మంత్రులు తరలి మూఁడురాత్రులు ప్రయాణము సాగించి యయోధ్యచేరి తమరాకను దూతలవలన ఱేనికిఁ దెలిపి యను జ్ఞాతులై లోనికిఁ జని, 'రాజేంద్రా, మిథిలాపతియగు జనకమహారాజు గారి దూతలము. సీతాదేవి మా ఱేనికిఁ బుత్రికారత్న మగుటయు నామె వివాహమునుగూర్చి మా రాజు ప్రతినచేసియుండుటయు దేవర వారికి శ్రుతిగతమైయున్నది. రామలక్ష్మణులు మా ఱేని భాగ్యనశంబు ననో యన మిథిలానగరంబునకు విశ్వామిత్ర పురస్సరంబుగా వచ్చిరి. రాముఁడు శివచాపంబును మోపెట్టి యాకర్ణాంతముఁ దివిచెను. అది యిరు ఖండములై తునిగిపడెను. అట్లు మీ జ్యేష్ఠసుతుఁడు తన ప్రభావ పరాక్రమంబు నుంకువయిడి మా రాజపుత్రికను సీతాదేవిని విలిచెను. మీ పుత్త్రులను సందర్శించునిమిత్తము దేవరవారు సకుటుంబ మంత్రి పురోహితబాంధవపరివారంబుగా రాఁగోరి మాముఖంబున మా ఱేఁడు

ప్రార్థించుచున్నాఁడు. విశ్వామిత్రశతానందుల యనుమతితోఁ దరలివచ్చితిమి. ఏలినవారి చిత్త' మని విన్నవించిరి.

దశరథుఁడు హర్షపులకితశరీరుఁడై జనకమంత్రులను బహువిధంబుల సత్కరించి వసిష్ఠ వామదేవ జాబాలి కాశ్యప మార్కండేయ కాత్యాయనాది మహర్షులతోడ సుమంత్రాదిమంత్రులతోడఁ జతురంగ బలసమేతంబుగా మఱునాఁడే తరలి నాల్గవనాఁడు మిథిలానగరము చేరెను.

జనకుఁడు దశరథాదులను సముచిత సత్కారంబులఁ దనిపి, 'మహోత్కులును బరాక్రమసింహులు నైన రాఘవులతోడి వియ్యంబునఁ జేసి నావంశము మహోన్నతిఁ గాంచెను. నా యాగము సమాప్తము గానున్నది. అనంతరము వైవాహికమంగళంబును ఋషీంద్రులు నిశ్చయించి' రనెను. ఆ మాటను దశరథుఁడు సంతసించి, 'ఇచ్చునది మీరు పుచ్చుకొనునది మేము. ప్రతిగ్రహము దాతయధీనముగదా. ధర్మజ్ఞుఁడవైన నీవచన మగుఁగాక' యని ప్రియంబులు పలికెను. నాఁటిరేయి యట్లు గడచెను.

చ॥ అలఁతిగ జాభరారసము నద్దినపెంచెఱ డించిగోయనం
బొలిచెను బ్రాగ్దిశాతలము, పుష్కరిణీహృదయాంతరాళముల్
వెలిసెఁ బ్రసన్నతోయుభరవిహ్వలమై, తొలినాటిసేదలన్
దలఁగిసమస్తసృష్టియు స్వధర్మముఁబూనెను నూత్నశోభతోన్.

అట్లు తెల్లవాఱినంత జనకమహారాజు యాగీయకార్యంబులనెల్ల నిర్వర్తించి, యిక్షుమతీ తీరంబున సాంకాశ్యపట్టణంబుననున్న తన తమ్మునిఁ గుశధ్వజుని సీతాకళ్యాణమహోత్సవానుభవార్థము రప్పించెను. ఎల్లరు సభగూడిరి. దశరథునిఁ దోడితెచ్చుటకై వాని విడిదికి సుదాముఁడను జనకమంత్రి పోయెను. ఆ నరేంద్రుఁడును బురోహితాదిసహితుఁడై వచ్చి కళ్యాణమండపము నలంకరించెను. వియ్యంకులు కొంతవడి ముచ్చటలఁ బుచ్చిరి. అంత నయోధ్యాధీశుఁడు మిథిలాధిపుని సంబోధించి, 'వియ్యమునకుఁ గయ్యమునకు సమత వలయునందురు. మఱియు వివాహముపట్ల కన్యానరుల నంశక్రమంబులు దెలుపుట యాచారము. ఇక్ష్వాకువులకు నిలువేల్పయిన వసిష్ఠమహర్షి మాకు వక్తయై మా వంశక్రమంబును వినిపించు' ననెను.

ఇక్ష్వాకువంశక్రమము

అంత వసిష్ఠుఁడు లేచి, 'జనకరాజా, ఇంతకన్న సంతోషకరమైన కార్యము గలుగదు. రఘువంశంబునకు బ్రహ్మ మూలము. వానికి మరీచి, వానికిఁ గాశ్యపుఁడు, వానికి సూర్యుఁడు జనించిరి. సూర్యుని వలన మనువుద్భవించి రాజయ్యెను. మనువునకు నిక్ష్వాకువు ప్రభవించెను. అతఁడే యయోధ్య నేలిన మొదటి ప్రభుఁడు. వానికిఁ గుక్షి, వానికి వికుక్షి యతనికి బాణుఁడు వానికి అనరణ్యుఁడు, వానికిఁ బృథువు, వానికిఁ ద్రిశంకువు, వానికి దుందుమారుఁడుఁ గలిగిరి. దుందుమారుని యవనాశ్వుఁడనియుఁ బేరొక్కఁడుఁడు. వానికి మాంధాత, వానికి సుసంధి, వానికి ధ్రువసంధి ప్రసేనజిత్తులుఁ బుట్టిరి. అందు ధ్రువసంధికి భరతుఁడు, వానికి నసితుఁడుఁ బుడమెను. అసితుఁడు హైహయ తాళజంఘ శశిబిందురాదులతోఁ బోరి యోటమిఁ గాంచి హిమవత్పర్వతమందలి భృగు ప్రస్రవణంబు నాశ్రయించెను. అతనికి భార్యలిరువురుండిరి. వారు గర్భవతులై యుండఁగా రెండవభార్యయగు కాళింది సవతిమత్సరంబునఁ జేసి పెద్దభార్యకు గర్భస్రావార్థము విషము పెట్టెను. అయ్యవసరంబున నటకుఁ జ్యవనమహర్షి దైవయోగంబున వచ్చెను. అమ్మహర్షికి వారిరువురును ప్రణమిల్లిరి. ఆ మహాత్ముఁడు పెద్దభార్యవంకఁ జూచి మహాబలశాలియైన పుత్త్రుని బడయుదువుగాక యని దీవించెను. అంతఁ గొన్నాళ్ళకు నసితుఁడు పరలోకగతుఁడయ్యెను. వాని పెద్ద భార్యకు సుతుఁ డుదయించెను. ఆకుమారుఁడు గరసహితుఁడై జనించుఁ గావున నతనిని సగరుఁడనిరి. వానికి నసమంజసుఁడు, వానికి నంశుమంతుఁడు, వానికి దిలీపుఁడు, వానికి భగీరథుఁడు, వానికిఁ గాకుత్స్థుఁడు వానికి రఘువు జనించిరి. రఘువునకుఁ గల్మాషపాదుఁడు, వానికి శంఖణుఁడు వానికి సుదర్శనుఁడు, వానికి నగ్నివర్ణుఁడు, వానికి శీఘ్రుగుఁడు, వానికి మరుఁడు, వానికిఁ బ్రశుశ్రుకుఁడు, వానికి నంబరీషుఁడు, వానికి నహుషుఁడు, వానికి యయాతి, వానికి నాభాగుఁడు, వానికి నజుఁడుఁ గల్గిరి. అజమహారాజునకు దశరథుఁ డవతరించెను. ఈ కోసలేంద్రునకు రామలక్ష్మణభరతశత్రుఘ్నులు జనించిరి.

ఉ॥ శ్రీకరు లాదివంశపరిశిష్టులు ధార్మికవర్యు లుత్తమ
శ్లోకులు సూనృతవ్రతులు సుందరమూర్తులు నాత్మవంతు లై
క్ష్వాకులు రామలక్ష్మణులు వారికి నీ సుతలన్ వరింతు నీ
తాకమలాక్షి నూర్మిళ సుధామధుగోన్నత మంగళాత్మలన్.

రాజేంద్రా, నీ తనయలకు రామలక్ష్మణు లెంతయు ననురూపులు. వీరి దాంపత్యంబులు మహాశోభావహమై జగన్మంగళకరమగును' అని వచించెను.

జనకవంశక్రమము

శతానందుఁడు లేచి, 'మునీంద్రా వసునివంశంబును దెలిపితిరి. కన్యావంశమును వినుము. మా తేనివంశంబునకు నిమిచక్రవర్తి ప్రధాన పురుషుఁడు. ఆ మహనీయునిచరిత్ర లోకవిశ్రుతమేగదా! వానికి మిథి యను సూనుఁ డుదయించెను. వానిపేర నిష్పురవరము నిర్మిత మగుటంజేసి దీనిని మిథిలానగరమందురు. ఆ రాజేంద్రుఁడే మొదటి జనకుఁడు. వానికి సుదావసువు, వానికి నందివర్ధనుఁడు, వానికి సుకేతువు, వానికి దేవరాతుఁడు, వానికి బృహద్రథుఁడు, వానికి మహావీరుఁడు, వానికి సుధృతి, వానికి దృష్టకేతువు, వానికి హర్యశ్వుఁడు, వానికి మరుఁడు, వానికిఁ బ్రతిబంధకుఁడు, వానికిఁ గీర్తిరథుఁడు, వానికి దేవమీఢుఁడు, వానికి విబుధుఁడు, వానికి మహీద్రకుఁడు, వానికిఁ గీర్తిరాతుఁడు, వానికి మహారోముఁడు, వానికి స్వర్ణరోముఁడు, వానికి హ్రస్వరోముఁడు జనించెను. హ్రస్వరోముని వలన జనకుఁడునుఁ గుశధ్వజుఁడును బుట్టిరి. అంత హ్రస్వరోముఁడు తన రాజ్యంబును జనకునకు నప్పగించి తపోవృత్తిని వనంబునకుఁ జనెను.

ఇట్లుండఁ గొండొక కాలంబునకు సుధన్వుఁడు సాంకాశ్యప్రభుండు గర్వోద్ధతుఁడై సీతాశివకార్ముకంబులఁ బడయఁ గోరి మాసయిదండెత్తి వచ్చి రణనిహతుఁడయ్యెను. ఆ సాంకాశ్యరాజ్యంబును మా తేఁడు తన తమ్మునకు నిక్కుశధ్వజునకుఁ గట్టెను.' ఇది మా రాజువంశ వృత్తాంతము.

'కం॥ శ్రీయును గులమును రూపును
బ్రాయము శుభలక్షణంబు బాంధవవిద్యా
శ్రేయముఁ గలవరునకుఁ గ
న్యాయతగాఁజేయవలయు నధికప్రీతిన్.'

అని పెద్దలు వచింతురు. ఈ సంబంధము లెల్లవిధంబుల నొప్పియున్న'ఁదని నుడివెను.

ముహూర్తనిశ్చయము

అంత జనకుఁడు లేచి, 'మునీంద్రా, మీ యభిమతంబునకు మాఱు గలదా? మీ కోరినట్లు నాతనయలను సీతను రామునకు నూర్మిళను లక్ష్మణునకు నొసంగితిని. వారివలన గోదానపితృకార్యంబులఁ దీర్పించి యథావిధిఁ గళ్యాణము నొనర్పనగును. నేఁడు మఘానక్షత్రము ఉత్తర ఫల్గునీనక్షత్రము శుభప్రదము. నాఁడు వివాహములు జరుపుటొప్పు' అనెను.

అంత విశ్వామిత్రుడు మునుపడవచ్చి, 'మిథిలాధీశా, మీ యుభయ వంశంబులకు సంబంధములు గలుగుటకు నెంతయు సంతసింతుము. కుశధ్వజుని తనయలు మాండవీ శ్రుతకీర్తులు గలరుగదా. వారిని భరతశత్రుఘ్నులకు భార్యార్థము వరింతుము. దశరథసుతులు నల్వురు రూపవయోవిలాససంపదల సనూనులై దిక్పాలురకు సాటి యగుదురు' అని వచించెను. జనకుఁడు మునిహృదయంబును గ్రహించి, 'మహాత్మా, వసిష్ఠగాధేయుల సంకల్ప మమోఘము. కన్యాదానఫలంబును నాకీరూపంబున మీరిరువురు ననుగ్రహించి మీకునాయెడఁగల శిష్యవాత్సల్యంబును జూపితిరి. దశరథునకును నాకును భేదభావమెన్నఁడును లేదు. నా రాజ్యంబును కుశధ్వజునిరాజ్యంబునేగాక యయోధ్యానగరంబును గూడ స్వతంత్రించి గురుదక్షిణగా నిచ్చితిని. మీరు సింహాసనత్రయము నధిష్ఠించి మమ్మునుఁ బాలింపనగు' ననెను. ఆమాటకుఁ దశరథుఁడు పరమసంతుష్టచిత్తుఁడై, 'మిథిలాధీశుని నిష్కళంక హృదయ మెంతయు శ్లాఘ్యము. వానివచనంబును నేనును శిరమునఁ దాల్తు' ననెను. వసిష్ఠకౌశికులు పరమానందభరితులై, 'విదేహేశ్వరా! రాజ్యాలు మాకేల? మాయంతటివారు మీరు పరిపాలించుటఁ జూచుచు సంతసించుటకన్న మాకు వేఱునలయునా? మీ పరిపాలనము నిష్కామకర్మానుష్ఠానరూపమై సర్వప్రాణి సముద్ధరణసమర్థమై వెలయుచున్నది. ఇదే మీకును బరమకళ్యాణనిశ్రేణి యగును. కావున మీరాజ్యంబులను మీకే యిచ్చితిమి' అని పలికిరి. అంతలో నాఁటి సభ పరిసమాప్త మయ్యెను. ఎల్లరు వారి వారి విడుదులకుఁ జనిరి.

మఱునాఁడు దశరథమహారాజు తనసుతులవలన లక్షయేసి సువర్ణ శృంగగోవులను సవత్సకంబులుగాఁ గంచుకదోహదపాత్రలతోడ దాన మిప్పించెను. అంతలోన నచ్చటికి భరతునిమేనమామయైన కేకయ

రాజసుతుఁడు యుథాజిత్తు వచ్చి దశరథునిసందర్శించి, 'రాజేంద్రా, కేకయరాజు మనుమనిఁ జూడ నువ్విళ్ళూరుచున్నాఁడు. బాలునిఁ దోడితేర నన్నుఁ బంపెను. అయోధ్యకుఁ జనితిని. పుత్త్రులవివాహార్థ మిటకు మీరు వచ్చుటఁ దెలిసెను. అంతట నిటకు వచ్చితి' నసెను. ఆ జేఁడు వానిని యథోచితంబుగా సత్కరించి సంగతి వినిచి, 'నాపుత్త్రుల కళ్యాణంబు లాకస్మికముగా నిశ్చయింపబఁడెను. అందువలన మనవారి కెవ్వరికిఁ దెలుప వ్యవధి లేదయ్యె' నసెను.

సీతాకళ్యాణము

మఱుసటి యుదయంబున దశరథుఁడు సుతులవివాహంబులకుఁ బూర్వాంగకర్మములెల్లఁ గావించి విశ్వామిత్రాది ఋషులతోడ యజ్ఞ శాల కరుదెంచెను. రామలక్ష్మణభరతశత్రుఘ్నులు కౌతుకమంగళంబు లొనర్చి సర్వాభరణభూషితులై వసిష్ఠపురస్సరంబుగా విజయాఖ్య ముహూర్తంబునకుఁ దండ్రిని జేరిరి.

'సీ॥ పదతలంబులకెంపు పరఁగినతలము
కుంకుమలిప్తమైనచందము వహింప;
నంగంబు నునుఁగాంతి యడరినగోడలు
వేదులు మణిమయవిధమునొందఁ
గనుగవ మెఱుఁగులు గదిరిన నుందఱఁ
బుష్పోపహారంబుపాలుపు దాల్ప
వేనలికప్పుపర్వినమీఁది నీలదుకూలంబు
మేల్కట్టు కొమరువడయఁ'

తే॥ తాను జొచ్చినకతనఁ దత్సానమెల్ల
ఋణములా నూత్నశోభాతిశయము నొంద
జనకరాజేంద్రసుత సీత సఖులతోడ
మందగతిఁ జేరెఁ గళ్యాణమండపంబు.

ఆమె వెనువెంట నూర్మిళయు సఖీజనవలయితయై వచ్చిచేరెను. ఆమె వెనుక మాండవిని శ్రుతకీర్తిని దోడితెచ్చిరి. అంత వసిష్ఠుఁడు జనకుని డాయఁబోయి, 'రాజేంద్రా, ముహూర్తము సమీపించెను. దాతృప్రతి గృహీతలకు సర్వార్థసిద్ధి యగుఁగాక' యనెను. జనకుఁ డా ఋషిని బూజించి, 'మహాత్మా, ఇది మీ యిల్లుగాని వేఱుగాదు. మీయింట మీకు వెనుముందు లేల? నా తనయలును వైవాహికమంగళాలంకృతలై

వేదిమూలంబుల దీప్తవహ్నిశిఖలకరణి నున్నారు. రాముని వైవాహిక మంగళంబును మొదట జరిపింపు' మనెను.

వసిష్ఠుఁడంత విశ్వామిత్రశతానందులను బురస్కరించుకొని, విచిత్రవితానంబును నవరత్నసూక్తికజాలాభిరామంబును వివిధకుసుమాలంకృతంబును నవపల్లవతోరణమనోజ్ఞమునైన కళ్యాణమండపంబున వేదిఁ గల్పించి గంధపుష్పంబుల నలంకరించి బంగారు పాలికలు మూఁకుళ్ళు ధూమపాత్రలు శంఖపాత్రలు స్రుక్స్రువంబులు నర్ఘ్యజాలాది పాత్రలు సమస్తము సమకూర్చి యగ్నిం బ్రతిష్ఠించి సమ్రమాణదర్భలు పఱచి విధిమంత్రపురస్సరంబుగా హోమముఁ గావించెను. దశరథుఁడు తన ముద్దుకుమారునిఁ దోడ్కొనివచ్చి వేదిమ్రోల నిలిపెను. జనకుఁడు తన సుతారత్నమును సీతను గొనివచ్చి యగ్నియెదుటఁ గౌసల్యానంద వర్ధనుఁడైన రామునకు నభిముఖిగా నుంచి, 'రామా!

'ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ,
ప్రతీచ్ఛచైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా
పతివ్రతా మహాభాగా ఛాయేవానుగతా సదా.'

యని వాని హస్తపద్మమందు సమంత్రకంబుగా జలంబులు ధారవోసెను. దేవఋషిప్రముఖులు సాధువాదములు పలికిరి. మంగళమధురగీతంబులు చెలరేఁగెను; నానాతూర్య వీణారావంబులు విస్తరిల్లెను.

హస్తేన హస్తం పరిగృహ్యావధ్వాః ।
సరాజనూనుః సుతరాంచకాసే ।
ఆనంతరాశోక లతాప్రవాళం ।
ప్రాప్యేవచూతః ప్రతిపల్లవేన ॥
ఆసీద్వరః కంటకితప్రకోష్టః ।
స్నిగ్ధాంగులిః సంవృతే కుమారి ।
వృత్తిస్తయోః పాణిసమాగమేన ।
సమంవిభక్తేవమనోభవస్య ॥"

అనంతరము లక్ష్మణునకు నూర్మిళను, భరతునకు మాండవిని, శత్రుఘ్నునకు శ్రుతకీర్తిని, జనకుఁడు జలధారపూర్వకంబుగా నిచ్చెను. అంత రామాదులు వారివారి భార్యల కరకమలంబులను గ్రహించి యగ్ని హోత్రునకును వేదికిని జనకరాజదశరథమహారాజులకును ఋష్యాదులకును బ్రదక్షిణమొనర్చి విధిపూర్వకంబుగా వివాహంబులు గావించుకొనిరి. పుష్పవృష్టి కురిసెను; దివ్యదుందుభులు మ్రోసెను;

గీతవాదిత్రనిస్వనంబు లుప్పతిల్లెను; గంధర్వ మధురగానంబులు శ్రవణ మనస్సంతర్పణంబు లొదవించెను; సభాసదు లెల్లరు సంతోషరసంబుల నోలలాడిరి. అట్లు కళ్యాణంబులు పరిసమాప్తి నొందెను.

విశ్వామిత్ర నిర్గమనము

విశ్వామిత్రుఁడు 'ఇయంసీతా' యను శ్లోకంబును సారెసారెకుఁ దలఁచి తదీయభావగాంభీర్యంబులకుఁ దద్దయు హర్షవిస్మయంబు లంది దశరథుని ప్రేమాలకు రామునిఁ బిలిచి, 'రాజా, దశరథా, ఇదిగో నీ సుతుని నీకుఁ బదిలముగా నప్పగించితి' నని యుల్లసమూడి, రాముని వంక మరలి, 'వత్సా, జనకుని భావంబును గ్రహించితివా? వాని వచనంబులు ధ్వనిప్రాణితములై తలంచుకొలఁది మహానందంబును గూర్చుచున్నవి. సమస్తధర్మములకు సారమై జీవయాత్రకు రాజమార్గమై వెలయునట్టి యతనిపలుకు లంతరాత్మపలికినవి గాని యొండుగాదు. వానిభాషలఁ గలకాలము మఱువరాదు. ఏ బాలారత్నం బపరిచ్ఛేద్య సౌకుమార్యలావణ్యంబులందు లోకాతీతమై వెలయునో, ఏ నుహా మంగళ యయోనిజ యని విన్నదిసుత తద్విలోకనకుతూహలము త్వరించి నిన్నిటకుఁ దెచ్చెనో, ఏ కళ్యాణీసందర్శనంబు విద్యుల్లతవలె నీకు మహాసంరంభముఁ గలిగించుచున్నదో, అనవరతభావనా ప్రకర్షం బునఁ జేసి యేపుణ్యవతి నెల్లెడలఁ జూతువో, యే యలేఖ్యతనూవిలాసినీ ప్రతిబింబంబును గళ్యాణమండపరత్నస్తంభంబులఁ గాంచి విభ్రీప్తనయనుఁడవై తివో, శినచాపఖండనరూపమైన యనన్యసాధ్యకార్యంబునకు సముచితపారితోషికంబుగా నీకే సర్వమంగళ సంప్రాప్తయయ్యెనో, ఏ మహనీయచరిత నీ ప్రాప్తికై తపించి యీ రూపంబున నవతరించెనో, నీ యవతారసాఫల్యం బే భాగ్యవతి వలనఁ జేకూడనున్నదో, అయో నిజయు నుడివోని నిసర్గమధురయునైన యే మంగళకరి లీలామానుష విగ్రహునకు నీకెంతయుఁ బ్రాణంపుఁబ్రాణమై తనరునో, ఏ కోమలమతి తేజస్సు పీడ్యమానమయ్యుఁ బ్రజ్వలింపక మార్దవ మధురమై నీకెంతయు శోభావహముగా నుండునో, భాగీరథి నీ పూర్వులనుఁబోలె నే ధన్యచరిత మహోత్కర్ష స్వగుణసంపత్తిం జేసి నీకులంబునెల్ల నుద్ధరించునో, ఆగర్భ పరిపూతయైన యే మానవతి పోష్యపోషక సంబంధమాత్రంబున జనక సుతగా భావింపఁబడుచున్నదో, లోకైకవీరుఁడవైన నీకుఁ గూడఁ గార్మికవ్యాపారోపదేశకరి యగుటం జేసి యే లోకపావని నీసహధర్మ చరి యగుట యత్యద్భుతములు సత్యమో, అవగతనిఖిలజగత్కారణ

భావుండవై న నీవు దక్క నన్యుఁ డే పరిశుద్ధవతీ కరపల్లవంబును స్పృశింపఁ దగఁడో, ఉపచారంబుల శిష్యుఁడై హితోపదేశంబులఁ జెలిమై యుప భోగంబులఁ బ్రియుఁడై యే కాంతారత్నము నీకు నిరంతర మింపుసొంపు గూర్చుచుఁ దోడునీడవలెఁ జరియించునో యట్టి నీ భాగ్యదేవతను సీతాదేవిని గూడి స్వధర్మరతుఁడవై శాశ్వతకీర్తిసుఖంబులు చూఱ లాడుము. వత్సా! నా క్రతువు సమాప్తమైనది గావున నిఁక దపశ్చర ణార్థము హిమాద్రికిఁ జనువాఁడ' నని వచించి దంపతులనెల్లర నాశీర్వ దించి జనకదశరథుల వీడ్కొని చనియెను.

జనకోపదేశము

వైవాహిక వైభవంబులెల్లఁ దీఱినంతట జనకుఁడు తన సుతలకుఁ గనకవస్త్రాభరణంబులును గజతురంగవస్తువాహనంబులును దాసీ దాసజనంబును యథార్హ మొసఁగి యొక్కొక్కరినిఁ గొఁగిట గూర్చి మూర్కొని,

చ॥ పతి కెదురాడకమ్మ, సతిభక్తిని జూపుము కార్యవైఖరిన్
హితమతిఁ జూడుమమ్మ నిజభృత్యులడుఁ గొల్వుమియత్తమామలన్
వెత లవి యెన్నిగల్గినను వీడకు ధర్మము వేయు నేల? యి
ద్ధృతగతిఁ గీర్తిఁ గూర్పు మొగిఁ బుట్టినయింటికి మెట్టినింటికిన్.

అని పరమహితం బుపదేశించి యల్లుర తోడఁ బుత్త్రికలను సాగనంపి మరలి వచ్చెను. మాలిమిశక్తి యెట్టిదో గాని విజితేంద్రియుఁ డైన జనకుఁడు గూడఁ బుత్త్రికావియోగంబునకు న్యసనకలుషిత చిత్తుఁడై

"ఉ॥ కుందు జనించె నేఁగెడు శకుంతల యిప్పుడె యంచు బాష్పపుం
గ్రందు నడంప లోవెలుఁగు గాడ్పడిఁ జింతకుఁ జూపుమాన్పఁడా
వందర నిట్లు ప్రేమ వనవాసిని నేఁ దముఁ బాసి క్రొత్తగా
నందన లేఁగ నా వగమనంబున నెట్లు గృహస్థు లోర్తురో?"

అను కాశ్యపవచనంబులు తలంచి వెచ్చనూర్చెను.

తృతీయమండలము

రామపరశురామసమాగమము

దశరథుఁడు తనయులను గోడండ్రను వెంటఁగొని తరలి కొంత దూరము చనఁగాఁ ద్రోవలోఁ బక్షులు గుమికూడి వికృతముగాఁ

గూసెను; మృగములు ప్రదక్షిణము గావించెను. దశరథుఁ డాశకునం బులఁ బరికించి వసిష్ఠునితో, 'గురువర్యా! పక్షులవిక్రుతారావంబులు పరమాశుభసూచకంబులందురు; మృగప్రదక్షిణంబులు శుభస్కరంబని నచింతురు. రెండు మనకిప్పుడు సంభవించెను. ఏమో దిగులగుచున్న' దనెను. వసిష్ఠుఁ డదివిని, 'రాజేంద్రా! భయము వలదు. అశుభములు శుభములవలసఁ బ్రతిహతమగు' ననెను. అంతలోన వాయువు ప్రచండమై నిర్ఘాతధ్వని వీచి భూమినెల్లఁ గ్రక్కదల్చెను; వృక్షంబులు ఫెళఫెళారావములతో నున్మూలితములై విసరిపడసాగెను; రవిమండలంబును గాఱుచీఁకట్లు గ్రసించెను; దిక్కులు విస్తేజమొందెను. ఆ విపరీతంబులకు వసిష్ఠదశరథులును రాజపుత్త్రులును దక్క దక్కినవారు భయభ్రాంతులై మూర్ఛిల్లిరి. అంతలోనఁ గైలాసమువలె దుర్ధర్షుఁడును గాలాగ్నికరణి దుస్సహుఁడును జేజోరాశిక్రియ దుర్నిరీక్ష్యుఁడునైన యొకఁడు జటామండలముతో మూపునవ్రేలాడుచున్న పరశుతూణీరంబులతోఁ ద్రిపురాంతకునివలె మహాభీకరుఁడై వారియెదుటఁ దోఁచెను.

దశరథుఁడు వానిం గాంచి వసిష్ఠునివంక మరలి, 'గురువర్యా! జ్యోతిర్జ్వాలాప్రచయ జటిలమైన కుఠారతూణీరంబులు మూఁపున వ్రేలాడుచున్నవి; కటిభాగంబున మౌంజీవల్కంబులు గ్రాలుచున్నవి. హస్తాగ్రంబునఁ గోదండంబును వలయీభూతలోలాక్షసూత్రంబును వెలయుచున్నవి. ఉగ్రశాంతరసంబులు విపర్తమొందుచున్నచో యన నితనివేషంబున దోఁచుచున్నది. వీనిని గాంచ మహాభయంబొందవే' ననెను. వసిష్ఠుఁ డామాటలువిని, 'రాజేంద్రా! ఇతఁ డెవఁడో యెఱుంగవా? ఏ ధార్మికోత్తముఁడు క్రౌంచమహీధరశిఖరంబును బాణాగ్రంబున దొలిచెనో, ఏ దానవీరుఁడు ధాత్రీతలంబునెల్ల ధారాగతమొనర్చెనో, ఏ రణశౌండీరునకుఁ బయోనిధి ప్రత్యగ్రక్షితి ఖండదండనవిధిక్రీడా విశేషంబునకు విధేయమయ్యెనో, ఏ వీరాతివీరుఁడు షణ్ముఖునితోఁ బోరి జయంబుగాంచెనో, హైహయరాజేంద్రుని యుద్దామదోఃకాంతారం బెవ్వని కరాంతరవిలసత్కుఠారాగ్రంబున నిర్మూలితమయ్యెనో యా ధీరుఁడు పరశురాముఁడు సుమా యితఁ' డనెను. ఆమాటతోడ దశరథుఁడు నిలువెల్ల గగుర్పాటొంది, 'కటా! పితృవధామర్షియైన యితఁడు క్షత్త్రసంహారంబును మరలఁ దలపెట్టి వచ్చెనా' యని డగ్గుత్తుకతోఁ బలికెను. ఇట్లు వసిష్ఠ దశరథులు లోలోన గుసగుసలాడి యర్ఘ్యమునిచ్చి యా భీమదర్శనుని డాయఁబోరి.

పరశురాముఁడు ఋషిసత్కారంబును మాత్రము గ్రహించి దశరథజ్యేష్ఠకుమారునివంక మఱలి 'రామా! నీ పరాక్రమాతిశయంబును లోకము వేనోళ్ళఁ జాటుచున్నది. తాటకను వధించితివఁట; మారీచసుబాహులను బరిమార్చి గాధేయుని మఖముఁ గాచితివఁట; ఫాలాక్షుని కోదండంబు నవలీలఁ ద్రుంచితివఁట. ఈ కడపటి కార్యముమాత్రం బచింత్యాద్భుతము. ఈ కతలెల్లవిని నీ బలంబును బరీక్షింప వచ్చితిని. ఇదిగో నా చేతి చాపంబును జూడుము. దీనిని నా తండ్రి జమదగ్ని నా కొసంగెను. దీనిని మోపెట్టి నీలావు చూపుము. ఇది సేయుదువేని నాతోడి ద్వంద్వయుద్ధంబునకుఁ దగుదు' వనెను.

ఆ వచనంబులు చెవిసోకినంతనే దశరథుఁడు చింతాభయ వ్యగ్రాంతరంగుఁడై కయిమోడ్చి, 'మహానుభావా! నీయందు ఈ త్తి రోషము ప్రశాంతమయ్యెను. బ్రాహ్మణుఁడవు మహాయశశ్శాలివి స్వాధ్యాయతత్పరులగు భార్గవులవంశంబున జనించి ప్రతిజ్ఞాపూర్వకంబుగా నింద్రునిమోల శస్త్రసన్యాస మొనర్చి ధరామండలమెల్లఁ గాశ్యపునకు ధారాగతమొనర్చి దిగంతకీర్తిఁ గాంచినపుణ్యాత్మా! సత్యసంధా బంధురా! త్యాగిలోకరత్నమా! నా తనయులైన యీ బాలురకు నభయప్రదానం బనుగ్రహింపుము. మా ప్రాణంబులీ రామునందున్నవి. రక్షింపు' మని ప్రార్థించెను.

పరశురాముఁడా భీరుని వచనంబులు జీరికిఁ గొనక, 'రామా! తొల్లి విశ్వకర్మ బహుప్రయత్న పూర్వకంబుగాఁ జాపద్వయము నిర్మించెను. అందొకటి త్రిపురాసురయుద్ధమునాఁడు దేవతలు శివునకు సమర్పించిరి. రెండవదానిని విష్ణుదేవునకిచ్చిరి. దేవతలట్లా కార్ముకముల రెంటిని శివకేశవులకిచ్చి యీ యిరువురబలాబలంబులు తెలియఁగోరి బ్రహ్మను బురికొల్పిరి. అతఁడు హరిహరులకుఁ బగకల్పించెను. మురాంతక పురాంతకులు కదిసి ఘోరసంగ్రామ మొనర్చిరి. విష్ణునిహుంకారంబున శివచాపము జడతనొందెను. ఫాలాక్షుఁడు మహోగ్రుఁడై కనులెఱ్ఱ జేసెను. అంతలోన దేవర్షిచారణాదులు వచ్చి ప్రళయం బాపుమని సహస్రవదనంబుల వారిని ప్రార్థించిరి. శివకేశవులు మనస్కరించి శాంతించిరి. విష్ణువే పరాక్రమతరుఁ డనెడి ఋష్యాదుల యాంతరంగికభావంబును శివుఁడు గ్రహించి యలిగి తన చాపంబును విదేహాధిపుఁడైన దేవరాతున కిచ్చెను. దానిని నీవు జనకరాజసభయందు ఫెళ్ళునవిఱిచి కీర్తిఁ గాంచితివి. విష్ణువు తనధనస్సును ఋచీకున కిచ్చెను. అతఁడు దానిని

నాతండ్రి కొసంగెను. నా జనకుఁడు న్యస్తశస్త్రుఁడై తపంబాచరించుం డఁగాఁ గార్తవీర్యార్జునుఁడు వానింబంపెను. ఆ భూర్తు దుండగము నా యెదలో శోకత్రంబును రగిల్చెను. అంత నేను క్షత్రియకుల సంహారం బును సంకల్పించి పలుమాఱు క్షత్రియులను బరిమార్చి తన్రుధిరంబు లతోఁ బితృతర్పణక్రియలొనర్చి క్షోణీమండలమెల్ల నైవసము చేసికొని యాగమొండుగావించి క్రతుదక్షిణగాఁ బృథ్వీతలమును గాశ్యపునకిచ్చి మహేంద్రాచలంబునఁ దపంబాచరించుచున్నాను. రామా! నీ కతలు విని యిందు వచ్చితిని. క్షత్రధర్మంబులను మఱువవుగదా. కానిమ్ము నీ దోస్సారముం బరికించి నీతో మల్లయుద్ధము గావింతు' ననెను.

దశరథునకుఁ బ్రాణంబులెల్ల నెగచినట్లయ్యెను. వానిశరీరము చిమ్మచెమటలఁ గురియసాగెను. అతఁడు నిశ్చేష్టితుఁడై నోరప్పళించి చేతులుచాచి యట్టెచూచుచు నిలిచెను. రాముఁడు పరశురాముని మాటలకుఁ గినుక దాల్పక వినయము వహించి, 'భార్గవా! నీ కార్యములు వింటిని; పితృభక్తికి సంతసించితిని. అయినను నన్నొక శక్తిహీనునిగా భావించి నీవిట్లు పలుకుట పాడిగాదు. నీగావించిన యవమానము దుస్స హము. ఇదిగో చూడు' మని వానిచేతి శరంబు నందుకొనెను. బాణ గ్రహణముతోడఁ బరశురాముని శక్తి గూడ రాముని జేరెను. అంత రాముఁడు విల్లందికొని శరసంధానమొనర్చి, 'భార్గవా! బ్రాహ్మణుఁ డవు గావునను మీఁదుమిక్కిలి విశ్వామిత్రుని భగినివైన సత్యవతికిని ఋచీకునకుఁ బుట్టిన జమదగ్నికిఁ గుమారుఁడవగుటం జేసియు నీపు నా కెం తయుఁ బూజ్యుఁడవు. ఆ కారణంబుల బట్టి నీపయిఁ బ్రాణహరణంబైన యీ శరంబును వదలఁజాలను. ఈబాణము వైష్ణవంబు గావున వ్యర్థ ముగా నేలఁబడరాదు. నీ పాదగతి శక్తియో భవత్తపోబల సమార్జితం బులైన లోకంబులలో రెంటినొకటి దీనికి గుఱికావలయును. ఇందేది వలతువో చెప్పు'మనెను. ఆ యుద్ధమును జూచుట్కై వచ్చిన సిద్ధచారణ గంధర్వ యక్షరాక్షస బ్రహ్మర్షులును నిర్జరులును బ్రహ్మయు రాము నకుఁ బరశురాముఁ డేమి బదులాడునో యని యూపిరి బిగియపట్టి వేచి యుండిరి.

భార్గవుఁడు నిస్తేజవీర్యుఁడై, 'రామా! భూమండలంబునెల్లఁ దొల్లి కాశ్యపునకు దత్తమొనర్చితిని. నా భూమిమీఁద నుండరాదని యతఁడప్పుడు కోరెను. రాత్రిపూటమాత్ర మట్లుసేయుమనని వానికి మాటయిచ్చితిని. ఆ కారణంబున నేను సూర్యాస్తమయములోపల

మహేంద్రగిరికిఁ బోకతీఱదు. కావున నా పాదగతిని హరింపవలదు. తపోబలంబున నా జయించిన పుణ్యలోకంబును వేయుము. కాలవిలంబము వలదు. విష్ణుచాపంబును మోపెట్టినప్పడే నీవు సాక్షాద్విష్ణుండవని గ్రహించితిని. నీకు శుభమగుఁగాక. నీ యమానుషకార్యంబునుఁ జూడఁ బర్యుత్సుకులై యిదిగో నిర్జరాదులు వచ్చియున్నారు. త్రైలోక్యనాథుఁడవైన నీవలన నేను పరాజయమొందుట యెంతమాత్రము లజ్జాకారణము గాదు. శరము వదలుము. బాణమోక్షానంతరము మహేంద్రగిరికిఁ జనువాఁడ' నని చెప్పెను.

రాముఁ డంత శరవిమోచనముఁ గావించెను. ఆ బాణము క్షణములోపల బరశురామతపస్సార్జిత లోకంబులను హరించెను. అంత జామదగ్ని రామునకుఁ బ్రదక్షిణ మొనర్చి మహేంద్రాద్రికిఁ జనెను. దిశలు ప్రసన్నంబులయ్యెను. సుఖవాయువులు వీచెను. నిర్జరాదులు విస్మయమంది రాముని బహుముఖంబులఁ బ్రశంసించిరి. దాశరథి ప్రశాంతమనస్కుఁడై యా శరచాపంబులను వరుణునకు నొసఁగి వసిష్ఠాదులకు నమస్కరించి, భయవివశుఁడైయున్న తండ్రినిఁ జూసి, 'నాయనా! పరశురాముఁడు చనెను; ఇఁక మనము చతురంగబలసమేతంబుగా నయోధ్యకుఁ దరలనగు. చాతకంబులు వర్షంబును బలె సేనాపటలము మీయాజ్ఞ నిరీక్షించుచున్న' దనెను. దశరథుఁడంతఁ దెప్పిఱిల్లి తన కొడుకులు పునర్జన్మమెత్తినట్లుగా భావించి రామునిఁ గవుఁగిటఁగూర్చి మూర్ధ్నఘ్రాణంబులుచేసి ప్రయాణంబునకు ననుజ్ఞయిచ్చెను. ప్రయాణమును సాగించిరి.

అట్లు చనుచు వసిష్ఠుఁడు రామున కిట్లనియెను.

వసిష్ఠుఁడు రామునకుఁ బరశురామచరిత్ర చెప్పుట

'వత్సా, రామ! ఈ పరశురాముని చరిత్ర వింటివా. కన్యాకుబ్జదేశంబున గాధియనుపేరి రాజొకఁడుండెను. ఆ గాధి యనువాఁడు చంద్రవంశ్యరాజులలో మొట్టమొదటివాఁడైన పురూరవుని వంశ్యులలో నొక శాఖయందు జనించెను. ఆ గాధికి సత్యవతియను పుత్రిక యుండెను. ఆ సత్యవతిని భృగువంశ్యుఁడైన ఋచీకుఁడనువాఁడు పెండ్లియయ్యెను. ఆ కాలమందు బ్రాహ్మణులు కన్యారణముగా వేయియశ్వములనిచ్చు సంప్రదాయముండెను. ఋత్విజుఁడు నిజతపోమహిమచేత గంగాదేవిని మెప్పించి వరుణుని యనుగ్రహంబున నుత్తమోత్త

నములైన యశ్వములను వేయింటిని బడసి గాధికి సమర్పించి తత్తన యను గ్రహించెను. గాధియు ఋచీకుని తపోవిశేషంబున కెంతయు సంతుష్టుఁడయ్యెను.

ఋచీకుఁ డట్లు సత్యవతిని బెండ్లాడి యామెతో సుఖముండగా నొకనాఁడు ఋచీకుని తండ్రి పుత్త్రుని జూచుటకై యతని యాశ్రమమునకు వచ్చి, కోడలి సాశీల్యానుల కెంతయు మెచ్చి కోరిన వరమిత్తునని యామెతోఁ బలికెను. సత్యవతి యందులకుఁ బరమప్రీతయై తనకునుఁ దనతల్లికిని బుత్త్రసంతానమును గోరెను. ఋచీకుని తండ్రి వల్లె యని పాయసాన్న పాత్రములు రెండిచ్చి, 'ఈ పాయసము మంత్రపూతము; ఇందొకటి నీవును రెండవది నీతల్లియును భుజింతురేని, నీకోర్కిసిద్ధించును. ఋతియుఁ బుణ్యదివసంబున నీవు మేడిచెట్టును నీతల్లి అశ్వత్థవృక్షంబును స్పృశింపనగును' అని పలికి యెవ రేపాత్రలోని పాయసంబును భుజింప వలసినది వేఱుచేసి చూపి యంతర్హితుఁ డయ్యెను.

సత్యవతి యీ సంగతి నామె తల్లికిఁ జెప్పెను. ఆమె యది విని, 'ఆ ఋషికి నాయెడకన్న వాని కోడలైన సత్యవతియందుఁ బ్రేమ మెండుగా నుండక తప్పదు. కావున నతఁడు వానికోడలకిచ్చిన పాయసమందు గుణాధిక్యత యుండును' అని తలపోసి సత్యవతిపాత్రను దాను గైకొని తన పాత్రను సత్యవతి కిచ్చుటయేగాక తాను మేడిచెట్టును స్పృశించి సత్యవతిని అశ్వత్థవృక్షంబును స్పృశింపఁ జేసెను.

కొన్నాళ్ళకు నిరువురుఁ జూలుదాల్చిరి. సత్యవతి జమదగ్నియను పుత్త్రుని గాంచెను. ఆమెతల్లికి విశ్వామిత్రుఁడు పుట్టెను. ఆ పాయశ పాత్రాదుల వినియమంబు నమ్మహర్షి గ్రహించి, 'సత్యవతీ! నీ తల్లి గావించిన కార్యము ఫలముగా నీ పుత్రుఁడు బ్రాహ్మణసంభూతుఁడయ్యు క్షత్రవంతుఁడుగా నుండును. నీ తల్లికాన్పు క్షత్రబీజంబునకు జనించినను బ్రాహ్మణగుణసంకలితుఁడుగా నుండు' ననెను.

సత్యవతి యామాటవిని, 'మహాత్మా! బ్రాహ్మణపతివలన నాకు క్షత్రగుణపుత్త్రుఁ డుదయించుట కెంతయు దురపిల్లుదు. నాయెడఁ గరుణించి నా కూన బ్రాహ్మణగుణశాలిగను వానికి జనించువాఁడు మీరన్నట్లు క్షత్రగుణాన్వితుఁడుగా నుండునట్లనుగ్రహింపు'మని ప్రార్థించెను. ఆ ఋషీంద్రుఁ డట్లేయగు ననెను.

అందువలన విశ్వామిత్రుఁడు క్షత్రియుఁడగు గాధికి జనించినను నిజతపోమహిమంబున బ్రాహ్మణత్వమును బడసెను. జమదగ్ని కొన్నాళ్లకుఁ బ్రసేనజిత్తు అను రాజుకుమార్తెను రేణుకయను దానిని వివాహమాడెను. వానికి నామెవలనఁ బరశురాముఁడను పుత్త్రుఁడు జనించెను. అతఁడు పరశువు (గండ్రగొడ్డలి) నాయుధముగా ధరించుటం జేసి వానికి నట్టిపేరు సార్థకనామమయ్యెను.

ఇట్లుండగా నొకనాఁడు రేణుక స్నానార్థము పోయి వచ్చు చుండఁగా గంధర్వరాజు చిత్రరథుఁడనువాఁ డామెకంటఁబడెను. ఆమెకు వానియందు మరులు జనించెను. ఎప్పుడట్టిభావం బామెయెడఁ గలిగెనో యప్పుడే యామెనైజతేజస్సు కప్పుదాల్చెను. ఆమె యింటికి వచ్చినంతట జమదగ్ని యామె ముఖలక్షణములను గాంచి తపోదృష్టిచేత సంగతిని గ్రహించి, వాని కొడుకులను నలువురను జీరి, 'మీతల్లి దుష్టభావ యయ్యెను గావున దాని తలను ద్రుంపనగు' ననెను. మొదటి ముగ్గురు కొడుకులు నందులకు సమ్మతింపరైరి. జమదగ్ని కోపించి జడంబులగు మని వారిని శపించెను. నాల్గవ కుమారుఁడైన పరశురాముఁడు తండ్రి యాజ్ఞను దలఁదాల్చి తనగొడ్డటఁ దల్లితలఁ దటిగెను. జమదగ్ని వాని కెంతయుఁ బ్రీతుఁడై, 'కుమారా! నీ యిచ్చవచ్చిన వరంబును గోరు మిచ్చెద' ననెను.

పరశురాముఁడు వానికి మ్రొక్కి, 'తండ్రీ! నాతల్లి పునర్జీవితురా లగునట్లును, ఆమె తలను నేను నఱుకుట జ్ఞప్తియుండకుండునట్లును, నా సోదరులు ముగ్గురు యథాపూర్వమగునట్లును వరమును బ్రసాదింపు' మని కోరెను. జమదగ్ని యట్లే యనెను. రేణుకాదులు దొడ్డొడ యథా పూర్వమైరి.

ఆ కాలంబున హైహయరాజ్యమును కృతవీర్యుని కుమారుఁడు అర్జునుఁడను మహాప్రతాపశాలి పరిపాలించుచుండెను. కృతవీర్యుని తనయుఁడగుటఁ జేసి వానిని గార్తవీర్యార్జునుఁ డనిరి. అతఁడు నారాయ ణావతారమైన దత్తాత్రేయునిగూర్చి తపస్సుచేసి, వానినలన సహస్ర బాహువులును సువర్ణరథమును బడసి తద్వరగర్వోద్ధతుఁడై లోకకంట కుఁడుగాఁ బరఁగి కొండొకనాఁడు జమదగ్ని యాశ్రమమునకు వచ్చి వాని హోమధేనువును బలాత్కారముగాఁ గొనిపోయెను. పరశు రాముఁడు కార్తవీర్యుని వెంటనంటి వానితోఁ బోరి తదీయ బాహు సహస్రంబును ద్రుంచివైచి వానిని సంహరించి తన పగఁ దీర్చికొనెను.

కొండొకనాఁడు కార్తవీర్యుని పుత్త్రులు తమ పగదీర్చుకోదలఁచి జమదగ్ని యాశ్రమమునకుఁ జని యప్పుడచ్చటఁ బరశురాముఁడు లేకుండుట యెఱింగి, తపోనిష్ఠలోనున్న జమదగ్నిని జంపివచ్చిరి. పరశురాముఁడాశ్రమంబునకు వచ్చి తండ్రిపాటుఁ గాంచి సంగతి విని క్రోధదుర్నిరీక్షణమూర్తియై క్షత్త్రవంశము నిర్మూలమగునందాక నా పరశువును క్రిందఁ బెట్టనని శపథముఁ గావించి, క్షత్రరాజ సంహారార్థ మిరువదియొక్కసార్లు దండయాత్ర గావించి, క్షత్రియులనెల్ల మట్టుపెట్టి తద్రుధిరంబుల చేతఁ గురుక్షేత్రమందు నేనుమడుగులు గావించి యారక్తములతో నిజపితృతర్పణ మొనర్చెను. ఆ యైదుమడుగులే నేఁడును శమంత పంచకమనఁబడును. అప్పుడు వాని తాత ఋచీకుఁడు ప్రత్యక్షమై, 'వత్సా! ఇఁక నీ యాగ్రహంబు నుడుగు' మనెను. పరశురాముఁ డంతట శాంతి వహించి నిజపాపక్షయార్థము మహాయజ్ఞ మొనర్చి యజ్ఞదక్షిణగాఁ దాను జయించిన దేశమునెల్లఁ గాశ్యపుఁడను వానికి నిచ్చెను. నాఁడు సుత వసుమతికిఁ గాశ్యపియను పేరు వచ్చెను. తక్కిన చరిత్ర వాని ముఖంబుననే వింటివిగదా.

అయోధ్యానగర ప్రవేశము

దశరథాదులు వచ్చుట విని యయోధ్యానగరవాసులు పట్టణము నెల్లెడ ధ్వజనీపతాకాదులతో నలంకరించి రాజమార్గంబులను జలసిక్తంబులు గావించి పూలుచల్లిరి. పురమెల్ల నానావిధ శృంగారములతో శోభిల్లెను. ఆ వేడుకలు చూచుటకై బహుదూరమునుండి వచ్చిన ప్రజలతో నగరమెల్లఁ గ్రిక్కిరిసెను.

దశరథుఁడు చతురంగబలసమేతుఁడై యపూర్వమహోత్సాహముతో రాఁగాఁ బౌరులు వివిధమంగళవాద్యంబులతోడ వానికి నెదురేగి నిండువేడుకలతో వానిని దోడితెచ్చి పురప్రవేశమొనర్చిరి.

వారట్లు నగరుచొచ్చినంతనే కౌసల్యాదులు తమ కోడండ్రకు రాచకన్నియలవలన శాస్త్రోక్తములైన యుపచారంబులు చేయించి వారి నంతఃపురమునకుఁ గొనిపోయి యట గృహదేవతలకు వారివలన బూజ లొనర్పించి బ్రాహ్మణోత్తములకు ధనధాన్యధేనువస్త్రాదికము దానమిప్పించిరి. విప్రులును బరమసంతుష్టులై వారిని మహాశీర్వచన మాలికలఁ గైసేసిరి. సీతాప్రభృతులు బ్రాహ్మణాశీర్వచనమాలికను దలదాల్చి యత్తలకు నిండుభక్తితో మ్రొక్కి భర్తలఁగూడి సుఖముండిరి.

ఇట్లు కొన్నాళ్ళు చనెను. ఒకనాఁడు దశరథుఁడు భరతుని బిలిచి, 'నాయనా, కేకయరాజు నిన్నుఁ జూడఁగోరి నీ మేనమామను బంపెను. అతఁడువచ్చి దినములు గడచెను. నీవు చని నీ తాతముచ్చటలు దీర్చి రమ్ము'ని చెప్పి వానిని బయనముచేసెను. భరతుఁడు తండ్రికిని రామున కును మ్రొక్కి లక్ష్మణుని గవుఁగిటఁగూర్చి తల్లులను వీడ్కొని శత్రు ఘ్నునితోడఁ గేకయపురికిఁ దరలెను.

రాముఁడు తండ్రి పంపునఁ బౌరకార్యములెల్ల నోర్పునేర్పులతో సర్వజనప్రియకరముగా నెఱవేర్చుచుఁ దల్లులను గురుఫులను యథాకాల శుశ్రూషలఁ దనుపుచు నిజశీలవృత్తంబుల నెల్లర హృదయంబులను హరించెను. జనులు వానియెడ నిర్వ్యాజవాత్సల్యాతిశయంబులు గురియు చుండిరి.

సీతారాముల దాంపత్యమన్ననో యిట్లని చెప్పరాకుండెను. రాముని మనస్సు సీతయందు లీనమైన దనుటకంటె నొండువిధంబున వాని ప్రేమాతిశయమును వర్ణింపసాధ్యముగాదు. సీతాదేవియు భర్తను స్వమనోధిష్ఠితధ్యానమూర్తినిగాఁ గొలువసాగెను. ఇట్లు వారు పరస్ప రానురాగబద్ధులై యసాధారణ దాంపత్యము వెలయ లక్ష్మీనారాయ ణుల పగిది విలసిల్లిరి.

చ॥ అమరులకోర్కిఁ దీర్ప మనుజాకృతిఁ గైకొని కోసలేంద్రు గ
ర్భమున జనించి రక్కసులఁ బాపి మునీంద్రుమనంబు సేసి యా
శ్రమములు సంచరించి పతిశాపమునుండి యహల్యగాచి చా
పముఁ దెగటార్చి భూమిసుతపాణి గ్రహించిన రాము మ్రొక్కెదన్॥

బాలకాండము

సమాప్తము.

అయోధ్యా కాండము

ఉ॥ దైహికమైనద్వంద్వములు తప్పవు త్రోయఁగరావు గాన సం
దేహము మాని సంగమము ద్రెంచి స్వధర్మము నాచరించుటే
దేహికి రాజయోగ మని దెల్పుచు మార్గముఁ జూపినట్టి వై
దేహివిభుఁ భజింతుఁ బ్రణుతింతును ప్రేమ నితాంతభక్తితోఁ.

దశరథమంతనము

రామునియందు రూపపరాక్రమంబులు పరస్పరజిగీషకై మూర్తీభవించెనో యన నొప్పెను. ఆయన నిస్తరంగసముద్రమువలె నిరంతర ప్రశాంతహృదయుఁడును మృదుమధురభాషియునై, కృతజ్ఞతాబుద్ధియు ననసూయత్వంబు ననెడి నిసర్గభూషణంబుల ధరించి, యపకారంబులకుఁ దలంగక ప్రత్యపకారస్మరణగూడ లేక, జ్ఞానశీలురయు వయోవృద్ధులయు గోష్ఠి వినోదించుచు శుక్లపక్ష శీతకరునివలె వర్ధిల్లుచుండెను. ఎన్నఁడును వాని నోట పురుషవచనము రాదు; సత్యముఁదప్ప నొండు పలుకఁడు; వాని భాషణములు స్మితపూర్వకంబులై వినవిన నింపు సొంపులు గూర్చుచుండెను; పరాక్రమంబున సాటిలేనివాఁడయ్యు గర్వంబెట్టిదో యెఱుఁగఁడు; దయారసము నిరంతరము వాని నేత్రకోణంబుల నొలుకుచుండెను.

మఱియు రాముఁడు పరధనమన్న విషప్రాయముగాఁ జూచుచు న్యాయవ్యయములందు శాస్త్రమార్గము నతిక్రమింపక అసంగబుద్ధితో స్వధర్మము ననుష్ఠించుటయే మర్త్యునకు నుత్తమోత్తమ కర్మయోగ మని భావించి తన్మార్గదర్శియై ఎలప్రాయపుబాట లెంత జాఱునవిగా నున్నను బతనమొందక జాగరూకుఁడై మెలంగుచు, దేశకాలపరిస్థితులు సమగ్రముగా గ్రహించి పరేంగితజ్ఞానియై, 'విపది ధైర్య' మను నార్యోక్తిని మఱువక, ఆత్మశుద్ధి యత్యంతముఁ ద్రికరణ దర్పణంబులందుఁ బ్రతిబింబించి వెలయుచుండఁగా, వేదవేదాంగ రహస్యార్థంబులకుఁ దన ప్రవర్తనంబును సులభవ్యాఖ్యానముగా నొనర్చి, స్వపరదోషంబు లెఱిఁగి లోకైకసాధువను కీర్తిఁ బడసి విబుధాశీర్వచన పరంపరలకును బ్రజాకృతజ్ఞతాభివందనంబులకును బాత్రమై, యర్థ సంపాద

నంబున మధుకరకౌశలంబును రాష్ట్రహితైకవ్యయంబున జలదుని త్యాగమును గలిగి, నీతిశాస్త్రంబునకు నిధియై కావ్యనాటకాలంకార సాహిత్యంబునకు మేలుబంతియై సంగీతశిల్పంబులందును వాజివారణ శిక్షావిధానమందును ధనుర్వేదరహస్య జ్ఞానమందును వ్యూహ ప్రతి వ్యూహ నిర్మాణమందును అద్వితీయుఁడై సమస్తకళలకు మెఱుఁగు కళయోయన నొప్పారి బుద్ధియందు బృహస్పతిని క్షమాసంపదయందు ధాత్రిని బరాక్రమంబున సహస్రాక్షుని నతిశయించి, కిరణంబులకు సూర్యుఁడట్లు సకల కళ్యాణగుణంబులకుఁ దావలమై శోభిల్లెను.

చ॥ వినయముచేతఁ దండ్రిని వివేకముచేత మనీషివర్యులన్
పెనుపగుదానమానముల భృత్యులఁ బోషణచేత బీదలన్
పనుపడ నిష్టకారియయి బంధుల గూరిమిచే ననుంగులన్
వినుతనయంబులన్ నృపతివీరుల దవ్వెను రాముఁ డెంతయున్.

దశరథసంకల్పము

అట్లు రాముఁడసదృశసద్గుణసంపన్నుఁడై కౌల్లరకుఁ బ్రియంబుఁ గూర్చుచుండుట దశరథుఁడు గాంచి యట్టి లోకోత్తరగుణవత్తరునిపయి రాజ్యభారమును సంపూర్ణముగా మోపి వేడుకజూడఁ గోరి కొండొక నాఁడు తన మంత్రులను రావించి, 'సచివోత్తములారా, నానాఁటికి నన్ను ముదిమి పైకొనుచున్నది. మఱియుఁ బీడాసూచకములైన మహోత్పాతంబులు గానవచ్చుచున్నవి. ఇఁక రాజ్యభారమును వహింపనోపను. ప్రజలన్ననో తమకు మేలుసేయురాజును గోరుదురు. ప్రజాసేవ యింతటి కష్టకార్య మనరాదు. శక్తియున్నంత కాలము జనులకై శ్రమించితిని. అది చాలనప్పుడు మోయరాని భారమును వహించుట హాస్యకరమేగాక దానివలన ముప్పుగూడనగును. మఱియు ప్రజానురాగము రామునియెడ మెండుగానున్నది. ఈ సమయమునఁ రాముని రాజ్యాధిపతినిగాఁ జేయుట యుక్తము. ఇవియెల్లఁ బర్యాలోచించి నా తనయునకు యౌవరాజ్యాభిషేకముఁ గావింప నిశ్చయించితిని. ఇది మీకు సమ్మతమేని తడవుసేయక సమస్త రాజులకు శుభవార్త నందఁజేసి కార్యముఁ గొనసాగింపుఁడు. కేకయరాజునకును జనక మహారాజునకును సందేశమందింపఁ గాలము జాలదు. అయినను వారు మనవారే గావున వేఱుగా భావింపరు. మీఁదుమిక్కిలి సంతసింతురనెను.

మంత్రులు వల్లెయని చని తేని యూహ్జఁ గావించిరి. సామంత రాజులును నాగరజానపదులును వచ్చి పుర మెల్ల నిండిరి. దశరథుఁడు నిండు కొలువు దీఱి సభాస్తారులను గాంచి, 'ఆర్యులారా, ఇందాఁక నా శక్తి కొలఁది ప్రజలను సేవించితిని; ముదిమి దారొక్కొనెను; తనువు విశ్రాంతిని గోరుచున్నది. అంతరంగభూతులైన వసిష్ఠామలకు సంగతి తెలిపితిని. రామునియందు రాజ్యభారము మోపి విశ్రాంతిని గైకొందును. నా యీ సంకల్పమును మీ రభినందింతు రని నమ్ముదు. ఒండుచో మీ మతము దాఁపవలదు. ప్రజాసమ్మతము గాని కార్యమును రాజు చేయరాదుగదా' యని వచించెను.

పౌరజనామోదము

సభాసదులు తేని భావంబును గ్రహించి తగవుతగము లాలోచించి, 'రాజేంద్రా, ప్రజాసేవను జిరకాలము గావించి మీరు డస్సిరనుట సత్యము. ముదిమియుఁ మిమ్ముఁ బైకొనుట నిజము. ఇప్పుడు మీ శరీరము విశ్రాంతిని గోరుట వింతగాదు. ఇఁకఁ బరిపాలనక్లేశమును మీ కిచ్చుట పాడిగాదు. రాముఁడన్ననో మీ యంతటి వాఁడు; రాజ్య భారము వహింప నతఁడెంతయుఁ దగును. మీ మతమునకు భిన్నము గలుగ' దనిరి. దశరథుఁడామాటలు విని వారి భావమును గ్రహింపని వాఁడు వోలె నటించి. 'ఆర్యులారా, ఆహార వ్యవహారములపట్ల మోమోటమి కూడదందురు. ముఖప్రీతికిఁగా మీరిట్లు వచించినట్లు తోఁచుచున్నది. ఏలయందురా? ఎన్నఁడును మీ యనురాగము నా యెడఁ గొదువగాదు. అట్టిమీరు నానోట మాట వచ్చి రాకమున్నే యూహించుట వింతగదా' యనెను. నాఁపుడు, 'రాజోత్తమా, అడిగి నప్పుడు మిన్నకుండరాదు. మీ రాజ్యసేవను మేము మఱువఁజాలము. మిమ్ము మనసార వదలినవారము గాము; శారీరకధర్మము లెల్లప్పుడు నేకరీతిగా నుండవు. మీ రిప్పుడు విశ్రాంతిని గోరుట వింతగాదు. అదియునుగాక మీ యంతవానిని మాకు రాజుగా నిచ్చుచున్నారు. ధర్మసంస్థాపనార్థము నీ తపఃఫలముగా నెవఁ డవతరించెనో, ముల్లోకంబు లెవ్వాని బహుముఖంబులఁ గీర్తించి యానందింపనున్నవో, జను లెవ్వానిని దమ ధ్యానమూర్తినిగా గ్రహించి ప్రభాత ప్రదోషంబులందు శ్రద్ధాభక్తులతో నారాధించి సంసారసాగరంబును దరింపనున్నారో యట్టి సర్వమంగళాకారుఁడు దయాసముద్రుఁడు సమస్త కళ్యాణగుణ ధురీణుఁడు త్రిభువనారాధ్యుఁడు శ్రీరాముఁడు మాకు రాజగుట

మా పూర్వసుకృతపరిపాకవిశేషముగాక యొండగునా ? ఇంతటి మహా భాగ్యమును మీరు మాకుఁ గనికరింపఁ దలంచిననాఁడు మేము వలదనఁ గలమా ? మీ యీ వరమునకుఁ గోసలరాజ్యశ్రీ కయిచ్చాచి యున్నది గదా' యని యేకగ్రీవమునఁ బల్కిరి.

దశరథుఁడు వారి సౌహృదయంబును బ్రశంసించి వసిష్ఠ వామదేవాదులవంక మరలి, 'చైత్రమాసము వచ్చెను. ఇది మహా శ్రీమంతము; ఈ నెలలో బ్రమోడులుసైతము చిగురుర్చును. ఇది చనక మున్నే రాముని యీవరాజ్యపట్టాభిషేకమునకు నార్యు లుపక్రమించుట శోభనహేమగు' నని చెప్పెను. ఆ మాటలతోడ సభాస్థలియందెల్ల జయజయధ్వనులు మాఱుమ్రోగెను. నాటికిఁ గొలువు ముగిసెను.

యౌవరాజ్యాభిషేకయత్నము

అంత వసిష్ఠాదులుగూడి మంత్రులను బిలిచి, 'ఱేని సంకల్పమును వింటిరిగదా. జాగువలదు; వలసినసామగ్రిని సంతరింపుఁడు. మణి సువర్ణంబులు నోషధులును లాజాధవళపుష్పమాలికలును మధుఘృతంబు లును నూత్నవస్త్రంబులును సర్వాయుధంబులును జతురంగబలంబును రథంబును శుభలక్షణలక్షితమైన గజేంద్రంబును జోడు చామరంబు లును ధ్వజశ్వేతఛత్రంబులును గనకకుంభశతంబులును గాంచనశృంగ వృషభంబును సమగ్రమగు వ్యాఘ్రచర్మంబును బ్రాతఃకాలమునకు ఱేని యగ్నిహోత్ర గృహంబున సిద్ధముగా నుండవలయును. అంతఃపుర ద్వారంబులను నగరద్వారంబులను గంధ పుష్పమాలికలతో నలంక రించి వాసనద్రవ్య ధూపధూపితంబులు గావింపనగును. దధిక్షీరసిక్తం బైన యన్నంబును లాజలతోడ బ్రాహ్మణులకు నూర్లకొలది ప్రాతఃకాలంబున నిప్పింపనగును. సూర్యోదయముతోడ స్వస్తివాచకము జరుగునుగావున బ్రాహ్మణులకు ముందుగా సంగతి యందింపుము. నగర మెల్ల ధ్వజతోరణసమలంకృత మొనర్చి రాజమార్గములందుఁ బన్నీరు కలయంపి జల్లింపనగును. నటీనటగాయకులు సాలంకృతులై రాజ గృహముఁ రెండనతొలికట్టునందుఁ గొలువుతీఱియుండవలయును. దేవాలయములందును జతుష్పథములందును దేవతలకు నైవేద్యంబు లును బ్రాహ్మణులకు భక్ష్యభోజ్యదక్షిణలును యథావిధి నర్పింప వలయును; యోధులు కవచధారులై కటారులు బిగించి ముంగిటఁ దీఱవలయు'నని యాజ్ఞాపించిరి. మంత్రు లాప్రకార మొనర్చిరి.

మఱునాఁడు దశరథుఁడు సమస్తరాజులతోడను మ్లేచ్ఛప్రభువుల తోడను బేరోలగము దీఱి రామునికై సుమంత్రుని బంపెను. ఆ రాఘవుఁడు తండ్రియాజ్ఞ విని వెనువెంటఁ బయనమై రథమెక్కి సభాస్థానమునకు వచ్చి సారథిచేయూతఁగొని తేఱుడిగ్గి మేడమీఁదికిఁ బోయి జనకుని పాదంబులకు ప్రమొక్కెను. దశరథుఁడు పుత్త్రుని గవుంగిటఁ గూర్చి తనచెంతనే దివ్యరత్నాసనంబునఁ గూర్చుండఁబెట్టెను. బాలభాస్కరుని వలన మేరుపర్వతమో లె రత్నపీఠియుఁ, జంద్రునివలన శరద్గగనంబువోలె సభాతలమును రామునివలన శోభిల్లెను. ఆ జగన్మోహనమూర్తిని జూచుచు సభాస్తారులెల్లరు నిర్నిమేషులైరి.

దశరథుఁడు రామునకు ముఖ్య రాజనీతు లుపదేశించుట

అద్దంబునఁ దనబింబమునట్లు దశరథుఁడు సుతునిఁగాంచి లేనగవు మోము నలరింప, 'వత్సా, ప్రజలు నీసుగుణవశవర్తులై నీకు యీవ రాజ్యాభిషేకమును గోరుచున్నారు. తనయు డంతటివాఁ డగుటకన్నఁ దండ్రికిఁ బ్రియతరముండునా? పరమ పునీతురాలు నీ తల్లి నోచిన నోములు ఫలించెను. పుష్యనక్షత్రమునాఁడు నీకుఁ బట్టముఁగట్ట నిశ్చయించిరి. నాయనా, నిసర్గమధురమూర్తికి నీకు నుపదేశింపనేల? అయినను సుహృద్భావం బూఁతకుండనీయదు గావున వచింతును. సర్వానర్థంబులకుఁ గామము బీజము; ఎల్లరకు వినయము పరమమిత్రము. జితేంద్రియునకు దుర్లభము గలుగదు. ఈ మూఁడు మఱువనలదు. మఱియు రాజు నిజమంత్రులతోడ ప్రత్యక్షముగా వ్యవహరింపవలయును; భృత్యులను బరోక్షమున శాసింపనలయును; ప్రకృతిరంజనమునకన్న వేఱు తలంపు క్షేమానికి నుండరాదు. ఇంతకంఱెఁ జెప్పఁదగినవి లే' వనెను. ఆ హితోపదేశంబును రాముఁడు తలతో గ్రహించి తండ్రికి నమస్కరించి వానియాజ్ఞంబడసి తన మందిరమునకుఁ బోయెను. పౌరులును సర్వాభీష్టసిద్ధియట్లు సంతసించిరి. ఆ శుభవార్తను రాముని మిత్రులు కొందఱు హుటాహుటిఁ గొనిపోయి కౌసల్యాదేవికిఁ దెలిపిరి. ఆమెయు మహానందభరితయై యా వార్తాహరులను వివిధ పారితోషికంబుల మన్నించెను.

దశరథుఁడు సభ చాలించి పోయి యేకాంతమున మంత్రులను బిలిచి, 'ఱేపుగదా పుష్యనక్షత్రము. కార్యము నిలువరాదు' అని హెచ్చరించి పంపి, సుమంత్రుని రావించి రాముని మఱలఁ దోడ్కొనిరమ్మనెను. అతఁడు చని తండ్రిపిలుపు తనయునకుఁ దెలిసెను. రాముఁ

డది విని యేమోయని దోడ్తోడ బయలుదేఱి పోయి తన రాకను జనకునకు నెఱింగించి తదనుజ్ఞతుఁడై లోనికిఁజని యందుఁ గూర్చుండియున్న తండ్రికి నమస్కరించెను. దశరథుఁడు సుతుని నిజాంకమునఁ గూర్చి, 'నాయనా, దీర్ఘకాలము మంటిని; ఇష్టభోగంబులను యథామతిఁ జూఱలాడితిని; యాగాధ్యయన దానంబులవలన దేవర్షి బ్రాహ్మణ ఋణంబులఁ దీర్చితిని; సుఖానుభవమునలన శరీరఋణముఁ బాపికొంటిని; నిన్నుఁ బడసి పితృఋణముఁ గడిగంటిని. ఇఁక గోరదగినదియుఁ బడయనైనదియు నాకు మఱొండు గలుగదు. అయినను రాజ్యవిషయిక చింత మాత్రము నన్నుఁ బాయదు. ముదిమిం జేసి రాజ్యభారము మోయనోప ననుట స్పష్టము. అట్టి సందర్భమున రాజ్యమును యోగ్యునిచేతఁ బెట్టుట నాకు ధర్మము; జాగుసేయవలదని సూచనలు పెచ్చరింపు చున్నవి. ఎల్లందువా? దుస్స్వప్నంబులకు విరమరలేదు; ఉల్కాపాతములు బహుళముగా సంభవిల్లుచున్నవి. ఈ దుర్నిమిత్తంబులు ప్రాయికంబుగా రాజమరణంబునుగాని తత్సమానమైన ఘోరవిపత్తును గాని సూచించును. ఇందులకుఁ దోడుగా నా జన్మనక్షత్రము ప్రకృతము సూర్యాంగారకరాహుగ్రహంబులచేత నవష్టంభితమై యున్నదని దైవజ్ఞులవలన విందును. ఇట్టి గ్రహస్థితి మేలుగాదు. అన్నియుఁ బర్యాలోచించి నీకుఁ బట్టముఁగట్టుట యుక్తమని నిశ్చయించి యీకార్యముఁ దొరకొంటిని. వత్సా! నియతాత్ముఁడవై భార్యతోడ నేఁడుపవసించి దర్భప్రస్తర శయనముఁగావింపుము. శుభకార్యంబులకుఁ బెక్కు విఘ్నములు గలుగుచుండును. నీ సుహృదులు జాగరూకులై నిన్ను సర్వవిధంబులఁ గాపాడుదురుగాక. భరతుఁడు రాకమున్న యీ పని జరుగుట యుక్తము. అతఁడు సదాచారసంపత్తియు ధర్మనిరతియు భ్రాతృవత్సలతయుఁ గలిగి యుండుట నిజము. అయిననుఁ జాంచల్యపిశాచము మానవజాతిని నెన్నంటి యుండును. దానినోటఁ బడకుండుటకు నందరుఁజూల' రని వాత్సల్యభయవిహ్వలమైన స్వరమున వచించి రాముని బంపెను. ఆ రాజకుమారుఁడు తండ్రికి మ్రొక్కి సంగతియెల్లఁ దల్లికి విన్నవించు వాఁడై యామె యంతఃపురమునకుఁ బోయెను.

కౌశల్యాదేవి పుత్రుని క్షేమార్థము భగవంతుని ప్రార్థించుట

అత్తఱి కౌసల్యాదేవి పట్టుచీఱెఁగట్టి దేవతాగృహముఁ జేరి పుత్రార్థము రాజ్యలక్ష్మినిగోరి కులదేవతయైన శ్రీమన్నారాయణ మూర్తి నిట్లు స్తుతించుచుండెను.

"ఉ॥ ఎవ్వనిచేజనించు జగ మెవ్వనిలోపలనుండు లీనమై
యెవ్వనియందు డిందుఁ బరమేశ్వరుఁడెవ్వఁడు మూలకారణం
బెవ్వఁ డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు సర్వముఁ దానయైనవాఁ
డెవ్వఁడు వానినాత్మభవు నీశ్వరు నే శరణంబు వేడెదన్.

"క॥ లోకంబులు లోకేశులు
లోకస్థులుఁదెగినఁదుది నలోకంబగు నెం
దీకటికవ్వల నెవ్వం
డేకాకృతి వెలుఁగు నతని నే సేవింతున్."

శా॥ ఓదేవాధిప ! యోకృపాజలనిధీ ! యోసింధుకన్యాపతీ !
ఓదైత్యాంతక ! యోగజేంద్రవరదా ! యోభక్తచింతామణీ !
ఓదామోదర ! యోజగత్త్రయగురూ ! యోపుండరీకేక్షణా !
ఓ దీనావనదీక్ష ! నీపదాబ్జముల నెంతోనమ్మితిన్ మాధవా !

ఉ॥ కొటుకకొండఁ గజ్జిలముగా వనరాశి తదీయపాత్రగాఁ
బాటిలధాత్రియున్ పలకపై సురశాఖిలంబుఁబట్టి యూ
హాటకగర్భరాణి నలుహస్తములన్ రచియించినన్ జగ
న్నాటకసూత్రి ! నీగుణగణంబులపారము మట్టనేర్చునే ?

ఉ॥ అందవబుద్ధికిన్ నుడికి నంతకుముందటె యందవెంచఁగా
నెంగును నీవయుందు వది యేమి విచిత్రమొ యిట్టులున్న నే
కొందలపో నిన్నుఁ గొంతఁ గనుగొంగుల భావసమాధినిష్ఠ నీ
చందము చూనిముఖ్యులకు సైత మతీతముగాదె శ్రీపతీ.

ఉ॥ నాయెదగుట్టు నీదుచరణంబుల మ్రొలనువైచి భక్తిమై
దోయిలియొగ్గి నిల్చితిని ద్రోయకుమవ్వలఁ దోయజాక్ష నీ
వే యికనాకుదిక్కు మఱియెవ్వరుఁగల్గరు, వ్రాలి తార్థముల్
జేయుము సేయుమయ్య నినుఁజేరినవారికి నేగియుండునే ?

రాముఁడు నిజయౌవరాజ్యాభిషేకవార్త తల్లికిఁ జెప్పుట

ఆమె యిట్లు స్తుతించి కొండొకవడి ధ్యానగతాత్మయై యుండి లేచి సాష్టాంగ మొనర్చి నిలిచెను. అంతలోన రాముఁడామెను డాసి తదీయపాదంబులకు నమస్కరించి, 'తల్లీ, నాతండ్రి నన్ను రాజ్య పరిపాలనంబునకు నియమించెను; పట్టాభిషేకము జేపని నిశ్చయించిరి; నేఁడు నేను సీతతోడ నుపవసించునట్లు కట్టడి యయ్యెను. వలయు మంగళంబులను మాకుఁ గావింపవేడుదు' ననెను.

కౌసల్యాదేవి హర్షాశ్రువులు నించి పుత్త్రునిఁ గవుఁగిటఁగూర్చి దీవించి, 'నాయనా! సద్గుణంబులచేతఁ దండ్రి నారాధించితివి; నాతపస్సు ఫలించెను. శ్రీమన్నారాయణమూర్తి యనుగ్రహంబునఁ గోసల రాజ్యశ్రీ నిన్ను వరింపనున్న' దనెను. అంతలోన సీతయు సుమిత్ర లక్ష్మణులు నటకు నచ్చిరి. రాముఁడు తమ్ముని జూచి, 'సౌమిత్రీ, నాయనగాని యాజ్ఞ వింటివా? నీవు నాకు బహిఃప్రాణంబవు గావున నీ కొఱకు రాజ్యంబును నా జీవితంబును లెక్కసేయుదు. రాజ్యలక్ష్మి నా తోడ నిన్నుఁగూడ నాశ్రయించి యుండును. రాజ్యభోగంబుల నెల్ల నిర్విశేషంబుగా ననుభవింపు' మని పలికి తల్లికిని సుమిత్రకును మ్రొక్కి సీతను వెంటఁగొని, ప్రమోదవికసితవదనారవిందలైన నారీరత్నముల తోను మహాసంతోషవివశమైన సేవకబృందముతోను గ్రిక్కిరిసి ప్రఫుల్లనళినము మత్తద్విజగణము నైన సరోవరంబును బోలియున్న నిజమందిరంబును బ్రవేశించెను.

రాముఁడు పత్నితోడ నుపవాసవిధి సల్పుట

దశరథుఁడట్లు రామునిఁబంపియు నంతతోఁ దనియక వసిష్ఠుని రావించి, 'గురూత్తమా! ఉపవాస వ్రతమును రాముఁడు మఱుచునేమో యని శంకయయ్యెడు. మీరు చని వానికి వ్రతక్రమ ముపదేశించి వచ్చుట మేల'ని వచించెను. వసిష్ఠుఁడు వల్లెయని బ్రాహ్మణయోగ్యమైన రథమెక్కి రాముని మందిరమునకుఁబోయి కౌత్రేయము దాటి తనరాక యెఱిఁగించెను. రాముఁడెదురువచ్చి చేయూతయిచ్చి మునీంద్రుని రథమునుండి దింపెను. వసిష్ఠుఁడు వాని నాశీర్వదించి, 'వత్సా, నీ తండ్రి నీయెడఁ బ్రసన్నుఁడయ్యెను; యువరాజ్యముఁ బడయనున్నావు; నెల్లవాఁ డభిషేకమంగళము జరుగనున్నది. భార్యాసహితముగా నుపవసింపు'మని చెప్పి జాయాపతులను సమంత్రకంబుగా నుపవాసవిధి నుంచి వారి పూజలంది మరలివచ్చి యాసంగతి జేనికి వినిచి వాని యుత్తలపాటుఁ దీర్చెను.

రాముఁడట్లు సపత్నీకముగా నియతవ్రతుఁడై శ్రీమన్నారాయణ భగవానుని నుపాసించి, హవిఃపాత్రమును యథావిధిఁ దలఁదాల్చి యుపాసితదైవంబునుగూర్చి యగ్నిహోత్రంబున నాజ్యహోమమొనర్చి తచ్ఛేషంబును భుజించి, విష్ణ్వాలయమందు దర్భాసనంబున నధివసించి, మౌనవ్రతముఁ బూని నారాయణధ్యానైకపరుఁడై తేయిపుచ్చి,

జాముప్రొద్దుండగా లేచి ప్రాతస్సంధ్యాదీర్చి గాయత్రి జపించి, విష్ణు దేవునకు స్తుతిపూర్వక దండప్రణామంబు గావించి, సరాసి పీతాంబరము ధరించెను. బ్రాహ్మణులువచ్చి పుణ్యాహవాచనమొనర్చిరి. ఆఘోష తూర్యనినాదముమోలెఁ బుర మెల్ల వ్యాపించెను.

అయోధ్యానగరమును శృంగారించుట

నగరవాసులు తమతమ భక్తిసంతోషంబులఁ గొండుతలమించు తలంపులతో వేకువనే లేచి వారిముంగిళ్ళు శ్రేసేసిరి. గోపురములందుఁ జతుష్పథములందు రథ్యాప్రదేశములందు రాజమార్గములందు నట్టూలక విపణిశ్రేణులందుఁ బ్రాసాదమందిరములందు సభాస్థలములందు నున్నత శాఖిశాఖాగ్రములందుఁ జిత్రవిచిత్రములైన ధ్వజపతాకలెత్తఁబడెను. మార్గాంతరంబులందు సుగంధిజలములును బుష్పములును జల్లిరి. అభిషేకమహోత్సవ కార్యములు సమాప్తమగులోనఁ జీకటి పడునో యని యందంను దీపవృక్షంబులను విచిత్రముగాఁ దీర్చిరి. నగరమెల్లఁ బ్రజాహర్షతరంగముల రొదతోడనిండి యల్లోలకల్లోకనుగుసాగరమును బోలెను. కందువులుఁగూడఁ దమ యాటపాటలలో నదేసంగతిగా నుండిరి. తేని త్యాగబుద్ధియు భావశుద్ధియు వేనోళ్ళఁ గీర్తింపఁ బడుచుండెను. జనులు చిరమనోరథసిద్ధులట్లు పరమోత్సుకులై స్వశక్తి సంపదల నావంతయుఁ బరిగణింపక మహోత్సవమును శతగుణాధిక మొనర్చుటకై నిండుమనంబుతో సర్వము న్యయింపసాగిరి.

విషబీజారోపణము - కైకేయీమంథరలు

దశరథుఁడు కైకేయియందు మిక్కుటముగాఁ దగిలియుండెను. అట్లుండియు రామ యౌవరాజ్యాభిషేక విషయమై యామెతోఁ సందాఁక నతఁడు ప్రస్తావింపడయ్యెను. అందువలన నామెకాసంగతియే తెలియదు. మతియు నేఁడు ప్రతిరాత్రి యామెతోఁ బుచ్చుచుండు వాఁడు. నాటఁజేయి యేలనో యందు రాడయ్యెను. కైకేయి పతికై చాలసేపు కాచియుండి నిద్రాలసయై కనుగూర్కెను. తెల్లవాఱి యామె కూర్మిదాసి మంథర యనునది ముందుగా లేచి యదృచ్ఛగా మేడయెక్కెను. నగరమెల్ల ధ్వజపతాకలతో నిండియుండెను; వివిధ వాద్యంబులు చెవులు గీడ్పడ బ్రమోయుచుండెను. ఎల్లెడల జనులు గిటగిటమని యుండిరి; తెల్లని పూమాల తోరణంబుల సువాసనలు గుప్పించెను; గజబృంహితములును హయఘోషలును దుస్సహ

మయ్యెను; పచ్చతోరణముఁ గట్టని యిల్లే కానరాదయ్యెను. మంథర యీవింతఁగాంచి పరమాశ్చర్యమొంది, 'ఏమి! ఇది యింద్రజాలమా? కాకున్నఁ దెల్ల వాఱులోపల నింతమార్పుగలుగునా? ఏమియుఁ దోఁపదు' అని దిగాఱుపడి చూడసాగెను. అంతలో నచ్చటికిఁ బనికత్తె యొకటి వచ్చెను. మంథర దానినిగాంచి, 'ఈవింతయేమి?' అనెను. 'అమ్మా! రామునకు యౌవరాజ్యాభిషేకమఁట; అందులకు సంబంధించిన మహోత్సవలక్షణము లివియెల్ల' నని యాబోటి పలికెను. ఆ మాట తోడ మంథర కోపమూర్ఛితయై రోఁజుచు మేడనుండి హుటాహుటి దిగి పడుచు లేచుచుఁ గైకేయీ శయ్యాగృహమునకుఁ బోయి గాఢనిద్రా పరవశయైయున్న యామెను డాసి, 'మూఢా! ఇంకను గన్నులు విప్పవా? విపత్తు క్రమ్ముచుండుట గానక క్రమ్మోడువలె నిద్రింతువా? సిగ్గులేదా? లే లెమ్ము; దుఃఖకూపంబున నిన్నుద్రోసిరి. అనిష్టా! మహాసౌభాగ్యవతినని మురియుదువు. నీ సౌభాగ్యమెల్ల వలసపోయెను. నీ గతి యిప్పుడైనను గ్రహింపు' మని రోషదీనస్వరంబునఁ బలికెను.

కైకేయి కన్నులు విచ్చి, 'మంథరా! సంగతియేమి? తహతహ పడుదువేల? నీ మోము విన్నవోయి యున్నది; కారణమేమి?' అని నిబ్బరముగా నడిగెను. మంథర కన్నీరు నించుచు, 'ఏమిచెప్పుదు; నోటమాటరాదు. అప్రతీహతమైన వినాశయత్నము నీకుఁ గావించిరి. నా దేహమే నాకుఁ దెలియకున్నది; ప్రాణము లెగసి పోవుచున్నవి; ఎడరు నిలునెల్ల నేర్చుచున్నది! అయ్యో! కడలేని విపత్సాగరంబునఁ గ్రుంగితివి; ఏమిసేయుదు! ఏమిసేయుదు! నీ హితము నన్నుఁబాయని కారణంబున జీవముతో నిట రాఁగల్గితిని. కైకా! నీ దుఃఖము నా దుఃఖముగా నీ మేలు నా మేలుగా భావింతును గాన నీ యీ దుర్గతికిఁ జింతింతును. కటా! ఎంత యాపద! హా! దైవమా! మమ్ము మఱచితివా? కేకయరాజా! ఏమని నీకు విన్నవింతు? కైకా! కైకా! ఎంత బేలవు! చీ! ఇఁక నా బ్రతుకేల?' యని విలపించెను. కైకేయి యయ్యా గడముఁజూచి యేమియుఁదోఁపక, 'మంథరా! సంగతి చెప్పవేల? ఏమి విపత్తు వచ్చె'నని మఱిమఱి యడిగెను. మంథర సంగతి చెప్పకయే, 'నిర్భాగ్యురాలా! రాచవంశమునఁ బుట్టితివేగాని రాచసడతల కఱుకుఁదనముఁ దెలియవు. ఎంత గోలవు! ఇఁకనైన నీ జోలతనమును మానుదువా? కల్లకపటంబులు నేరవు; కావుననే నీకీగతి పట్టెను. మురిపెంబులకు బూరటిల్లుదువు; తియ్యని పల్కులకుఁ గొండ యెక్కుదువు.

జడమతీ! నా భర్త ధర్మదేవతయని చాటితివి. ధర్మదేవతయో కర్మదేవతయో యిప్పుడైనను గ్రహింతువా?' యనెను.

కైక:- చెలీ! నిష్కారణంబుగా నిందింతువేగాని సంగతి తెలుపవేల?

మం:- అకటా! దశరథా! ముద్దుఁజిల్కను గండుపిల్లి నోటికి నందించితివా? త్రాచును ముద్దుసేసి నట్లయ్యెఁ గదా నీ చెలిమి?

కైక:- అయ్యో! మంథరా! ఏమి యిది? పిచ్చిపట్టెనా? నా పతిని దూఱుదువేల? సంగతియేమి?

మం:- కైకా! నా భర్త కూర్మి నా యందు మూర్ఛిల్లి యున్న దంటివి. వాని టక్కుఁడెక్కులకుఁ జిక్కి సొక్కుదువు. ఆ కూర్మి నెల్ల నే డతఁడు నీ పయిఁ గ్రుమ్మరించినాఁడు. ఊడిగపుఁగత్తె వైతివి. ఇంతకన్న నేమి చెప్పుదు?

కైక:- మంథరా! గర్భోక్తులు మాని సంగతి తెలుపుము.

మం:- అయ్యో! ఈ పాపువార్త యేమని తెలుపుదు? దుఃఖము పొరలి వచ్చుచున్నది; మాటరాదు—రామునికి—పట్టముగట్టి నీ చేతికి—

రామునకుఁ బట్టముకట్టుదురను మాట చెవిసోకినంతనే కైకేయి లేచి కూర్చుండి, 'అహో, ఎంత ప్రియవార్త. ఈ సుభవార్తను వినిపించిన నీకేమి యీయరాదు? మంథరా, ఇదిగో యీ ముత్యాల హారమును బహుమానముగాఁ గైకొనుము. అహో, ఈ వార్త యమృత ప్రాయమై నాకు సకలేంద్రియ సంతర్పణ మొనర్చుచున్నది. నా భాగ్యమే భాగ్యము. సఖీ, నీవు నాకుఁ గూర్చిన సంతోష మింతన రాదు' అని పలికెను. ఆ మాటలకు మంథర మండిపడి, 'బాలిశా! ఏడుపునకు బదులుగా సంతోషమా? శోక సాగరంబునఁ గూలుట యెఱుంగవా? దుర్మతీ! నీ యజ్ఞానంబునను నెంతయు వగతు. కన్న కొడుకును గూర్చినచింత యీషన్మాత్రమునూడ నీకుఁ గలుగదా? ఇంత నిర్భాగ్యురాలుండునా? సవతి సుతుని సంపదకుఁ బ్రుళ్ళు వెట్టి వగుట నేఁడు గంటిని. కావుననే దశరథుఁడు నీకు వాతఁబెట్టెను. అమ్మా! రామాభిషేకమునకు నుబుసుపోకలు పోవుదువు; భరతునిగతి యేమనుకొంటివి? పరాకుచెందకు; కడుపారఁ గన్నసుతుని గాచి కొనుము. అయ్యో! భరతా! నిన్నుఁ దలంచినంతనే నా గుండియలు వ్రీలుచున్నవి. నాయనా! ఇఁక నీ గతియేమి? దోసెఁడు గుడ్డయు

బట్టెఁడు కూమును గఅవై పొట్టఁ జేతఁబట్టుకొని పస్తుపడి పరులపంచలు ప్రాకి యెట్టకేలకుఁ జివికిచచ్చు కల్మినిఁ గట్టడిదైవము నీ నొసఁట వ్రాసెనా?' యని యెలుగెత్తి వాపోవసాగెను.

కైక:- మంథరా! రామాభిషేకంబునకు భరతుఁడు గూడ సంత సించును సుమా. రామభరతులిద్దఱు నాకు నొక్కటేగదా. అయ్యో! ఈ కలవరమేల? రామునిఁ దెలియదా? తమ్ములనుఁ దనకు సాటిగాఁ జూచును; స్వార్థమెట్టిదో యెఱుఁగడు; నమ్మిన వారికిఁ ప్రాణ మిచ్చును; మిన్ను మీఁదఁ బడినను మిథ్యా వచనము పలుకఁడు; ఆడినమాట తప్పఁడు; తల్లిదండ్రులయెడ వాని శ్రద్ధాభక్తు లింతనరాదు. నిసర్గమాధురీగుణ మట్లు మూర్తీభవించెనో యని వానిని దలంతును. ధర్మజ్ఞుఁడును శిక్షితుఁడును బరిశుద్ధుఁడునైన రాముఁడు యువరాజగుట రాష్ట్ర సుకృతముగాని వేఱుగాదు.

మం:- ఔనౌను; చతుస్సముద్రముద్రితధరామండలేశ్వరియైన కౌసల్యా దేవికి దాసియైనోచి పనులుచేయు నీసుకృతము మాత్రము సామాన్యమూ? నీ జోలి నా కేల? కౌసల్యకు మమ్మేలఁ గుదువ వైతైదవు? నీకన్నకొడుకును రామునకు సమర్పింపుము. కోడలిని ముసుఁగువైచి మూలఁ గూర్చుండఁ బెట్టుము. నీకన్నులకల్మి తీఱును. వెఱ్ఱిదానా! లక్ష్మణుఁడు రామునిమాట జవదాటఁడు. భరతుఁడు లక్ష్మణశత్రుఘ్నులకన్నఁ బెద్దవాఁడు; రాజ్యాధికారము భరతునకు సన్నిహితము; రాముని చనంతరము రాజ్యము భరతవశముగాక మానదు. రాజులన్నఁ యశాత్రవ రాజ్యమును గోరుమరు. రాముఁడు రాజనీతిజ్ఞుడగాని యేతన్మాత్రుఁడు గాఁడు; వాని సమయజ్ఞతయుఁ బ్రజావశీకరణశక్తియు నింతనరాదు. సంగతి యింతస్పష్టముగానున్నది; ముంజేతి కంకణమునకుఁగా నద్దమును గోరుదువు. నీ యజ్ఞానము బోధపడదు సుమా!

కైక:- మంథరా! నీ భావము బోధపడెను. రామాభిషేకము నీ కెంత మాత్రము సమ్మతముగాదు. ఆ బిడ్డవలన నీవు వెఱపు శంకింతువు. ఆ కూన యెన్నఁడుగాని యెవరికి నెగ్గుసేయఁడు. నీ విట్లు తలఁపనేల? ఈ భ్రాంతి యుడుగుము. భరతునిసంగతి యేమందువా? రాజ్యము జ్యేష్ఠానుగతమగుట ధర్మము.

రాముఁడు నూఱేండ్లు రాజ్యమేలుఁగాక. అనంతరమే మన భరతుఁడు రాజుగాఁగలఁడు. తొందఱయేమి? రాముఁడు నన్నెంతో యెక్కువగా శుశ్రూషించును; నా యభిమతంబు లడుగకయే కురియుచుండును; వానికందలి నా వాత్సల్య మింతన రాదు. రామాభిషేకమును నేనుగూడఁ గోరుదు. ఈ కార్య భారమును నేనే స్వతంత్రించి నహింతుఁగదా.

మం:- అనర్థదర్శినీ! నీ మూఢ్యము మానుము. ఆత్మహితమెట్టిదో యెఱుఁగవు. నీ తలవ్రాత యిట్లున్నది కాఁబోలు. రాముని తర్వాతనే రాజ్యము భరతునకు వచ్చునని చంకలెగవేయుచున్నావు. నీ యట్టి బాలిశురాలు జనింపఁబోదు. రాజ్యము జ్యేష్ఠానుక్రమమని నీవేచెప్పితివి. రామునకుఁ గొడుకు గలుగఁడా? అతఁడు రాజు గాఁడా? నీ సుతునకు రాజ్యమెట్లు దక్కును? పుత్త్రాభ్యుదయ మును గోరునట్టి తల్లి యిట్లాడునా? అమ్మా! నీ కొడుకును గుట్ట లకుం దోలుము. నీ కడుపు చల్లారును. ఇంత వెట్టివని తెలియక నీవెంటనచ్చితిని; నీకుఁగాదు నా యజ్ఞానంబునకుఁగా వగతు. నీ కడగండ్లతో నాకుఁ బనిలేదు. చేతులారఁ బెంచిన భరతునకై విలపింతును. నాయనా! భరతా! ఎండకన్నెఱుంగవు; అగర్భ శ్రీమంతుఁడవు; ఇఁక నీగతియేమి? నీ యన్న రాజుగానున్నాఁడు. దాయాదిమచ్చరమునకు మేరలేదు. క్ష్త్రియుల సంగతి చెప్పవలయునా? నాయనా! బ్రదికియున్న శుభములు పడయ వచ్చు నందురు. ఇటు రానవలదు. నీ మేనమామ పంచలుప్రాఁకి పొట్టపోసికొనుము. ఇదే నీతల్లికోరిక. కటా! మాలిమినలన ప్రాఁకులుగూడఁ బ్రియమగు నందురు. నీ తల్లియఁ దిట్టిది గోరంతయు గాన్పింపదు. నిజము గ్రహించితిని. పాషాణము నూఁతి యీ విధాత నీతల్లిహృదయము కల్పించెను. కైకా! రాముఁడు రాజనీతిజ్ఞుఁ డంటివి. ఇఁక నీ కొడుకునకు నీళ్ళు పదలుము. ఏలయందువా? భయమనునది యెల్లభూతముల నావరించియుండును. ఆత్మరక్షణార్థము ప్రాణికోటి పలుపోకలు పోవుచుండును. ఆత్మకన్న ధనము నెక్కుడు సేయుదురు. దానికి హానిగలుగనున్నచోఁ దద్రక్షణార్థము ధర్మాధర్మములనుగూడఁ బాటింపరు. ఇది లోకసహజమేగదా? రాముఁడు రాజయిన నాఁడు రాజ్యరక్షణార్థ మతఁడెంత జాగరూకుఁడై యుండ

వలయునో నీవే నూహింపుము. రాజులు రానున్న యాపదలనుఁ గూడ ముందుగా వారింతురు. భరతుఁడు నిర్దోషియైనను వానియెడ రాముఁడు దోషము శంకింపవచ్చును. కారణ మేమందువా? రామునకు భరతుఁడు సన్నిహితుఁడగుటయే కారణము. అట్లు దోషమును శంకించునేని నీ కొడుకును బ్రతుకనిచ్చునా?—దేవీ! నా యూహలు నిరాధారములు కానగును; నా మాటలు వదురుకూఁతలు గానచ్చును. అట్లే యగుఁగాక. మఱియొక మాట. నీ భర్తకు నీవు ప్రాణాధికవుగదా. దయితుని మచ్చికఁజేసి నీ సవతిని గౌసల్య నెంతో యవమానించితివి. రాముఁడు రాజయిననాఁడు నీకుఁ బ్రతిక్రియ తప్పునా? ఇది యైనఁ దలపోయవా?

కైక:- మంథరా! నీవేమైనఁ జెప్పుమువ్వుగాక; నా రాముని వలన మా కెట్టి యెగ్గుఁ గలుగదు.

చ॥ వినయము మాతృభక్తియు వివేకము శాంతియు సూనృతంబు నె
వ్వని వలనం బ్రకాశిలుఁ గువాదము లెవ్వఁడెఱుంగఁ డెన్నఁడున్
తనయపకారికైనను హితంబొనరించు నకాండ మెవ్వఁడా
తనయున కివ్విధంబునఁ బ్రతారణబుద్ధులు మూటగట్టుదే?

మం:- అమ్మా! నిజమాడిన నిష్ఠురము తప్పదు. రాజు రాముఁడు గానీ మఱియొకఁడు గానీ, కూలిదానికి నా కేల? ఎవఁడు రాజైనను నా కూలి నాకుఁ దప్పదు. ఏలుటకు నూళ్ళుండవు గాని యెత్తి కొని తినుటకు నూళ్ళుండవా? రాముఁ డెన్నఁడును నాకుఁ గీడు సోయలేదు. వాని మెలంత యోర్వనిదాననుగాను. నీ వెంట నితండ్రి నన్నుఁ బంపుచు, 'మంథరా, బిడ్డను నీ చేతిలో నుంచితిని. ఎట్లు కాపాడుదువో' యనెను. ఆ మాటకుఁ గట్టువడి నాఁటనుండి నీతోడిదే లోకముగానుందు.

మ॥ సరసాలాపములాడువేళఁ జెలియై సౌఖ్యోపదేశంబులఁ
బరగంబల్కెడువేళ నొజ్జయయి నీ భాగ్యంబు నీ మేలు నీ
నిరతైశ్వర్యశుభోన్నతుల్ తనవిగా నిత్యంబు భావించు మం
థర చేదయ్యెను నేఁడు నీకు నకటా! ధర్మంబులేదే యిలఁ

కైక:- మంథరా! ఈ నిష్ఠురములు వలదు. ఎన్నఁడేని నీ మాటఁ గాదంటినా? రామదూషణము నాకు దుస్సహము. వానింగూర్చి చిన్నమాట లాడకుము.

మం:- ఇది రామదూషణముగాదు. నీకు రానున్న ముప్పును దెలిపితిని. ఎంత విప్పి చెప్పినను గ్రహింపవు. భరతుఁడు నీకడుపునఁ బుట్టఁడా? వానిమేలు నీకు వలదా? అతని సంగతి యటుండ నిమ్ము. నీగతిని గూర్చి విచారింపుము. అదియు వలదా? అట్లయిన మిన్నకుందు. అయిన నొక్కమాట. దశరథునకు నీవుఁ గూర్మిపత్నివి గదా.

కైక:- మంథరా, ఈ సంగతి యడుగవలయునా?

చ॥ మురిపపుఁజిల్కగామనుచు, ముద్దులు తాఁగురియించు, జీవితే
శ్వరినిగ నెంచి ప్రోచుఁ, గనుసన్నలఁ గోర్కులతీర్చు, నా మతం
బరయక నేయడెద్దియుఁ దనంతటఁ, బెక్కు వచింపనేల? మా
యురములరెండు నేకమయియుండు నవస్థలనెల్ల, మంథరా.

మం:- ఈ మాట వినుట కెంతయు సంతసింతును. ఆడుదానికి నంతకన్న నభ్యుదయమున్నదా?

అమ్మా! రామపట్టాభిషేకము నీకుఁ దెలిసియున్నదని స్పష్ట పడెను. ఈ పాపిష్ఠురాలు వినరాదని దాచితివా? ఇంత కపట నాటక సూత్రధారిణినగుట నేటి వఱకు నేరనైతిని.

కైక:- మంథరా! ఆ సంగతి తెలిసి దాఁపలేదు. అట్లు చేసియున్న దారవాది నరక మనుభవింతును.

మం:- అమ్మా! మీ యంతరాత్మలు రెండు నొక్కటే యంటివి. ఇట్టిదా మీ యొద్దిక? నీకుఁ జెప్పక నీ యనుమతి పడయక యింతకార్యమునకు నీవల్లభుఁడు పూనెనా? నీ తోని వలపు ఇంత మాత్రమా? తరుణీ! దశరథుని హృదయము కౌసల్య యందు లీనమైయున్నది. వేఱు నిదర్శనమేల? నీ మాట యటుండనిమ్ము. భరతునియెడ వానికి నిక్కమైన పుత్త్రీవాత్స ల్యము గలుగదు. ఉన్నచోఁ గొడుకు తనయింటలేనప్పు డింత పని సంకల్పించునా? సంకల్పించెను బో; పుత్త్రుని రప్పింపఁడా? తల్లీ! తోనికి నీమీఁదను నీకొడుకు మీఁదను గల ప్రేమ వట్టి బూటకము. ఇది నా కెన్నఁడో తెలిసియున్నది. కొండెలాఁడినిగా నన్నుఁ దలంతువో యని యిన్నాళ్ళు మ్రింగి మిన్నకుంటిని. నీ పతినిగూర్చి పల్లెత్తుమాటయైన నీతోఁ బలికితినా? నీ పతిని గూర్చిన నీ బట్టపలుకులు సహ్యములుగాకున్నను జెవియొగ్గి విందును. ఏలయందువా? మీయిరువురకు నఱమఱలు గలుగునో

యని జడిసితిని. నీ పడిన ప్రమాదమును నేఁడు నీకుఁ దెలుపవలసి వచ్చెను. విధి యిట్లు నా నోసట వ్రాసినాఁడు. నీ కొడుకును దేశాంతరము పంపెను; నీతో మాటనూత్రము చెప్పఁడు; అకస్మాత్తుగా నిట్టిది సంకల్పించెను. కీలక మేమో యూహిం తువా? భరతుఁ డింటనున్న నేమోయని నీ భర్త శంకించెను. నీ వల్లభుఁడు జిత్తులమారిగాని వేఱుగాదు. నీ యెడ వానివలపు లెల్ల వట్టి యభినయములనియు నిట్టి కుహనాధర్మదేవతకు నిత్యముఁ గుసుమార్చన లొసంగుదువనియు నిఁక నైనను నిజము గ్రహింపుము. ముహూర్తకాలము సమీపించుచున్నది.

విషపరిణామము

మంథర యిట్లు విషగుటికను నానానుపానములలో మెదిపి ప్రయోగించెను. పుత్రవాత్సల్యానుపానము గిట్టదయ్యెను; ఆత్మ సౌఖ్యానుపానము వెగటించెను; సపత్నీన్యక్కారానుపానంబిం దకుండెను; కట్టకడకుఁ బతినిరాదరణరూపమైన యనుపాన మొక కొంత యనుకూలించెను. ఆ విషము కైకేయీగర్భాంతరమునఁ జేరి క్రమ క్రమముగా నా మెకు నిలువెల్ల వ్యాపించెను. ఆ దేవి జేపురించిన ముఖంబుతో నిట్టూర్పులు వెడల్చుచుఁ గరకమలకీలితకపోలభాగయై వితర్కింపసాగెను. భూనపరంపరలు తెర తెరలుగా నా మెయెదుటఁ బొడకట్టి విచ్చి మాయముగాఁ జొచ్చెను. 'ఏమీ! నా పతి నన్ను నిరాదరించెనా? వివాహము మొదలు నేటిదనుక యట్టిలక్ష్మణ మొక్కటియుఁ గాన్పింపదు. మూర్తిగొన్న నిజప్రేమానురాగముల సర్వస్వముగా నన్ను నా వల్లభుఁడు మన్నించును; నా యీప్సితంబుల నింగితంబులవలననే గ్రహించి యయాచితంబుగాఁ గురియించును; నా తోడిదే లోకముగా వర్తించును. అట్టి నా దయితుఁడు నన్ను నిరాదరించెనను మాట నమ్ముఁబెట్లు? నమ్మకున్న దీనికేమనవలయును? నన్నుఁగాదని గోరంతపనికూడఁ జేయఁడు. అట్టి ప్రియుఁడు నేఁడిట్లు వర్తింపనేల? రామాభిషేకము నాకు నెంతో సంతోషకరముగదా. మాటమాత్రమన్నచోఁ గార్యభారమెల్ల నేనే వహింపనా! ఏదో గుట్టుగలదు.

'అయ్యో! నిష్కారణముగా నా హృదయేశ్వరుని శంకించి మహాపాతకము నొడిగట్టుచున్నాను. నాథా! రాజ్యచింతతోన దివా రాత్రంబులు నీకుఁ గడచుచుండును. మైమఱచి యొక్కనాఁడును

నిద్రించి యెఱుంగవు; 'కూలినాలిచేసి కుడుచు పేదసుఖంబుఁ దక్క దిలను మకుటధారికెందు' అనుమాట నీ యెడ నక్షరాక్షరముల సార్థమగుట నేనుఁ గన్నార్చఁ జూచుచునే యున్నాను. ఇట్లు నిరంతర రాజ్యచింతల మునుఁగుటఁ జేసి యీ సంగతి నాకుఁ జెప్ప మఱచి యుందువు. ఇంత మాత్రానకే పరభావదోషము నీపయి నారోపింపఁ దగునా ?

ఉ॥ ఇంతల నింతగాఁదలఁచి యీసువహించి దురంతర వ్యథా
క్రాంతమనస్కులై చివికి క్రాగుట కొంతలకెంచ సైజ, మీ
వింతగుణంబుగల్గు టలివేణుల దోసముగాదు, వారి యై
కాంతికభర్తృరాగరసకాంక్షలదోషము నిక్క మెంచఁగాఁ.

'అకటా ! ఎంత వెఱ్ఱి ! భరతునిఁ బంపుట, నాకుఁ జెప్పకుండుట; కార్యము రేపగుట, యివియెల్ల తనిభానమర్మమును దేఁటతెల్లము గావించుచుండగా మీనమేషము లెంచుచు స్పష్టార్థమునకు వాఖ్యానముఁ గోరుచున్న నా యట్టి మూఢురాలుండునా? రాచపనులతోందఱు యొక సమాధానముగాఁ గుమర్చుకొంటిని. మాటమాత్రము తెలుపుటకు వ్యవధిలేకున్నదా ? నా పతి నా కన్నులుమూసి యీ పనికిఁ గడగుట నిక్కము. సఖీ ! మంథరా ? మోహప్రభావము నేఁడు విశదమయ్యెను.

ఆ॥ వె॥ కన్ను మోసగించుఁ గప్పును బిత్తంబు
హితము లెల్లఁజెవికి నేవగించు
మోహజాలికుంగు మోలనిచ్చినయంత;
వానిమాయ నేఁడు గాననయ్యె.

'ఏమి నా యవివేకము ! ముక్కునకు సూటిగాఁ జూతుఁగాని పూర్వోత్తరములు విమర్శింపనైతి. ముహూర్తము తోపుగదా? ఇది రాత్రి నిశ్చయించి యుంసుము. ఇప్పుడో యిఁక గొంతసేపటికో నా పతి యిందునచ్చి నాకు సంగతిఁ దెలుపును. అంతమాత్రపుఁ దాల్మి లేక యూహా ప్రపంచంబునఁ బరిభ్రమించుచున్నాను. ఈ కార్యము నెన్నఁడో నిశ్చయించి రందురా? అట్లయిన నగరమందు వెల్లడి గాకుండునా? నా సనిక తెలు విని నాకుఁ జెప్పకుందురా? ఎట్లు వితర్కించినను నా పతి నన్ను నిరాదరించెనను సిద్ధాంతంబునకు నవకాశము గాన్పింపదు.

'అట్లేయగుఁగాక. భరతునకు సంగతి తెలిపెనా? నిన్నుగాదని యది చేయుఁబెట్లు?—హా! సంగతి స్పష్టమైనది. ఊహాపిశాచమా! ఇఁక నీ మాయదారితనమును జాలింపుము. ఈ కైకేయిని మోసగింపఁ జాలను. నా సుతుఁడు తప్పక వచ్చును; నా భర్త వానిని రప్పించును.

లగ్న మెప్పుడు? తెల్లవాఁటినఁగదా? ఇంతలో నా కూన వచ్చుఁ బొట్లు? నాల్లు రోజులు ప్రయాణము సాగినఁ గాని యటకుఁ బోఁజాలదు. ఇప్పటి దనుక నెవరినిఁ బంపరైరి. ఇఁకఁ బోవుట, వాఁడు వచ్చుట కల్ల. ఏదో మర్మముగలదు. నుంధర యూహలు కేవల నిరాధారములు గావు; పాపము! దాని నన్యథా భావించితిని! ఆ! ఇప్పటికి బోధపడినది. నా పతి పరమసాధువు. అమాయకుఁడు. ఈ మహా వ్యూహమును నా సవతి పన్నెను. తన కొడుకునకు రాజ్యమును గట్టు నెపంబున నన్నా బోటి యేలఁడలచి యీ యెత్తువై చెను. నా పతి దాని జాలములోఁ జిక్కెను. నా తండ్రి కేకయరాజగుట, నేను పుట్టినది శుద్ధ క్షత్రవంశ మగుట, పెఁగినది రాజస్థానమగుట మఱచెనా? ఇంత మాత్రానకే బేలనగుదునా? కౌసల్యా! నీవు విషబీజమును నాటితివేగాని యది మొలచుట కల్ల. అది యంకురించెనేని నాదియు నొకబ్రదుకా? ఇదిగో నా నేర్పు చూఁడుము.' అని యామె పెద్దయుండడవు వితర్కించి కృత నిశ్చయయై, 'మంథరా! నీ మాట నిజము. ఇదంతయు నా సవతి జాలము, ప్రతిక్రియ యూహింపు' మనెను.

కైకేయి యట్లు పలికినంతనే మంథర లోలోన సంతసించి 'అమ్మా! ఊఁడిగపుఁగొ మ్మొ యెక్కఁడ? యీ సంవిధాన మెక్కఁడ? పని పాటలు చేయుటో చీరనార లందిచ్చుటో నేపథ్యములు రచించుటో నాబోంట్ల కగుఁ గాని యిట్టి పనులకుఁ జాలుదుమా? రాచకులమునఁ బుట్టలేదు; పెద్ద చదువులూ చదువలేదు; లోకపరిజ్ఞానమునకు మాకుఁ గడుదూరము; తలంపులు ముడివెట్టుట విచ్చుట యెన్నఁడు నేరను. ఇట్టిదా నీకుపదేశించుట! ఇంత యుల్లసమా! నేనుండుట నీకు వెక్కసమైనచో దారిఁబట్టుదు. నీయుపదేశికుఁడు దశరథుఁ డుండఁడా? ఆ నీ ప్రియుని నీమనోహరుని నీసర్వస్వము నడుగరాదా? ఆ తంత్రజ్ఞుఁడు నీ చేతిలోనుండఁగాఁ బరుల నడుగనేల? దశరథ ప్రేయసీ! ఎగతాళి యిఁకఁజాలు. ఏలువారికి రాజ్యాలు గలుగవుగాని బిచ్చగాండ్రకు దేశాలు పెక్కుగలవు. నలువ నాఁడు మా నొసట వ్రాసిన వ్రాత నేఁడు దప్పదు. కూటికెంత పేదలమైనను గులమునకుఁ బేదలము గాము. పుంటిపై ముల్లు గ్రుచ్చవలదు' అని నిష్ఠురములాడెను.

కైక:- మంథరా! పరిహాసముగాదు; నిజము పలుకు చున్నాను; మది కుదుటఁబడదు; శూన్యహృదయనై పరితపింతును; వెఱవు వచించి రక్షింపుము.

చ॥ ఉరుతరదావకీలలకు నోర్చిన నోర్వగవచ్చుఁగాక, దు
స్తరమగు కాలకూటమును ద్రావినఁ ద్రావఁగవచ్చుఁగాక, యీ
శ్వరనయవాగ్నిమంటలకు సైచిన సైపఁగవచ్చుఁగాక, నా
వరుఁడు సపత్నిలోలుఁడను వార్త సహింపఁగ శక్యమే? చెలీ!

'అ॥ వె॥ పొమ్మ్మి లీయవచ్చు పొమ్మంత యీవచ్చు,
విష్యరానిప్రాణ మీయవచ్చు,
తనదువిభుని వేఱుతరుణిచేతికి నిచ్చి,
తాళవశమె యెట్టిదానికైన?'

చ॥ మరుఁడను సైంద్రజాలికుఁడు మోహనమంగునఁజేరి మోహపుం
దెర దిగవైచి యుగ్మతగతిక్ రచియించిన విభ్రమంబులక్
స్థిరమనినమ్మి వెట్టినయితిన్ సవతుల్ నగుటయ్యె నామనో
హరుఁడు సపత్నిహస్తగతుఁడయ్యెను నేబ్రతుకంగ నేలాకో.

మం:- దేవీ! ఇంత దారుణమేల? భాగ్యవతులలో భాగ్యవతివని మే మెల్లరము నిన్ను భావించి కొలుచుచుండఁగా నీవిట్లు దుఃఖం చుట బేలతనముగదా. ఎట్లు భాగ్యవతి నందువా?

చ. కుడిచి మిగిల్చినట్టి చలికూడును గట్టిన ప్రాతకోకలున్
చిడిముడిగూనతుల్ వెగటుఁజీదఅలున్ బరతంత్రజీవమున్
విడువనియూడిగంబుఁ బదివేలుగ నీకొనఁగూడనుండు నే
పడఁతిరో! నీకుసాటియగు భాగ్యవతీమణి లుంగుశేభుఁడిన్?

కైక:- మంథరా! అగ్గిమీఁద నాజ్యము పోయనలదు. ఈ దీనురాలిని గరుణింపుము.

మ॥ పరదైవంబుగఁ గొల్చు నాదయితుఁ డాభామామనోవల్లభుఁ
పరదైవంబుగ నయ్యెనాకు నకటా! ప్రాణంబుసంరంభియై
యురలంజొచ్చెను, నీదుకైక యిలపైనుండంగఁ గాంక్షింతువే,
బరమోపాయముచెప్పి కాచికొనుమా ప్రాణభిక్ష మేపారగన్.

మం:- కైకా! ఎంత సంగనాచివి! కావున నేగదా విభునిమాటదప్ప మా మాట పాటింపవు.

కైక:- మంథరా! మంథరా! నీపలుకు గాదనియందునా? నీయాన నీవు చెప్పినట్లు నడతును. తరణోపాయము ననుగ్రహించి యీ వ్యథాశల్యంబును బెకలించి వేయుము. స్త్రీరక్షణపుణ్యము నీకగును. కాదందువా? నన్ను మఱచిపొమ్ము.

మం:- సాహసమేల? నీవు నేరనియుపాయమును నేనుమాత్రము నేర్తునా? నా జ్ఞాపకశక్తిని బరీక్షింప నిట్లాడుదువా?

కైక:- మంథరా! నీభావము తేటపడదు. గుట్టువిచ్చి చెప్పి రక్షింపుము.

మం:- అమ్మా! ఈ సంగతి యటుండనిమ్ము. నీ దయితుని పరాక్రమమునుగూర్చి వేయిసార్లు చెప్పితివి. మందమతిని గావున మరచితిని. దేవాసురయుద్ధమునాఁడు నీపతి చూపిన విక్రమవిశేషంబుల మఱల వినఁ గుతూహలమగుచున్నది. అది సుంత వివరింతువా?

కైక:- మంథరా! ఆ పురాణమిప్పుడేల? అవి తలచినంతనే నిలువెల్ల నుడుకుచున్నది. ఈ గండము తొలఁగుదారి చూపుము. ఆ కతలు నెమ్మదిగా వినవచ్చును.

మం:- చెలీ! మనస్సు కుదిరినఁగాని సరియైన తలంపులు స్ఫురింపవు. నా చిత్త మిప్పు డాకత వినఁగోరుచున్నది. దాని యుదిరిపాటు దీర్చినఁగాని యది వశముగాదు. విషయాంతరగతమైన హృదయమును మఱలించుటకు వేఱుపాయము గలుగదు. నీ కార్యము నకుఁ జిత్తమెంతో సంవిత్తము గావలయును సుమా.

కైక:- మంథరా! నీ గితికలు మానవు; పట్టు వదలవు. ఏమిసేయుదు! సంగ్రహముగాఁ జెప్పుదు వినుము. శంబరాసురుఁడను మహాబలశాలి యుండెను. వాని దాడికి దేవేంద్రుఁడు వెఱచి నా పతిని సహాయ్యముఁ గోరెను. నా దయితుఁడు చతురంగబలముఁ గూర్చుకొని దండకారణ్యాంతరమునన్న వైజయంతమను పేరి శంబరరాజధాని పయి నడిచెను. శంబరుఁడు శతమాయావి; వాఁడు నా పతి నెదుర్కొనెను. నేను నా భర్తకు సారథ్యమొనర్చుచుంటిని. ఇరువీరులకు ఘోరయుద్ధమొనరెను. రాత్రియైనంత నిరువాగులు రణముచాలించెను. మా సైన్యము స్రుక్కి మైమఱచి నిద్రించెను. అత్తఱి శంబరానుచరులు హఠాత్తుగా మా బలముపై బడిరి. నా వల్లభుఁడు నిజసైన్యరక్షణార్థము వారిని ఢీకొని శస్త్రశకలీకృతాంగుఁడై మూర్ఛిల్లెను. తేనిదుర వస్థనుజూచి వానిని రణభూమినుండి యావలకుఁ గొనిపోయి వివిధశైత్యోపచారములఁ దేర్చుచుంటిని. అంతలో నటకు వైరులు వచ్చి మరల నా నాథుని బ్రహరింపసాగిరి. నా నేర్పు మెఱయించి యందుండి నా జీవితేశ్వరుని దొలఁగించి గాపాడుకొంటిని.

నా సాహసోపకృతులకు నా తోడు నన్ను మెచ్చి ప్రసన్నుఁడై రెండు వరములు గోరుమని నాతోఁ జెప్పెను. వలసినప్పుడు కోరుదు నంటిని. అందులకు నా భర్త సంతసించెను. అంత

మం:- చాలుఁజాలు; కథావిశేషము స్ఫురించినది. ఇఁక నీసంగతి చూచుకొనుము.

కై క:- మంథరా! నన్ను దిగనాడుదువా? ఈ కటికతన మేల?

మం:- కై కేయీ! ఇంత వెఱ్ఱియుండునా? బ్రహ్మోన్మ్రములు చేతిలో నుండఁగా యెదురుకోలను వెదకుదువేల?

కై క:- ఎట్లున్నట్లు?

మం:- ఎట్లా? అంతమాత్రము తెలియదా? ఆ వర మిప్పుడు కోరరాదా?

కై క:- వరముల వలన నా దురవస్థ తీఱు నెట్లు?

మం:- కై కా! నోటఁబెట్టిన ముద్దను గూడ మ్రింగఁజాలవు. నాయంతటి కార్యసాధకురాలు గలదాయని బడాయి కొట్టుదువు. ఆ తెలివి నేఁడేమాయెను? సాగినప్పుడు ప్రగల్భములు గురిపింప వచ్చును. సమయము వచ్చినప్పుడుగదా తెలివిదేఁటలు తెల్లమగుట. కాల హరణమేల, వినుము. దశరథుఁడు కౌసల్యామాయకు లోఁబడుట, ఆ కారణంబున రామునకుఁ బట్టముగట్టుట—ఈ రెండుఁగదా నీ దుఃఖకారణములు. రాముఁడు పెద్దవాఁడు; వానికిఁ బట్టము కట్టుట లోకసహజము. మొట్టమొదట దీనికిఁ బ్రతిబంధక మూహింపవలయును. దీనివెంట రెండవది తనంతట తానే యగును. మహారాజు తా నిఁక రాజ్యభారము వహింపఁ జాల ననియు రామునకుఁ బట్టముఁ గట్టుదుమనియు సభలో వచించె నఁట. రామ పట్టాభిషేకమునకు విఘ్నము కావలయునన్న, దశరథుఁడు మరల తాను రాజ్యభారము వహించుటో లేక భరతునకుఁ బట్టము కట్టుటో రెంట నొకటి జరుగవలయును. రాజ్యభారమును తోడు మరల వహింపనొల్లఁడు. అందులకై యత్నించియు ఫలము లేదు. కావున భరతపట్టాభిషేకమునకై యత్నింపక తప్పదు. ఇది యుక్తియుక్తమేగదా. అంతతో మనపని తీరదు. రామునకుఁ జతుర్దశ వర్ష వనవాసమును గోర వలయును. వీలయందువా? రాముఁడు మహారాజనీతివేత్త;

ప్రజలన్ననో వానికి వశవర్తులై యున్నారు. ప్రజానురాగము గలుగనినాఁడు రాజ్యపరిపాలనము సుకరముగాదు, రామఁడిందున్నంతకాలము జనుల హృదయము వానియందే తగిలి యుండును. ఇది భరతునకుఁ జెప్పరానిముప్పుఁ దెచ్చును. ప్రక్క-లోని యీఁకొను దొలఁగింపవలయును. కన్ను చాటయినచో మనస్సుగూడఁ జాటగునంచురు గదా. రాముడు దేశాంతరగతుఁ డైనప్పుడు వానియందలి ప్రజాభక్తి తొలి రెండు మూఁడునాళ్ళు మిక్కుటముగా నుత్కటించి నానా రూపములు దాల్చినను క్రమక్రమముగా సన్నగిలి తుదకు భరతు నాశ్రయించును. జనులు సద్యఃఫలాసక్తులై వర్తింతురు గావున దాన మానములచేత వారిని వశపఱచుకొననగును. కావున రాముని విపాసము ప్రధానము. పదునాల్గు వత్సరముల విపాసమేల యందువా? భరతుఁడు జనుల హృదయమును సమగ్రముగా నధిష్ఠించుటకుఁ దడవు వలయును. అది యెంతదీర్ఘమైన నంత మేలగును. కైకేయీ; ఈ రెండు వరములను గోరుము; నీ యీప్సితము సిద్ధించును. వానిని సాధించు పెట్టందువా?

'మ॥ కరచంచన్మణికంకణరణత్కాంచీగుణస్వర్ణనూ
పురనాదాహృత రాజహంసరమణుల్ పూర్ణేందుబింబాననల్
ధర నెవ్వానిమనంబు సేకొనరు ముగ్ధత్రస్తవల్గన్మృగీ
తరళాలోకన తుల్య విభ్రమ దృగంతస్తోమ పాతంబులన్.'

అని స్వభావజ్ఞులు సిద్ధాంతరీకరించి యున్నారుగదా. అందు దశరథుఁడు నీవన్నఁ బ్రాణములు విడుచుచుండును. రాజపుత్రీ, నీవు త్రిశుద్ధికిఁ బంతగింతువేని క్షణములో నీకోరిక లీడేరును. ప్రకృత మేమి సేయవలయు నందువా? మలినవస్త్రమును ధరించి యలుకయిల్లు చొచ్చి కటికనేలఁ బరుండుము. నీకుఁగా రాజువచ్చును. వానిని గన్నెత్తియైనఁ జూడకుము; నిన్నుఁ బలుకరించును; బదులాడకుము; చేరవచ్చి బుజ్జగించును; పొరలి పొరలి విలపింపుము. ప్రణయము లాడును; భావముఁ దెల్పవేడును; మణిమయాభరణంబు లిచ్చును; బాసలుచేయును; తుదకుఁ గాళ్ళ్రావాలును. ఏమి చేసినను సందియ్యవలదు. ఇట్లొనర్తువేని యతఁడు నీ పరితోషార్థము నిజప్రాణములనైన నుంకువ పెట్టును. అట్టిస్థితికి వానినిదెచ్చి, అడిగినదిచ్చునట్లు ముమ్మాటికి బాస చేయించి, మాట తప్పఁడను నమ్మికగల్గిన తర్వాత, దేవాసుర

రము వివిధలతాగృహములతోను బన్నిటిదుంపురలఁ జిల్కరించు యంత్రములతోను నిండియుండెను. నాల్గవకక్ష్యాంతరము దంతపుదాస లును స్ఫటికసోపానములును దాపిన క్రీడాసరోవరములు గలిగి చూడఁ జూడ వినోదముఁ గూర్చుచుండెను. ఆ కొలఁకుల జలము స్ఫటికనిర్మలమై యున్నందున నందు సోపానంబులు ప్రతిబింబించుచు వింతఁ గూర్చు చుండెను. మఱియు నందలి కలువలును దామరలును బూచి యపూర్వ శోభావిశేషంబును గలిగించుచుండెను. ఆ జలజంబుల మకరందంబును గ్రోలు మధుపంబుల ఝుంకారంబు లెంతయు దుస్సహముగా నుండెను. ఆ కొలఁకులచుట్టుఁ దీర్చిన లేఁబచ్చికవాడలు కాసారేందిరారమణికిఁ గైసేసిన పచ్చపట్టుపై తాణులో యసనొప్పెను. ఐనవ కక్ష్యాంతరమున వివిధశిలానిర్మిత స్త్రీవిగ్రహంబులు సజీవములవలె నిలిచి స్ఫాటిక కలశం బులఁ గొన్ని రతనంపుగిండులఁగొన్ని బంగరపుపల్లెరంబులఁగొన్ని హస్తతలంబుల ధరించి యందువచ్చువారికిఁ బన్నీటిజలకంబులార్చి పుష్పోపహారంబులిచ్చి మర్యాదలు గావించుటకై యారామలక్ష్మి నియమించిన దాసీజనమోయనఁ దోఁచుచుండెను. ఆఱవకక్ష్యాంతరము సంగీతశాల యనుటకన్న వేఱుదోఁపదు. అందు నానారత్నరచిత స్త్రీప్రతిమలు వివిధగానయంత్రంబులఁ గైకొని, వియచ్చరాంగనలు మధురాలాపనగతులచేత వినువారినిఁ బరమానందపారవశ్యులఁ జేయుచుఁ దమ గానమై పుణిని బ్రదర్శరింపఁ గొలువుతీఱినో యను భ్రాంతిని గలిగించు చుండెను. ఏడవ కక్ష్యాంతరమునఁ గైకేయీవాసమందిరము గలదు. అది మదనసామ్రాజ్య సట్టాభిషేకమోయన శోభిల్లుచుండెను. ఆ మంది రాంతరము నందుఁ గోపగృహమును నిర్మించిరి. అటఁ గైకేయి యట్లు పరుండియుండెను.

కైకేయి కపటవ్యూహము

కైకేయి యంత మలినపరిధానయై కోపాగారము చొచ్చి పుణ్య తీర్థంబున దివినుండిరాలిన కిన్నరిలోలె నందుఁబడి యుండెను. సమస్త భూషణంబులు డుల్చి దుఃఖావృతనదనయైయున్న యా రాజపత్నినిజూడ మగ్నతారకయు గాఢతమోవృతయునైన దివి తలంపునకు వచ్చుచుం డెను. ఆ కాంతామణి యట్లు పరుండి మంథరాకుత్సితబోధనల స్మరిం చుచు విషధర కిన్నరింబోలె నాగకన్యరీతి వెచ్చనూర్వసాగెను. ఆమె రత్నాభరణంబులు విశీర్ణంబులై నేలరాలి నక్షత్రంబులు గగనంబును బోలె నమ్మందిరంబును వెలిగించుచుండెను.

కైకేయీదశరథుల సమాగమము

దశరథుఁడు నాఁటిరేయి వచ్చి, చంద్రుఁడు పాండురాభ్రమైన యాకాశంబునుబోలెఁ గైకేయీమందిరముఁ జొచ్చి, హుటాహుటిఁ గేళిగృహమునకుఁ బోయి, యందు దయితారత్నమును గానక యవ్విపరీతమునకు విషాదాశ్చర్యమగ్నుఁడై కొంతవడి తహతహపడి నెమ్మది వహించి తేఱి దేవి యెందున్నదోయని యంతఃపుర ద్వారపాలికను విచారించెను. అద్దాసి గడగడవడఁకుచు, 'దేవి కోపగృహమునఁ బడియున్న' దని న్యసనకలుషస్వరంబునఁ బలికెను. ఆ మాటతోడ నోడు విలుపితవ్యాకులేంద్రియుండై యత్యంత విషాదము నొంది పిశాచగ్రస్తుఁడుఁబోలె నెగచి యలుకటిల్లు డాసి యటఁ ద్రుంచిపాఱవైచిన పూఁదీవెవలె, నింటనుండి పడఁద్రోసిన కిన్నరి చందంబున, గగనాంతరమునుండి జాఱిపడిన యప్సరోరత్నముక్రియఁ బరిభ్రష్టయైన మాయఁబోలె, గట్టివైచిన లేడిచాడ్పున, ధరాతలంబునఁ బడియున్న ప్రియురాలిని శిరీషకోమలాంగికను గాంచి నిర్విణ్ణుఁడై తెప్పఱిలి యా యింతిని సమీపించి, కాననాంతరమున వ్యాధవిషబాణవిద్ధయై పడియున్న కరేణువును గజరాజుఁబోలె సకాంతామణిని దన కరాగ్రంబులఁ దడవి, 'ప్రేయసీ! సంగతియేమి? నీ యాజ్ఞసేయరా? ఎవరాడిరా? అప్రియంబులు పల్కిరా? తలఁచినకార్యము సమకూరదా? ఏదేని యచింత్యము దోఁచెనా? దూతిరా? సేనలందు జాగయ్యెనా? ఏల యిట్లలిగితివి? నా సర్వకళ్యాణస్వరూపవు. నా భాగ్యదేవతవు. నీవిట్లు ధూళిఁ బ్రుంగుటకు నా గుండియ లవియుచున్నవి. జీవితేశ్వరీ! సంగతి సుంత వినిపింపుము. మోహనాంగీ! అదండ్యులనైనను దండింతును; దండ్యులనైన నాదరింతును. నీ మనంబు పెల్లుము. శాతోదరీ! కుసుమకోమలియైన నీతనూలతను గటికఁ జాతినేలఁ ద్రోయనగునా? దశరథుఁడు నీవాఁడైయుండఁగా నీకుఁ గొఱతయుండునే?

'సుందరీ! ఎంత బతిమాలినను బలుకవేల? దానమానంబులఁ జక్కఁగాఁ గూర్పనా? ప్రాణంబులు వలచినను వెనుదీయనుగదా. మోడివీడి మరందమాధురీస్యందియైన మృదూక్తి నొండు పలికి నీవల్లభునకుఁ బ్రశాంతి గూర్పుము. మంగళస్వరూపిణీ! యిచ్చకముగాదు; నా సుకృతము తోడుగా భాసచేయుచున్నాను. నీకొఱకు చేయరాని దేదియుఁ గలుగదు. వ్యాధి పైకొన్నచో వైద్యులను రప్పింతును;

పిశాచ మావేశించెనేని మాంత్రికులను బిలిపింతును. జీవితేశ్వరీ! అంజలి యొనర్తు; నా యెదఁ జిచ్చుఁజొనుప వలదు' అని వివిధగతులఁ బ్రార్థించెను.

దశరథుఁడు కైకేయికి బాస సేయుట

కైకేయి సుంత కన్నువిచ్చి, 'అయ్యో! ఈ పాపిష్ఠురాలికి రోగమా? ఎవరో యేమి చేయుదురు? నా తలవ్రాఁతకు వగతు. ఎవరితోఁ మొఱ పెట్టుదు? ఆదరించువారెవరు? మృత్యువునకుఁ గూడ వెగటించితి'నని హీనస్వరమున నేడువసాగెను. దశరథుఁ డా యింతి చేతులు పట్టుకొని, 'లోకైక మోహినీ! నీ పల్కు నాకుఁ బ్రాణదాన మిచ్చెను. ప్రేయసీ! సంగతియేమి? కామినీ ప్రపంచంబున నీ కన్నఁ బ్రియయుఁ బురుషలోకంబున రామునికన్నఁ బ్రియుఁడును నాకుఁ గలుగరు. నీ యాన రాముని యాన నీయిష్టము తప్పకొనర్తును, ప్రాణేశ్వరీ!

చ॥ మకరముఖాంతరస్థమగు మానికమైనను దెత్తు సర్వ రా
ణ్మకుటచిరత్నరత్నమయినన్ గొనివత్తు సురేంద్రునోర్చి క
ల్పకమును దెమ్మటన్నను సపాదముగాఁ బెకళించి తెత్తుఁ గో
రిక మటియేదియైన నొనరింతును నెంజలిమాని చెప్పుమా.

అని శపథపూర్వకంబుగా వచించెను.

దశరథుఁ డట్లు పలికినంతనే, 'రాజా! నీ పుత్త్రుని సాక్షిగాఁ బాసచేసితివి. ఇది చేయుటకా? అగ్నిహోత్రుఁడును ముప్పది మూఁడు కోట్ల దేవతలును నీమాట లాలకించు చున్నారు.—నిశాకర దివాకరులారా! రాజ శపథమును విందురా? గ్రహములారా! తేని ప్రతిజ్ఞ నాలింతురా? ఆకాశమా! జనపాలకుని బాసకు నీవే సాక్షి; దివారాత్రములారా! భూపతి వచసంబు లాకర్ణింపుము. పంచమహాభూతములారా! సర్వముఁ బరికింతురుగదా' యని కైకేయి చరాచరంబులను సాక్షిగొరెను. దశరథుఁడు వింతదోఁచి, 'ప్రాణేశ్వరీ! ఈ శంక యేల? మిత్రులు శత్రులగుదురుగాక, ప్రజాకోటి దూఱుఁగాక, గురువు లాఁకట్టెదురుగాక, పుత్త్రులు పాయుదురుగాక, మంత్రులు మోహరింతురు గాక, రాజ్యలక్ష్మి త్యజించుఁగాక; మఱి యేమైన నగుఁగాక, నా మాట తిరుగదు. నీ సంకల్పమేమో తెలుపు' మని నొక్కి వచించెను.

కైకేయి యీ వచనంబులు విని, 'రాజేంద్రా! మిమ్ము శంకించుట గాదు. మీ సత్యసంధతయు మీ ధర్మదీక్షాపరతయు నాకుఁ దెలియవా? 'ప్రమాదోధీమతామపి' అని యుందురు. అట్టి కళంకము మీకు రాకుండుఁగాక యని సమస్త దేవతలను ప్రార్థింతును. మీ కిట్టి యనర్థము కలుగునేని నీ కైక సహింపఁ జాలదు' అని ప్రేమరసంబును గ్రుమ్మరించెను.

దశ:- విలాసినీ! నీ హృదయము శిరీషకోమల మగుట నే నెఱుంగనా? సంగతియేమో తెలుపుము.

కైక:- నా యడుగనున్నది మీకు మిక్కిలి యల్పము. అది విని మీరు నవ్వినను నవ్వవచ్చును.

దశ:- బేలా! ఈ యలఁతికై యింత యూగడమేల?

కైక:- కోవిదులకు నెట్టిదియు నల్పముగానే యుండును. ముగ్ధల సంగతి యట్లు గాదుగదా? నాథా! ధర్మ సందేహ మొకటి నన్నుఁ గలఁచు చున్నది. పండితులులేరా యనిన వారికి శాస్త్రజ్ఞానమే గాని యనుభవ జ్ఞానము జాలదు. మీకు రెండునుగలవు. అందువలన నాముడి మీ వలన వీఁడునని యుంటిని. ఏలకో రాత్రి యిటరా మఱుచితిరి. ఆఁడువారికి నోర్పు లేదనుట మీకుస్పష్టము. మీవిలంబము నన్నింతకుఁ దెచ్చెను. నాయవినీతిని మన్నింపనగు.

దశ:- ప్రేయసీ! నా వలన నీ కిట్టి క్లేశము గలిగినందుల కెంతయుఁ జింతింతు. రాజు పరతంత్రుఁడు గాని స్వతంత్రుఁడు గాఁడు. నా యపరాధమును సైరింపుము. కాంతామణీ? నీ యెఱుంగని ధర్మసూక్ష్ములుగలవా? నీ సలహా వలననేగదా నా రాచ కార్యములు సుకరములగుట. వినోదార్థ మడుగుదువు కాబోలు. సంగతి తెలుపుము, చూతము.

కైక:- నాథా! నా చెలి కొండొకనాఁడు నాకొక ప్రియ మొనర్చెను. అందులకు నేను మెచ్చి 'ఇచ్చనచ్చినది కోరుము, ఇత్తు'నంటిని. 'నలసినప్పుడు కోరుదు' నని యది చెప్పెను. ఇది జరిగి యేండ్లు పూండ్లు గడచెను. ఆ సంగతినే మఱుచితిని. ఆ యింతి నేఁడువచ్చి గుప్తార్థము నిమ్మనుచున్నది. వరములు కోరుమంటిని; వలసినప్పుడు కోరెద ననెను. అంతమాత్రమేగాని, యివియని యూహె

యడుగలేదు; వానిని ఇచ్చెదనని నేను చెప్పలేదు. అంతటితో నవి గుప్తార్థములగునా? కాదన్న బొంకగునా?

దశ:- దేవీ! ఇది స్పష్టార్థము. దీనికై శ్లోలాయమానమేల? సంకల్పము ప్రధానము. ఇచ్చు సంకల్ప మెప్పుడు నీ యెద సంకురించెనో యది దత్తమేయగును. అందులకు మాఱులేదు. ఇది యని కోరలేదందువా? కోరినది యిత్తునంటివి. ఏదికోరినను గోరుఁగాక, కోరినదాని నియ్యక తప్పదు; నాఁడు కోరకున్న నేఁడు కోరుచున్నది. సత్యమునకుఁ గాలహరణదోషము గలుగదు. నోటఁజెప్పి దప్పినప్పు డసత్యమగునేగాని చెప్పనినాఁడట్టి దోషము రాదని కొందఱు పల్కుదురు. అది మిథ్యావాదము. సంకల్పమే ప్రధానముగాని చెప్పుటగాదు. ప్రేయసీ! కుహనాతర్కములకు నెడమీయవలదు; ధర్మదూషితవు గాకుము. నీ చెలి యేమి కోరెనో చెప్పుము. నీకుగా నేను దానికోర్కి తీర్తును.

కైక:- నాథా! నీకుబదులాడ నేరను, తఱిచినఁగాని వెన్నపుట్టదుగదా; నా యవివేకతిని మన్నింపుము. నా చెలి తనకోరికలు తెలిపియుండి, యిత్తునని నేనుచెప్పియుండి, యిప్పుడు కాదన్నచో నసత్యదోష మాపాదించును. మాటసామెతకు నాఁడు వచించితిని. అప్పుడు మూగవలె మిన్నకుండి యిప్పుడు హఠాత్తుగా దుర్ఘటమును గోరినప్పుడు కాదన్నఁ గల్లయగునా? నేఁడు సాధ్యమగునని రేపు, కాకుండనగును. కాలము దురత్యయము. అసత్యమాడి తప్పించుకొనునట్టి యూహయే లేదు. కాలవ్యతిక్రమముం జేసి పరిస్థితులు మాఱి సంకల్పము నెరవేఱుమార్గ ముండనప్పు డేమి సేయనగు?

దశ:- కళ్యాణీ! కోరినదాని నిత్తునంటివి, ఆ మాట చాలు. సత్యము త్రికాలాబాధితమని మున్నే చెప్పితిని. పరిస్థితులు మాఱినప్పుడో యని యందువా? అప్పుడుగూడ లేదనరాదు. యథాశక్తి ప్రయత్నించి నీయంతరాత్మను దృప్తిచేయుము; అసత్యదోషము బొరయదు. మఱియు సాధ్యాసాధ్యములు పరిశీలించి మాట యిచ్చుట మేలు. అట్లు గావింపకుండుట యెవరిదోషము? ప్రచ్ఛన్నవిధమున వరములుకోరినప్పుడో యని యందువా? బలి చరిత్ర వినవా? శుక్రాచార్యులు వలదన్నను బలి వినెనా?

"మ॥ నిరయంబైన నిబద్ధమైన ధరణీనిర్మూలనం బైన దు
ర్మరణంబైనఁ గులాంతమైన నిజముఁ గానిమ్ము కానిమ్ము పో
హరుఁడైనఁ హరియైన నీగజభవుండభ్యాగతుండైన నాఁ
దిరుగఁ నేరదు నాదు జిహ్వ వినుమా ధీవర్య వేయేటికిఁ."

అని బలిచక్రవర్తి స్పష్టముగాఁ బలుకలేదా? సజ్జనులు యుక్తి వాదము నాశ్రయింపరు. దేవీ, మన కార్యఫలములొండొరులకుఁ జెందకమానవు. సతీపతులసంబంధము వాగర్థముల వలె నుండునుసుమా. మనోహారిణీ! ఇంత విచారమేల? సంగతి జెప్పుము.

కైక:- నాథా! ధర్మత్వము సూక్ష్మాతిసూక్ష్మమగుట నేఁడు గంటిని. ధర్మమందుఁబుట్టి యందేపెరిగి దానినే యాశ్రయించియుండు భవాదృశులకే యది గోచరించును; అన్యులకు స్పష్టపడదు. హృదయేశ్వరా! ఇదంతయు సూచ్యార్థసూచికగా వచించితిని. దేవాసురయుద్ధము మఱునాఁడుగదా? అప్రార్థితముగా రెండు వరములు నాకు ననుగ్రహించితిరి గదా.

దశ:- కల్యాణీ! నాఁడే యనలేల? నేఁడుమాత్రము నీవుకోరినది కాదందునా? దశరథుఁడు నీవాఁడే గదా? ఏమివలయునో కోరుము. తప్పక యిత్తును.

కైకేయి వరంబులు గోరుట

కైక:- నాథా! అభిషేకసంభారములు సిద్ధమేగదా. ఆ ద్రవ్యముల తోడనే భరతునకుఁ బట్టాభిషేక మొనర్పుము. ఇది మొదటి వరము. రామునకు జటావల్కలములిచ్చి వానినిఁ బదునాల్గేండ్లు వనవాసమునకుఁ బంపుము. మాటతప్పవలదు. ధర్మాతిరేకమునకు సాహసింపకుము. అన్నమాట యొనర్చి కలకాలము జీవింపుము. రాముఁడు నేఁడే తరలవలయును. అతఁడు పోవుటఁ గన్నారఁ జూడవలయును. నాథా! ఆత్మకళ్యాణమును గోరుదువేని, కుల శీల సంరక్షణము నీకు నలయునేని, ఇక్ష్వాకు వంశంబునకుఁ గళంకము రా నొల్లవేని యాడినమాట చెల్లింపుము.

దశరథుని దుఃఖరోదనములు

కైకేయీ వరంబులు చెవిసోకినంతనే దశరథునకు నిలువెల్ల వడఁకెను; చెమ్మటలు పిచ్చెల్లెను; మోము వెలవెలఁ బాఱెను. 'హా!

ఏమి! ఇది స్వప్నమా? పూర్వానుభవ స్మరణమా? హృదయము తప్పుచున్నది. నేత్రములు సుడియుచున్నవి. మూర్ఛయయ్యెడు—హా! పాపీ! కులనాశిని! చండాలినీ! ఏమంటిని? రాముఁడు నీ కేమి యొగ్గు చేసెను? నిరపరాధుని నిష్కారణంబుగా నిట్లు చేయనేల? వాఁడు నీ కొనర్చిన శుశ్రూషలకై యీ పారితోషిక మిత్తువా? అయ్యో! ఎవని కళ్యాణ గుణంబులను జీవలోకము సంస్మరించి బ్రహ్మానంద మొందునో యట్టి నిత్యమంగళాకారుని గుట్టలకుఁ దోల సమకట్టితివా? ఆ కూన యొనర్చిన యపరాధమేమి? నీ విట్టి కాఠిన్యము వహింపనేల? అయ్యో! కౌసల్యను వదలుమన్నను బదులాడి యుండను; సుమిత్రను విడనాడుమన్నను సమ్మతించి యుందును. రాజ్యమును బాయుమన్నను సంతసించి యుందును. ప్రాణములు గోరినను గొమ్మందును. రాముని బాయఁజాల.

చ॥ రవిగహితంబుగా జగము గ్రాలినఁ గ్రాలును గాక, వారి బా
ష్పవిరహితంబుగాఁ బుడమి సస్యము పండినఁబండుఁగాక, ని
ష్పవనతలంబునఁ వెలుఁగు భాసిలఁగల్గినఁ గల్గుఁగాక, నా
ప్రవిమలజీవరాశియగు గామునిఁ బాసిన మేను నిల్చునే?

అని లోలోనఁ జింతించి, 'ప్రేయసీ! నీ యెడఁగల నాకూర్మిని బరీక్షిం తువా? కాకున్నచో నిట్లాడవు. అయ్యో! నవనీత కోమలమైన నీ హృదయమందిట్టి దంభోళిదారుణమైన యూహ జనించునా? ప్రేయసీ! ఈ కైలాటములు చాలించి నీ చెలికోడ్కలేవో తెలుపు' మని ప్రణయ మధుర స్వరంబున నడిగెను.

కైక:- రాజా! పైపూఁతలు చాలు; అన్నమాట చెల్లింతువా? తప్పుదువా?

మ॥ ఆడియాసల్ గలిగించి లేదనక మాయల్ పన్ని పైతీపుగా
నుడువుల్ బల్కి హులిక్కిచేయుచదురుల్ నూత్నంబుగా నేర్పుదే
తడవుండూళియుజిడ్డులేకయె నిరాధారానఁ జిత్రించి చూ
పెడుప్రోడల్ తతితీపుమాటలయిం బేల్వోదురే యెన్నఁడున్.

దశ:- దుష్టా! నీ సంకల్పము నిజమా? పిశాచగ్రస్తవై యిట్లాడుదువా? నన్ను నేను నమ్మఁజాలకున్నాను. రాముఁడన్న నెంతో సంత సింతువు; వానిపయిఁ బ్రేమంబులు కురియింతువు; భరతుఁనైన నను విడిచి యుందువుగాని రాముని జూడని దినము దుర్దినముగా భావింతువు. అట్టి నీవు నేఁడిట్లాడుదువని నమ్మికెట్లు? నా వీనులు

చక్కగా వినవు. ఇది నిజము. సత్యంబున సర్వలోకంబును, దానంబున దీనులను, శుశ్రూషలవలన గురుజనంబును, వింటి వలన శాత్రవ మండలంబును జయించి జగదేకవీర ఖ్యాతిని బడసి యెల్లరకు నల్లాడముద్దుగా నెవఁడు శోభిల్లునో, ఎవని నాశ్రయించి తపశ్చర్యయుఁ ద్యాగమును మైత్రియు శౌచవార్జవంబులును విద్యాభక్తులును గృతార్థత నొందుచున్నవో, మూర్తీభవించిన శాంతరసమని యెవని నభివర్ణింతురో, వశీయుధర్మజ్ఞుఁడునై, నిజప్రవర్తనము కృతజ్ఞతాతత్త్వార్థ పరిజ్ఞానంబునకు సులభ వ్యాఖ్యానము కాఁగా సన్మార్గమును దప్పక యెవఁడు ప్రవర్తించు చుండునో, ఎనని త్రికరణ వ్యాపారము అహింసాధర్మస్వరూప నిశ్చయంబునకు బిండీకృతార్థమో యట్టి లోకోత్తర గుణవంతుని దేవసమానుని మహర్షికల్పునిఁ బరిశుద్ధహృదయుని సర్వభూతప్రియుని రాముని గహనాంతర సీమలకు వినీతవేషంబునఁ గపటము మని కిరాతకీచకులు గూడ గోరరు. దయితామణీ! ఉన్నసమసకుఁగా నట్లంటిననుము; నెమ్మదివహించి వీడింతువు.

కైక:- రాజా! ఇచ్చకములు వలదు.

ఉ॥ ఆడినమాట కొవనుదువా పరిరాజులలోన నిల్చి? యా
నాఁడు తెగించి మృత్యువదనంబునఁ జిక్కితపించు నిన్నుఁ గా
పాడినపత్ని కిత్తునని పల్కినబాసలు తప్పదంచు మొం
డాడి వచింతువా యలమహస్థల మ్రోల సభాంతరంబునన్?

దశ:- అయ్యో! కైకా! ఈ విపరీతమేమి? ఈ గుణము నీకు సహజము గాదు. పరదుర్బోధనలు వింటివా? కళ్యాణీ! నయసంపన్నవైన నీకు నిట్టిగుణము నిక్కముగా జనించెనేని యిక్ష్వాకువంశ మండలంబున నగ్నిజొనుపుట గాదా? ఏనోట రాముని బ్రశంసింతువో యానోట నిట్టిమాట రానోపదు. అప్రియముఁ బలికిగాని, అయుక్తమొనర్చిగాని యెఱుఁగని నీవు నేఁడేల యిట్లాడుచున్నావు? పరవశవై యున్నావనుట స్పష్టము. మోహనాంగీ, ఇదే సాష్టాంగమొనర్తు; నీదశరథుని గలంపకుము.

చ॥ బలముడిగెఁ మనోద్రఢిమ పాయుఁగఁ జొచ్చెను నాఁడు నాటికిన్
పలితము లైనకేశములు పైఁబయిఁ దెల్పును గాలశేషమున్
గలిగెను దృష్టిమాంద్యమును, గాడటు రమ్మను వీడు పొమ్మనున్,
కలికిరో! మూఁడుగాళ్ళముకం దెగటార్పకు మున్ముముందుగాన్

మ॥ ధరణీమండలమెల్ల నీకొఱ కిదే ధారాగతంబిత్తు నీ
చరణంబుల్ తలదాల్తు నీనయనసంజ్ఞావర్తివై యుండు నీ
పరిచర్యాక్రమమొప్పగా నలుపుగుఱ, బద్మాక్షీ నారామపై
గరుణాలేశముఁ జూపుమా, దయితునిం గాపాడుమా యింతటఁ.

కైక:- రాజేంద్రా! ఈ వగలు నాకుఁ దెలియనివిగావు. ఒక్కమాట. తనువు శాశ్వతముగాదు. ధీరులు యశశ్శరీరమునుగోరి వర్తింతురు. కీర్తివలతువో అపకీర్తిని వరింతువో విచారింపుము. నీయీ చర్యలవలన రెండవదే నీకిష్టముగాఁ దోచుచున్నది. కైబ్బిడు తన శరీరమును గోసియిచ్చి డేగను దనిపి పారావతమును గాపాడెను. అలర్కుఁడు తన నేత్రింబుల నంధుఁడడుగఁగా బదులాడక యిచ్చెను. మాటకుఁ గట్టుపడి సముద్రుఁడు నేడుఁను జెలియలికట్టఁ దాటఁడు. బలిచక్రవర్తిసంగతి జగద్విదితమే గదా. వారిని జూచియైన గ్రహింపరాదా? సిరిసంపదలు నిత్యములు గావు. నీటిబుడగలకై ప్రాల్మాలవలదు. పూట గడచును, మాట నిలచును. నీవు కపటనాటకసూత్రధారివగుట నేఁడు స్పష్టమయ్యెను. రామునకే రాజ్యముఁ గట్టుము; కౌశల్యతోడఁ జిరకాలము సుఖముండుము; నాతలంపే నీకు వలదు. ఆత్మలాభార్థివై మాటదప్పము. మృత్యుముఖాంతరమునుండి రక్షించిన భార్య నకాలమరణదేవతకుఁ జేతులారఁ బప్పగింపుము. మహాకీర్తి యాచంద్రతారార్కముగా నీకగుఁగాక.

కైకేయి యిట్లు నిష్ఠురములాడి కులిశధారంబోని వాఁడిచూపును దశరథుని వంకఁ బఱపెను. అతఁడు బదులాడనోపక, 'హా! రామా! నష్టాత్ముఁడనైతిని. మంత్రనిర్వీర్యసర్పంబు గతి నాకు సంప్రాప్తమయ్యెను' అని కొంతసేపు విచారపడి తెంపుచేసి, 'గయ్యాళీ! ఈయసత్యంబును నీకెవ్వఁడు బోధించిరి? పిశాచగ్రస్తనలె భయముదక్కి నా యెదుట నిట్లాడ లజ్జింపవా? రామవివాసము! భరతాభిషేకము! అయ్యో! రామునినవలన నీకింత భయమేల? దీర్ఘసుమంగళీత్వమునఁ గోరుదువేని భరతునిమేలు నీకుఁ బ్రియమేని లోక సన్మానమును వలతువేని నీవిమతమును వదలుము. కుశీలపతాకా! నీయీ చురీప్రేరితమును భరతుడంగీకరించునని నమ్మితివా? ఆమాట కల్ల. రామునిగాదని భరతుఁడు రాజ్యమొల్లఁడు. కొడుకును గన్నావేగాని వాని తత్వమును గ్రహింపవైతివి. అంతమాత్రపుఁ బరిజ్ఞానమున్న నిట్టివింతలు పుట్టునా? చెనటీ!

ఇంగితజ్ఞులైన మంత్రులును త్రికాలవేత్తలైన పురోహితులును శ్రేయోభిలాషులైన బాంధవులును మిత్రులును గూడి నిశ్చయించిన యర్థంబు నువ్వెత్తుగా నూదివేయ సమకట్టితివి. ఇదిసాగునా? పిశాచీ! నీమత మెనర్చి పెద్దలకేమి పలుకుదు? రాజలోకము భ్రమోలఁ దల యెత్తుకొట్లు? చీ! నీముఖముఁ గూడ చూడరా'దని యంతఃకోపంబును వెలువరించెను.

కైకేయి యీమన్మాత్రమేని జడియక, 'రాజా! పెద్దలకేమని పలుకుదు నంటిని. మృత్యుముఖాంతరమునుండి తప్పించిన సతికి బాస చేసి తప్పితినని చెప్పుము. రాజలోకము భ్రమోలఁ దలయెత్తు కొట్లంటివి. నీతిలేనివారి కేలోకమైన నేమి? అయ్యా! నిన్ననవలదు. ఆత్మదోషము ననుభవించుచున్నాను. నివుఱుగప్పిన నిప్పనియుఁ బయోముఖవిషకుంభ మనియు నేరక మోహవివశనై నిన్నుఁ గవుంగిటఁ గూర్చి ముద్దాడి బాహ్యాంతరపరిదగ్ధనైతిని. ఇదే ప్రాణములు తరలుచున్నవి. చిరకాలము సుఖముండు' మని పలికెను.

దశరథుఁడంత నొంతశాంతిము నహించి, 'కైకా! నేఁడు నీనడత యపూర్వముగానున్నది. కారణమూహింపరాను. అయ్యో విపరీత భానముదగదు. నామాటవినుము. పరిచర్యాసమయంబున దాసివై వినోదవేళల సఖివై ధర్మాచరణంబున సహధర్మచారిణివై యుపలాలనంబులఁ దోఁబుట్టువై పోషణంబునఁ దల్లివై యెల్లప్పుడుఁ ద్రిశుద్ధికి నన్ను సేవించు కౌసల్యనుగూడ నీకు నోడి మనసార మన్నింపనైతి. నీకుఁగా నాయెనర్చి నవి యెల్ల రోగికి నపథ్యమట్లు పరిణమించెను' అని లాలనగర్భముగా వచించెను. దశరథుఁడు లాలించుకొలఁది కైకేయి మొండితనము పెచ్చు పెరుగ సాగెను. ఆ జోడు చింతాక్రాంతుఁడై యేమియుఁ దోపక, 'హా! రామా! ఈకఠోరవార్త నీకు వినుపించుకొట్లు? నీపట్టాభి షేకమును గూర్చి సభాంతరాళమున వెల్లడించితిని. అది తప్పకొట్లు? కౌసల్యా! నీయట్టి దురదృష్టశాలుండడు. నీవుగాదు, నీవుగాదు; నీపతి పరమదురదృష్టుఁడు. ఆ భాగ్యహీనునిఁ జేపట్టినకతన వాని పాపము నిన్నుఁగూడఁ జెనకెను. సుమిత్రా! ఈసంగతి విని నన్నేమందువో గదా? కటా! సీతా! ఈదుఃఖమెట్లు భరింతువు? పరస్పర ప్రేమ గ్రథితములై యెడబాయని మీ హృదయంబులకుఁ బ్రళయమును హఠాత్తుగాఁ గలిగించు పాతకంబును నాకొసట ధాత వ్రాసెఁగాఁబోలు. కాంతునిఁబాసిన కిన్నరివలె రాముని బాసి నీవు జీవింపవు. స్త్రీహత్యా

దోషము గూడ నాకుఁదప్పదు. ఎవరినో యనఁనేల? ఇదంతయు స్వయం కృతాపరాధ ఫలము; అనుభవింపక తీరదు. మాపునుగాంచి మోస పోయి యసతిని సతిగా గ్రహించితిని; విషమిశ్రమధువు సేవించుటయ్యెను. హా! కరాళీ! కైకా! గానమాధుర్యము లేడినివలె నీ చక్కఁదనము నన్నుహరించెను. కామినీలోలత్వఫలము నేఁడుపండెను. మూరా! నీమాటకుఁ గట్టుబడి పట్టిని కాననలకు దరలింతునేని సురాపుఁడైన బ్రాహ్మణునివలె నన్ను రాజవీథుల ధిక్కరింపరా? పాపీ! నీ చెలిమి మృత్యువుతోడి క్రీడయయ్యెను' అని పరుషంబుగాఁ బలికెను.

అందులకుఁ గైకేయి సుంతయుఁ జలింపక కోపదీపితయై, 'రాజా! వట్టినిందలవలన ఫలములేదు. అన్నంత చేయుదువా లేదా?' యని ఖచితముగా నడిగెను. దశరథుఁడు వెలవెలబోయి, 'హా! రామా! జీవలోక గర్హితుఁడైన యీ దురాత్మునకు నీ వేలఁబుట్టితివి? నీ కాల మెల్లఁ గఠినవ్రతములతోడ గురుశిక్షాశ్రమలతోడఁ జనెను. ఒక్క నాఁడును గోరంత సుఖంబును బడసి యెఱుంగవు. నీకు భోగానుభవ కాలము వచ్చేఁగదాయని యూహఁజిల్లితిని. కుమారా! ఇంతలో నీకిట్టి కష్టము దాపరించుననికలలోఁగూడఁగలంపనైతిని. నాయనా! బదులాడి యెఱుఁగవు; నిప్పులో నుఱుకుమన్నను వెనుదీయవు; ఇప్పుడేమి సేయుదువు? తండ్రీ! ఒక్కసారి నామాట కాదనుము; బ్రతిమాలుదు; గురుజనోల్లంఘన పాపము వచ్చునందువా? నేనే నిన్నుగోరుచున్నాను. ఆ కార్యము నా కెంతయుఁ బ్రియమును హితము నగును. —అయ్యో! ఎంతయజ్ఞానము; నీతత్త్వమెఱింగియు దిక్కుమాలిక లు కోరుచున్నాను. అజన్మపరిశుద్ధమైన నీ హృదయమందిట్టి కపటంబులకుఁ దావుగలదా?' అని కొంతతడవు విలపించి, కైకేయినంక మరలి, 'అనర్థదర్శినీ! మావంశ వినాశమును సంకల్పించితివి. రాముని వనంబునకు నన్ను యమసదనంబు నకు నొక్కసారిగాఁ దరలింతువుగదా. సుతవివాసమును బతివియోగము ననెడి శోకాగ్నులు ముమ్మరమై కౌసల్యను దహించి పరిమార్చును. రామునియందుఁగల భక్తిస్నేహంబులు లక్ష్మణుని హరించును. ఆ దారుణవార్తకు శతృఘ్నుఁడు గుండెయలు వ్రీలిచచ్చును; మా యనంతరము సుమిత్ర జీవింపదు; భరతుఁడుగూడ నుండుట కల్ల. అనాది ప్రసిద్ధము గుణసత్కృతము అక్షోభ్యమునైన యిక్ష్వాకుకులంబు నిట్లు వ్రేల్మిడిలో, నామావశిష్టముగావించి వారిరాజ్యమును సీవే యాకులం బుగాఁ బాలింపుము' అని వివిధగతుల దూఱి, మరల రామునిఁదలఁచి,

'హా! కుమారా! శిలాకర్కశంబులును క్రూరమృగాభీలములు నైన ఘోరాటవులందుఁ గ్రుమ్మరుదువా? కటుతిక్తకషాయంబులైన వన్య పదార్థములతో జీవింతువా? కాషాయపరిధానుండవై చరింతువా? జీవులకు సంయోగవియోగంబులు సహజములందురు. రామా! నీవు సామాన్య జీవిమాత్రుఁడవు గాదు; అలౌకికమూర్తివి. నిన్నెట్లు చేతులారఁ ద్యజింతు? నీ యెడ నిట్లు వర్తింతునేని సర్వప్రపంచము నన్ను నిగ్రహింపదా? నాయనా! నిన్నుఁ జూచినంతనే నాకడుపు నిండును; నీవు చెంతనున్నప్పుడు యీవనప్రాదుర్భావమట్లు బూరటిల్లుదును. నిన్ను విడనాడునెట్లు?' అని పలువగల విలపింపసాగెను.

దశరథుని దుఃఖసరణిని విని కైకేయి సుంత సంతసించి, 'దారికి వచ్చుచున్నాఁడు; పట్టువదలరా'దని నిశ్చయించుకొని, 'రాజా! ఏమి చెప్పెదవు? కాలవిలంబమగుచున్న'దని హెచ్చరికగాఁ బలికెను. ఆ మాటవిని దశరథుఁడు తోఁకత్రొక్కినపామువలె నూర్చుచు, 'పాపీ! ఈ కోరికలు కోరినప్పుడు నీనోటి రదనములు రాలవా? ఈ దురూహ జనించినప్పుడు నీ డెందము వ్రీలదా? చీ! చండాలినీ! దుఃఖనిహతవైన నగుదువుగాక; శోక పరిదగ్ధవైన నగుదువుగాక; నీపంత మెంత మాత్రముఁ గొనసాగదు. రాక్షసీ! పరమేష్ఠి పనిఁబూని లోకములోఁ గల సర్వ మాలిన్యంబుల నేతియేతి, కాలకూట విషము పదునిడి నూతినూతి, నీయాకారమును దీర్చి దిద్ది మకరందరసము లేతఁగా రాసి తళుకు మెఱుంగులిడి నిన్ను సృజించుట నేరక పైవన్నెలకు భ్రమించి నిన్నుఁజేరి యెట్టకేలకు దీపపతంగ న్యాయమును గ్రహించితి' నని దుఃఖింప సాగెను.

దశరథుఁ డింత పరితపించినను కైకేయీ హృదయము మాఱ నుండెను. ఆ తోఁడు వగలఁ బొగిలి యితికర్తవ్యతాజ్ఞుఁడై నెట్టివలెను బిశాచగ్రస్తుని పగిది రోగవిహ్వలునిచందమున విలపించుచు రెండు చేతులుచాచి, 'ప్రేయసీ ఈదీనుని గనికరింపుము; నీ పాదములు సట్టుదు'నని తదీయ చరణంబుల వ్రాలఁబోయెను. కైకేయి తన పాద ముల నవ్వలకు జరిపెను. అతఁడు పట్టఁగానక జాఱి నేలఁగూలఁబడెను.

అట్లు ధరాగతుఁడై పుణ్యాంతంబున దేవలోకపరిచ్యుతిఁ గాంచిన యయాతిని దలపించుచున్న సతిపయిఁ గైకేయి సుంతేనియుఁ గనికర మూనక, 'రాజా! నిత్యసత్యవ్రతుఁడనంటివి. సత్యమును గూర్చి పెద్ద

గ్రంథముఁ గఱపితివి. ఇదియా నీ సత్యవ్రతము? నీ వచించిన నీతులు నీ యెడవర్తింపవా? ఇంతయేల? చెప్పి తప్పితి ననుము. అంతేచాలు. నీ మాట నీ యొడిలో వైచి చనుము' నని యెత్తిపొడిచెను. దశరథుఁడు కటకటంబడి కన్నులెఱ్ఱజేసి, 'నన్నును నా రాముని జంపి నీకోర్కి-కొనసాగించుకొని సుఖముండుము రండా' యనెను. 'రాజా! నీ యాగడమునకు వింత యగుచున్నది. ఈ నాటకాభాసము చాలు; ఏమి చెప్పెద'వని మరల నయ్యింతి పుంటిపై ముల్లు గ్రుచ్చెను.

దశరథుఁడు నిర్విణ్ణుఁడై, 'కటా! ఏమిసేయుదు? బొంకఁజాల; రాముని వనమునకుఁ బంపఁజాల. ఒక వంక నూయి యొక ప్రక్క-గోయిగా నేర్పడెను. ఎటుఁ బోవుటకుఁ దోఁపదు. రామా! నీకుఁ బట్టముఁ గట్టుదు నంటిని. కల్లయెట్లు వచింతు? నాయనా! నిన్ను దుఃఖకుండమునఁ ద్రోయుటకన్న నేను ప్రాణపరిత్యాగ మొనర్చుట మేలు. అట్లయిన నీ కీ గండము తప్పఁగాక. హా! దైవమా! జన్మాంతరంబున నేనేమి యొనర్పఁగా నా కిట్టి యప్రతియోగమైన పాపముఁ గూర్చితివో? అయ్యో! ఇది కేవల కామవికారదుష్కృత ఫలము కాఁజాలదు. స్త్రీలోలు లెందరు గలుగరు? వారికెల్ల నిట్టిది సంభవించెనా?' అని లోలోనఁ గృశింప సాగెను. వాని వ్యసనమును జూడ నోపక యోయన భానుఁ డపరాంబుధియందుఁ గ్రుంకెను. తోని ముఖ పటలియో యన ముంజీఁకటి వ్యాపించెను.

దశరథుఁడు పెద్దయుండడవు వాపోయి వెచ్చనూర్చుచు నింగి వంక తలయెత్తి చంద్రోదయమగుటఁగాంచి, 'నక్షత్రభూషణా! చెల్ల వాఁటికు; ఈ దీనుని గరుణింపుము; ఇదే నమస్కారము—కాదు కాదు వెనువెంటనే చెల్లవార్చుము. ఏలయందువా? దురంతదురితావతార మైన యీ కరాళిని జూచుచు నిందుండఁ జాల'నని వేరెలుగెత్తి యేడ్చి యేడ్చి, మరలఁ గైఁకేయిని జూచి, 'శాతోదరీ! నిన్ను నా భాగ్య దేవతనుగాఁ గొలుతు; నా మొఱవినుము. అవసాన కాలంబున నాకు బొంకు మూటకట్టవలదు. శరణిల్లితిని, కాపాడుము. రాజ్యమెల్ల నీ హస్తగత మొనర్తును. నీవే దానిని రామునకిమ్ము; నీకీర్తి లోకా లోకములు వ్యాపించును. నీవు జగదాహ్లాదకారిణి వగుదువు; నీయశ్శ రీరము కలకాలముండును; ప్రపంచమునకు మార్గ ప్రదర్శకురాల వగుదువు. ఇంతకన్న మర్త్యులకేమి కావలయును? నా మాట వినుము. కళ్యాణీ!

చ॥ పరిణయబంధనంబునను భావములం బెనవైచి, యన్యదు
స్తరమగు దోహద క్రియలు సల్పి, యపూర్వసుఖైక భావ్యమున్
సురవర దుర్లభప్రణయ సూనమనోజ్ఞము జీవితంబు గాఁ
బరిణతిఁగూర్చు ప్రేమవనపాలిక నేఁడెటులీగెనో గదా ?

అనుచు వివిధాలాపములతో హితోపదేశములతోఁ బ్రార్థనాపరంపరలతోఁ బ్రొద్దుపుచ్చి సొమ్మసిల్లెను.

కైకేయి భ్రుకుటీకరాళాస్యయై, 'రాజా! దుఃఖమేల? అన్న మాట చెల్లింపవలసి వచ్చెనని దుఃఖింతువా? మాట తప్పవలసి వచ్చెనని దుఃఖింతువా? ధర్మజ్ఞుఁడవుగదా. 'సత్యంవద ధర్మంచర' అను వచనంబులు వినవా?

"చ॥ నుతజలపూరితంబులగు నూతులు నూఱేటికంటె సూనృత
వ్రత! యొకబావి మేలు మఱి బావులు నూఱేటికంటె నొక్క స
త్రక్రతువది మేలు తత్క్రతుశతంబునకంటె సుతుండు మేలు త
త్సుతశతకంబుకంటె నొకసూనృతవాక్యము మేలు చూడగాన్."

"గీ॥ సర్వతీర్థాభిగమనంబు సర్వవేద
సమధిగమము సత్యంబుతో సరియుగావు
ఎందుఁగు మెల్ల ధర్మంబులకెందుఁజెద్ద
యండ్రు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు."

అను విబుధోక్తులు తెలియవా? 'జాతస్య హి ధ్రువో మృత్యుః' అని వచించిరి. కావున శరీరము శాశ్వతముగాదు. 'ఇన్నాళ్ళు బ్రతికియిప్పుడు కల్లరి గావలదు,' అన్నమాటను సమర్థింపలేనివాఁడు పురుషాధముఁడందురు. ఈ యపకీర్తి నొడిగట్టకుము. నాకోరికలు నీయరచేతిలోనున్నవి. ముంజేతిని గట్టిగా ముడువనేల? రాజా! అభినయములచేతఁ దెల్లవాటెను. అవునో కాదో చెప్పు' మని మర్మములు గాఢవచించెను.

దశరథుఁడు పండ్లుగీటి, 'పాపీ! ఇఁక నీవు నాభార్యవుగావు; నేటితో మనకు సరి; నీ కొడుకునకు నాకు ఋణము తీఱినది. అదిగో సూర్యభగవానుఁడుదయించుచున్నాఁడు. అభిమేకద్రవ్యంబులను గూర్చి గురుజనము నన్ను నిరీక్షించుచుండును' అని పలికెను. బ్రహ్మాస్త్రంబులఁబోని యా వచనంబులు హృదయమున గలింపఁగాఁ గైకేయి కాలఁద్రాచిన త్రాచుపగిది నిశ్వసించుచు, 'రాజా! ప్రతిన చెల్లింతువా లేదా? మంత్రాలకు మామిడికాయలు రాలవుసుమా' యని యూని

పలికెను. దశరథుఁడు కడుంగడు ముచ్చటి, 'హా! రామా!' యని మూర్ఛిల్లెను.

అభిషేకద్రవ్యార్జనము

అట వసిష్ఠుఁడు శిష్యులనుగూడి సరయూతోయములాడి యభిషేకద్రవ్యములతోడఁ దరలి వివిధాలంకారశోభాయమానములై చందనాగరు ధూపవాసనాపరంపరల గుబాళించుచు లక్షోపలక్షజనసమ్మర్దమై యున్న యయోధ్యానగరవీథులను మెలమెల్లగాఁ గడచి రాజాంతఃపురము సమీపించి సుమంత్రుఁడను సారథిని బిలిచి, 'గంగా గండకీ బ్రహ్మావర్తాదిపుణ్యనదీ తీర్థములతోఁ బరమపవిత్ర సరోవరజలంబులతోఁ బయోధినీరముతో నించిన కనకకుటంబుల నశ్వత్థాది పత్రాచ్ఛాది తముగాఁ దెచ్చిరి; ఔదుంబరపీఠము సిద్ధమైయున్నది. వివిధరత్నంబులను సమస్తబీజములను నానాగంధములను మధుదధిఘృతక్షీరంబులను లాజాకుశపుష్పంబులను జతపరచిరి. మనోహరాంగకలైన కన్నెలైనముంత్రిపురు వచ్చియున్నారు. భద్రేభముఁ జతురశ్వరథముఁ జాప ఖడ్గంబులును బోయలతోడి పల్లకియు శ్వేతచ్ఛత్రముఁ జామరద్వయము సువర్ణదామబద్ధమైన తెల్లవృషభమును సమకూర్చిరి. స్వర్ణపాత్రమును నాలుగు కోరలునైచిన నిషుదజూలు తేజియు వ్యాఘ్రాజినమును సింహాసనంబున వీతిహోత్రంబును గోగణంబును బూజ్యములైన మృగపక్షి రాజములును సమస్తవాద్యంబులును యథావిధి నున్నవి. ఆచార్యులును బ్రాహ్మణోత్తములును జానపదముఖ్యులును వేంచేసియున్నారు. వేశ్యాంగనలు సాలంకృతలై కొలువు దీరిరి. ముహూర్తము సమీపించుచున్నది. ఈ సంగతి యేనికి విన్నవింపుము; నా రాకయు నెఱింగింపు' మని చెప్పెను.

కైకేయీ సుమంత్రులు

సుమంత్రుఁడు బిఱబిఱచని కైకేయి యంతఃపురము సొచ్చి శయ్యామందిరము వాకిట నిలిచి,

ఉ॥ రాజకులైకదీప రతిరాజసురూప జోహారు, శౌర్యవి
భ్రాజిత దివ్యమూర్తి యమరాధిపకీర్తి జోహారు, సత్యసం
పూజితవాగ్విశాల గుణభూషితశీల జోహారు, కోసల
శ్రీజయగీతికాభిరతచిత్త జోహారు, నరేంద్రశేఖరా.

సీ॥ నీరజాకరములు నిష్ఫలమ్మొనర్చిన
భవ్యతపంబులఫలమనంగ,
వివసముఖాభినందితచక్రయుగ్మకం
బుల యనురాగంపుఁ బ్రోవనంగ,
హరిహరబ్రహ్మమహానుభావంబు లా
కొక్కటిగాఁ గరఁగిన గుటికయనఁగ,
నతులవేదత్రయలతికాచయము,
పెనుపొందఁబుట్టెడు మూలకందమనగ

తే॥ నఖిలజగముల కందెఱయగుచు జనన
మాజకరపుటహృదయసరోజములకు
ముకుళనంబును జృంభణంబునునొనర్చి
భానుబింబంబు పూర్వాద్రిపై వెలింగె.

రాజేంద్రా, వేదవేదాంగంబులు చతురాస్యుని ప్రబోధించుచున్నవి. ఉదయ కాంతామణి సర్వమంగళ స్వరూపిణి యైన భూదేవిని నిగ్రహించుచున్నది. ఇనానలోకన మహాభాగ్యమును లోకము నిరీక్షించుచున్నది. సుమంత్రుఁడు దేవరవారిని ప్రబోధించుచున్నాఁడు. రవిచంద్రులును వైశ్వానర దేవేంద్రులును సదాశివుఁడును ఏలినవారికి విజయముఁ గూర్చుగాక. వసిష్ఠభగవానుఁడు భూసురసమేతుఁడై యరుదెంచి వేచియున్నాఁడు. కాపరిలేని పశుగణంబువలె నాయకుఁడు లేని సేనరీతిఁ జంద్రుఁడులేని రాత్రి కైవడి రాజదర్శనంబులేని రాజ్యము శోభాహీనమై యుండును. ముహూర్తము సమీపించెను. రామపట్టాభిషేక కార్యక్రమమునకు ననుజ్ఞ వేఁడుదుము; వేవేగ దయచేయఁ బ్రార్థించుచున్నా' మని విన్నవించెను.

సుమంత్రుని ప్రబోధవాక్యంబులు విని, 'సుమంత్రా! నీసూక్తులు సూదులై తోచు' నని దశరథుఁడు పలికెను. సుమంత్రుఁడది విని దిగాలుపడి జేనినంకఁ జూచి తన్నియంత్రణశక్తి వలన వాని మనోద్వేగమును గ్రహించి భయాక్రాంతుఁడై యోసరిల్లి నిలిచెను. మంత్రజ్ఞుఁడగు కైకేయి సారథినిజూచి, 'సుమంత్రా! రామునికైన సముత్సుకత్వంబునఁ జేసి రాజు రేయెల్లఁ గనుఁగూర్కక నిద్రాలసులై యున్నారు. రాము నిటకుఁ దోడ్కొనిరమ్ము' అని చెప్పెను.

కైకేయీ వచనంబులు రాజసమ్మతములని సుమంత్రుఁడు తలఁచి యందుండి హుటాహుటిఁ దరలి, రాజదర్శనార్థులైయున్న నరేంద్ర లోకమును గడచి, పైపైఁ బొరలుచున్న ప్రజాసాగరంబును దాఁటి,

యడిగినవారితో 'రాముని తోడితేరఁ బోవుచున్నా' ననుచుఁ జనిచని, మహా కవాటపిహితంబును మణీవిద్రుమ తోరణంబునైన రామమందిర బహిర్ద్వారము దూఱి, నానాదేశాగతనరపాలమండలమండితంబైన ముఖశాల నతిక్రమించి, దాసీదాసజనసంకీర్ణంబైన తొట్టికట్లుమించి, కాషాయవస్త్రధారిణులై వేత్రంబులు పూనియున్న యంతఃపుర రక్షక స్త్రీజన గౌరవంబు లంది, దాశరథికిఁ దనరాక నెఱింగించెను.

తండ్రి యాప్తుఁడు సుమంత్రుఁడు వచ్చుట రాముఁడు విని వానిని లోనికి రప్పించెను. అతఁడట్లుపోయి రత్నకంకణంబులు మధురరవంబు లీనుచుండ, మృణాళనాళ మృదుహస్తతలంబునఁ జామరము వీచుచుఁ జెలువ సీతాదేవి విలసిల్లుచుండఁగా, హిరణ్మయ పర్యంకము నధిష్ఠించి, చిత్రానక్షత్ర సంయుక్తుఁడైన చంద్రుని కరణిఁ బొలుపారుచున్న రాముని సందర్శించి, భయసయసంబులు పిఱిగొన మ్రొక్కి సుఖ ప్రశ్నముఁ గావించి తా వచ్చిన సంగతి విన్నవించెను.

రాముఁడు దశరథు నొద్దకుఁ బోవుట

రాముఁడు సుమంత్రుని సత్కరించి భార్యవంక మరలి, 'దేవీ, తండ్రియుఁ గైక తల్లియు నాకొఱకు సుమంత్రుని బంపిరి. నా యభిషేకంబును గూర్చి వారాలోచించు చున్నట్లు తలంతును. నా పినతల్లి భర్తృప్రియకానుయు సమర్థురాలును గావునఁ బతి యభిప్రాయంబు నుజ్జీవింప జేయును. జగన్మంగళాభిలాషిణి యగుటఁ జేసి యామె యిందులకు సంతసించుట వింతగాదు. వారిరువురుఁ గూడి యర్థసాధకుఁడైన సుమంత్రుని నాకడకుఁ బంపుట నా భాగ్యవిశేషముగాని యొండు గాదు. జాగువలను. పోయివచ్చెద. పరిజనంబులతోడఁ గ్రీడల సుఖింపు చుండు' మని పలికి వెడలెను. సీతాదేవియు భర్తృ మంగళంబును గోరుచు ద్వారముదాఁక వెంట నడచి, 'పరమేష్ఠి యింద్రునకుఁబోలె దశరథ మహారాజు మీకు రాజసూయాభిషేచన యోగ్యమైన రాజ్యంబు నిచ్చుఁగాక. రాజసూయ యాగదీక్షను నహించి వ్రత సంపన్నుఁడవై కృష్ణాజినమును ధరించి కురంగశృంగమును హస్త తలమునఁ దాల్చియుండ నిన్నుఁ గన్నారఁ జూతుఁగాక. దేవేంద్రుఁడు ప్రాచీభాగంబునను యముఁడు దక్షిణపార్శ్వంబునను వరుణుఁడు ప్రతీచీ దిశయందును గుబేరుఁ డుదీచీ దిక్కునను నిల్చి నిన్ను రక్షింతురుగాక' అను మంగళోక్తులతో సాగనంపెను.

రాముఁడట్లు వెడలినచ్చి హుజారమునొద్ద వేచియున్న తమ్ముని లక్ష్మణుని వెంటఁగొని మధ్యమ కక్ష్యాంతరమున భాసులుదీఱియున్న మిత్రకోటి నభినందించి, వ్యాఘ్రాజిన సమాచ్ఛాదితమై యగ్నివలెఁ దేజరిల్లుచున్న రజతరథంబు నారోహించెను. సౌమిత్రి ఛత్రచామర ములు పట్టి పృష్ఠభాగంబున నిల్చెను. వందిమాగధుల జయజయ ధ్వనులు చెలరేగెను. నానామంగళ వాద్యనాదంబులును బ్రజాకల కలంబులును రోదసీకుహరము నిండెను. ఉత్తమ హయంబులెక్కి కొందఱును మాతంగంబు లధిష్ఠించి కొందఱును వెంటఁదరలిరి. సారథి రథాశ్వంబులవాఁగెలు సడలించెను.

రాముఁడట్లు బయలుదేఱి రాజవీథింద్రొక్కి యిరుపార్శ్వంబుల సౌధోపరితలంబుల నుండి యిందుబింబాననల దోయిళ్ళు వర్షించు దివ్యపుష్పంబులఁ దోఁగుచు, నుత్తమాంగనల మంగళాశీర్వచన మాలికలను దలతోడ గ్రహించుచు, రోహిణి చంద్రునట్లు... సీతాదేవి నిజ పురాకృత సుకృతఫలంబుగా రామచంద్రుని గూడెనను వృద్ధనారీ ముఖుల ప్రశంసోక్తులు వినుచుఁ దన పరిపాలనంబునఁ గలుగు సభ్య దయంబులను గూర్చి జనులు బహుముఖంబులఁ బల్కుచున్న యాశా వచనంబులను నాకర్ణించుచు భావికారిమింతయుఁ బ్రారయక, దేవా లయంబులు వలగొని మందమంద గమనంబునఁ బోయి తండ్రియున్న నగరుజొచ్చి ధనుర్ధర సంరక్షితంబైన కక్ష్యాత్రయము దాఁటి యట రథము డిగ్గి పాదచారియై మఱికొండు కక్ష్యలు గడచి తోడిజనంబు నందుండి మరలించి తనరాక నెఱిఁగించి లోనికిఁ జని తండ్రికిఁ గైక తల్లికి మ్రొక్కి నిలిచెను.

కైకేయీ రాములు

దశరథుఁడు తన ప్రియసుతుని జూచి, 'రామా!' యను మాట మాత్రము పలికి మిన్నకుండెను. రాముఁడు తండ్రిని దేఱిచూచి, వాని కంఠము వ్యసనకుంఠిత మగుటయు, వానిదృష్టి సౌమ్యనిరుద్ధమగుటయు వానియునికి యపూర్వస్థితి నుండుటయు కలతవాఱిన సముద్రమువలె దబ్బఱలాడిన బుషిచందంబున నంతస్తాపసంతప్తుఁడై నిటూర్పులనలన నతఁడు హృదయ పరితాపమును వెలిపుచ్చు చుండుటయుఁ బరికించి పార్వణసాగరము క్రియ మనఃక్షోభ మొందిపురపురఁ బొక్కుచు, 'గతా ననున్ను జూచినంతనే సంతోష పరవశుఁడగు నా తండ్రి నేఁడిట్లు కానేల?

ఏమి విపరీతము వాటిల్లె?' నని వితర్కించుకొని, కైకేయి వంక మరలి, 'తల్లీ! నా తండ్రి యిట్లుండనేల? కాయిక మానసిక వ్యాధి రూప దుఃఖంబులు వానిని బాధింపవు గదా? భరతశత్రుఘ్నులు కుశలమే గదా? మీ రెల్లరు సుఖముందురుగదా? జననమూలమును బ్రత్యక్ష దైవతమునైన తండ్రిగారి యాజ్ఞను సుతులు శిరంబునఁ దాల్తురుగదా? తల్లీ! మైత్రినొండె మతియేకారణముననొండేఁ బరుసము లాడవుగదా? సంగతియేమో తెలుపుము, తల్లీ' యనెను.

కైక:- రామా! కోపముగాదు, తాపముగాదు. ధర్మసందేహ మొకటి గలిగి ముడివీడక త్రొక్కట పడుచున్నాఁడు. ధర్మజ్ఞుఁడవగు నీవే దీనిని దీర్పవలయును. సంగతియో యంత దురనగాహము గాదు. ఆడితప్పనగునా కాదాయనునది ప్రస్తావనాంశము. సత్యమునకు నపవాదములు గలవని నా నేర్చినకొలఁది చెప్పితిని; పెద్దల చరిత్రలు తార్కాణగాఁ బేర్కొంటిని.

'ఆ॥ వె॥ వారిజాతులందు వైవాహికములందుఁ
బ్రాణ విత్త మాన భంగమందుఁ
జకితగోకులాగ్ర జన్మరక్షణమందుఁ
బొంకవచ్చు నఘము పొంద దధిప!'

అను శుక్రాచార్యోపదేశంబు నుదహరించితిని. ఎంతునను వాని తలఁపుచిక్కు వీడదు. నీవే దీనినిఁ దెలుపనగును.

రామ:- అమ్మా, సత్యమునకు నపవాదములు కేవలాసద్ధర్మంబులుగా వచింతురు. అంతేగాని యొండుగాదు. ఆడితప్పరాదు; తప్పినచో దోషము సంభవింపక మానదు. తల్లీ, ఈ ధర్మము నీకు మాత్రము తెలియదా? ఓర్పుమాటగా నట్లంటివిగాఁబోలు.

కైక:- రామా! నీవును నీ తండ్రితో నేకీభవించితివి. ఇఁక నా మాట సాగదు. ఆడితప్పరాదంటివి; తప్పుట దోసమంటివి. నీ యట్టి ఋజుమార్గవర్తియు సత్యవాదియుఁ గలుగఁడు. నీ తండ్రి కొండొకనాఁ డొకమాట చెప్పెను. అదినేఁడు కాదనలేక పరిపంచు చున్నాఁడు. తండ్రియెడరు తీర్చుట తనయులకు విధిగదా.

రామ:- తల్లీ, ఈ విషయమున నీ రాముని సంశయింతువా? గురువును దైవము నైన తండ్రికిఁ జేయరానిది గలదా? రాముఁడు తండ్రి

కెదురాడఁడు. ఆడి తప్పఁడు. ముమ్మాటికి నమ్ముము. తల్లీ, సంగతి యేమో చెప్పుము; నా తండ్రికిఁగా నేనొనర్తును.

కైక:- రామా! తొల్లి దేవాసురయుద్ధంబున నీతండ్రి శంబరాసురుని వలన శకలీకృతాంగుఁడై మూర్ఛిల్లెను. అప్పుడు సారథ్యము వహించియున్న నేను మూర్ఛాగతుని నీతండ్రిని వేదతేర్చి కాపాడితిని. నా సేవకు మెచ్చి నీతండ్రి యయాచితంబుగా నా కప్పుడు రెండు వరములిచ్చెను. అవి యిప్పుడు కోరితిని. వానిని జెల్లింపనోడి యిట్లు సరితపించుచున్నాఁడు. నీతండ్రి బహుయాజి యందురు; కలిమిగలనాఁడు వేనవేలు యజ్ఞములు చేయవచ్చును. వానిని సత్యసంధుఁడని కీర్తింతురు. అక్లిష్టసమయములం దెల్లరు నట్టివారుగానే కాన్పింతురు. సమయమునెడి యొఱపుసానమీఁద రాచుదాఁక నిగ్గు తేలదుగదా.

రామ:- అమ్మా, నా తండ్రి నీకిచ్చినవరము లేవి? వానిని జెల్లింప సంశయ మేల? నా తండ్రికి మాఱుగా నవ్వరంబులను నీకు నేను సాధింతును. తల్లీ, మాటతప్పను.

కైక:- రామా! సాధింపరాని వరములను నేనుగోర లేదు. నా కోరినవి ఱేని యరచేతిలోనే యున్నవి. దాపనేల? వినుము. భరతునకుఁ బట్టముఁగట్టుమంటిని; నీకుఁ బదునాలుగేండ్లు వివాసమును గోరితిని. ఈ సంగతి నీకుఁ జెప్పనోడి నీతండ్రి తలవాల్చి యున్నాఁడు. జనకుని కీర్తినిఁ గాపాడఁదలఁతువేని వానిమాట చెల్లింపుము. సంభారములెల్ల సిద్ధముగా నున్నవి. ఆ ద్రవ్యములతోన భరతునకుఁ బట్టముగట్టి నీవు జటాజినవల్కలంబులు ధరించి చతుర్దశ వర్ష వనవాస మొనర్పుము.

రామ:- తల్లీ! అనర్ఘములైన వరములను నాకుఁ గృపచేసితివి. ఇవితప్పక చెల్లింతును; వేఱుతలఁపు వలదు. ఇప్పుడే నీయెదుటనే నార చీరలు గట్టి తరలుదును. ఈ పరమ వరములను నా తండ్రి నాకు స్వయముగా ననుగ్రహింపఁడయ్యె ననుచింతదక్క నొండు గలుగదు. నా యెడఁ బితృభక్తిని శంకించెనోయని వందురుదును. తల్లీ! తండ్రి పనుపుచేయుటకును నీకు నభిమతార్థమును గూర్చుటకును రాజ్యమునే గాదు సీతనేనియుఁ దుదకుఁ బ్రాణంబు నేనియుఁ దృణీకరింతును. అమ్మా! నాయనగారి నాశ్వాసింపుము.

అయ్యో! నా తండ్రి కన్నీరునింపనేల? వలదు. ఎంతమాత్రము వలదు. ఒండుతలంపక తడవుసేయక భరతునకై సందేశమును వాయువేగంబునఁ బంపుము.

కైక:- రామా! అట్లుచేయుడుఁగాని నీవుమాత్రము జాగుచేయవలదు. మాటచెల్లింతువో లేదోయని జంకి నీ తండ్రి సిగ్గుపడి పలుకఁడు. వానికొంకు మాన్పుము. నీవు వనమునకుఁ బోవుదాఁక నీ తండ్రి యన్నపానాదులుగూడ స్మరింపఁడు.

కైకేయీ వచనంబులు కొరడాఝళిపించుచు త్వరించెను. రాముఁడంత దశరథుని లేవనెత్తి, 'నాయనా! రాజ్యాదిసంపదలకు నీ రాముఁడు దాసుడుగాఁడు. ధర్మమొండు వానికిఁ జాలును. పితృసేవకు మించిన యజ్ఞముఁ దండ్రిపనుపుసేయుటకన్న నధికమైన ధర్మముఁ గలుగవు. అట్టి ధర్మము నొనర్చుటకు నాకిప్పు డవకాశమును గలిగించితివి. ఇంత కన్నఁ బరమభాగ్యము నా కేల? నీ యాజ్ఞను తల్లిముఖంబున వింటిని. నీ రాముఁడు నీ కెదురాడఁడు. అట్టి జంకుకళంకులు వలదు' అని పలికి కైకేయిని జూచి, 'తల్లీ! నీవే నన్ను శాసింపరాదా? నీ పనుపుఁ దలదాల్పనా? నీ కోరినవి మహాస్వల్పములు. ఇవి యొకవరంబులుగా రాజేంద్రుని యాచింపవలయునా? ఇదిగో జనసీజనకులను వీడ్కొని నీత నూఱడించి నేఁడే దండకారణ్యంబునకుఁ దరలుదు. నా తమ్మునకు భరతునకు రాజ్యము గట్టుము. పితృశుశ్రూషలందుఁ బరాకుచెందవలదని నా మాటగా వానికిఁ జెప్పు' మని వచించి కైకేయీ దశరథులకుఁ బ్రదక్షిణమొనర్చి ప్రణమిల్లి పితృవాక్యపరిపాలనా మహాభాగ్యప్రాప్తి కెంతయు సంతసించుచు నందుండి వెడలి లక్ష్మణుని వెంటఁగొని యభిషేకజలభాండాదులవంక కన్నెత్తియు సారింపక వానిని ప్రదక్షిణమాత్రంబున నభ్యర్చించి తల్లిమందిరంబునకుఁ బోయెను. అంతఁజేతిలోని రాజ్యశ్రీ హఠాత్తుగా జాఱిపోయినను రాముని హృదయము లవమాత్రమేనియు జలింపక నిర్వాత దీపకళికవలె నుండెను. వాని మోమునందెట్టి వికారముఁ దోఁపదయ్యెను. వానిని జూడఁగా ద్వంద్వాతీతుఁడైన స్థిత ప్రజ్ఞుఁడు తలంపునకు వచ్చుచుండెను.

రాముఁడు కైకేయీ మందిరమునుండి వెడలివచ్చుఁ దడవుగా శుద్ధాంత కాంతాజనంబుల హాహారావములు పిక్కటిల్లెను. 'కటా! మా ప్రాపు, మా భాగ్యము, మా కన్నతండ్రి, మా రాముఁడు మమ్మెల్ల

విడనాడి వనాంతరమునకుఁ జనుచున్నాఁడు. అయ్యో! ఏమిసేయనగు? కటా! రాజా! నీదుర్బుద్ధికేమనగను? లోకశరణ్యుఁడైన కూర్మిసుతుని గహనాంతరములకుఁ దోలి ప్రాణిలోకంబును బెండిఁకటి ముంతువా?' అని వారు దూడలఁబాసిన గోవ్రులచందానఁ బనవసాగిరి.

రాముఁడు తల్లిని వీడ్కొనుట

అటఁ గౌసల్యాదేవి పుత్త్రుని హితార్థము నియమ నియమిత చిత్తయై రేయెల్ల జాగరణముండి వఱువాత విష్ణువు నర్చించి కృత మంగళయై హోమము గావించుచుండెను. రాముఁడు తల్లి మందిరముఁ జొచ్చి తొలి తొలికట్టునందున్న ద్వారపాలకుల జయాశీర్వాదములు గైకొని రెండవ తొలికట్టునందున్న వేనవేత్తలకు నమస్కరించి మూఁడవ తొలికట్టుఁ బ్రవేశించెను. అచట పురంధ్రీమణులు వానిని గాంచి ప్రమోదభరితాంతరంగలై యాశీర్వదించి వానిరాకఁ దల్లికెఱిఁగించిరి. కౌసల్యాదేవి వాత్సల్యము పిచ్చలింపఁగాఁ గొడుకునకు నెదురు వచ్చి తనకు నమస్కరించిన సుతుని సంకమునఁ గూర్చి శిరము మూర్కొని, 'నాయనా, మహోత్కులగు రాజర్షులకువలె నీకు దీర్ఘాయుఃకీర్తులగుఁ గాక; వంశోర్వ్యమగు ధర్మంబును భావింతువుగాక' యని దీవించి, 'వత్సా, నేఁడు నీకు యౌవరాజ్యాభిషేకమంగళము గానున్నది గదా. ఇటఁగుడిచి చను' మని పలికి యాలోన సుతుని మురిపెంబులను విన గుతూహలయై వానిని గూర్చుండుమనెను.

రాముఁడు తల్లికి మరలమ్రొక్కి, 'అమ్మా! సంగతి యొండు వినిపించి పోవచ్చితిని. వెరవకుము. దేహధారులకు సుఖమఃఖంబులు సహజంబులు. పరమార్థము విచారించినచో సుఖము సుఖముగాదు; దుఃఖము దుఃఖముగాదు. ఏలయందువా? దేహాత్మబుద్ధి గలంతకాలమే యీద్వంద ములకు నునికి గలదు. అప్పుడుగూడ నవి దైహికములేగాని యాత్మ సంబంధములుగావు. మఱియు నిట్టి సుఖదుఃఖాదులు జీవరాశికిఁ బూర్వ కర్మానుసారమున వచ్చుచుండును. కర్మగతి యిట్లని చెప్పఁదరముగాదు. ప్రాప్తమును సహింపక తీరదు. ఈ పరమరహస్యము నెఱుంగనివారు ద్వందకోలాహలమునకుఁ జిక్కి నశింతురు. ఇదియునుగాక సుఖదుఃఖముల యొక్కయు మేలుగీళ్ళ యొక్కయు యాథార్థ్యము సులభ గోచరముగాదు. ఇప్పుడు మేలుగాఁదోచునది మఱికొంత సేపునకుఁ గీడు గావచ్చును. ఇప్పుడు కీడుగాఁ దలఁపఁబడినది కాలాంతరమున

మేలు గావచ్చును. కావున నేది నిజముగా మేలో యేదినిజముగాఁ గీడో మాయావృతులకుఁ దెలియవు. ఈ యజ్ఞానంబునకుఁ జిక్కి వారు భ్రాంతులై మరుమరీచికల వెంటఁ బరువెత్తుచుందురు. తెలివిగల వారట్లు సేయరాదు. నా తండ్రి నాకుఁ బట్టముఁగట్టుట మేలో కాదో చెప్పగలరా? తలఁచినపని సమకూఁనునో లేదో నిశ్చయింపఁ గలరా? సర్వము దైవాయత్తమై యుండును. ఎప్పుడేది గల్గునో దానిని సహించుటయే మర్త్యులకుఁ బరమ శ్రేయోమార్గము. తల్లీ! సుఖదుఃఖంబులను గలిమిలేములను సమదృష్టితో భావించుచుఁ బ్రాప్తంబు ననుభవించుచుండుము. కోరికలవెంటఁ బరువులెత్తవలదు. భరతునకుఁ బట్టముఁగట్టునట్లు నిశ్చితమైనది. నేను దండకారణ్యంబునఁ బదునాల్గు వత్సరంబులు కందమూలఫలభోజనై వసింపఁ దరలుచున్నాను. అనుజ్ఞ వేఁడుదు. నిండుమనంబుతో నెలవిమ్ము' అనెను.

కౌసల్యా విలాపము

చిచ్చుఱుపిడుగుఁబోని యీమాట చెవిఁబడినంతనే కౌసల్యా దేవి నిలువున నఱికిన కదళీవోలె నేలఁగూలి మూర్ఛిల్లెను. ఆమెను దాదులు శైత్యోపచారంబులఁ దేర్చిరి. ఆమె నేదదేఱి, 'వత్సా! నా శోకార్థము జన్మించితివా? అయ్యో! సంతానము లేనినాటికంటె నేఁడు నా దుఃఖము దుస్సహమయ్యెనుగదా. భర్తవలన నిండారు సుఖమెట్టిదో యెఱుంగకున్నను బుత్త్రుని వలననేని సుఖంతుఁగదాయని కొండంత యాసతో నుంటిని. ఆ యాసను నమ్మి యోర్వరానికష్టము లోర్చితిని; మరణంబుఁబోని సపత్నీనిరసనంబును సహించితిని. అయ్యో! నా యాసలెల్ల నడియాసలయ్యెను. ఇఁక నాగతియేమి? కైకేయికి వెఱచి పరిజనంబు నన్ను మనసారఁ బరిచరింపదు; దయితుఁడు హృదయమిచ్చి వర్తింపఁడు. నాయనా! నిన్నుఁ జూచికొని యివి యెల్ల మింగియుందును. నీ యుపనయనమై యిప్పటికిఁ బదునేడు వత్సరంబులుగడచెను. నీకు యౌవరాజ్యంబు వచ్చుననియు నా యెడరు లెల్ల సమసిపోవుననియు నూఁటిల్లుదును. పుత్త్రా! కడకు నిన్నుఁ జూచుటయే నాకుఁ గఱువుగా నయ్యెను. లెక్కలేనిదినము లుపవసించితిని; చెప్పరాని వ్రతములు సలిపితిని. కన్నదేవతలకెల్ల మ్రొక్కితిని. ఎట్లో నాతపఃఫలంబుగా నిన్నుఁబడసితిని. నాపడినగాసియెల్ల నేఁటితో వ్యర్థమయ్యెను. వఱదతాఁకున నదీకూలమువలె నా హృదయము విఱియరాదా? కటా! యముఁడు గూడ తనలోకంబున నాకుఁ జోటియ్య

వెఱచెనా? హా! ప్రాణములారా! ఈ మొండికట్టియను వదలి పున్నెముఁ గట్టుకొనరా? దేహమూ? ఈ వ్యసనంబు లోర్చుటకన్నఁ దలనుండి జాఱిన నీటికడవవలెఁ దుత్తునియలై నశింపరాదా? పితామహా! వజ్రసారంబునఁ బదనిడి నన్ను సృజించితివా? కావుననే గదా నన్ను దుఃఖాగ్ని దహింపదు. ఇఁక నాకు మరణభాగ్యము కల్ల. నాయనా! నీతోడిదే లోకంబుగా నుందును. నిర్జీవలోకంబున నన్ను భయిదు చేయవలదు. నీ వెంట వత్తు' నని గొబ్బున విలపించెను.

లక్ష్మణుని శోక కోపంబులు

అందాఁక లక్ష్మణున కీసంగతియే తెలియదు. రాముఁడట్లు కౌసల్యతోఁ జెప్పుట విని సౌమిత్రి తన్నుఁదా నమ్మకుండెను. కౌసల్యా దేవి యెలుగెత్తి విలపించెను. లక్ష్మణుఁడు బహిర్ముఖుఁడుఁబోలెనై, 'తల్లీ! దుఃఖమువలదు. స్త్రీమాటకుఁ గట్టువడి నాయన్న హస్తగతయైన రాజ్యశ్రీని నిరసించి గుట్టలపాలగుట నే నెంతమాత్రము సహింపఁజాలను. ఱేఁడన్ననో వయఃపరిపాకజనిత చిత్తచాంచల్యంబునకు విషయ లౌల్యము తోడ్పడఁగా నెత్తువారిచేతిబిడ్డఁడై యున్నాఁడు. వివశుని భాటించుట నెట్లౌతనము' అని పలికి రామునివంక మరలి, 'అన్నా! ఏమి? నీకు దేశాంతరవాసశిక్షను విధించెనా? ఏల? రాజద్రోహ మొనర్పవు. అంతటిసేత యేదియుఁ జేయవు. పగతుఁడుగూడ నీవంక వ్రేలుచూపఁజాలఁడు. ఋజుమార్గవర్తివి. జితేంద్రియుఁడవు; దైవ సమానుఁడవు; మీఁదుమిక్కిలి గాదిలికుమారుఁడవు. అట్టి నిన్ను నిష్కారణముగాఁ దండ్రి త్యజించెనా? వాని యస్వస్థచిత్తతను నిరూపింప మఱేమి వలయును? అట్టివాఁడు ధర్మజ్ఞుఁడగునా? ధర్మజ్ఞుఁడు కాని వాఁ డాదరణీయుఁడా? ధర్మదూరుని లెక్కసేయనగునా? లెక్కచేయుట యధర్మముగాదా? ధర్మమునలనఁ బ్రమాదమందవలదు. అన్నా! ఈ యవివేకశాసనము వెల్లడిగాకమున్నే రాజ్యంబు నాక్రమించుదము గాక. నేను ధనుష్పాణినై నీ చెంతనున్నంతకాలము నీయాజ్ఞ జనదాటు ప్రాణి గలుగఁబోదు. అయోధ్యారాజ్యంబెల్ల నొక్కటిగా నెత్తివచ్చినను నిలువనోర్తును. రౌతు మెత్తనైన గుఱ్ఱము ముక్కాల నడచు ననుసామెత నేఁడు మన యెడ వర్తించుచున్నది. కైకేయీ మాయలకుఁ జిక్కి కన్నతండ్రియే మనకు శత్రువయ్యెను. కానిమ్ము; కార్యాకార్య వివేకము దక్కి యుత్పథంబుఁ ద్రొక్కిన యతఁడు తండ్రియైనను గురు వైనను శిక్షార్హుఁడుగాకమానఁడు. స్మృతులే యిట్లు వచించుచున్నవి.

ఇది యట్లుండనిమ్ము. రాజ్యము నీకు ధర్మప్రాప్యము. నీ సొమ్మును భరతునకిచ్చుటకు దశరథున కేమిహక్కుగలదు? మనయిద్దఱను విరోధించి వగ్గుముచుసలి యీ పని చేయఁజాలునా? ఏ బలంబును నమ్మి యట్లొనర్చునో చూతము. తల్లీ! జ్ఞాతినని నన్ను సంశయింపవలదు. సత్యము సాక్షిగా నా చేతివిల్లు సాక్షిగాఁ బ్రమాణము చేయుచున్నాను. అన్నయెడ నా యనురాగము నిర్వ్యాజనిష్కళంకము. అన్నమాటఁ దలఁదాల్చి వర్తింతును. ఆయన మహారణ్యము చొరనున్నను గాలాగ్ని నుఱుకనున్నను వానికన్నముున్న నే నుందును. అమ్మా! ఊరడిల్లుము. నా పరాక్రమముఁ జూతువుగాక' అని రోషభీషణంబుగా వచించెను.

రాముఁడు కౌసల్యా లక్ష్మణుల నోదార్చుట

కౌస:- నాయనా! రామా! తమ్ముని వింటివా? సవతిదురోబ్ధనలకు రాజు చిక్కువడియున్నాఁడు. నన్ను శోకసాగరంబునఁ ద్రోయకుము. నీవు వనములకు నెంతమాత్రముఁ బోఁదగదు. వత్సా! నీ నెఱుంగని ధర్మము గలుగదు. మాతృశుశ్రూషకన్నఁ బరమధర్మము గలదా? రాజ్యము లేకున్న మానెఁగాక; నా తోడనిటనుండుము. కాశ్యపుఁడు మాతృసేవైకవ్రతియై యిల్లెడలకుండియు స్వర్గమును బడయఁడా? బిడ్డలకుఁ దండ్రియెట్లో తల్లియు నట్లేగదా. వత్సా! నీవు లేనిబ్రదుకు నాకేల? నీవు చెంతనుందువేని తృణభక్షణముగూడఁ బరమరసాయన సంతృప్తి నొందవించును. నా మాట వినవేని యన్నపానాదులు నర్జించి ప్రాణపరిత్యాగ మొనర్తును.

రామ:- తల్లీ! నీకు వేనవేలు నమస్కారములు. దారుణము వలదు. తండ్రియాజ్ఞఁ దప్ప నాతరముగాదు. జనకునియాజ్ఞ యనుల్లంఘ్యము. తండ్రిపనుపు సేయుటకై కండుమహర్షి గోహత్యకుఁగూడ సాహసించెను; సగరపుత్త్రులు తమ ప్రాణంబులను ధారవోసిరి; పరశురాముఁడు కన్నతల్లిని గొడ్డటఖండించెను. పెద్దల మార్గమును బరిశీలింపుము. నన్నుఁ గనిపెంచితి వనుట నిజము; నాకై పడరాని పాట్లు నీవు పడుట సత్యము. ఏది యెట్లున్నను ధర్మమెల్లరకుఁ బ్రధానము. బిడ్డలు ధర్మమార్గావలంబకులగునట్లు చేయుట తల్లిదండ్రులకు విధివిధానము. ధర్మ మాచరింప నున్నప్పుడు నీవు నాకుఁ దోడ్పడవలయునే గాని యిట్లనరాదు. ధర్మ

మును విడనాడనోపఁ. నేను వనవాసముచేయుట నీకు దురంత శోకకరమగునని యెఱుంగుదు. దానినైన నోర్తుఁగాని తండ్రి యాజ్ఞ మీఱఁజాలను. నా యీ నిర్ణయము విపరీతముగాదు. లోకవ్యతిక్రమ మిందేమియు లేదు. తొల్లిటి మహాత్ములత్రోవఁ ద్రొక్కుచున్నాను. ధర్మనిబద్ధమైన నా యీ కార్యమునకు ననుజ్ఞయిమ్ము.

లక్ష్మణా! నీ కూర్మికెంతయు సంతసింతును. తేజోవిక్రమంబులందు నీవు దురాసదుఁడవగుట నాకుఁ గ్రొత్తగాదు. నా తల్లి సత్య శౌంత గుణాదుల తత్త్వము సమగ్రముగా గ్రహింపని కారణమున నట్లాడుట చిత్రముగాదుగాని గురుశుశ్రూష లొనర్చి శాస్త్రము లభ్యసించి యెల్లధర్మములు నేర్చిన నీవిట్లాడుట చిత్రమేగాక దుఃఖకరముగానున్నది. వత్సా! ధర్మమునకు సత్యమే మూలము. ధర్మమునకన్న నుత్తమ పురుషార్థము గలుగదు. దేహధారులకు సత్యంబుకంటె శరణ్యంబు లేదు. ధర్మంబు నెడయుట సత్యద్రోహమగును. ఆత్మవినాశమును వరించువాఁడు దక్క సన్యులందులకుఁ దెగింపడు. భావితాత్ములకు ధర్మమే శరణము. ఎల్ల ధర్మములలోఁ బితృవాక్య పరిపాలన ముత్తమోత్తమ ధర్మమని పెద్దల నిశ్చయము. తండ్రియాజ్ఞ నతివర్తింప నా వలనుగాదు. అది కైకేయీ ప్రేరితమందువా? అగుగాక. తండ్రి యాజ్ఞ ప్రధానము గాని తన్మూలకారణము ప్రధానముగాదు. ఉత్పథమందువా? ఆ విచారణకే నీవర్హుఁడవుగాదు. లక్ష్మణా! కేవల క్షత్ర ధర్మాశ్రితబుద్ధి వలదు. ఆర్యులు దాని నంతగా మన్నింపరు. క్రౌర్య మెడసి ధర్మమాచరింపుము.

కౌస:- కుమారా! గురుజనాజ్ఞ మీఱరాదంటివి. పోషణ స్నేహంబులఁ దల్లియుఁ బుత్త్రులకు గురువగునుగదా? నా యాజ్ఞను మాత్రము మీఱనగునా? వత్సా! నామాట వినుము. నన్ను వనదువెల్లిద్రోయకుము. నీవు లేనినాఁడు పితృలోకస్వధగాని స్వర్లోకామృతముగాని నా కెంతమాత్రము నభిమతంబులు గావు. నీసన్నిధానము నాకుఁ గల్పముగానుండును. పుత్త్రా! నీ మనస్సును మరల్చి నా ప్రాణములు నిలుపుము.

రామ:- తల్లీ! వ్యసనపరితాపంబులకు నెడమీయవలదు. సందిచ్చినచో నవి మింగివైచును. ప్రాణులకు సుఖదుఃఖములు సహజములని

మున్నే విన్నవించితిని. ధైర్యము వహించి యివి యెల్ల సహింపుము.

(తమ్ముని వంకకు మరలి) 'లక్ష్మణా! నీవిట్లు దుఃఖించుట పౌరుషమా? నాయనా! సత్పురుషులకు ధర్మార్థకామంబులు మూఁడును సమాదరణీయంబులు. అందు ధర్మము త్తమము. ఏలయందువా? వశ్యమై ధర్మంబును, బు త్త్రవతియై యర్థంబును భార్య భ ర్తకుఁ గూర్చుపగిది ధర్మమొక్కండ నరునకు సమ్మోటిని సమకూర్చును. కావున ధర్మము ప్రధానము; అర్థకామంబు లానుషంగికములు. ధర్మార్థకామంబులు మూడింటికిఁ గూడని కర్మము నాచరింపరాదు. కామార్థములకుఁ గాకున్నను ధర్మమునకు మాత్రమే యైనచోఁ దత్కర్మము పరమాను ష్ఠేయము. కేవల కామార్థకర్మము లోకగర్హితమని వేఱు చెప్పనక్కఱ లేదు. ఈ నచనంబులు తార్క్ఱాణగాఁ బ్రకృత విషయంబును విచా రింపుము. రాజ్యభోగాదులు కామార్థప్రదములే గాని యంతకు మించి నవిగావు. అట్టి తుచ్ఛంబులను మనబోంట్లు పెద్దసేయ వచ్చునా? ఎన్ని కష్టంబులు వచ్చినను సహించి ధర్మమును సంపాదింపవలయును. కావున నివ్విషయంబునఁ బరాకు చెందకుము. సౌమిత్రీ! మహారాజు మనకు గురువును దండ్రియు రాజు నగుటయేగాక వృద్ధుఁడును గావున చతుర్విధములఁ బూజనీయుఁడై యున్నాఁడు. అట్టి మహనీయుని యాదేశము కామకారితముగానీ యేమైనఁగానీ ధర్మసరుఁడు నిరాక రింపఁడు. లక్ష్మణా! తండ్రియాజ్ఞ నీకుఁగూడఁ గ ర్తవ్యమేగదా? తల్లీ! సతికిఁ బతియే గతి. పతిమాటను నీవు నిరాదరింపరాదు. అమ్మా! రాజ్యాదులు క్షణికములు; ప్రాణము శాశ్వతముగాదు. నీటి బుడుకలం బోని వీనికై నిత్యమగు ధర్మమును వదలుదురా?—లక్ష్మణా! ధైర్య మనలంబించి రోషశోకంబులను నిగ్రహింపుము. అవమానమును సుంతయు శంకింపవలదు. అభిషేకార్థము రచించిన యలంకారములనెల్ల విసర్జింపుము. ప్రవృత్తి నివృత్తుల నొక్కరూపున బాలించు వాఁడే ధీరుఁడు. జాగు వలదు. మనతండ్రి నిజప్రతిజ్ఞాభంగమును సంశయించి పరలోకభీతుఁడై యున్నట్లు తోఁచెను. వాని శంక తీరవలయును. నేను వనగతుఁడనగుదాఁక యది తీరదు. అందాఁక భరతాభిషేకమును గూడఁ దలంపరు. తమ్ముఁడా! రాజ్యమును ద్యజింపరాదంటివి. నాదియు నొక త్యాగమా? తండ్రికి నా యెడఁగల పు త్త్రివాత్సల్యమెంతో నీవే యూహింపుము. నాఁడు విశ్వామిత్ర మహర్షి తోడ నన్నుఁబంపుటకు

నాయన యెంత పరితపించెనో నీవు కన్నారఁ జూచియున్నావు. అట్టి వాత్సల్యమూర్తి సత్యప్రతిష్ఠాపనార్థము పుత్త్రునిఁ జేతులార గుట్టలకుఁ బంపుచున్నాఁడు. ఈ త్యాగము క్రమాల మనదియుఁ ద్యాగముగాఁ జెప్పనగునా? నన్ను వనమునకుఁ బంపుట న్యాయమా యని శంకింప నచ్చును. తండ్రి కెన్నఁడు నప్రియమొనర్పలేదు; వాని మాటకు నెదు రాడి యెఱుంగను. నాయన తన కార్యములెల్ల నా పయిఁ గురియించు చుండును. అట్టివాఁడు నాయెడ నిట్లు వర్తింపనేల? ఈ పాట్లకెల్లఁ గైకేయి మూలమందురు. ఇది కేవలము భ్రాంతి మూలకము. ఆమె భరతునికన్న ననే్న ప్రియంబుగా మన్నించును. ఆమెకు నే నెట్టి యవిన యంబుఁ గావింపలేదు. అట్టి తల్లి నేడిట్లు కోరనేల? తమ్ముఁడా! ఇదంతయు దైవికముగాని వేఱుగాదు. దైవయోగమును గుర్తింప రాదు. సామాన్యులకుఁ దెలియరాకున్నను యోగీంద్రులకేనియుఁ దెలియదా యని యడుగవచ్చును. యోగులకుఁ గూడ నయ్యది దురూహ్యమే యనవలయును. ఎట్లందువా? మహర్షులు త్రికాలజ్ఞు లందురు. అట్టివారు నా పట్టాభిషేకముహూర్తమును నిశ్చయించిరి. తెలిసితెలిసి వా రెగ్గుచేయరుగదా! వారి నిశ్చయము సహితము క్షణములో వైపరీత్యమొందెను. కావున దైవయోగమంత దురూహ్యము. అది బహురూపంబులఁ బరిణామ మొందుచుండును. మర్త్యు లది నిమిత్తమాత్రులగుదురు. ఈ రహస్య మెఱింగినవారుఁ దమకు సంభవించు సుఖదుఃఖములకై నిమిత్తమాత్రులైన వారిని భూషణ దూషణ లొనర్పరు. కాబట్టి మన తండ్రినిగాని కైకతల్లిని గాని నిందించుట యజ్ఞానమూలకమగును. దైవయోగమును బ్రతిఘటింప నగునని నీవు భావించుచున్నావు. దైవయోగమనఁగా నేమి? సర్వేశ్వరుని శాసనమని కొందఱు తలంతురు. అది కేవలము ప్రమాదము. సర్వేశ్వ రుఁడను పరతత్త్వము నిష్క్రియానిరంజన నిర్వికార శుద్ధబుద్ధస్వరూపమై యుండును. అట్టి దాని కిట్టి కార్యము లంటగట్టరాదు. దైవయోగ మనఁగాఁ బ్రారబ్ధకర్మవిశేషమని గ్రహింపుము.

"కం॥ వినుఁ పూర్వకర్మ ఫలములు,
దనకు వశమ్ముగాక పొందుఁదఱితో వానిం,
గనుఁగొన నేరక మూఢుఁడు,
దన కాపద్ధయ్యెనఁగోట దైవము మూఁకన్."

"తే॥ కార్యఫలములయెడఁ దాన కర్తననుట,
కడుసెఱుంగమిఁజువ్వె, దాఁగర్తయేని,
తగిలితనదైనకార్యజాతంబుసెల్లఁ,
జెడక ఫలియించునట్లుగాఁజేయరాదె?"

సీ॥ నీతిమంతులు ధర్మనిరతులు దతులు
నగువారు సేయుకార్యములు గొన్ని
సిద్ధిఁబొందవు దుష్టచిత్తులుఁగ్రూరులై
చేయఁగొన్ని విశేషసిద్ధిఁబొందు
నూరకయుండంగ నొందుఁగొందఱు విపు
లార్థముల్ గొందతాయాసపడియు
నిష్ఫలారంభులై నిలుతురు కొందఱు
పేదవారికిఁబ్రజ పెల్లువొడము.

తే॥ నర్థవంతులు కొందఱు కర్థి నధిక
దానములు ధర్మములు సుత్రతములుఁజేయఁ
బ్రజలుపుట్టరు వినుమట్టి భంగిసుమ్ము
కర్మఫల మాత్మ తంత్రంబుగాకయుండు.

"కం॥ పురుషుఁడు కర్మాధీనత,
నరుగక దనవశము యనిన నాపదలు రుజల్,
మరణంబును నివియేమియుఁ,
బొరయకయుండంగ బోలదె చెపుమా?"

తమ్ముఁడా! వేయిమాటలేల?

ఉ॥ కర్మమునన్ జనించును జగంబులు కర్మమునందు నిల్చు న
క్కర్మమునందెడిందు మఱికర్మగతిన్ నిలుపంగరాదు త
స్కర్మమెఱింగి ధర్మమగుమార్గమునం జరియించుచుండినన్
నిర్మలనిత్యసంపదలు నిక్కముగాఁ దుదిఁగల్గు జీవికిన్.

"ఆ॥ కర్మవశతఁజూవె కలుగుదేహము
దేహవర్తనంబు కర్మవశతఁబుట్టు
దేహపాతమైనదేహుఁడగుజీవుఁ
డరుగుఁ గర్మవిహితమైనయెడకు."

రాముఁడట్లు వచింపఁగా లక్ష్మణుఁడు తలవంచి సమగ్రముగా విని బొమముడివెట్టి బిలస్థకుపితసర్పంబువలె నిశ్వసించుచుఁ గ్రుద్ధసింహంబు పగిది భయంకరవదనుఁడై హస్తాగ్రము విదిల్చి తలపంకించి, 'అన్నా! సమస్త నీతులెఱింగియుఁ బ్రమాదపడుచున్నావు. క్షత్త్రియాగ్రణీ!

భ్రాంతి నిన్నుఁ బైకొనె ననకతీఱదు. కాదేని దైవబలంబు నొక బలంబుగా నుగ్గడింతువా? స్వతంత్రశక్తి లేని దీనులు దాని నాశ్రయింప వచ్చుఁగాక; మనబోంట్లకుఁ దగదు. పౌరుషసాధ్యములుగాని కార్యములు గలుగవు. ఆ సంగతి యటుండనిమ్ము. ధర్మవ్యతిక్రమము దగదంటివి. కైకేయీ దశరథుల యీ వ్యూహము ధర్మబాహ్యమగునేని వారినూట నేయుట దోసమేగదా? ఆత్మాభీష్టసిద్ధికై యీమాయావులు ధర్మదేవతల వలె సీయెడ నింతకాలము నభినయించిరి. ఆ మంత్రరహస్యము నెఱుంగక వారిపన్నిన వలలోఁ జిక్కితివి. కతయెల్లఁ జక్కగా విమర్శించి చూడుము. తోఁడు వరము లిచ్చి యేండ్లు పూండ్లుఁ గడచెను. నేటి దనుకఁ దత్ప్రసక్తియే గలుగదు. నేఁడు హఠాత్తుగా నీ పట్టాభిషేక నిమిత్తమై యవి పొడసూపనేల? ఇన్నాళ్ళు వలవని వరములు నేఁడు కోరనేల? మతియు నాఁ డిట్టివరములని కోర లేదు. కోరదగినవెన్నో గలవు. ఇప్పుడీ రెంటినే కోరనేల? వానికి రాజు సమ్మతింపనేల? సత్యసంధుఁడందువా? ఈ వరములని నాఁడుచెప్పి నేఁడులేదన్నచో మాట తప్పుటగును. అట్టిదేదియు లేదు. కావున నిందు బొంకనుమాటకే యవకాశము లేదు. సత్యవ్రతము సర్వత్ర వర్తింపవలదా? ఇట్టివని కోరని రహస్యవరములను గాదనుట యసత్యమైనచోఁ బట్టబగలు సభాంతరాళమున రాజర్షులమ్రోల నీకుఁ బట్టముఁ గట్టుమునని విస్పష్టముగా నాడినమాటలు తప్పుట యసత్యముగాదా? అన్నా! అమాయకుఁడవు నీకిట్టి కుత్సితములు గోచరింపవు. ఇఁకనైనను గన్నులెఱుచి చూడుము. సత్యాసత్య విచారమటుండనిమ్ము. ధర్మశాస్త్రమును బరిశీలింపుము. రాజ్యము జ్యేష్ఠక్రమాగతమని శాస్త్రములు ఘోషించుచున్నవి. మన కులాచారముగూడ నట్లేయున్నది. నీవు పెద్దకుమారుఁడవు. నిన్ను గాదని భరతునకుఁ బట్టముగట్టుట శాస్త్రవిధికారమును గులాచారవిరుద్ధమునై యున్నది. ఈ నీతి ధర్మనిరసనముగదా? రాజుగారి ధర్మబుద్ధి యేది? దీనికేమి సమాధానముఁ జెప్పెదవు? భ్రాంతి పక్షపాతంబులు నీమనోదర్పణంబును గప్పియున్నవి. అన్నా! నీవు నవనీతహృదయుఁడవు. ఈ సంగతి తెలిసి మూఁడుగాళ్ళ ముసలి యాడినది యాటగానున్నది. ఇది సహింపరాదు. ఎదయిచ్చి పల్కితిని; క్షమింపుము. అధర్మంబునకు ధర్మకవచమును గూర్చినంతనే లోకము మోసపోవదు. వినశునిమాటకు విలువ లేదు. అన్నా! ఆజ్ఞయిమ్ము; దిక్కాలు రేకమైవచ్చినను ముల్లోకంబు లడ్డగించినను నా నిశ్చయము

మాఅదు; ఏ పాపాత్ముల దుర్వ్యూహము నీకుఁ జతుర్దశవార్షిక వివాస శిక్ష విధించెనో యా వ్యూహమును దాఅుమాఱొనర్చి యీ శిక్షకు హారినే పాత్రులగా నొనర్తును. ఏ దురాశాపిశాచము హఠాత్తుగా నుద్భవించి నీ మంగళంబునకు విఘాత మొనర్చెనో యా పిశాచంబు నుగ్మూలించి వత్తు. ఇక్ష్వాకురాజ్యంబు వర్షసహస్రపర్యంతము భవ దృక్తమై నీ పుత్త్రీయ త్తమగుఁ గాక. అన్యథాకరణ మెంతమాత్రముఁ బొసగదు. రాజ్య విభ్రమంబును శంకింతువా? నేనుండఁగా నీ కట్టి శంకయే వలదు. నీకెట్టిభంగము గలిగినను నేను వీరలోక దూరుఁడ నగుదు. చేయితట్టి బాసచేయుచున్నాను. పట్టాభిషేకమునకు సమ్మ తింపుము. నా యీ భుజాదండంబులు ధనుర్ధరణార్థముగాని శోభార్థము గావు. ఎదిరించు విరోధుల శిరోధులు గగనచరభూతంబులకు విందగుఁ గాక. బద్ధగోధాంగుళిత్రాణుఁడనై శరసంధాన మొనర్చి నిల్చిన నన్ను డీకొను మేటియెవఁడో రానిమ్ము. నా యస్త్రంబులకు నాటవిడుపగుఁగాక. దీనజనాభినందనంబులును ధర్మశరణ్యంబులు నైన నా బాహువుల కండూతి భవదభిషేకమంగళ విఘ్నకారుల ముండనంబులను చెండాడుట వలనఁ దెమలుఁగాక. అన్నా! నీ కింకరుఁడు నీ యాజ్ఞకు వేచియున్నా' డని రౌద్ర ముప్పొంగఁ బలికెను.

రాముఁడు లక్ష్మణుని శాంతి పఱచుట

రాముఁ డా రోషభీషణవచనంబులు విని, 'సౌమిత్రీ! పరమ సౌమ్యునకు నీకిది తగదు. ధర్మతత్వము సూక్ష్మాతి సూక్ష్మము. అత్యంత పరిశుద్ధాంతఃకరణమునకు మాత్రమే యది స్ఫురించును. రజస్తమో గుణంబులు దాని పొడగూడఁ గాననేరవు. అతిదీర్ఘతపఃఫలంబుగా సత్త్వశుద్ధిని గాంచిన మహర్షులు మహోస్వచ్ఛంబులైన తమ యంతఃకరణంబులకు నవ్యగ్రస్థితియందు స్ఫురించిన యర్థంబులను లోక సంగ్రహార్థము శాస్త్రీకరించిరి. ఆ యర్థంబులు లోకవాసనావిహ్వలులకు గోచరింపవు. లౌకికదృష్టితో వానిని విమర్శించి యిచ్చవచ్చినట్లు వర్తింపరాదు. ధర్మజ్ఞుల యాదేశమును జవఁదాటఁజాలను. ఇంతకన్న సత్పథము నాకుఁ గలుగదు. వత్సా! నీవును దాత్కాలికములు నవిమర్శపూర్వకములు నైన నీ కోపదుఃఖఃఖంబులను మాని పెద్దలమాట యవధరింపుము. అహంకారమమకారము లిన్నిభ్రాంతులను గలిగించు చుండును. ఆ శత్రువులను జయింతువేని యజాతశత్రువుగా నుందువు' అని హిత ముపదేశించెను.

కౌసల్యాదేవి పుత్రుని దీవించి పంపుట

కౌసల్యాదేవి తన పుత్త్రుని మనోనిశ్చయమువిని దుఃఖాక్రాంతయై, 'కటా! ఏమిసేయుదు? పుట్టువుదొట్టి దుఃఖమెఱుఁగడు; ఎన్నడును ధర్మమెడయఁడు. అట్టి నాకూనకు నేడిట్టి విపరీతావస్థ సంప్రాప్తమయ్యెను. ఎవని మురిపెంబుల నేను ప్రొద్దుపుచ్చుచుందునో యట్టి నా ముద్దుసుతునిబాసి యుండుటయ్యెను. ఇష్టమృష్టాన్నములు భుజించు నా పట్టి రాలినధాన్యకణంబు లేరి బ్రతుకుటయ్యెను. అహహా! దైవము దురాధర్షమనుట నేఁడు గ్రహించితిని' అని పెద్దయుండడవు లోలోనఁ జింతించి, 'కుమారా! దుఃఖవిలాపంబులనెడిసమిధలు పేర్చి వియోగాగ్నిఁ జొనిపి, కన్నీరుఘృతము వోసి, చింతాధూపముఁజేపి, నీయపర్యనంబనెడి మారుతుఁడు, హిమాత్యయంబున లతాగృహంబును జిత్రభానుఁడు వోలె నన్ను సంప్రాణంబుగా దహించుచున్నాఁడు. వత్సా! నిన్నువిడిచి మనఁజాల; నీ వెంట నత్తు; ఇదేని సమ్మతింపు' మని యురియాడుచిత్తంబుతో వాపోవసాగెను.

రామ:- తల్లీ, నీవు నా వెంట వత్తునంటివి. నాయనగతి యేమి? మన మిద్దఱము చస్నచో నా తండ్రి జీవింపఁడు. వానికి దిక్కులేని చావు గలుగును. కావున నీవు వానిని వదలి రాఁజనదు. మఱియు నెట్టియాపదలువచ్చినను సతి తన పతిని బాయరాదు. ఇదియే స్త్రీలకు నుత్తమోత్తమధర్మము. పతినివదలి నావెంటవత్తువేని ధర్మదూషితవై లోకనింద నొడికట్టుదువు. ఈ పని కలనైనఁ దలఁపవలదు. అమ్మా, పతిసేవయే నీకుఁ బరమధర్మము; ఒండు స్మరింపకుము.

కౌస:- నాయనా! దుఃఖము నన్ను దరిగొనుచున్నది. అయినను నీకు బదులాడఁజాలను.

రామ:- తల్లీ, రాజాజ్ఞను మనము తలతో నహింపవలయు. దుఃఖింపవలదు. ఈచోడువత్సరములు తెప్పపాటులోఁ గడపి మఱలవచ్చి నీయిష్టప్రకారము వర్తింతును.

కౌస:- నాయనా! పదునాలుచేండ్లు సవతిదండ నుండఁజాలను. ఇన్నాళ్ళు నిన్నుఁజూచుకొని యెట్లో గడపితిని. దుర్భరమైన యీ వ్యసన కుండమున నన్నుఁ గ్రాచుటకన్న నీ వెంటఁగొని పోరాదా? నా

వలన నీకెట్టి శ్రమయుఁ గలుగదు. జీవితశేషమును నీతోడఁ బుచ్చి చనుదు.

రామ:- తల్లీ, నీ వెఱుఁగని ధర్మము గలుగదు. నీవు నాపెంటనుంట నాకెంతో సుఖమగుగాని శ్రమముగాదు. ఆత్మసౌఖ్యార్థమై ధర్మవ్యతిక్రమ మెనర్పరాదుగదా. స్త్రీకి భర్తయే పరమాశ్రయము. పతిని వదలివచ్చుట స్త్రీలకు ధర్మవిరుద్ధము. అట్టిదానిని నేనెట్లు ప్రేరేపింపనోపుదు? మఱియు నీపతి సుఖముగానున్నాఁడు. వానికి నీయెడ నత్యంత ప్రేమాదరములుగలవు. కావున వాని వలన నీకెట్టి యెగ్గు గలుగదు. భరతుని శంకింతువా? వాఁడు ధర్మాత్ముఁడు. సర్వభూత ప్రియుఁడు. మాతృభక్తితో నిన్నతఁడు రక్షించును. సవతికి వెఱతువా? ఆమె నిన్నేమియుఁ జేయఁజాలదు. ఆమె తన కొడుకుచెవిఁ గఱచునందువా? చెప్పుడు మాటలకు భరతుఁడు చెవియొగ్గఁడు. అమ్మా, ఎందును నీకు భయము గలుగదు గావున నీతలంపుమాని పుత్రవియోగదుర్విపాకంబునకుఁ బొక్కుచున్న నాతండ్రి నుపచరించు చుండుము. తల్లీ, వానినెట్లు కాపాడుదువో? ఏమఱితివేని నాయన శోకంబునఁ జివికి మడియుట సిద్ధము. వ్రతోపవాసంబులు పెక్కు సలుపును గాక; ఉత్తమురాలను గీర్తిని గడించుగాక; పతి ననుసరింపదేని యా స్త్రీ పాపిష్ఠురాలగును. దేవద్విజాది పూజలొనర్పకున్న నుండుఁగాక; భర్తృ శుశ్రూషాపరతంత్రయగు నేని యా స్త్రీకి స్వర్గము స్వతస్సిద్ధము. ఇది సత్యము. ఇంతకన్న శిష్టాచారము స్త్రీలకుఁ గలుగదు. సత్యమును బహిష్కరింపక శ్రుతిస్మృతులను దూఱక, శిష్టాచారమును నిగ్రహింపక, నామాట మీఱక నీవిందేయుండి నాశుభార్థము దైవపూజా హోమాదులొనర్చుచు బ్రాహ్మణోత్తములను వివిధ దానముల చేత నారాధించుచు నియతాహారవ్రతవై పతిసేనఁ దవిలి యుండుము. నేను వచ్చునందాక నాతండ్రి సుఖముండునేని నీకు సమస్త శుభంబులుఁ జేకూఱును. ఒండు తలంపవలదు.

రాముఁడట్లు పలుకగాఁ గౌసల్యాదేవి వాని నిర్ణయమును గ్రహించి, 'పుత్రా! ఎంత బ్రతిమాలినను నీదీక్షను మానవు. నిన్ను మరలింప బ్రహ్మకుఁ గూడఁ దరముగాదు. ఇంతకుఁ గాలమే కారణము. అది దురత్యయము. నాయనా! పితృవచనమును బాలించి తండ్రి

ఋణముఁ దీర్చికొనిరమ్ము. ఎందును నీకు భద్రము లేయగుఁ గాక. (అని యాచమించి వచ్చి) వత్సా! పదునాలుగేండ్లు చన్నంతనే మరలిరమ్ము. సత్పథము నెంతమాత్రము వదలకుము. నాయనా! ఇట్లు వనవాసము చనుచున్న నీ కేమి యిచ్చిపంపనగునో యూహింపరాకున్నది. దారి బత్తెములన్నచో నీ వనవాసము పదునాలుగేండ్లుగావున నంతకాలము చెడకుండు పదార్థము గలుగదు. ధనమిత్తునా యనిన సర్వధనమును వర్జించి చను నీవు దాని నొల్లవు. కావున నా యియ్యదగిన దేదియుఁ గలుగదు. దేనికి సేగిగలుగదో, ఏది సమస్త స్థితికిమూలమై యుండునో, దేని సంరక్షణార్థము నీవు వనవాసవ్రతమును స్వీకరించితివో, ఏది గలిగియున్న సర్వముఁ గలిగియున్నట్లే యగునో, యా ధర్మము నీయందు నిరంతరము సమృద్ధమై యుండుగాక. ఏ ధర్మంబును నీవు పరమ నియమ సంతోషంబులతోఁ బాలింతువో యా ధర్మమే నిన్ను రక్షించుఁగాక. ఏ యే దేవతలకు నీవు నిత్యముఁ జతుష్పథ దేవాలయములందు నమస్కరింతువో యాయా దేవతలు నిన్ను మహర్షి సహచరుని వనాంతరములందు సర్వవిధములఁ గాపాడుఁగాక. విశ్వామిత్రమహర్షి యనుగ్రహించిన యా దివ్యాస్త్రంబులు సర్వకాల సర్వావస్థలయందు సద్గుణ సంపన్నుని నిన్నుఁ బ్రోచుఁగాక. కుమారా! నీ మాతాపితృ సేవలును నీ సత్యవ్రతమును, నిన్నుఁ గాచుఁగాక. వత్సా! సమిత్కుశపవిత్రంబులును వేదికలును దేవాయతనంబులును స్థండిలంబులునుఁ బర్వతంబులును లతాతరుగుల్మంబులును నదీనదహ్రదంబులును గ్రిమికీట సరీసృపంబులును బతగపన్నగంబులును సిద్ధసాధ్యవిద్యాధరులును విశ్వదేవతలును మరుత్తులును మహర్షులును నీకు మంగళంబులు గూర్చుఁగాక. ధాతయు విధాతయుఁ బూషయు భగుఁడు నర్యముఁడును నీకు శుభంబులఁ బ్రతిపాదింతురుగాక. ముహూర్తంబులును దివారాత్రంబులును బక్షమాసంబులును ఋతుసంవత్సరంబులును నీకు జయంబు లనుగ్రహించుఁగాక. స్మృతియు ధృతియు నెల్లప్పుడును నీకుఁ బలుకుతోడై యుండుఁగాక. స్కందుఁడును సోముఁడును బృహస్పతియు సప్తర్షులును నారదుఁడును నెల్లవేళల నీకు భద్రకరు లగుదురుగాక. దిగ్దిగీశ్వరులు నా స్తుతులకుఁ బ్రసన్నులై నిన్నుఁ గాననాంతరంబుల నొముదురుగాక. కులగిరులును సముద్రంబులును రవి చంద్రగ్రహ నక్షత్రంబులును సంధ్యలును నిన్నుఁ బాలించుఁగాక. గగనలక్ష్మి తోడునీడయై నిన్ను కాచియుండుఁగాక. రత్నగర్భయగు ధాత్రి నా పుత్త్రరత్నంబును

నిన్నుఁ గడుపుపదాచి కాపాడుఁగాక. కళాకాష్ఠలు నీకు సుఖమిచ్చుఁ గాక. రక్షఃపిశాచక్రూరమృగంబుల వలనను వృశ్చిక దంశ మశక ప్లవగంబుల వలనను ఋక్ష మహిష గజ సింహ వ్యాఘ్రంబుల వలనను నీకు బాధ గలుగకుండుఁ గాక. నీ నడచుమార్గంబులెల్ల నీకు శివంకరము లగుఁగాక. నీ పరాక్రమంబునకు నెదురు లేకుండుఁగాక. ఎందును నీకు మంగళమే యగుఁగాక. శత్రువులు సయితము నీకు శుభదాయులే యగుదురుగాక. నాయనా! ఉపసర్పణకాలంబున వాయ్వగ్ని ధూమంబులును మహర్షిదత్తమంత్రంబులును నిన్నుఁ గాపాడుఁగాక. శ్రీమన్నారాయణుఁడు నీకు సదా సాక్షాత్కరించుచుండుఁగాక.'

అని పెద్దయుఁదడవు సుతుని దీవించి, వివిధస్తోత్రపూర్వకంబుగా దేవతలను గంధమాల్యాదులతో నర్చించి కుమారమంగళార్థము యథా శాస్త్రము హోమము చేయించి హవిశ్శేషంబున బాహ్యబలిఁగావించి దదిమధుఘృతాక్షతలతో స్వస్తివాచ్యమును జెప్పించి, పట్టీ!

యన్మంగళం సహస్రాక్షే సర్వదేవనమస్కృతే।
వృత్రనాశే సమభవత్తత్తేభవతు మంగళమ్॥

యన్మంగళం సువర్ణస్య వినతాఽకల్పయత్పురా।
అమృతం ప్రార్థయానస్య తత్తే భవతు మంగళమ్॥

అమృతోత్పాదనే దైత్యాన్ఘ్నతో వజ్రధరస్య యత్।
అదితిర్మంగళం ప్రాదాత్తత్తే భవతు మంగళమ్।

త్రీన్విక్రమాన్ప్రక్రమతో విష్ణోరమిత తేజసః।
యదాసీన్మంగళం, రామ! తత్తే భవతు మంగళమ్॥

ఋతవస్సాగరా ద్వీపాః వేదా లోకా దిశశ్చతే।
మంగళాని మహాభాహో! దిశంతు శుభమంగళాః॥

అని యాశీర్వదించి వానియూదల నఱుత లుంచి సుగంధమును దనువెల్లనలఁది సిద్ధార్థయైన యోషధిని విశల్యకరణి యనుదానిని రక్షగా వానిచేతికిఁగట్టి యభిమంత్రించి, దుఃఖవివశభావయయ్యు సంతోషంబును వాజ్మాత్రంబునఁ జూపుచుఁ, బైకొనుచున్న తొట్రుపాటును సమదాయించుకొని యతని శిరమును మూర్కొని వానిని గవుంగిటఁ గూర్చి, 'వత్సా! సర్వార్థసిద్ధిని బడసి సుఖంబుగా నయోధ్యకు నీవు మఱలివచ్చి రాజ్యాధిపత్యమును వహింపఁగాఁ జూతుఁగాక. నాకును నాకోడలైన సీతకును గోర్కెలు దీర్తువుగాక. ఎల్లభూతంబులును నిఖిల దేవతలును

నీకుఁ బరమ శుభంబులు గూర్చుఁ గాక. పోయిరమ్ము' అని పలికి, రక్షార్థము వానికిఁ బ్రదక్షిణ మొనర్చెను. రాముఁడు తల్లిపాదంబుల వ్రాలి యామెకుఁ బలుమాఱు ప్రమొక్కి తదనుజ్ఞాతుఁడై యందుండి తరలి సీతామందిరంబునకుఁ జనెను.

సీతా పతిభక్తిపరీక్ష

అట సీతాదేవి దేవతాపూజలొనర్చి, రాజధర్మజ్ఞ గావునఁ బతికిఁ బట్టాభిషేకానంతరము వలయు సామగ్రినెల్లఁ జేకూర్చి వానిరాక నిరీక్షించుచుండెను. రాముఁడట్లు తల్లిని వీడ్కొని సమలంకృతమును హృష్టజనసంకీర్ణమునైన తన యర్ధాంగి మందిరంబును లజ్జచేతంబోలెఁ దలవంచుకొని ప్రవేశించెను. వైదేహి తన పతిరాక విని యెదురేగెను. సీతను గాంచినంతనే రామునకు నిలువెల్లఁ జెమర్చెను; వాని మోము వెలవెలఁబాఱెను. అతని నయనగోళంబులు బాష్పపూరితములాయెను. హృదయేశ్వరుని విలక్షణంబులకు జానకి వెఱఁగంది విహ్వలయై, 'నాథా! బృహస్పతిదేవతాకంబైన పుష్యనక్షత్రము సమీపించెనని ప్రాజ్ఞులు వచించిరి. పట్టాభిషేకకాలము ప్రత్యాసన్నముగదా. ఇట్టి మంగళ సమయంబున మీ ముఖమండలము వైవర్ణ్యమొంది యంతస్తాపంబును దెలుపకయే తెలుపుచున్నది. కారణమేమి? శతశలాకంబును డిండీర తేజంబునైన ఛత్రంబు మీ వదనమండలంబు నాచ్ఛాదింపదు; చంద్ర హంస ప్రకాశ పరిహాసమానచారుచామరంబులు మీ యిరుపార్శ్వంబుల వీవవు; వేదపారగులగు బ్రాహ్మణులు మీ మూర్ధంబునఁ దీర్థోదకంబు లభిషేకింపరు; పుష్పరథంబును నీలాద్రింబోని భద్రగజంబును మీముందు నడువవు; ప్రియదర్శనా! రత్నకాంచనరచితమైన భద్రాసనము వీర పురస్కృతముగా నూరేగదు. అభిషేకమహోత్సవ మెంతగాఢమో యంతగాఢమైన వైవర్ణ్యము మీ మోమునఁ దోచుచున్నది. మీ యునికిని జూడఁగా నా ప్రాణంబు లెగయుచున్నవి. నాథా! ఈ విపరీతంబునకుఁ గారణమేమి?' అని వినయమధురంబుగాఁ బలికెను.

రామ:- ప్రేయసీ! బెగడు వలదు. పరమపూజ్యమగు వంశంబున జనించి తివి; మహాధార్మికుఁడైన జనకమహారాజునింటఁ బెఱిగితివి. నీకుఁ దెలియని ధర్మముండదు. ధర్మవ్యతిక్రమము నిరయమూలమగుట నీకుఁ గ్రొత్తగాదు. ధర్మపరిపాలనార్థము ప్రాణములనైన ద్యజింతుమనఁగా భోగభాగ్యముల సంగతి చెప్పవలయునా?

మటియు ధర్మాచరణంబునఁ బతికిసతి తోడగుట విధివిహితము. ఆ కారణముననే సతిని సహధర్మచారిణి యందురు. కావున నిప్పుడు నీ విధిని నీవు జంకుకళంకులు మాని నిర్వహింపుము. సంగతి వినుము. నా తల్లి కైకేయీదేవి తొల్లి నా తండ్రివలన రెండు వరములు పడసెను. ఆమె యీ వరముల నిప్పుడు కోరుచున్నది. రాజు సత్యమును దప్పరాదు; ఇచ్చిన వరములఁ జెల్లించి తీఱవలయును. తండ్రివాక్యమును బరిపాలించుట పుత్రునకు నుత్తమోత్తమ ధర్మమగుట నీకు విదితము. నా తండ్రి మాటఁ జెల్లింప నిశ్చయించుకొంటిని. నా తల్లి కోరినవరము లన్ననో మిక్కిలి యల్పములు. భరతునకుఁ బట్టముఁగట్టు మనియు నాకుఁ బదునాలుగేండ్లు వనవాసమును విధింపుమనియు నామె కోరెను. భరతుఁడు యువరాజుగా నియుక్తుఁడయ్యెను. నేను వనమునకుఁ బోవుచు నిన్ను వీడ్కొనవచ్చితిని. కళ్యాణీ! నా పరోక్షమున నీ వనుష్ఠింపనగు వర్తనక్రమమును వినుము. శ్రీమంతులు పరగుణ శ్లాఘనలు సహింపరు. కావున భరతుని మ్రోల నన్నెన్నఁడును బ్రశంసింపవలదు. నిన్ను నెక్కునఁగాఁ బోషింపవలసిన బాధ్యత వానికిలేదు. ఆ మాత్రంబున వానికడ నీ వుండనగును. జానకీ! భరతుని దశరథుని ననుసరించి వారి మదికెక్కి వర్తింపుము. అట్లు చేయుదువేని వారు నీ యెడఁ బ్రసన్నులై యుందురు. కాంతామణీ! మునిసేవితమగు వనంబు నకుఁ బోవుచున్నాను. వ్రతోపవాసంబులు మఱువవలదు; ఉషఃకాల దేవతారాధనంబులు మానకుము; దైవపూజానంతరము నా తలిదండ్రులకు నమస్కరించుట తప్పవలదు. వారికి ముదిమికిఁ దోడుగాఁ బుత్త్రవియోగసంతాపము దాపరించెను. వారెంతయు నగలింతురు. వారి నెట్లు నిన్మానింతువోగదా. తల్లులు ముగ్గురు నాకు స్నేహప్రణయరక్షణంబుల సమానులు గాని వేఱుగాదు. సుమిత్రయెడఁ గాని కైకేయియెడఁగాని యవినయంబునకు లేశమాత్రముగూడ నెడమీయవలదు. భరతశత్రుఘ్నులు నాకుఁ బ్రాణాధికులు; వారిని భ్రాతృమర్యాదలతోఁ బుత్త్రవాత్సల్యంబుతోఁ జూచుకొనుము. రాజులు రాష్ట్రంబునకేగాక కులంబునకుఁ గూడఁ బ్రభువులు. కులశీల మర్యాదలు మీఱక యుపసేవించు వారియెడ వారు ప్రీతు

లగుదురు. తదితరుల నాగ్రహింతురు. ఎగ్గుగావించెనేని మిత్రు నైనను ద్యజింతురు. హితమొనర్చినచో వైరినైనను మన్నింతురు. ఇవి యెఱిఁగి సత్యవ్రతవై యిందుండుము. జీవితేశ్వరీ! నా పోవునది క్రూరమృగాభీలమైన కీకారణ్యము; అటకు స్త్రీలు రాఁదగరు.

సీత:- నాథా! రాజపుత్త్రినినోట నిట్టి పేదమాటలు రాఁజెల్లునా? ఇవి విన్న నగరా? ఆర్యపుత్త్రా! ధర్మము మీకుఁ బరమానుష్ఠేయమంటిరి. అది కాదను వారెవరు? మీదుఁమిక్కిలి ధర్మము సర్వప్రాణులకుఁ బరమానుష్ఠేయము. ఇందు జాత్యాది భేదము గాని స్త్రీపురుష తారతమ్యముగాని గలుగదు. కావున మీకు వలె నాకుఁగూడ ధర్మానుష్ఠానము విధివిధానమై యున్నది. ప్రకృతము నే ననుష్ఠింపనైన ధర్మమేమందురా? నా పతిని వెంబడించుటయే యిప్పుడు నాకుఁ బరమధర్మము. మిమ్ములను మాత్రమే వనవాసంబునకు నాజ్ఞాపించి రందురా? భర్త నాజ్ఞాపించుట భార్యనుగూడ నాజ్ఞాపించినట్లే యగును. భార్య యర్థాంగి గదా. శరీరమందు సమభాగమును వదలి మీరు చన సాధ్యము గాదుగదా. తలిదండ్రులును గొడుకు కోడండ్రును నన్నదమ్ములును బరస్పరసంబంధ భాంధవ్యములు గలిగి యున్నను బుణ్యపాపఫలంబులగు శుభాశుభంబుల ననుభవించు విషయమున వారికిని భార్యాభర్తలకును మిక్కిలి తారతమ్యము గలదు. ఒండొరుల శుభాశుభంబులను వారు పంచికొనరు. భార్యాభర్తలన్నలో పరస్పర శుభాశుభఫలములను విభజించి కొని యనుభవింతురు. ఈ సంగతి మీకుఁ దెలియదా? ఈ కారణమును బట్టి గూడ మీ వెంట నేను రాకతప్పదు. మఱియు స్త్రీలు స్వతంత్రులుగారు. నునుదీవె బ్రాకునుబోలె సతి పతినిఁ బ్రాకి జీవించును. ప్రాపుతోలఁగినచో బ్రదుకు దుర్లభమగును. ఈ నిమిత్తమునఁగూడ మీరు నన్ను విడనాడరాదు. హృదయేశ్వరా! దుర్గమంబగు కీకారణ్యంబునకు మీరు చననున్నారు. అట్టిచోట తోడుండుట యత్యంతావసరము. సతికి మించినతోడు పతికిఁగలదా? నాథా! కుశకంటకావృతమై దారి నడువరాకుండును; మార్గమును జక్కఁ చేయుచు మీ ముందు నడతును. నా వలన మీకు లేశమాత్రముగూడ భారము గలుగ

నేరదు. ఫలమూలంబులతోడ జీవింతును; ఒండేమియుఁ గోరను. వీరాగ్రణీ! ఈర్ష్యాగోషంబులను బీతావశిష్టజలంబులఁ బగిదిఁ ద్యజించి నన్ను విశ్వసించి వెంటఁగొనిపొమ్ము. ప్రాసాదాగ్ర విహారంబులొండె విమానసంచారంబులొండెఁ దదన్యంబులొండెఁ బతిశుశ్రూషకన్న సతికి సుఖకరములు గావు. కళ్యాణసమయం బున నగ్నిసాక్షికంబుగాఁ బ్రాణమానశరీరంబులను మూఁటి మీ యందు లీనమొనర్చిన నాకు నేఁడు పృథగ్భావమెట్లు గలుగనోపు? సర్వకాలసర్వావస్థలయందు సతికిఁ బతియే గతి యని నా తలిదండ్రులు నాకు బాల్యమందే యుపదేశించిరి. వారి యుపదేశంబును మీఱరాదు. నాథా! అరణ్యము దుష్ట సత్త్వాభీలమంటిరి. అగుఁగాక; మీ రుండఁగా నాకు భయమేల? సర్వలోకరక్షకుఁడవు నన్ను రక్షింపలేవా? నాథా! నా మొఱ యాలకింపుము. మీతోడ వత్తును; మిమ్ము విడిచి త్రైలోక్యాధి పత్యమునైన నొల్లను. మీ సేవయే నాకుఁ జాలు; వేఱు తలంప కుము. పుట్టినింటనువలె మీ వెంట నెందేనియు సుఖముందును. బ్రహ్మచారిణీవ్రతనియతనై మిమ్ము సేవించుచు మధుగంధి పుష్పలంబులైన వనంబులందు మీ తోడ విహరింతును. పుణ్యనదీనదంబులను దుర్గమంబులగు వనంబులను మహోన్న తములైన శైలంబులను సందర్శింప నెంతో యుత్సహింతును. పూచిన తామరలతో ఛాయించకొదమలతో సొబగారు సరో వరంబులను మిమ్మొగూడి విలోకింపఁ దమకింతును. దివ్యతీర్థము లందుఁ దోయమాడ నాకుఁ బేరాసగలదు. నా యీ చిరాభి లాషను దీర్పుము. ఈ నెపంబున మనకుఁ దీర్థయాత్రాలాభంబు నకు నవకాశముఁ గలిగించిరి. దానిని వృథసేయకుము. అరణ్య వాసమందురా? ఏ వాసమైనను మీ సహవాసమున్నచో నదియే నాకుఁ బదివేలు. నాథా! అనన్యభావయు ననురక్తయు నైన మీ సీతను విడనాడ మీ రెట్లు తలంచితిరి? కాదని విడ నాడుదురా? మరణమే నాకు శరణమగును. ఇది సత్యము.

రామ:- అబలా, కార్యాకార్యవిచక్షణము వలదా? సాహసోత్సా హంబులకు వశము గావచ్చునా? అరణ్యవాసము క్లేశభూయిష్టము; సుఖమనుమాట యందుఁ గలుగదు. అట గిరినిర్ఝరధ్వానంబు లును గండశాంతర క్రూరమృగాక్రందనంబులును జెవులఁ

గీడ్వఱచుచుండును; ఘోరసత్త్వంబులు విచ్చలవిడి నాహారార్థము తిరుగాడుచుండును; నదులు మకరసంకీర్ణంబులై నీరాన రాకుండును; దారులు కంటకలతానిబిడంబులై చొరరావు; కందమూల ఫలంబులు దక్క నొండేమియు దొరకదు; అవియు సమృద్ధంబులు గావు; నారచీరలు గట్టి జడలు దాల్చి యుప్పిండియుపవాసము లోర్చి రాలినపండుటాకులఁ బరుండనలసివచ్చును; పెనుగాడ్పులు దావాగ్ని దుస్సహములై బోరున వీచుచుండును; రాత్రులన్ననో యంధకారబంధురంబులై కన్నులొడిచికొన్నను గానరావు; ఏ ప్రొద్దు సరీసృపంబులు ప్రాకులాడుచుండును; మశకదంశంబులు నిద్రింపనీయవు; పిశితాశనార్థులై రాక్షసులు తిరుగాడుచుందురు. సఖీ! ఇన్ని కడగండ్లతోఁ నిండిన వనవాసంబునకు నీ వెట్లు తగుదువు? ఎండకన్నెఱుంగవు; అంతఃపురము దాట నేరవు; వీణాగానసంబులకుసుమితము విసువుదువు; నెచ్చెలులఁ గూడి యుందువు; లతామండపంబులను గూడ నొంటిగాఁ జొఱ వెఱతువు; హృష్టపుష్టాన్నంబులఁ గూడఁ గసిగాబుగా నారగింతువు; సుధారసంబుగూడ మెచ్చవు; హంసతూలికాతల్పంబుల గాని పరుండవు; చీనిచీనాంబరంబులు సయితము నీకు బరువుగాఁ దోఁచును; మలయమారుతంబునకుఁగూడ జంకుదువు; ఇట్టి సుకుమారిని నిన్ను గహనాంతర కఠిన క్లేశ పరంపరలకు నప్పగించుట మహాపాతకముగదా? అట్లుచేయ నా మది యెట్లొర్చును? ప్రేయసీ! నామాట విని యిందే యుండుము.

సీత:- నాథా! మీ సాన్నిధ్యంబున నివి యెల్ల గుణములే యగును. అమానుషంబగు మీ రూపంబును జూచి వెఱఁగంది పాఱిపోవక క్రూరసత్త్వంబులు నిలుచునా? భయమనునది జీవలోక సామాన్యము; ప్రాణంబు లన్నింటికిఁ దీపుగదా? మీరు చెంత నున్నంతకాలము రాక్షసాదులెవ్వరును నన్నుఁ బ్రధర్షింపఁ జాలరు. మఱియొకటిగూడ విన్నవింతును. నాకు వనవాసప్రాప్తి గలదు; జ్యోతిష్కులిట్లు వచించిరి; కొండొక తాపసియు నట్లే నుడివెను. కర్మఫలము తప్పదు; భోక్తవ్యంబునకు వెఱచి ఫలము లేదు. నాథా! నా యొనర్చిన యలఁతిసేవల ఫలంబుగా నా కీయభీష్టంబును బ్రసాదింపుము. జీవితేశ్వరా! మీ వెంట

వచ్చుటకు మఱియొక కారణముగూడఁ గలదు. ఇన్నాళ్ళు మీకు నా యొనర్చిన సేవలు సేవలుగావు. వీలయందురా? నగరములందుఁ గోరిన వస్తువులు సన్నద్ధముగా నుండును; వానిని దెచ్చి యందిచ్చుటకుఁ బరిజనము వేలకొలఁదిగలదు. అట్టి చోట్లఁ బతిసేవలు సతులకొక నేర్పుగాదు. నిర్జన వన ప్రదేశంబున ననన్యసాహాయ్యుఁడై యుండి మీ మదికెక్కఁ వర్తింతునేని నా జీవము సార్థమగును. అట్టి భాగ్యము నేఁడు నాకు సంప్రాప్తముగానున్నది. ఈ మహోదయంబును ద్రోచిపుచ్చకుము. మీ తోడి యునికియుఁ మీ పాదసేవయు లోకాంతరమునఁ గూడఁ గలుగఁ గోరుదును. ఈ యలఁతి వరంబు ననుగ్రహింపుము. మఱియు దాంపత్యము శాశ్వతము; మరణముగూడ దానికి భిన్నముఁ గలిగింపఁజాలదు; ఇది శ్రుతివచనము. నైసర్గికమైన యవినాభావంబునకు మీరు వినాభావమును గలిగింపఁజాలరు. అట్టి సంకల్పముగూడ నలదు. నాథా! దీనయుఁ బతివ్రతయు భక్తినిరతయునైన నీ యర్థాంగిని వెంటఁగొనిపోవ సంశయమేల? నా మొఱాలకింపరేని విషమో వీతిహోత్రుఁడో నాకు శరణ మగును.

రామ:- జానకీ! నీ మేలుగోరి యింతసెప్పితిని; హితవును నిరసింపరాదు సుమా!

సీత:- నాథా! మీ వచనంబులకు లజ్జాదుఃఖంబు లయ్యెడు. పురుష రూపమును దాల్చిన స్త్రీవగుట నా జనకుఁ డెఱుంగఁడు గాఁబోలు! ఎఱిఁగి యెఱింగి నన్ను మీ కిచ్చునా? నన్ను వెంటఁ గొనిపోవ మీ యరగలియేమి? మీ భయంబునకుఁ గారణమేమి? అనన్యశరణ్యను నన్ను విడువనేల? సావిత్రి యల సత్యవంతుని వలె నేను మి మ్మనుగమింతును. చెడిపనై కులంబును జెఱుపఁ బుట్టలేదు. భవదన్యునిఁ గడగంటనేనిఁ జూచియెఱుఁగని దానినిఁ జిరవాసినిని సౌమారిని నన్నుఁ జేతులార నొడులపంచఁ ద్రోసి చన మీకుఁ బాడియగునా? కౌసల్యాది గురుజనుల సేవార్థము నన్నిందుండు మనిరి. మీకును వారు సేవ్యులేగదా? మీరు మాత్రము వారినెట్లు వదలి చన నేర్తురు? అట్లు చేయుట ధర్మాతిక్రమము గాదా? నాథా! వేయేల? ఏ వాసమైనను మీ సహవాసము నాకు విధ్యుక్తము. గహనాంతరములని

వెఱవనలదు; మార్గశ్రమమగునని చింతింపవలదు. మీ వెంట వచ్చు నాకు సమస్తము సుఖావహమే యగును. కుశాదికంట కంబులు తూలికామార్దవములగును; పెంథూళిరజము చందన చర్చయగును, లేబచ్చికలు పట్టుతల్పంబులగును; చేతులార మీ యిచ్చు ఫలముగానీ, మూలముగానీ తుదకుఁ బత్రిముగానీ నాకు నమృతప్రాయ మగును. ఆ యాయా ఋతువులందుండు ఫలముల భుజించుచుఁ బుష్పములు ధరించుచు మీ చెంత సుఖ ముందును. నాభరణరక్షణంబులకై యీషన్మాత్రము గూడ మీకుఁ గాసిగలుగదు. యుష్మత్సహవాసమే నాకు స్వర్గము; మీ వియోగమే నాకు నరకము. మిమ్ముఁ బాసి దుఃఖాగ్నిఁ గ్రాగి చివికి చచ్చుటకన్న మీ పాదంబుల ప్రేమల నిప్పుడే యిందే యంతరింతును. నాథా! ఎవఁ డైన మీతోడిదే లోకంబుగా నుండునో, మీ యెడఁబాపు క్షణమయ్యు నెవఁ డెకు యుగాయతం బగునో, ప్రకృతిపురుషునింబలె నెనయై మిమ్ము సర్వకాల సర్వావస్థల విడనాడఁగో, విడనాడి జీవింపదో యట్టి యబలకు ననన్యశరణ్యకు నర్థాంగికిఁ జతుర్దశవర్షవియోగ క్రూరశిక్షను విధింపకుము. క్షేమస్థిఁ బ్రార్థింతును; నా విన్నపము గైకొని మీ వెంట రా నాకు ననుజ్ఞ యిమ్ము.

అందాఁక సీతాహృదయాంతఃస్థమై యరణియందు నగ్నివలె నున్న తదీయ దుఃఖ మంతట వెలికిఁ బ్రాకెను. బాష్పధారలవలనఁ గాటుక జిడ్డూడిన యామె నయనంబులు స్ఫటికంబులబోని బిందువులను వర్షింపసాగెను. ఆమె మోము కన్నీటఁ దోగిదోగి నీటిఁ బాసిన కమలంబును దోపించెను. న్యసనము మహోద్వేగమగుటంజేసి యామె పట్టూడి రాముని పయి వ్రాలి వానిని గవుంగలించుకొని బిగ్గయేడ్చి మూర్ఛనొందెను.

రాముఁడు ప్రియురాలిని బొదివిపట్టి తన చేలాంచనంబున నామె కన్నీరు తుడిచి సేదఁదేర్చి, 'దేవీ! దుఃఖింపవలదు; నీ వొల్లవేని నాకంబునుగూడ దిగనాడుదు. నీ కెట్టి యప్రియంబును జేయనోపను. భయంబున నట్లాడితినని తలంపకుము. నాకును భయమా? నీ తలఁపుఁ దెలియ నట్లువర్తించితిని. నీ నిర్ణయమును దెలిపితివి. మానవంతుఁడు కీర్తినట్లు నేను నిన్ను విడువను; ఈ మాట నిక్కము. సాధ్వీమణియైన సువర్చల సూర్యునట్లు నీవు న న్ననుగమించుట పరమ ధర్మము; జనక

నందినీ! తండ్రియాజ్ఞ నన్ను వనమునకుఁ దోలుచున్నది. జనకునిపంపు సేయుటకన్న మిన్నయగు ధర్మము సుతునకుఁ గలుగదు. క్లేశవశమున నేని మతి యేకారణముననేని ధర్మపరిత్యాగము సజ్జనలక్షణముగాదు. తల్లిదండ్రులును గురువులును మర్త్యులకుఁ బ్రత్యక్ష దేవతలు. దైవ మన్ననో యదృశ్యము. అదృశ్యము నారాధించుట క్లేశతరము. దృశ్యదేవతలైన మాతాపిత్రాదుల యారాధనము సుకరమును సులభ ఫలప్రదము నై యుండును. ఆ కారణంబున నా తండ్రిని దదీయవాక్య పరిపాలనరూపంబున నారాధించుచున్నాను. పితృసేవవలనఁ గలుగు పరలోకప్రాప్తి సత్యదానాదులవలనఁ గలుగుఁగదా యని శంకింప వచ్చును. అవియుఁ బరలోకప్రాప్తికరములే. అయిన నట్టివెల్ల నిర్వ్యాజ పితృసేవయం దంతర్భూతములు. ఆముష్మికంబునకుఁ బితృసేవకన్న సులభమార్గము గలుగదు. పితృపరాయణులకు బ్రహ్మలోకము సయి తము కరస్థమై యుండును; తక్కినలోకంబుల సంగతిచెప్పనేల? కళ్యాణీ! ధర్మార్థము స్వాత్మార్థము లోకార్థము దండకారణ్యప్రస్థానంబును గ్రహించితిని. ఏకాకిఁగాఁ జన నుద్దేశించితిని. నన్నుఁ దలిరా నిశ్చ యించుకొంటివి. ఇఁక దప్పదు. సుకుమారీ! వనవాసంబునకుఁగా సృజింపఁబడితివా? సహధర్మచరీ! రమ్ము నా వెంట; నీ వలన నుభయ వంశంబులు శోభిల్లెను. ప్రాణేశ్వరీ! ఇదిసుత నీ రాముఁడు నిన్నెడసి స్వర్గమేనియు నిచ్చగింపఁడు. రత్నదానంబులచేత బ్రాహ్మణులను మృష్టాన్నంబుల భిక్షుకులను దనిపి కోరినవారికిఁ గోరినది యిచ్చి విశిష్టంబులైన వస్త్రాభరణాదులెల్ల నీని నావి యనక సమస్తము భృత్యులకు నొసంగి ప్రయాణమగు' మని పలికి యామెను శోకంబువలన వారించెను. సీతాదేవి తనహృదయసంతాపము పతివచనామృతంబునఁ జల్లారగా మహానందమొంది ప్రయాణోన్ముఖ గాసాగెను.

లక్ష్మణుని పట్టుదల

రాముఁడట్లు సీతాదేవిని వీడ్కొని యందుండి వచ్చెను. లక్ష్మణుఁ డందాఁక యాగది వెలుపటనుండి వారి సంవాదమునెల్ల వినుచుండెను. రాముఁడు గది వెడలి వచ్చినంతనే లక్ష్మణుఁడు వాని చరణములపయి వ్రాలి, 'అన్నా! నానామృగాకీర్ణమగు వనంబునకుఁ జన నిశ్చయించితిరి. ధనుర్ధరుఁడనై మీ వెంట నంటియుందు. నా వచ్చుట మీ సంచారంబు లకు నెంతయు సౌకర్యముఁ గూర్చును; అన్నా! నిన్ను వదలియుండ నోపను. నా మనవి నిరాకరింపవల'దని దృఢభక్తిపూర్వకముగా

విన్నవించెను. సౌమిత్రి విజ్ఞాపనమును రాముఁడు విని, 'లక్ష్మణా, నీ వెంతయు సాధుహృదయుండవు; నీ ధర్మనిరతి నాకుఁ గ్రొత్తగాదు; వీరాగ్రణివి; నాకుఁ బ్రాణప్రియుండవును వశ్యుఁడవు నగుటయేగాక తమ్ముఁడవై యున్నావు. అట్టి నీవు నా వెంట నుండుట నా కెంతో మేలుగదా. కౌసల్యాసుమిత్రలను గూర్చి తలంచితివా? నీవును నా వెంట వత్తువేని వారికి దిక్కెవ్వరు? ధాత్రికిఁ బర్జన్యుండువోలె వారికి నీప్సితంబుల వర్షించుటకు రాజు గలఁడందువా? తేఁడు కామపాశ వివశుండని నీవే చెప్పితివి. మన తల్లులు దుఃఖదుర్విదగ్ధులై యున్నారు. అశ్వసతిసుతవలన సనతిమర్యాదలను మాత్రమే వారు ప్రతీక్షింపనగును. భరతుండన్ననో తల్లిని మీఱరాదుగదా. నీ విందున్నయెడల మన వారికి నెందును గొఱంత గలుగనేరదు. ఆ కారణంబున నిన్నిందుండఁ గోరుదు. మాట వినుటయే భక్తిసేయుటగును. ధర్మజ్ఞునకు నీకుఁ జెప్పనేల? నా వచించిన ట్లొనర్పుము. భ్రాతృభక్తిఫలంబును గురుజన పూజారూపధర్మాచరణ సిద్ధియు నీకుఁ జేకూఁ' నని.

నాఁడు, 'అన్నా! నీ తేజస్సే సర్వముఁ జేయును, జేయించును. మన పరోక్షంబున మనతల్లులకెట్టి యవినయంబు గలుగునోయని శంకింప వలదు. కౌసల్యాదేవికిఁ బరరక్షణనేల? అమె వేయిభరతులను గాపాడఁ జాలుఁగదా. ఆమెయిచ్చిన యగ్రహారములె యీ సంగతిని శతముఖంబులఁ జాటుచున్నవి. ఆమెనుగూర్చిన చింతయే మనకువలదు. సేవకునిగాన న్ననుగ్రహింపుము; ఇందు ధర్మవిరోధములేదు. నా వలన మీకుఁ గొంత ప్రయోజనముండును. నేనును మీ వలనఁ బరితార్థుండ నగుదు. నా వలని ప్రయోజన మేమందువా? విల్లుపూని మీ వెంట నుందును; పుటికయు గుద్దలియుఁ దీసికొని మీ చనుత్రోవ చక్కఁజేయుచు ముందు నడతును; తపస్వియోగ్యములైన కందమూలాహారంబులు తెచ్చి యిచ్చుచుందును; జాగ్రత్స్వప్నావస్థలయం దెల్లఁ గనుఱెప్పవలె మిమ్ముఁ గాచియుందును; మీరు నిర్భయముగా గిరిసానువులందుఁ గ్రీడింపనగు' ననెను. ఆ మాటలకు రాముఁడెంతయుఁ బ్రీతుఁడై, 'వత్సా! అట్లే చేయుము; స్నేహితులను వీడొక్కనిరమ్ము. వరుణదత్తములైన దివ్యచాపకవచంబుల నక్షయతూణీర సాయకంబులను ఖడ్గ రాజంబును మన యాచార్యునింట నునిచితిమి; వానిని గొనిరమ్ము' అని పలికెను.

పెద్దలను బూజించి వీడ్కొనుట

లక్ష్మణుఁడు తోడ్తోడఁజని మిత్రులకు వీడ్కోలు పలికి కులగురువును వసిష్ఠుని బూజించి దివ్యాయుధములను గొనివచ్చెను. అంత రాముఁడు తమ్మునిఁ జేరఁబిలిచి, 'సౌమిత్రీ! నిన్ను మందలనుంచికొని నా సర్వస్వమును బ్రాహ్మణులకుఁ దపస్యులకు సమర్పింపఁ దలఁచితిని. వసిష్ఠపుత్త్రుఁడు సుయజ్ఞుని శీఘ్రముగాఁ దోడితెమ్ము; శిష్టబ్రాహ్మణులను రప్పింపుము. వారినెల్లఁ బూజించి వనమునకుఁ దరలుదము'అనెను. లక్ష్మణుఁడు చని యగ్నిహోత్రగృహంబుననున్న సుయజ్ఞునకు నమస్కరించి వానికి సంగతి వినిచెను. సుయజ్ఞుఁ డగ్నికార్యంబులు గావించి సౌమిత్రి వెంటఁ బోయెను. అట్లు వచ్చిన మిత్రునకు హుతవీతిహోత్రుని వలెఁ దేజరిల్లుచున్న సుయజ్ఞునకు రాముఁడు సీతతోడఁ బ్రాంజలియై ప్రదక్షిణ మొనర్చి వానికి రత్నరచితసువర్ణాంగదంబులును రమణీయ మణికుండలంబులును వజ్రమయ కేయూరకంకణంబులును నానారత్నంబులు నిచ్చెను. సీతాదేవి యంతతోఁ దనియక తన హారాదులను సయితము వాని భార్యకిమ్మని రామునిఁ బ్రేరేపించెను. దాశరథి యట్లు ప్రియా ప్రేరితుఁడై, 'మిత్రమా! రశనాహార హేమసూత్రంబులను, సాస్తరణంబును నానారత్నమయపర్యంకంబును వనవాసోన్ముఖ యీ సీత నీ భార్యకు సమర్పించుచున్న'దని వచించి యవి యిచ్చి, 'నా మేన మామ నాకు శత్రుంజయమను గజరాజంబు నిచ్చెను. దానిని మాతంగ సహస్రముతోడఁ గైకొను' మనెను. సుయజ్ఞుఁ డవియెల్లఁ బరిగ్రహించి సీతారామలక్ష్మణుల నాశీర్వదించెను.

ప్రదానములు

అంత రాముఁడు లక్ష్మణుని బిలిచి, 'అగస్త్యుని విశ్వామిత్రుని దోడ్కొనివచ్చి వారిని రత్నములతోఁ బూజించి గోసహస్రంబున సంతుష్టులఁ గావింపుము. కౌసల్యాదేవిని నిరంతరము శ్రద్ధాభక్తులతో దీవించుచుండు మైత్తరీయాచార్యుఁడు వేదవిదుఁడు గలఁడు. వానికిఁ తృప్తియగునందాక కౌశేయంబులును దాసీజనంబు నొసంగుము. సారథి చిత్రరథుఁడు మన తండ్రికిఁ జిరకాలప్రియుఁడు. ఉత్తమంబులగు మణులను ధనకనకవస్త్రంబులను వేలకొలఁది గోవులను సన్నజీవముల నిచ్చి వానిని దనుపుము. కఠశాఖీయులును గాలాపశాబ్దీయులును బలాశదండధారులునగు బ్రహ్మచారులు గలరు. వారు నిత్యస్వాధ్యా

యముచేత నివసింతురు; ఇంకొక పనికి నోపరు; సోమరితనము సుంత వారి నంటియుండును; మఱియు స్వాదుభోజనంబులు వారికి మహా ప్రియములు. ఎనిమిదిబండ్ల మఱులును శాలివాహసహస్రంబును రెండు వందల దుక్కిఱెద్దులును వ్యంజనార్థము వేయిగోవులు నిచ్చి వారిని సన్మానింపుము. నా తల్లి నాశ్రయించిన బ్రహ్మచారులు పెక్కుగలరు. వారి కొక్కొకరికి వేయి ధేనువులిమ్ము. లక్ష్మణా! అది యిది యని చెప్పనేల? కౌసల్యాదేవికి సంతోష మొదవునట్లుగా బ్రాహ్మణులను సమస్త విధములఁ బూజింపు' మని చెప్పెను.

భృత్యవర్గసన్మానము

లక్ష్మణుఁడు పోయి యన్నమాట ప్రకారమొనర్చి వచ్చెను. అంతలోనఁ బరిచారకులు కన్నీరునించుచు గుమిగూడి వచ్చి రాము నెదుట నిలిచిరి. అతఁడు వారిని బుజ్జగించి తజ్జీవనార్థము బహుధనమిచ్చి 'నా వచ్చుదాఁక నా యింటిని లక్ష్మణునియింటిని జాగ్రత్తతోఁ గాపాడుచుండు' మని చెప్పి పంపివైచి, ధనాధ్యక్షుని రావించి ధనమెల్లఁ దెప్పించి బాలవృద్ధ దరిద్రులపాలొనర్చి కోశమంతయు వ్యయించెను.

త్రిజటుఁడు

రాముఁడట్లు నిశ్శేషితకోశజాలుఁడై యుండఁగాఁ ద్రిజటుఁడను వగ్గుముదుసలి పేదపాఱుఁడు యౌవనవతియగు భార్యతోడను గసికందువులగు పుత్త్రులతోడను వచ్చెను. వాని మూపున గుద్దలియు గొడ్డలియు వ్రేలాడుచు నతఁడు కందమూలంబు లేఱితిని జీవించుటను దెలుపుచుండెను. రాముని దాతృత్వమును, ద్రిజటునిభార్య విని తన సతిచేతి గొడ్డలి లాగి పాఱవైచి, 'అయ్యా! ఆ రామునకు నీకుటుంబమును జూపుము. ఆ పరమధార్మికుఁడు చూపుతోడ నీ పేదతికమును గ్రహించి యేదేని యీయకపోఁడ'ని బలవంతపెట్టెను. అతఁడు పైగప్పు గుడ్డగూడలేక చింపిగోచితోడ వచ్చి రామమందిర ద్వారంబున నిలిచెను. వాని పేదతికము జాలిగొలుపఁగా ద్వారపాలకు లతని నడ్డగింపరైరి. ఆస ముందునకు శంకాకళంకములు వెనుకకు వాని నుట్టూత లూయసాగెను. ఆ బ్రాహ్మణుఁ డెట్టకేలకుఁ దెంపువహించి లోనికిఁ బోయి రాముని సందర్శించి, 'రాజపుత్త్రా! నిర్ధనుఁడను, బహు పుత్త్రకుఁడను, ఉంఛవృత్తి జీవనమయ్యెను.

ఉ॥ పూటకుఁగూడులేదు మఱిపుత్త్రికులన్నవి వేవురైరి నా
పాటవమేది నింట నెలప్రాయపుటింతిచిరాకుఁ జెప్పఁగా
మాటలుచాలవెందు నవమానమెదుర్కొనుచుండు నక్కటా!
కూటికిఁ గాలుచాచినను గాలుఁడుకొడను నేమిసేయుదున్.

అని మహాదీనస్వరమునఁ బలికెను.

రాముఁడు వానిని జూచి,

ఉ॥ ఎక్కడిబ్రాహ్మణుండవు మఱెచ్చటనుండితి వింతదాక నా
బొక్కసమెల్ల రిక్తమయిపోయెను నీకిపుడేమిచేతుఁ గా
సొక్కటియైనలేనితఱి నోయనివచ్చితి వేలనయ్య నీ
యక్కఱదీర్చు టెట్టులొగదయ్య ధరామరవంశశేఖరా.

భూసురోత్తమా! నిన్నుఁజూడ జాలియయ్యెను. అయినను నీకు నా చేతులాఱ నెద్దియు నిచ్చుట లేదు. అదిగో యాలమంద. నీ చేతి దండమును విసరివైచి అది పఱచునంత నేలలోని గోగణమును గొని పొమ్మని పరిహాసమునకో యనఁ బలికెను. త్రిజటుఁడు సంతసించి గోచి బిగించి నిగిడి తనచేతికఱ్ఱను సత్తువకొలఁది గిరగిరఁ ద్రిప్పి విసరెను. ఆ కఱ్ఱ సరయూతీరముదాఁటి చెక్కుచేవ గోవులకు నవ్వల నాఁబోతు ముందు పడెను. రాముఁడు త్రిజటుని గవుంగలించుకొని, 'విప్రవర్యా! నీ బలంబు నెఱుంగఁగోరి యిట్లొనర్చితి; కోపింపవలద'ని పలికి దండము పాఱినంత మేరలోని యావులనెల్ల గోపకులవలనఁ దోలి తెప్పించి 'ఆర్యా! అదిగో నీ ధనము; దానిని గొనిపొమ్ము. ఇంక నేదేని కోరుదువేని సంకోచింపవలదు; నా ధనమెల్ల బ్రాహ్మణార్థముగాని వేఱుగాదు; అది నీయట్టివారికిఁ జెంది సద్వినియోగమగుట నా కెంతయుఁ బ్రీతికర' మనెను. త్రిజటుఁడా మాటవిని, 'రామా! నీ యౌదార్యమునకు మేర గలుగదు. మఱేమియు నాకువలదు; సమస్తకళ్యాణములను బడయు' మని పలికి తన యాలమందను దోలించుకొని పోయెను.

ప్రజాదుఃఖము

అంత రామలక్ష్మణులు శరచాపంబులు ధరించి సీతాసమేతముగా దశరథునికడకుఁ గాల్నడకఁ దరలిరి. అట్లు వచ్చుచున్న వారిని జూచుటకై జనులు గుంపులు గూడిరి. వీధు లిమ్ముచాలవయ్యెను. కొందఱు ప్రాసాదంబు లెక్కిరి; కొందఱు హర్మ్యతలంబుల నిలిచిరి; కొందఱు విమాన శిఖరంబు లధిష్ఠించిరి. జనులట్లు సంమగలతావులెల్ల నాక్రమించి,

'అహో! ఐశ్వర్యరసజ్ఞుఁడును వదాన్యశిరోమణియునైన రాముఁడు ధర్మగౌరవంబునఁ జేసి తండ్రికి రానున్న యసత్యదోషంబును నివారించుటకు నెంత తెంపు జేసెనో చూచితిరా? ఏమి త్యాగము! ఏమి వైరాగ్యము! ఈ మహనీయుని తత్త్వ మూహకుఁగూడ నందదు. కటా! గగనచరభూతంబులకుఁ గూడ దుర్లభదర్శనయగు సుకుమారి సీతాదేవి నేఁడు రాజమార్గంబున నడచుటయ్యెను. చందనచర్చలకేని కసుగందునట్టి యీమె మైదీఁగె శీతోష్ణవర్షంబులకు నెంత ససిచెడునో చెప్పరాదు. దశరథుఁడు పిశాచావిష్టుఁడగుట ముమ్మాటికి నిజము. కాదేనిఁ గూర్మితనయునిఁ గాననాంతరములకుఁ బొఱఁదోలునా? తులువసుతునిగూడఁ దలిదండ్రులు త్యజింపరు; సర్వలోకప్రియునిఁ జెప్పనేల? మహాసత్పురుషునకు రామునకు నిట్టి యిక్కట్లు వచ్చుటఁ జూచి జనులు నీరింకిన కాసారమునందలి జలచరంబులపగిదిఁ దల్లడిల్లుట యబ్బురముగాదు. సకలకళ్యాణగుణసంపన్నునకు రామునకే యిట్లు సంభవించినప్పుడు సౌజన్యంబునకు నిఁక మర్యాద యెట్లుండును? ఇఁక శీలమును గణింతురా? శ్రుతిస్మృతులను బాటింతురా? ఈ మహావైపరీత్యము జగమునెల్లఁ దలక్రిందు చేయుచున్నది. రాముఁడనఁగాఁ బ్రపంచ మహామహీరుహంబునకు మూలకందముగాని సామాన్యుఁడుగాడు. అతనికే యిట్టి పతనము గలుగఁగా శాఖాపత్రపుష్పఫలమాత్రమగు ప్రాణివర్గముగతి చెప్పఁదరమా? మన రాముఁడు వలసపోవుచున్నాఁడు; మనముమాత్ర మిందుండనేల? మనకు గృహములేల? క్షేత్రములేల? మనముగూడ సమస్తము వర్జించి భార్యాబంధుసహితముగా వానివెంటఁ బోవుదము. అడుగో లక్ష్మణుఁడు మనకు మార్గదర్శి. మనమెల్లఁ బోవుదుమేని నిందలి జంతుకోటికి భరణక్షణములు తొలఁగును. అని వనగతమో దివంగతమో యగును. అయోధ్యానగరము సర్వనిష్కృతిఁ గాంచి పాడగును. ఆ పాడుపట్టణమును కైకేయి నిరంకుశముగాఁ బాలించుచు సుఖముండుగాక' యని తలకొక యూహగాఁ బలుకసాగిరి.

తండ్రిని వీడ్కొనుట

జనులు హాహారవములును విలాపనిందావచనంబులును శ్రవణపుటంబుల నగల్చుచున్నను రాముఁడు కించిన్మాత్రమేని వికారమొందకచని వీరపురుషరక్షితమైన రాజగృహముఁ జొచ్చి, దూరాన నిల్చి సుమంత్రుని దుఃఖవివర్ణుని జేరి తనరాక తెలిసి కెటిఁగింపు మనెను. అతఁడు లోనికిఁబోయి రాహుగ్రస్తుడైన సూర్యునివలె నీఱుగప్పిన

నిష్ప్రక్రియ నింకిన తటాకమురీతి తేజోవిహీనుఁడై యున్న దశరథునకుఁ గేలు మోడ్చి జయవచనంబులు పలికి, 'రాజేంద్రా! పురుషలలాముఁడు నీ కుమారుఁడు రాముఁడు విశ్రాణన నిశ్శేషితసమస్తోశజాలుఁడై వచ్చి వాకిట నున్నాఁడు. మిత్రుల వీక్షోత్సులాయెను; దేవరవారి దర్శనముఁ గోరుచున్నా'ఁడని హీనస్వరమునఁ బలికెను.

దశరథుఁడు తనభార్యలనెల్ల రప్పింపుమని సుమంత్రు నాజ్ఞా పించెను. శుద్ధాంతకాంతాజనము మున్నూటయేబదిమంది దుఃఖావ తారయైన కౌసల్యను జుట్టి వచ్చిరి. అంత సతీఁడు రాముని బ్రవేశపెట్టు మనెను. రాసుతుఁడు బద్ధాంజలియై సీతాలక్ష్మణులతోఁడ వచ్చెను. దశరథుఁడు తనయుని గతిపయపదముల దవ్వునఁ జూచి యాసనంబు నుండి లేచి భార్యలతోఁడ నెదురేగ యత్నించెను గాని దుఃఖభరము వానికాలు గదలనీయదయ్యెను; మూర్ఛ పైకొనెను. అతఁడు నేలవ్రాలి విసంజ్ఞునిపగిదిఁ దోఁచెను. సతులొక్కపెట్టున రోద గావించిరి. సీతా రామలక్ష్మణులు తటాలున దుమికివచ్చి వానినిగ్రుచ్చి యెత్తి పాన్పు పయిఁ బరుండఁబెట్టి సేదదేర్చిరి. అతఁడు కొంతసేపటికిఁ దెలివొంది కనువిచ్చి చూచెను. రాముఁడు కయిమోడ్చి, 'మహాప్రభూ! మాకెల్ల నీశ్వరుండవైన మిమ్ము వీడ్కొని వనమునకుఁ బోవచ్చితిని. వ్యసనము మాని మీ కటాక్షవీక్షణభాగ్యంబును నాకుఁ గలిగింపుము. సీతా లక్ష్మణులు నా వెంట రా నిశ్చయించిరి. ఎంతసెప్పినను వినరు. అనుజ్ఞ వేఁడుదు' మనెను.

దశ:- (వెచ్చనూర్చి) రామా? ఈ మందుఁడు కైకేయీ ప్రతారితుఁడు. ఈ నిర్భాగ్యుని నిగ్రహించి యయోధ్య నధిష్ఠింపుము.

రామ:- నరేంద్రా! ఇది ఎట్టిమాట. పెక్కుసంవత్సరములు యథావిధి రాజ్యపాలనమొనర్చితిరి; సత్యసంధుండను కీర్తిని గడించితిరి. నేఁడు మీకు మీ సుతునివలన దూఱు రాఁజెల్లునా? ఈ తలంపు నకు నెడమీయకుఁ. పదునాల్గు సంవత్సరములు క్షణములోఁ జనును. వనాంతరనివాసము నా కెంతయుఁ బ్రియము. మీ ప్రతినఁ జెల్లించినవాఁడనై వచ్చి మీ పదము లాశ్రయింతును. ఎట్టి నెంజలియు వలదు. నిండుమనంబున ననుజ్ఞయిమ్ము.

దశ:- నాయనా! నీకు మహాభ్యుదయమగుగాక; నీవు సుఖముగా మఱలివత్తువుగాక. పుత్రా! ఆకుతోభయుండవై యవ్యగ్రము

శుభస్కరమునగు సరణిద్రొక్కి చిరకీర్తి నొందుము. నీ సత్యాత్మతయు నీ ధర్మాభిరతియు లోకాతీతములు. నీ మది మఱలింప నాతరముగాదు. ఈ రాత్రి యిందుండి యేపకడఁ జనుము. కుమారా! నాకుఁ బ్రియమొనర్ప సమస్తముఁ దృణ ప్రాయముగాఁ ద్యజించి విజనంబును ఘోరసత్త్వమహోగ్రము నైన కాంతారంబులందుఁ ద్రిమ్మరఁ బోనున్నావా? ఈ దృశ దుష్కరకార్యము భవదన్యులకు సాధ్యముగాదు. రామా! నీ వనవాసంబునకు సమ్మతించితినని యెంచవలదు. చెడిపెకు మోసపోయి యిన్ని కడగండ్లు తెచ్చుకొంటిని. ఇది సత్యము. వంచనచేసి సంపాదించిన వరమునుగూడ సఫలీకృతమొనర్చు నీ ధార్మికత్వమెందుఁ గలుగదు.

రామ:- తండ్రీ! ఈ రాత్రి నేనిందుండి చేయునదేమియులేదు. భక్ష్యంబు లగు భక్ష్యముల నారగించి పొమ్మందువా? భోగముల వలన విరమించితిని; కోరి కెల్లఁ ద్యజించితిని; మనశ్చాంచల్యమునకు నెడమీయరాదు. అదియునుఁగాక నేనిందుండుట మీకు దుఃఖ మును బెంచుటగునుగాని యూఱట గలిగించుట గాదు. రాష్ట్ర మును భరతునకు నప్పగించి సత్యమును గాపాడుము. నాయనా! కన్న కుమారునకుఁ గీడొనర్చితినను సంతాపము మిమ్మేర్చు చున్నట్లు తోఁచుచున్నది. మూఢలోకమువలె మీరును భ్రాంతికి నెడమీయనగునా? నాకు మహోపకారమును గావించి తిరేగాని యెగ్గొనర్పరు. మహర్షి సాంగత్యము దుర్లభముఁ బరమవాంఛనీయము. అదియు నొకనాఁడు రెండునాళ్ళుగాదు. పదునాల్గువర్షములు. ఈ మహోదయము మీ కృపవలనఁగదా నాకుఁ గలుగుట. ఇంతకు మిన్నయగు మేలుగలదా? ఒండు తలంపువలదు; సంతోషపూర్వకముగా ననుజ్ఞయిమ్ము. సత్య పరిపాలనమును బితృసేవయు నా పరమవ్రతములు. రాజ్యము గానీ భోగైశ్వర్యంబులుగానీ మైథిలిగానీ తుదకు జీవితముగానీ నాకంత కన్నఁ బ్రియములుగావు. నాయనా! నేఁడే వనము నకుఁ దరలుదునని తల్లికిఁ గైకేయీదేవికి మాటయిచ్చితిని; ఆ మాటచొప్పునఁ బ్రయాణమై వచ్చితిని. నా సంకల్పము మాఱదు. ఈ వినయంబు సైరించి సెలవిమ్ము. తండ్రీ! మిమ్ముఁ బుట్టి దుఃఖించుచున్న యీ జనమును జూతువా? మీరే

యిట్లయినచో వీరి నూరార్చువారెవరు? సర్వజ్ఞుఁడవు; మీ లోకానుభవ మింతనరాదు. ఇట్లు డీలుపడి వగవనేల? మిన్ను విఱిగి మీఁదఁబడలేదు; గోరంతయొగ్గు గలుగలేదు. ఎల్లప్రాణు లకు సంయోగ వియోగంబులు సహజంబులు; ముడివైచినను చావుతప్పదుగదా. అశోచ్యంబునుగూర్చి ప్రాజ్ఞులు శోకింపరాదు.

సుమంత్రుఁడు కైకేయికి బోధించుట

దశరథుఁడు మఱల దుఃఖవివశుఁడయ్యెను. అతని సారథి సుమం త్రుఁడు సమస్తము విని తేనిపాటుఁగాంచి పండ్లు పటపట గీటి తల విదిర్చి నిట్టూర్పు నిగిడ్చి చేఁజేయి నలిపికొనుచుఁ గన్నుల నిప్పులు గురియ మోము జేవురింప నిలువెల్ల వడఁకఁ గైకేయి వంక మరలి, 'జగత్పతియు మీఁదుమిక్కిలి పతియునైన మహనీయుని త్యజించినదానికి మితిమేర గలవా? పతిఘ్నుకుఁ గులఘ్నత్వ మేపాటియగు?' అని లోలోనఁ బలికి కొని, 'మానవతీ! వరదుని నీభర్త నవమానింపకుము. కోటిమంది కొడుకులు భర్తకు సాటిగారు. రాజ్యము జ్యేష్ఠక్రమాగతము. అనాది ధర్మంబును దానుమానుఁ సేయవలదు. నీకొడుకునకే పట్టముఁగట్టుకో; నీవే యేలుకో; మే మెల్ల రామునివెంటఁ బోవుదుము. బ్రాహ్మణుఁ డొక్కఁడేనియు నీ రాజ్యాన నుండఁబోఁడు. మితిమీఱితివి; నీ వృత్తంబు నకు భూమి బ్రద్దలు కాకుండుట మహాశ్చర్యము. కటా! పుత్త్రివివాస దీక్షాపరతంత్రయైన యీ భీమదర్శనను మహర్షిధిగ్వచనంబులు దహింప వేల? దశరథా! రామునిఁ బాఱఁద్రోలి కైకేయి ముద్దుఁ దీర్తువా? రసాలవృక్షంబును దునిమివైచి వేపఁచెట్టును బెంచెదవా? కేకయ రాజపుత్త్రి! తల్లిగుణంబులు నీకుఁ దప్పవయ్యెను. విత్తొకటి నాటిన చెట్టొకటియగునా? నీతండ్రి కొండొక మహర్షివరంబున సమస్తజీవుల భాషాజ్ఞానముఁ బడసెను. ఒకనాఁడు వానిపడకయొద్ద జృంభణ పిపీలి కంబులు సంభాషించుచుండెను. అదివిని నీతండ్రి నవ్వెను. నవ్వుకారణ మేమని నీతల్లి వానినిఁ బీడించెను. 'ఇది చెప్పరాదు; చెప్పితినేని నాకుఁ జావుసిద్ధము; ఇది మునికట్టడి' యని యతఁడెంతో బ్రతిమాలెను. నీ తల్లి తనపట్టు వీడకుండెను; భార్యపోరు పడలేక యతఁడు మునీంద్రుని కడకుఁబోయి సంగతి తెలిపెను. ప్రాణములు తీపగునేని రహస్యమును దాచు' మని యా మునివచించెను. అంతట నీతండ్రి నీతల్లిని నిరాకరించి ప్రాణము దక్కించుకొనెను. ఇది మాకుఁ గ్రొత్తగాదు. ఆ తల్లికడుపునఁ బుట్టిన నీకు వేఱుగుణము లెట్లువచ్చు? తండ్రి గుణములు తనయులకును

దల్లిగుణంబులు తనయలకును గలుగుననుట [redacted] కైకేయీ! నీ దుండగమువలనఁ గడలేని కష్టనష్టములు రానున్నవి. ఇఁక నీవును నీ మోడి వీడి పతికి ననుకూలవతివగుము. రాఘుపట్టాభిషేకంబునకు తోనిని బురికొల్పుము; దుఃఖనిర్మగ్నమైన జీవలోకము నుద్ధరింపుము. చెప్పుడుమాటలు వినవలదు. నీవు నీ చేతులారఁ నీ భర్తనధర్మగర్తంబున ద్రోసి తీఱనినిందకుఁ దలయొగ్గెదవా? నూన మేదెనేనిఁ బ్రాణమేల? నీవుగా రామునకుఁ బట్టముఁ గట్టము; ఈ దూఱు వాయు'నని బహు భంగుల నయభయంబుల బోధించెను. వాని బోధనలెల్ల నడవిఁగాచిన నెన్నెలయ్యెను. విధివిధానము తప్పునా?

కైకేయీ దశరథుల వివాదము

ఎవరెంత చెప్పినను గైకేయి తననిశ్చయమును మరల్పమికి దశరథుఁడు విసివి, 'సుమంత్రా! రాముని యనుయాత్రార్థము చతురంగ బలమును రత్నరాసులతోడఁ బంపుము. ధనవంతులైన వైశ్యులును నటీనటులును గాయనీగాయకులును గుమారుని వెంట నుందురుగాక. నా పుత్త్రుని మిత్రవర్గమును భృత్యకోటిని వాని వెంటఁ దరలింపుము. వివిధాయుధములును శకటంబును వ్యాధశిఖామణులును వనగోచరులును వానిని దవిలియుందురుగాక. నా సుతుఁడు రాజ్యముసంగతి మఱచి యిచ్ఛావిహారంబుల సుఖముండునట్లుగా వలయునవియెల్ల సమకూర్చి పంపుము,' అని చెప్పెను. దశరథుఁడట్లు పలుకగా విని కైకేయి మహోగ్రహమొంది, 'రాజ్యమును బ్రాణశూన్యమొనర్చి పిప్పిని భరతునకిత్తువా?' యని పరుషస్వరంబునఁ బలికెను. దశరథుఁ డామాటతోఁ గటగటంపడి, 'కూళా! దుర్భరమగు భారము వైచి నన్నుఁ బాతాళమునకుఁ ద్రొక్కితివి. అది చాలక నైన మన్నుద్రోయుదువా? ఏ వరములను నీవు కోరితివో వానిని మాత్రమే గ్రహింపు; అంతకు మించి పలుకవలదు. రాముని వెంట నెవ్వనిఁ బంపరాదని నీవు కోరలేదు. వృథాశ్లేషణలు విరమింపు' మని యదలించి పలికెను. పతిమాటలకు సంతప్తాప ముద్దుడికించుచున్నను గైకేయి దానిని లోలోన నడచిపెట్టి, 'రాజా! పూర్వాచారము తప్పరాదంటివి. ఆచారతిరస్కారము ధర్మాతిక్రమ మగునంటివి. ధర్మాతిక్రముఁడు సత్యదూషకుఁడగునని వేసార్లు బోధించితివి. ఈ విషయమునఁగూడఁ బూర్వాచారము పాటింప వలదా? అసమంజసుని చరిత్ర వినవా? సగరుఁడు వానినిఁ దొల్లి వనంబునకుఁ బంపినప్పుడు వాని వెంట నిట్టివి తరలించెనా? సగరుఁడు నీ

[redacted]ట్లుచేయుట మీ వంశాచార వ్యతిక్రమము గా[redacted] యని పాటఁబలికెను.

సిద్ధార్థుఁడు కైకేయిని నిందించుట

సిద్ధార్థుఁడనుమంత్రి కైకేయీ హృదయవిదారణవచనంబులు విని కటకటంబడి, 'దేవీ! నీ యుక్తి విశేషము వినఁ నింపుగాదు. ఆట్లాడు చున్న పసిబిడ్డలను బట్టితెచ్చి నీటముంచి యూనందించిన యసమంజసునితో రామునిఁ బోల్చెదవా? అసమంజసుని క్రూరకృత్యంబులకుఁ బ్రజలు గోడుగోడు యని యేడ్చిరి. వారి దుఃఖనివారణార్థము సగరుఁ డా యసమంజసునకుఁ గొడుకను కనికరముగూడఁ జూపక యావజ్జీవ వనవాసశిక్షను విధించి భార్యాద్వితీయునిగా వానిని వెడలించెను. రాముఁడేమి యకార్యములొనర్చెను? రామవివాసమునకు లోక మెల్ల దురపిల్లుచున్నదిగదా. రాముని బల్కననోట నసమంజసుని బల్కుట మహాపాతకముగదా! అసమంజసుఁడు నరమదుష్టుఁడు; రాముఁడు సజ్జనశిఖామణి; వాఁడు ధర్మబాహ్యుఁడు; ఇతఁడు ధర్మనిరతుఁడు; అతని వివాసమును రాష్ట్రమెల్లఁగోరెను; ఇతని వివాసమును నీవుదక్క నొరులు గోరరు; సగరునాజ్ఞ నెల్లరు నామోదించిరి. దశరథునాజ్ఞ ను బ్రతిషేధింపని ప్రాణిగలుగదు. అతనికి నితనికి సామ్యముఁబలుక నోరెట్లాడెను? చంద్రునియందేనిఁ గళంకముగలదుగాని రామునియం దెట్టి కళంకము గలుగదు. అట్టి సజ్జనుని ధార్మికుని లోకప్రియుని నిర్దోషిని స్వలాభార్థ మిట్లు గాఁదీంచువారికి సిరిదక్కునా? ఇంతటనేని నీ దుర్మతమును మాని యాత్మహిత మొనర్చుకొనుము' అని యంతఃకోపమును వెలువరించెను. దశరథుఁడును వానిమాటనందుకొని, 'పాపీ! సిద్ధార్థుని వింటివా? ఎంతవిన్న నేమిఫలము? కుత్సితమతికి హితంబులు రుచింపవు. లోకగర్హితంబునకుఁ దెగించితివి. నీస్థితి మబ్బువిడిచిన యెండయయ్యెను. చెనటీ! నీతోడివాసమునకన్న వనవాసమే మేలు. సర్వము నప్పగించితిని; ఏకాకిగా నిందు సుఖముండుము. నేనుఁగూడ నా రాముని వెంటఁ బోవుచున్నా' ననెను.

రా మా దు లకు వ ల్క ల ము లి చ్చు ట

రాముఁడది విని, 'నాయనా! గజమునిచ్చినదాత దానిని గట్టుత్రాటికై యాసించునా? ఎల్లయర్థములను విసర్జించితిని; సైన్య సామగ్రులు నా కేల? మీరు నా వెంట రాఁజనదు. వల్కలములో

గుద్దలియో పుటియో యింతయిచ్చి నన్నుఁ బంపుము. జాగునల' దనెను. రామునినోట నమ్మాట వచ్చుటే తడవుగాఁ గైకేయి వల్కలములు తెచ్చి వానికిచ్చి ధరింపుమనెను. ఆమె చేతకు నెల్లరు నివ్వెఱఁ గందిరి. రాముఁడా నారచీరలు గైకొని కన్నులనద్దుకొని తన మొలనున్న జిలుఁగువస్త్రంబును డుల్చివైచి యవి ధరించెను. సీతా దేవి తనకుఁగాఁ దెచ్చిన వల్కలములను జూచి వలను గాంచిన లేడికైవడి బెగడొంది బాష్పపూర్ణలోచనయై, 'నాథా! వనవాసినులు వల్కలములధరించు వైఖరి యెఱుంగ' నని యొకటి మెడవైచికొని యింకొకటి చేతఁబట్టుకొనెను. రాముఁడాప్రియురాలి భ్రాంతిని గ్రహించి యాచెఱచేతి వల్కలము నందికొని యామె కట్టియున్న పీతాంబరము పయిఁ దానిని జుట్టెను. అదిగాంచి యందున్న స్త్రీజనమెల్ల గొల్లుమని విలపించి, 'నాథా! రామా! వలదు వలదు; ఈ పని చేయవలదు. వనవాసశిక్ష సీతకుఁ గావింపఁబడదు. ఈ బిడ్డ నెడబాయఁజాలము. నీవచ్చుదాక నీకు మాఱుగా సీతను జూచియేని మనియుందుము. పితృవాక్యమును బాలించిరమ్ము. లక్ష్మణుఁడు నీకుఁ దోడుగానుండును. అయ్యో! ఈ పరమకళ్యాణియేడ? తాపసవృత్తియేడ? నిన్ను మరలింప మాతరము గాదు. సీత నేని యిందుంచి చను' మని వ్యసనకుంఠితస్వరం బుల మొఱలిడిరి.

వసిష్ఠుఁడు కైకేయికి హితము చెప్పుట

వసిష్ఠుఁ డందుండి యానాటకమెల్లఁ గన్నారఁ జూచి లోలోనఁ బొడమి యేఁచిరగులుచున్న కోపాగ్నిని బట్టఁజాలక, 'కులఘ్నీ! నీ యతివృత్తముచాలు; తెనిని మోసగించి నీపడసిన వరములెంతో యంతతో నిలువుము. జానకి వల్కలములు కట్టనేల? వనమునకుఁ బోనేల? ఆమెకు నారచీర లందియ్య నీచేతులెట్లాడెను? లజ్జయేని నిన్నాక నెట్టదా? గృహస్థునకు భార్య యాత్మయగును. రాముని పరోక్షమున వాని రాజ్యమును వాని యర్ధాంగి యధిష్ఠించుఁగాక. ఆమెదండ మేముండి రాచకార్యంబులను జరుపుదుము. నైదేహిసయితము రాము ననుగమించుచో మేమును వారివెంటఁ దరలుదుము. మాతోడఁ బుర మెల్లఁ గదలును; దశరథుఁడు మమ్మనుసరించును. అగ్రజసేవార్థులై భరతశత్రుఘ్నులు వత్తురు. ఈపాడు పట్టణము నేకాకిగా నేలుకొనుము. రాముఁడు రాజుగానిరాజ్యము రాజ్యమేగాదు. అతఁడుండుచోటు వనమైనను రాజ్యమగును. అవివేకీ! భరతునకు రాజ్యమును

గట్ట నుంకించుచున్నావు. వాఁడు దశరథుని పుత్త్రుఁడుగాఁడా! తండ్రి యీయనట్టియు నగ్రజుని సొమ్మయినట్టియు రాజ్యము నొల్లునా? కైకేయీ! నీ యీదృశవాత్సల్యంబును భరతుఁ డేనగింపక మానఁడు. తల్లడింతువుగాక, నీ మతము నతఁడు సేయఁడు. తిర్యగ్జాతంబులు గూడ రాము ననుసరించుచుండఁగాఁ బితృవంశచరిత్రజ్ఞుఁడు భరతుఁ డొండు సేయునా? భరతునకు మహోపకృతి నొనర్చుచున్నానని తలంచుచున్నావు. అది కేవలము భ్రాంతి; వానికి మోయరాని యపకార మొనర్చుచున్నావు. కోడలి కిచ్చిన వల్కలములు మరలఁ దీసికొని వానికి మాఱుగా నుత్తమాభరణము లిచ్చి నీ యకార్యదోషమును బాసికొను' మని హితము వచించెను.

దశరథుని పరితాపము

వసిష్ఠుని వ్యసనాగ్రహంబులు దశరథుఁడు పరికించి, 'కటా! నా యజ్ఞాన మెన్ని యనర్థములకు మూలమయ్యెను; వెదురుపూచినట్లు నా తెలివి యిట్లు పూచి యాత్మవినాశ మొనరించెను' అని లోలోనఁ జింతించి, కైకేయివంక మరలి, 'పాపీ! రాముఁడు నీకుఁ దలయేఱయిన నగుఁగాక, సీత యేమిచేసెను? కుమతీ? ఆబిడకు నారచీరలందియ్యఁగా నీ చేతులెట్లాడెను?' అని నిందాస్ఫూర్తితో గర్హింపసాగెను. రాముఁడు తండ్రికిమ్రొక్కి, 'నాయనా! సెలవిమ్ము, పోయివచ్చెదను. నా తల్లి వృద్ధురాలు, మదేకపుత్త్రిక; అట్టినన్ను వనంబునకుఁ బంపుచున్నను మీ కెదురాడదు. ఆమెనెట్లు పాలింతువో' యనెను. ఆ మాటతోడ దశరథుఁడు దుఃఖపరీతహృదయుఁడై, 'కటా! నా ప్రియసుతుని మునివేషమును జూడనోడి నా కన్నులు మూసికొనుచున్నవి; దుఃఖము నోరాడనీయదు; తొలిభామున నేనెట్టి యకార్య మొనర్చితినో? కాకున్న నాకిప్పు డీ పుత్త్రవియోగ దుఃఖముగలుగదు. అయ్యో! ప్రాణములు చనరాదా? ఏమి నా యజ్ఞానము! కాలము రానిదే ప్రాణములు తరలునా? ఈ మొండికట్టె యింక నెంత యనుభవింప వలసియున్నదో గదా. భోక్తవ్యము తీఱనిదే యనసానకాల మెట్లుగలుగు! హా! రామా!' అని నిట్టూర్పు నిగిడ్చి సుమంత్రుని జూచి, 'సారథీ! నీవు చని యుత్తమహయంబులను బూన్చి రథమును గొనివచ్చి మహాభాగుని రాముని నందెక్కించుకొని పోయి వానిని దేశాంతరమున వదలి రమ్ము. కన్నవారే తమ పుత్త్రుని బరమసాధువును ద్యజించుటఁ జూడఁగా సద్గుణంబులు సయితము కొన్ని వేళలఁ గారానట్లు తోఁచుచున్న' వని

పలికి వానిని బంపి, ధనాధ్యకుని రప్పించి 'పదునాల్గువర్షంబులకుఁ జాలు నంత వస్త్రాభరణాదికముఁదెచ్చి నాగోడలికి సీతకిచ్చి పంపు'మనెను.

కౌసల్యాదేవి సీతకు హితము పదేశించుట

కౌసల్యాదేవి యంత సీతను గవ్వఁగిటఁ గ్రుచ్చి శిరంబు మూర్కొని, 'అమ్మా! సంపత్కాలంబున భర్తనుఁ బూలతోఁ బూజింతురు; ఆపదలందు వారిని ద్వేషింతురు; బొంకునకు వెఱువరు. ఇవి స్త్రీలకు నైజము. మఱియు స్త్రీహృదయంబు నశ్వప్లుతంబు నెఱుంగరాదు. ఇంతులు గోరంత యప్రియంబునుగూడ సహింపరు. తఱివచ్చెనేని వారు కుల గోత్రంబులఁ ద్వేషింతురు; విద్యాధనంబుల నిరసింతురు; లోకసంగ్రహోపకారంబులను గూడఁ బాటింపరు. సాధ్వీమణులసంగతి యట్లుగాదు. కులశీలములు వారికిఁ బెట్టని భూషణంబులు; సత్యమే వారికిఁ బ్రాణము; గురుజనుల మాట దాఁటరు; పతియే దైవంబుగా వర్తింతురు. అమ్మా! నా సుతుఁడు లక్ష్మీనిరాకృతుఁడని వాని నవమానింపకుము. దరిద్రుఁడో ధనాఢ్యుఁడో రాముఁడే నీకు దైవ'మని వచించెను.

సీత నిజమనమును వెల్లడించుట

వైదేహి యా యుపదేశంబులం విని, 'తల్లీ! నీ పలుకు లాజ్ఞలుగా గ్రహించి వర్తింతును. సతీధర్మములను పెద్దలవలన నేర్చితిని. కాంతి చంద్రునివలె నేను ధర్మము ననుసరింతును. పతినిఁబాసినసతి తంత్రులు లేని వీణవలెఁ జక్రములులేని బండివలె నగునని యెఱుంగుదు; తలిదండ్రుల నలనఁగాని సుతసోదరుల వలనఁగాని స్త్రీలు పడయునదెల్లఁ బరిమితముగా నుండును. భర్తలవలన వారు పడయుసదన్నచో యపరిమితము. కలిమిలేములు బుద్బుదప్రాయములు; సిరివచ్చునట్టి ముడి యంత దృఢముగాదు; వలపుముడి యెన్నఁడు వీడదు; దానిని విప్పఁ దరముగాదు. నన్నుఁగూర్చి శంకింపకు' మని నిజాంతర్భావమును సూచించెను.

రాముల నిర్గమనము

కౌసల్యాదేవి కన్నీరునింప సాగెను. రాముఁడామెకుఁ బ్రబోధించి, 'అమ్మా! నా వనవాసము నిమిషమాత్రమునఁ గడచును; ఎడరు వలదు; నా తండ్రిని బదిలముగాఁ గాపాడు' మని చెప్పి సుమిత్రాదులకు వండమొనర్చి, 'తల్లులారా! అజ్ఞానమునఁ జేసిన బరిచయాతిశయమున

నొండె మతియేకారణముననొండె మీ రాముఁడు మీ కెన్నఁడేని యవినయ మొనర్చియుండునేని దానిని క్షమింపనగు. ఇదే మిమ్మతఁడు వీడ్కొనుచున్నాఁడని పలికి, సీతాలక్ష్మణులతోడ దశరథునకుఁ బ్రదక్షిణ నమస్కార మొనర్చి మఱలఁ గౌసల్యకుఁ బ్రణమిల్లెను. రాముఁడట్లు వనవాసమునకై తరలునప్పుడు వానికి నిరువదేనువత్సరములు నిండనుండెను.

లక్ష్మణుఁడంతఁ గౌసల్యకు మొదటఁ బ్రొక్కి యనంతరము తన తల్లికి సుమిత్రకు నమస్కరించెను. సుమిత్రాదేవి సుతుని శిరము మూర్కొని, 'నాయనా! జాగరూకుండవై యుండుము. రాముఁడు వ్యసనియగుఁగాక సమృద్ధుఁడగుఁగాక. వాఁడే నీకు దిక్కు. జ్యేష్ఠుననుసరించుటకన్నఁ బరమధర్మము లేదు. యజ్ఞదానతపోదీక్షలకు మీవంశము జన్మస్థానము. రణరంగంబున నైరాకోకులు వెనుచూపి యెఱుఁగరు. రాముఁడే తండ్రిగా సీతయే తల్లిగా భావించి వర్తింపుము. పోయిరమ్మ'ని వానిని దీవించి పుచ్చెను.

సీతారామలక్ష్మణుల వనప్రయాణము

అంతలోన రథమువచ్చెను. రాముఁడు తన ప్రియురాలిని మొదట రథమెక్కించి యామెవెంట తానెక్కెను. రామునివెనుక లక్ష్మణుఁడెక్కెను. సారథి వాగెలు సడలించెను. శకటము తీవ్రగతిఁ దరలెను. రథము కదలినంతనే జనులెల్లరు సమాకులభ్రాంతులైరి; గజంబులు తమ కోపదుఃఖంబులను ఘీంకారంబుల వెల్లడింపసాగెను; హయశింజితములు చెలరేఁగెను; నగరమెల్ల హాహారవముల బోరుకలఁగెను. దాహదీనులు సలిలంబులనువలె జను లాబాలవృద్ధము రథమువెంటఁ బడిరి. పార్శ్వములను బట్టుకొని కొందఱుఁ బృష్ఠభాగమున వ్రేలాడుచుఁ గొందఱు రథగమనమునాపి బాష్పపూర్ణలోచనములెత్తి, 'సుమంత్రా! వాగెలు బిగింపుము; రథము నిలుపుము. ఇఁక మేము రాముని జూచు చెన్నఁడో; కడసారి తనివితీఱ వానిఁజూతుముగాక. అహో! కౌసల్యా హృదయ మయఃపిండముకాని వేఱుగాదు. ఒండగునేని వ్రీలదా? భళీ! వైదేహి నిజపతిని ఛాయవలె ననుగమించుచున్నది. ఈమె మహాకృతార్థురాలు సుమా. లక్ష్మణా! అన్నను దేవసమానుని బరిచరింపఁ జనుచున్నావు. నీవు నిక్కముగా సిద్ధార్థుఁడవు. ఇంతకన్న వేఱు తపమేల? ఇదే నీకు మహాభ్యుదయకరమగు'నని కేకలిడ సాగిరి.

దశరథుని దురవస్థ

సుతవియోగము దశరథునకు దుస్సహమయ్యెను. అతఁడు దుఃఖహేతుఁడై యుండియుఁ బుత్త్రనిజూచు తమకంబున సంతఃపురమునుండి వెడలెను. అతనివెంట వానిభార్యలును దరలి యూధనాథుని బంధనంబునకుఁ గరేణుకాగణమువలె రోదింపసాగిరి. తల్లిదండ్రులట్లు వచ్చుట రాముఁడు చూచి యీ విషాదప్రదర్శనంబును సమాప్త మొందింప నెంచి వాగెలు సడలింపుమని సారథి నాజ్ఞాపించెను. సాయంకాలము దూఁకై గోవుచందంబునఁ గౌసల్యాదేవి రథమువంకఁ బరుగెత్తుచు, 'హా! రామ! హా! సీతా! హా! లక్ష్మణా!' అని విలపింపఁ జొచ్చెను. నిలు నిలుమని దశరథుఁడు కేకలిడెను. చక్రాంతరగతుఁడుమోలె సారథి డోలాయమాన మానసుఁడై దిగారుపడి యేమియుఁ దోపకుండెను. రాముఁడదిగాంచి, 'సుమంత్రా! వీరిముఖమును జూడఁజాల; రథముఁ బోనిమ్ము'ని త్వరించెను. రథము వాయువేగమునఁ బఱచెను. దశరథుఁడు సుతునివెంబడింప యత్నింపఁగా, 'రాజా! నీ సుతుని శీఘ్ర పునరాగమనంబును గోరుదువేని వానిని దూరము వెంబడింపరా' దని చెప్పి వానినుడిపిరి. అతఁడు స్విన్నగాత్రుఁడును విషణ్ణవదనుఁడునై భ్రమానువలె నిలిచెను. వాని దృష్టిపథాత్రము సుతునివెంటఁ బఱచెను.

చ॥ తనకులసంభవుండును నితాంతమహామహిమోన్నతుండు ధ
ర్మవిభుఁడుఁ బైతృకంబయినరాజ్యముఁగూడఁ ద్యజించి వల్క లా
జినములు గట్టి ఘోరవనసీమకుఁ బోవుటఁ జూడలేమి నో
యన నినుఁడస్తమించె నపరాంబుధి శోకవిదీనమూర్తియై.

మఱియు వీతిహోత్రంబులు భ్రేలుట మానెను; గృహస్థులయిండ్లఁ బ్రొయ్యి రాజదు. గజములు కబళింపవు; గోవులు నత్సంబులఁ గుడుపవు; జ్యేష్ఠకుమారునకుఁ దల్లి సంతసింపదు; గ్రహమండలంబునఁ బ్రదిశంకు కుజబుధ గురుశులును దదితర క్రూరగ్రహంబులును వక్రించి దృష్టిచేతఁ గొన్నియు సంయోగంబునఁ గొన్నియుఁ జంద్రుని బొందెను. నక్షత్రంబులు నిస్తేజములై మినుకఁరింపసాగెను. కోసలదేశాధితారయైన విశాఖానక్షత్రము ధూళిధూసరమై కాన్పించెను. ప్రళయానిలవేగంబున మహోదధివోలె రామనిర్గమనదుఃఖావేశంబున నగరమెల్ల వ్యాకుల మొందెను. చంద్రుని నైసర్గిక సౌమ్యదర్శనము మాయెను.

అంతలోన రథధూళి సన్నగిలి సమసిపోయెను. దశరథుఁడు దుఃఖహేతుఁడై నేలఁగూలెను. కౌసల్య వాని దక్షిణహస్తంబును బట్టు

కొనెను; కైకేయి వానియెడమచేఁ బట్టుకొని లేనన్నెత్త నుంకించెను. దశరథుఁడామెనుఁ గ్రూరదృష్టిఁజూచి, 'దుష్టా! నా యంగకంబులు తాకవలదు; మిత్తివిగాని నాకు భార్యవుగావు; అర్థంబునకుగా ధర్మంబును దిగమ్రింగు రక్కసివగుట నేఁడుగంటిని. నీకును నాకు నింతటితో సరి; రాజ్యప్రాప్తికి భరతుఁడు సంతసించునేని వాఁడిచ్చు జలతర్పణంబులు నాకుఁ జెందకుండుఁగాక' యని పలికి వామకరంబును విదిల్చి లాగికొనెను. కౌసల్య మెల్లగా వానిని లేవఁదీసి యింటికి మరలించెను. దశరథుఁడు సారెసారెకు రాముని దలఁచును; అడుగడుగునకు మరలిమరలి చూచును; నిప్పుతాకినట్లు తపించును; గుఱ్ఱములజాడలుగాంచి 'హా! రామా!' యని సొమ్మసిల్లును. 'హా! జనకరాజతనయా!' యని వాపోవును. 'అయ్యో! చందనచర్చలఁ జిగురాకు వీవనల మృదు తల్పంబుల హాయిగాంచు నా పుత్త్రిరత్నము పెంధూళిఁ బ్రుంగుచు దవానలకీలలఁ గ్రాగుచుఁ గటికపూనేలలఁ బరుండుచు దినములు గడపుటయ్యెఁగదా' యని వెక్కివెక్కి యేడ్చును. 'జానకీ! మృదు పదవసనంబులపయినేని పొక్కి జాజువాఱు నీ యడుగుతమ్ములు సూచికాగ్రశిలాతలంబుల నెట్లు నడయాడనేర్చునో' యని వెచ్చ నూర్చును.

కౌసల్యా విలాపము

దశరథుఁడట్లు పరిపరివిధంబుల వాపోవుచు మెలమెల్లగా నగరము ప్రవేశించి యందుఁ జతుష్పథంబులు నిర్జనంబులగుటయు గృహద్వారంబులు నిరలంకృతముగా నుండుటయు విపణిశ్రేణికలు నివిూలితములగుటయు దేవాలయంబులు మూయఁబడియుండుటయుఁ జూచి పిల్లు విలపించి సూర్యుఁడు మేఘమండలాంతరమునఁ బోలె నిజమందిరాంతరముఁ జొచ్చి, 'కౌసల్యా! నీ యింటికి నన్నుఁ గొనిపొమ్ము; ఒండుచో నూఱటగల్ల' దనెను. ఆమె యట్లొనర్చి మెత్తనిపాన్పుపయి వానిఁ బరుండఁబెట్టి యుపచరించు చుండెను. అతఁడందుఁ దొడగట్టువలెఁ బడి రామలీనహృదయుఁడై యంతస్తాపంబును బాష్పధారారూపంబున వెలిపుచ్చుచు నర్ధరాత్రమైనను గనుగూర్కక, 'హా! పుత్త్రా! నన్నుఁ ద్యజించితివా?' యనుమాట దక్కి నోండుపలుకక దుఃఖించి దుఃఖించి, చెంతనున్న భార్యను బిలిచి, 'దేవీ! రాముని వెంటఁజన్న నా దృష్టి యల్లోయున్నది; చేరువనున్నను నీవు కానరావు; మంగళకరమైన నీకరంబున ననొక్కింత స్పృశింపు' మనెను. ఆమె యల్లెయొనర్చి

సుతుని దలంచి తలంచి యేడ్చుచు, 'కటా! క్రౌంచునలెఁ గైకేయి పొంచి పొంచి నా బిడ్డను గఱచి విసముఁ బాసి కుబుసము వదలెను. ఆ యింతి కోరిక లీడేరెను. దాని తాపము చల్లారెను. ఇలుఁజొచ్చిన పాముపగిది నిఁక నన్నెంతగాఁజంచునో తెలియదు. అయ్యో! నా పట్టిని గుట్టలకు దోలుటకన్న నింటనేయుంచి భరతునకు దాస్యమొనర్చు నట్లు కోరరాదా? నాకూన నాకంటియెదుట నుండును; అంతతో సంత సింతును గదా. నాథా! పర్వకాలంబున దేవతల హవిర్భాగంబును రక్కసులకు నాహితాగ్ని యిచ్చుకరణి రాముని రాజ్యంబును వాని పట్టాభిషేక సమయంబున గైకేయి కిచ్చితివి. అంతతో నప్పాలఁతి తనియదయ్యెను. దాని తృప్తికిఁగా నా ముద్దుపట్టిని ఘోరమృగాభీల కాననాంతరములకుఁ బఱచితివి. అదియు నొండు రెండేండ్లు గాదు; పదునాల్లు సంవత్సరంబులు. భోగంబులఁ దులతూగనగు యౌవన ప్రాయంబునఁ గొడుకునకుఁ గోడలికి మునివృత్తి నిప్పించితివి. ఇష్ట మృష్టాన్నములకు మాఱుగాఁ గందమూలంబులు పెట్టితివి. అయ్యో! పదునాలుగేండ్లు గడపి నా పుత్త్రుఁడు మరల నింటికి రాఁజూచుభాగ్యము నాకుఁ గల్లునా; రామపునరాగమన సంతోషంబున ధ్వజపతాకాదు లతో శోభిల్లు కలిమి నయోధ్యాపురము నోచెనా? నగరోత్సవేళల లాజప్రసూనంబులను రాముని యాదలగురిసి సంతసించు సంపద యీ పుర పురంధ్రీమణులకు మఱలఁ గలదా? నా పట్టి వయోబుద్ధులఁ బరిణతుఁడైనను వానిని నూఁడేండ్లు కందువుగా భావించి లాలింతును. కటా! పూర్వజన్మంబున స్తనంధయులనుఁ ద్రోపాడితినో, తల్లుల పాలిండ్లు త్రెంచితినో, ఏమహాపాతక మొనర్చితినో యీ పాపఫలముగా నా కిట్టి పుత్త్రవియోగక్లేశము దాపరించెను. కైకా! నోయరాని నోములునోచి పడరాని యిడుములుపడి కానక కన్న నరపుత్త్రుని గళ్యాణగుణ గరిష్ఠాకరుని ధర్మస్వరూపుని రాముని నా యొడినుండి లాగి మిన్నులు పడ్డచోట వైచితివి. నిదాఘభానుతాపము ధాత్రిని బోలె సుతశోకము నన్ను గ్రాచుచున్నది. హా! దైవమా! ఎట్లు జీవింతు' నని దుఃఖిల్లెను.

సుమిత్ర కౌసల్యనోదార్చుట

ఆమె పరితాపంబును సుమిత్ర చూచి యోర్వఁజాలక చెంతఁజేరి 'అక్కా! ఇంత వెఱ్ఱియుండునా? మన రాముఁడు పితృవాక్యపరిపాలన రూప పరమధర్మంబు ననుష్ఠించి లోకాభ్యుదయ మొనర్పఁ జనెను.

అందులకు సంతసించుటకు మాఱుగా విలపింతువా? రాముఁడు మహాను భావుఁడుగాని యేతన్మాత్రుఁడుగాఁడు. వానిసేవ లక్ష్మణునకుఁ బూర్వ పుణ్యఫలంబుగా లభించెను. జానకి పరమసుకుమారి, సుఖంబులకుఁ దక్క క్లేశంబులకుఁ దగదు. ఆ బిడ్డ సంగతి యేమందు? పతివ్రతామణి కావున మనమెంత వారించినను వినక పతి ననుగమించెను. ఎవని కీర్తి పతాక చిరస్థాయియై ముల్లోకంబుల శోభిల్లనున్నదో, సత్యధర్మంబు లెవనివలనఁ బునఃప్రతిష్ఠితంబులై వెలయనున్నవో యట్టి నీతనయు నకు నెందును శుభమేయగును. వానికిఁ గీడు రానోపదు. రాముని శౌచంబునకు వెఱచి చండాంశుఁడు వానికి శీతకరుఁడగును; తదీయ సుగుణంబులకు మెచ్చి వాయువు వానికి సుకరముగా వీచును; అతని యకళంకత్వంబునకు లజ్జించి మృగాంకుఁ డాత్మదోష పరిహారంబుగాఁ దుహినకరంబుల వాని నుపచరించును. ఇట్లు నవగ్రహంబులు వాని నెందున్నను సేవింతురు. మఱియుఁ జతురాస్య ప్రసాదిత దివ్యాస్త్రంబు లెందును వానిని గాపాడును. రామధనుష్టంకారధ్వని పాఱినంతమేర భూతబేతాళపిశాచాది దుష్టనర్గము నిలువనోపదు. ఇవియెల్ల మనకు ననుభవసిద్ధములేగదా. అట్టి మహాపురుషునకు భయము శంకింపనేల? పదునాలుగేండ్ల వియోగమందువా? అది లీలాప్రాయముగాఁ గడ చును. సూర్యునకు సూర్యుఁడును వైశ్వానరునకు వైశ్వానరుఁడును సిరికి సిరియుఁ గీర్తికిఁ గీర్తియు దేవతలకు దేవతయు భూతంబులకు భూతంబును రాజులకు రాజునై పరమైశ్వర్యశక్తితో రాజిల్లు రాముని విరోధించి మనఁజాలు ప్రాణి భూనభోంతరాళంబులఁ గలుగదు. అక్కా! రాజ్యలక్ష్మి సీతతోడఁ బంతగించియోయన రాముని వెంబడించెను. నీసుతుని విజయపూర్వక సుఖాగమనంబునకు నానందాశ్రువులు వర్షింతువు. నామాట తప్పదు. ఎడరువాసి తోడివారికి ధైర్యము పలికి సుఖముండు'మని బహువిధంబుల నూరార్చెను.

రాముఁడయోధ్యావాసులనూరార్చుట

అట రాముఁడు తనరథంబును దడిమివచ్చుచున్న యయోధ్యా వాసులనుజూచి, 'మీరిట్లుగావించుట నాకు సంతసముగాదు. నాయందలి మీ గౌరవాదరంబులను భరతునియెడఁ జూపి నాకుఁ బ్రియమొనర్పుము. నా తమ్ముఁడు కళ్యాణచరిత్రుఁడు; అతఁడు మీకు సమస్తహితములు గూర్చును. ప్రభుత్వంబునకు వలయు జ్ఞానవృద్ధియు మృదుమధుర పరాక్రంబును వాని కెంతయుఁ గలవు. వానివలన మీకు భయము

గోరంతగూడఁ గలుగదు. గుణలక్షణాదులను జక్కఁగాఁ బరీక్షించి వానిని యువరాజుగా నియమించిరి; రాజాజ్ఞ నుల్లంఘించుట ధర్మ వ్యతిరేకమే గాక రాజతిరస్కారముగూడ నగును. అయోధ్యావాసు లట్లొనర్పనేరరు. ఇదియునుగాక మహారాజు నా వియోగంబునకుఁ బురపురఁ బొక్కుచున్నాఁడు. ఇట్టితఱి మీరు వానికి నుపశాంతి గూర్ప నొప్పును. అట్లుసేయక నా వెంట వత్తురేని తేనిదుఃఖంబు నినుమడిం తురు. అది భయావహమగును. నా మొఱ విని మీరు మరల యయోధ్యకుఁ బోయి తేని నూరార్చి నాకుఁ బ్రియమొనర్పుఁడు' అని సవినయంబుగా వారిని ప్రార్థించెను. రాముఁడట్లు విన్నవించుకొలఁది వానియందుఁ బ్రజలకు ననురాగము పెంపొందసాగెను. వారు కన్నీరు గార్చుచు గుణబద్ధులు ఓలె వానిని వెంబడింపసాగిరి.

వృద్ధ బ్రాహ్మణులు రాముని వెంటఁబడి వేడుట

మఱియు జ్ఞానవయోవృద్ధులగు బ్రాహ్మణులు హుటాహుటి నడువలేక రథంబులకు దూరమై ముదిమినలన వడఁకుచున్న తలలతో 'ఓ రామవాహనములారా! మామాట మీఱుట జాత్యశ్వంబులకుఁ దగదు; మరలుము; మీ ప్రభువునకు హిత మొనర్పుము. నిసర్గదీర్ఘ శ్రవణపుటంబులుగల మీకు మా కేకలు వినరావనుట నమ్మరాదు. ఎవఁడు పరమధార్మికుఁడని త్రిశుద్ధికి నొక్కి చెప్పఁగలమో, ఎవని చిత్తశుద్ధి యద్వితీయమో, వీరాతి వీరుఁడనియు శుభగుఁడనియు మహా దృఢవ్రతుఁడనియు నెవని నిశ్శంకముగాఁ గీర్తింతురో యట్టి రామునిఁ బట్టఁగాంతరముల నూరేగించుట మీకగుఁగాని వనాంతరములకుఁ గొని పోవఁ దగునా?' యని యార్తాలాపంబులు గావించిరి.

వారి యార్తధ్వనులు రాముని ముందునకు సాగనీయవు; వ్రతభంగ భయము వానిని మరలనీయదు. అట్లు రాముఁ డురియాడు చున్న మనంబుతో రథంబునుండి దిగి యా ముదుసలులు కలయ వచ్చుటకై మెల్లగా నడువఁజొచ్చెను. అతఁడట్లు రథము దిగియు నిలువక చనుట వారు గాంచి భ్రాంతిసంతాపంబులంది, 'రామా! నిలు నిలు; ఇంతకన్న వడిగాఁ రాఁజాలము; ముదిమికిఁ దోడుగా మా మూఁపు లెక్కియున్న యగ్నిహోత్రంబులభారము మమ్ముఁ గదలనీయదు. నాయనా! ఎండవేడిమికిఁ దాళఁజాలవు. ఇదిగో వాజపేయయాగంబున మేము పడసిన శరన్మేఘశ్వేతచ్ఛత్రంబులు నీకుఁగాఁ దెచ్చుచున్నాము. వత్సా! వేదమంత్రంబులఁ దవిలియుండు మా బుద్ధి నేఁడు మమ్ముఁ

గాదని నీ వెంట వనంబునకుఁ దరలెను. మాపరమధనంబులైన నిగమంబులను స్వాత్మపేటికలందుఁ బదిలపఱచి, మాభార్యలను రక్షణార్థము పాతివ్రత్యంబునకు నప్పగించి, నిన్నుమరలించు నిశ్చయముతో వచ్చితిమి. ముదిమివలన హంసశుక్లంబులయ్యు దుఃఖాతిరేకంబున నేలఁబడి పొర్లాడుటఁజేసి ధూళిధూసరంబులైన శిరోరుహంబులుగల మాతలలతో నీకు మ్రొక్కి వేఁడుచున్నాము. మరలుము మరలుము. అర్థిజన వరదాన దీక్షారతుండవు నీవీ ధర్మంబు నుపేక్షింతువేని మఱి యే ధర్మంబు నపేక్షింతువు! ఇదిగాక పెక్కండ్రు బ్రాహ్మణులు యాగ సంభారములతో నయోధ్యకు వచ్చియున్నారు. నీవువచ్చినగాని వారి జన్నములు సాగవు; యజ్ఞవిఘ్నకారివి కావలదు. రామా! నీరాకను మేముమాత్రమేగాదు చరాచరభూతవర్గమెల్లఁ గోరుచున్నది. అదిగో చూడుము. వృక్షంబులు నిన్ను తఱిమి మరలింపనెంచి విసరివిసరి పీచుచుఁ దమ మూలంబులు కదలమింజేసి దుఃఖించుచు నిజవ్యసనంబును వాయువేగజనిత ధ్వనిరూపంబునఁ దెలుపుచున్నవి. పక్షులు చేష్టాహార సంచారంబు లుడిగి వృక్షైకస్థానవిష్టితములై మునినృత్తిఁబూని సర్వ భూతానుకంపహృదయుని నిన్నుఁ బ్రార్థించుచున్నవోయనఁ దోఁచుచున్నవి. ఆర్తులప్రణయములను నిరసింపరా'దని వివిధగతుల మొఱలిడిరి. వారికిఁ దోడ్పడుటకోయన నంతలోనఁ దమసానది యడ్డమయ్యెను. అంత రాముఁడు సారథిని బిలిచి, 'అశ్వములు బడలియున్నవి. రథము విచ్చి వానినిఁ బొర్లాడించి నీరుత్రావి యొడలుకడిగి నదీతీరంబున నలాయింపు' మనెను. అతఁడట్లు గావించెను.

వనవాస ప్రథమవాసరము

రాముఁడు సీతాలక్ష్మణులనుజూచి, 'మన వనవాసమునకు నిది మొదటి దినము. అదిగో వినుము; అరణ్యములు మృగపక్షిధ్వనుల ముఖంబున మనకు స్వాగతమిచ్చుచున్నవి. తమ్ముఁడా, అయోధ్యా వాసులకు మనమెడఁగల యనురాగమెట్టిదో వారి యనుతాపము తెలుపుచున్నది, తలిదండ్రులు కన్నీరొలికి యొలికి యంగులగుదురేమో యని భయమగుచున్నది. అయినను ధర్మాత్ముఁడు భరతుఁడు గలఁడు; అతఁడు వారి నూరార్చును. లక్ష్మణా, నీవు నా వెంటవచ్చుట యెంతో మేలయ్యెను. నీవురానిచో వైదేహీ సంరక్షణార్థము పరసాహాయ్య మపేక్షితమై యుండును. నాయనా, వన్యాహారములు పెక్కుగలవు; ఏదియు నామది గోరదు; నీరింత గ్రోలి యీరాత్రి గడపుదు'ననెను.

అంతలోన సూర్యుఁడస్తమించెను. ఎల్లఱుఁ గాలకృత్యములు దీర్చి వచ్చిరి. లక్ష్మణుఁడును సుమంత్రుఁడును బర్ణశయనంబు లేర్పఱిచిరి. అందు సీతారాములు శయనించిరి. వెంటవచ్చిన నగరవాసు లందందుఁ బఱుండి మార్గశ్రమంబునఁ గొంతవడికి నిద్రించిరి. సౌమిత్రి సుమంత్రు లకు మాత్రము కనుగూర్కఁదయ్యెను. రామగుణాభివర్ణనంబులతోడ వారికి రేయెల్లఁ గడచెను.

రాముఁడు పురవాసుల నేమరించి చనుట

రాముఁడు వేకువనే నిద్రలేచి వృక్షంబులక్రిందఁ బడియున్న నగరవాసులను గాంచి లక్ష్మణుని బిలిచి, 'తమ్ముఁడా, మనయందలి యనురాగము వీరి నింతదూరము లాగెను. వీరు తమ యిండ్లు వదలి వచ్చి యిట్లుండుటఁ జూడఁజాలను. మనలను మరలింపనచ్చిన వీరి మనో నిశ్చయ మంత సులభముగా మాఱదు. ప్రాణంబులను గూడ వీరు లెక్కించునట్లు దోఁపదు. వీరు మేల్కొనకమున్నే యిందుండి మనము చనుట యుక్తము. అట్లు గావింతుమేని వీరు మనలను గానక తుదకు స్వగృహంబులు చేరుదురు. అనురక్తులకు మృథాదుఃఖము గలిగింప రాదు' అని చెప్పెను. లక్ష్మణుఁడు వల్లెయనెను. సుమంత్రుఁడు రథము నాయత్తపఱచెను. అంత వారు రథము మీఁదఁ దమసానదిని దాటి యొడ్డుచేరిరి. రాముఁడు సుమంత్రునితో, 'సారథీ, మేము రథము దిగి యీ మార్గంబున వచ్చి నిన్నుఁ గలసికొందుము. నీవు రథంబు నుత్తర ముఖంబుగాఁ గొంతదవ్వు గొనిపోయి మార్గాంతరమున దానిని గొని రమ్ము. నగరవాసులు మేల్కాంచి జాడలుపట్టి మనము మరలి యయోధ్యకుఁ జన్నట్లు భావించి సట్టణమార్గముఁ ద్రొక్కి యిల్లు చేరుదురు. ఏమార్చినఁగాని వారు మనల వదల'రని చెప్పి, సీతాలక్ష్మణ సహితంబుగా రథము దిగి దాటిపట్టెను. సుమంత్రుఁడట్లు గావించి రథమును మరలఁ దోలితెచ్చెను. రామాదులు రథమెక్కి ప్రయాణ మంగళార్థము నాలుగడుగు లుత్తరముగాఁ జని తపోవనమార్గముఁ ద్రొక్కిరి.

పౌరులు రాముని గానక యిల్లు చేరుట

పౌరులు లేచి రామాదులను గానక నలుదెసలు వెదకివెదకి వేసారి శోకోపహతులై, 'కటా! పాడునిద్రకుఁ జిక్కి యీ విపత్తుఁ దెచ్చికొంటిమి. రామా! నీ భక్తులనిట్లు విడనాడుట పాడియగునా?

అయ్యో! మాయిబువేల్పు మమ్మెడసెను; ఇక బ్రదుకనేల? ప్రాయోపవేశమో మహాప్రస్థానమో మనకు శరణమగుఁగాక. అయ్యో! అయోధ్యకుఁ బోరాదు. కన్నవారెల్ల రాము నడుగుదురు. అడవికి వాని నప్పగించి వచ్చితిమందునూ? ఆ మాటచెప్పి పురజనుల నెల్లఁ గలంచుటకన్న యిందే మడియుట మేలు. చిదుకులు గలవు; చితిపేర్చి యందుఁజొచ్చి కడతేరుద'మని వివిధగతుల నటనటించుచుఁ దేరిజాడనుగాంచి పేరాసతోఁ గొంత దవ్వు చనిరి. అనల జాడలు గానరాకుండెను. 'కటా! దైవము దాయయయ్యె' నని నిరాశచెంది వారు మరలిరి. ఎంతనడచినను దారిసాగదు. ఎట్లో వారిల్లుసేరిరి.

రాముని వదలి వచ్చి నందులకుఁ దమ పతులనుఁ బౌరస్త్రీలు కోరుట

అట్లు వచ్చినవారికి వారిభార్య లెదురేగి సంగతివిని, 'రాముని వదలి వచ్చినవారికి నాలుబిడ్డలేల? లక్ష్మణుని జూచియేని స్వధర్మంబును గ్రహింపరా? సీతారాముల నుపచరించుటకన్న వేఱు భాగ్యము గలదా? నదీనద సరోవరంబులు వారి స్నానపానంబుల బవిత్రీకృతములు గానున్నవి; వృక్షంబులును సానుమంతంబులైన పర్వతంబులును వారికిఁ బ్రియాతిథ్య సత్కారంబులొనర్చి శుభములు పడయనున్నవి. పొదరిండ్లు భ్రమరఝుంకారస్తుతులొనర్చి ప్రసూనభారనమ్రమంబులైన వల్లికాహస్తములతో వారికిఁ బుష్పాంజలులొసంగి కృతార్థతనొందును. భూతువు లకాలపుష్పఫలార్ఘ్యంబు లిచ్చి స్వధర్మంబును రక్షించుకొనును. జడంబులు సయితమిట్లు రామారాధనంబునకు నువ్విళ్ళూరుచుండఁగా మీ రెట్లు వారిని వదలివచ్చితిరి? అయ్యో! మా కెంతయు సిగ్గయ్యెడు. ఇదిగో మేముఁగూడ వచ్చుచున్నాము. దరలుఁడు. జాగు వలదు. రాముని మీరును సీతను మేమును సేవించి జీవితసాఫల్యము నొందుదము. రామునితోడ ధర్మము వలసవోయెను. అధర్మదేవత కోసలరాజ్యంబునఁ గాలూనెను. ఇటనుండుట పాడిగాదు. కాదని యున్నను గైకేయీదాస్యంబునకుఁ జేతులొగ్గుటో ప్రాణమానంబులు వదలుటో తప్పదు. ఇంతకన్నఁ జచ్చుటేమేలు. మీరు క్షీణపుణ్యులరు గావున దరిద్రదేవతాగ్రస్తులై మహానుభావుని రాముని వదలి యీ పాడునగరముఁ జొచ్చితిరి. ఆకలిదప్పులకు వెఱచినచ్చితిరా! ఇంచుండి పాతకాన్నము తిని మనుటకన్న దేశాంతరమున విసముద్రావి చావరాదా? కటా! ఈ కపటనాటకసూత్రధారుఁడు దశరథుఁ డెట్టిపాటు గాంచునోగదా. అయ్యో! రామా! నీ నగుమోము మరలఁగాంచు

కలిమి మాకుఁగలదా? నీమృదువచనంబుల వినఁనోఁచుదుమా? నీ మధురాకారంబును సందర్శించు భాగ్యము మాకున్నదా? అరణ్యకము లకు నీ పరమసేవాభాగ్యంబును గూర్ప మమ్మువదలితివా?' యని పలు విధంబుల వారి మనస్తాపంబులను వెల్లడించిరి. వారి దుఃఖపటలమోయన నంతలోన ముంజీఁకట్లు గప్పెను. నగరమెల్ల శోభాదరిద్రాణమై తమం బున మునిఁగినట్లయ్యెను.

రాముఁడు కోసలదేశంబును గడచి చనుట

అట రాముఁడు సీతాలక్ష్మణులవెంటఁగొని తెల్లవాఱులోన గడుదూరము చని సూర్యోదయముతోడఁ బ్రాతస్సంధ్య నుపాసించి పయనముసాగించి మార్గాంతర వనంబులను విలోకించుచు, బీజా రోపణాయత్తకేదారంబులఁ గాంచుచు, నందందు గ్రామవాసులు గుమి గూడి కైకేయీదశరథులను గూర్చి పలుకు వచనంబుల విన నేవగించి హుటాహుటి నడచుచుఁ, జని చని పుణ్యతోయవతియైన వేదవతిని గడచి శీతజలశోభినియగు గోమతిని దాఁటి హంసరుతమనోజ్ఞమైన స్యందిక నతిక్రమించి, సారథిని బిలిచి, 'సుమంత్రా, పుష్పితవనవిలసితం బైన సరయూతీరంబునఁ దలిదండ్రులఁగూడి మృగయా విహారాదులు గావించు భాగ్యము మఱల నాకెన్న డొదవునో తెలియదు. మృగయా వినోదంబులు రాజర్షులకుఁ దగవందువా! నీమాట కాదనను. గుఱికిగా రాజులకు వేట యొప్పును. మఱియు శ్రాద్ధాదులందు మృగమాంసంబు నవశ్యముగా గణింతురుగావునఁ దదర్థముగూడ వేట నంగీకరించిరి. ఈ కారణంబులఁ జేసి నేను కొలఁదినిమాత్రమే వేటాఁడుచుంటిని. ఇఁక నావేట యెట్టిదిగానుండునో యూహింపరాదు' అని సంసర్గోచితంబుగాఁ బలు కుచు దారియందుఁ గానవచ్చు చిత్రంబులను సీతాదేవికిఁ జూపుచుఁ గ్రమ క్రమంబుగాఁ గోసలదేశముఁ గడచి, యయోధ్యవంక మఱలి చేదోయి జోడించి, 'కాకుత్స్థవంశరాజపాలితమైన యయోధ్యానగరమా, ఇదే నిన్ను రాముఁడు వీడ్కొనుచున్నాఁడు; చతుర్దశవర్షవ్రతము సలిపి పితృఋణముఁదీర్చి మగుడ నిన్ను సందర్శించు' నని పలికి, చూడవచ్చిన జానపదులదెసఁ దిరిగి కుడిభుజమెత్తి, 'సౌమ్యులారా, మీ దయాను భావంబులు మఱువఁజాలను; దుఃఖము దీర్ఘతరముగారాదు; ఇఁకమీరు చని మీ పనులు చూచుకొనుఁడ'ని చెప్పెను. వారు రామునకుఁ బ్రదక్షిణ నమస్కారము లాదరించి యశ్రుపూర్ణనేత్రంబులతో మఱలిరి. వారు చూచుచుండఁగనే రాముని రథము దృష్టికి దూరమయ్యెను.

పాడిపంటల సమృద్ధినిదెలుపు గోకుల కేదారంబులతోడ, రాజ్య మహాభ్యుదయంబును బ్రకటించు చిత్రనిర్మాణంబులతోడఁ, బ్రజాభోగైశ్వర్యంబులను జాటు వివిధోద్యానవనంబులతోడ, వేదప్రమాణ బుద్ధిని వితరణశీలంబులను ప్రదర్శించు యూపస్తంభముల తోడ నిరంత నిగమ ఘోషాప్రతిధ్వనులతోడ నిండి యలరారుచుండు దేశంబును వదలి చనుటకు హృదయమెంతో పరితపించును. దేశమునే గాక దేశాధిపత్యమునుగూడఁ ద్యజించుట యెంతకష్టమో యూహింప నగును. అట్టిదేశమును దేశాధిపత్యమును సమస్తబంధువర్గమును వదలి చతుర్దశవర్ష వనవాస శిక్ష ననుభవింపఁ బోవుచున్నను రాముని చిత్తము కించన్మాత్రము గూడఁ గలంగదు. ధీరులవృత్త మిట్టిదేగదా.

గుహునితోడి సమాగమము

రాముఁడట్లు కోసలము దాఁటి, శ్రీ మహావిష్ణుచరణంబులనుండి జాఱి ముక్కంటి జటాజూటమం దనతరించి సముద్రునిగూడి త్రిలోక పావనియను ఖ్యాతిని గాంచినదియు, తీరమందలి శ్రీమంతపుణ్యాశ్రమ ప్రదేశంబుల వలన నిజమాహాత్మ్యంబును బ్రదర్శించు చున్నదియు, దేవదానవ గంధర్వాది సంసేవితంబులయ్యు నిసర్గపరిశుద్ధ్యంబును బాయని తోయంబుల వలన స్వాత్మనైర్మల్యంబును జాటుచున్నదియు, జలాఘాతంబులనెడి మహోట్టహాసంబులతో లేనురంపుఁ జిఱునగవులతోఁ బ్రవాహరూప దీర్ఘతరవేణితో శోభిల్లుచు రమణీయపులినతలంబుల వలన నూత్నభావంబులను బ్రబోధించుచుఁ దీరస్థ పుష్పితలతాదామ సమలంకృత భుజాంతరయై ప్రసూనపరాగారుణంబులైన నీరంబు లాత్మీయానురాగ విభ్రమంబులను దెలుపుచుండఁగా సొబగారుచున్నదియు నైన గంగానదిని శృంగిబేరపుర ప్రాంతంబున సమీపించెను.

"సీ॥ నెగసినగొనలేచి నింగియంతంతకు
నవులఁద్రోవఁగఁ దనరారుదానిఁ,
జాగినశాఖా లాశాచక్రములకొలం
దులుబారవెట్టంగఁ బొలుచుదానిఁ
గవట లొండొంటితోఁ గదియుచు నెడములు
మ్రింగిప్రబ్వంగ సొంపుమిగులుదాని
లోనిజొంపము పవలును బెనుఁజీకటి
నొదవించి పొదలంగనొప్పుదాని

గీ॥ ద్విజకులారావమూఁక్రియ వెలయుదాని
పక్షికవిశ్రాంతియోగ్యమై పఱగుదానిఁ
దన్నదీతీరమునఁనిల్చి తనరుదానిఁ
గనియె నింగుదీభూరివృక్షంబు నొండు.''

రాముఁడా వృక్షముక్రింద నాఁడు నివసింపఁదలఁచి సీతాలక్ష్మణులతోడ రథంబునుండి దిగి తచ్ఛాయ నాశ్రయించెను.

అట గుహుఁడను నిషాదపతి యుండెను. వాఁడు రాముని రాక తన చారులవలన విని నిజకులవృద్ధులను మంత్రులను వెంటఁగొని యా చెట్టుకడకు వచ్చెను. రామలక్ష్మణులు వాని కెదురేగిరి. గుహుఁడు రామునిఁ గవుంగిటఁ బొదిలి, 'నా రాజ్యమెల్ల నీ యధీనము; మేము నీ బంట్లము; మమ్మునీ బాలింపనగును. నీ యట్టి యతిథిప్రియుఁడు మహా దుర్లభుఁడు; భక్ష్యభోజ్యంబులును బేయలేహ్యంబులును సిద్ధముగా నున్నవి; యథామతి నారగించి బడలికలు వాయనగు' ననెను. రాముఁడందులకుఁ బరమప్రీతుఁడై గుహునిఁ బునరాలింగనంబున గారవించి, 'మిత్రమా, సుఖముందువా? బంధువర్గమెల్ల లెస్సగదా. నినుఁజూచు భాగ్యము నాకు నేటికిఁ గలిగెను. నెచ్చెలి, రాజ్యాదులు నా కేల? నీ ప్రీతియే చాలు. తండ్రిమాట సేయఁగా వనాంతరతపోనిష్ఠను గ్రహించి నారచీరలుగట్టి వచ్చితిని. ఫలమో మూలమో యింతచాలు; భక్ష్యభోజ్యాదులన్నోల్ల; గుఱ్ఱములు డస్సియున్నవి. వానికిఁ గొంచెము మేత యిప్పింపుము. నా తండ్రి దశరథమహారాజునకు ని య్యశ్వరత్నంబులు మహా ప్రియంబు' లనెను. గుహుఁడట్లు గావించెను.

అంతలోనఁ బ్రొద్దుక్రుంకెను. రాముఁడు వల్కలమునే యుత్తరీయముగా ధరించి సాయంసంధ్యనుపాసించి లక్ష్మణుఁడు తెచ్చిన నీరింత గ్రోలి పాదప్రక్షాళనమొనర్చి యాచమించి నేలమీఁదఁ బడుండెను. వానివెంబడి సీతాదేవియు శయనించెను. లక్ష్మణుఁడు కతిపయపదముల దవ్వు చని రామరక్షార్థము ధనుష్పాణియై నిలిచియుండెను.

గుహలక్ష్మణుల సంవాదము

గుహుఁడు వారి దుర్దశకు మిగుల జాలిపడి లక్ష్మణుని డాయఁబోయి, 'నాయనా! ఇట్టి కష్టంబులకు మేమగుదుముగాని నీవు తగవు; రామరక్షణార్థము రేయెల్ల మేల్కొనియుందుము; అతనికన్న బ్రియుఁడు నాకుఁగలుగఁడు. నా మాట నమ్ముము. ఇదిగో నీ పడకపయి మేనువ్రాల్చి నీవును సుంత శ్రమవాయుము; వేఱు భావింపవలదు.

నా ప్రియసఖుని గాపాడు సుకృతంబునకన్న మహాభాగ్యము నాకుఁ గలుగునా? రాముఁడు మా యెడఁ బ్రసన్నుఁడేని సమస్తైశ్వర్యంబులు మాకు దక్కినట్లగును. నేను నా బంధువర్గముతోడ మిమ్ముఁ గాచి యుందును. ఈ వనదుర్గంబున నా యెఱుఁగనిది లే'దని చెప్పెను.

లక్ష్మణుఁడు గుహుని విని, 'అనఘా! నీవు రక్షకుఁడవుకాఁగా మాకిట భయముండునా? భయంబునఁ జేసి నేను మేల్కొనియుంట గాదు. రాజు దశరథనరేంద్రుఁడు బహుకాలము నానామంత్రానుష్ఠాన పూర్వకంబుగా ఘోరతపంబునఁ గ్రాగి ప్రియసుతుని నా యన్నను రాముని బడసెను. ఈయన యాగర్భశ్రీమంతుఁడు; జనకరాజసుత సీతాదేవి యెండకన్నెఱుంగదు. వీరిట్లు కటికనేలఁ బడియుంటఁ జూచుచున్న నాకంటికి నిదుర యెట్లువచ్చును? సుతవియోగ దుఃఖము మా తండ్రిని బెద్దకాలము మనసీయదు; కోసలావనియచిరంబ వైభవ్యమును బడయనున్నది; శుద్ధాంతము దుఃఖరోదన పరిశ్రాంతకాంతాశతమై మాటుమణుఁగ నున్నది; దశరథుఁడును గౌసల్యాసుమిత్రలును నేఁటి రాత్రిఁ గడతురాయని సంశయింతును. నా తల్లి సుమిత్రకు మఱియొక కొడుకుగలఁడు గావున నామె యొకవేళ జీవించినను జీవింపవచ్చునుగాని రామైకపుత్రిక కౌసల్యాదేవి జీవింపదు. మిత్రమా! ఈ తెలంపులు తెఱతెఱలుగా స్ఫురించి యేఁచి కలంచుచుండఁగా నాకు నిద్రవచ్చునా? మా తండ్రి రామపట్టాభిషేకమును సంకల్పించెనే గాని యది కొన సాగకమున్నే చననున్నాఁడు; పితృప్రేతసంస్కార భాగ్యంబును మేము నోచమైతిమి. నా తండ్రి జీవించియుండునందువా? పదునాలుగేండ్లు జీవించునా? అలోన మేము రాఁజాలముగదా. మిత్రమా! చతుర్వర సంస్థామనోహరంబును హర్మ్యప్రాసాదాభిరామంబును రథగజాశ్వ సమృద్ధంబును సర్వకల్యాణమనోజ్ఞంబునైన యయోధ్యానగరంబును మా తండ్రి జీవితకాలములో మరల మేము ప్రవేశించు కలిమి మాకుఁ గలదా?' యని గద్గదస్వనంబున నుడివెను. ఆ వచనంబులకు గుహుఁడు జ్వరాతురనాగంబువోలె వ్యథావ్యగ్రాంతరంగుఁడై బాష్పములు నించెను. అట్లాఁ డేయి యెల్ల లక్ష్మణునకు స్వపరిదేవంబులతోఁ గడచెను.

రాముఁడు సుమంత్రుని గుహుని వీడ్కొనుట

రాముఁ డంతలోన లేచి, 'లక్ష్మణా, అదిగో కృష్ణకోకిల కూయుచున్నది; కేకిధ్వనులకు వనమెల్ల మాఱుమ్రోయుచున్నది. భగవతి రాత్రిగడచెను; సూర్యభగవానుఁ డుదయించుచున్నాఁడు. గంగా

ప్రవాహము మహోద్ధతినున్నది; ఎట్లయినను నదిని దాటుద' మనెను. లక్ష్మణుఁ డా సంగతిని గుహునకుఁ దెలిపెను. ఆ నిషాదపతి తన మంత్రులకు నాజ్ఞాపించి తరణయోగ్యమగు నావను సిద్ధపఱచెను. రామ లక్ష్మణులు ఖడ్గకవచతూణీరంబులు ధరించి సీతాసమేతముగా రేవునకుఁ దరలిరి.

వారట్లు నావఁ జేరినంతట సుమంత్రుఁడు సమీపించి కయి మోడ్చి యాజ్ఞ వేడెను. రాముఁడు వానిఁ దన దక్షిణహస్తంబునఁ దడవి, 'సుమంత్రా! ఇందాక రథముమీఁద నన్ను గొనివచ్చితివి; ఇఁక బాదచారినై చనుదు. నీవు శీఘ్రముగా నయోధ్యకుఁబోయి మహారాజునొద్ద నప్రమత్తుండవై యుండు'మనెను. సుమంత్రుడు దుఃఖశ్రువులు నించుచుఁ, 'బ్రాకృతుఁడువోలె నిల్లాలినిఁ దమ్మునిఁ వెంటఁగొని వనవాసము సలుపనున్న నీయీ దుర్విపాకంబు నెవ్వరును దప్పింప లేరైరిగదా. బ్రహ్మచర్యవ్రతంబును గఠినంబుగా నాచరించితివి; ఆ ఫలోదయము వేదాధ్యయనంబును సలిపితివి; దయార్జవంబులకు జన్మస్థాన మనిపించుకొంటివి; అట్టి నీకే యిట్టి యిడుములు కలుగఁగా సద్గుణముల ఫలమేమి? ఇఁక వాని నెవరు గారవింతురు? రాఘవా! నీకుఁ బ్రైలోక్య విజయలక్ష్మి చేకూఱుఁగాక. మాగతి యందువా? నీ చేత విడువఁబడి పాపిష్ఠురాలగు కైకేయి బారిఁబడి దుఃఖంబులకు నప్పగించుకొంటిమి. ఇంతకన్న దుర్గతి మాకు రా'దని యెలుగెత్తి యేడ్చెను.

రాముఁ డతనిఁజూచి, 'సుమంత్రా! ఐక్ష్వాకులకు నీ పాటి నెచ్చెలి గలుఁగదు. డీలుపడవలదు. మహారాజు నన్నుఁ దలఁచి తలఁచి దుఃఖించుచుండును. ఆయన వ్యసనంబు నెఱ్ఱేని మాన్పుము. నా తండ్రి ముదుసలియుఁ గామభోగావసన్నుండును గావున నింతగాఁ జెప్పదును. రాజాజ్ఞకు నెదురుండరాదు. అభీష్టనిరాతంకసిద్ధికిఁగదా రాజులు రాజ్యాలు పాలించుట. సుమంత్రా! పరమపూజ్యుఁడును వృద్ధుఁడును దుఃఖమెట్టిదో యెఱుఁగనివాఁడునై న నా తండ్రికి నావలన నింతశోకము గలుగుటకుఁ జింతయగుచున్నది. నాకుఁగా నీవు వానికి నమస్కరించి యయోధ్యా నిరాకృతులమని గాని వనవాసశిక్షితులమని గాని మేము చింతించుట లేదనియుఁ బదునాల్గు వత్సరములు పుచ్చి వచ్చి సందర్శింతు మనియు, భరతునకు వెనువెంటనే రాజ్యముఁగట్టి వానిని గవుఁగిటఁ గూర్చుమనియు నందువలన దుఃఖమొకకొంత చల్లారుననియు నా విన్నపముగా నెఱిఁగింపుము. సుమంత్రా! భరతుని బిలిచి తండ్రియెడ

నెట్లో తల్లులయెడఁగూడ నట్లే యభేదభావముతో వర్తింపుమని చెప్పుడు. కైకేయి తనకుఁ గన్నతల్లియెట్లో కౌసల్యాదేవి నాకునట్లే గన్నతల్లి యగుట మఱువవలదనుము. జనకుని యాజ్ఞను దలఁదాల్పు మనుము. తండ్రిప్రీతికేని రాజ్యభారమును వహింపుమనుము.' అని చెప్పెను.

సుమంత్రుఁడా మాటలువిని, 'రామా! మాలిమివలన జంకు మాని యెదవిచ్చి పలుకుచున్నాను; ఉపచారార్థముగాదు. నా యీ యవినయంబును మన్నింపనగును. నీ వియోగకారణంబున నయోధ్య పుత్రశోకవ్యాకులయై యున్నది. నిన్ను విడిచి యచ్చటకు నే నెట్లు చనగలేర్తు? నిన్ను రథముపయి గూర్చుండఁబెట్టుకొని వచ్చితిని. ఇది యయోధ్యానగరమెల్లఁ గన్నారఁజూచెను. వట్టిరథమును గొనిపోదు నేని వారికి గుండియలు వ్రీలును. నిరంతరము హృదయాంతరములఁ బ్రతిబింబించుచునుండు నిన్ను నే డయోధ్యావాసులు గానక యెంత గుందుదురో యూహింపుము. వారిఁక నాహారములు మాని నీ యందే యాత్మల నిలిపి జీవితశేషముఁ బుత్తురుగాని యెండుసేయరు. మాబోంట్ల సంగతి యటుండనిమ్ము. నీతల్లి కేమనిచెప్పుదు? మేనమామయింట నవలివచ్చితినని బొంకుదునా? గుట్టలపాలొనర్చి వచ్చితినందునా? ఇంత యేల? నీవులేనిదే యీ గుఱ్ఱములు గదలునా? రామా! నిన్నువదలి యయోధ్యకుఁ బోజాలను; నీతోడనుందు; అనుజ్ఞయిమ్ము. నా మొఱ లకింపవేని సరథంబుగా నగ్నికి నర్పించుకొందును. రామా! ఇందాఁక నీ సారథ్యభాగ్య మనుభవించితిని; ఇఁక నీసేవాసంపద నభిలషింతును. దుష్కృతునకు స్వర్గమువోలె నిన్ను విడిచినట్టి నాకు నయోధ్యానగరము దుష్ప్రవేశమగును. ఏరథమునీఁద నిన్ను వనవాసార్థము దెచ్చితినో యారథమునీఁదనే నిన్ను నీవివాసానంతర మయోధ్యకుఁ గొనిపోవ నెంతయుఁ గోరుదును. నా మనోరథముఁ దీర్చి ధన్యునొనర్పుము. నీతోడ నున్నచోఁ బదునాలుగేండ్లు క్షణప్రాయమగును. నిన్నువిడిచి నచో నాకవి పదునాల్గుయుగంబులగును. భృత్యవత్సలా! నీలెంక మొఱ నిరసింపవలదు' అని వ్యసనకషాయస్వరంబునఁ బలికెను.

రాముఁడు వానితో, 'సుమంత్రా! నీ భర్తృవాత్సల్యము నాకుఁ గ్రొత్తకాదు. కొండొక ప్రయోజనంబునుగోరి నిన్నయోధ్యకుఁ బంపుచున్నాను. నిన్నువిని నా పినతల్లి కైకేయీదేవి నా వనవాసము నమ్మును. నా తండ్రినిగూర్చిన యామెశంక తీఱును; భరతునకుఁ

బట్టముఁ గట్టుదురు ; ఆమె యభిమతార్థము సిద్ధించును. మా తండ్రికి మా క్షేమసమాచారములను దెలిపి వానికి మనశ్శాంతిఁ గూర్తువు. ఈ కారణంబులు నుదినిడికొని నిన్నుఁ బంపుచున్నాను' అని చెప్పి యోదార్చి, గుహునివంక మఱలి, 'మిత్రమా, జటాధారణార్థము మట్టిపాలు తెప్పింపుము ; తపస్వివేషము మాకు మేలుసేయు' ననెను. గుహుఁడు నటఁజీరము తెప్పించెను. ఆ పాలతో రామలక్ష్మణులు జడలు దాల్చి నారచీరెలుగట్టి వైఖానస మతానుసారంబుగా వానప్రస్థాశ్రమము స్వీకరించిరి. అంత రాముఁడు గుహునితో, 'మిత్రమా, రాజ్యసంరక్షణము సులభకార్యముగాదు ; చతురంగబలంబులను జక్కఁగాఁ గాపాడుము ; కోశవిషయంబునఁ బరాకు చెందవలదు. దుర్గమంబులైన జనపదంబులను నొకగంటఁ గనిపెట్టియుండు' మని పలికి సీతాదేవిని బడవయెక్కించి యామెవెనుక లక్ష్మణునితోడఁ దానెక్కి, యాత్మహితార్థము క్షత్రవర్ణయోగ్యమైన యారోహణమంత్రంబును 'దైవీ' మను దానిని బఠించి భార్యాసమేతంబుగా నాచమించి యథాశాస్త్రము గంగాతరంగిణీమతల్లికి సతీసహోదరులతోడ నమస్కరించి గుహునిని సుమంత్రుని వీడ్కొనెను. కలాసు లోలపాటలతోడఁ బడవను దరలించిరి.

గంగాతరణము

ఆ తెప్ప నదీమధ్యంబునకుఁ జన్నంతట సీతాదేవి యాశైవలినికి నమస్కరించి, 'దేవీ! త్రిపథగామినీ! ఉదధిరాజపత్నీ! మంగళకరీ! దశరథరాజాత్మజుఁడు చతుర్దశవార్షిక వనవాసంబునకుఁబోవుచున్నాఁడు. మాకుఁ గుశలపునరాగమంబు ననుగ్రహింపుము. మా రాజ్యమును మఱలఁ జేరినంతట నీకు సహస్రసురాఘటంబులను మాంసభూతాన్నంబును సమర్పింతును ; నీతీరవాసులగు దేవతలను బూజింతు' నని ప్రార్థించెను. అంతతోన నావ దక్షిణతీరము చేరెను. రాముఁడు సీతాలక్ష్మణులతోడ దిగి దారిద్రొక్కి, 'సౌమిత్రీ, ఎన్నఁడును మనము కాలూనని విజనప్రదేశంబునకుఁ బోవుచున్నాము ; ఆత్మరక్షణ మవశ్యము. మాకు రక్షకుండవై ముందు నీవు చనుము ; నీ వెనుక సీతవచ్చును; మీ యిరువురను రక్షించుచు నెనుక నేనువత్తును. అన్యోన్యపరిత్రాణము మనకిచటఁ గర్తవ్యము ; కార్యము చెడినపిదప సవరింపరాదు ; నిర్జనంబును క్షేత్రారామవర్జితంబును నిమ్నోన్నతంబును బ్రపాతమయంబునైన యీ కాననమందు నివసించుట ఎంతక్లేశవంతమో సీతకు నవగతమగు' ననెను.

తొలిరాత్రి

లక్ష్మణుఁడు ముందునడచెను. వానివెనుక సీతయు నామెవెనుక రాముఁడును దరలిరి. వారట్లు తరలి, యనవరత పదక్రమోపక్రమమాన మహోద్విజవేదధ్వనులను అవిచ్ఛిన్నహూయమానాగ్నిహోత్రస్వాహా శబ్దంబులను అనేక మునిగణప్రణీతవచన విషయవిభాగ వినిర్ణయ న్యాయనిపుణ విద్వత్సభాసంభాషణఘోషంబులను బ్రతిపథదుర్విభేద ప్రమాణ విచార్యమాణ వేదార్థమీమాంసక గోష్ఠీవివాదనాదంబులనుం జేసి ప్రమోదించు యజ్ఞప్రయోగ ప్రవీణులైన యాజ్ఞికులకును విహితానుష్ఠానాసక్తులైన యనుష్ఠాతలకును నధికతపోనిరతులైన తపో ధనులకును నివాసంబుగానున్న యప్పుణ్యనదీతీరముఁ బాసి పయనము సాగించి క్రమక్రమంబుగాఁ జని సస్యశ్యామలమగు వత్సదేశముఁ జేరిరి. వారికి నాఁకలి పెల్లిదమయ్యెను. రామలక్ష్మణులు మనుఁబోతు, నేదు పందిని, దుప్పి, నల్లచాఱులేడిని వేఁటాడి తెచ్చిరి. ఆ మాంసంబులు వండి యెల్లరు నారగించి విశ్రమార్థమొకవృక్షము నాశ్రయించిరి. సూర్యుఁడస్తమించెను. రాముఁడు సాయంసంధ్య వార్చి, 'తమ్ముఁడా, మనదేశమును దాఁటితిమి; సుమంత్రుఁడు చనెను. మనవనవాసంబునకు నిదే మొదటిరాత్రి; సీతాయోగక్షేమములభారము మనపైనున్నది; రాత్రులందు బహుజాగరూకులమై యుండనలయును; ప్రొద్దుక్రుంకెను; పర్ణశయ్య నమర్చికొనఁ దడవులేదు; నేటికి నేలమీఁదనే పరుండుద' మని యట్లుగావించి, 'లక్ష్మణా! మహారాజు దుఃఖాతిశయంబునఁ జేసి నిద్రకుఁ బగయై యుండును. కైకేయి కృతమనోరథ గావున నూఱట చెందియుండును; పట్టాభిషేకార్థము భరతుఁడు వచ్చును; ఇఁక నేని తెనికి నెత్తిపొడుపులు తీయుఁగాక. తమ్ముఁడా! కామమెంత బలవత్తరమో కంటివా? కామవివశులను గష్టంబులంటియుండుటఁ జూతువా? కైకేయి నిరంకుశపథముఁ ద్రొక్కును; కౌసల్యాసుమిత్రలకు మన్నిమిత్తంబునఁ బలుబాములు తప్పవు. నా తల్లి యవియెల్ల నోర్వకతీఱదు; సుమిత్రాదేవి నా వలన దుఃఖభాగినియగుట సరిగాదు. మాతయు వారిదుఃఖమును విని యోదార్చువారును లేరు. తమ్ముఁడా! నీవేని యందున్న వారికిఁ గొంత యూఱట గిల్లును. నామాటవినుము; ప్రొద్దునలేచి యయోధ్యకుఁ జనుము; కౌసల్యను ధర్మజ్ఞుఁడైన భరతునకు నప్పచెప్పుము. అతఁడామెను రక్షించును. నా తల్లి జన్మాంతరమున మాతాసుతులకు వియోగముఁ గల్పించియుండు. దానిఫలమిప్పుఁడు సంప్రాప్తమయ్యెను.

చురంతదుఃఖమును మాటగట్టు నా యట్టి దౌర్భాగ్యసుతు నేతల్లియు గనకుండుఁగాక. సౌమిత్రీ! మనము నా తల్లిని వీడ్కొనునప్పు డామె పెంపుఁడు శారిక తోడిచిలుకతో 'కీరమా! శత్రుపాదమును గొఱకక విడువరా' దనుట వినునప్పుగదా' యని హెచ్చరించెను. ఆ మాట వింటివా? సఖీకిఁ గలంత జ్ఞానమేని నాకుఁ గలుగదు; తావన్మాత్ర ప్రియమేని నేను నా తల్లికిఁ జేయనైతిని. నాదియు నొక జన్మమా? మదేకపుత్రికను నా తల్లిని శోకసాగరంబున ముంచివచ్చితిని. నాయట్టి మందభాగ్యుఁడుండునా? పరాక్రమించియున్న చో సమస్తముఁ జక్కఁబడి యుండు నందువా? తమ్ముఁడా! ఇది పరాక్రమంబునకు సమయము గాదు. కాకున్న మతోక్కదండము ముల్లోకంబుల నుద్దుడికింపదా? అధర్మంబునకును బరలోకంబునకును వెఱచితిని; పట్టముగూడ నిరసించితి' నని పెద్దయుండడవు తన మనస్తాపంబును వెల్లడించి స్రుక్కిమంటలారిన వీతిహోత్రునివలె నిర్వేగమొందిన సముద్రునిక్రియ నుండెను. లక్ష్మ ణుఁడు సంగతి గ్రహించి, 'అన్నా! ఇట్లు నిరవధిక సంతాపసంతప్తుండ వగుట నీకుఁ దగదు. నీ యనుతాపంబునకు మూ లెయెదలు సందర్భము లగు చున్నవి. అన్నా! ఏ యాజ్ఞయైనఁ జేయుదునుగాని యయోధ్యకు నన్నుఁ బొమ్మనిమాత్ర మాజ్ఞాపింపనబదు. నిన్ను వదల' నని యూనిపలికెను.

భ ర ద్వా జా శ్ర మ ము

ఆ రాత్రి యట్లు గడచెను; పెల్లవాటి వారు కాలకృత్యములు దీర్చి తరలి యదృష్టపూర్వంబులును మనోజ్ఞంబులునైన నానాప్రదేశ ములు చూచుచుఁ బోసాగిరి.

"సీ॥ పద్మినీపద్మాతపత్రంబు శిథిలప
త్రాగ్రమైరాయంచ యాశ్రయించెఁ,
దాలప్రవత్నేన జాలంబుతో ఘోణి
పంచలనొంపి కలంచియాడెఁ,
దూగోర్గమద్దావ ధూమ మంబుదబుద్ధి
నెమ్మి లోపాదనుండి నిక్కిచూచె,
జతరస్థజలము నాసానాళమునఁబీల్చి
సామజం బిరుప్రక్కఁ జల్లుకొనియె,

గీ॥ సరసిపై నీరు సలసలబెరలె విపిన
సకలపీథులు నిర్మృగోచ్ఛాయములయ్యె
మట్టమధ్యాహ్నమిది సుధామధురవాణి
యర్పమిచ్చోఁ బథశ్రమ మపనయింప"

అని రాముఁడు ప్రియురాలికిఁ బల్కెను. అంతలో గంగాసంగమము చేరువయ్యెను.

అటకు భూమధ్వజమొండు గానవచ్చెను. ఆ చోటు భరద్వాజాశ్రమముగా నెఱిఁగి వారందుఁబోయి సమయముఁవేచి హోమక్రియా సమాప్తంబున నమ్మహర్షిని సందర్శించి తమ కత విన్నవించిరి. భరద్వాజుఁడు వారిని యథావిధి సత్కరించి సుఖోపవిష్టులఁ గావించి, 'రామా! చిరకాలమున కిందువచ్చితివి; నిన్నుఁజూడఁ గంటిని. వత్సా నీ వివాసకథను వింటిని. ఎందో నీవు పోనేల? గంగాయమునాసంగమ స్థానమైన యీ చోటు మహాపవిత్రమైనది. మఱియు నిది వివిక్తము. ఇందు సుఖముండు' మనెను. అనవుఁడు, 'ఋషిసత్తమా, మీ కెంతయు కృతజ్ఞుఁడనైతి. ఈ యాశ్రమము పౌరజానపదులకు సమీపముగా నున్నది. ఇటకు వారు సులభముగా రావచ్చును. ఏకాంతవాసము జనకతనయకు సుఖార్హమగును. అట్టితావు తెలుపవేఁడుఁ' నని రాముఁడు వచించెను. భరద్వాజుఁడు వాని హృదయము గ్రహించి, 'నాయనా! ఇటకుఁ బదిగోసులలోఁ జిత్రకూట పర్వతము గలదు. అది మహర్షి సేవితంబును బుణ్యవంతంబును సుఖదర్శనంబునై గంధమాదనంబునకు సాటిచేయ నొప్పియున్నది. ఆ నగముయొక్క శిఖరంబును దర్శించినంతనే సమస్తపాపంబు లుడుగును; శుభకాంక్షోత్సాహ మంకురించును. అందు మహర్షులు పెక్కుఁడు దీర్ఘతపములాచరించి సశరీర స్వర్గంబును గాంచిరి. అచ్చటి నివాసము మీకు నొప్పిదమైయుండు' నని నెను.

అంతలోన రాత్రియయ్యెను. రాముఁడు భార్యాలక్ష్మణులతోడ నాఁటిరేయి యందుఁబుచ్చి ప్రభాతంబున ఋషీంద్రుని సందర్శించి, 'మహానుభావా! రాత్రి యిందు సుఖముంటిమిఁ; చిత్రకూటంబునకుఁ జననున్నాము; అనుజ్ఞయి'మ్మనెను. భరద్వాజుఁడు వానిని దగ్గరకుఁజీరి, 'నాయనా, అచ్చట వివిధవృక్షములు గలవు; కందమూలములు కోరి నన్ని యున్నవి; అంచలి సరిత్ప్రసవణంబులును దరీకందరనిర్ఝరిణులును జూడఁ జూడ నింపుగూర్చును; మయూరరుతంబులు వీనులకు విందొనర్చును; కిన్నరగానంబులకు విరుమర యుండదు. అట నుచితాశ్రమంబును నిర్మించుకొని సుఖముండుము. శుభమగుఁగాక' యని వారి నెల్ల మనఃపూర్వకముగా దీవించెను. సీతారామలక్ష్మణులు మహర్షికి మ్రొక్కి దారిపట్టిరి. జనకుఁడు సుతులను బలె భరద్వాజుఁడు వారిని

గొండొకమేర సాగనంపి, 'వత్సా, రామా! గంగాసంగమంబునకుఁ జని, యందుండి పశ్చిమముఖంబుగాఁ బ్రవహించుచుండు యమునానది యోరఁ గొంత దూరము పొమ్ము. రేవొండు గాన్పించును. అట తెప్పయెక్కి నదిని దాటుము. ఆవలిగట్టున శ్యామలంబను పేరి గొప్ప మట్టివృక్షము గలదు. ఆ మహీరుహంబును సీతాదేవి నిజాభీష్టసిద్ధికై మ్రొక్కి ప్రార్థింపనగును. అట్లొనర్చి దానినీడఁ గొంతవడి విశ్రమించి బడలికలు వాయుము. అటకుఁ గోసుమేర నల్లనికాన గలదు. ఆ యరణ్యము పలాశబదరీవృక్షంబులతో నింగిరాయు వెదురుపొదలతోఁ గ్రిక్కిరిసియుండును. ఆ యడవి నెంబడిగాఁ జనుము; చిత్రకూటమును జేరుదురు. ఈ మార్గమునఁ బెక్కుసార్లు నేనటకుఁ బోయివచ్చితిని. దారి శిలాకఠినముగాక రమ్యముగానుండును; కార్చిచ్చులబాధ గలుగ'దని చెప్పి మఱల దీవించి మరలెను.

యమునాతరణము

సీతారామలక్ష్మణులు మహర్షిని శ్లాఘించుచు వాని సందర్శన భాగ్యంబునకు సంతసించుచు నమ్మహాత్ముఁడు చెప్పిన త్రోవఁ జని రేవు చేరిరి. అప్పుడు ప్రవాహము మహోత్తుంగతరంగభీకరమైయుండెను; దాఁటుటకుఁ దెప్పయొక్కటిగూడ నందులేకుండెను. అందులకు రామలక్ష్మణులు సుంతచింతించి యందందుఁబడియున్న కొయ్యలు సంతరించి వానిఁగూర్చి వెదుళ్లుపఱచి వట్టివేళ్ళతోఁగట్టి తెప్పను దయారుచేసి సుఖానసనార్థము నేరేడు కొమలును బ్రబ్బలితీఁగెలును బఱచి సీతాదేవిని మొదట నెక్కించి యామె వస్త్రాభరణంబులను దమ యాయుధంబులను బుటిక నందుంచి తామెక్కి గడవేయసాగిరి. ఆ తెప్ప మెల్లమెల్లగా నడియేటిలోనికిఁ బోయెను. సీతాదేవి యయ్యమునానదికి నమస్కరించి, 'తల్లీ! భగవతీ! నిన్ను గడచుచున్నాము. మాకు మంగళమగుఁగాక. నా భర్త సుఖముగా నయోధ్యానగరము చేరినంతనే నీకు వేయి గోవులను బదినూర్లు సురాఘటంబులను సమర్పింతు; అనుగ్రహింపు' మని ప్రార్థించెను. మఱికొంతవడికిఁ దెప్ప దక్షిణతీరము దాఁకెను. వారందుండి దిగి వటవృక్షమునకుఁ జనిరి. వైదేహి యా భూరుహమునకుఁ బ్రణమిల్లి భర్తకు సుఖననవాససమాప్తంబును దనకుఁ గౌసల్యాసుమిత్రలతోడి పునస్సమాగమంబును బ్రార్థించి ప్రదక్షిణించెను. అంత వారచ్చట సుంతతడవు విశ్రమించి పయనమైరి.

లక్ష్మణుఁడు ముందు దారి చూపుచుండెను. వానివెనుక సీతయు నామెవెంట రాముఁడును నడవసాగిరి. మార్గంబునఁ గానవచ్చు ఫల పుష్పాదులను వై దేహిగోరిన వానినెల్ల రాముఁడు తెప్పించి యిచ్చుచు నందందలి లతాపాదపంబులఁ గూర్చి యామె యడుగుదానికెల్ల సమా ధానము సెప్పుచునుండెను. అట్లు వారు నదీతీరముఁబట్టి క్రోశదూర మేగి యొకచోట నిలిచిరి. లక్ష్మణుఁడు పోయి భక్ష్యంబులైన మృగంబు లను వేఁటాడి తెచ్చెను. ఆ మాంసంబున వారు క్షుదార్తినిబాసి రాత్రి యగుటఁ జేసి యందే విశ్రమించిరి. సీతారాములు కనుగూర్కిరి. లక్ష్మ ణుఁడు వారిని గాచియుండెను.

చిత్రకూటమున వాల్మీకిని సందర్శించుట

విహంగధ్వనులు తెల్లవాఱుటఁ దెలిసెను. వారులేచి దినకృత్య ములు దీర్చి దారిఁబట్టిరి. విరియఁబూచి యాదీప్తంబులుగానున్న మోదుగవృక్షంబులును, నిండారఁ బండిన ఫలంబులభారంబునకు నుఱుతలూగుచున్న జీడిమ్రాకులును వసంతకాలసమావేశంబును దెలి పెను. తేనెతెట్టెలు ద్రోణప్రమాణములై శాఖాగ్రముల వ్రేలాడుచు వింతమురువు గొల్పుచుండెను. వనతలమెల్లఁ బూసెజ్జగాఁ దోఁచెను. వానకోయిల కూఁతలకు నెమిళ్ళు బదులుకూసికూసి యులయుచుండెను. ఆ వినోదంబులనెల్ల రాముఁడు సీతకుఁ జూపుచుఁ గ్రమక్రమంబుగాఁ జిత్రకూటముచేరి, యచటి ఫలమూల సమృద్ధంబును సరసోదకంబును మనోహరలతాతరువితానంబును బరికించి యిది తమకు వాసయోగ్య ముగా భావించి, యా పర్వతంబుననున్న వాల్మీకిమహర్షి యాశ్రమంబు నకుఁబోయి యా మునీంద్రునకు ప్రొక్కి వాని స్వాగతసత్కారంబు లంది తమవృత్తాంతంబులను వానికి వినిచి యందుండ నిశ్చయించెను.

పర్ణశాలాప్రవేశము

లక్ష్మణుఁడు దారుసామగ్రిని గూర్చి పర్ణశాలను నిర్మించెను. రాముఁడంతఁ దమ్మునిఁ బిలిచి, 'నాయనా, వాస్తుశాంతిఁ గావింపక గృహప్రవేశ మెనర్చుట చిరజీవులకుఁ గారాదు. కృష్ణసారమాంసంబున గృహాధిష్ఠాతృదేవతల నారాధించుట శాస్త్రవిహితమేగాక యాచా రముగూడ నైయున్న' దనెను. సౌమిత్రి తోడ్తోడఁజని యొక నల్ల యిట్టిని వేఁటాడి తెచ్చెను. రాముఁడు తమ్మునిఁజూచి, 'వత్సా, నేఁడు తిథిముహూర్తంబులు గానున్నవి. జాగుసేయక యైణేయంబును బక్వము

గావింపు' మనెను. సౌమిత్రి యట్లొనర్చెను. రాముఁడు స్నానమొనర్చి నియతుఁడై సత్రావసానికంబులైన మంత్రంబులు సంగ్రహముగా జపించి వాస్తుదేవతలను బూజించి వైశ్వదేవరౌద్రవైష్ణవబలులను సమంత్రకంబుగా నర్పించి వాస్తుశాంతికై పుణ్యాహవాచనాది మంగళంబులు సలిపి యథావిధి నదీజలంబులఁ దీర్థమాడి సర్వాపాపశమనంబు నుత్తమంబునైన బలియిచ్చి యాశ్రమయోగ్యంబుగా బలిహరణాది వేదికలును దేవాలయంబులును వీతిహోత్రగృహంబులు నేర్పఱచి ఫలమాంసంబులతో జలతర్పణంబులతో మంత్రజపంబులతో సమిత్కుశలతో శాస్త్రోపదిష్టంబుగా భూతతృప్తిఁగావించి సీతాలక్ష్మణసమేతంబుగా గృహప్రవేశ మొనర్చెను. అట్లు వారు పర్ణశాలయందు నివసించుచుఁ జిత్రకూట వినోదంబుల వలనను మాల్యవతీ సైకతవిహారంబుల వలనను స్వపురవియోగాది వ్యసనంబుల మఱచుటయ్యెను.

గుహుఁడు సుమంత్రుని వీడ్కొనుట

అట గుహుఁడు రామాదులను వీడ్కొని సుమంత్రుని దన యింటికిఁ దోడ్కొనిపోయి యథోచితమర్యాదల వానిని సత్కరించి మూన్నాళ్ళుంచుకొనెను. అంతలోనఁ జారులు వచ్చి రాఘవుల వృత్తాంతంబును చిత్రకూటపర్యంతముఁ దెలిపిరి. వారిరువురకుఁ గొంత మనశ్శాంతి యొదవెను. అంత సుమంత్రుఁడు నిషాదపతిని వీడ్కొని మూఁడవనాఁటి సాయంకాలమునకు నయోధ్యచేరి, రామవియోగతాపాగ్నివలన సంప్రాణికముగా దగ్ధమయ్యెనోయన మూఁటుమణఁగియున్న యా పట్టణంబును జూచి విభ్రాంతుఁడై తెనిస్థితి నెఱుంగు తమకంబునఁ బురము సొచ్చెను.

సుమంత్రుఁడు దశరథుని సందర్శించుట

సుమంత్రుని గాంచినంతనే పురమెల్ల గుంపుగూడెను. రాముఁడేఁడీ యనుమాట దక్క నొండు లేదయ్యెను. అతఁడు బదులాడలేక యెట్టకేలకు, 'గంగయొడ్డున దించివచ్చితి' ననెను. ఆ మాటతోడ మహారోదనముప్పతిల్లి నింగిముట్టెను. అతఁడు తలవంచి మెల్లమెల్లఁగా రాజగృహద్వారము ప్రవేశించి జనసంకులములైన కక్ష్యాంతరములు దాటి లోనికిఁజనెను. అట శుద్ధాంతకాంతామణులు గుమిగూడి, 'సుమంత్రుఁడు వచ్చెనఁట; రాముని గంగలోవదలెనఁట; కౌసల్యకు నేమని చెప్పునో? అయ్యో! ఆమె దుర్జీవము పగఱకుఁగూడవల'దని

గుదియలు పడుచుండిరి. సుమంత్రుఁ డామాటలు విని జీవచ్ఛవమై కదలకకదలి యెనిమిదవతొలికట్టుచొచ్చి యందుఁ బొండురగృహంబున శోకదీనుఁడై తొడుగువలెఁ బడియున్న రాజును దిన్నగా డాసి నమస్కరించి రాముని వడలివచ్చితిననెను. దశరథుఁడు విభ్రాంత హృదయుఁడై మూర్ఛిల్లెను; అంతఃపురస్త్రీజన హాహారావములు చెల్లు రేఁగెను. కౌసల్యాదేవి వానిని సుమిత్రాసాహాయ్యంబున లేవఁదీసి, 'మహాభాగా! వనవాసమునందుండి రాముఁడు పంపినదూతతో మాటాడవా? అధర్మంబునకు లజ్జింతువా? వగవకు; వగచియు ఫలము లేదు. సత్యపరిపాలనాపుణ్యము నేఁడు నీకు సపరికరంబుగా సిద్ధించెను. నూనమేల? కైకేయికినోడి యిట్లుందువా? ఆ యింతి యిచ్చట లేదు సుమా. అఱమఱలు మాని మాటాడు' మని పలికి యాత్మదుఃఖనిహత వోలెఁ గూలెను.

దశరథుఁడు కొంతవడికిఁ జేతి ధూళిధూసరుండును దుఃఖ దీనుండునై తన యోరనున్న సారథినిజూచి, 'సుమంత్రా! నా మది యిందు లేదు; ఆ కారణంబున నీ మాటలు వినరావు. నా ముద్దుపట్టి నెందువదలితివి? ఏ చెట్టు వానికి నీడయ్యెను? వాఁ డేమి తిని మనుఁదురు? ఎట్లు పరుండుదురు? రాముఁడేదేనిఁ జెప్పెనా? లక్ష్మణుఁడేమనెను? సీత యేమిపలికెను? సూతాగ్రణీ! ఇవియెల్ల వివరింపుము. అందువలన నేని నా కొక్కింత యూఱట గల్గునేమో' యనెను.

అనవుడు, 'రాజేంద్రా! రాముఁడు గంగలోఁ బడవయెక్కుచు నన్నుఁ బిలిచి, 'సుమంత్రా, నా తండ్రి విదితాత్ముఁడు రాజలోక వంద్యుఁడు. వానికి నా సాష్టాంగనమస్కారము లర్పింపుము. ఆవరోధ వ్రాతమునకు యథార్హము నా యభివాదము లర్పింపుము. నా తల్లికి నా కుశలప్రణామంబులందించి ధర్మము వదలవలదనియు నగ్నిహోత్రముల యెడఁ బరాకుచెందవలదనియు మహారాజును దైవంబుగా సేవింపు మనియు సపత్నులయెడఁ నభిమానగర్వరహితంబుగా వర్తింపుమనియుఁ గైకేయికి ననుకూలించి యుండుమనియు భరతునియెడ రాజమర్యాదతో మెలంగుమనియు రాజధర్మంబును మఱువరాదనియు మున్నగునవి చెప్పెను. మఱియు 'రాజు వయోవృద్ధుఁడు; వానికెదురాడవలదు; తండ్రియాజ్ఞ సేయుము. నా తల్లిని నీ తల్లివలెఁ జూచుకొను' మని భరతునితోఁ దనమాటగాఁ జెప్పుమనెను. లక్ష్మణుఁడు నిట్టూర్పు నిగిడ్చి, 'నిరపరాధిని బహిష్కరించితివి; అలఁతివై కైకేయికి లోఁబడి

తివి; మా కిట్టి యకార్యమొనర్చితివి; ఇదియెల్ల నీ యనుతాపమునకే యగును. ఇఁక నాకు రాముఁడే తండ్రియు బంధువు సర్వము' నని పలికెను. సీత యేమియు మాటాడక భూతావిష్టవలెనై నా ప్రయాణము విని కన్నీరు నించెను' అని సుమంత్రుఁడు సమయోచితముగా రామాదుల హృదయంబును వివరించి, 'రాజేంద్రా, రామలక్ష్మణులు జడలు దాల్చి వల్కలములు గట్టి గంగానదిని దాఁటు దాఁక యుండి శృంగిబేర పురమునకువచ్చి మఱలఁ బిలుపువచ్చు నేమోయను పేరాశతో గుహునియింట మూన్నాళ్ళు వేచియుంటిని. నా యాస నిరాస యయ్యెను. వారు చిత్రకూటముఁ జేరినట్లు తెలిసెను. అంత బయలు దేరి వచ్చితిని; రామవియోగంబున నీ దేశము దాల్చిన మారుఁబాటుఁ జూచితిని. పూచివిరిసిన వృక్షములెల్ల నిలువున నెండఁబాతెను; నదీసరోజలంబులు వెచ్చగిల్లెను; ఉద్యానవనంబులు శుష్కపలాశము లాయెను; వనస్త్వములు నడయాడు పాటి దక్కెను; క్రూర మృగంబులు నోరుచొచ్చిన జంతువునుగూడఁ జెనకకున్నవి. కమలంబులు దివాసమయమందే ముకుళించెను; నీరములు పంకిలము లయ్యెను; మీనంబులు చరింపవు; విహగంబులు విహరింపవు; పుష్పంబులు నిర్గంధములయ్యెను. ఎందును వికాసము గానరాదు. రామరహిత మైన నా రథమును జూచి పురమెల్ల దుఃఖాశ్రువులు వర్షించెను. ఏమి చెప్పుదు? ఈ విపరీతములకు నా ప్రాణము లెగయుచున్నవి; పలుక నోరాడదు' అని గద్గదస్వరంబున వచించెను.

దశరథుఁడు మూర్ఛగతుఁడగుట

దశరథుఁడా మాటలెల్ల విని మహోదైన్యమొంది, 'కటా! పాప బుద్ధియైన కైకేయి వరములుకోరెఁబో, మంత్రకుశలుల నాలోచింపక మోహమునకుఁ జిక్కి యింత గావించితినిగదా. ఇది మానుషికమో దైవికమో యూహింపరాదు. ఇదంతయుఁ గులనాశార్థము సంప్రాప్తమయ్యెఁ గాబోలు. సుమంత్రా! నా వలన నీ వెన్నఁడేని నుపకారమొంది యున్నచో నన్ను నా రాముని యొద్దకుఁ గొనిపోయి ప్రత్యుపకారమొనర్పుము. రాముని బాసి జీవింపఁజాలను. ప్రాణంబులు త్వరించుచున్నవి. సారథీ! రాజాజ్ఞ చెల్లునేని రామునే యిటకుఁ గొనిరమ్ము. వలదు. వలదు. రాకపోకలకుఁ దడవగును. నన్నే యటకుఁ దరలింపుము. హా! రామా! ఎందున్నావు? నీవు సీతాసమేతంబుగా నాకంటికిఁ గాన్పింపవా? అట్లు చేయనేని నీతండ్రిని మఱచిపొమ్ము. అయ్యో!

లోహితాశ్రులతో నాజానుదీర్ఘ బాహువులతో ముక్తామణికుండలంబు లతోఁ జూడఁజూడ ముచ్చటలు గురియు నిన్ను మరలఁ గాంచెడు భాగ్య మీ పాపాత్మునకుఁ గలదా? హా! రామా! హా! సీతా! హా! లక్ష్మణా! వ్యసనంబునఁ జావనున్న నన్నుఁ దలంపరా? కౌసల్యా! పుత్రవియోగమహాభోగమై సీతా విరహపారము గలిగి శ్వాసితోర్మి మహా వర్తంబును బాష్పఫేనజలావిలంబును బాహువిక్షేపమీనౌఘంబును విక్రందనమహాస్వనంబును బ్రకీర్ణకేశశైవాలంబును గైకేయీబడబా ముఖంబును గుబ్జావచనగ్రాహంబును వరద్వయ వేలాయితంబును వివాసాయతంబు నగు నిమ్మహాశోకసాగరంబునుండి నన్నుద్ధరింప రాముఁడు దక్క నొండు సమర్థుఁడుగాఁడు. వాఁడు రాకున్న నీకు నేను దక్కుటకల్ల. అహో! రామా! అహో! లక్ష్మణా! మీకై పనవ్వదు: నిమ్మునుఁ జూడఁ గోరుదు; కాననరాఁగలే? నన్నుఁ ద్యజించి తిరా?' యని మూర్ఛాగతుఁ డయ్యెను.

కౌసల్యా పరిదేవనము

సుతశోకంబున మ్రగ్గుచున్న కౌసల్యాదేవికిఁ బతిమరవష్ట పుంటిపై ముల్లడచినట్లాయెను. ఆమె పిశాచావిష్టవలె వడఁకుచు వివశయై నేలఁ బడి కొంతవడికిఁ దేఱి,

"సీ॥ కానక కన్నసంతానంబు గావున
గానక కన్నసంతానమయ్యె
నరయ గోత్రనిధానమై తోఁచుఁగావున
నరయ గోత్రనిధానమయ్యె నేఁడు
ద్విజకులాదరణ వరిష్ణుఁడు గావున
ద్విజకులాదరణ వరిష్ణుఁడయ్యె
వివిధాగమాంత సంవేద్యుఁడయ్యె గావున
వివిధాగమాంత సంవేద్యుఁడయ్యెఁ

వ॥ గటకటా! ధాశరథి సముత్కటకరీంద్ర
కటకలితదాన ధారార్ద్రికటకమార్గ
గామి చరియించుటయ్యె నుత్కటకరీంద్ర
కటకలితదాన ధారార్ద్రికటకతటుల"

అని బహుభంగుల వాపోయి,

'సుమంత్రా! నా బిడ్డలున్న యెడకు నన్నుఁ గొనిపొమ్ము; వారిని విడిచి బ్రదుకనోపను' అని దురపిల్లసాగెను. సుమంత్రుఁడు కేలు

మోడ్చి, 'తల్లీ! దుఃఖము మానుము; మోహావ్యాకులము వలదు. రాముఁడు వనమందు సుఖమున్నాఁడు. ధర్మజ్ఞుఁడును విజితేంద్రియుఁడు నైన సౌమిత్రి భ్రాతృసేవామూలంబునఁ బుణ్యలోకములు సాధించుచున్నాఁడు. సాధ్వీమణి సీతాదేవి రామలినహృదయయైై యింటవలె వనమందుఁగూడ సుఖమున్నది. ఆమె ముఖంబున వివాసదుఃఖము లేశమాత్రముఁగూడఁ గానరాదు. మార్గాయాసమునఁ గాని గాలివడ తాకునఁగాని యామె మేను గసుగందదు; ఆమె పాదములు లాక్షారవర్జితములయ్యుఁ దామర మొగ్గచెన్ను దొఱఁగవు. రామభుజాసంశ్రిత గావున నామె గజములఁగన్నను బెబ్బులుల బొబ్బరింతలు విన్నను సింగంబులు చేరువఁజన్నను బెగడొందదు. వారిలో నెవ్వరికిని నీవు దుఃఖింపవల'దని పెక్కువిధముల నూరార్చెను.

కౌసల్యాదేవి సుతునిదలఁచితలఁచి నొగులుచు, 'నాథా! దయామూర్తివనియు మహాదాతననియుఁ బ్రియవాదివనియు ముల్లోకములు నిన్నుగ్గడించుచున్నవి. అట్టి నీవు నీబిడ్డలను సుఖసంవృద్ధులనెట్లు కాఅడవికిఁ దోలితివో యూహింపరాకున్నది! తరుణియు సుకుమారియు సుఖోచితయునైన జానకి గహనాంతరసీమలఁ జివికి నశింపకుండునా? ఆ బిడ్డలు తృణధాన్యంబులు తిని మనుదురా?' అని పలికి 'హా! రామా! కమలాయతలోచనా! తమ్మితావినిట్టూర్పులఁ గ్రాలునట్టి నీ ముద్దు మోము నెన్నడు చూడఁగలను? హృదయమా! ముద్దుపట్టిని బాసిన వగకు వ్రీలవేల? రాజేంద్రా! భరతునకుఁ బట్టముఁ గట్టనున్నావు. అధికార మింత తీపనరాదు. ఒకసారి మరగిన మానుటకల్ల. భరతుఁడు తనచేతిలోని రాజ్యకోశంబులను వదలఁడు. రాముఁడు మరలివచ్చినప్పుడు వానికేమి యిత్తువు? ఒకవేళ భరతుఁడు పెద్ద మనస్సుచేసి రాజ్యకోశములను వదలినను భ్రాతృభుక్తంబును రాముఁడిచ్చగించునా? పెఱమెకము ముట్టిన మాంసంబును బెబ్బులిగూడఁ దాఁకదుగదా! రాత్రిగడచిన హవిరాజ్యాదుల నధ్వరాంతరంబునకు గ్రహింపనట్లు చవిగన్న సురను గ్రోలనట్లు భరతుఁడిచ్చు రాజ్యంబును రాముఁడు గ్రహింపఁడు. తండ్రివగుట నీపయి రాముఁ డలుగకుండెను. తత్ఫలముగా వానికి రాజ్యచ్యుతియు దేశాంతరగతియు దీఱని తలవంపును సంప్రాప్తము లాయెను. నా బిడ్డ విల్లెక్కుపెట్టునేని నభంబు సతారకంబుగాఁ గూలును; స్వర్గంబుట్టిపడును. భూమండలం బుట్టలుగాను. తోఁక తాకును బెబ్బులి యోర్చిన నోర్చుఁగాక; రాముఁ డసహ్యాకారంబు నెంత

మాత్రము సహింపఁడు. పదునాల్గులోకము లెత్తివచ్చినను వాఁడు భయ పడువాఁడు గాఁడు. ధర్మంబునకు మాత్రము గట్టువడును. తత్కులముగా వాని కీగతియయ్యెను. మత్స్యము తనపిల్లలకునట్లు నీవు వానికి దెప్ప రంపు ముప్పు గలిగించితివి. శాస్త్రసృష్టమును సనాతనమునైన ధర్మము నీయందింక నిలుచునా? స్త్రీకిఁ గ్రమంబుగా భర్తయు సుతుఁడును జ్ఞాతియు గతియగునందురు. సవతికి వల్లభుఁడవై తొలిగతిని నాకు నెఱ సున్నగావించితివి; కొడుకును దక్షిమినైచి రెండవగతికి నన్ను దూర మొనర్చితివి; జ్ఞాతిసమాశ్రయము భాగ్యముగాదనుట లోకవిదితము. అయ్యో! యెల్లవిధముల నన్నుఁ జెఱచితివి. రాజ్యమును జెడిపితివి. నీవును జెడితి' వనెను.

ఆ మాటలు బ్రహ్మాస్త్రములై తాకఁగా దశరథుఁడు సకలేం ద్రియ వివశుఁడయ్యెను. వాని యంతరాత్మ యేకాగ్రత నహించెను. అట్లతఁడు ఋణముసేపుండి కనువిచ్చి కయిమోడ్చి, 'దేవీ! ప్రసన్న వగుము; అంజలి యొనర్తును. పగతుఁఱుగూఁడఁ బ్రోచిమించు నీవు నాయెడఁ గనికరమూనక తప్పదు. నీ దుఃఖమునకు మేర లేదు; ఈ యనర్థమునకు నేను కారణమైతి' నని సకరుణముగాఁ బలికెను. కౌసల్యాదేవి తన పతి మోడ్పుఁ జేతులను నిజకరకమలంబులఁ బొదివి శిరమునఁ దాల్చి, 'నాథా! ఱమింపుము. తలతో ప్రొక్కి వేఁడుచున్నాను. భర్తృయాచితనై మహాపాతకంబు నొడిగట్టితిని. ఈ పాపపరిహారమునకుఁ బ్రాయశ్చిత్త మును వేఁడుదును. ధర్మజ్ఞా! ధర్మతత్త్వము నొకక్రొంత యెఱుంగుదు; నీవు సత్యసంధుడవగుట క్రొత్తగాదు; అయినను బుత్రశోకమట్లు పలి కించెను. శోకమువలన ధైర్యము నశించుటయు విద్య సన్నగిలుటయు నీకుఁ దెలియదా. శోకమువంటి శత్రువున్నదా? వైరిప్రహరణంబున కన్న శోకసహతి మహాతీక్ష్ణముగదా. సర్వధర్మము లెఱింగిన వేద మూర్తులు సయితము శోక కారణంబున నజ్ఞానంబునకుఁ జిక్కుట గలదు. స్త్రీమాత్రురాలిసంగతి చెప్పవలయునా? నా రాముఁడు చని నేటికైదు రాత్రులయ్యెను. ఈ పంచరాత్రంబులుఁ బంచవర్షంబులుగా నున్నవి. సుతుని దలఁచినంతనే నా యెడదు పొరలి వెల్లివిరియు చున్నది. ఈ దీను రాలి యపరాధమును మన్నింపు' మని వ్యసనస్వరంబున నుడివెను.

దశరథుఁడు నిజశాపవృత్తాంతమును దెలుపుట

అంతలోన సూర్యుఁడస్తమించెను. దశరథుఁడు దుఃఖవిపాకంబున మైమఱచి కొంత తడవు నిద్రించి కనువిచ్చి చెంతనున్న కౌసల్యాదేవిని

జూచి, 'ప్రేయసీ! శుభాశుభంబులు కర్మానుగుణంబులై యుండును. వానిని సహింపక తీఱదు. అయినను గుణదోషంబులను గౌరవలాఘవంబులను విమర్శింతురు. పూలకుఁగా మోదుగను బెంచి మెలమావిని బెఱికివైచువాఁడు ఫలప్రాప్తికాలంబున దుఃఖభాగుఁడు కాకమానఁడు. నా గతియు నట్టిదేయయ్యెను. నా విజ్ఞప్తిఁగుఁదనమే యిందులకుఁ గారణము. తెలియక చేసినను దెలిసిచేసినను కర్మఫలము దప్పదు. సంగతి వినుము. శబ్దవేదివిద్య నాకు బాల్యసుండే సిద్ధించెను. వేటాఁడునప్పుడు మృగము కంటికిఁ గానరాకున్నను సడివట్టి వైచి దానిని వధించునేర్పు తద్విద్యాప్రభావంబునఁ గలిగెను. మునివివాహమునకు మున్ను కొండొకయేఁడు యథాగతి సూర్యభగవానుఁడు నిజకిరణంబులఁ బఱచి రసములెల్ల గ్రహించి పుడమిని సంతాపము పాలొనర్చి ప్రేతాధిష్ఠిత మును భయావహమునైన దక్షిణదిశను బ్రవేశించెను. వానికై యుడుకుచున్న వసుంధరకుఁ దాపోపశాంతి గావించుటకోయన వర్ష ఋతువు వచ్చెను. ఎల్లెడల వేడిమి చల్లారెను; నల్లనిమేఘము లంతరిక్షము నావరించి భేకసారంగమయూరంబులకు సంతసమును గూర్పసాఁగెను. వాతవర్షంబులకు నూఁగుచున్న కొమ్మలందు పక్షులు వ్రాలి స్నానాంతరము తడియాఱుచున్నవోయన తెక్కలను విదిలించుకొనుచుండెను. నదులు గైరికాది ధాతుసంయోగంబునఁ బొంగురారుణంబులైన జలంబులనిండి కార్చిచ్చు బూదిబ్రుంగిన సర్పంబులఁ దలపించుచుఁ బ్రవహింపఁ జొచ్చెను. అట్టిసమయంబున నేను ధనుర్బాణములు ధరించి రథమెక్కి మృగయావిహారార్థము సరయూతీర వనము జేరితిని.

"సీ॥ సింహనఖాంకురచ్ఛిన్నవారణకుంభ
జనితముక్తాఫల శర్కరిలము,
సముదసూకర పరస్పరభీకరాఘాత
శిథిలదంష్ట్రాచూర్ణ సికతిలంబు,
గంధసింధుర ఘటాకట కటావస్రవ
ద్బంధురదానాంబు పంకిలంబుఁ
దవగంధవహబంధు దందహ్యమానేక
కాశికాగురుధూప గంధిలంబు,

తే॥ పృథులషడ్జస్వరోద్గీత భిల్లపల్ల
వాధరాగీతికా కర్ణ నాతిభీతి
పరవశాత్మపటీరకోటరకుటీర
లీనఫణియగుచు నపు డక్కాఁ;

రాత్రియయ్యెను; రేవు పొంచితిని. మృగములు నీటికై యటకు వచ్చెను. నాఁడు చీఁకటి మహాగాఢమై యుండెను. మృగముల సడి మాత్రము వినవచ్చుచుండెనే గాని యవి కానరాకుండెను. శబ్దవేదిని గావున సడివట్టి యందుఁగొన్నిటి వైచితిని. అంతలో నేటియందు గుబగుబధ్వని యొండు వినవచ్చెను. గజము నీరుద్రావుటకుగా నెంచి యావంకఁ గోలవైచితిని. 'అయ్యో! అయ్యో! తాపసిని. నిరపరాధిని. జాలార్థమువచ్చితిని. ఎవఁడో కోలవైచెను; ప్రాణములు పోవుచున్నవి. కటా! నారచీరలుగట్టి కూరనారలుతిని జీవించు మమ్ముఁ జంపినఁ గార్యమేమి? నన్నుఁ జంపిన జంపుఁగాక. నా తోడ నా తల్లిదండ్రులను వగ్గుముదుసళ్ళను జంపుచున్నాఁడు. ఈ యకృతాత్ముఁ డెవఁడో' యను మాటలు వెనువెంట నా చెవిఁ బడెను. నా ప్రాణములు నిలువున నెగచెను; నేను శోకసంభ్రాంతి దీనుఁడనైతిని. నా తనువెల్ల ఘర్మాన్వాటు చెందెను. సఖీ! ఎట్టకేనికి నా యుత్తలపాటును సుంత సమదాయించు కొని రేవునకుఁ బోయి యట విరిసినజడలతో నెత్తుఱు వట్టొడ్డు చున్న మేనితోఁ బడియున్న మునికుమారుని జూచి భయవిహ్వలుఁడ నైతిని; నాకు మతి దప్పెను. ఆ మునిపుత్త్రుఁడు నన్ను గఠోరవీక్షణంబులఁ దేఱిచూచి, 'రాజా! ననవాసిని. గుర్వర్థము జలములకై వచ్చితిని. నీ కెట్టి యపకారంబును గావింపను. నన్నుఁ గోలవైచి కూల్చితివి. నా తోడ నా తలిదండ్రులను బరమాంధులను గడువృద్ధులను జంపు టయ్యెను. వారు కదలమెదలలేరు; పిపాసార్థులై యున్నారు; నన్ను నిరీక్షించుచుందురు. కటా! ఎంత తపస్సుచేసిన నేమి? ఎంత విద్యా ధనమున్న నేమి? కర్మగతి తప్పదుగదా! అయ్యో! తండ్రీ! నా గతి యిట్లయ్యెను. కాలులేమి నీవు కదలజాలవు. కడసారి నన్నుఁ గాంచు కలిమిగూడ నీకుఁ గలుగదు. గాలికి విఱిగిపడు చెట్టును వెంబడిచెట్టు చూచుచుండునేగాని తోడ్పడ నేర్చునా? దశరథా! నీవు నెంటనేచని నా తండ్రికి నా సంగతి తెలుపుము. అట్లు చేయుదువేని వాని కోపము నకు గుఱియగుట నీకుఁ దప్పును. ఒండుచో నిన్నతఁడు బూది సేయును. ఇదిగో యీ త్రోవఁబట్టి పోయినచో నా తండ్రి యాశ్రమమును జేరుదువు. రాజా! ప్రవాహవేగము మెత్తనిదరినట్లు నీ కఱకుటమ్ము నా మర్మములను హరించుచున్నది. తాళజాలను; కోలను బెఱుకివైచి నా కొక కొంతయూఱటఁ గూర్పు' మనెను.

'దేవీ! వానిని జూచి యామాటలు విన్నంతనే నన్ను దిగులు పైకొనెను. శరము నూడతియ్యుదునా? వానికిఁ జావు సిద్ధము. దాని నల్లెయుంతునా? వానిబాధ యోర్వరాదు. నా తలఁపుచిక్కఁ న మ్మునిసుతుఁడు గ్రహించి, 'రాజా! తడయవలదు. బ్రహ్మహత్యనొనర్చితినని బెంగపడకుము. నేను శూద్రికి వైశ్యునివలనఁ బుట్టితి'నని పలికెను. వానికి శరబాధ దుర్భరమయ్యెను. అతఁడు గొంతవడి గిరగిర దొర్లాడెను; కొంతసేపు చచ్చినట్లుండెను. వాని యవస్థఁ జూడనోపక ప్రాణమును బెరకివైచితిని. అతఁడు వెనువెంటనే ప్రాణములు విడిచెను.

'సఖీ! వాని చరమస్థితినిగాంచి యేమిసేయుటకుఁ దోఁపక కొండొకతడ వందే బ్రహ్మాస్త్రడియుండి యెట్టకేలకు నిశ్చయించుకొని మునిసుతుఁడు తెచ్చిన ఘటమునిండ నీరు గైకొని మెల్లమెల్లగా నయ్యాశ్రమమును జేరితిని. అటఁ బరమాంధులు లిద్దఱు తెక్కఁ తెగినపక్షులు వలెఁ బడియుండిరి. వారిని జూచినంతనే నా వ్యసనము పొరలి మితిమీఱెను. వారు నా కాలిచప్పుడు విని, 'నాయనా! వచ్చితివా? నాలుక యీడ్చుచున్నది. కొంచెము నీరిటులిమ్ము. నత్తా! నీకై నీ తల్లి మిక్కిలి పరితపించుచున్నది. పుత్త్రా! మాపయి నలిగితివా? ఇంత జాగు నకుఁ గారణమేమి? ఏదేని యప్రియమొనర్చితిమా? చనవునఁ జేసి పలుకరానిది పలికితిమా? ఎవరేమి యొనర్చినను తపోధనులకు నాగ్రహము కూడదు. ఎల్లవిధముల మేము దిక్కులేనివారమై యున్నాము. కన్నులు లేవు; కాలు కదలదు. నీవే మాకుఁ గన్నులుఁ గాళ్ళు సర్వమునైతివి. మా ప్రాణములు నీ చేతనున్నవి. పట్టీ! పలుక వేల?' యని యా వృద్ధతాపసి యనెను.

'ఆ మాటతోడ నాకుఁ గన్నులు పచ్చనయ్యెను; నోటఁ దడి యాఱెను. మాట వెలువడకుండెను. నా తత్తఱపాటు నాక కొంత యడఁచికొని, 'మహాత్మా! నీసుతుఁడు కాఁడు. నా చేఁ దశరథుఁ డందురు. కర్మవశంబునఁ బరమదుఃఖభాగినై వచ్చితిని. వేఁటతమి యింత తెచ్చెను. సంగతి వినుము. మృగయార్థము సరయూతీరమున రేవుగాచి యుంటిని. ఏఁటిలో గుబగుబ ధ్వని వినవచ్చెను. ఏనుంగని యెంచి శబ్దవేదిని గావునఁ బెండ్లికటిలో సడివట్టి కొలవైచితిని. 'అయ్యో! అయ్యో! తాపసిని, జలార్థము వచ్చితిని జచ్చితి'నను మహార్త వచనములు నా చెవిఁబడెను. సంగతి యేమో యని యా వంకకు హుటాహుటిఁబోయి యట ముసిసుతుఁడు తొమ్మునినాటిన శరంబునకుఁ

దల్లడిల్లుచుండుటఁ జూచితిని. అతఁడు నన్నుఁగాంచి పెద్దయు విలపించి కోల నూడఁతీయుమనెను. నే నట్లొనర్చితిని. అంత నతఁడు మీ సంగతిఁ దెలిపి మీకుఁగా మహోచింతాక్రాంతుఁడై ప్రాణములు విడలెను. తపోధనా! నీ సుతునిఁ గావక చంపితిని; కలరూపు తెలిపితిని. కర్తవ్య మూనతింపు' మని వానిని వేడితిని.'

'ఆ ఋషి హృదయవిదారణమైన యా దుర్వార్తకు వ్యసనాగ్రహ వివశుఁడై

"ఉ॥ భానుకులప్రనూతులు కృపాపరులంట యవధ్యహింసకుఁ
బూననిపుణ్యులంట గుణభూషణులంట యథాపరాధ దం
డానుపమానశౌర్యనిధులంట మునిప్రియులంట నేఁడయో!
కానకకన్న మాసుతుఁ బొకారిచి యన్నియు మిథ్యచేసితే?"

"మ॥ మునిజీవాతువు లజ్జబంధుకులసంభూతుల్ నయోపేతు ల
త్యనుకంపాపరులంచు నమ్మితిమిగాకయ్యో! జిఘాంసఁ గిరా
తుని చందంబున నొంచితీ వనపరాధుఁ సాధు మత్పుత్రుఁ బం
డెనె కోర్కుల్? ఫలియించెనే విశిఖపాండిత్యంబు నీ కింతటఁ?"

అని దుఃఖంబును వెలిపుచ్చి, 'రాజా! స్వయముగా నీ విందు వచ్చి తప్పుదాఁపక తెలిపి మననోఁచితివి. కానిచో నీ తల వేయి పఱియలై యుండును. రాజా! నరహత్యా దోషము తప్పదు. తెలియక యిట్లొనర్చితివనుట స్పష్టము. అందువలననే బ్రతికి యిందురాఁగలిగితివి; ఇక్ష్వాకువంశ సమూల నాశనంబునుఁ దొలంగెను. దశరథా! పుత్త్రుని సజీవునిగాఁ జూచుకలిమి యిఁకఁ గలుగదు. వాని శవమునేనిఁ జూతుము. మమ్మటకుఁగొని పొమ్మ' నెను. వారిని మోచికొని పోయి యా శవము చెంత దింపితిని. వారా శవంబును దడవి తడవి పడిన పరితాపంబునకు మేరగలుగదు. తల్లి మూర్ఛాగతయై నేలవ్రాలెను. తండ్రి వెల్లు విల పించుచు, 'కుమారా! తండ్రికి నమస్కరింపవా? తనయా! పలుకవా? నాయనా! అలిగితివా? పుత్త్రా! నీ తల్లినేనిఁ జూడవా? అర్ధరాత్రమున లేచి నీవు చేయు వేదాధ్యయనంబును విను భాగ్యంబు నేటితో మాకు ముగిసెనా? తెపును మాపును నీ వొనర్చు శుశ్రూష లెల్ల మాకుఁ దీరెనా? చూడఁగన్నులును నడువఁగాలును లేవు; ఎందును బోఁజాలము. ఏపనికిఁ దగము. ఇఁక మాకు దిక్కెవ్వరు? కూటికి నీటికిఁ జివికిచచ్చు దుర్గతి మానొసఁట వ్రాసియున్నది. పుత్త్రా! నీ వెంట మమ్ముఁగూడఁ గొనిపొమ్ము. కాలవ్యవధికి వెఱతువా? ఇదిగో

యిప్పుడే నీతోడ వైవస్వతు నాశ్రయింతుము. తనయా! పాపియైన దశరథునివలన నీపాపంబు లుడిపికొంటివి. సత్యవ్రతులైన శస్త్ర యోధులకగు లోకములు నీకగుఁగాక. సగరుఁ డేపదవి నొందెనో, శైబ్యుఁ డేస్థానముఁ బడసెనో, దీలీపుఁ డేచోటికిఁ జనెనో, జనమేజయుఁ డేది పొందెనో, నహుషదుందుమారు లేతావు చేరిరో యా నెలవు నీకగుఁగాక. సాధువులకేది సిద్ధమో వేదాధ్యయనులకేది కరస్థమో తపోధనుల కేది కొంగుబంగారమో భూమిప్రదాతలకేది నిశ్చితమో యాహితాగ్ను లేది పొందుదురో ఏకపత్నీవ్రతుల కేదిప్రాప్తించునో గోదాన మునకేది ఫలమగునో గురుపోషకులును దేహన్యాసకృతులును జేరుదురో యది నీకగుఁగాక. నాయనా! మనకులమునఁ గూన కూడ దుర్గతిచెందదు. నీ సంగతి చెప్పవలయునా? నిన్నుఁ జంపినవానికి మాత్రము దుర్గతి తప్ప'దని నిజమనస్తాపంబును వెలిపుచ్చి భార్యా సమేతుఁడై తనయునకు సలిలక్రియలు తీర్చెను. ఆ మునికుమారుఁడు దివ్యరూపమొంది యింద్రునితోడ సతని విమానముమీఁద స్వర్గాభిముఖుఁడై చనుచు, వగచుచున్న జననీజనకులను సంబోధించి, 'మీకు నా యెనర్చిన శుశ్రూషలఫలంబుగా నాకీ సద్గతి లభించెను. అచిరకాలమున మీరును నన్నుఁ గలయుదు'రని చెప్పి పోయెను. ఆ వృద్ధులంత నా వంక మరలి, 'రాజా! ఏకపుత్త్రికుని నపుత్త్రికునిగా నొనర్చితివి. ఈదుఃఖము నీకు నీ యనసానకాలంబునఁ దప్పదు. సుతశోకంబున నీ జీవితము సమాప్తమగుఁగాక. తెలిసిచేసిన తప్పు గాదందువా? కావునఁ నీ మహాపాతకంబునకు నెడమైతివి' అని పలికి యేకచిత్తులై తనుత్యాగ మొనర్చిరి.'

'కౌసల్యా! అపథ్యము వ్యాధియట్లు నా పాపకార్యమిట్లు పరిణమించెను. భద్రా! నాకు దృష్టి తప్పుచున్నది; చెంతనున్న నీవు గానరావు. నీకరకమల స్పర్శసుఖంబును గడసారి నాకనుగ్రహింపుము. కటా! నావంటి దయారహితుఁడుండఁడు. నా నోట మాటవెడలుటే తడవుగా నా పట్టి బదులాడక తరలెను. ఇట్టిది వానికే చెల్లును. రామా! కడసారి కంటఁబడిపొమ్ము. నీ తండ్రి కింతమాత్రపుసుఖము నేనిఁ గూర్పవా? మానవులకు మరణానంతరము పరస్పరముఁ జూపు లుండవుగదా. ప్రేయసీ! స్మృతి తప్పుచున్నది. అదిగో యమకింకరులు వచ్చి వేగిరించుచున్నారు. నిదాఘతాపము మెఱకమీఁది నీటినివలె రామాదర్శనదుఃఖము నా ప్రాణముల నింకించుచున్నది. పదునాలుగేండ్ల

తర్వాత రాముని మఱలఁ జూచు కలిమి నోఁచినవారు దేవకల్పులుగాని యేతన్మాత్రులుగారు. కౌసల్యా! చిత్తమోహమున నా హృదయము శూన్యమగుచున్నది; కరణంబులు తమ పటిమను దొఱఁగుచున్నవి' అని యా త్రోఁపు సగము రాత్రివఱకుఁ బరితపించి, 'హా! రామా! హా! కౌసల్యా! హా! సుమిత్రా!' అని నిట్టూర్చి మౌనముద్ర వహించెనో యన మిన్నకుండెను.

దశరథుని నిర్యాణము

వఱువాత యథాప్రకారము వందిమాగధులు కొలువుదీఱి జోహారులునుఁ బరాకులును మంగళోక్తులుఁ బలికి చనిరి; పంజరస్థములైన పులుఁగులు మేల్కాంచి మధురమధురంబుగాఁ గూయనారంభించెను; పరిచారికల రాకపోకలక్రందు మెండయ్యెను; స్నానవిధిజ్ఞులైన లెంకలు హరిచందనోదకంబుల నించిన హేమకలశంబులఁ గూర్చిరి; మంగళాను లేపనంబులును భక్ష్యభోజ్యంబులును వస్త్రాభరణంబులును గొనివచ్చి యువతులు కాచియుండిరి. అంతలోన,

"సీ॥ తనుఁబాసి శశి దవ్వుచనినచెవ్వగఁబోలె
దొలిదిక్కుజవరాలు వెలుకబాఱెఁ,
బ్రభమాద్రి సభయుండుఁ బఱచినకెంబట్టు
జముకొణమునఁగ రాగముజనించె,
ధవుకూర్మిఁ గొసరుమన్నవివోలె ముఖరాళి
వనరుహాస్యములఁ బద్మినులు చెఱచె,
భానూష్మభీతి మున్నడినచుక్కలభంగి
దూరలె వేకువగాలి దూరలమంచు

గీ॥ కాలగుణయుక్తిమింటిచక్కటికినెగయ
వాసవునిపట్టి పొడువుగావైచియాడు
గచ్చుచమరినదారుచక్రంపుబిళ్ళ
వోలె నొయ్యనఁబ్రాచి లేబొద్దువొడిచె."

అట్లు సూర్యభగవానుఁడు మొలచివచ్చినను దశరథుఁడు నిజమందిరాంతరమునుండి వెలికి రాఁడయ్యెను. ఈ యపూర్వవైఖరికి సంశయములు వొడమెను. అంతఃపురప్రవేశయోగ్యులు తెంపుచేసి లోనికిఁ జనిరి. త్రోఁపు నిద్రావశుఁడైనట్లుండెను. కౌసల్యాసుమిత్రలు దుఃఖశోషలై యతని చెంతఁ బడియుండిరి. అందుఁ గౌసల్యాదేవి వివర్ణయుఁ గాంతివిహీనయునై దుఃఖావతారమోయన మిక్కిలి జాలి

గొలుపుచుండెను. తేనిని మృదువచనంబుల మేల్కొలిపిరి. అతఁడు కదలక మెదల కుండెను. వానినిఁ దాఁకి చూచిరి. సంగతి స్పష్ట మయ్యెను. మహారోదనము లెగసెను. కౌసల్యా సుమిత్ర లులికిపడి లేచి పతిని దడవి సంగతి గ్రహించి యాక్రోశించుచు నేలవ్రాలిరి. శుద్ధాంతము క్షణములో మహాదుఃఖరోదన మందిరమయ్యెను.

కౌసల్య తన పతిశిరంబును దొడపై నిడుకొని, రాముని దలఁచి

మ॥ కొడుకా! నిన్నెడఁబాసినట్టివెత నాకుంజాలదో నాఁగ మ్రు
క్కడిదైవంబు లలాటకుంకుమపుఁజుక్కండుల్చి వైధవ్యపుం
బడబాగ్నింబడవైచె ముట్టెనెడరుంబారంబు నేనీక్రియం
జెడియుంజావక మొండినై పడయఁగాఁజేటింక నెంతున్నదో?

అని పెల్లు దుఃఖించి, 'కైకేయీ! నీ మనోరథము ఫలించెనా? ఇఁక బోటులేని రాజ్యమును బాలింపుము. రాముఁడు వనగతుఁడును నాథుఁడు స్వర్గతుఁడునైరి. నేను విపథంబునఁ దోడుతప్పిన తెఱువనైతిని. ఇఁక జీవమేల? భర్తనెడసి జీవించుట సాకగుఁగాని మఱియొకర్తుకకుఁగాదు. లుబ్ధుఁడు విషమిష్టఫలంబునుగోరి చెడినట్లు నీవుకుబ్జాకుత్సితబోధనలకుఁ జిక్కి చెడితివి; రాఘవకులంబునకుఁ జేటు తెచ్చితివి. హా! రామా! వైధవ్యమును సహింపఁజాలను; సహగమనంబునకు ననుమతింపుము. ఇది పతివ్రతలకు సహజధర్మ'మని వేవగలఁ బొగులసాగెను. సుమిత్రా నయననీళంబు స్రవించు దుఃఖాశ్రుధారలకు నెడ తెంపు గలుగదయ్యెను.

వ్యావహారికులంతఁ గౌసల్యాసుమిత్రల నందుండి తొలగించిరి. పుత్త్రీలెవ్వరును జెంతలేని కారణంబున దహనసంస్కారమునకు నభ్యంతరము గలిగెను. మంత్రులు గుమిగూడి వసిష్ఠునితో సంప్రతించి తేని కళేబరంబును తైలద్రోణియందుఁ బదిలపఱచి రాచకార్యముల నడపింపసాగిరి.

జనులు కర్తవ్యమునుఁగూర్చి పలుకుట

మఱునటి యుదయంబున రాజకర్తలైన మార్కండేయ మౌద్గల్య వామదేవ కాశ్యప కాత్యాయన గౌతమ జాబాలి ప్రభృతులును మహర్షులును సభచేరిరి. వసిష్ఠుఁడును వచ్చెను. బ్రాహ్మణోత్తములు పెక్కుఁడు గూడిరి. 'రాత్రి వేయియుగముల ప్రాయమయ్యె'నని యొక విప్రుఁడు మొదలు పెట్టెను. 'రాజు దివంగతుఁడాయెను; అతని సుతులెవ్వరుఁ జెంతలేరు; రాజ్య మరాజకము గారాదు; ఇక్ష్వాకు వంశ్యు

లెవ్వాఁడు జేతికి దొరకరా' యని యొకఁడుపన్యసించెను. 'అరాజకమైన దేశమున వానలు గురియవు; చోరులు చెలరేగుదురు; ఫలము దక్కదను భయంబున విత్తుచల్లరు; పంటలుండవు. శిక్షకుఁడు లేకుండును. తండ్రిని కొడుకు వినఁడు; భర్తను భార్య లెక్కసేయ'దని మఱియొకఁడు పలికెను. 'ఱేఁడులేనినాట ధనము చొంగలపాలు, భార్యలు జారుల పాలు; సత్యము సాగరముపాలు; మఱేమి వలయు'నని యింకొకఁడు నుడివెను. యజ్ఞయాగాదులు పోసఁగవని యొకఁడు, సభలు చల్లారెనని యొకఁడు, ఉత్సవము లుడిగెనని యొకఁడు, క్రయనిక్రయంబు లాగిపోవునని యొకఁడు, శాస్త్రంబులు త్రుప్పుపట్టునని యొకఁడు; ఋష్యాశ్రమంబులు పాడగునని యొకఁడు, నిష్కారణనైరములు పెఱుఁగునని యొకఁడు; యోగక్షేమములు వలసపోవునని యొకఁడు, వర్ణాశ్రమధర్మంబు లడుగంటునని యొకఁడు, నాస్తికుల రాజ్యమగునని యొకఁడు, తలకొకమాటగాఁ బలుకసాగిరి. 'సర్వము రాజాయత్తము; రాజు సర్వప్రాణులకు సర్వస్వ'మని యొకఁడు వచించెను.

ఆతలంపులెల్ల వసిష్ఠమహర్షి వినిసూర్కొండేయామములలోఁ సంప్రతించి. 'కాలము పుచ్చరాదు. భరతుని రప్పించుదమ'ని నిశ్చయించి మంత్రులరావించి, 'అమాత్యులారా, కర్తవ్యము వినుఁడు. రవితురగములంబోని గుఱ్ఱములమీఁదఁ దెలివిగలవారిని రాజగృహపురంబునకుఁ బంపుము. వారు భరతుని సంధించి వానికి మంత్రిపురోహితులసశేషములు వినిచి, 'అత్యవసరమైనవని తటాలునఁ గలిగెను. తదర్థము నిన్నుఁ దోడ్కొనిరా వసిష్ఠుఁడాజ్ఞాపించెను; వచ్చితి' మని చెప్పుమనుము. రామవివాసముగాని దశరథనిర్యాణముగాని యెంతమాత్రము భరతునకుఁ దెలియరాదు. దూతల ముఖలక్షణంబులుగూడ నట్టివి సూచింపరాదు. దూతలు కానుకలఁ గొనిపోవుట సంప్రదాయము. వలసిన కౌశేయ దివ్యాభరణములిచ్చి పంపు' మనెను.

భరతునకుఁ గా దూతలు గిరివ్రజపురమునకుఁ జనుట

దూతలు తరలి పశ్చిమాభిముఖులై కొంతదూరము పోయి యపరశైల పర్వతమును దాని దక్షిణపుఁ గొమ్మున దాఁటి, యా కొండకును బ్రలంబనాద్రికిని మధ్యఁ బ్రవహించుచున్న మాలినీ నదీతీరంబునఁబడి యుత్తరాభిముఖులై చనిచని మరలఁ బడమటికి మరలి హస్తినాపురంబునొద్ద గంగానది నతిక్రమించి కురుజాంగలదేశంబుల

నడుమంబడి పాంచాలదేశముఁ జొచ్చి శరదండానది నుత్తరించి దాని యుత్తరతీరమున నున్న సత్యోపయాచనమనుపేరి దివ్యనికూలవృక్షంబు నకుఁ బ్రదక్షిణ నమస్కారము లాచరించి కుళింగాపురము గడచి, అధికాలమనుపేరి గ్రామమును వెనువైచి, బోధితవనపర్వతోద్గమయు నైశ్వాకువంశసేవితయునైన యిక్షుమతిని నిర్గమించి, యా నదీతీర నివాసులై యంజలిమాత్ర జలాహారవ్రతమాచరించి తపంబుల వేద పారాయణంబునఁ దనిలియున్న బ్రాహ్మణోత్తములను సందర్శించి బాహ్లిక దేశమునకును సుదామపర్వతంబునకును నడుమనున్న దారి ద్రొక్కి విష్ణుపదమును దాటి విపాశానది నుత్తరించి దానియొడ్డునున్న శాల్మలీవృక్షము నవలోకించి మూర్ధాంతర వాహినులను సరోవరంబులను వాపీతటాకపల్వలంబులను గజవ్యాఘ్రసింహాది మృగంబులను దిలకించుచు, భర్తృప్రీతియు తద్వంశపరిగ్రహ తత్పరతయుఁ బ్రేరింపఁ బ్రయాణభారంబులు మూఁడు ముప్పిరిగొని త్వరించుటంజేసి మార్గశ్రమమునుగూడ జీరిగొనక మూఁడవనాఁడు రాత్రియగునంతకు గిరివ్రజపురము చేరిరి.

భరతుని స్వప్నము

నాఁటి వేకువన భరతుఁడొక యశుభస్వప్నమును గాంచి ప్రభాతస్వప్నమగుటంజేసి యది నిక్కలయై యేమిరానున్నదో యని పరితపింపసాగెను. సంగతి తెలియక వానిహితులు తద్వ్యథానివారణార్థము వివిధ కథలతో మధురగానంబులతో హాస్యోక్తులతో భరతుని వినోదించిరి. ఎంతనను వాని మనస్తాపము తీఱకుండెను. ఎట్టకేలకు నాంతరంగికుఁడొకఁడు భరతుని డాసి, 'సఖా, నీవై మనస్యమునకుఁ గారణమేమి?' యని యడిగెను. నావుడు, 'మిత్రమా, ఏమిచెప్పుదు? పాడుకలయొకటి వేకువనఁ గంటిని. నా తండ్రి విరిసినతలతో ముఱికి జొబ్బిల్లు తనువుతో మహాద్రిశిఖరమునుండి ముఱుగుపెడగుంటలోఁబడి తేలాడినట్లు, దోసిళ్ళఁబడి నూనెద్రావి వికృతపునవ్వులు నవ్వినట్లు నూపిండియన్నము తిని తలక్రిందుగాఁ గూలి దొర్లాడినట్లు తైలావగాహ మొనర్చినట్లుండెను. అంతలో సముద్రమింకెను; చంద్రుఁడు నేలరాలెను. లోకమెల్ల గాఢాంధకారబంధురమయ్యెను; భద్రగజదంతంబులు పుప్పొడిగా నురలెను; మండుచున్న వీతిహోత్రుఁడు తటాలునఁ జల్లారెను; పుడమి ప్రీలెను; వృక్షంబులు నిలువున నెండవాలెను; పర్వతములు కూలి పొగలెగసెను. ఈ విపరీతము లొక్కొక్కటిగాఁ దోఁచెను. ఇవినూచుచుండఁగనే నా తండ్రి నీలవస్త్రధారియై యినుప

గద్దె మెక్కి గానిపించెను. వానిని జూచి కృష్ణపింగళవర్ణనలైన ప్రమదలు వికవికనవ్విరి. నా తండ్రి యచటువాసిపోయి కాటుక చందనమలంది రక్తమాలలు ధరించి గాడిదలుకట్టిన రథమెక్కి దక్షిణాభిముఖుడై తరలెను. మార్గమధ్యమున హఠాత్తుగా నొకరక్కసి రక్తాంబరములు గట్టి వికృతముగా నున్నది విహసించుచువచ్చి వాని నాకర్షించెను. మిత్రమా! ఈ స్వప్నముతోడ బ్రభాత మెల్ల భయావహమై గడచెను. నాలో నెవరికో మరణమును శంకింతును. ఖరరథమెక్కి చనుచున్నట్లుగా నెవడు కలలోఁ గానవచ్చునో వాని కాటిపొగ యచిర కాలమునఁ గననగు నందురు. ఈ వెతయొండు తలఁపనీయదు. కంఠము తడియాఱెను; ఎద కుదుటపడదు; అకారణభయము వెన్నంటి తఱుము చున్నది; ఎలుఁగు సన్నగిల్లెను; నన్ను నేనే నిందించుకొందును. సఖా! నా తండ్రికై భయమగుచున్న' దని భరతుఁడు చెప్పెను.

ఆ చెలికాఁడు మహాశ్చర్యమగ్నుఁడయ్యు మిత్రుని యూఱట కుఁగా ధైర్యము వహించి, 'కల కల్లగాక నిజమగునా! వాతాది దోషములు ప్రకోపించి మర్త్యులను మిథ్యాప్రపంచమునఁ బరిభ్రమింపఁ జేయుచుండును. భ్రాంతిత్వమునుఁ దెలియక వ్యసనపడుట హృదయ దౌర్బల్యమగును. నీబోంట్లకిది తగదు. జీవితకాలములోపలఁ బ్రతివ్యక్తి లెక్కలేని కలలు గాంచును. అవి నిజమైనచోఁ జెప్పవలయునే? ఇదంతయు నీకుమాత్రము స్వానుభవ సిద్ధముగాదా?' యని వెక్కు సమాధానములు చెప్పసాగెను. వారట్లు సంభాషించుచుండఁగా దూతలు వచ్చి, 'రాకుమారా! వసిష్ఠదేశంబున నయోధ్యనుండి వచ్చితిమి. గురుజనమును మంత్రులును గుశలముఁ దెలుపు చున్నారు. ఆకస్మికముగాఁ గార్యమొండొదవెను. అందులకు నీవు మందల నుండవలయు నఁట. ఈమాట సీతోఁ జెప్పి నిన్ను వెనువెంటఁ గొనిరమ్మని వసిష్ఠ మహర్షి మమ్ముఁ బుత్తెంచెను. తాతకును మామకును గానుకలు తెచ్చితి'మని విన్నవించిరి.

భరతుఁ డా చీనాంబరాదు లందికొని దూతలకుఁ బ్రతిపూజ లొనర్చి, 'తండ్రి కుశలమా? రామలక్ష్మణులు సుఖమున్నారా? ధర్మ నిరతయైన కౌసల్యాదేవియు ధర్మజ్ఞయగు సుమిత్రయు సుఖమా? నా తల్లి యేదేనిఁ జెప్పిపంపెనా?' యని యడిగెను. 'రాకుమారా, ఎల్లరు సుఖమే, తడవుసేయ వలదు. లక్ష్మీ పద్మహస్తములు సాచి నీకై వేచియున్న'దని వారు పలికిరి.

భరతుఁడయోధ్యకుఁదరలుట

భరతుఁడంత మిత్రులను వీడ్కొని తాతయు మేనమామలయు నొప్పుదలఁ బడసి వారి సన్మానములంది తమ్ముని వెంటఁగొని చతురంగ బల సమేతముగాఁ దరలి తూర్పుదెస పోయి సుదామనదిని దాఁటి, పశ్చిమ వాహినిని శరద్రూనదిని ఏలాధానగ్రామ సమీపంబున నుద్గమించి, యపర పర్వతదేశము సొచ్చి శిలామహానది నతిక్రమించి యాజ్ఞేయ శల్యకర్తన గ్రామంబులమీఁదుగా మహాపర్వతములు గడచి వైత్రరథవనమార్గముఁ ద్రొక్కి వీరమత్స్యదేశంబులకు నుత్తరంబున గంగాసరస్వతీ సంగమమందలి భాఁడుండవనముఁ బ్రవేశించి యావలఁ గుళింగాయమునా సంగమ స్థానముచేరి యట సైన్యవిశ్రాంతికిఁగా సుంత నిలిచి బడలికలు వాసి యమ్మహారణ్యంబును భద్రగజముమీఁదఁ గడచి ప్రాగ్వట పట్టణంబున నంశుధానంబనుచోట భాగీరథి నుత్తరించి కుషికోష్ణికా వాహినిని వెనువైచి ధర్మవర్ధనతోరణ గ్రామముల మీఁదుగా దక్షిణాభిముఖుఁడై చని జంబుప్రస్థము నతిక్రమించి వరూథ గ్రామ సమీపంబున మరల సుంత విడిసి యందుండి తూర్పుగాఁబోయి కదంబవనవాటీబహుళమైన యుజ్జిహా నగరోద్యానవనము డాసి యట స్వదేశమం దడుగిడి పరివారమును నెమ్మదిగా రమ్మని తాను బయనమై సర్వతీర్థ గ్రామమునకు వచ్చి విశ్రాంతి. గైకొని తరలి యుత్తానికాది నదులను భార్గవతీయ తురంగంబులవలన దాఁటి లాహిత్యనగరంబున గఫీవతీనదిని నేకసాల గ్రామంబున స్థాణుమతీనదిని గడచి వినత నగరంబున గోమతీనది నధిగమించి కళింగనగరముచేరి యందలి సాల వనంబున గోడాల యలపుదీర్చి యరుణోదయంబుతోడ నయోధ్యా నగరంబును సందర్శించెను.

అయోధ్యానగరస్థితి

అట్లు భరతుఁ డేను దివారాత్రములు ప్రయాణము చేసి యయోధ్యానగరము చేరి యది మాటుమణగినట్లుండుటఁ గాంచి యాశ్చర్యవిషాదములంది, 'ఇందు స్త్రీపురుషుల కలకలధ్వనులు నిరంతరముఁ దుకములుగానుండును. ఎట్టి సందడియు నేఁడు వినరాదు. కాముకులు నిశాక్రీడాసక్తులై యీ నగరోపవనములందు రేలు గడపి కనుచీఁకటిలోనఁ దమయిండ్లకు హుటాహుటిఁ జనుచుందురు. ఆ శోభయు నేఁడు గానరాదు. వాహనంబుల రాకపోకలతోఁ బురవీథులు నడువ

రాకుండును. నేడొక్కటియుఁ గాన్పింపదు. అరుణుఁ డుదయించినను మృగపక్షులధ్వనులు వెలిఁబడవు. మారుతములు చందనాగరుధూప గంధంబులను గుబాళించుచు వీచుచుండును. అదియు నేఁడు గలుగదు. భేరీమృదంగంబులు వాయవు; నా హృదయము తహతహ పడుచున్నది' అని తలపోయుచు జయంతద్వారముగుండ నగరుసొచ్చి, 'సారథీ! నన్నింత హుటాహుటిఁ బిలిపించిరి; కారణముఁ దెలుపరైరి. నామనస్సు శంకాకుల మగుచున్నది. గృహస్థులు ముంగిళ్ళను జిమ్మరు; తలుపులు మూయరు; బలికర్మములు గానరావు; ప్రజలు నిరశనులట్లు తోఁచుచున్నారు; కుటింబిభవనము లెల్ల నలక్ష్మీకములట్లు గాన్పించుచున్నవి. దేవాలయములు పుష్పార్చనాది శోభారహితంబులుగా నసంమృష్టాజిరంబులుగా నున్నవి. యజ్ఞగోష్ఠులు లుప్తములై యున్నవి. పూల యంగళ్ళు విచ్చరు. క్రయవిక్రయములు సాగవు; మండపాదులందలి పక్షులు దీనముగా నున్నవి; జనుల మోములందుఁ దహతహపాటు చూపట్టుచున్నది. ఈ లక్షణములెల్ల రాజవినాశమును సూచించునని పెద్దలు వచింతురు. ఏమి విననున్నానో' యనుచు రాజగృహమునకుఁ బోయి యందుఁ దండ్రినిగానక తల్లి మందిరమునకుఁ జనెను.

కైకేయీ భరతులు

కైకేయి సుతుని గాంచి పరమసంతోషనుంది సువర్ణాసనము నుండి లేచి యెదురేగెను. భరతుఁ డామెకు నమస్కరించెను. ఆమె తనయుని గవ్వుగిటఁ గూర్చి శిరము మూర్కొని యంకమునఁ జేర్చి, 'వత్సా! ఎన్నాళ్లు ప్రయాణము చేసితివి? నీ తాత కుశలమా? నీ మేన మామ సుఖమా? అని యడిగెను.

భర:- ఏడు దివారాత్రములు ప్రయాణముచేసి వచ్చితిని. మీవారెల్లరు సుఖముగానున్నారు. వారు పంపిన పారితోషికములను గైకొని నా పరిజనము వెనుక వచ్చుచున్నది. దూతల త్వరవలన ముందు వచ్చితిని. అమ్మా! హేమభూషితమైన నీ పర్యంకము నేఁడలంకార శూన్యముగానున్నదేల? ఐశ్వర్యాకులందు సంతసము గానరాదేల? నాయనయేఁడి?

కైక:- పుత్రా! భూతకోటికిఁ దుదకేగతి తప్పదో యాగతిని నీతండ్రి పొందెను. వగచియు ఫలములేదు. దాన యజ్ఞాధికారిణియు

శీలవతియు శ్రుతివచోనుసారిణియునైన నీ బుద్ధి బేలతనముఁ బడయరాదు.

భర:- తల్లీ! అన్నగారి పట్టాభిషేకమునో యేదో యొక మహా యాగమునో సంకల్పించిరని యువ్విళ్ళూరుచు వచ్చితిని. తా నొకటి తలఁచిన దైవమొకటి తలఁచునన్న సామెత సార్థకమయ్యెను. కటా! నా తండ్రిని గన్నారఁ జూచుభాగ్యము గూడ నాకుఁ గఱవయ్యెను. అమ్మా! ఏ పాడువ్యాధి వానిని హరించెనోగదా? పితృసంస్కార మొనర్చి నా యన్న ధన్యుఁడయ్యెను. ఆపాటి కల్మియు నాకుఁ గలుగదు. హా! నాయనా! నీ కూర్మలు నీ బుజ్జ వంబులు నేటితో నాకుఁ దీఱెను. అమ్మా! ఇఁక నాకుఁ దండ్రియు బంధువు సర్వము రాముఁడే గదా. నా రాక వాని కెఱిగింపుము. తల్లీ! అవసానకాలంబున నా తండ్రి యేదేని నాకుఁగాఁ జెప్పెనా?

కైక:- నాయనా, నీ తండ్రి హా! రామా! యనుచుఁ బ్రాణములు విడిచెను గాని నీ మాటయే తలఁపఁడు. రాముఁడు సీతాలక్ష్మణ సమేతుఁడై మరలి వచ్చిననాఁడు వాని నెవఁడు సందర్శించునో యతఁడు సిద్ధార్థుఁ డను మాటమాత్రము నీ తండ్రినోట వచ్చెను.

భర:- ఏమీ! నా తండ్రి యవసానకాలంబున రామానుజులు గూడ లేరా? వారెందుఁ జనిరి?

కైక:- దండకారణ్యమునకు వివాసార్థము చనిరి.

భర:- ఏమి! నా యన్నకు వివాసశిక్ష విధించిరా? బ్రాహ్మణ ధన మపహరించెనా? అదండ్యులను దండించెనా? పరస్త్రీనిగోరెనా? భ్రూణహత్యాపాతక మొడిగట్టెనా?

కైక:- నాయనా! రాముఁ డెట్టి యకార్యమును జేయలేదు. సంగతి వినుము. రాజు నాకుఁ దొల్లి రెండువరముల ననుగ్రహించెను. అవి నేను కోరనుంటిని. అంతలోన రామునకుఁ బట్టాభిషేకమును దలపెట్టిరి. ఆ సంగతివిని యేనికి నా వరములు జ్ఞప్తిజేసి రామ వివాసమును నీ పట్టాభిషేకమును గోరితిని. రాజు సత్యసంధుఁడు గావున నా వరములను బ్రసాదించి తనువు త్యజించెను. ధర్మజ్ఞా, రాజ్యభారమును వహింపుము. వత్సా, నీకుఁగా నింతచేసితిని.

రాజ్యము నిష్కంటకముగా నీ చేతఁ జిక్కెను. వసిష్ఠాదుల యూదేశము తలఁదాల్చి పితృసంస్కారము లొనర్చి పట్టాభిషిక్తుఁడవై నా చిరమనోరథము నీడేర్పుము.

భరతుఁ డా మాటలు విని కటకటంబడి నిట్టూర్చి, 'ఏమంటివి? నా యన్నకుఁ గాదని నాకు రాజ్యమా? తండ్రిని దెగటార్చి యన్నకు నారచీరలిచ్చి నాకు రాజ్యమును సంపాదించితివా? కఠాళీ! మా వంశమునకుఁ గాళరాత్రి వైతివిగాని యొండుగాదు. నిప్పని యెఱుంగక నా తండ్రి నిన్నుఁ గవుఁగిటఁ జేర్చి బూది యయ్యెను. కౌసల్యాసుమిత్రలను శోకాగ్ని కుండమునఁ ద్రోసితివి. నా యన్న నిన్ను మహా భక్తితో శుశ్రూషించుచుండెను. ఆ సేవ లేనియు దలంపవా? కౌసల్యాదేవి నిన్ను సొంత చెల్లెలినిగా మన్నించుచుండెను. ఆమె ప్రేమయేని నిన్నడ్డగింపదయ్యెనా? పాపీ! సత్యసంధుఁడగు నా తండ్రిని మోసగించి ధర్మచిత్తయగు కౌసల్యాదేవి గర్భంబునఁ జిచ్చుఁ బొనిపి లోకాభిరాముని రాముని గుట్టలకుఁ ద్రోలి కోసల దేశంబున నేకచ్ఛత్రాధిపత్యము వహింప నెంచితివా? నీయట్టి లుబ్ధు రాలు గలదా? నీ మతమునకుఁ దోడ్పడుదునని నీ దుర్బుద్ధి నిన్నుఁ బ్రేరేచెనా? నాయన్న యెడ నాకుఁగల భక్తిగౌరవంబులు తెలియని నీయజ్ఞానంబు నిన్నింతకుఁ దెచ్చెను. కులపాంసనీ! నా యన్నకు వెఱువ నేని నిన్నిక్షణంబ పరిత్యజింతును. కుశీలపకాకా! రామలక్ష్మణులను నిరసించి రాజ్యసంరక్షణమొనర్ప సాధ్యమా? ఇంతమాత్రపుఁ దెలివి లేదయ్యెనా? వృషభరాజు మోయుభారమును లేఁదూడమూపున వైతువా? పుత్రగర్థినీ! ఈ దురాలోచనము నీకెట్లు జనించెను? రాజ్యము జ్యేష్ఠక్రమాగతమగుట తెలియదా? రాజవంశంబున జనింపవా? రాజధర్మంబును దిరస్కరించి సంప్రదాయమును వీటఁబుచ్చి మాకీర్తిని గర్తుపాలొనర్చి నాకు మరణాధిక దుఃఖంబును మూట గట్టితివి. దీనికిఁ బ్రతీకార మేమిగలదు? ఇదిగో చూడుము. నాయన్న నిప్పుడే తోడి తెత్తును; నీయెదఁ జిచ్చు రగిలింతును; భగ్నమనోరథవై యేడ్చియేడ్చి హూహుమాయుదువు గాక. నరకమే నీకు శరణమగును. పతిఘాతినీ! నీవు నాకు మాతృరూప మహాశత్రువవుగాని తల్లివిగావు. ఎంతో పాపమొనర్చి నీ పాడుగర్భమున జనించితిని. దుర్వృత్తా! పుత్రుఁడు తల్లికి హృదయజుఁడగుఁగాని యంగప్రత్యంగజుఁడు గాఁడను సంగతి యెఱుఁగవా? పుత్రవియోగమున కన్న మించినదుఃఖము

తల్లికిఁ గలుగదని తెలియదా? చతుష్పాత్తునకుఁ గల సుతవాత్సల్యము నీకుఁ గఱవయ్యెనా? సురభికి సుతసహస్రముఁ గలిగియుఁ దాని బిడ్డలలో రెంటిని మార్పులేక మధ్యాహ్నమువఱకు దున్నుచున్న వానిని జూచి యది పురపురఁ బొక్కి వగచుటయు, దేవేంద్రుఁడువచ్చి యూఱడించుటయు వినవా? అందఱు బిడ్డలుగల యా సురభి రెంటికష్టమును జూచి యోర్వదనఁగా రామైకపుత్త్రికయైన కౌసల్యాదేవి సుతవివాసమునకై యెంత నంతపడునో యూహింతువా? పరమసాధ్వని వినత్సగా నొనర్చిన నీకు నిహసరములు రెండుఁ దక్కవు. పాతకీ! నీసేత సహింపఁజాలను; అశ్రుకంఠులైన పౌరులమ్రోల నిఁక నొక్కనిమిష మైనను నిలుననోపను. నాయన్నను దెచ్చి యిందు విడిచి వానికి మాఱుగా నేను వివాసినై దూఱుఁబాపుకొందు' నని మహాక్రూరముగాఁ గైకేయినిఁ దెగడి పాదతాడితభుజంగమువలె నూర్చి యుత్సవానంతర మింద్రధ్వజముకరణిఁ దోమరప్రబోధితమై గజముగర్తమునంబలె నేలఁ గూలి పెద్దయుండడవునకుఁ దెలిసొంది ధారాపాతంబుగా వర్షించుచున్న బాష్పజలంబులకుఁ దడియుచు జఱునిమాడ్కి నుండెను. అంతలోన మంత్రులచ్చటకు వచ్చిరి. భరతుఁడు వారినిజూచి, 'రాజ్యకాంక్ష నాకుఁ గలలోఁగూడఁ గలుగదు. ఈవ్యూహము నాకు బొత్తుగాఁ దెలియదు. సీతారామలక్ష్మణుల వివాసమిప్పుడు వినుచున్నాను; త్రిశుద్ధికి నమ్ముఁడని గట్టిగా వచించెను.

భరతుని శపథము

కౌసల్యాదేవి భరతుని కంఠధ్వని విని వానిని జూచునిమిత్తము తరలి గడగడ వడఁకుచు నడుగడుగునకు సొమ్మసిల్లుచు నెట్లో కతిపయ పదములు వచ్చెను. భరతశత్రుఘ్ను లంతలోన నామె కెదురైరి. వివర్ణయుఁ గృశయు మలినాంగకయునై దుఃఖావతారముగానున్న యామెను గాంచినంతనే భరతుని ప్రాణము లెగసెను. అన్నదమ్ములిద్దఱు నామెపాదముల వ్రాలి పెల్లుగోదన మొనర్చిరి. కౌసల్యాదేవి యాత్మదుఃఖమును బట్టఁజాలక, 'భరతా! నీతల్లి నీకు నిష్కంటక రాజ్యమును సంపాదించెను. నాకొడుకు గుట్టలపాలయ్యెను. నన్నుఁ గూడఁ దఱుమ నున్నది. ఆతల్లి కింతశ్రమ వలదు. అగ్నిహోత్రమును గైకొని సుమిత్రా ద్వితీయనై నాకూనయొద్దకు నేనే పోనున్నాను. సుకృతివేని మమ్ముఁగొనిపోయి యచ్చట వదలు' మనెను.

భరతుఁ డాపాదమస్తము కంపిల్లుచుఁ జేతులు జోడించి, 'ఆర్యా! ఈదీనుని విన్నప మాకర్ణింపుము. నాయన్న యెడ నాకుఁగల భక్తి నీకుఁ గ్రొత్తగాదు. ఈ విపరీతము లిప్పుడే వింటిని. ఇందాఁక నాకుఁ దెలియవు. ఏపాప మెఱుంగను. తల్లి! సత్యసంధుఁడును సత్పురుషాగ్రణియు నైన నాయన్న నిట్లుగావించుట నాకుఁ దెలిసి యుండునేని నా శాస్త్రానుసార బుద్ధి నన్నుఁ ద్యజించుఁగాక; నాయన్న వివాసమును నేను సమ్మతించి యుందునేని, నీచజాతిని సేవించువాఁ డెగతిని బొందునో, సూర్యు నెదుట మూత్రపురీషములు విసర్జించువాఁ డేగతినొందునో, నిద్రించుచున్న గోవును గాలఁదన్నువాఁ డేగతిబడయునో, ఉపకరించినభృత్యునకు జీతమియ్యని దొర కేగతి యగునో, ప్రజావల్లభుఁడైన రాజునకు ద్రోహమొనర్చువాఁడును బలిషడ్భాగంబును గొనియుఁ బ్రజలను రక్షింపని యేఁడును దపోధనులైన ఋత్విక్కులకుఁ జెప్పినయాగదక్షిణ లీయని యజ్వయు నేగతిఁ బొరయుదురో యా దుర్గతి నా కగుఁగాక. జననీ! రామవివాసంబును దలఁచి గాని చెప్పిగాని చేయించిగాని యుందునేని యుద్ధంబునఁ బిఱుదివియు వాఁడును, గురూపదిష్టశాస్త్రసూక్ష్మార్థంబుల మఱచువాఁడును, బాయసకృసరచ్ఛాగమాంసంబులను దేవపితృతిథులకు నర్పింపక తిను వాఁడును, నూతా పితృ గురుజనంబుల నవమానించువాఁడును, మిత్ర ద్రోహియు, విశ్వాసఘాతకుండును, గృతఘ్నుండును, బడయుగతి నా కగుగాక. అమ్మా! నా యన్న కెట్టి యపకారమున్నైనను నేను తలఁచి యుందునేని దారాపుత్రాదుల నోరుగొట్టి మృష్టాన్నము గుడిచిన పాతకమును, స్త్రీబాలవృద్ధులను జంపిన దురితంబును, లాక్షామద్య మాంసలోహిత నిషిద్ధవస్తువిక్రయంబునఁ గుటుంబమును భరించిన వృజి నంబును వెన్నిచ్చి పఱచువారిని దునిమిన కిల్బిషంబును, నన్ను మ్రింగుఁ గాక. జనయిత్రీ! నన్ను శంకింపవలదు. నా యన్న కెట్టికీడున్నైనను రోసియుందునేని కపాలమును జేతఁగొని గోచిఁగట్టి వెత్తివలె నూరూర భిక్షమెత్తికొనుచు భూమండలమెల్లఁ గ్రుమ్మరుచుందుగాక; కామ క్రోధాభిభూతుండనై మద్యపానము సేయుచు జూదమాడుచు వంచ నాంగనలపంచలు ప్రాకి జీవింతుఁగాక; నా ధర్మబుద్ధి నశించుఁగాక; సూర్యోదయాస్తమయంబుల నిద్రించు దరిద్రుఁడ నగుదుఁగాక; గురు తల్పగపాపనిహతుఁడనై పోదునుగాక; సత్కర్మములు నన్నుఁ ద్యజించుఁ గాక; సజ్జనులు నన్ను బహిష్కరింతురుగాక; బహుపుత్రికుండగు

పేదనై నిరంతరము వివిధ పీడారోగదుఃఖంబుల మురుగుదుఁగాక; ఋతుస్నాతయైన భార్యను బతివ్రతామణిని వదలి వర్తించిన పాపము నాకగుఁగాక; జలదూషకుండును విషదాతయు సత్కారవిఘాతకుండును బొందు దురవస్థ నాకగుఁగాక; తల్లీ! ముమ్మాటికి నిజము వచింతు'నని నానాశపథపూర్వకంబుగా నాత్మనిర్దోషత్వంబును బ్రకటించి దుఃఖాక్రాంతుఁడై మూర్ఛిల్లెను. కౌసల్యాదేవి వానిని లేవఁదీసి యంకమునఁ గూర్చి, 'నాయనా! నీ శపథములు నా దుఃఖమును రెట్టించుచున్నవి. సత్యప్రతిజ్ఞుండవై సత్యలోకంబును పడయు'మని యూరార్చి వ్యసన వినశయయ్యెను.

దశరథుని దహనక్రియలు

అంతలోనఁ దెల్లవాఱెను. వసిష్ఠమహర్షి భరతునొద్దకువచ్చి, 'రాజపుత్రా! శోకముపలదు. ఎవరికినిఁ గాలగతి తప్పదు. నీ తండ్రి యుత్తరక్రియలొనర్పుము. తదర్థము నిన్నింత వేగముగా రప్పించితి'నని చెప్పి తైలద్రోణినున్న దశరథ కళేబరంబును దెప్పించెను. భరతుఁడా శవముపైఁబడి కొంతనడి యేడ్చి, 'తండ్రీ! నేను దేశాంతరమున నుండఁగా ధర్మజ్ఞుఁడైన నా యన్నను మహాబలసంపన్నుఁడగు లక్ష్మణుని ననంబునకుఁబంపిన నీ మత మేమో తెలియదు. నా యన్న వనగతుఁడును నీవు దివంగతుఁడవు నైతిరి. ఇఁక నీ రాజ్యమునకు దిక్కెవ్వ' రని వాపోయి వసిష్ఠఋత్విగాదుల ప్రోద్బలంబున శవంబు నలంకరించెను. తనయింటి యగ్నిహోత్రము కూడనందునఁ బొరుగింటినుండి దానిని దెచ్చిరి. పరిచారకు లా శవంబును బల్లకిలోనుంచి దానినెత్తుకొని తరలిరి. ప్రజలు గుంపులుగూడి రజితసువర్ణంబులను జందనాగరు సరళపద్మకాది నానాగంధద్రవ్యచూర్ణంబులను వస్త్రంబులను జల్లుచు గుగ్గిలధూపములు వేయుచు ముందునడచిరి. శ్మశానవాటి చేరినంతట ఋత్విజులు శవమునెత్తి చితిపయినుంచి భరతునిచేతికి నగ్నియందిచ్చి పైతృమేధకమంత్రములు పఠించిరి. సామగులు యథాశాస్త్రము సామగానమొనర్చిరి. అంతలోన దశరథుని భార్యలు వృద్ధస్త్రీజనపరివేష్టితలై యథార్హశిబికాదుల మీఁద నటకు వచ్చిరి. ఋత్విజులును గౌసల్యాదులును భరతుఁడును శవమునకు నప్రదక్షిణముగావించి పెల్లు విలపించిరి. దహనక్రియలు ముగిసెను. అంత వారు సరయూనదికిఁజని మంత్రిపురోహితసహితంబుగాఁ బ్రేతకు సలిలదానములు గావించి నగరుజొచ్చిరి.

పదిదినములు చనెను; పదునొకండవనాఁడు భరతుఁడు శుచియై పదురెండవనాఁడు శ్రాద్ధకర్మములొనర్చి పితృపరలోకక్రియలనుద్దేశించి బ్రాహ్మణులకుఁ గనకరత్నవస్త్రాభరణంబులను గోఛాగంబులను దాసీదాసజనంబును గృహవాహనంబులను బుష్కలముగా దానములిచ్చి పదుమూఁడవనాఁడు శోధనార్థము ప్రాతఃకాలమున శ్మశానభూమికిఁ జని తండ్రిని దలఁచి, 'నాయనా! ఎవని యొడిలో నన్నుంచి నీవు పోదగునో యట్టి నా యన్న యడవులపాలయ్యెను. దిక్కులేనిచోట నన్ను దిగవిడిచితివి. సుతునిబాపి కౌసల్యాదేవిని దిక్కుమాలిన దానఁగాఁ జేసితివి. నీవును మమ్ములఁ ద్యజించితివి' అని భస్మారుణంబును దగ్ధాస్థిస్థానమండనంబును నైన యా చితిని జుట్టి రోద సేయుచు నేలఁగూలెను. శత్రుఘ్నుఁడును దండ్రిని స్మరించి దుఃఖించుచు, 'నాయనా! మంథరాప్రభవంబును కైకేయీ గ్రాహసంకులంబును వరదానమయంబు సత్యోభ్యంబునైన యీ మహా శోకార్ణవంబున మునింగితిమి. నీయుపలాలనంబులు మాకింతలో సరియయ్యెను. నిన్నును నిన్ను మఱపించునట్టి రాముని విడనాడి మనఁజాలను. అగ్ని నాశ్రయించి కడతేఱుదు'నని యాక్రందించెను. వసిష్ఠుఁడు వారి నూరార్చి, 'ఆఁకలిదప్పులును సుఖదుఃఖంబులును జరామరణంబులును ప్రాణికోటికి సహజములు. అనివార్యములకు వగచియు ఫలములేదు; జాగువలదు; అస్థిసంచయనముఁ గావింపు'డని చెప్పెను.

భరతుఁడు యథాశాస్త్ర మపరక్రియాశేషమును జరిపి యింటికి వచ్చి, 'అయ్యో! సర్వభూతదుఃఖాపనోదకుండును సత్త్వసారసంపన్నుండునునైన రాముఁడంతటివాఁడు సయితము స్త్రీవలన వలసపోయెఁ గదా. 'స్త్రీబుద్ధిః ప్రళయాంతక' మను నానుడి యథార్థమని నేఁడు గంటిని. అన్నా! అపకీర్తికి నోడి తండ్రిమాటకుఁ గట్టువడి వివాస మంగీకరించితివి. నీమతమును ద్రిప్పఁజాలరు. లక్ష్మణా! ఏమిచేయుచుంటివి? నీవీర్య మేమాయెను? తండ్రిని నిగ్రహించి యన్నను మఱలింపవేల? అన్నకు వెఱచితివా? నాయన కర్మగతికిఁజిక్కి మోహకారణంబున నుత్పథంబుఁ బ్రొక్కినప్పుడు నిగ్రహింపకుండ నగునా? ధర్మమునకు స్వపరతారతమ్యముగలదా?' యని చురపిల్లసాగెను.

అంతలోన మంథర సర్వాభరణభూషితయై రాణులు ధరించు పీతాంబరముఁగట్టి కైసేసికొని యాగదివాకిలియొద్దకు వచ్చెను.

ద్వారపాలకు లాదాసి నీడ్చితెచ్చి శత్రుఘ్నునకు నప్పగించిరి. అతఁడు పుఱపుఱుఁ బొక్కుచు, 'పాతకీ! విషబీజమును నాఁటి మాకుఁ గడలేని యెడరు గలిగించితివిగదా? ఫల మనుభవింపు' మని దాని నొడిసిపట్టి కత్తి దూయనుండెను. ఆ వరవుడు గొంతెత్తి యాగడపు టేడ్పు లేడ్చెను. శత్రుఘ్నుఁడు దానిని నదలఁడయ్యెను. ఆ తొత్తు తోడికత్తెలు మంట లుమియుచున్న వాని చూడ్కులకు వెఱచి నలుదెసలు పాఱిరి. రాసుతుని యార్పువేగంబునకు మంథరాభూషణములెల్లఁ దెగి రాలి యా ప్రదేశంబును సనత్రశరద్గగనంబుగాఁ దోపించెను. దాని యఱపులు విని కైకేయి వచ్చి యడ్డుపడఁబోయి శత్రుఘ్నుని యుద్ధతికి భయపడి వడఁకుచు భరతుని చాటుజొచ్చెను. భరతుఁడు తమ్మునిఁ జూచి, 'నాయనా! స్త్రీవధకూడదు; మతియు నన్నగారి కోపతాపంబు లకు వెఱతును. కాకున్నచో నీకూళ లిందుండదు. ఈ దుష్టలను బగ గొందుమేని మన కార్యము మన యన్నకుఁ దెలియకుండదు. స్త్రీవధ కులను మన యన్న కంటితోఁగూడఁ జూడఁడు. వాని కోపమునకు మనము గుఱిగారా'దని ప్రశాంతవచనములఁ బలికెను. ఆమాటతోడ శత్రుఘ్నుఁడు తన యాగ్రహంబును సమదాయించుకొని మంథరను వదలెను. అది కైకేయి వలన దాఁగి నాటికిఁ గడతేఱితినని మెల మెల్లగా నందుండి జాఱిపోయెను.

భరత పట్టాభిషేకమును రాజకర్తలు కోరుట

మఱునటి యుదయంబున రాజకర్తలు వచ్చి భరతునిఁ బిలిచి, 'రాజపుత్రా! అనాయకముగా రాజ్యముండరాదు. దైవయోగంబున నెట్టి విపరీతములు గలుగక యీ పదునాలుగు దినములెట్లో గడచెను. జాగునలదు. అభిషేచనికమును గొనివచ్చి స్వజనము నిన్నుఁ బ్రతీక్షించు చున్నది. పట్టాభిషిక్తుండవై పితృపైతామహధ్రువంబగు రాజ్యంబును బాలించి మాబోంట్లను రక్షింపుము.

"చ॥ అవని యరాజకంబయినయప్పుడ భూప్రజయందు సర్వధ
ర్మవులుఁదొలంగు దేవముని ముఖ్యులు వాయుదుగోలి వృష్టిలే
దవు మతియర్ఘువుల్ దఱుఁగునందురు గావున గాలయాపనం
బవిహితవాక్య! చేయుక నయంబున రాజ్యమునిల్పు మిత్తటన్."

అని యుపదేశించిరి.

వసిష్ఠమహర్షియు శిష్యసమేతముగా వచ్చి సభామండపమున సుఖాసీనుఁడై మంత్రులను గణాధిపతులను బ్రాహ్మణక్షత్రియవైశ్య ముఖ్యులను దదితరరాజ్యహితులను దూతలవలనఁ బిలిపించి భరత శత్రుఘ్నయుధాజిత్తు సుమంత్రులను రప్పించి సభకూర్చి, 'వత్సా, భరతా, ధర్మవ్రతులైన దశరథరాములు నిమ్మఁటకమైన యీ రాజ్య మును నీ కిచ్చి చనిరి. పట్టాభిషిక్తుండవై సుఖముండు' మనెను.

భరతుఁడు రాజ్యమును నిగ్రహించుట

భరతుఁడు మహావిషణ్ణాస్యుఁడై కరయుగము మోడ్చి, 'ఋషి చంద్రమా! మీ రెఱుంగని ధర్మము గలుగదు. రాజ్యము జ్యేష్ఠ క్రమాగతమగుట శాస్త్రీయమేగాక మా వంశసంప్రదాయమునై యున్నది. రాజకులమెల్ల నట్లే పాటించుచున్నది. కోసలదేశంబునకు నా యన్న రాముఁడు రాజగును. అగ్రజుని సొమ్మును దమ్ముఁ డపహరింపరాదు. ఆ దోషమును నాకుఁ గట్టవలదు. మఱియు రాజునకు వలయు గుణలక్షణంబులు కొన్ని గలవు. అవియెల్ల నా యన్నయందు మూర్తీభవించియున్నవి. ఆ మహనీయుఁడే మనకు రాజుగాఁదగునుగాని యొరులు దగరు. వాని సేవలు నాకుదొరకినఁ జాలును. దిలీపనహుషాది రాజచంద్రులుగూడ నా యన్నకు సాటిరారు. అట్టి మహాత్ముని నిగ్రహించి నేను రాజునగుట యనార్యజుష్టము నసత్కార్యము నకీర్తికరము నైన గార్యమగును. పరీక్షార్థము నన్నిట్లు కోరుచుని తలంతును. నా కులమును జెఱుప జనించితినా? నా తల్లికి సంతసింతునని యెంచితిరా? కన్నకారణంబున నామె నాకుఁ దల్లియైన నగుఁగాక. అంతకుమించిన మాతృగౌరవంబునకు నామె కొఱగాదు. నా యన్నకు వనదుర్గస్థుఁడై యున్న వానికి నిందుండియే యంజలియొనర్చి ప్రమాణపూర్వకముగాఁ జెప్పుచున్నాను. నా యన్న యే రాజు; నేను వాని బంటును. నా యన్న యీదీనుని ప్రార్థనంబు నంగీకరింపఁడేని నేనుగూడ వానితోడనే యుందును. నేనుచని వానిపాదములవ్రాలి యథాశక్తి బోరాడి యిటకు నా యన్నను గొనివత్తును. రాముఁడు లేని యీ నగరంబున నొక పూటయేని నివసింపనొల్లను. ఆర్యమిశ్రులు నన్ననుగ్రహింతురుగాక. పరివారము ముందు నడచుఁగాక' అని విస్పష్టముగాఁ బలికెను. భరతుని ధర్మవచనంబులకు సభయెల్ల నానందబాష్పములు వర్షించెను. రామ పునర్దర్శనోత్కంఠలై పురస్త్రీలు తమతమభర్తలను బ్రయాణోన్ముఖులుగా వేగిరించిరి. ఎల్లరు నేకగ్రీవముగా భరతుని దీవించిరి.

భరతుఁడు రాముని కైతరలుట

ఒకజట్టు సాధనసామగ్రిఁ గైకొని దారియందలి పొదలు గుట్టలు చక్కఁబఱచుచు ముందునడచెను. దానివెనుక నొకగుంపు తరలి నేల చదరముసేయుచుఁ బోయెను. ఆ వెంబడి మఱికొందరు దారిఁ జిమ్ముచుఁ జనిరి. వంకలకు వాగులకు దాట్లు గట్టఁ గొందఱుచనిరి. నదీనదములను దాఁటుటకుగాఁ దెప్పలు తయారుచేయుటకు మఱికొందఱు వెడలిరి. అందందు బావులుత్రవ్వుటకు వసతులేర్పఱచుటకుఁ గొందఱు బయలు దేరిరి. భరతుఁడు రథమెక్కెను. వానిని గౌసల్యాసుమిత్ర లనుగమించిరి. వారితోడఁ బురమెల్లఁ గదలెను. కైకేయి నిజాపరాధమునకుఁ బ్రాయశ్చిత్తమోయన మున్నందు నడచెను.

గుహ భరత సంవాదము

భరతుఁడట్లు వెడలి సాయంకాలమునకు శృంగిబేరపురసమీపంబున గంగాతీరమున విడిసెను. అసేనను గుహుఁడు చూచి తన జ్ఞాతులను గూర్చి, 'గంగయొడ్డునున్న సేనాసాగరమును జూచితిరా? దుర్మతి భరతుఁడు రామునిపయి దండెత్తఁ గాఁబోలు. అదిగో కోవిదారధ్వజము. దీనినిబట్టి యది భరతసైన్యమని నిశ్చయింపవచ్చును. కటా! కైకేయీ సాహస మేమనవచ్చును? ఆమె మాయదారితన మెవరికిఁ గలుగును? భర్త వశవర్తుఁడయ్యెను; రాముఁడు గుట్టలసాలాయెను. ఆ యింతి యంతతోఁ దనియదు. రాముఁడు భూమిమీఁదనుండుట తన కొడుకునకు ముప్పని యామె నిశ్చయము. రాముని దెగటార్పఁ దండ్రియొల్లఁడు; ఆ పనికిఁ గొడుకును బ్రేరేచి పంపెను. వనచరుని రాముని వేఁటాడు నిమిత్తము భరతుఁడు వచ్చెను. ఎంత దారుణము! ఎంత క్రూరము! పెక్కురాజులను జూచితిని; రామునియందుఁగల మహారాజలక్షణంబు లెందును గానరావు. విశాలవక్షంబును దీర్ఘబాహువులును కంబుగ్రీవంబును సమోన్నత హనువులును నాకర్ణాంత నేత్రంబులును నిసర్గలక్ష్మి కూర్చిన యనర్ఘభూషణములై యొప్పుచుండఁగా విధాతనిర్మాణశక్తికిఁ బరమావధియోయన నుండు సంగసౌష్ఠవము గలిగి సస్యశ్యామల శరీరచ్ఛాయ మెఱుఁగులీనుచుండగా రాముఁడు చూడఁజూడ ముచ్చటగును. వేయేల! అతఁడు పుంమోహనమూర్తిగాని యొండుగాఁడు; ఆకారమునకుఁ దగిన ప్రజ్ఞయుఁ ప్రజ్ఞకుఁ దగిన వినయమధురిమయు వానియందే చూడనగును. ఆ మేధావి యెఱుంగని తత్త్వరహస్యము

లేదందురు. వశియు సత్యవాదియు నెవఁడన్న వానినే పేర్కొన వలయును. వాని సంభాషణము మితమును ధర్మయుక్తమునై మహా ప్రియముఁ గూర్చుచుండును. అపకారినిగూడ నమ్మహాత్ముఁడు నెప మెన్నక యుపకరించును; నోరంతమేలొనర్చినను మఱువఁడు; శరణన్న ప్రాణమిచ్చును; స్వార్థమెట్టిదో యెఱుంగఁడు; అహితమెన్నఁడు నొనర్పఁడు; ప్రీతితోఁ బండిచ్చినను నొండగా గ్రహించును; సాధువు లకుఁ బరమసాధువు; వీరులకు మహావీరుఁడు. గాంభీర్యంబున సముద్రుని ధైర్యంబున హిమవంతుని వీర్యంబున విష్ణువును బ్రియదర్శనంబున జంద్రునిఁ గ్రోధంబునఁ గాలాగ్నిని శాంతంబున ధాత్రిని త్యాగంబున ధనదుని ధర్మంబున ధర్ముని దలపించుచు నెల్లరకుఁ గూర్మిపండువుగా నున్న రామునకు నెగ్గుతలంచి వచ్చిన యీ భరతు నేమనరాదు? కాసిమ్ము; రాముఁడు నాకు మిత్రము, ప్రభువు. వాని కార్యార్థము మీ రెల్లరు సర్వసిద్ధులరై యుండనగును. మన యోడలనెల్ల సైన్యముతో నిండి మాంసఫలమూలాశనము లాయత్తపఱచి గంగానదికి నడ్డముగాఁ దీర్చి రేవును గాపాడుచుండుఁడు. అయిదు వందల యోడలు తయారుగా నుండవలయును. భరతుఁడు నిరపరాధియేని వానిని ససైన్యముగా మన యోడలమీఁదనే దాటింత'మని చెప్పి వలసిన యేర్పాట్లుచేసి మధు మత్స్యమాంసంబులను గానుకగాఁ గొని భరతునొద్దకుఁ బోయెను.

గుహునిరాక సుమంత్రుఁడు చూచి, 'భరతా, నిషాదపతి గుహుఁడు వచ్చుచున్నాఁడు. వీనికి వేలకొలఁది జ్ఞాతులు గలరు; దండ కారణ్యమున నితఁడు త్రొక్కని తావుండదు; మీఁదుమిక్కిలి యితఁడు రామునకుఁ బరమమిత్రము; రాముని యిక్కువ లితండెఱిఁగి యుండును' అని చెప్పెను. అంతలోన గుహుఁడు వచ్చి భరతునకు నమస్కరించి, 'అయ్యా! నా యీ దేశము మీకు నిష్కంటము. మీ రాక మున్నుగా నెఱుంగనైతిని; దానునియింట బసచేయవేఁడుదు; కందమూలములకు ఫలమాంసంబులకుఁ గొదువయుండదు; ససైన్యంబుగా నా యలఁతి యాతిథ్యము నంగీకరించి యీ రాత్రి యిందుఁ బుచ్చి రేపు చననగు' నని విన్నవించెను. భరతుఁడు వాని ప్రణయమును విని, 'నిషాదేశ్వరా! నీ సుహృద్భావము మాకు సమస్తముఁ గూర్చెను. నాయన్న మిత్రుఁడు నాకు వేఱుగాఁడు. భరద్వాజాశ్రమమునకుఁ జననున్నాను. ఈ ప్రదే శము దుర్గమంబుగావున మార్గముఁ దెలియరాకున్నది. గంగయు దాట రాకున్నది' అనెను. గుహుఁడు సుంత వితర్కించి, 'రాజా! ఇంతసేన

యేల? ఈ సన్నాహము సంశయమును గలిగింపకమానదు; రామునకుఁ గీడు తలఁపంబడదు గదా'యని తన నెంజలిని వెలిపుచ్చెను. భరతుఁడు వాని హృదయము గ్రహించి, 'మిత్రమా! నీ కిట్టి సంశయమగుట కెంతయుఁ జింతయయ్యెడు. నాకు నన్నయుఁ దండ్రియు నీడయునైన రామునిఁ దోడి తెచ్చుటకుఁ బోవుచున్నాను. సంశయము వల'దని తన యుదంత మెల్ల వినిచెను. గుహుఁడు పరమప్రీతుఁడై, 'భరతా! నీకు రాజ్య మయత్నప్రాప్తమాయెను. అట్టి దానిని గూడఁ ద్యజించితివా? నీ త్యాగ మేమనవలయును? నీ కీర్తి చిరస్థాయియై వెలయుఁగాక' అని తన యానందమును వెల్లడించెను.

అంతలోన రాత్రియయ్యెను. సైన్యమెల్ల బడలి మైమఱచి నిద్రించెను. భరతునకు మాత్రము కనుగూర్కదు. వానితల్లి దుండగంబును దానం గలిగిన విపత్తులును వాని హృదయదర్పణంబున నొక్కటొక్కటిగాఁ బొడసూపసాగెను. వాని యంగములెల్లఁ జెమర్చెను. గుహుఁడు వాని మనస్తాపంబును గ్రహించి డాయబోయి, 'భరతా! నీ యట్లు రాముఁడు గూడ నిందొక రాత్రి గడపెను. వానిని లక్ష్మణుఁడు రేయెల్ల తెప్పవాల్పక కాచియుండెను. నేను లక్ష్మణునిఁ జేరి, 'నాయనా! ఈ కష్టంబులకు నోపవు; సుంత పరుండి బడలికలు వాయుము. రామప్రసాదార్థుఁడనై యున్నాను. వానియందు నాకుఁ గల ప్రేమ యింతనరాదు. నేను నా బంధుజన సహితంబుగా వేచి యుండి రాముని గాపాడుదు'నని వాని నెన్నోవిధముల వేడితిని. ఎంత చెప్పినను సౌమిత్రి వినక, 'అయ్యా! నా యన్న భార్యతోడ నిట్లు కటికనేలఁ బడియుండుటఁ జూచుచు నేను బ్రతికియుండుట కెంతయు వగతును. ఈ దురవస్థ చూచు నా కంటికిఁ గూర్కు వచ్చునా? దేవాసురులకైన వచ్చినను బిఱుదివిఱుచు పరాక్రమ శాలికి దశరథ మహారాజ చిరతపఃఫలమైన వానికి నా యన్నకు నిట్టికష్టములు వచ్చుటఁ దలఁపగా విషాదాశ్చర్యములు పెనగొని యేచుచున్నవి. రాము నెడఁబాసి దశరథుఁడు చిరకాలము జీవింపఁడు; కోసలావని త్వరలోనే విధవ కానున్నది; కౌసల్యాసుమిత్రలు భర్తననుగమింతురు; సర్వము శూన్యముగా నా కంటికి గోచరించుచున్నది; అయోధ్యకును మాకును ఋణము తీఱె'నని బహువిధముల దుఃఖించెను. వాని దుఃఖమును మాన్పలేనైతిని. తెల్లవారినంత వారు జడలు దాల్చి వల్కలములుగట్టి సీతాదేవిని వెంటఁగొని చని'రనెను.

ఆకత విని భరతుఁడు దుఃఖహతుఁడై నేలవ్రాలెను. వానికి శత్రుఘ్నుఁడు విలపించెను. ఎల్లరు బెగడొంది వాపోవసాగిరి. కౌసల్యా దేవి వానిని సంది టఁగూర్చి, 'నాయనా! ఏల యిట్లయితివి? మా ప్రాణములు నీచేతిలోనున్నవి. నిన్నుఁజూచి బ్రతికియున్నాము. ఏదేని దుర్వార్త వినవచ్చెనా?' యని దురపిల్లఁజొచ్చెను. భరతుఁడు తెప్పరిల్లి తనయెడరు నణఁచికొని కౌసల్య నోదార్చి, 'నిషాదేశ్వరా! నా యన్న నాఁటిరేయి యెందుఁ బరుండెను? లక్ష్మణుఁ డెందుఁ గాచియుండెను? సీతాదేవి యెచటఁ బవళించెను? వారేమి భుజించిరి?' అని గుహు నడిగెను. నావుఁడు, 'భరతా, ఈ గారచెట్టుక్రింద దర్భశయ్యపయి రాముఁడు పరుండెను. వాని సమీపమున సీతాదేవి యటఁ బవళించెను. లక్ష్మణుఁడు వారివారి యడుగుదమ్ములు గడిగి యాచోట ధనుష్పాణియై కాచియుండెను. వారి భోజనార్థము నానాభక్ష్యములను వివిధఫలంబులను బహుతరరుచిరాన్నములను దెచ్చితిని. ఏదియు ముట్టరైరి. క్షత్రియులకు దానాధికారము గలదుగాని పరిగ్రహాధికారము లేదని రాముఁడు నాకు సమాధానముచెప్పి తమ్ముఁడు తెచ్చిన నీరు పుడిసెఁడు ద్రావియుండెను. సీతాలక్ష్మణులుగూడ నట్లే యొనర్చిరి. నేనును విల్లు దాల్చి నా బంధుజనముతోఁగూడి లక్ష్మణునివెంటనుంటి' నని గుహుఁడు చెప్పెను.

భరతుఁడా గారచెట్టుక్రిందకుఁజని యందున్న దర్భశయ్యను గాంచి తల్లులను బిలిచి, 'యీ పడకమీఁద గుహోత్సుఁడు రాముఁడు నాఁటిరాత్రిగడపె' నని వారికి దానినిజూపి, 'కటా! మెత్తని యాస్తరంబులు గప్పి నెత్తావిపూలుచల్లి తీర్చిన ప్రాసాదవిమానవలభీ ప్రదేశములందు హంసతూలికాతల్పంబులపయి శుకపికమధురారావములును వీణారవములు నాలకించుచు మలయమారుతుని సేవలందుచుఁ బరిజన సహస్రయుతుఁడై హాయిగానుండునట్టి నా యన్నకుఁ గటికరాల మయమైన కీకారణ్యమందుఁ గ్రూరమృగావళిమధ్య నెల్లుపయి నిద్రించు దురవస్థ కలగెఁగదా? ఈ విపరీతము తలంపునకు గూడ నందకున్నది. దైవమునకన్నఁ గాలమే బలవత్తరమను నుడి నిజమగుచున్నది. అయ్యో! ఈయగచాట్లకెల్ల నేనేగదా మూలము. నా వంటి పాపాత్ముడుండునా? లక్ష్మణా! అనిర్వచనీయమైనట్టి దురవస్థయందుఁగూడ రాముని విడనాడవైతివి. నీ సుకృతమే సుకృతము. ఆపద్బాంధవుఁడన్న నిన్నే చూపవలయును. జనకరాజతనయా! పతివ్రతాధర్మంబును లోకంబున నుద్ధరించి కృతార్థవైతివిగదా. మీ పాదరేణువునకుఁ బోలుదునా?

అన్నా! నీకుఁగానిభోగములు నా కేల? నేనుగూడ నీవార్గమనుసరింతును. వల్కలములుగట్టి జడలు ముడిచి కందమూలాశినినై నేలమీఁదఁ బరుండుచు నీపాదధ్యానరతుండనై యుందును. ఇదే నాకుఁ బాపప్రాయశ్చిత్తమగుఁగాక. నామనవి చేకొనవేని నీవెంటనుందు'నని పెక్కుగతుల దుఃఖించెను. ఆ రేయి యెల్ల నట్లు చనెను.

భరతుఁడు భరద్వాజమహర్షిని సందర్శించుట

తెల్లవారినంతట భరతుఁడు గుహునితో, 'మిత్రమా, నదిని దాటింపు'మనెను. అతఁడు నిజపురికిఁజని బంధువర్గంబును లేపి సంగతియెల్ల వారికి వినిచి విశాలములును జిత్రపతాకాభిశోభితములునైన యోడలను స్వస్తికములను రేవునందుఁ దీర్చి యందొకదానివయి నెక్కుకంబళి పఱపించి వచ్చెను. భరతశత్రుఘ్నులు దానిపై నెక్కిరి. అన్నిపడవలుండియు నెల్లరకుఁ జాలవయ్యెను. కొందఱు తెప్పలమీఁద దాటిరి. కొందఱు ఘటముల యూధారమున నీదిరి. భరతుఁడట్లు ససైన్యంబుగా గంగానదినిదాటి యా తోయములాడి పరిశుద్ధుఁడై యందుండి మైత్రముహూర్తంబునఁ దరలి ప్రయాగవనము సొచ్చి యటఁ బరివారమునుడించి శస్త్రవస్త్రములు వదలి పీతాంబరముఁదాల్చి మంత్రిపురోహితులను వెంటఁగొని భరద్వాజాశ్రమమునకుఁ జని తద్బహిర్భాగంబున నెల్లర నిలిపి వసిష్ఠద్వితీయుఁడై లోనికిఁబోయెను. భరద్వాజుఁడు వసిష్ఠునకు నభ్యుత్థానాది గౌరవములు గావించెను. భరతుఁడు తన యూరు పేరు చెప్పి యా మునికి నమస్కరించెను. భరద్వాజుఁడు వారికి యథాక్రమమర్ఘ్యపాద్యములిచ్చి కుశలమరసి తగుమర్యాదలు గావించెను. వసిష్ఠభరతులు నమ్మునిగుశలమడిగి వాని యగ్నిహోత్రములు విచారించిరి.

ఇట్లు సమాగమపూర్వాంగము ముగిసినంత భరద్వాజుఁడు భరతుని బిలిచి, 'వత్సా రాజ్యమువదలి యింతదవ్వురానేల? నీయన్న యమిత్రదమనుఁడగుటయు జగదానందవర్ధనుఁడగుటయు లోకవిదితము. ఆకళ్యాణమూర్తి యా కౌసల్యా తపఃఫలము తండ్రియాజ్ఞకుఁ గట్టువడి చతుర్దశవర్ష వనవాసమును స్వీకరించి భార్యయుఁ దమ్ముఁడు దోడుగా వెడలివచ్చెనుగదా. రాజులు నిష్కంటకరాజ్యము నభిలషింతురు. అట్టియభిలాష నిన్నెట్టి యకార్యమునకుఁ బురికొల్పెదుగదా?' యనెను. భరతుఁడు క్రించుఁదనము దాల్చి బొటబొటఁ గన్నీరు నించుచు, 'భవాదృశుల మనంబున నిట్టి సంశయము స్ఫురించుట నా దురదృష్టము

గాని వేఱుగాదు. ఋషివర్యా! రాజ్యము నాకు వలదు; త్రిశుద్ధికి మీ రెదుటఁ బ్రమాణము చేయుచున్నాను. నా తల్లి కొంచెతనము నాకుఁ దెలియదు. నేను నగరాంతరమున నుండఁగా నింతజరిగెను. ఈ లోకగర్హితకార్యమును మీ దాసుఁడు భరతుఁ డెంతమాత్రము నంగీకరింపఁడు. నా యన్న చరణములవ్రాలి వాని నయోధ్యకుఁ గొని పోవ వచ్చితిని. వాని యుక్కువలు సెలవీయవేఁడుదు'నని సాగిలఁ బడెను. భరద్వాజుఁడు మహా సంతోషమంది, 'వత్సా! ఇంద్రియ నిగ్రహమును జ్యేష్ఠానువర్తనమును సత్పురుష లక్షణములు. రాఘవు లన్యథాకరింపరు. యోగికబలంబున నీ తలంపును గ్రహించియు దృఢీకరణార్థమును భవత్కీర్తి ప్రచారము పొంచె నిట్లు ప్రస్తావించితిని. రాముఁడు సీతాలక్ష్మణయుతుఁడై చిత్రకూటంబున నున్నాఁడు. నీవు సపరివారముగా నేఁడిందుండి రేపు చననగు'నని వచించెను. భరతుఁడు వాని పలుకులు తలతోఁ గ్రహించెను. భరద్వాజుఁడు వానికి మెచ్చి, 'వత్సా! మా యెడ నీకుఁ బరమప్రీతిగౌరవము లుండుటయు నీ వలఁతి సంతోషి వగుటయు నెఱుంగుదుము; నీ సేనకు విందొనర్ప నెంచితిమి; బలమును దూరాన విడిచి రానేల?' యనెను. 'తపోధనా! ఆశ్రమము లకు బాధ కలుగరాదు; తాపసులున్నవలను దప్పించి ప్రయాణించుట రాజులకు విధివిహితము. ఆ కారణంబున నట్లు చేసితి'నని భరతుఁడు విన్నవించెను.

భరద్వాజుఁడు భరతునకు విందొనర్చుట

భరద్వాజుఁడంత వీతిహోత్రగృహము ప్రవేశించి యమ వరుణ కుబేర దేవేంద్రాదులను విశ్వకర్మను సంస్మరించి, 'భూమ్యాకాశంబులఁ గల నదీనదము లింపు వచ్చి మైరేయమద్యంబును సురను నిక్షురసము లోని శీతజలంబులను సమకూర్చుఁగాక; గంధర్వాప్సరసలు గీతా నృత్యంబులచేత నతిథులను దనుపుదురుగాక; సైత్రరథము వచ్చుగాక; భగవానుఁ డోషధీశుఁడు చతుర్విధాన్నములను నానాపానరసంబులను వివిధమాంసంబులను బుష్కలముగా సంతరించి వృక్షవాటినెల్ల నవనవ పత్రపుష్పఫలభరితంబుగా నొనర్చుఁగాక. ఎందును గొదువ లేకుండుఁ గాక'యని సంకల్పించెను.

మలయమారుతము హాయిగా వీచెను; పుష్పవర్షములు గురి సెను; స్వర్భేరీనినదంబులు చెలరేఁగెను; నృత్యగానంబులు దృక్కర్ణ

హృదయ సంతర్పణంబు లొదవించెను. పంచయోజన విస్తీర్ణ పర్యంతము భరాభాగమెల్ల నీల వైడూర్య రచితమోయన లేఁబచ్చికలతో నల రారెను. తరువులు ఫలపుష్పభరితములై కొమ్మలు సాచి యతిథిసత్కారార్థము నిరీక్షించుచున్నవోయన నొప్పెను. చతుశ్శాలలును గజ శాలలును నేలయీనినట్లయ్యెను; రాజగృహము శరన్మేఘధవళమై మహోన్నత కవాటతోరణంబులు గలిగి వివిధమాల్యావృతముగా నానామృదుతల్పాసనశోభితంబుగాఁ బరిమళగంధ బహుళంబుగాఁ బహు విధరత్న పాత్రమయముగాఁ బరిఢవిల్లెను.

"సీ॥ ఒకకొన్నివడియంబు లొకకొన్నివరుగులు,
నొకకొన్ని తెఱఁగుల యొలుపుఁబప్పు
లొకకొన్నిద్రబ్బెడ లొకకొన్నితాలింపు,
లొకకొన్నివిధముల యొట్టిచేసు
లొకకొన్నికలకల్పులొకకొన్ని బజ్జులు
నొకకొన్నిరీతుల యూర్పువగలు,
నొకకొన్నిసిగరులు నొకకొన్నియంబళ్ళు
నొకకొన్నివహులపూపోత్కరములు,

గీ॥ వివిధఫలకందమూలంబు లవియుఁగొన్ని
యూరుఁబిండులు నొకకొన్నియొక్కకొన్ని
యూరఁగాయలు పచ్చళ్ళు నొక్కకొన్ని
పెరుగు పాల్తేనె నేతులు పెచ్చు పెరిగె."

భరతుఁడు ససైన్యంబుగా నందుఁ బ్రవేశించి మహర్షి తపో బలంబునకు మహాశ్చర్యమొంది యా భవనంబుననున్న దివ్యాసనంబు నకును శ్వేతచ్ఛత్రచామరంబులకును బ్రదక్షిణించి రామునిస్మరించి నమస్కరించి సింహపీఠిని బూజించి వింజామరము గయిఁబట్టి మంత్రి జనోచితమైన యాసనంబున గూర్చుండెను. వాని ననుసరించి మంత్రి పురోహిత సేనాపతులు యథార్హ మధివసించిరి. అంత గంధర్వరాజులు నారదతుంబురగోపులు గానమారంభించిరి. అలంబుస మిశ్రకేశి పుండరీక వామన మున్నగు నచ్చరమచ్చెకంటులు నృత్తము సాగించిరి. వేనవేలు దివ్యాంగనలువచ్చి యతిథులనెల్ల జలకములాడించువారును వస్త్రము లందిచ్చువారును భక్ష్యభోజ్యములు కొసరికొసరి వడ్డించువారును బరిమళద్రవ్యము లలఁదువారును నై సకలోపచారములు గావించిరి. ఎల్లరు స్వర్గభోగము లనుభవించుచు నాటిరాత్రి యందుఁ బుచ్చిరి.

తెల్లవాఁటినంత భరద్వాజమహర్షి యగ్నిహోత్రకార్యములు దీర్చి యాశ్రమమున నుండెను. భరతుఁడు వానిని సమీపించి, 'మహాత్మా! రామసందర్శనమునకు నువ్విళ్ళూరుదు; ఇందు నాకుఁ గాలు నిలువను. చిత్రకూటమెంతదూరమో యటకు మార్గమేదో సెలవీయ వేఁడుదు' ననెను. ఆ మహర్షి భరతుని నిష్కళంకభక్తికి మెచ్చి, 'వత్సా, చిత్రకూట మిటకు సార్ధయోజనదూరమున నున్నది. దాని యుత్తరభాగంబున మందాకినీనది గలదు. సీతారామలక్ష్మణులు చిత్రకూటమునఁ బర్ణశాల నిర్మించుకొని యున్నారు' అనిచెప్పి దారిఁ జూపెను.

కౌసల్యాసుమిత్రలు భరద్వాజునకు మ్రొక్కి నిలిచిరి. కైకేయి నిజపాపభారవినమ్రయౌయన వంగి యా ఋషికి నమస్కరించి లజ్జ జేసి కౌసల్యాదులచెంత నిలువనోపక మునీంద్రునకుఁ బ్రదక్షిణమొనర్చి నెపంబున భరతునిప్రక్కకు నోసరిల్లెను. భరద్వాజుఁడు భరతునిజూచి పీరివ్వరనెను. 'మహాత్మా! శోకదీనయై కృశించియున్న యీమెయే కౌసల్యాదేవి, రామునిగన్న పూజ్యురాలు; పూరాలినకొండగోరువలె నున్న యీమె సుమిత్రాదేవి; విక్రమసింహులగు లక్ష్మణశత్రుఘ్నులామె తనయులు. సీతారామలక్ష్మణులకు వివాసమును భర్తకుఁ బుత్రశోకమరణమును నాకీ కష్టము నొక్కమాటతోఁ గూర్చిన యీ తల్లియే యీ మందభాగ్యుని తల్లి కైకేయీదేవి. ఈ యార్యరూపిణికిఁగా గడలేని యపకీర్తిని మూటగట్టితి' నని యతఁడుపలికెను. ఆ మహర్షి యీమాటవిని, 'వత్సా! భరతా! సీతల్లిఁదందు దోసమెంచవలదు. రామవనవాసము భవిష్యన్మంగళమునకుఁ బునాదియని గ్రహింపుము. ఇందువలన భావితాత్ములగు ఋషులకును దేవతలకు నెంతో మేలు గలుగుచున్నది. కైకేయి నిమిత్తమాత్రురాలు. దైవప్రేరణమట్లు గావించె' నని భగవత్సంకల్పమును సూచించెను.

భరతుఁడు చిత్రకూటమునకుఁ దరలుట

అంత భరతుఁడు మహర్షికి మ్రొక్కి వానియనుజ్ఞ వడసి సపరివారముగా వెడలి గంగాదక్షిణతీరమునఁ గీకారణ్యముఁబడి కొంతదవ్వు చని చిత్రకూటసానువులను గాంచి మందాకినీ తరంగసంఘట్టనధ్వనులను విని, 'నీలనీరదంబులు జలబిందువులనట్లు సానువులందలి పున్నాగంబులు పుష్పంబులను గురియుచున్నవి. హరిణంబులు మన సైన్యమునుజూచి బెదరి పెనుగాలికి నభ్రములువోలె చెల్లాచెదరగుచున్నవి, నీలజీమూతము లఁబోని శిఖరాగ్రతలములందుఁ బూజొంపములఁ దాల్చి సొబగారుచున్న

యీ తరువులను జూడఁగా నెఱులుదువ్వి విరులు ముడిచిన దాఁకీఁగా త్యలు తలంపునకు వచ్చుచున్నాఁడు. ఖురఘట్టపరాగము రాముని యాశ్రమపథంబును గప్పిపుచ్చునోయని గాఁబోలు మూఁతుఁడు దాని నెగజిమ్ముచున్నాఁడు. రథనేమిధ్వనులను మేఘగర్జనంబులఁగా భ్రమించి మనూరము లెగసి యిక్కఁవలు దూఁతుచున్న' వని పలికి రామాశ్ర మమును గుహతించిరమ్మని భటుల నాజ్ఞాపించెను. కొండఱుపోయి నలు క్రేవలుఁ జుట్టివచ్చి, 'దేవా, చూపుమేరదూరమున నదిగో భూమశిఖ గానవచ్చుచున్నది. అది రామాశ్రమమో ఋష్యాశ్రమమో కానోపు' ననిరి. భరతుఁడు పరివారమునెల్ల నంపు డించి వసిష్ఠసుమంత్రులను వెంటఁగొని యావంకఁ బోయెను.

సీతారాముల వనవిహారము

రాముఁడు చిత్రకూటముచేరి నాఁటికొక మాసమయ్యెను. ఆ యరణ్యము విజనముగావున నంపు నినసించుట సామాన్యులకుఁ గూడఁ గష్టతరముగాక మానదు. పుట్టునుద్దొట్టి నగళ్లలో వేలకొలఁది జనుల మధ్యఁ బెరిఁగిన సీతాదేవికి నట్టి వివాసము కష్టతమమగుట వింతగాదు. ఆ యమ్మ యందులకుఁగా విమనస్కయగునేమోయని రాముఁడు శంకించి యట్టిది పరిహరింపఁదలఁచి యామెను వెంటఁగొని వెడలి యందందలి విశేషంబుల నామెకుఁ జూపుచు, 'కళ్యాణీ! ఈ పర్వత రామణీయకములు రాజ్యభ్రంశ దుఃఖమునుగాని బంధువియోగ క్లేశమునుగాని నన్నుఁ దలంపనీయవు. ప్రేయసీ! వివిధధాతు మయములై మిన్నేరయుచున్న యీ గిరిశిఖరంబులు బాలార్కకిరణ ప్రసారంబునఁ జేసి వింతవింతవన్నె లీనుటఁ జూతువా? తలోదరీ! ఈ నగ రాజము మునిసేవితమగుట యిందలి మృగపక్షిజాతులు నిసర్గవైరములు మాని కలసిమెలసియుండు నెయ్యమే ప్రకటించుచున్నది. కాంతామణీ! శైలప్రస్థములందుఁ గిన్నరమిథునంబుల విహారంబులను తిలకింతువా? భళీ! సెలయేళ్ళతోడను సానువులతోడ ని గ్గీంద్రము మవప్రావి కరీంద్రమును దలపించునుగదా. శిరీషగాత్రీ! మందానిల మతిథి జన సత్కారపరతంబోలె గుహాంతర్నిర్గతమై నానాసూనగంధములు మోచి తెచ్చి ఘ్రాణేంద్రియ సంతర్పణ మొసర్చుచున్నది. ఇంపులకుఁ దనియని ప్రాణియుండునా? ప్రాణేశ్వరీ! నినుఁగూడి లక్ష్మణుని పరిచర్యలందుచు నిందు సంవత్సరము లున్నను నాకుఁ దనివిలేనట్లు తోఁపదు. ఈ వన వాసము ఫలద్వయమును గూర్చి యెంతో యుపకరించెను. ఎట్లందువా?

పితృఋణము తీఱెను; భరతునకుఁ బ్రియముఁగూరెను. దేవీ! ఇందలి సౌభాగ్యంబులఁ జూఱలాడుచు నాతోనుండు నీకు వెగటుగాదుగదా? వనవాసము విదేహముక్తికి నమ్మతోపాయమని పూర్వరాజర్షులు వచించిరి. అట్టిది మనకు సప్రార్థితముగా లభించెను. సఖీ! ఈ చిత్రకూటము నీలపీతసితారుణశిలామయమై నిక్కముగాఁ జిత్రకూటమగుచున్నది. అదిగో చూడుము; ఓషధులు పెట్టనిదీపములై యద్రితలంబును మనోహరంబుగా వెలిఁగించుచున్నవి. రమణీ! ఈ నల్లగల్వపాన్పులను బొగడపూసెజ్జలను భూర్ణపత్రశయనంబులను లేఁదామరపడకలను బరికింతువా? ఈ మ్మదితకమలమాలికలు కామిజన పరిత్యక్తములై కృతఘ్నుల తత్త్వమును దెలుపుచున్నవిసుమా. ఆత్మేశ్వరీ! కులధర్మవినర్థనములైన నియమంబులఁ బాటించుచు సాధుమానవర్తనై నీతోడ నిందు విహరించుచునుందు. నాకుఁ బదునాల్గువర్షములు క్షణప్రాయమగును. దేవీ! అవిగో మందాకినీసైకత ప్రదేశములు. అతిమనోహరములైన యవి భావోద్దీపికంబులుగాక మానవు. జలంబుల పయిఁ దేలియాడుచున్న యీ తామరలసొబగుఁ జూతువా? హంసకూజితంబులు వీనూపురధ్వనుల ననుకరించు చున్నవిసుమా. చెలీ! హరిణకంబులు రేవులఁబఱచి నీరు గ్రోలుతీరు చూడఁ జూడ వినోదమయ్యెడు. అదిగో చూడుము, మునులు కొందఱు జటావల్కలములు గట్టి తోయమాడుచున్నారు; కొందఱు బాహున్నతులై సూర్యభగవానునిగూర్చి యుపస్థాన మొనర్చుచున్నారు. శాతోదరీ!

గీ॥ కొండనెత్తమ్మిగొనబాఱుగున్నతరులు
వీచినదిపైని సూనముల్ విసరుఁజూవె,
కమ్మతావిపుష్పమ్ముల సెమ్మితోడఁ
బ్రియుఁడు ప్రియురాలిపైఁజోపు నయముదోప.

పర్వతమునుండి గాలికి వీచి పుష్పంబులు నదీతలంబునఁ బడుచుఁ బ్రియుఁడు విరులను బ్రియురాలిపయి విసరు మురిపెంబులు దలపించుచున్నవి. సుందరీ! అల చక్రవాకపు జంటల యనురాగంబును బరికింతువా? అవి సతీపతుల ప్రేమైకవర్తనంబునకు మార్గదర్శకములుగావా? మర్త్యులు తిర్యగ్జడంబుల వలన సయితము నేర్చుకొనఁదగిన సంగతు లెన్నోగలవు. కోమలీ! చిత్రకూటమే యయోధ్యగా మందాకినియే సరయువుగా వన్యమృగములే పరిజనముగా భావింపుము. అనుకూలవతివైన నీవును బ్రాణాధికుఁడైన లక్ష్మణుఁడును దోడుందుఁ రేని

నిందుఁ ద్రికాలనదీస్నానసుఖమనుభవించుచు మధుమూలఫలాశినై యెట్టి మనోద్వేగమెఱుంగక హాయిగా వసింతు'నని యున్యాపదేశంబుగా నాత్మనిశ్చయమును దెలుపుచుఁ గొంత తడవు వినోద విహారంబులఁ బుచ్చి కొండ నెత్తముమీఁదఁ జలువఱాతినెపయి సీతాసహితుఁడై కూర్చుండి నయ్యాయివిశేషంబులను బ్రియురాలికి మధురమధురంబుగాఁ బలుకుచు స్వాదుఫలంబులఁ దెచ్చి యిచ్చుచు నామెను వినోదింపఁ జేయుచుండెను.

రామభరతుల సమావేశము

సీతారాములట్లు కూర్చుండి యచ్చికబుచ్చికంబుల నుండఁగా వారి కెట్టెపట దూరమున హుతాత్తుగాఁ బరాగపటలి రేచి యెట్టగావు కప్పెను. శ్రవణకుహరంబులు వ్రీలునట్లు మహోధ్వని చెలరేఁగెను; మత్తమాతంగములు భయపీడితములై పఱచువేగధాటికి విరిగి కూలుచున్న వృక్షంబుల ఫెళఫెళారావంబు లకాలమేఘగర్జనంబులుగాఁ దోఁచెను. రాముఁ డా విపరీతములఁ జూచి, 'లక్ష్మణా! కెంధూళి చీఁకట్లు పర్వుచున్నవి; మేఘఘోషలవలె ధ్వను లుప్పతిల్లుచున్నవి; వనసత్త్వంబులు భయభ్రాంతములై యాత్మరక్షణార్థ మెండొంటి దాఁటి పఱచుచున్నవి. రాజో రాజమాత్రుఁడో వేటకై వచ్చి యుండును. అట్లుగాదేని యపూర్వసత్త్వము వనముఁజొచ్చి యుండును; సంగతియేమో పరికింపు'మని తమ్మునితోఁ జెప్పెను. సౌమిత్రి చేరువనున్న మహోన్నత వృక్షమెక్కి యుత్తరదిశఁ జూపుసారించి, 'అన్నా! చతురంగబలము గానవచ్చుచున్నది. దేవిని గుహాంతరమునకుఁ బంపి యగ్నిహోత్రముఁజల్లార్చి కవచముఁదొడివి శరసంధాన మొనర్పు'మనెను.

రామ:- సౌమిత్రీ! ధ్వజము గానరాదా? దానినిబట్టి సైన్యము నూహింపలేవా?

లక్ష్మ:- అన్నా! కోవిదారధ్వజము గానవచ్చుచున్నది; ఆశ్వికులు నింగిఁ జెంగలించుచున్నారు. కైకేయీసుతుని దాడిగాఁ దోఁచును. భరతుఁడు నిష్కంటకరాజ్యమును వలచి మనకు వెసరుపెట్ట వచ్చుచున్నాఁడు; ధనుర్ధరులమై గిరినాశ్రయించుదము; కాదేని యుద్ధసన్నద్ధుల మగుదము. మన చేటులకెల్ల మూలమైన యితనిసందర్శనము మనకు రణశ్రోణినగుఁగాక. ఇతఁడు వధ్యుఁడగుట నిస్సంశయము; వీనివధ దోషముగాదు

మీఁదమిక్కిలి ధర్మమే యగును. కైకేయి తన కుహనా వ్యాపారఫలము నేఁడుఁ గడుపార భుజించునుగాక. ఆ పాపిని సబాంధవంబుగా దహించి మంథరాకుధరంబును దుత్తునియలు గావింతును; ధాత్రి పాపవిముక్తయై సుఖించుగాక. ఇన్నాళ్ళుగా మత్రోత్థానలంబు నడఁచిపెట్టితిని; దుర్భరమైన తలనంపును మోసితిని. అవి యిప్పుడు పైకొనుచున్నవి. విరోధిరక్త మాంసంబులు వెదచల్లి క్రూరమృగసంతర్పణమొనర్చి నాభుజ కండూతిని దెమల్చుకొన సెలవిమ్ము.

రామ:- తమ్ముఁడా, శాంతింపుము. భరతుఁడు దురుద్దేశముతో వచ్చుచున్నట్లు తలంపవలదు; యుద్ధసన్నాహమెంతమాత్రము వలదు; భరతుని జంపుదునేని నా ప్రతిన బూటకమగును; నాకుఁ దీఱని యపవాదము గల్గును. మతియు ససత్యవాది నగుదును. అసత్యవాదికి రాజ్యమేల? మరియు బంధుమిత్ర రుధిరప్రదిగ్ధమైన ద్రవ్యము కాలకూటముగదా. లక్ష్మణా, రాజ్యకాంక్ష నీకు లేదాయని యందువా? ధర్మార్థకామంబు లొండె ధరిత్రీమండలమొండె మతియొకటియొండె మీకొఱకు గోరుదుఁగాని యాత్మార్థము గోరుటగాదు. నిస్సంగునకు నాకివి యేల? వత్సా, తలాతలలోకంబులెల్ల నా యజ్ఞచేతనుండఁగా గోప్పాదమునంటి యీ మ్రుక్కఁడిరాజ్యము వలయునా? సౌమిత్రీ, భరతుఁడు పరమభ్రాతృవత్సలుఁడు; వాఁడు నాకుఁ బ్రాణాధికుఁడుగాని యొండుగాదు. అతఁడయోధ్యకు వచ్చి వివరమెల్లవిని వ్యాకులేంద్రియుఁడై యనన్యప్రేరితుఁడుగా నిందు వచ్చుచున్నాఁడు. తల్లి యకార్యంబును వాఁడెంతమాత్రమును మన్నింపఁడు. రాజ్యమును నాకుఁ గట్టుటకై వాఁడిందు వచ్చుటగును. లక్ష్మణా, పుట్టువుదొట్టి మనమెల్లఁ గలసిమెలసి యుందుముగదా. ఎన్నఁడేని వాఁడు నీకు గోరంత యపకార మొనర్చెనా? అప్రియమెట్టిదేని వచించెనా? వానిని సంశయింతువేల? వాఁడిందువచ్చినప్పుడు పరుషముఁగాని యప్రియముగాని పరాకునఁగూడఁ బలుక వలదు. వానిననుట నన్ననుటయగును. అపదలందువా? అవి ప్రాణిసహజంబులు. అవి రెండువిధంబుల నుపకరించును. ఎట్లందువా? వానివలనఁ బ్రారబ్ధము భుక్తమై నశించును; ప్రాణి ప్రకృతికిఁ బరీక్షలగును.

సత్త్వాభివృద్ధిని గోరువా రాపదలను వలతు రేగాని దెగడరు. తన స్థితిని దానెఱుంగుటకన్న మానవునకు వేఱొండు నేలు గలదా? బంగారువన్నె వఱపుతొయివలన నెట్లో యట్లే మనుష్యుల స్వభావము క్లిష్టపరిస్థితులయందు బయలుపడును. తమ్ముఁడా, మఱియొకమాట. రాజ్యమే నీకుఁ బ్రధానమేని భరతునిఁ బ్రాణముతీయనేల? వానివలననే దానిని నీకిప్పింతును గదా. అతఁడు నామాట మీఱఁడుసుమా.

ఆ మాటలు విని లక్ష్మణుఁడు తన యవివృశ్యకారిత్వమునకు లజ్జించి యన్నకు మనస్సంతాప మొదవుట గ్రహించి వానిహృదయమును బ్రస్తావాంతరమునకు మరల్చువాఁడై, 'అన్నా, సుతవియోగము నోర్వక మన తండ్రియే యిందు వచ్చుచున్నాఁడు గాఁబోలు' ననెను. నావుడు, 'ఉండనోపు; అదిగో నాయనగారి జాత్యశ్వయుగము వచ్చుచున్నది; అదిగో పట్టపుటేనుఁగు శత్రుంజయము సేనాముఖంబున నడచుచున్నది. శ్వేతధ్వజము మాత్రము గానరాదు. చూతముగాక, దిగిరమ్ము'అని రాముఁడు చెప్పెను. లక్ష్మణుఁడు చెట్టుదిగి వచ్చి రాముని పార్శ్వమునఁ గేలుమోడ్చి నిలిచెను.

భరతుఁడు పాదచారియై కొంతదవ్వు వచ్చి యచట యాశ్రమ లక్షణంబులను బరికించి యందు రాముఁ డుండనోపునని తలపోయ సాగెను. అంతలోనఁ గుహుఁడును శత్రుఘ్నుఁడును రామాన్వేషణార్థము చన్నవారు మరలి వచ్చిరి. భరతుఁడు వసిష్ఠునకు మ్రొక్కి, 'ఋషి చంద్రమా, ఈ యాశ్రమంబున నాయన్న యుండునని స్ఫురించు చున్నది. మునుపడ మేముఁ దరలుదుము. నూ తల్లులను దోడ్కొని తమరు రానగు'నని వానికి విన్నవించి, గుహుని శత్రుఘ్నుని వెంటఁ గొని చని కొండొకయెడఁ దాపసగృహంబును బోని కుటీరంబును బర్ణమండపంబును రేలమంటకుఁగాఁ గూర్చియున్న కట్టియలను బూజార్థము సంతరించిన పుష్పంబులను జలిమిరి కాచికొనుటకుగాఁ జేర్చిన మృగమహిషకరీష రాసులను జూచుచుఁ బోయి,

"మ॥ కనియెఁ గోమలనీలమేఘసుభగాకారుఁ జటావల్క లా
జినధారుఁ సితభూతిభూషితుని రాజీవాక్షుఁ గళ్యాణ కీ
ర్తనుఁ గాకుత్స్థకులప్రదీపకుని సీతాలక్ష్మణోపేతు స
న్మునిలోకార్చితు సత్కృపాభరణు రాముఁ రాజమూడామణిన్."

భరతుఁడట్లు తనయన్నను జూచి వాని యంఘ్రిపద్మముల వ్రాలి బహువిధంబుల వాపోయెను. శత్రుఘ్నుఁడును వానికి సాగిలఁబడి నమస్కరించి బొటబొట కన్నీరు నింపసాగెను. రాముఁ డా తమ్ముల నిరువురఁ గవుఁగిటఁ గూర్చి భరతునిజూచి, 'నాయనా! ఎన్నాళ్ళకు నిన్నుఁ జూడఁగంటిని! తండ్రి సుఖమున్నాఁడుగదా. వానిని విడిచి నీవిట రాఁజెల్లునా? తండ్రి ముదిమియు నీ బాల్యంబును నిమిత్తములుగా నన్యులు రాజ్యమాక్రమింపరుగదా. వత్సా! సత్యవిక్రముఁడైన తండ్రిని శుశ్రూషింతువా? విదిత వేదవేదాంగతత్త్వసారుఁడును బ్రహ్మతేజోవిరాజితుఁడు నైన మన గురువును వసిష్ఠమహర్షిని యథావిధి పూజింతువా? కౌసల్యాదేవి సుఖమా? సుమిత్రాదేవి కుశలమా? కైకేయీదేవి సంతోషమా? వినయసంపన్నుఁడును బహుశ్రుతుఁడు నైన సుయజ్ఞుని సత్కరింతువా? దేవపితృగురుయజ్ఞాతులను యథార్హమర్చింతువా? అర్థశాస్త్ర విశారదుఁడును దివ్యాస్త్రసంపన్నుఁడు నైన సుధన్వుని ధనుర్వేదాచార్యుని మన్నింతువా? విధిజ్ఞుఁడగు సుయజ్ఞుఁడు హుతహోమ్యమాణంబులను యథాకాలము నీకుఁ దెలుపుచుండును గదా. విద్యానిధులును జితేంద్రియులును సత్కులసంజాతులును శూరులు నింగితజ్ఞులు నాత్మసములు నైన వారేగదా నీ మంత్రిపుంగవులు? భరతా! రాజ విజయంబునకు మంత్రమే మూలము. దానంజేసి కోవిదులును మంత్రధరులునైన వారినే మంత్రులుఁగా రాజు గ్రహింపవలయును.

"క॥ ఆనఘులశాస్త్రవిధిజ్ఞుల
నానరకోవిదఁ బితృపితామహక్రమమున వ
చ్చినవిప్రుల మంత్రులఁ గా
నొనరించవె కార్యసంప్రయోగముపొంపెఱ."

రాముఁడు రాజధర్ములనుపదేశించుట

'ఎన్నఁడుగాని తోఁడు నిద్రావశుఁడు గారాదు; అతఁడు యుక్తకాలంబున మేల్కొనుచుండవలయును. కార్యాలోచనమునకు నర్ధరాత్రము తప్ప నొండుసమయము తగదు; ఏకాకిగా నాలోచింపరాదు; అట్లని పెక్కండ్రతో నాలోచించుటయుఁ దగదు. ఆలోచిత రహస్యంబును వెల్లడింపరాదు. లఘుమూలమును మహోదయము నైన యర్థంబులను నిశ్చయించి శీఘ్రముగాఁ జేయుచుండ వలయును. ఆలస్యము తగదు. సామంతరాజులు సుకృతంబులును గృతరూపంబులు

నైన కార్యముల మాత్రమే యెఱుంగనగును; కర్తవ్యములు వారికిఁ దెలియరాదు. నీవును నీమంత్రులును గావించు నాలోచనంబులు యుక్తులవలనఁగాని తర్కంబులవలనఁగాని యింగితంబుల వలనఁగానీ యన్యులకు నందరాదు. మూర్ఖసహస్రంబును ద్యజించియేని బండితు నొక్కని సంపాదింపనగును. క్లిష్ట కాలంబునఁ బండితుఁ డుపకరించునే గాని మొఱకులు వేనవేలుండియుఁ గొఱగాఁరు. మంత్రహీనులైన నూర్గురు మంత్రులకన్న మేధావియు శూరుఁడును దక్షుఁడును విచక్షణుఁడునైన సచివుఁ డొక్కఁడు చాలును.

'వక్తృ, భృత్యుల నుత్తమమధ్యమాధములని మూఁడువర్గములుగా విభజించి తగినకార్యములందే వారిని నియమింపవలయును. కఠిన దండనంబులెందును బ్రజోద్వేగకరములు గావున రాజు శిక్షావిధానంబునఁ గడు మెలఁకువతో వర్తింపవలయును. దండనిర్ణయమందు మంత్రులు రాజునకు నుపశాంతిఁ గూర్పవలయును. యాజకులు దుర్దాన ద్రవ్యకృతయజ్ఞదీక్షకునిని స్త్రీలు హఠాత్కారకామకునిని దూషించునట్లు ప్రజలు కఠోరకరగ్రాహియైన రాజును నిందింతురు. ఉపాయకుశలుండును భృత్యదూషణపరుండును వైద్యుఁడును శూరుఁడును నైశ్వర్యకాముండును నైన వానివలన రాజునకు ముప్పురానుండును. ఆత్మశ్రేయఃకాముఁడైన జేఁడట్టి గూఢశత్రువును బరిమార్పక తీఱదు. సత్కారసంతుష్టుఁడును వ్యవహార ప్రగల్భుఁడును సమయోచిత వ్యూహరచనాకుముండును ధృతిమంతుండును బరిశుద్ధస్వభావుండును సత్కులప్రసూతుండు ననురక్తుండును దక్షుండును శూరుండునగు వాని నెందైన వెదకి రాజు నిజసేనాధిపత్యంబున నియమింపవలయును. మఱియు జేఁడు బలనంతులును యుద్ధవిశారదులును బహురణవిజయులు నైన ప్రధానవీరులను బరికించి సన్మానించుచుండవలయును. సైనికులకు యథోచిత వేతనంబులను గాలానతిక్రమముగా నిచ్చుచుండవలయును. భటులెందును వేతనజీవులై యుందురు; వారు విలంబమోర్వరు; అట్టి సందర్భములందుఁ గీడుసయితము రోయుదురు. అంతకన్న మహోనర్థము రాజునకు మఱియొండు గలుగదు. రాజు నిజకులపుత్త్రులలోఁ బ్రధాన భూతులైన వారిని దానమానముల మన్నించుచు సమయమువచ్చినప్పుడు వారు తనకుఁగాఁ బ్రాణమానంబుల నర్పించువారినిగాఁ గావింప వలయును. స్వదేశజుఁడును విద్వాంసుఁడును దక్షిణుఁడును బ్రతిభాశాలియును యుక్తాయుక్తవివేకియును యథోక్తవాదియు నైన వానిని

విచారించి రాజదూతగా నియమింపవలయును. మంత్రియుఁ బురోహితుఁడును యువరాజును సేనాపతియును దౌవారికుఁడును నంతర్వంశికుఁడును గారాగారాధికృతుఁడును ధనాధ్యక్షుఁడును గార్యనియోజకుఁడును ప్రాడ్వివాకుఁడును సేనానాయకుఁడును నగరాధ్యక్షుఁడును గర్మాంతికుఁడును సభాపతియును ధర్మాధికారియును దండపాలుండును దుర్గపాలుండును రాష్ట్రాంతపాలకుండునను పదునెనమండ్రుగు రష్టాదశతీర్థములనఁబడుదురు. శత్రురాజ్యమందలి యీ తీర్థముల నొక్కొక్కదానిని గాచియుండుటకుఁగా ముగ్గురు ముగ్గురు వంతను జాగరూకులైన చారులను నియమించి యందలి రహస్యముల నప్పుడప్పుడే రాజు తెలిసికొనుచుండవలయు. అంతియగాదు; స్వరాజ్యమందు గూడ మొదటి మూఁడు తీర్థములఁ దప్ప తక్కిన పంచదశతీర్థములను సయిత మట్లే యొకకంటఁ గనిపెట్టి యుండవలయును. శత్రువు దేశాంతర పలాయనుఁడై తిరిగి వచ్చినప్పుడు దుర్బలుఁడని వాని నుపేక్షింపరాదు. అతనినొకకంటఁ గాచియేయుండవలయును. నాయనా, లోకాయతికులనెన్నఁడును సేవింపరాదు; వారు పండితమానులును బరమాజ్ఞానులనుట నిజమేగాని యంతటి యనర్థకుశలు లుండఁబోరు. ధర్మశాస్త్రమన్నంతనే వారితల కంటగించును; శుష్కతర్కంబుల వారు ప్రొద్దుపుచ్చుచుందురు. పెడదారులు త్రొక్కించుటయే వారి దినచర్యగానుండును. ఈ విప్లవకారులున్న దేశమెన్నఁడును మేలుపడయదు. వారి నెప్పుడుగాని తలయెత్తనీయరాదు. వైశ్యులు రాజాభిమతులై యుండవలయును. అట్లగుటకు రాజు వారికిఁ గష్టంబులు తీర్చుచు నిష్టంబులు గూర్చుచు నుండవలయును. ఒండుచో వర్తకము యథావిధిసాగదు; వర్తకము సాగనినాఁడు జనులకు సౌఖ్యము పొసఁగదు. సర్వప్రజారక్షణము రాజధర్మమైయున్నను వర్తకులు విశేషాభిమానపాత్రు లగుదురు గావునఁ బ్రభువు వారియెడ జాగరూకుఁడై మెలఁగవలయును. అంతఃపురాంగనలను మంచి మాటలతో సంతోషపెట్టుచుఁ వారికి బరపురుషసంభాషణాదులకు నెడ మీయక వారిని గాపాడవలయును. స్త్రీలమాటల నమ్మరాదు; నమ్మనట్లగపడనురాదు. ఎన్నఁడుగాని వారికి రహస్యములఁ దెలుపవలదు. నాగవనంబును జక్కఁగా రక్షింపవలయును. గజాదిసంగ్రహంబున నేని కెప్పుడును దనివి జనింపరాదు. రాజు ప్రాతఃకాలమున లేచి సాలంకృతుఁడై సభాజనులకు సందర్శనమిచ్చుచుండవలయును. అవసరము గలిగినప్పుడు మాత్రమే పనివాండ్రకు రాజదర్శనము కావలయునుగాని

యన్నప్పుడెల్లఁ గారాదు. రాజు దుర్గంబులనెల్ల ధనధాన్యంబులతోడను వివిధాయుధయంత్రంబులతోడను శిల్పివర్గంబుతోడను ధనుర్ధరులతోడను నించియుండవలయును. ప్రభువు తన రాఁబడిని వృద్ధిచేయుచు వ్యయమును మట్టగించుచు నుండవలయును. అపాత్రులకు ధనమియ్యరాదు. పరిశుద్ధాత్ములమీఁద నేరమును మోపినప్పుడు దానిని శాస్త్రదృష్టుల వలనఁ జక్కగాఁ బరిశీలించి యథాన్యాయము తీర్పుచెప్పవలయును. లోభబుద్ధికి లోనై వారిని శిక్షింపరాదు. దొంగ సద్రవ్యముగాఁబట్టుపడి ఋజువుమీఁద దోషిగా నేర్పడినప్పుడు లంచమునొని వానిని విడువ రాదు. ధనికునకును దరిద్రునకును వ్యవహారము పొసఁగినప్పుడు రాజు వారి నిరువురను సమబుద్ధితో విచారింపవలయును. మిథ్యాభిశప్తుఁడు దండితుఁడై కన్నీరొలికినచో రాజునకుఁ బశుపుత్రధనాదిహాని యగును. దానంబుల వలన వృద్ధులను మచ్చికఁజేసి బాలురనుఁ బ్రియవచనంబుల బండితులను రాజు వశపఱచుకొనవలయును. దేవగురు తపోధనులకును వృద్ధులకు నతిథులకును జతిష్ఠ వృక్షంబులకును సిద్ధార్థులైన బ్రాహ్మణులకును నమస్కరించుట మఱువరాదు. అధర్మసంపాదనంబునకుఁ గడఁగవలదు. సుఖంబునఁబొందుఁ గామంబుననొండె ధర్మార్థంబులను వదలఁగూడదు. భరతా, పూర్వాహ్ణంబున ధర్మంబు నపరాహ్ణంబున నర్థంబును సాయాహ్ణంబునఁ గామంబును సేవింపనగునని కాలజ్ఞులు నియతిని బ్రతిపాదించిరి గావున రాజు తన్నియమమును బాలింపనగును. వేయేల? జనులెల్లరు రాజశ్రేయఃకాంక్షులగునట్లుగాఁ బ్రభువు వర్తింప వలయును. అనృతము నాస్తిక్యము క్రోధము ప్రమాదము దీర్ఘసూత్రత జ్ఞానిజననిర్లక్ష్యము ఆలస్యము ఇంద్రియపరత్వము ఏకచింతనము అనర్థజ్ఞమంత్రము నిశ్చితారంభము మంత్రరక్షణము ప్రాతఃకాల మంగళాద్యప్రయోగము ఏకకాలసర్వశత్రవయద్ధము-ఈ పదునాల్గును రాజదోషంబులండ్రు. రాజు వానిని సర్వథా పరిత్యజింపవలయును. సమర్థులగు వారిని నల్వురనో మువ్వురనో తనకు మంత్రులఁగా రాజు నియమించుకొని వారిమతంబులను వ్యష్టిగా సమిష్టిగా నెఱుఁగుచుండ వలయును. అగ్నిహోత్రాద్యనుష్ఠానంబులవలన వేదాధ్యయనంబును ధర్మనిబద్ధదానభోగంబులవలన ధనంబును సదాచారంబువలన శాస్త్రంబును సంతానమువలన భార్యను ఫలవంతములుగా నొనర్ప వలయును. ఒంటరిగా మధురాన్నమెన్నఁడును భుజింపరాదు; మిత్రుల యభిమతంబులను ధర్మానతిక్రమముగాఁ దీర్చుచుండ వలయును.

తమ్ముఁడా, రాజునకు నుండవలసిన ముఖ్యగుణములను స్థూలముగా వినిపించితిని. ఈ గుణములను బాటించి మన తాతముత్తాతలు కీర్తిఁ గాంచిరి. నీవును వారి మార్గమనుసరించి రాజ శబ్దమును సార్థమొనర్చి యిహపరసౌఖ్యములందుము.

"తే॥ గీ॥ వీరు నమ్మంగఁ దగుదువు వీరునమ్మ,
దగరు నా కనవలవదు తత్త్వబుద్ధి
నెవ్వరిని విశ్వసింపక యెల్లప్రొద్దు
నాత్మరక్షోపరుం డగునది విభుండు॥"

'క॥ పలుమఱు శపథంబులు నం
జలియును నభివాదనమును సామప్రియ భా
షలు మిథ్యావినయంబులు
గలయవి దుష్టస్వభావకాపురుషక్రియల్॥'

"క॥ తన కిమ్మగునంతకుఁ
ర్జనుఁ డిష్టుఁడవోలెనుండి సర్వమువోలెం,
దన కిమ్మగుడును గఱచును
ఘనదారుణకర్మగరళఘనదంష్ట్రలచేఁ."

కావున నట్టివారియెడ జాగరూకుఁడవై యుండుము. ఎల్లప్పుడును బాపంబులవలన నేవగింపు' మని బోధించెను.

భరతుఁడు రామపట్టాభిషేకమును బ్రార్థించుట

భరతుఁ డనియెల్ల సాంతముగా విని, 'అన్నా! నీ యుపదేశము లనర్ఘములు. అవి రాజునకుఁ జెల్లునుగాని నీ సేవాధర్మపరునకు నా కేల? రాజ్యము నీదిగాని నాదిగాదు. దానిని నేనెన్నఁడును గోరలేదు. ధర్మమును మనవంశ సంప్రదాయమును రాజలోకాచారము నన్నిటిఁ బరిశీలించి నా ప్రణయ మంగీకరించి పట్టాభిషిక్తుఁడవై జగన్మంగళ మొనర్పుము. నీవు సర్వార్థసిద్ధుఁడవు. ఎందున్నను నీకుఁ గొదువ యుండదుగాని నీవు రాజత్వము వహింపనిచో లోకాపకారమగును. ఎట్లందువా? మానవులకుఁ బురుషార్థసంపాదనంబునకు మించిన కార్యము గలుగదు. అందు ధర్మము ప్రధానము. ధర్మమునకు వృత్తివ్యవస్థలేదు. ఏవృత్తియైనను ధర్మసహితమైనచో దానివలననే సర్వముఁ జేకూఱును. నీవు క్షత్రవంశంబున జనించితివి. రాజ్యపాలనము నీకు విధివిధానము. అట్టిదానిని నీవు నేఁడు మానినచో దానికిఁ గళంకమాపాదించుటగును.

జనులు నీమార్గ మనుసరింతురు. అందువలన లేనియనర్థములువచ్చును. కావున నీవు రాజ్యభారంబును వహింపక తీఱుము. అది యట్లుండనిమ్ము. అన్నా, నేను రాకమున్నే నీవు సీతాలక్ష్మణసమేతముగా వనమునకుఁ దరలనేల? నన్ను శంకించితివా? అంతటి పాపాత్ముఁడనా? నీ కూర్మికి దూరుఁడనైతినా? నీ వియోగమెంతటి యాపదగలిగించెనో వింటివా? ఏమి సెప్పుదు! నాయన తెగటారెను; వాని శవమును జూచుభాగ్యము మాత్రము నాకు లభించెను. అన్నా! లేలెమ్ము. తండ్రికి జలతర్పణాదులొసంగుము. గాదిలిసుతుని తర్పణంబులు జనకునకు నక్షయపితృలోకంబును గూర్చును. అన్నా! నీదేలోకముగాఁ దండ్రి తన ప్రాణములు దొఱఁగె'నని విన్నవించెను.

రాముఁడు తండ్రికి జరమక్రియలు సలుపుట

పితృమరణవార్త చెవిసోకినంతనే గొడ్డటనఱికిన తరువువలె రాముఁడు నేలఁగూలి మూర్ఛావివశుఁడయ్యెను. వానిని శీతోపచారంబులఁ దేర్చిరి. అతఁడు కొంతవడికిఁ దేఱి, 'హా! తండ్రీ! నీకొడుకే నీకు మృత్యువాయెనా? అయ్యో! పితృదహనసంస్కారభాగ్యమేని నోఁచనైతినా? అయోధ్యకు నాకు ఋణము తీఱెను; కాదనివచ్చిన నన్నిఁక రాజకార్యముల నియమించి శిక్షించు దక్కుఁడెవండు? తండ్రీ! నీ మెప్పులును నీ బుజ్జవంబులు నిఁక నెందుఁ బడయుదు? హా! జానకీ! నీ మామను మఱచిపొమ్ము; లక్ష్మణా! పితృహీనుండనైతి'వని వాపోవ సాగెను.

తమ్ములు ముగ్గురుఁగూడి పెద్దయుండడ నూఱటలు పలికి పితృచరమ క్రియకు రామునిఁ బ్రేరేపించిరి. ఆ ధీరాత్ముఁడు నిజదుఃఖమును మ్రింగి కన్నీటిజాలునఁ దోఁగుచున్న సీతాదేవిని బుజ్జగించి, 'లక్ష్మణా! ఇంగుదీపిణ్యాకముఁ దెచ్చియిమ్ము; ఉత్తరీయమందికొనుము. నీ వదినె ముందును వెనుక సీవును దరలుము; నీ వెంట నేను నత్తును. ఇట్టి కార్యములందు స్త్రీలును బాలురును ముందు చనుట శాస్త్రీయ'మని చెప్పి, వారితోడఁబోయి మందాకినీ సలిలంబులాడి తండ్రికి సభక్తికంబుగా నుదకంబులు విడిచి మఱల దోయిట నీరుగొని దక్షిణాభిముఖుఁడై, 'రాజసింహమా? పితృలోకగతునకు నీకు నా యిచ్చుచున్న యీ విలోమలోదకంబు లక్షయముఁ గూర్చుగాక' అని జలంబును వదలి తీరమునకు వచ్చి గారపిండియు రేగుసండ్లును గలిపి పిండములు

చేసి వానిని దర్భసంస్తరణముందుంచి, 'మహారాజా! పురుషుఁడు తాను భుజించునట్టి యాహారమునే దేవతలకు సమర్పించుట శాస్త్రీయము; మాకిట నింగుదీపిణ్యాకమే యాహారము; అదే నీకు సమర్పించుచున్నాను; ప్రీతితో గ్రహింపు'మని గద్గదస్వనంబునఁ బలికి నివాపమిచ్చి పర్ణశాలాభిముఖుఁడై చనెను.

కౌసల్యాదేవి పుత్రాదుల కష్టములకై దుఃఖించుట

అంతలోన వసిష్ఠాదులు మందాకినీతీరమునకు వచ్చిరి. కౌసల్యాదేవి యందలి రేవులు పరికించి, 'సీతారామలక్ష్మణులు నిర్విషయీకృతులై యిందు వచ్చినది మొద లీరేవునందు నీరాడుచుందు'రని తలంచి, 'సుమిత్రా! నీకుమారుఁడు రామునికొఱకు జలంబు లీరేవునుండి కొనిపోవుచుండును. నీచకార్యనియోజితుండగు కతన లక్ష్మణుఁడు గర్హితుఁడని యెంచవలదు. అన్న శుశ్రూషయెట్టిదేని గుణవంతమే గదా. ఆకూనకు నిట్టిక్లేశము శీఘ్రుమే తొలఁగుఁగాక' యని పలికి, తత్సమీపంబున దక్షిణాగ్రంబులగు దర్భలపయి నున్న యింగుదీపిణ్యాకములు చూచి,

సీ॥ చతురంతవసుమతీ చక్రాధినాథుండు
గారపిండిభుజించు కరణియయ్యె
ఆగర్భలక్ష్మీకుఁడైనట్టి పుత్త్రుండు
నారచీరలుగట్టి నవయుటయ్యె
వీరాతివీరైక విఖ్యాతుఁడౌ కూన
మూపున నీరంబుమోయుటయ్యె
రాజాధిరాజుగారాబు పుత్త్రీమణి
మృగములతోఁగూడి మెలఁగుటయ్యెఁ

గీ॥ బతినిగోల్పోయి గాదిలి సుతునిబాసి
చచ్చిచావనిదానవై శరణులేక
యొరులపంచఁ బ్రాకుచు మనియుండుటయ్యెఁ
గటకటా! యింతకన్న దుఃఖంబు గలదె?

అని బహువిధంబుల విలపించెను. ఆమెను మెల్లగా నోదార్చి పర్ణశాలకుఁ దరలించిరి.

రాముడులను వారి తల్లులు చేరుట

రాముఁడు కౌసల్యాదులనుగాంచి యెదురేగి వారికి సవిన యంబుగా నమస్కరించెను. వారు మృదుతరహస్తంబుల వానిని బుడికి చుంచులు దువ్వి శిరము మూర్కొనిరి. లక్ష్మణుఁడు తల్లులకుఁ బ్రణ మిల్లెను. వారతని నాదరించిరి. సీతాదేవి యశ్రుపూర్ణేక్షణయై యత్తల యడుగుఁదమ్ములకు మ్రొక్కెను. దుఃఖార్తయు వివాసకృశీ భూతయునై యున్న యామెను గౌసల్యాదేవి యాత్మసుతనువలెఁ గౌగిటఁగూర్చి, 'అమ్మా! ఆతపతప్తమైన పద్మమువలెఁ బరిక్లిష్టమైన యుత్పలముక్రియ, ధూళిధూసరమైన సువర్ణముబోలె మేఘాచ్ఛాదితమైన చంద్రమండలమువడువునఁ గప్పుదాల్చి కాంతిహీనమైన నీ మోమును గాంచినంతనే దుఃఖాగ్ని నన్ను దహించుచున్నది. జనకమహారాజునకు ముద్దుసుతవై దశరథమండలేశ్వరునకు గాదిలికోడలవై త్రైలోక్య వల్లభుని రాముని జేపట్టిన నీకుఁగూడ వెతలు దప్పవయ్యెనా? విధి నేమనఁ దగునో యూహింపరా' దని కన్నీరు నించెను.

రామభరతుల సంవాదము

రాముఁడు వసిష్ఠమహర్షిని దేవేంద్రుఁడు సురగురువునుబోలె నమస్కరించి వాని నుచితాసనంబునఁ గూర్చుండఁబెట్టి తత్సమీపంబునఁ దాను గూర్చుండెను. వానివెంబడి భరతుఁడు గూర్చుండెను. అంతలోన నటకు మంత్రులును బ్రధానులును సైనికవర్గమును వచ్చి రామునకుఁ సాష్టాంగనమస్కారమొనర్చి తదనుజ్ఞాతులై యథాస్థానంబులు గైకొని యేమిజరుగునోయని తహతహపడుచు దదేకదృష్టి నుండిరి. అంత రాముఁడు తమ్మునిఁ జూచి, 'భరతా, నివు జటావల్కలములుగట్టి యిందు వచ్చిన కారణమేమో వినవలతు' ననెను.

భర:- అన్నా! మనతండ్రి కేవలకామవివశుఁడై హితాహితవివేకము దక్కి ముదిమికిఁ జిక్కి నీకుఁ జేయరాని యపకారమొనర్చి తచ్చోకంబున మడిసెను. నా తల్లి దురాశాపిశాచగ్రస్తయై నిన్నుఁ గాననసీమలకుఁ దరలించెనే గాని తనకోర్కిని బడయఁ జాలదు. ఆమె నిజాపరాధఫలంబుగా శోకకర్శితయై ఘోర నిరయంబును బడయనున్నది. పాపికడుపునఁ బుట్టుటఁ జేసి నేనును మహాపాతకినైతిని. నాకు నీవే గతి; నీదాసు ననుగ్రహింపుము. నీకుఁ దెలియనికులధర్మములొండె రాజధర్మములొండెఁ గలుగవు.

మా విజ్ఞాపనంబును మనస్కరించి ధర్మరక్షణంబును లోక రంజనంబు నొనర్పుము. చేదోయి యొగ్గి త్రిశుద్ధికిఁ బ్రార్థించు చున్నాను. శీతకరునివలన శారదారాత్రియట్లు నీవలన ధాత్రి తేజరిల్లుఁగాక. తమ్ముఁడను, శిష్యుఁడను, దాసుఁడను; ననొప్పరికింపకుము. ఇది నా యొక్కని విన్నపమేగాదు; ప్రకృతివర్గమెల్ల నైకకంఠ్యంబున నా ముఖంబున నిట్లు విన్న వించు చున్నది.

రామ:- భరతా, నీవు కులీనుండవును సత్వసంపన్నుండవును దేజస్వియు జితవ్రతుండవును గావుట లోకమెఱుఁగదా? ఇట్టి తుచ్ఛ రాజ్యంబునకుఁ బ్రాల్మాలుదువని యెవరైనను దలంతురా? వత్సా, నీ యెడ నెట్టిదోషంబును నేను శంకింపలేదు. నీ తల్లి పూజ్యురాలు; ఆమెను దూఱుట సరిగాదు. పుత్త్రికళత్రాదులను యథామతి నియమించు స్వాతంత్ర్యము గురుజనంబునకు సంపూర్ణముగాఁ గలదు. తండ్రియాజ్ఞ నట్లు తల్లియాజ్ఞనుగూడ నెఱవేర్చుట సాధుమతమగును. తండ్రిపంపును దలదాల్చితిని; నీవు నీ తల్లియానతిని మీఱవలదు. మఱియు మనతండ్రి నాకు వనవాసంబును నీకు రాజ్యభారవహనంబును శాసించి పరలోక గతుఁడయ్యెను. తండ్రి యేదియిచ్చునో యదే మనకుఁబరివేలు. దానిని నిరసింపఁజనదు. అదియునుంగాక తల్లిదండ్రులిద్దఱుఁ గలసి మనకిట్లు విధించిరి. ఈ సంగతి మఱువక వారి యాజ్ఞను శిరముతో గ్రహించి తదనుసారముగా వర్తింపుము.

భర:- అన్నా! నీకెదురాడుటగాదు; నా మనవి వినుము. ఉత్పథము ద్రొక్కినప్పుడు గురుజనమును సయితము నిరసింపవలయునని శాస్త్రము. ఈ విషయమున మనతండ్రియు నా తల్లియు జెడు త్రోవఁ దొక్కిరి. అట్టివారిమాట పాటించినఁ బాపమగును. రాజ్యము నీదిగాని నాదిగాదు. నీ రాజ్యమును నీవ్ర వదలినచ్చినచో దానిని బాలించు వారెవరు? మఱియు రాజ్యభారము వహింప నాకుఁ దరముగాదు. అశ్వవేగము ఖరమునకుఁ గలుగదు; పక్షీం ద్రునివలె కాకి యెగురఁజాలదు. ఎవనినలనఁ బెక్కుఁడు సుఖిం తురో వాని జీవనమే జీవనమగును; పరానుజీవనము దుర్జీవనము. మనతండ్రి యీ రాజ్యవృక్షంబును బెంచి ప్రోదిసేసెను. దాని ఫలము నీ మూలమున లోకమునకుఁ జెందనలసియున్నది. అట్లు

కానిచో మనతండ్రిశ్రమయెల్ల వ్యర్థమగును. అన్నా! నీ పట్టాభిషేకమును బౌరులెల్లరు సభిలషించుచున్నారు; మఱియు నద్దాన నంతఃపురస్త్రీల దుఃఖము సమసిపోనున్నది. రెంటనుపకరింపనున్న కార్యంబును ద్రోయవలదు. అన్నా! తండ్రియు రాజు నైనవాని యాజ్ఞ దాఁటరాదంటివి. రాజాజ్ఞ లోకకళ్యాణకరముగా నుండవలయును. ఒండుచో దానిని భాటించుకొల్లు? ఈ యాజ్ఞ కోసల రాష్ట్రమునెల్ల దుఃఖసాగరమున ముంచెను. ఆ సంగతి నీకు మాత్రము తెలియదా? తండ్రియాజ్ఞ నీకు మేలు గూర్చెనందువా? అవును. అది నీ త్యాగగుణంబును వెల్లడించి నీకు శాశ్వతకీర్తిని గూర్చెననుట సత్యము. ఇది యూహాత్మార్థమగునేగాని లోకార్థము గాదు. ఆత్మలాభార్థ మింతలోకంబు నలమటఁ ద్రోయుదువా? అది ధర్మ్యమగునా? ధర్మ్యమగాని దానిని నీవు మనస్కరింతువా?

రామ:- భరతా, ధర్మాధర్మముల విచారమంత సులుభముగాదు. కొన్ని సందర్భములందు వానింగూర్చి భావితాత్ములు సయితము పొరఁబడుదురు. ఆ సంగతి యటుండనిమ్ము. భరతా, జీవులు ప్రారబ్ధకర్మానుభవార్థము దేహములు ధరించుచుందురు. దేహములన్నచో భోక్తవ్యకర్మములకు యోగ్యములుగా నానారూపంబుల వచ్చును. కర్మము భుక్తమై నశించునేగాని యెండు విధమున నశింపదు. ఏకర్మానుభవార్థ మీ జన్మమును గాంచితిమో దాని ననుభవింపక మానుకొల్లు? నీవు రాజ్యభారవహన రూపమైనకర్మము ననుభవింపపలసియున్నది. అది తప్పదు. తండ్రి యాజ్ఞగాని నీతల్లి కార్యముగాని నిమిత్తమాత్రములు. జీవుల జీవయంత్రమందుఁగల యీ పరమరహస్యమును గ్రహించి నర్తించుటయే జ్ఞానమగును. వట్టి వాదములవలన ఫలములేదు. కావున నీవు మరలి యయోధ్యకుఁ జనుము. నామాట వినుము. కర్మానుభవాదు లైచ్ఛికములని కొందఱు తలంతురు. అది సరిగాదు. ప్రతికర్మమునకు ఫలము తప్పదుగదా. ఫలముతప్పని నాఁడు దానిని గర్హ యనుభవింపక మానుకొల్లు? ఫలము స్వార్థముగాక పరార్థము కారాదాయని యందువా? ఆసంగతినే కర్మయోగము బోధించుచున్నది. అట్లుచేయుచో పునర్జనన కారణమే గలుగదు. జననము లేనినాఁడు ఫలానుభవముగూడ లేని దగునుగదా.

భరః- అన్నా! నీ మాట సత్యము. నా యట్టివారి యేలుఁబడి స్వకర్తాను భవార్థమేయగును గాని యొండుగాదు. నీ వనిననో యవాప్త సమస్తకాముఁడవు; ద్వంద్వాతీతుండవు. నీ పరిపాలనము లోక కళ్యాణకరమగును. ఆ కారణంబున నీవు రాజత్వము నంగీకరింపవలదా? పరోపకారమునకన్న ధర్మముగలదా? మఱి యొకటి విన్నవింతును. మహోత్ములకుఁ గష్టములు గలుగుటఁ జూచి లోకము విపరీతబుద్ధిని బడయును; ఆ కారణంబున ధర్మమునందు విశ్వాసము తఱుగును. దాన మహానర్థములు గలుగును. నీవట్టి విపరీతంబులకుఁ గారణభూతుఁడవు కానగునా? ఇదియును గాక నీవు ధర్మరక్షణార్థ మవతరించితివి. మోక్ష ధర్మములవలె లౌకికధర్మములనుగూడ నీవు రక్షింపవలయును. లౌకికధర్మములందుఁ గులధర్మము పెద్దయందురు. మనము క్షత్త్రి వంశంబున జనించితిమి. క్షత్త్రియులకు రాజ్యపాలనము ధర్మ మగునేగాని మునివృత్తి ధర్మముగాదు. నీవే వర్ణాశ్రమ ధర్మ వ్యతిక్రమ మొనర్తువేని నిన్నుఁజూచి రాజ్యమెల్ల విపథంబును ద్రొక్కునగదా. అన్నా! మహోత్ములజీవితము పరోపకారార్థమే గాని యాత్మార్థముగాదు. నీ వలన లోక మెంతో మేలుపడయ నున్నది. లోకప్రతీక్షణమును రిత్తపుచ్చకుము. వయోవీర్యా దులఁ బెద్దవగు నీవుండఁగా నేను రాజత్వము వహించుట తులువతనముగాదా? నా మనవి చేకొనుము. కులగురువులు వసిష్ఠాదులు వచ్చియున్నారు. ఇప్పుడే యిందే నీకు సమంత్ర కముగాఁ బట్టముఁ గట్టుదురు. మా మొఱలాలకింపుము; అయో ధ్యకు మరలుము; దేవర్షిపితృఋణములు తీర్చి ప్రజాభీష్టములు గూర్చి లోకకళ్యాణ మొనర్పుము. ఇదే సాష్టాంగపూర్వక ముగాఁ బ్రార్థించుచున్నాను.

రామః- భరతా, దశరథసత్పుత్త్రునకు నీకు యోగ్యముగాఁ బల్కితివి. రాజ్యము నాదని నీవు భావించుట ప్రమాదము. సంగతి యెఱుం గక యట్లనుచున్నావు. కైకేయీగర్భజునకు రాజ్యమును బాస చేసి యామెను మనతండ్రి వివాహమయ్యెను. ఆ కారణమున రాజ్యము నీఁదగుఁగాని నాదికానేరదు. నీ రాజ్యమును నీవు పరి పాలింపక తీఱదు. మఱియుఁ దండ్రినూట కల్ల సేయకుము. ఎవఁడు తనతండ్రిని బున్నామనరకమునుండి కాపాడునో యతఁడే

పుత్త్రుఁడగునుగాని కన్నవారెల్లఁ బుత్త్రులు కాఁజాలరు. భరతా! తండ్రులు బహుపుత్త్రులఁ గోరుటయేలనో యూహింతువా? అందొక్కఁడేని తనకు గయాపిండదాన మిచ్చుఁగాక యను పేరాసతో నట్లభిలషింతురుసుమా. ఇది గయునివచనముగాని వేఱుగాదు. కావున సత్పుత్త్రకుండ వగుము. పితృవచనము మనయిద్దఱకు వేదవచనమే యగును. వత్సా, వేఱుమాటాడక యయోధ్యకుఁ బోయి రాజ్యభారమువహించి తండ్రిఋణముఁ దీర్పుము. నేను చతుర్దశవర్ష వివాసవ్రతము సలిపి పితృవాక్య పరిపాలనమొనర్తును. ఇదే మనకుఁ బరమధర్మము. నాయనా, మఱియొకమాట వినుము. ఇదియే నీకు నా గావించు పరమోప దేశమని భావింపుము.

"క. ఎఱుకగలవారిచరితలు
గఱచుచు సజ్జనులగోష్ఠిఁగదలక ధర్మం
బెఱుఁగుచు నెఱిఁగినదానిని
మఱువ కనుష్ఠించునది సమంజసబుద్ధిన్."

"క. ఇచ్చునది ధనము పాత్రున
కచ్చుగ నొరు వేడకుండునది యభిముఖు లై
వచ్చినయాశార్థుల వృథ
పుచ్చకచేయునది సర్వభూతప్రీతిన్."

"క. ఆలీగిన సలుగక యెగ్గులు
పలుకిన మఱి విననియట్లు ప్రతివచనంబుల్
పలుకక బన్నము వడి యెదఁ
దలఁపక యున్నతఁడుచూవె ధర్మజ్ఞుఁడిలన్."

"తే॥గీ॥ పిరుఁదమ్మఁగఁ దగుదురు పిరుఁదమ్మఁగ
దగరు నా కనవలవఁగు తత్త్వబుద్ధి
నెవ్వరిని విశ్వసింపక యెల్లప్రొద్దు
నాత్మరక్షాపరుండగునది విభుండు."

రామ జాబాలి మహర్షుల వివాదము

జాబా:- రామా! మహాప్రతిభాశాలివి నీవు మూఢబుద్ధిఁ బొరయ నగునా? నీ మాటలకు నీ చేతలకుఁ బొందు గాన్పింపదు. ఎట్లందువా? పథికులకు విశ్రమస్థానములట్లు జీవులకు మాతాపిత లగుదురు; అనఁగా వారి సంబంధములు సహవాసమాత్రములగునే

గాని యంతకు మించినవి గావు. అట్టి యల్పకాలిక సంబంధము లందు బుద్ధిమంతులు తగిలియుండరు. ఈ యర్థమును నీవే నెక్కసారులు చెప్పితివి. అదే వాక్కున 'తండ్రియాజ్ఞ తండ్రి యాజ్ఞ' యని కలువరింతువేల? వానియాజ్ఞ వానితోన సమసి పోయెఁగదా. ఈ వెట్టితలంపులు మఱచి యేక వేణీధరవై నిన్ను నిరీక్షించుచున్న యయోధ్యకువచ్చి పట్టాభిషిక్తుఁడవై సద్యఃఫల మనుభవింపుము. సుఖదుఃఖంబులేగాక జనన మరణములు సయితము కర్మఫలములంటివి. స్త్రీపురుషసంయోగములేక ప్రాణులు జనించునా? కావున జననమునకుఁ గర్మము కారణము కాఁజాలదు. సుఖదుఃఖాదులందువా? అవి వారివారి చేతిలోనున్నవి. పుట్టియుఁ బుట్టినప్రాణి గిట్టక యట్లేయుండదు. ఈ కీలకముఁ దెలిసినవారు యథేచ్ఛాభోగంబుల ననుభవించి కాలగతిఁ జెందుచుందురు. భ్రాంతాత్ములు పలుపోకలుపోయి తుదకు నైహిక సుఖమునకుఁగూడ దూరులై కష్టపడి నశింతురు. రామా! ధర్మము ధర్మమని నోక్కి పలుకుదువు. ధర్మమనఁగా నేమి? వలచి యింటికివచ్చినసిరికి మోకాలొడ్డి యిహసుఖంబుల నిరసించి కాననాంతరము లాశ్రయించి నిరశనవ్రతులై జీవు నల్లాడించుచుఁ దుదకుఁ జివికి చచ్చుటా? ఇట్టివారు జీవితమును వ్యర్థపుచ్చుటయేగాక లేనిసుఖములను మూటగట్టుకొను చున్నారుగదా. రామా! ఇట్టిది ధర్మమెన్నఁడును గానేరదు. ఏది నైజమో దానిననుసరించుట ధర్మమగును. తుష్ణీపాసాభోగం బులు ప్రాణులకెల్ల నైజములు. వానిని భాటించిన ధర్మ మగును. స్పష్టార్థమునకు విపరీతవ్యాఖ్యానములు రచించి దుఃఖములపాలు గావలదు. రామా! పితృదేవతలకుఁ బిండ దానార్థము సంతానమంటివి. ఇంతకన్న వెట్టితనము గలదా? పంచభూతసమ్మేళసంబున శరీరప్రాణంబులు వొడముచున్నవి. ఆ భూతములు విడివడునాఁడు శరీరప్రాణములు రూపు మాయు చున్నవి. ఇఁక బితృదేవత లెందుండి వత్తురు? ఎట్లో వత్తురు పో గయాక్షేత్రమునఁ బిండదాన మొనర్చినచో నెచ్చటనో కనవినరానిచోట నున్న పితరులకు నయ్యది చేరుఁజుట్లు? వారి పొట్ట నిండుఁజుట్లు? ఇచ్చట నేను బిండమొకటివైచిన నయోధ్య నున్న మనవారి క్షుధాగ్ని చల్లారునా? శ్రాద్ధాన్నములఁట;

పరలోకగతులకు దాదిబత్తెములఁట. ఈ కట్టుకతలతో లోకము మోసపోవుచున్నది. యజ్ఞములఁట, దానములఁట యాగదీక్షలఁట, త్యాగములఁట; అహో! ధర్మోపదేశమున నెంత లుపదేశించుచున్నారు! మేధావులు పన్నిన పరద్రవ్యాకర్షణ జాలములఁ జిక్కి లోకమెంత తాఁబూమాఁబగుచున్నది! ఈ పగఁటిదొంగల నెంతశిక్షింపరాదు? పరలోకము మిథ్యామాత్రము. మనమున్నదే లోకము. ఇందే సన్నస్తసుఖములనుభవింపనగును. ప్రత్యక్షమును మాని మిథ్యామాత్రమైన పరోక్షమునకుఁ బ్రాకులాడవలదు. ధర్మోపదేశంబున నైసర్గిక ములకు నెడసి దుఃఖములపాలు గావలదు. జీవితమును వృథ సేయ వలదు. సద్యఃఫలమగు రాజ్య భోగములను యథామతి ననుభవించి తనువు దొఱఁగుము. ఇంతకన్న వేఱుధర్మము గలుగదు.

రామ:– మునీంద్రా, నన్ను మరలించునిమిత్తము మీరిట్లు నుడువుదురే గాని యది మీ నుతము కానేరదు. అయినను మీరుగావించిన యాక్షేపణములు వైదికమత మూలక్రిములైయున్నవి. వానికి సమాధానములు చెప్పి సిద్ధాంతములు గావింపనిచో నయ్యది లోకమెల్లఁ బ్రాఁకి కడలేని ముప్పు తెచ్చును. తన్నిమిత్తము నాకుఁ దోచినట్లు నచింతును.

శారీరకసంబంధములు శాశ్వతికంబులు గాననుట సిద్ధము. అట్టి వానికిఁగాఁ బ్రాకులాడుట తగదనుటయు నిజమే. అయిన నిందు విశేష మొకటి గలదు. తల్లిదండ్రులవలన శరీరము గలుగుచున్నది. ఆ కారణంబున శరీరము తల్లిదండ్రుల సొమ్మగును. ఆ సొమ్ము పుత్త్రుల వశమైయున్నంతకాలము వారు జనకజనకులకు ఋణగ్రస్తులై యుందురు. దీనినే పితృఋణమందురు. ఋణగ్ర స్తస్మరణ మెవ్వరుఁ గోరరు. ఆ ఋణ విముక్తికిగా సుతులు వారి తల్లిదండ్రులకు సర్వవిధసేవలు చేయుదురు. నా తండ్రివలన నేను బడసిన సొమ్మును మరల దానుగోరెను. దానిని సంతోషపూర్వకముగా వానికిచ్చి పితృఋణమునుండి విముక్తుడనైతిని. ఇందు విపరీతముగాని దోషముగాని లేదు. 'జనతోవాక్యకరణాత్' అను పెద్దలవాక్యమును మఱచితిరా?

తండ్రియాజ్ఞను బరిహసించితివి. అజ్ఞయే వలదందువో చచ్చిన వాని యాజ్ఞవలదందువో యూహింపరాదు. లోకమెల్ల నాజ్ఞాబద్ధమై

యున్నది. అట్లుకానినాఁడు జగత్తు విశృంఖలమై నశించును. కావున నాజ్ఞయే వలసినమాటను మీఱుగూడ నిరసింపక తప్పదు. చచ్చినవాని యాజ్ఞ చేయుటేల యందురా? వ్యక్తికి మరణము గలదుగాని వాని యాజ్ఞకు మరణములేదు. ఎంతకాలం బాయాజ్ఞ పరిపాలింపఁబడునో యంతకాలమది జీవించియుండును. వ్యక్తిసముఁబునఁ దదాజ్ఞను నాటించుటయుఁ దత్పరోక్షంబున దానిని నిరసించుటయుఁ గుత్సితవర్తన మగునే గాని ఋజుమార్గము కానేరదు. బుద్ధిమంతు లట్టి కపట వర్తనంబును మన్నింపరు. మతియు మీరన్నట్లు చేయుట యగునేని రేపు మీ మాటకుఁగూడ నదేగతి కలుగదా? ఇఁక మాటకు నిలుకడ యెక్కడ? ఆజ్ఞారూపములైన వేదశాస్త్రములకెల్ల దుర్గతికలుగదా? లోకమునకే వ్యవస్థ తప్పునుగదా? ఇట్టిది మీఱుమాత్రము సమ్మతింతురా? కావునఁ బిత్రాజ్ఞను నేను బరిపాలించుట ధర్మమగునే గాని యధర్మము కానేరదు.

చార్వాకమత ఖండనము

జననాదికము స్త్రీపురుషసంయోగ ఫలమంటిరి. అట్లగునేని వంధ్యాత్వమునకే యనకాశ ముండగూడదు. ఈ వంధ్యాత్వము మనుష్యవర్గమందే గాక తిర్యగ్జడంబులయందు సహితము గానవచ్చుచున్నది. దీనికేమందురు? అదియట్లుండనిమ్ము. సృష్టియెల్ల స్త్రీపుంస సంయోగోద్భవమనుట చార్వాకమతమగును. ఇచ్చట సృష్టియను పదము చేతనాత్మక సృష్టికి నన్వయింతురా? జడాత్మక సృష్టికి నన్వయింతురా? ద్వితీయపక్షమేని యది యంగీకృతమగును. ఏల యందురా? శరీరము జడము. దాని ప్రాప్తికి స్త్రీపురుషసంయోగము కారణమగుచున్నది. అందువలన మీ యీ వాద మంగీకృతమగును. అంతియగాని శరీరాంతర జీవాత్మకుఁగూడ స్త్రీపురుషసంయోగమే కారణము కాఁజాలదు.

స్వభావవాద ఖండనము

సృష్టియెల్ల స్వాభావికమే యగుననెడి స్వభావవాదము నాశ్రయింతురా? ఈ స్వభావమునే ప్రకృతి యందురు. ఈ ప్రకృతి జడమా? చేతనమా? జడమందురేని యందుఁ జైతన్య ముండనేరదు. సృష్టి యన్నచో చైతన్యాత్మకమైయున్నది. దీనికేమందురు? చైతన్యాత్మకమే

యని యందురేని మీకును వైదికమతమునకు సమరసము గలుగును. మీ ప్రకృతియే వారి యాత్మయగును. ఆ యాత్మవలన సృష్టికలుగు చున్నదని యిరువురు నంగీకరించుటగును.

పరమాణువాద ఖండనము

అవయవసంయోగంబున శరీరంబు లేర్పడుచున్నవని యందురా? దాని నంగీకరింతుము. కాని యీ సంయోగము అవయవములకు ఐచ్ఛికమా? పరప్రేరితమా? ఐచ్ఛికమేయందురేని యిచ్ఛాశక్తి చేతనం బులకు మాత్రమే యుండును గావున అవయవములు గూడఁ జేతన ములే యనవలయును. అవయవములు కేవల జడములని మున్నే నిరూ పించితిమి. కావున మీరు చెప్పినట్టి సంయోగము ఐచ్ఛికము కానేరదు. పరప్రేరితమే యందురా? అది యంగీకృతమే. ఆ పరమునే యాత్మ యందురు.

సృష్టి తత్త్వము

సృష్టి ప్రస్తావితమయ్యెను గావున దాని సంగతి వినుము. అభా వమునుండి భావము జనింపదు. ఇది ప్రథమ సూత్రము. కారణము లేకయే కార్యముగలుగదు. ఇది రెండవ సూత్రము. సృష్టి భావము. ఈ భావము అభావమునుండి గలుగదుగావున భావమునుండియే యీ భావము జనింప వలయును. మఱియు సృష్టి కార్యమగును. ఈ కార్య మునకుఁ గారణ ముండవలయును. ఆ కారణమే సృష్ట్యాదిభావమగును. దానినే పరమాత్మయందురు.

పరమాత్మ

ఈ పరమాత్మకు మఱియొక కారణము గలుగదు. ఎల్లకారణ ములకు నది మొదటి కారణమై యున్నది. మఱియు నప్పరమాత్మ నిర్గుణనిరంజన కేవలచిద్రూపమున నుండును. దానికి జననాది షడ్వి కారములులేవు. అది యవ్యయము శాశ్వతమునై యుండును.

కారణ తత్త్వ విచారము

కారణములేనిదే కార్యము కలుగదని చెప్పఁబడెను. ఈ కార ణము ఉపాదానకారణమని నిమిత్తకారణమని రెండు విధములు. ఘటమునకు మన్ను ఉపాదానకారణమగును; కుమ్మరి నిమిత్తకారణ

మగును. సువర్ణాభరణమునకు సువర్ణము ఉపాదానకారణము ; స్వర్ణకారకుఁడు నిమిత్తకారణము. అట్లే యీ సృష్టికి ఉపాదానకారణమేది? నిమిత్తకారణమేది? అని యడుగవచ్చును.

ఘటమేర్పడుటకు మృత్తికయనుపదార్థమొకటి ఘటనిర్మాణపూర్వమే యుండును. అట్లే సృష్టి యేర్పడుటకుముందేది యుండెను? పరమాత్మతప్ప నన్యమేదియు లేదని మున్నే చెప్పితిని. కావునఁ బరమాత్మయే ఘటమునకు మృత్తికవలె సృష్టికి నుపాదానకారణము కావలయును. మరియొక పదార్థ మున్నదని చెప్పుదుమేని పరమాత్మ అద్వితీయము అను వచనంబునకు భంగమగును. పరమాత్మ అద్వితీయము గావునను పరమాత్మకన్న భిన్నమైన పదార్థము సృష్టికిఁ బూర్వ ముండుటకే యవకాశములేదు గావునను సృష్టికిఁ బరమాత్మయే ఉపాదానకారణమని యంగీకరింపక తప్పదు.

ఘటమునకుఁ గుమ్మరి నిమిత్తకారణమంటిని. అనఁగాఁ గుమ్మరి యనువాఁడొకఁడు మృత్తికతో ఘటమును నిర్మించుచున్నాఁడని దీని భావము. అట్లే సృష్టికి నిమిత్తకారణమేది? పరమాత్మకన్న నన్యము లేదని చెప్పితిని. ఆ పరమాత్మ సృష్టికి నుపాదానకారణమంటిని. నిమిత్తకారణముండనిదే సృష్టికార్యమేర్పడదయ్యెను. నిమిత్తకారణముగా గ్రహించుటకు మఱియొండేదియుఁ గలుగదయ్యెను. కావునఁ బరమాత్మయే నిమిత్తకారణముగూడఁ గాకతప్పదు. దానంజేసి సృష్టికిఁ బరమాత్మయే ఉపాదాన కారణమును నిమిత్తకారణమును రెండు నగుచున్నది.

సృష్టి సంకల్ప విచారము

ఏదేనొకయుద్దేశ్యముతో నెట్టి పనిఁగాని చేయుదురు. ఉద్దేశ్యరహితముగా నేపనియుఁ గాదు. ఈయుద్దేశ్యమునే వేదాంతపరిభాషయందు సంకల్పమని చెప్పుదురు. పైనఁ జెప్పిన ప్రకారము సృష్టికిఁ బరమాత్మయే ఉపాదాన నిమిత్తకారణములు రెండునై యున్నదని యంగీకరించినను ఆ పరమాత్మ యేసంకల్పముతో సృష్టిగావించెను? ఎప్పుడాసంకల్పము పుట్టెను? ఏల పుట్టెను? అను ప్రశ్నలు వొడమును. ఏదోయొక సంకల్పము పరమాత్మకుఁ గలదని యంగీకరింపక తీరదు. అట్లు కానినాఁడు సంకల్పరహితకార్య మేర్పడును. అట్లనుట మూల సూత్రమును నిరసించుటగును. సంకల్పము కలదుగాని అది యిట్టి

సంకల్పమని వచించుటకు సాధ్యముగాదు. దానంజేసి యది యనిర్వచనీయమనిరి. ఎప్పుడాసంకల్పము పుట్టెననుటకు ఎప్పుడో యొకప్పుడు సృష్టికిఁబూర్వమే సంకల్పము జనించి యుండవలయుననుగాని యా కాలమును నిర్ణయింపరాదు గావున దానిని అనాదియనిరి. ఏలసంకల్పము కలిగెననుటకుఁ గూడ నిదమిత్థమని నిర్వచింపరాకున్నది. అందువలన లీలామాత్రమనిరి. అనఁగాఁ బైమూఁడు ప్రశ్నలకు జవాబుచెప్పుటకు యుక్తిచాలదు. యుక్తిసాగినంతవరకు నూహించిరి. యుక్తియెల్ల నింద్రియ కార్యము గావునను ఇంద్రియములన్నచో పరిచ్ఛిన్నములు గావునను వానికి నందని విషయము అతీంద్రియమనిరి. అట్టివానిని నిశ్చయించుటెట్లన్నచో అవి కేవలబుద్ధిగ్రాహ్యము. ఆ బుద్ధియు సమాధ్యవస్థనున్నప్పుడే యిట్టి యతీంద్రియవిషయంబులు స్ఫురించును. ఆ స్ఫురణము మనస్సునకు నందినంత గ్రహించి వాక్కునకు సాధ్యమైనంత నచించిరి. ఈ యాప్తవాక్యమును విశ్వసించి వర్తింపనగును.

కర్మతత్త్వము

కర్మములను నిందించితిరి. కర్మము నిసర్గమనియు నైమిత్తిక మనియు రెండువిధములు. సృష్టితోడఁబుట్టినకర్మము అనగా సంకల్పరూప కర్మము నిసర్గ కర్మమగును. ఏదేనొకనిమిత్తము గలిగినప్పుడు చేయు కర్మము నైమిత్తికకర్మ మగును. ద్వివిధమైన యీ కర్మమునకు సంకల్పము బీజమగును. పరమాత్మయొక్క సంకల్పకాలము అనిర్దేశ్యము గావున అది యనాదియనిరి. దానంజేసి తత్సంకల్పముతోఁగూడ జనించిన నిసర్గకర్మమును అనాదియేయగుచున్నది. ఈ నిసర్గకర్మ మొకసారి యంకురించినతర్వాత యదో నిలునదు; ప్రవాహసరణిఁ బఱచుచుండును. దీని నాపుటకుఁ గూడ సాధ్యముగాదు. మఱియొక విశేషము. ఈ నిసర్గకర్మము అనాదియగుటయేగాక అనంతమునైయున్నది. ఎట్లందురా? సృష్టికి మూర్ఖట్లున్నను సర్వస్వరూపనాశన మెన్నటికినిలేదు. సృష్టియున్నంతకాలము నిసర్గకర్మముండును. ఆ కారణమున నయ్యది యనంతమగును. అనాదియు ననంతమునైన యీ నిసర్గకర్మమును మీరు నిరసింపజాలరు. ఆ కర్మము మీయందును నాయందును జరాచరరూపసర్వప్రపంచంబునందును బ్రతిక్షణము జరుగుచునేయున్నది. కావున నది స్వానుభవసిద్ధము.

ఇఁక నైమిత్తిక కర్మములన్నో నిమిత్తము గల్గినప్పుడే యవి చేయఁబడును. పితృకార్యాదు లీరాశిలోఁ జేరును. ఈ కర్మముల

ఫలమేమందురా? జీవుఁడు శరీరవియోగానంతరము కర్మానుభవము నకుఁగా లోకాంతరములు చెందియుండును. పితృకర్మములవలన ఆ జీవునకు శాంతికలుగునని తత్త్వజ్ఞులు వచించిరి. వాదిమాట కాదని నిరూపింపఁజాలము. తత్త్వము నట్టియుక్తికిఁ జిక్కదు. అతీంద్రియమైన యా విషయమును గూర్చి కేవల నిర్వికల్ప సమాధ్యవస్థయందుఁ బరీక్షించి నిశ్చయించిరి. మీరు నట్లే పరీక్షించి కాదందురా? అందాఁక మీ మాటను గ్రహించుటెట్లు?

శ్రాద్ధవిధి

శ్రాద్ధవిధి నుల్లసించితిరి. శ్రాద్ధమునకు శ్రద్ధాపూర్వక సంకల్పము జీవము. సంకల్పము దేశకాలానవచ్ఛిన్నము. అది క్షణములో ముల్లోకములుఁ జుట్టివచ్చును. మహర్షులసంకల్పంబులు దేశదేశాంతరములందుఁ గార్యక్షమములగుట వినమా? తపోనిధికి మీకుమాత్ర మిది తెలియదా? కావున సుతుల శ్రద్ధాపూర్వకములైన సంకల్పములు లోకాంతరగతులైనవారి పితలయెడ నేల వ్యాప్తిగాంచరాదు? అట్లు పరిణతిఁగాంచుట యనుభవసిద్ధమే గావున నట్టికర్మములను జేయుట పరమధర్మమగును. యజ్ఞయాగాదిక్రతువులు గూడ నీ వర్గములోనే చేరును. ఏదో యొక రూపమైన యర్థమును గోరి యిట్టిక్రతువులొనర్తురు. సంకల్పమెన్నఁడును వ్యర్థముగాదు గావున నిట్టి క్రతుకర్తలీప్సితార్థములను దప్పక పడయుదురు. ఫలము మాత్రము తప్పదు. అది యాత్మార్థమైనఁ గావచ్చును. ఆత్మార్థము చేయరాదందురా? అది మాకును సమ్మతమే? ఇట్టివాని వలననగు సుఖము తుచ్ఛమందురా? ఆ మాట సర్వజనాంగీకృతము. ఆ కారణముననే తుచ్ఛానందములవంక జనక శాశ్వతానందమును బడయుమని మన శాస్త్రము లుద్ఘోషించుచున్నవి.

నైసర్గికస్థితి

ఈ నిత్యానందమును బడయుట యెట్లందురా? మన యంతఃకరణము తన నైసర్గికస్థితి నెప్పుడు పడయునో యప్పుడు నిత్యానందము గలుగును. నైసర్గికస్థితియనగా నేమియందురా? సృష్టియెల్ల సత్త్వ రజస్తమో గుణాత్మకమైయుండును. ఈ మూఁడుగుణములు ముప్పిరిఁ బెనచిన త్రాఁడుగా నుండును. ఈ మూటింటిలో సత్త్వము నైసర్గికము. ఏలయందురా? సృష్టిలో నావరణాచ్ఛాదితమైయున్న జీవాత్మ యా పరమాత్మయే గాని వేఱుగాదు. పరమాత్మకును జీవాత్మకును ఆవరణ

కారణంబున మహాకాశ ఘటాకాశ తారతమ్యము గలుగుచున్నది. అంతియగాని యవి వేఱుగావు. పరమాత్మ యన్ననో కేవలసత్యాత్మక నిత్యానందస్వరూపి. జీవాత్మయు వాస్తవముగా నట్టివాఁడే. అయినను ఆవరణభేదమునుబట్టి వేఱుగా భావింపఁబడుచుండును. ఇట్టి విపరీత భావమునకుఁ గారణములైన రజస్తమో రూపావరణంబులు తొలఁగి కేవల సత్త్వావరణము గలిగెనేని జీవాత్మయు నిత్యానందస్వరూపియై విలసిల్లును. ఇదియే నైసర్గిక స్థితి.

యోగములు

ఈ స్థితి కలుగుట యెట్లందురా? అందులకే యీ కర్మకలాప మెల్ల నేర్పడెను. ఈ కర్మములనే యోగములందురు. ఈ యోగము లెల్ల నంతఃకరణావరణశుద్ధి పర్యంతములు. అనంతరము వానివలన ఫలములేదు. ఆవరణతత్త్వ తారతమ్యమునుబట్టి యోగములను నిర్ణయించిరి. గృహస్థులగు వారు రజస్తమోమయావరణకలితులై సంకల్పపరంపరలతో నిండియుందురు. కావున వారికి యోగ్యముగాఁ గర్మయోగమును జెప్పిరి. ఈ కర్మయోగము సకామముగాఁ బ్రారంభమై క్రమక్రమముగా వైరాగ్యావస్థను జెంది తుట్టతుదకు నిష్కామకర్మయోగముగాఁ బరిణమించి స్వరూపజ్ఞానోత్పత్తినిఁ గలిగించును. ఆవిధముగా నది యంతఃకరణశుద్ధి నొనర్చును. భక్తి యోగముగూడఁ గర్మయోగాంతర్భూతమే గాని యొండుగాదు. ఈ కర్మయోగమునే యభ్యాసయోగమనియు వచింతురు. స్వతస్సత్త్వావరణావృతులకు శుద్ధికలాప మవసరముకాదు. వారికి స్వరూపానుభవము మాత్రమే యవసరము. ఈ యనుభవమునే విజ్ఞానమందురు. వారికిఁగా జ్ఞానయోగమును నిర్ణయించిరి.

మనుష్యుని విశేషధర్మము

తుత్పిపాసాభోగములు నైసర్గిక ధర్మములనియు వానిని సేవించుటయే పరమధర్మమనియు వచించితిరి. ఈ మాఁటను సర్వప్రాణి సామాన్యధర్మము లగుట నిర్వివాదాంశము. ఇతర ప్రాణివర్గమునకన్న మనుష్యునియందు జ్ఞానమనెడి విశేషలక్షణము గలదు. అందువలన మనుష్యులను దదితర ప్రాణివర్గమునుండి వేఱుచేసి యధికులుగా గణించి వారికి విశేషధర్మములను జెప్పిరి. ఈ జ్ఞానము నిత్యానిత్యవస్తు వివేకమునకుఁ దోడ్పడును. ఆ వివేకమువలన అనిత్యములను నిరసించి

నిత్యమును సాధింపనగును. ఇదియే మనుష్యుల విశేషధర్మము. నిత్యమును సాధించుటవలన నేమి యగునందురా? అవ్యయానందము గలుగును. మీరు చెప్పిన నైసర్గిక ధర్మత్రయము ననుష్ఠించుట నలనఁ గూడ నట్టి యానందమే వచ్చునుగదా యనవచ్చును. అంచనలనఁ గలుగు నట్టి యానందము కేవల మింద్రియానంద మగును. మఱియు నది క్షణికమే కాని శాశ్వతముఁ గాదు. ఉభయ తత్త్వములకు నానందానుభవమే పరమావధి యైనప్పుడు క్షణికమును దుచ్ఛమునైన దానితోఁ దనివిచెందుటకన్న నిత్యమును బరమము నైన దానిని సాధించుట యెప్పుఁగదా.

సద్యఃఫలమైన రాజ్యభోగాదులను త్యజించి కాలాంతరములును సంశయాత్మకములు నైన వానికిఁ బ్రాకులాడనేల యనిరి. రాజ్య భోగాదులు సద్యఃఫలములే యగుఁగాక. అవి సకాములకు రుచించునే గాని నిష్కాములకు రుచింపవు. సర్వము సన్యసించియున్న మీకిప్పుడు గృహస్థాశ్రమము రుచించునా? రుచింపని దానియందు మిమ్ము బలవంతపెట్టిన ఫలమేమి?

మహాత్మా!

"చ॥ ధృతిఁగొని భోగముల్ జరయుదేహమునొంపకముండె, నింద్రియ
ప్రతిహతిలేకముండె, తనప్రాణవిరామముకాకముండె, పం
డితజనుఁడాచరింపదగు దీవ్రబయత్నము మున్కికిన్, మహో
ద్ధతశిఖినిల్లు గాలుతఱిదాలిమి నూతులు త్రవ్వ టొప్పునే?"

యుక్తివాదఫలము

అని పెద్దలు వచించిరి. ఆ వచనంబులమోఘంబులు. ఆ వాక్యంబులను మన్నింపక శాస్త్రదూషిత బద్ధులై యెండమావుల వెనువెంటఁ బఱచువారు దివాంధులై యెట్టకేనికి ముప్పుఁబొరయుక మానరు. ధర్మములు సూక్ష్మాతిసూక్ష్మంబులు. అవి వ్యవసాయాత్మ్మలకు గోచరించునే గాని యవ్యవసాయాత్మ్మలకు గోచరింపవు. కేవల యుక్తివాదమును నమ్మిన ఫలములేదు. అట్టివారి గతి అంధఃపరంపరా గతి యగును.

సత్యమే ధర్మము

సత్యమే ధర్మము. ధర్మమే సత్యము. ఎవరెన్ని బోధించినను నేను ధర్మమును విడువఁ జాలను. ఇది నా పరమనిశ్చయము. అశాస్త్రీయం

బులును ధర్మవిరుద్ధంబులు నైన వచనంబులు మీరాడినను నా తండ్రికిఁ బరమాశ్రితు లగుటం జేసి మీ సమక్షంబున నిలిచి యింతగా వచించితిని. అన్యాపదేశంబులు ననుబోంట్లను గలంపనేరవు. అట్టివి వచించుట భవాదృశులకును యోగ్యము గాదు.

రాముఁ డీయుపసంహారోక్తులను గోపకలుషిత తీవ్రస్వరంబునఁ బలికెను.

జాబాలి:– రామా! కోపింపవలదు; నా మతము నాస్తికముగాదు; ధర్మసంకటకాలము ప్రాపించెను; ఏవగనైన నయోధ్యకు నిన్ను మఱలింప నట్లాడితిని. నీ ముఖమున వెలువడిన యీ తత్త్వసారము సుప్రతిష్ఠితమై యీచంద్రార్కము లోకము నుద్ధరించుఁ గాక; కుమతులును విమతులును సుమతులై మేలుపడయుదురు గాక.

రామవసిష్ఠుల సంవాదము

వసిష్ఠుఁడు:– (రామునివచనంబు లాకర్ణించి,

చ॥ కులమత్యజించినక జనులు గోలయొనర్చినఁ దల్లిదండ్రులుక
వలదనిపల్కినక సిరులువమ్మయినక సతి యడ్డగించినక
విలయమువచ్చినక బుడమి ప్రీలిన మిన్నులుమీఁదవ్రాలినక
దలఁగరుసిద్ధపూరుషులు ధర్మవినిశ్చిత మార్గమింతయుక

అని లోలోనఁ దలంచి జాబాలిమాట సందుకొని) వత్సా! జాబాలి నన్యునిగాభావింపకుము. తత్త్వవిషయికమైన నీ వచనామృతమును జెవులారగ్రోలి పరమసంతుష్టుఁడ నైతిని. సత్యమే ధర్మము, ధర్మమే సత్యమంటివి. ఇది యుక్తాయుక్తముల యథార్థము. ప్రకృతము నీ ధర్మమేమో విచారింపుము. రాజ్యము జ్యేష్ఠక్రమానుగతము; ఇది మీ కులధర్మమేగాదు రాజధర్మమునై యున్నది. ఆ ధర్మంబును నీవుద్ధరింపవలదా? వత్సా! జనకకారణంబున దల్లిదండ్రులట్లు జ్ఞాన ప్రదాన కారణంబున నాచార్యుఁడును గురువగును. గురువచనము చేయుట ధర్మము. ఈ యంశమును నీవే తెల్పితివి. నేనో మీకుఁ గులగురువును గాని నేటివాఁడనుగాదు. నా మాట పాటింపవా? నా సంగతి యిటుండనిమ్ము. ఇందువచ్చిన వేదమార్తులను జూడుము. ఈ బ్రాహ్మణులెల్ల నీవారేగదా. వీరి మాటయేని వినవలదా? ఇదిగో

నీ తల్లి; వార్థక్యమునకుఁ దోడుగా నీమెకు వైధవ్యమును సంప్రాప్తమయ్యెను. ఇప్పుడామెను శుశ్రూషింపకున్న నెప్పుడు శుశ్రూషింతువు?

'ఉపాధ్యాయాన్దశాచార్యఃఆచార్యాణాంశతాపితా,
సహస్రంతుపితౄన్మాతా గౌరవేణాతిరిచ్యతే'' అనిరి.

మాతృఋణవిముక్తికి నింతకన్న మేలుతరుణము గలుగునా? ఆమె మతము నొప్పరికింతువా? రాఘవులు యాచకజనాభీష్టదాన దీక్షాబద్ధులని లోకమెల్లఁ బ్రశంసించును. భరతుఁడు కేలొడ్డి యాచించుచున్నాఁడు. వానిని వ్యర్థపుత్తువా?' యనెను.

రామఃఁ- (వసిష్ఠునకుఁ గేలొగ్గి) గురువర్యా! నా వచించినదంతయు మీ యుపదేశసారాంశమేగాని వేఱుగాదు. గురుజనుల మతమును జేయవా యనిరి. వారియాజ్ఞ శిరమునఁ దాల్తును. ఆర్యా! విన్నపము; శరీరము తలిదండ్రుల సొమ్ము. నా తండ్రి నా తనువును మున్నుగాఁ గోరెను. దానిని వానికిఁ బ్రతిజ్ఞాపూర్వకముగా నిచ్చితిని. ఆయన దానికి ననవాసము విధించెను. అది యిప్పుడు తలఁగుటెట్లు? తండ్రికి నర్పితమైన తనువును దల్లి యిప్పుడు గోరిన నే నేమిసేయనోర్తు? ఆ మాట మఱచిపొమ్మని యామె యడుగులకుఁ దలతో మ్రొక్కి వేఁడుచున్నాను. మఱే యేదిచెప్పినను దప్పక యామెమాట నొనర్తును. గురువర్యా, ఇందు నా యొనర్చిన ధర్మవ్యతిక్రమమున్న నెలపీయ వేఁడుదు.

భరతుఁడు నిరశనవ్రతమున కుపక్రమించుట

భరతుఁ డామాటవిని నిరాశఁ జెంది, 'సుమంత్రా! నాకుఁ గూడ నిండే కుశాస్తరంబును సిద్ధపఱుపుము. ఇచ్చిన ఋణమును మఱల నిచ్చునందాఁక బ్రాహ్మణుఁడు ఋణగృహీతవాకిటఁ బరుండునట్లు నేను నా యన్న ప్రసన్నుఁ డగునందాఁక యీ పర్ణశాలవాకిట నిరశనవ్రతమూని పరుండుదును. అన్నయాజ్ఞ వలయునందువా! అట్లయిన నేనే దర్భలు పఱచికొందు'నని యట్లొనర్చెను. రాముఁడంతఁ దమ్మునిఁ జేరఁబని వానిని లేవఁదీసి, 'నాయనా! మోడి సేయకుము. ఇది బ్రాహ్మణునకుఁ దగుఁగాని క్షత్త్రియునకుఁ గూడదు. ఏమి యపకారమును నేను నీకొనర్చితినని నీ విట్లు వాకిటకు నడ్డముగాఁ బరుండుదువు? భరతా! ఈ దారుణవ్రతముమాని యయోధ్యకుఁజను' మని వివిధంబుల బుజ్జగించెను. భరతుఁడు రాముని పాదములఁబట్టి, 'అన్నా! నా మొఱ

వినకున్న నగుఁగాక; ఈ పౌరుల విజ్ఞాపనమేని మనస్కరింపవా?' యని దీనస్వరంబునఁ బ్రార్థించెను. రాముఁడు కడుంగడు జాలికిఁ జిక్కి, 'తమ్ముఁడా! లెమ్ము; జలంబులతో నన్ను స్పృశింపు' మనెను. భరతుఁడంతట లేచి, 'బ్రాహ్మణోత్తములారా! మంత్రివర్యులారా! పౌరులారా! రాజ్యకాంక్ష నా కెన్నఁడును జనింపలేదు; దానికై నా తండ్రిని గోరలేదు; నా తల్లిని ప్రేరేపింపనులేదు. నా యన్న వివాసము నాకుఁ దెలియదు. ఈ మాట ముమ్మాటికి నమ్ముము. తండ్రియాజ్ఞతప్పరాదేని నా యన్నకు మాఱుగా నేను చతుర్దశవర్ష వనవాసశిక్ష ననుభవింప సంసిద్ధుఁడనై యున్నాను. నా యన్న నా మనవిని మనస్కరించి యయోధ్యా పరిపాలనమునకు నియ్యకొని మమ్మెల్లఁ గృతకృత్యులుగా నొనర్చుఁగాక!' యని పరిస్ఫుటస్వరంబునఁ బలికెను. రాముఁడు వానిని గౌగిటఁ బొదివి, 'వత్సా, వట్టి శంకలు వలదు. తండ్రిసేతకుఁ దాఱుమాఱు గలిగింప మనకు నధికారములేదు. అట్లొనర్చుట ధర్మద్రోహమగును. నాకును దీఱని తలవంపు గలుగును. మనతండ్రియు బాసతప్పినవాఁడగును. భరతా, తండ్రికొఱకును నాకొఱకును ధర్మముకొఱకును నీవు నీ సంకల్పమునుమాని నావచించునట్లొనర్పుము. నీకు భద్రమగు' ననెను.

దేవర్షులు భరతునకు హితముచెప్పుట

రామభరతుల సంవాదంబును వినుచుండిన దేవర్షి సిద్ధచారణాదులు తమలోఁ దాము కలియఁబలికికొని ప్రత్యక్షులై, 'భరతా! నీ సుస్వభావంబున కెంతయు మెచ్చితిమి. నీయందెట్టి దోషమునులేదు. మా మాట నమ్ముదువను విశ్వాసముతోఁ జెప్పుచున్నాము, వినుము. నీతండ్రి కైకేయీఋణముఁదీర్చి స్వర్గమున నున్నాఁడు. వానిమాట కల్లయగునేని వానికి స్వర్గచ్యుతి గలుగును. చక్కఁగా విచారింపు' మనిరి. భరతుఁడు వారివచనంబులు విని నిజయత్నము బీఱుపోవుటకుఁ జింతిల్లుచుఁ గేలు గీలించి, 'అన్నా! జ్ఞాతులును యోధులును మిత్రులును కర్షకాదిప్రకృతివర్గమును వాఱువీ రనేల? చరాచర సమస్త రాజ్యము నిన్నుఁ గోరుచున్నది. రాష్ట్రరంజనము రాజునకుఁ బరమధర్మము. అందులకు నీవే తగుదువుగాని నేను జాలను. రాజధర్మమునకును గులధర్మమునకును నన్ను వేఱుపుఱువుగా నొనర్పవలదు. నాతల్లి కోరిక తీఱవలయునందువా? అట్లయిన నెల్లయర్థములకు సరిపోవు మార్గము ననుజ్ఞయి'మ్మనెను. రాముఁడు వానిని దన యంకమునఁ

గూర్చి, 'నాయనా, నీ సహజజ్ఞానము నేఁడు వేయిరెట్లు వెలుగుచున్నది; మఱియు గురుశిక్షితుఁడవుగాని సామాన్యుఁడవుగావు. భూభార వహనమునకు సంశయింతువేల? మహాప్రజ్ఞావంతులైన మంత్రులుండరా? నీకై ప్రాణములిచ్చు మిత్రులు గలుగరా? ఎందును నీకుఁ గొఱతలేదు. వత్సా, కైకేయీదేవి నెంతమాత్రము చిన్నచూపు చూడవలదు. మాతృసేవకు లోటుగలుగనీయకు' మనెను.

రాముఁడు తన పాదుకలనిచ్చి భరతునిపంపుట

భరతుఁడంత గత్యంతరముదోఁపక సువర్ణపాదుకలు తెచ్చి రాముని క్రమ్మోలనిడి, 'అన్నా! ఈ పాదుకలపయి నీ పాదపద్మము లుంచుము. ఇవే సమస్తలోకమునకు యోగక్షేమములుగూర్చు'ననెను. రాముఁడట్లొనర్చెను. భరతుఁడా పాదుకలకు క్రమ్మిక్కి, 'అన్నా, ఈ నీ పాదుకలకు రాజ్యతంత్రమప్పగించి నేను జటావల్కలధారినై ఫలమూ లాశనవ్రతముతో నీ వచ్చుపర్యంతముఁ జతుర్దశవర్షంబులు నగర బహిర్భాగంబున నివసించుచు నిన్ను నిరీక్షించుచు నుందును. పదునాలు గేండ్లు చన్న తర్వాత నీసందర్శన మహాభాగ్యము నా కనుగ్రహింప వేని నా శరీర మగ్నికి సమర్పితమగు' ననెను. రాముఁడు వాని తల మూర్కొని, 'నాయనా, నీ తల్లి నేమఅవలదు; నాయాన సీతయాన' యనిచెప్పి యతని సాగనంపెను.

పాదుకాపట్టాభిషేకము

భరతుఁడా పాదుకలను మృత్యుంజయమను భద్రగజంబు శిరంబునందుంచి యన్నయాజ్ఞవడసి వసిష్ఠాదిసమేతముగాఁ దరలి చిత్రకూట పార్శ్వమార్గంబున భరద్వాజాశ్రమంబునకు వచ్చి యా మునికి నమస్కరించి వివరమెల్ల వానికి వినిచి తదాశీర్వచనంబు లంది శృంగిబేరపురము చేరి యటఁ గొంతతడవు పుచ్చి యయోధ్యానగరము డాసెను. ఆ పట్టణమతల్లి గ్రహగ్రస్తయై రోహిణివలెఁ జెన్నుదొఱఁగి, దిమిరగ్రసితయైన యామినిరీతిఁ బీడాకరమై, నిదాఘసంతప్తయైన సెలయేఱుక్రియఁ గృశించి, హవిర్ధూపము గప్పిన యధ్వరాగ్నిశిఖఁబోలె నిస్తేజమొంది, విధ్వస్తగజవాజిరథపతాకయైన సేనవడువున నిరుత్సాహ పడి, వాతోద్ధూతయై యెగసి ఘూర్ణిల్లి, కుదిలపడిన వీచికలాగున నిశ్శబ్దముగా నుండెను. భరతుఁ డందులకు మహావ్యసనవ్యగ్రాంత

రంగుఁడై యెట్లో దశరథాంతఃపురము సొచ్చి యందుఁ దల్లుల డించి వారికి నమస్కరించి వసిష్ఠాదులతోడ నందిగ్రామముచేరి ప్రజలఁగూర్చి రామపాదుకలను శిరమునఁ దాల్చి, 'ఈ పాదుకలే రామచరణాం భోజములు. వీనికి స్వేతచ్ఛత్రాదిక సమస్త రాజగౌరవంబులు జరుగుఁ గాక. ఇవి రాజ్యమెల్ల సురక్షితముగాఁ బాలించును. నాయన్న వీనిని నాయొద్ద నిక్షేపించెను. ఆయన వచ్చినంతనే వాని పాదములకు వీనిఁ దొడిగి వాని రాజ్యమును వానికి నప్పగించి కృతకృత్యుఁడనై దూఱు వాయుదు' నని శపథపూర్వకముగా విన్నవించుచున్నాను. నా శపథంబును మీరెల్లరు మనస్కరించి యథావిధి వర్తింపనగు'నని పలికి యా పాదుకలకుఁ బట్టాభిషేకమొనర్చి వానికి సమస్త రాజమర్యాదలను జరుపుచు నతఁడందు నివసించుచుండెను.

ఋషులు చిత్రకూటమును బాసి చనుట

చిత్రకూటముఁబాసి భరతుఁడు చన్నంతట నందలి ఋషులు కలియఁబలికికొని యాశ్రమాంతరములకుఁ జన సమకట్టిరి. వారితలంపును రాముఁడు గ్రహించి కులపతినిడాసి, 'స్వామీ, ఋషుల వదనమండలము లందు వై పరీత్యములు దోఁచుచున్నవి. మావలన నపరాధమేదేనిఁ గలిగెనా? గురుశుశ్రూషలందు సీత పరాకుచెందదుగదా' అని విసయ వినమ్రుఁడై యడిగెను. అనవుఁడు, 'పరమకళ్యాణి సీతాదేవి ధర్మ వ్యతిక్రమ మొనర్చునా? నీవలన నపరాధముండునా? సౌమిత్రి తలంపులోనేని యకార్యసంకల్పము జనించునా? ఇట్టి శంకలు వలదు. రావణానుజుఁడు ఖరుఁడను రాక్షసుఁడు గలఁడు. వాఁడు మహా గర్వోద్ధతుఁడై జనస్థాన నివాసులైన మునులను బాధఁదోలెను. అతఁడంతతోఁ దనియఁడు. నీవించున్న కారణంబున మమ్ములనుగూడఁ గాటించుచున్నాఁడు. నీవీ యాశ్రమంబునఁ బాదమూనినది మొదలు రక్కసులవలన మేము పడయు నిడుమ లిన్నియనరావు. ఆ ఖలులు భీభత్సరూపంబులు దాల్చి మమ్ము వెఱపింతురు. మా హోమద్రవ్యం బులను హరింతురు; అగ్నిహోత్రములఁ జల్లార్చుదురు; మాపయి నపరిశుద్ధవస్తువులఁ జిమ్ముదురు; హఠాత్తుగాఁబట్టి వధింతురు. ఆ కూళల దుండగము దుస్సహముగా నున్నది. ఆ కారణంబున నిచ్చోటువాసి తొల్లిటి మా యాశ్రమంబులకుఁ జన నుద్యుక్తులమైతిమి. అవి యిటకు దవ్వుగావున మాకు నచ్చట నిట్టి బాధలు గలుగనేరవు. మీరు నిచ్చగింతురేని మావెంట రానగు'నని యక్కులపతి చెప్పెను.

రాముఁడు చిత్రకూటమును వదలి యత్రియాశ్రమము చేరుట

రాముఁడావచనంబులకు మహోన్ముఁడై వారి పయనమును మాన్ప నెంతో ప్రయత్నించెను గాని ఋషులు వారి నిశ్చయంబును మఱలింపరైరి. ధాశరథి యంతటఁ దనయుద్యమమును విరమించి యా ఋషులను సాగనంపి పర్ణశాలకు వచ్చి నిజాంతరంగంబునఁ జంచలాచంచలంబులుగాఁ బొడసూపి యంతరించుచున్న భావపరంపరలకుఁ గొందల పడసాగెను. తల్లులును బొరులును మరల వత్తురో యను శంక యొక ప్రక్క వాని నాశ్రమాంతరమునకుఁ ద్వరఁ బెట్టెను. ఆ తలంపునకు నాశ్రమ సహవాసప్రేమ యొకవంక యాకవెట్టఁజొచ్చెను. రాముఁడట్లు కొంతవడి నురియాడి యెట్టకేలకుఁ గృతనిశ్చయుఁడై సీతాలక్ష్మణులను వెంటఁగొని యత్రిమహాముని యాశ్రమము చేరెను. ఆ మహోత్ముఁడు వారిని సుతాధికప్రియంబున సత్కరించి,

"ఉ॥ కాలవిపర్యయంబున సుఖంబును దుఃఖము వచ్చుచుండు నె
క్కాలము నేరికిఁ ధ్రువముగాదు సుఖంబును దుఃఖమున్ మహీ
పాల! బుధుండు తద్విధభంగు లెఱింగి ప్రమోదభేద సం
శీలుఁడుగాఁడు రెంటను బ్రసిద్ధపథంబున నప్రమత్తుఁడై."

అని వచించి నిజపత్ని ననసూయాదేవిని బిలిచెను. ఆమెకు రామలక్ష్మణులు మ్రొక్కిరి; సీతాదేవి తన పేరుచెప్పి ప్రదక్షిణ నమస్కార మొనర్చెను. అనసూయాదేవి రాఘవుల నాదరించి సీతను దనవెంట లోనికిఁ గొనిపోయి, 'అమ్మా, నీ వృత్తాంతమును వినగోరుదు' ననెను. వైదేహి తన చరిత్ర మెల్ల వినిపించెను. ఆ మునిపత్ని పరమప్రీతయై, 'అమ్మా, నీ పాతివ్రత్యంబునకు మెచ్చితిని; నీ నిశ్చయమును గొనియాడరాదు; సతికిఁ బతిసేవకన్నఁ దరణోపాయము వేఱుగలుగదు; నీవు త్రైలోక్యస్త్రీజనంబునకు శుభమార్గదర్శిని వైతివి; మేమెల్లరము నిట్లు తపోవ్రతములాచరించుట మనశ్శుద్ధి సంపాదనమునకేగదా. శుద్ధ చిత్తులకు దుర్ఘటంబు లుండవు. వత్సా, నీయిచ్చ దెలుపు మొనర్తు' ననెను. జానకి యామెకుఁ గయిమోడ్చి 'ఆర్యా, నీవచనమునఁ నాకు సర్వాభీష్టసిద్ధియయ్యె' నని చెప్పెను. అనసూయాదేవి యంత నామెకు వస్త్రాభరణంబులును బుష్పమాలికలును నంగరాగమును గొనివచ్చి యిచ్చి, 'వత్సా, వీనిని ధరింపుము; నీకు సమస్తశుభములగును; ఇవి చెడని పదార్థము' లని పలికి తనమ్రోలనే వానిని ధరింపఁగోరెను; సీతాదేవి వానిని భక్తితో గ్రహించి దాల్చి యామెకు మ్రొక్కి

రామునొద్దకుఁజని సంగతి తెలిపెను. రామలక్ష్మణు లందులకు మహా ప్రీతులైరి.

అంతలోన నాఁడు విహగంబులు తమతమ కులాలయములుచేరి నిజవిహార విశేషంబులను జెప్పుకొనుచున్నయోయనఁ గలకలధ్వనులఁ గావించెను; మునులు సాయంకాలిక స్నానములాచరించి తడిబట్టలతోడ జలకలశంబులతోడ నాశ్రమములకు రాసాగిరి; అగ్నిహోత్రంబుల ధూమము కపోతాంగాభనిమమును బురుడించుచు గగనభాగంబును గప్పెను; ఆశ్రమమృగంబులు విశ్రమార్థము వేదిస్థానములు చేరెను; వృక్షంబులు మహాల్పపర్ణంబులయ్యెఁ బత్త్రిబహుళంబులుగాఁ దోఁచెను; చంద్రుఁడు నక్షత్రపరివారముతోడఁ బేరొలగము తీఱి లేవెన్నెలలఁ బఱచి యింద్రియతర్పణమొనర్చుచుఁ దన రాజనామంబును సార్థకమొనరింపసాగెను.

రాములు దండకారణ్యమునకుఁ బోవుట

సీతారామలక్ష్మణు లారాత్రి యందుఁ గడపి ప్రాతఃకాలమున లేచి తమప్రయాణంబు నయ్యాశ్రమవాసులకుఁ దెలిపిరి. వారామాటవిని, 'రామా, ఈ మహారణ్యంబున నరభక్షకులైన రాక్షసులు నానాఘోరాకారులు గలరు; క్రూరమృగంబులును దండోపతండములుగా విహరించుచుండును. మేమెంతో మెలఁకువతో ఫలాహారములను సేకరించుకొనుచుందుము. ఇదిగో యీదారిఁ జనిన నంతభయముండ'దని చెప్పి మార్గముఁజూపి వారినాశీర్వదించిరి. రాముఁడు వారికిఁ బ్రణమిల్లి సీతాలక్ష్మణుల వెంటఁగొని సూర్యుఁడు నీలమేఘమండలంబును వలె దండకారణ్యముఁ బ్రవేశించెను.

అయోధ్యాకాండము

సమాప్తము

శ్రీ దొడ్డ రామాయణము

అరణ్య కాండము

కా॥ రాజ్యశ్రీ దిగనాడినన్ గహనగర్భం బాశ్రయంబైన సం
భోజ్యంబుల్ ఫలమూలవారియయినన్ బుంజీకృతాధ్వశ్రమల్
ప్రాజ్యంబైన సహించె నెవ్వఁడు స్థితప్రజ్ఞాధ్యుఁడై యూజగ
త్పూజ్యప్రాభవయోగివర్యు చరణాంభోజంబులం గొల్చెదన్॥

రాముఁడు సీతాలక్ష్మణులతోడఁ దాపసమండలమునకుఁ బోవుట

అట్లు రాముఁడు సీతాలక్ష్మణులఁగూడి దండకారణ్యంబుఁ జొచ్చి చనుచు మార్గమధ్యంబునఁ గొండొకచోట, స్వాదుఫలభరనమ్రంబులైన వృక్షంబులతోఁ గ్రిక్కిరిసి యున్నదియు, నానాసూనవితానమనోజ్ఞ లతామందిరంబులను వికచకల్హారకమలాకరంబులను గలిగి మహారమణీయంబుగా నున్నదియు నగు తాపసాశ్రమ మండలంబొండు గాంచి తత్ప్రాంతనృత్తోగ్రములం దారవైచియున్న వల్కలంబులను, యజ్ఞార్థము సంతరింపఁబడి యందందుఁ బ్రోవులైయున్న కుశలనుజూచి, చేరువకుఁబోయి యందు యూగపాత్రకృష్ణాజినసమిత్కుశజలకలశంబులతో నిండియున్న యగ్నిహోత్రగృహంబులను వాని మధ్యఁగూర్చుండి బలిహోమార్చనల బ్రహ్మఘోషలఁ దపిలియున్న బ్రహ్మతేజోమూర్తులను బరికించి, నారిసడలించి వినీతవేషంబున నయ్యాశ్రమముఁజొచ్చెను. అందలి మహర్షులు దివ్యజ్ఞాన సంపన్నులు తమ యాశ్రమంబునకు నట్లు వచ్చిన యయ్యతిథులను గాంచి సంతసించి యెదురేగి, యా మువ్వుర లోన విలక్షణరూపలక్ష్మీసౌకుమార్యసౌందర్యంబులఁ దేజరిల్లుచున్న రామునకు నత్యంతము విస్మయమంది, యట్టి మహాభాగుఁడు తమకు నతిథిగావుట కెంతయు నలరి, వారిని దోడ్కొనివచ్చి యథోచిత సత్కృతులాచరించి, ఫలమూలపుష్పంబుల గారవించిరి. ఎల్లమర్యాదలు తీఱినంత రాముఁడా మునులను గుశలవృత్తాంతాదులు విచారించెను. వారు ప్రాంజలులై, 'మహాత్మా, నీవు మాకెల్ల మాన్యుండవును బూజ్యుండవు నగుటయు గాక పరమశరణ్యంబవై తనరుదువు. ధర్మపరిపాలనార్థం బవతరించితివి; దుష్టశిక్షణంబున ధర్మవు సుస్థిరంబై

వెలయును. దుష్టులను శిక్షించు రాజు తండ్రికిఁ సాటియగును; రాజ జన్మంబు సామాన్యముగాదు; తేఁడు దేవేంద్ర చతుర్థాంశంబున జనించును; ఆ కారణంబున నతండు సర్వలోకనమస్కృతుండును నిఖిల భోగానుభవయోగ్యుండు నగును; మే మెల్లరము నిందు నివసించుచు భవదభ్యుజాభిరక్షితులమై మనుచున్నాము; నగరస్థులమో వనస్థులమో మా కెల్ల నీవే ప్రభుండవు. జితేంద్రియులము గావున నపకారులనుగూడ నొప్పింపనొల్లము. తపోవ్రతచర్యలఁ బ్రొద్దువుత్తుము; తపోధనులు నీకు గర్భసంజాతు లట్టివారు; వారి రక్షణము నీకుఁ దప్పఁదనిరి.

విరాధవధ

రాముఁ డట్లామహర్షులకు సన్నిధియై సతీసహోదరులతోడ నాఁటి రేయి యందుఁబుచ్చి రేపకడలేచి యమ్మునీంద్రులను వీడ్కొని తరలి చనిచని యరణ్యాంతరము ప్రవేశించెను. ఆ కాననంబు నానామృగా కీర్ణంబును శార్దూలనృకసేవితంబును విధ్వస్తలతావృక్షగుల్మంబునై వెలఁ పించుచుండెను. అందలి కాసారంబులు దుర్గంధదుస్సహములుగాఁ గ్రోఁచెను. మఱియు నందు శకునిగ్రుల్లికాదులు చలనంబులు మాని నోరు విచ్చి తపోనిష్ఠనున్నవోయనఁ గాన్పించెను. రాముఁ డవియెల్ల జూచుచు వింతగూరుచుఁ గొండొకదవ్వు చని యట గిరిశృంగంబును బోని పెనుభూతంబును చేటలంతటి కన్నులతోను మహాగహ్వర సమానవదనంబుతోను బూరటిల్లి విషమమైయున్న యుదరంబుతోను భీభత్సాకారముగా నున్నదానిని గాంచెను. ఆ భూతము పచ్చినెత్తురు వల్చుచున్న పులితోలుచుట్టి, సింగంబులమూఁటిని బెబ్బులులనారింటినిఁ దోడేళ్ళరెంటిని జింకలఁబదింటిని, పసగాఱుచున్న సదంతదంతిమస్తకం బొండు శూలాగ్రమున గ్రుచ్చిమూఁపున వ్రేలవ్రైచి నోరప్పళించి యమునివలె రాసాగెను.

ఆ భూతంబు రామాదులనుజూచి ధాత్రీతలంబు గ్రక్కడలునట్లు పాదసంఘట్టనంబు గావించి బిట్టార్చి యెగచివచ్చి సీతాదేవినొడిసి చంక బెట్టుకొని, 'ఎవరురామీరు? నారచీరలుగట్టితిరి; ధనుర్బాణంబులను ధరించితిరి; కాంతాసహితంబుగా వచ్చితిరి. ఇది చాలఁ జోద్యమయ్యెడు. ఋషులేడ? ప్రమదాసహచర్యమేడ? మీవేషంబులెక్కడ? ధనుర్బాణంబులెక్కడ? అధర్మవర్తనులైన మునిదూషకులు మీ రెవ్వరో వచింపుఁడు. ఈ దండకారణ్యంబు నాదగుట యెఱుంగరా? నా సంగతి

తెలియదా? ఋషిమాంసభోజినై యిందు వసింతునని వినరా? ఈ వరాలోహ నాకుఁ గూర్మిసతి యగుఁగాక. మీ వేడినెత్తురులు నా యాఁకలిఁ దీర్చుఁగాక' అని మహోష్టంబుగాఁ బలికెను.

సీతాదేవి ప్రవాతకదళికవలె వడంకుచుఁ బరితపింపసాగెను. రాముఁడు తనప్రియురాలి దురవస్థకు దుఃఖశోషితవదనుండై, 'లక్ష్మణా! జనకమహారాజునకు జనించి శుభాచారయై యత్యంతసుఖంబులఁ బెంపొంది పరమపతివ్రతాకీర్తిని గడించిన యీరాజపుత్త్రి నాయనుంగు సతి యిట్లు రాక్షసాంకమునఁ జిక్కియుంటఁ జూచుచు మిన్నకుందువా? కైకేయి యెంతదీర్ఘదర్శినియో చూడుము. ఆమె తనకొడుకునకు రాజ్యప్రాప్తిమాత్రంబునఁ దనియక యేదేది సంకల్పించి సర్వభూతహితుని నన్ను వరవ్యాజంబున వనప్రస్థాపితునిగా నొనర్చెనో యవి యిట్లు నేఁడు ఫలింపనున్నవి. తమ్ముఁడా! వైదేహిని బరపురుషుండు తాఁకుటంజేసి నా కిప్పుడు పొడముచున్న దుఃఖము పిత్రృవియోగ రాజ్యాపహరణంబులఁగూడ జనింప'దనెను. ఆమాటతోడ లక్ష్మణుఁడు మహాక్రుద్ధుఁడై మంత్రనిరుద్ధకాలసర్పంబు పగిది నిశ్వసించుచు, 'అన్నా! సర్వలోకనాథుండవును దేవేంద్రకల్పుండవునైన నీవు ప్రేష్యుండనైన నేను వెంటనుండఁగా ననాథునిచందంబున నిట్లు పరితాపమొందనేల? రాజ్యకామియైన యీ భరతునిమీఁది నా పగ తీఱునట్లుగా నొక్కకోల నిప్పాలసుదిండిని బరిమార్చి తద్రక్తంబుల నవనికిఁ ద్రాననిత్తు జూడుము. ఆకర్ణాంతము దివిచి వేయు నాబాణం బీ దురాత్ముని యురస్థలంబును వ్రచ్చి వానిప్రాణంబులను హరించి తచ్ఛవంబును క్షణమాత్రంబున నేల దొర్లాడించు'నని పలికి యీ రక్కసునిజూచి, 'రాక్షసాధమా! ఈ వనంబున విచ్చలవిడిఁ జరింతువు; నీ వెవ్వండ' వని యడిగెను. ఆ రక్కసుఁడు గరోద్ధతుఁడై, 'మీరెవ్వరో? ఎందుఁబోదురో ముందు వివరింపుఁడ'ని గభీరస్వరంబున బదులాడెను. రాముఁడా మాటవిని, 'మేము క్షత్త్రియులము; సదాచారసంపన్నులము; వనవాసము వరించి వచ్చితిమి. నీ సంగతియే'మనెను. నావుఁడు 'రాజా! నా తండ్రిపేరు జయుఁడు, నా తల్లి శతహ్రద; నన్ను విరాధుఁడందురు. నేను బ్రహ్మను గూర్చి కఠోరతపంబొనర్చి ఖడ్గధారాహతులవలనఁగాని ఛేదనభేదనంబుల వలనఁ గాని చావురాకుండునట్లుగా వానివలన వరంబులందితిని. నన్నుఁ జెనకనోపరు. ఈ యింతిని మీరిఁకమఱచి ప్రాణంబులు దక్కించుకొని వచ్చినదారిఁ బోనగు' నని పలికి సీతతోడ నురుకనుండెను. రాముఁడు

కోపసంరక్తలోచనుఁడై, 'క్షుద్రాధమా! పరస్త్రీహరణంబును దలపెట్టి మృత్యువునుగోరి వచ్చితివి. ప్రాణంబులతో నీవు నెడలుటకల్ల; నిలునిలు' మని విల్లెక్కుఁడించి తుక్మపుంఖంబులును వాయువేగవంతంబులునైన శరంబుల నేడింట వానిని వైచెను. ఆ బాణంబులు వానిశరీరంబును జీల్చి తచ్ఛోణితదిగ్ధములై నేలఁ బ్రాలెను. విరాధుఁడు శరహతికి నొచ్చి మహోగ్రుఁడై సీతను డించి వేఁడ్చుచు నింద్రధ్వజముఁబోని శూలంబును బూని కాలాంతకుని పగిది లక్ష్మణునిపైకి నుఱికెను. రామలక్ష్మణు లిరువురు నొక్కుమ్మడి నతనిపై శరవర్షముఁ గురిపించిరి; విరాధుఁడు వికవికనవ్వి తనయొడలనాఁటియున్న యమ్ములుకులను విదిల్చివైచి బిట్టార్చి రాముని గవసెను. రాముఁడు బాణద్వయంబున వానిశూలంబును ఖండించెను. విరాధుఁడట్లు నిరాయుధుండయ్యు విజృంభించెను. రాఘవులు వానిని గృష్ణసర్పంబులఁబోని ఖడ్గంబులఁ బ్రహరించిరి. అయ్యసుర యాఘ్రేటులు చీరికిఁగొనక యయ్యిరువుర నొడిసి సందిటఁజేర్చి పోనుంకించెను. రాముఁడు వానితలంపు గ్రహించి, 'లక్ష్మణా! మనము పోనున్నదారినే యితఁడు మనలను మోసికొని పోనున్నాఁడు; కాని' మ్మనెను. విరాధుఁడు రామలక్ష్మణులను శిశువులనువలెఁ దనభుజంబుల పయి నిడుకొని బొబ్బరించుచు వనాభిముఖుండయ్యెను.

ఆ రక్కసుని దుండగంబును సీతాదేవి పరికించి చేతులు పిసికి కొనుచు, 'అయ్యో! సత్యసంధుని బరిశుద్ధాత్ముని దశరథమహారాజ పుత్త్రికుని రాముని సోదరసహితంబుగా రాక్షసుఁడు రౌద్రాకారుఁడు హరించుచున్నాఁడు; ఇఁక నేను వృకశార్దూలంబులకు బలియగుట నిజ' మని చింతించి, 'దనుజాగ్రణీ! నీకు నమస్కరింతును; నా మొఱాలింపుము. రామలక్ష్మణులను వదలి నన్నుఁగొనిపొమ్ము' అని వేఁడుకొనుచు వాపోవ సాగెను. సీతారోదనంబు చెవిసోకినంతనే రామలక్ష్మణులు కోపవినశులై యా నిశాచరుని దోర్దండ నధింపనిశ్చయించి వానిభుజంబులు చెరియొకటి ఖండించిరి. విరాధుఁడు భగ్నబాహుఁడై తత్తరిల్లి వజ్రంబడిచిన పెను గొండవలెఁ గూలెను. అట్లు నేలఁబడిన యాదుష్టుని వారు మోకాళ్ళ గ్రుమ్మి పిడికిళ్ళబొడిచి నుఱుమాడి ముద్దగావించిరి. ఏమిచేసినను వానికిఁ జావురాదయ్యెను. రాముఁడంత విరాధునివరంబులు తలంచి, 'లక్ష్మణా! ఆయుధములు వీనిని గెడపఁజాలవు; పరమేష్ఠివరమట్టిదై యున్నది. ఇతనిని గోతిలోఁ బాతిపెట్టుద' మనెను. విరాధుఁడదివిని, 'పురుష వ్యాఘ్రమా! మోహవశంబున నిన్నెఱుంగనైతిని. నీవు కౌసల్యా

గర్భంబున జనించిన శ్రీమన్నారాయణుండవగుట గ్రహించితిని. సీతా తత్త్వంబును లక్ష్మణునికలరూపును నాకు విదితములయ్యెను. రామా! నేను తొల్లి తుంబురుండనుపేరి గంధర్వపతినిగా నుండి రంభాసక్తుండనై ప్రమాదమొనర్చి కుబేరశాపంబున నిట్లయితిని. వైశ్రవణుఁడు నన్నుఁ గరుణించి నీ చేతివధ నాకు శాపావసానంబుగా ననుగ్రహించెను. నీ ప్రసాదంబున నేటితో నా శాపము తీఱెను; స్వస్థానంబునకుఁ జనువాఁడ; మీకు శుభమగుఁగాక. ఇటకు నత్యర్థయోజనదూరంబున ధర్మాత్ముఁడు శరభంగమహర్షి గలఁడు. అటకుఁ జనుఁడు; మేలగును. రాక్షసశవంబును బూడ్చుట ధర్మసంప్రదాయము. ఆయుపకారంబు నాకొనర్చి పొమ్ము' అని చెప్పి ప్రాణములువిడిచెను.

రాముఁడు శరభంగాశ్రమమునకుఁ జనుట

రాముఁడు విరాధునికళేబరంబును గర్తంబునఁ బూడ్చి సీతాదేవి నూరార్చి యామెను దమ్మునిని వెంటఁగొని శరభంగాశ్రమము డాయ బోయెను. అత్తఱి నంతరిక్షంబునఁ బచ్చవాడునంబులుగట్టిన రథంబు సూర్యాగ్ని తేజోవిభ్రాజమానమైనది గానవచ్చెను. ఆ రథమునందుఁ భాండురాభ్రచంద్రమండలంబుల వైఖరిని దలపించుచున్న చిత్రమాల్యోప శోభిత శ్వేతచ్ఛత్రంబులును, వానినీడనుండి మృదుమృణాళహస్తంబులతోఁ దపనీయదండ చామరన్యజనంబులఁబట్టి నీచుచున్న నారీమణులును గానవచ్చిరి. మఱియు నా రథమునుజుట్టి గగనస్థితులై సిద్ధగంధర్వామర మహర్షులు నిగమోక్తులఁ బ్రస్తుతించుచుండిరి. రాముఁడదియెల్లఁజూచి, 'లక్ష్మణా! కాంతిశ్రీసమాజుష్టమై మధ్యాహ్నభానుమండలంబు పగిది నింగిఁ బొంగారుచున్న యా బంగారురథంబును గంటివా? ఆతేరునకుఁ గట్టిన పచ్చవన్నెతురంగంబులఁ జూతువా? శోణాంశువస్త్రంబులుధరించి పరిఘాయత బాహుదండంబులందు ఖడ్గంబులు దాల్చి దురాసదులై యయ్యరదంబును జుట్టియున్న వారలెవరుగానోపు? సౌమిత్రీ! ఆ మహనీయుల యురంబుల మెఱయు హారంబుల తేజము వారివంకఁ జేతి చూడనీయదు. వారెల్లరును బంచవింశతివర్షప్రాయులుగాఁ దోతురు. దేవతలట్టివారని విందుము. నీవును సీతయు నిందుండుము; నేనుపోయి వివరము విచారించి వత్తు'నని చెప్పి యాశ్రమంబువలను చనెను.

అంతలోన నొకదివ్యతేజోమూర్తి యయ్యరదంబునుండి దిగి వడివడి శరభంగమహర్షిని సమీపించి, 'మునీంద్రా, అదిగో రాముఁడు

వచ్చుచున్నాఁడు. ఆయన రావణునివధించి దేవతాకార్యంబొనర్పనలసి యున్నది. అందాక మాకు సమాగమంబుకూడదు. వేగమ తరలుము' అనెను. శరభంగుఁడు వారినిబూజించి, 'నిర్జరనల్లభా, ఇప్పుడు రాజాల' నని చెప్పి యతనిని వీడ్కొలిపెను.

అయ్యమహేశ్వరుఁడు చనుటయే తెడవుగా రాముఁ డయ్యాశ్రమము చొచ్చి యమ్మహర్షికి మ్రొక్కి గగనంబునఁ దాఁజూచిన రథంబునుగూర్చి యడిగెను. శరభంగుఁడు తలయూచి, 'నాయనా! రామా! అది యింద్రరథము. నేను తపోబలంబున బ్రహ్మలోకంబును సాధించితిని. అటకు నన్నుఁ గొనిపోవ నిర్జరాధిపుఁడు సురసమేతంబుగా రథంబును దెచ్చెను. ప్రియాతిథివి నీవు సన్నిహితుండవగుట యెఱింగి నిన్ను సందర్శింపక చనరాదనియెంచి యింద్రుని బంచితిని. రామా! నా సాధించిన యక్షయస్వర్గలోక బ్రహ్మలోకంబులను నీకు సమర్పింతు గ్రహింపు' మనెను. రాముఁ డామాటవిని, 'తపోధనాగ్రణీ, ఏ లోకంబునైనను స్వయంబుగా సాధించుట ధర్మంబగును. ఆ తలంపునఁ నే యింతు వచ్చితిని. నాకు నివసింపఁదగుతావుఁ జూపుము, చాలు' ననెను. 'రామా, ఈ వనమందే యనతిదూరంబున మహాను భావుండును సర్వజ్ఞుఁడును గౌతమవంశ్యుండునైన సుతీక్ష్ణమహర్షి గలఁడు. ఆయన నీకు మేలు గూర్చును. ఇదిగో యీ మందాకినీ తీరంబునఁ జనఁగా నేటిలోఁ బుష్పాకారంబులైన తెప్పలు కాన వచ్చును. అది గురుతుగా దారింబట్టిపోయి వాని యాశ్రమము చేర నగును. రామా! నీ సందర్శన భాగ్యంబు లభించెను. ఇఁక నే నీ జీర్ణ శరీరంబును సర్పంబు కుబుసంబునువలె వదలుదును. అది చూచి చను' మని పలికి యప్పుడే యగ్నిరగిల్చి యాజ్యము వ్రేల్చి యా చితిఁ జొచ్చి దగ్ధుఁడై యందుండి కుమార వయస్కుఁడుగా లేచి, యాహితాగ్నులును ఋషులును దేవతలును బడయు లోకంబులు దాఁటి బ్రహ్మలోకముఁ జేరి యటఁ బితామహుని స్వాగత మందెను.

ఆశ్రమమునులు రాక్షసబాధలు గూర్చి రామునకు మొఱలిడుట

శరభంగుని యాశ్రమమందు బహువిధతపోనిష్ఠ లుండిరి. అందుఁ గొందఱను వైఖానసులందురు; వారు బ్రహ్మనఖంబులవలన జనించిరఁట. మఱికొందఱను వాలఖిల్యులని పేర్కొందురు; వారు బ్రహ్మరోమంబుల నుండి పుట్టిరని చెప్పుదురు. సంప్రక్షాళులనుపేరివారు మఱికొందఱు

గలరు; వారు ధౌతి యొనర్తురు. మరీచిపు లనువారు కొందఱుండిరి; వారు సూర్యచంద్రకిరణంబులను ద్రావి జీవింతురు గావున వారికాపేరు నచ్చెను. అశ్మకుట్టులను నింకొక తెగవారుండిరి; వారు స్వదేహంబు లను శూలతో మర్దించికొనుటంజేసి యా పేరఁ బరగుదురు. పత్ర హారులను తెగ యొకటి యుండెను; రాలిన పండుటాకులు తిని జీవించుట వారి యాచారము. దంతోలూఖలిను లనువారి తెగ మఱి యొకటి గలదు; దంతములతో ధాన్యముల పొట్టొలిచి గింజలు తిని నునుట వారి వ్రతము. ఊన్మజ్జకులను మఱియొక తెగవారుండిరి. కుత్తుకబంటి నీటిలో నిలిచి తపముచేయుట వారి సంప్రదాయము. గాత్రశాయు లనువారు కొందఱుండిరి; భుజమో మోమో తలగడగాఁ జేసికొని నిద్రింతురుగాన వారి నట్లందురు. అశయ్యు లనువారు మఱికొందఱు గలరు; వారు బొత్తుగా నిద్రింపరు. అభ్రావకాశులను వేఱొక తెగవారుండిరి. వారు శీతకాలంబున బహిఃప్రదేశమందు నిలిచి తపంబులాచరింతురు. కొందఱు సలిలాహారులును మఱికొందఱు వాయుభక్షులు నుండిరి. వీరుగాక నిరాలంబముగా నింగి నిలిచి తపంబు సేయునట్టి యాకాశనిలయులును, గటికనేల బరుండుటే వ్రతముగాఁగల స్థండిలశాయినులును, నిత్యోప వాసంబులుసేయు వ్రతోపవాసులును, దమమునే యనుష్ఠించు దాంతు లును, నిరంతరముఁ దడిగుడ్డలు కట్టియుండునట్టి యార్ద్రపటవాసులును, సజపు లనువారును దపోనిష్ఠు లనువారును బంచాగ్నిమధ్య నిలిచి తప మొనర్చువారు నిట్లు పలురకముల వారుండిరి.

రాముఁడు వారి నెల్లఁజూచి, 'లక్ష్మణా! ఈ మునులనుజూతువా? వీరెల్లరు నిట్టి కఠినవ్రతంబు లాచరించుట యేలనో యూహింతువా? ముక్తిని గోరి వీరిట్లు చేయుచున్నారు. ముక్తిఁబడయుటకుఁ జిత్తైకాగ్ర్యము వలయును. చిత్తమన్ననో చంచలాచంచలము. దాని నొకచోట నిలుపుట యంత సులభకార్యముగాదు. మఱియుఁ జిత్తము వివిధ వాసనారూపంబున నుండును. ఆ వాసనలను నిశ్శేషమొనర్చుటయే చిత్తసమాధాన మందురు. వాసనలు పలువిధము లగుటయేగాక సూక్ష్మ మంద గాఢ రూపంబుల నుండును. దానంజేసి తన్నాశనంబు నకు నేకమూలికాప్రయోగము తగదు. అందువలనఁ దత్త్వజ్ఞులగు గురువులు తమ శిష్యుల మనస్తత్వంబులను గ్రహించి వారివారికిఁ దగు నిష్ఠల నుపదేశింతురు. ఈ మునుల కెల్లరకు ముక్తియే ప్రాప్యముగా నున్నను మనస్తత్వభేదముంబట్టి వీరిట్టి భేదమార్గంబుల ననుష్ఠించు

చున్నారు. తమ్ముఁడా! ఆత్మసమాధి యెంతకష్టసాధ్యమో గ్రహింపు' మనెను.

అంతలో నమ్మునులు రాముని సమీపించి, 'ధర్మాత్మా! దేవేంద్రుఁడు స్వర్గంబునకునలె నీవు భూమండలంబునకు నధిపతివై విశ్రుతిఁ గాంచితివి. పితృభక్తియందును సత్యపరాయణత్వమందును నిన్నుఁ బోలు నతండు గలుగఁడు. రాజునకుఁ బ్రజాసంరక్షణమే పరమధర్మము. తన్నిమిత్తము జనులవలన జేఁడులు షడ్భాగంబులు గ్రహింతురు. ప్రజలసొమ్ము నట్లు గైకొనియు వారిని రక్షింపనిరాజు మిక్కిలి యధర్మం బును బొరయును. ప్రజలను బ్రాణాధికులుగా రక్షించు జేఁడు బ్రహ్మ లోకపూజితుఁ డగుటయేగాక కీర్తిమూర్తియై చిరకాలము జీవించును. కచ్చడంబులు గట్టి కందమూలంబుల జీవించుచున్న యీ గోఁచి పాతలరాయలు తమ రక్షణార్థము రాజులకేమి యిత్తు రనవలదు. వారును దను తపోధనమందుఁ జొరరాంశంబు రాజులకిచ్చు చున్నారు. కావున వారుఁగూడ రాజులకు సనశ్యరక్షణీయులగుదురు. వాన ప్రస్థులకు మా కేమి బాధలుండు నందువా? అదిగో చూపు మివ్వన మందుఁ బడియున్న యస్థిరాసులే మా కష్టములఁజెప్పును. రాక్షసుల వలన మేము పడు బాము లిన్నియనరావు. వారు గావించు వధాకోలా హలంబును భరింపఁ జాలకున్నాము. నీవే మాకు శరణం' బని మొఱ పెట్టిరి. ఆ ఋషుల దీనవచనంబులకు రాముఁడెంతయుఁ జింతా క్రాంతుఁడై, 'మహాత్ములారా, మీరు నన్నాజ్ఞాపింపఁ దగుదురేగాని నాకు విజ్ఞాపింపఁ జెల్లదు. కొండొక కార్యార్థినై యిందువచ్చితిని. అయినను దండ్రియాజ్ఞ నట్లు మీ యాజ్ఞనుగూడఁ దలఁదాల్చి రాక్షసుల వలని విప్రకారంబునుండి మిమ్ము దప్పింతును. తపోధనులు మా శౌర్య పరాక్రమంబులఁ జూడఁగలరు. భయము మానుఁ' డని పలికి వారికి నభయహస్తంబిచ్చి సీతాలక్ష్మణులను వెంటఁగొని యా మునులతోడ సుతీక్ష్ణమహర్షియొద్దకుఁ దరలెను.

సుతీక్ష్ణమహర్షియాశ్రమము

రాముఁడట్లు వెడలి మహారణ్యముఁ జొచ్చి జలపూర్ణంబులైన నదులు దాఁటి, వివిధవృక్షసమాకీర్ణములై చీఁకట్లుగ్రక్కుచున్న వెనుగొండల నతిక్రమించి, చనిచని చీరమాలాపరిష్కృతమైన యాశ్రమమొండు చేరెను. అందుఁ జీకుముదుసలితపసి యొకండు

నిజజటాభారము పంకావిలమైనది తదీయ నిశ్చలతపోవ్రతత్వంబును జెప్పకయే తెలుపుచుండఁగా యోగసమాధి నుండెను. ఆ తాపసియే సుతీక్ష్ణమహర్షిగా నెఱింగి రాముఁడు వానిని డాయఁబోయి, 'మహాత్మా మీ దర్శనార్థము నచ్చితిని; నన్ను రాముఁడందు' రని నమస్కరించెను. ఆ మునిపుంగవుఁడు రామునిఁ గపుంగిటఁగూర్చి, 'రామా! స్వాగతము; నీవలన నా యాశ్రమంబు నేఁడు సనాథమయ్యెను. నీ రాకను నిరీక్షించి దేవలోక గమనంబునుగూడ విరమించి యీ తనువును భరించి యున్నాను. నీవు రాజ్యభ్రష్టుండవై వనవాసము నిమిత్తముగాఁ జిత్ర కూటంబునకు వచ్చుట వింటిని. ఇప్పుడే యింద్రుఁ డిటకు వచ్చి, 'మునీంద్రా, శరభంగమహర్షి కడనుండి వచ్చుచున్నాను. తపో బలంబున నుత్తమ లోకంబుల నెల్ల జయించితి' నని పలికి చనెను. నా యార్జించిన యీ దివ్యలోకములందు మత్ప్రసాదంబున నీవు సీతా లక్ష్మణులనుగూడి యథాసుఖంబు విహరింపనగు' నని వచించెను. నావుడు, 'మహాత్మా, మీ నిర్వ్యాజప్రేమ కెంతయుఁ కృతజ్ఞులము. పుణ్యలోకములను స్వయముగా సంపాదింప నభిలషింతును. ప్రకృతము మేమీ వనమందు వసింపనైన చోటేదో యనుజ్ఞయిమ్ము. శరభంగ మహర్షి పంపున నిందువచ్చితిమి. నీవు సర్వభూతహితరతుండవగుటయు సర్వజ్ఞుండవగుటయు గౌతమ వంశ్యుండవగుటయు నమ్మహనీయుఁడు మాకుఁ దెలిపె' నని రాముఁడనెను. అందులకు నమ్మునివరుం డలరి, 'రామా, ఈ యాశ్రమమందే మీరుండవచ్చును. ఇది ఫలమూల సమృద్ధంబును ఋషిసేవితంబు నగుట మీకు వసింపఁదగియున్నది. మృగబాధమాత్ర మిందుఁగలదు. అన్యక్లేశంబు లిటఁగలుగ' ననెను. రాముఁడది విని, 'ముసీంద్రా, ఆశ్రమోపకారములైన మృగంబులను వేయక నాకుఁ దప్పదు. అది మీ కోపకారణంబగును. అంతకన్నఁ గష్టముండునా? కావున నేనిందుఁ బెద్దకాలము వసింపనోప' ననెను.

వారట్లు సంభాషించుచుండఁగా రవి యస్తంగతుఁడయ్యెను. రామాను లంతట తత్సమీపంబున నున్న కొలనునందు వార్చివచ్చి తాపసభోజ్యమైన యన్నము గ్రహించి యా రేయి యందుండి వఱువాత లేచి యుత్పల సుగంధబంధురశీత జలంబులాడి యగ్నిహోత్రకార్యంబులు దీర్చి దేవతలను బూజించి సూర్యోదయంబుతోడ సుతీక్ష్ణమహర్షిని సందర్శించి, 'మునివర్యా, రాత్రి యిందు సుఖముంటిమి. దండకారణ్య మందలి పుణ్యాశ్రమంబులను సందర్శింప నెంతయుఁ దమకింతుము. ఆజ్ఞ

వేడుదుము. నడుమంత్రపు సిరిగలాని దుందుడుకట్లు ఎండవేడిమి దుస్సహము గాకమున్నే యిందుండి తరలఁగోరుదు' మని వానికి సాగిలఁబడి మ్రొక్కిరి. ఆ ముసీంద్రుఁడు వారిని లేవఁదీసి, 'రామా! ఛాయవోలె నంటియున్న సీతతోడఁ గూర్మినిధానమైన తమ్మునితోడ నీవు చనుమార్గము నిరుపద్రవంబగుఁగాక. తపోభావితాత్ముల పుణ్యాశ్రమంబులను సేవించుచుఁ బ్రౌఢ్యఫలమూలంబు లారగించుచు, వివిధ మృగయూథవిహారంబులఁ గాంచుచుఁ, బ్రకాండపక్షిగణకూజితంబు లాలకించుచుఁ, బూచి దలిర్చి నునుగాలికి వీచుచున్న లతాహస్తంబులతోఁ బొదరిండ్లు గావించుసట్టి యాహ్వానంబు లందికొనుచుఁ, బ్రసన్న సలిలపూరంబులునుఁ బ్రఫుల్లపంకజకారండవమనోజ్ఞంబులు నైన సరోవరంబులకు నలరుచు, మయూరనృత్యంబు లభినందించుచు, సుఖంబుగాఁ బొమ్ము. వత్సా! లక్ష్మణా! నీకు భద్రంబగుఁగాక. మరల మీరిందు రాఁగోరుదు' ననెను. వారంతట సమ్మునికిఁ బ్రదక్షిణం బొనర్చి తరలిరి.

సీతారాముల సంభాషణము

వారట్లు కొంతదూరము చన్నతర్వాత సీతాదేవి భర్తను జూచి, 'నాథా, ఈ ముసీంద్రుని గూర్చి తలంచుకొలఁది వింతయగుచున్నది. మిథ్యావచన పరస్త్రీ గమనవైరంబులనునవి మూఁడుఁ గామజన్య వ్యసనంబులందురు. అందొక్కటేనియు నిమ్మునీంద్రునందుఁ గానరావు. అమ్మూఁడింటిని జయించినవారిని జితేంద్రియులందురు. కావున నిమ్మునీశ్వరుండు జితేంద్రియుండనుట నిర్వివాదాంశము. ఇట్టి జితేంద్రియులకెల్లఁ బరమపూజ్యుండగు మహానుభావుఁడు డెంతటివాఁడుగా నుండునో యూహింపనగునేగాని చెప్పఁదరముగాదుకదా. నాథా, ఇట్టి మునీశ్వరులకు వేలకొలందికి మీరు పూజ్యులై యున్నారు. వనవాసంబునకు మనము వచ్చినది మొదలు ఋషీంద్రులు మీకుఁ గావించు సత్కారంబుల వలననే యీ సంగతి స్పష్టము. ఇట్టి మీ యందుఁ దత్కామజన్యవ్యసనంబులెల్ల సబీజంబుగా నశించి యుండక తప్పదు. అట్లు గాకున్నచో మీ కిట్టి యాధిక్యత కలుగనేరదు. ఈ వ్యసనంబులు మూఁడింటిలో మొదటివి రెండు మీ యందు వాసనామాత్రముగానేని గలుగవని మీ చరిత్రయే చాటుచున్నది. ఈ మూఁడింటిలోఁ బూర్వపూర్వములు బలవత్తరంబులందురు. బలవత్తరములైన మొదటి రెంటిని జయించిన మహానుభావుండు మూఁడవ దానిని జయింపలేడని తలంచు

టయు భావ్యముగాదు. ఎవనిచిత్త మెంతమాత్రము పక్వమైయుండునది వాని కార్యములు సూచించుచుండును. కావునఁ గార్యమునుబట్టి కారణంబును లోకమూహించి నిశ్చయించును. నాథా, పై మూఁడింటిలో మొదటిరెంటికి మీ యందుఁ జావే లేదని విన్నవించితిని. మూఁడవ దానిని గూర్చి మాత్రము కొంత సంశయంబగుచున్నది. ఈ సంశయంబు నకు నా యజ్ఞానమే కారణమైయుండును. అయినను సంశయనివార ణార్థము విన్నవింతును. సంశయకారణమేమందురా? రక్కసులఁ బరి మార్తునని ఋషులకు మాటయిచ్చితిరి; దానంజేసి రాక్షసులఁ మీఁద మీరు మీ శరంబును వ్యయింపక నూనరు. అసురులు మీ కెట్టి యొగ్గు నొనర్పరు. అట్టి వారియెడ నిట్లు వర్తించుట నిష్కారణ వైరంబగును. ఈ మోహవశకార్యంబు పామరులకగుఁగాని సర్వజ్ఞునకుఁ జెల్లదు. ఇట్లిది నేఁడు మీకు గలుగుటకుఁ జింతాశ్చర్యంబు లయ్యెడు. అగతియ గాథలు; ధనుర్బాణంబులు ధరించి తమ్మునిగూఁడి మీ రిట్లు వనంబునకు వచ్చుట యేతన్నిమిత్త మేమోయనియు స్మరించుచున్నది. చేతిలోని యాయుధ మూఁతకుండనీయదు. చేరువనున్న యింధనంబుల వలన నగ్నివలె హస్తగతాయుధంబుల వలన క్షత్రియుండు తేజోవృద్ధిని గాంచును. ఇందులకు నిదర్శనంబుగాఁ గతయొకటి చెప్పుదురు. తొల్లి మునియొకండు తపోనిష్ఠుఁడై కొండొక వనంబున నివసించుచుండెను. శచీపతి వాని తపంబును విఘ్నమొనర్పఁదలంచి భటసహితంబున వాని యాశ్రమంబునకువచ్చి, 'అయ్యా, నా చేతి యీ ఖడ్గంబును దాచి పెట్టుము. మరలవచ్చి నీకొందు'నని చెప్పి యాకత్తిని వాని యొద్ద నుంచి చనెను. ఆ గుప్తార్థంబు నమ్ముని ప్రాణపదంబుగాఁ గాపాడుచు ఫలమూల సంగ్రహణంబునఁ గూడ దానిని భాయఁడయ్యెను. అట్లాముని నిరంతరంబు శస్త్రంబును సహించుచున్న కారణంబున వాని మనస్సు క్రమక్రమంబుగాఁ దపోవిముఖమై రౌద్రంబును వహించి తుదకుఁ బ్రాణి హింసాపరముగాఁ బరిణమించెను. అట్లతఁడు ధర్మకర్మితుండై శస్త్ర సంసర్గంబునఁ దుదకు నరక మొందెను. శస్త్రసంసర్గంబు వహ్నిసంసర్గంబు వంటిదని యందురు. కారానివానినిఁ జేపట్టినచో ముప్పువాటిల్లక మానదు. స్పర్శదోషమంత తీవ్రమైయుండును. కావునఁ బెద్ద లీ విష యంబున మహా జాగరూకులై వర్తింతురు. నాథా, మాలిమించేసి యీ సంగతిని జ్ఞప్తిచేసితిని. ఆర్తసంరక్షణంబు క్షాత్రధర్మమందువా? హింస కారాదుగదా. మఱియు మీరు రాజధర్మంబును ద్యజించి ముని

ధర్మంబును స్వీకరించితిరి. ఇది మీ వేషమువలననే స్పష్టము. ముని వేషంబునకును క్షాత్రధర్మంబునకు నెట్లు పొసఁగును? అదియునుంగాక ధర్మవర్తనంబునకు దేశకాలవ్యవస్థగలదు. దానికి ననవస్థాదోషము గలుగరాదు. మునివేషంబును గ్రహించితిరి; వనముఁ జొచ్చితిరి. వన సీమలు తపోవృత్తియోగ్యంబు లగుఁగాని యొండుగావుగదా. అయోధ్యకుఁ జన్నప్పుడు రాజ్యపరిపాలనార్థము క్షత్రధర్మంబు నవలంబింపక తప్పను. అది యచ్చట రాణించును. నాథా, సర్వసృష్టికి ధర్మమే మూలమనియు ధర్మంబునఁ జేసి యర్థంబును దానివలన సుఖంబుఁ గలుగుననియు ధర్మసంపాదనార్థమై త్యజింపరానిది గలుగదనియుఁ బెద్దలు వచింతురు. ధర్మార్థము మీరు సమస్తమును త్యజించి వచ్చితిరి. వచ్చిన కార్యంబును సాధింపవలయునుగదా. మఱియు నొకటి వ్యయింపనిదే మఱియొకటిరాదు. వలఁతికై యలఁతిని మానుదురు. ఇది లోకస్వభావము. ధర్మార్థము మీరు సౌఖ్యంబును త్యజించితిరి. సౌఖ్యంబునకన్న ధర్మమే పరమార్థమనిగదా యట్లొనర్చుట. దానికి భంగము రానగునా? మఱియు,

"ఆ॥ వె॥ సర్వభూతదయకు సత్యవాక్యమునకు
నుత్తమంబు ధర్మమొండెయుంగ;
నొరులనొప్పికోడ కుపతాపమొనరించు
నదియ కడు నధర్మమనిరి బుధులు"

ఎన్నివిధముల విచారించినను మీ వేషంబునకును మీరు ఋషుల కిచ్చినమాటకునుఁ బొందుగలుగదు. స్త్రీచాపల్యంబునఁ జేసి యింత పలుకుదునేగాని మీ రెఱుంగని ధర్మముగలదా?' యని వినయ మధురంబుగా నుడివెను.

రాముఁడావచనంబులువిని, 'దేవీ! నీ వంశంబునకుఁ దగినట్లు పలికితివి. నా నేలు నీ వెంతకోరునది నీ మాటలవలననే స్పష్టము. ఆ క్షత్రాణము క్షాత్రధర్మనుగుట నీవే యంగీకరించితివి. ఇఁక నా చెప్పఁగలదేమి కలదు? నా వేషమందువా; ఇది యాదృచ్ఛికముగాని నైజముగాదు. ధర్మంబునకు దేశకాలాద్యవస్థలు గలుగవు. అట్టినియతిని గలిగించుట సంకుచితం బగును. ఎందున్నను స్వధర్మము నాచరింప వలయును. నేను క్షత్రవంశంబున జనించితిని; ధర్మరక్షణంబు నాకు విధివిధానము; రాజ్యమునన్నొండె వనమునన్నొండె నా ధర్మంబును నేను తప్పరాదు. అట్లుచేయనేని యనేకానర్థంబులకుఁ గారణమగుదును.

నన్నుఁజూచి యన్యులుగూడ నపమార్గంబును ద్రొక్కుదురు. రాక్షసవధ హింసకాదా యంటివి. ఆత్మలాభార్థము పరులకు మనోవాక్కాయంబులఁ గ్లేశంబులుగలిగించుట హింసయగును. నేను గోరంతగూడ స్వలాభంబు గోరి చేయుటలేదు. కావున నా పనులయెడ హింస నారోపింపఁదగదు. నా కార్యములందు రాగద్వేషములు వ్యక్తములేగదా యనియు రాగద్వేషపూర్వకర్మంబులు హింసామాత్రకములుగావా యనియు శంకింపనచ్చును. రాగద్వేషంబులనుమాటే నాయెడఁ జెల్లదు. రాక్షసులని పగసేయుటలేదు; యోగులని మైత్రినెఱపుటలేదు. ఎల్లరయందు సమబుద్ధితో వర్తింతును. యోగులొండె రాగులొండె ధర్మోల్లంఘన మొనర్తురేని సహింపను. రాక్షసులు ధర్మమును బ్రతిఘటించుచున్నారు. ధర్మంబును గాపాడుటకుగా వారిని శిక్షింపకతప్పదు. మఱియు రాక్షసుల నెల్లఁ జంపుటలేదు. దుష్టులను మాత్రమే శిక్షింతును. దుష్టశిక్షణంబున శిష్టరక్షణంబగును. శిష్టులు ధర్మంబును రక్షింతురు. అట్లు ధర్మము సంస్థాపితమగును. ఒక్కటి చూడుము. ఈ యోగులెల్లరు నాత్మ కళ్యాణార్థము శ్రమించుచున్నారు. ఒకరిజోలికిఁ జనరు; కందమూలములతో జీవింతురు; ఒకరి నాశ్రయింపరు. వీరివలన నెవరికి నెట్టికష్టనష్టములు గలుగవు. ఇట్టి నిరపరాధులను రక్కసులు నిష్కారణంబుగా బాధించుచున్నారు. ఈ యకార్యంబును సైచుటెట్లు? కూళలకుఁ దాళలేక నా శరణుజొచ్చినవారిని గాదనుటెట్లు? ఇప్పుడు నేను మిన్నకుందునేని దౌష్ట్యంబునకు నెలవిచ్చినట్లుగాదా? 'గతానుగతికోలోక' యన్నట్లొకరిని జూచి యొకరు వర్తింపరా? పర్యవసానమేమి? ప్రాణమానవిత్తములకుఁ జేటగును. తుదకు ధర్మమే లుప్తమగును. ఇందులకు నిదర్శనము లిప్పుడె కానవచ్చుచున్నవి, చూడుము. తాపసుల హోమంబులు చల్లారెను; వ్రతాదులకు వారు దూరమైరి. ఇంతటనేని దౌష్ట్యంబును నివారింపనేని యది చెలరేగి సర్వనాశంబొనర్చును. తాపసులే యీ దుష్టుల నడంపలేరా యని తలంపవచ్చును. వారికట్టి మహిమగలదు. ఆ మహిమంబులను వారెంత శ్రమించిసంపాదించిరో యూహింపనగునేగాని వచింపరాదు. అట్టి చిరార్జితతపోమహిమంబును వ్యయింపనోడి వారీ బాధలు సహించుచున్నారు. వారి వెతల నుడుపని రాజేల? 'దుర్బలస్యబలంరాజా' యన వినవా? ఇన్నితలపోసి మునులకు నభయమొసగితిని. మాటతప్పుటయెట్లు? కళ్యాణీ! ప్రాణమును గానీ లక్ష్మణునిగానీ తుదకు నిన్నుఁగానీ విడిచిన విడువనోర్తుఁగాని

సత్యంబును విశువఁజాలను. మఱియొకటి వినుము. అనుగకయే రాజు లార్తులను రక్షించి స్వధర్మంబును గాచికొందురు. ఈ మునులు నన్ను సంప్రార్థించిరి. సంప్రార్థితుండనయ్యు మిన్నకుండుట ధర్మబాహ్యము నాత్మశక్తివంచనముఁగదా' యని యుక్తియుక్తంబుగా సమాధానము చెప్పెను.

ధర్మభృన్ముని సందర్శనము

అట్లు వారు సమయోచితంబులఁ గూర్చి సంభాషించుచు మార్గాంతరమందలి వివిధశైలప్రస్థంబులకును, నదీపులినాంతరవిహార మాణ సారసచక్రవాకంబులకును, వికచకమలేందీవరరమణీయజల జాకరంబులకును, రూపుఁదాల్చినచిఱుమబ్బులువోని నరాహమహిషంబు లకును, దంతంబులఁ గోరాడుచుఁ దుండంబుల విసరుచు నడగొండవలె సంచరించుచున్న మత్తగజంబులకును, సంతోషాశ్చర్యము లందుచు సూర్యాస్తమయంబునకుఁ దటాక మొందు చేరిరి. అది యోజనాయతంబై వెలిదామరలతోఁ బొందమ్ములతో నిండి సారసహంసకలహంసమధుర కూజితమనోహరమై యుండెను. ఆ కొలనునుండి గీతావాద్యత్ర ధ్వనులు నిర్గతములై చెవులకు విందుసేయసాగెను. వెదకినను మనుష్యుల పొలకువయే యందుఁగానరాదయ్యెను. ఆ వింత యచ్చెరువు గొలుపఁగా రామలక్ష్మణులు దానినిఁ జేరఁబోయిరి.అట మునియొకఁ డుండెను. ఆ తపోధనుఁడు వారినిఁ జూచి, 'కాకుత్థ్సులారా, నన్నుధర్మభృత్తని పేర్కొందురు, నేనీ యాశ్రమంబున నుందు; మీ యడుగనున్నది గ్రహించితిని. ఈ తటాకంబును మాండకర్ణమహర్షి నిజ తపోబలంబున నిర్మించెను. దీనిని బంచాప్సరస్సని చెప్పుదురు. ఇందు నిరంతరంబు గీతావాద్య మధుర రుతంబులు వర్తిల్లుచుండును. ఏల యందురా? ఆ మహర్షి వాయుభక్షణ మాత్రుఁడై నీట నిలిచి దశసహస్ర వర్షంబులు ఘోరతపంబొనర్చెను. వానికి వైశ్వానరాది దేవతలు కుతిలపడి తత్తపో విఘ్నార్థము చంచలలఁబోని యచ్చరమచ్చెకంటుల నేవురఁ బంపిరి. వారు సురకార్యనిమిత్తం బతనిని మోహవివశునిఁగాఁ జేసి వానికి భార్యలైరి. వారికిగా నంతర్గృహ మిందు నిర్మింపఁబడెను. ఆ నిలింపవేశ్య లందు నివసించి యీ ఋషిని మధురగీతంబుల వినోదించుచుందురు. గీతానాదఁ బా కాంతామణుల భూషణధ్వనులతో మేళవించి యిట్లు మనోహరంబుగా నెనసగుచుండు' ననెను.

రామాదులు మునిపల్లెలో పదియేండ్లుగడపి
సుతీక్ష్ణమహర్షియాశ్రమంబు చేరుట

రామలక్ష్మణులు మరలి వచ్చి సీతాదేవికి వివరంబు వినిపించి మరల దారిఁబట్టి కొంతదూరము చనిరి. అట మఱియొక యాశ్రమంబు గానవచ్చెను. వారమ్మునిపల్లెను జొచ్చి యందలి ఋసుల పూజలంది యాచోటు తమకు నివాసయోగ్యంబుగా భావించిరి. మునులు దమ కడగండ్లు వారికి నివేదించి సంరక్షణముఁ గోరిరి. రాముఁడా మునుల రక్షణార్థంబచ్చట భార్యాలక్ష్మణుల తోడఁ బదివత్సరంబులు పుచ్చి యనంతరము సుతీక్ష్ణమహర్షి యాశ్రమమునకు మరలి వచ్చి యందుండెను.

ఇట్లుండఁగాఁ గొండొకనాఁడు రాముఁడా మునీంద్రునకు నమస్కరించి, 'మహాత్మా, అగస్త్యభగవానుం డీవనమందుండు నని విందుము. ఆ మహానుభావుని శుశ్రూషింపఁ బెద్దయుఁ గోరుదుము. ఏ మార్గంబున నటకుఁ బోనగునో' యనెను. సుతీక్ష్ణమహర్షి యది విని, 'వత్సా, నా చెప్పనున్నది నీవే ప్రస్తావించితివి; ఇటకు నాలుగు యోజనంబుల దవ్వున నగస్త్యుని భ్రాత సుదర్శన మహాముని గలఁడు. ఈ దారినఁ జన్నచో వాని యాశ్రమంబును జేరుదురు. మీ దారిలో నెచ్చట పిప్పలీవృక్షంబులు దట్టముగా నుండునో యాచోటే వాని యాశ్రమము. అందొకరాత్రి పుచ్చి ప్రాతఃకాలంబునఁ దరలి దక్షిణాభిముఖంబుగా యోజనదూరము పొమ్ము; అగస్త్యుని యాశ్రమముఁ జేరుదు' రని చెప్పెను.

సుదర్శనాశ్రమము

రాముఁడు భార్యాలక్ష్మణసహితుఁడై బయలుదేరి పోసాగెను. కొండొకచోటఁ బిప్పలీగంధబంధురంబులైన మారుతంబులు కటుకోదయములై వీచెను; కాష్ఠరాసులందందుఁ గానవచ్చెను. దర్భాంకురములు వైడూర్యకాంతుల మఱపించుచు విదీర్ణములై యుండెను; అగ్నిహోత్రధూమపటలంబు కృష్ణాభ్రశిఖరంబుగాఁ దోఁచెను; మునికుమారులు వివిక్తతీర్థస్నాతులై పుష్పోపహారంబులను గోసి తెచ్చుచుండిరి. ఆ లక్షణములఁబట్టి యదియే సుదర్శనాశ్రమంబు కానోపునని రాముఁడు నిశ్చయించి యిట్లనియెను:

ఇల్వలవాతాపులు

'లక్ష్మణా, ఇచ్చోటు అగస్త్యభగవానుని మాహాత్మ్యము నేఁడును బ్రకటించుచున్నది. సంగతి వినుము. ఇల్వలవాతాపులను రక్కసు లిరువురుండిరి. ఇల్వలుఁడు బ్రాహ్మణవేషధారియై సంస్కృతము భాషించుచు శ్రాద్ధార్థము బ్రాహ్మణులను నిమంత్రించుచు, వారు వచ్చినంతనే మేషరూపంబున నున్న తన తమ్ముని వాతాపిని వధించి శ్రాద్ధదృష్టకర్మపూర్వకంబుగా నిమంత్రితులకుఁ గుడువఁ బెట్టుచుండెను. వారు నమ్మి భుజించుచుండిరి. భోజనానంతరము, 'వాతాపీ! ఇఁక రా' యని యిల్వలుఁడు పిలుచుచుండెను. ఆమాటతోడ వాతాపి మేకవలె నఱచుచు నిమంత్రితుల యుదరకోశంబులు వ్రచ్చి వెలువడుచుండెను. ఇట్లు వేనవేలు బ్రాహ్మణులు మడియుచుండిరి. ఈ ఘోరకృత్యంబును దేవతలు సహింపలేక యగస్త్యమహర్షినిఁ బ్రార్థించిరి. ఆ ఋషి చంద్రుఁడు సురలప్రణయంబు నంగీకరించి కొండొకనాఁ డారక్కసుల నిమంత్రమియ్యకొని యటకుఁ బోయెను. వారు యథాపూర్వ మాచరించిరి. భోజనానంతరం బుత్తరాహోశనమిచ్చి 'వాతాపీ, రా' యని యిల్వలుఁడు పిలిచెను. మహర్షి నవ్వి, 'ఇంకెక్కడి వాతాపి! వాఁడు నా యుదరంబున జీర్ణించి యమసదన మొందె'ననెను. తమ్ముని దుర్మరణంబునకు నిల్వలుఁడు దురాగ్రహ మొంది యగస్త్యుని పయి నుఱికెను. ఆ ఋషిసత్తముఁడు వానిని దన నేత్రానలంబున బూదియొనర్చెను. అగస్త్యభగవానుఁ డట్లొనర్చి యీ దక్షిణదిక్కును ఋషిజనవాస యోగ్యంబు గావించెను. నాఁడుసుత నింకు మునిపల్లెలు వెలసె'ననెను.

అంతలోన,

'తే॥ గీ॥ గగనహరినీలశైల శృంగంబునుండి,
డొల్లిపడెఁ బ్రొద్దు జేగుఱుఁగల్లువోలెఁ;
దన్నిపాతసముద్భూత ధాతుఫాళి
చందమునఁదోఁచె దివసావసానసంధ్య.
కోమలతామ్రధూళికల క్రొవ్వెఱసంజకుఁ బ్రోదివెట్ట ని
స్సీమకఠోరతారరుచిఁ జెట్టుపలార్చుచు నల్లెలెత్తి వి
శ్రామమపోలెఁ గూసె విలసచ్చరమాచలకూటపక్కణ
గ్రామటికాకుటీరశిఖరంబులఁ గుక్కుటచక్రవాళముల్."

అట్లు సూర్యాస్తమయంబగుట రాముఁడు తమ్మునితోడ వార్చి వచ్చి సీతాదేవిని వెంటఁగొని యాశ్రమము ప్రవేశించి సుదర్శనమహర్షికి

మ్రొక్కి వాని సత్కృతులంది యారాత్రి యందుఁగడపి వఱువాత యగస్త్యాశ్రమమార్గము ద్రొక్కెను.

అగస్త్యాశ్రమము

వారు కొండొకదూరముచని యరణ్యాంతరము సొచ్చిరి. ఆ కాంతారము పనసతాలవంజులధన చిరిబిల్వతింత్రికాదిమహోన్నత వృక్షనిబిడమై, యేచివిదిర్చి యల్లిబిల్లిగనల్లుకొని పూగుత్తులభరంబున వంగి నునుగాడ్పులకు మెలమెల్ల వీచుచున్న కలికిపొదరిండ్లు గిలిగి, నయనోత్సవము గొలుపుచుండెను. శాఖాంతరములు వానరమయములై వినోద మొదవించుచుండెను. ఆ వనమధ్యప్రదేశము చీరమాలాపరిష్కృతంబును ధూమాకులమునై యాశ్రమమగుట సూచించెను. రాముఁడాచిహ్నంబుల నుపలక్షించి, 'లక్ష్మణా, అదిగో చూడుము.

సీ॥ శుకములుచదివెడి సామగానంబుల
వినుచు మత్తేభముల్ దనక విందుఁ,
గరికరోత్క్షిప్తశీతకరణముల కాంక్ష మై
తచ్ఛాయ సింహముల్ బాయకుండు,
సెలయేటినీరముల్ కలసిత్రాగుచు నిందు
వ్యాఘ్రమృగంబులు వఱలుచుండు,
మూషికౌమార్జాలములుగూడి బలియిచ్చు
నీవారపిండముల్ నెమ్మిగుడుచు

ఆ॥ వె॥ సహజవైరమేది సఖ్యంబు వాటించి,
కలసిమెలసియిట్లు గ్రాలుచున్న
యీమృగాళియునికి నీక్షింపఁగా నింగు,
మానిశక్తిచోద్యమయము గాదె?

తమ్ముఁడా, ఏ మహాత్ముఁడు వింధ్యునిగర్వం బడంచి సూర్యమార్గనిరోధంబును బాపి లోకంబులకు మహోపకారమొనర్చెనో, ఏ తేజస్వీపేరు విన్నంతనే రాక్షసులు దక్షిణదిక్కువంకనైనఁ దలఁ ద్రిప్పరో, ఏ పుణ్యశాలి యింద్రుండుటంజేసి మహర్షులకు రక్కసిబాధలు తీఱెనో, ఏ సర్వభూతహితుండు లోకహితార్థము చిరజీవిత్వంబును గ్రహించెనో, ఏ మహిమోన్నతు నిందుపాసించుచు దేవగంధర్వసిద్ధచారణాధులేగాక పక్షులు సయితము నిరాహారాది తపోనిష్ఠలఁ దవిలియుండునో, ఏ సంయమీంద్రునికడఁ దపస్సిద్ధులైనవారికిఁ దివ్యదేహంబులతో సూర్యతేజోమయవిమానాధిష్ఠానపూర్వక స్వర్గా

రోహణంబు సంప్రాప్తించుచుండునో, మృషావాదిగాని క్రూరుఁడుగాని శఠుఁడుగాని నృశంసుఁడుగాని కామవృత్తుఁడుగాని యెవని యాశ్రమంబు ద్రొక్కి జీవింపఁడో, యయ్యగస్త్యభగవానుని యాశ్రమముఁ జేరితిమి. ఇందు భక్తితో భగవదారాధనంబు చేయువారికి సర్వాధిపత్యంబులు స్వతస్సిద్ధంబులగును. మనమిం మునిసేవలఁ దగిలి వనవాసక్లేశంబులు నిందుఁ బుచ్చుదము.

''చ॥ వుడిసిటఁబట్టి నేతపసి పొంగుపయోనిధి నిల్వలానుజు
గడుపునవేల్చి నేతపసి, గాఢతపోనిధి నే యగస్త్యునిఁ
బొడగని వింధ్యభూధరము పొంకము బింకము దక్కి నేలలో
నడఁగి బిలాంతశ్శలిని'' నట్టిమహాత్ముని గొల్వ మేలగున్॥

అని పలికి తమరాక నెఱిఁగించుటకై వాని నా ఋషీంద్రునొద్దకుఁ బంపెను.

లక్ష్మణుఁడు పోయి యాశ్రమద్వారమంచున్న మునిశిష్యుని జూసి, 'ఆర్యా, దశరథరాజజ్యేష్ఠకుమారుఁడు రాముఁడు భార్యా సహితుండై మహర్షి దర్శనార్థము వచ్చియున్నాఁడు. నేను వాని తమ్ముఁడను; నా పేరు లక్ష్మణుఁడు; అన్నకు భక్తిహితంబు లొనర్చుచు వాని వెంటనుంటి' ననెను. ఆ మునికుమారుఁ డది విని గురువు నొద్దకుఁ బోయి యతనికి సంగతి వినిచెను. అగస్త్యుఁ డామాటవిని మహా సంతోషమంది, 'రాముని బహుకాలంబుగా నిరీక్షింతును; నా కోరిక నేటికి సఫలమయ్యెను; వత్సా! తడయక వారిని దోడ్కొని ర'మ్మని చెప్పెను; రాముఁడంతట సీతాలక్ష్మణ సహితుండై మునికుమారుని వెంటఁ జని ప్రశాంతహరిణకంబైన యాశ్రమాంతరంబుఁ జొచ్చి యొక్కొక్కటిగా బ్రహ్మస్థానంబు నగ్నిస్థానంబును విష్ణుస్థానంబును మహేంద్రస్థానంబును సూర్యస్థానంబును సోమస్థానంబును భగస్థానంబును గుబేరస్థానంబును ధాతృవిధాతృస్థానంబును వాయుస్థానశేషస్థానంబులను ననంతునిస్థానంబును గాయత్రీస్థానంబును వసువరుణకార్తికేయ స్థానంబులను సందర్శించుచుఁబోయి, శిష్యగణపరివృతుఁడై యెదురుగా వచ్చిన మహర్షికి భార్యాసహోదరపురస్సరంబుగా నమస్కరించెను.

అగస్త్యుఁడు వారికి నర్ఘ్యపాద్యంబులిప్పించి కుశలప్రశ్నంబులు గావించి వైశ్వదేవముచేసి వానప్రస్థధర్మప్రకారము ఫలమూలాహారంబు లొసఁగి, 'రామా, ఋషుల యతిథిపూజలు వైశ్వదేవపూర్వకంబుగా నుండవలయును. అట్లు చేయనివాఁడు కూటసాక్షివలెఁ బరలోకంబున

శ్వమాంసభక్షకుండగును. సర్వలోక ప్రభుండవును మహారథుండవును బరమధార్మికుండవును మీఁదుమిక్కిలి మహామాన్యుండవును నైన నీవు ప్రియాతిథివైన వేళఁ జెప్పవలయునా?' అని పలికి హేమరత్న విభూషితమైన శరచాపతూణీరంబులను లోపలి నుండి తెప్పించి, 'రామా, ఈ వింటిని విశ్వకర్మ నిర్మించి విష్ణువునకిచ్చెను. ఆ మహనీయుఁడు దానిని నాకనుగ్రహించెను. ఈ బాణంబులు బ్రహ్మదత్తములు; మఱియు నక్షయంబులు; ఈ తూణీరఖడ్గంబులను దేవేంద్రుఁడిచ్చెను. తొల్లి విష్ణుదేవుండీ ధనుస్సహాయంబుననే యసురులను నిర్జించి సురరాజ్యశ్రీని మరల దేవతలకుఁ గైవశమొనర్చెను. వీనిని నీవు ప్రతిగ్రహింపు'మని యవియెల్ల నిచ్చి, 'నాయనా, స్వీన్నములైన మీ యంగకంబులు మీ బడలికలను దెలుపుచున్నవి. ఈ జనకరాజసుత పరమ సుకుమారి. భర్తస్నేహంబునఁ జేసి వనక్లేశంబులు వరించి వచ్చెను. ఈ కళ్యాణికి నాశ్రమ నివాసంబు సతతసమగున ట్లొనర్పుము. భర్తలు మంచిస్థితినున్నప్పుడు భార్యలు తమ యనురాగంబులఁ గురిపింతురు; పతులకు విషమస్థితి సంఘటించువేళ పత్నులు నిర్దాక్షిణ్యముగా వారినిఁ ద్యజింతురు. స్త్రీ స్వభావ మిట్టిదై యుండును. స్త్రీలబుద్ధి చంచలకన్నఁ జంచలమై శస్త్రధారకన్నఁ దైక్ష్ణ్యమై వేగంబున వాయువును గూడ మించును. నీ భార్య యట్టిదిగాదు. ఈమె లోకవిలక్షణయగుట తచ్చారిత్రమే వెల్ల డించును. ఈ పతివ్రతామణి యరుంధతీదేవివలె సర్వలోకశ్లాఘ్యయై పసమీఱుఁగాక. మీరు మువ్వురిందు వచ్చుటఁ జేసి యీ దేశము పరమ శోభను గాంచె' ననెను. రాముఁడా మాటలు విని, 'మునీంద్రా! మీ యనుగ్రహంబునకుఁ బాత్రుల మగుటఁ జేసి మేము ధన్యులమైతిమి. జలసమృద్ధంబును బహుకాననంబునైన చోటొకటి సెలవిత్తురేని మేమందు సుఖనివాసార్థ మాశ్రమపదంబును నిర్మించుకొందు' మని యడిగెను. 'నత్తా, ఇటకు యోజనద్వయదూరంబున బంచవటి యను పేరి ప్రదేశంబుగలదు. అది బహుమూలఫలోదయమై సిరులపట్టుగా నున్నది. ఆ చోటు మీ కోరికకుఁ దగియుండును. రామా, నీ ననవాస కాలంబు చాలఁ గడచెను. అచిరమే నీవు సముత్తీర్ణ ప్రతిజ్ఞుండవై రాజ్యశ్రీని బడయుదువు. దశరథుఁడు నాకుఁ బరమమిత్రుఁడు. ఆ కారణంబున నీ వృత్తాంతమెల్ల యోగదృష్టిం జూచితిని. రామా, నీ విందుండుట నాకెంతయు సంతసమగును. అయినను నీ యభిమతంబు వేఱుఁగాఁ దోఁచుచున్నది. దానంజేసి పంచవటిని బోర్కొంటిని. దాని చెంత

గోదావరీ నదియుఁ గలదు. ఆ నదీతీరంబు మీాయుంటకు నెంతయు ననుకూలించును. అదిగో మధూకవనంబు. దాని యుత్తరపార్శ్వంబునఁ జనుము; పెద్ద మట్టివృక్షంబు గానవచ్చును. దాని మీాఁదుగాఁబోయినఁ బర్వత మొండు గలదు. ఆ కొండ ప్రక్క పంచవటి యున్న'దని యా తాపసి పలికెను.

జటాయు సందర్శనము

రామాదులంతట నమ్మునిని వీడ్కొని పంచవటికిఁ దరలిరి. మార్గమధ్యంబున వారికి మహాకాయంబును భీమపరాక్రమంబును గల గృధ్ర మొండు గానవచ్చెను. వాఁడు దానిని జూచి రాక్షసుండని తలంచి, 'ఎవండవు నీ'వని యడిగిరి. నావ్యుఁడు, 'రాఘవా, నీ తండ్రికి దశరథునకుఁ జిరమిత్రంబునగుదు. కశ్యపప్రజాపతివంశ్యుండును వినతాతనయుండు నైన యరుణుండను వానికి శ్యేనియందు సంపాతి జటాయున్నులను వేరి సుతులిద్దఱు జనించిరి. అందు సంపాతి పెద్దవాఁడు; నేను రెండవ వాఁడను. ఈ కాంతారంబు క్రూరమృగసంకీర్ణంబును రాక్షససేవితంబునై మహాభయంకరంబుగా నుండును. ఇందు వసింప మీాఱు వచ్చితిరి. నా వలన నీకుఁ బ్రయోజనంబుగలదు. నీకు సహాయంబుగా నిందు నుందు' నని యా జటాయువు చెప్పెను. రాముఁ డాగృధ్రరాజంబు కెంతయు సంతసించి వానివలనఁ దనతండ్రికతలు వినుచుఁ బంచవటికిఁ బోయెను.

పంచవటి

రాముఁడు పంచవటిని గలయఁజూచి, 'లక్ష్మణా, శ్రీగంధవృక్షంబుల నెత్తావులిందుఁ గ్రందుగానున్నవి. కమలాకరంబులు హంసకారండవ చక్రవాకాకరంబులై సొంపుఁ దలిర్చుచున్నవి. అదిగో గోదావరీనది. సౌమిత్రీ, ఇందు గైరికాదిధాతుకాంతిప్రసారంబున మత్తేభదేహంబులు గవాక్షచిత్రితంబు లట్లు దోఁచుచున్నవి. తాలతమాలాది నానావృక్షంబులు వివిధపుష్పలతా వృతంబులై నేత్రోత్సవంబును గూర్చుచున్నవి. ఇందు మనము జటాయువుతోడ వసింపనగు' నని పలికి యందు నివాసయోగ్య ప్రదేశంబును నిర్ణయించెను.

లక్ష్మణుండంత మట్టితో గోడలుకట్టి వెదురుకంబంబులు నాఁటి జమ్మివాసములు పఱచి తెల్లు గప్పి పర్ణశాలను సిద్ధపఱచి గోదావరీ తీర్థంబులఁ గ్రుంకి శుచియై కమలంబులును ఫలంబులును గొనివచ్చి

వాస్తుపూజాశాంతు లొనర్చెను. రాముఁడు ప్రియాసహితుండై పర్ణ శాలను బ్రవేశించి, 'లక్ష్మణా, ఉపచారంబులవలనఁ దండ్రిని మఱిపించి తివి,' అని వానికిఁ బరిష్వంగ పారితోషికంబిచ్చెను.

ఋతు వర్ణనము

అట్లు వారు పంచనటియందు సుఖంబుగాఁ గాలముఁ గడుపుచుఁ గొండొకనాఁడు స్నానార్థము గోదావరికిఁ దరలిరి. లక్ష్మణుఁడు రాముం జూచి, 'అన్నా! వసుంధర సస్యశాలినియై సొబగారుచున్నది; లోకుల శరీరంబులు నీహారపరుషంబులయ్యెను; అగ్ని దేవుండెంతయు సుభ గుఁడుగా మన్నింపఁబడుచున్నాఁడు. సత్పురుషులు దేవతాప్రీత్యర్థము నూత్నధాన్యంబులు యజించి కృతాగ్రయణకులై కల్మషంబులను బాసిరి. జనపదంబులు సమస్తపదార్థసమృద్ధంబులయ్యెను. గోవులు కుండలం బితుకుకుచున్నవి. విజిగీషాపథుల ప్రచారంబులు మెండయ్యెను. దక్షిణదిశ సూర్యసేవితయై వెలసెను. ఉదీచి శూన్యలలాటయగు నెలంతుకవలె నున్నది. హిమవంతుఁ డన్వర్థాభిధానుఁ డయ్యెను; తరుచ్ఛాయాసలిలంబులు రుచింపవు; ద్విరదంబులు శీతోదకంబులదాఁకి తుండంబులను మోడ్చుచున్నవి. భీరువులు రసభూమిండాసియుఁ బ్రాణం బులకు వెఱచి నిలుచునట్లు జలచర విహంగంబులు దరి చేరియు నీరుం జొఱవు. అరణ్యంబులు శూన్యములై గాన్పించుచున్నవి. దివంబులు మంచుగప్పి చెలువు దొఱంగెను. రాత్రులు హిమారుణంబులై పొడవు దాల్చి ప్రణయినీజన దూషణభూషణంబు లందుచున్నవి. చండభానుఁడు హిమధామని మనోహరత్వ దర్శనీయత్వంబుల నెఱవ్రగొని తన మిత్ర నామంబు నన్వర్థపఱుచుచున్నాఁడు. చంద్రమండలంబు తుషారుణమై నిట్టూర్పులావిరిగప్పిన యద్దంబువలె నున్నది. పూర్వాహ్ణంబులు నిర్వీర్యములు; మధ్యాహ్నంబులా పాండురాతప శోభాపరిణతములై సుఖస్పర్శముగానున్నవి. పడమటి గాడ్పులు మంచువలనం జేసి రెట్టించిన చల్లదనంబుతో వీచుచున్నవి. ఇనావలోకంబునకు సిగ్గుపడియోయన వనసీమ యావిరిముసువుం గప్పెను. కేదారంబులు పండి ఖర్జూర పుష్పంబులంబోని తండులంపు వెన్నుల బరువువలనఁ బఱచి భూమిపయిం బంగారుదాఁపిరో యనుశంకను గలిగించుచున్నవి. పచ్చికబయళ్ళు మంచు గప్పి లేయెండకు వింతవన్నె లీనుచున్నవి. తరువులు విలు వితప్రసూనంబులై మంచుఁ జీకటిలోఁ బుష్పాతులను మోడ్చి నిద్రించుచున్నవోయనఁ దోచును. తరంగిణులు బాష్పసంఛన్న

సలిలంబులగుటంజేసి సారసవిహంగంబులు పరస్పరముఁ గంఠధ్వనుల నలన గుఱుతించుకొనుచున్నవి. తామరలు జరాజర్జితంబులై కర్ణికాకేసరంబులను రాల్చి నాళమాత్రావశిష్టంబులగుట వలనఁ గమలాకరంబులు సౌందర్య కమలాకరంబులు గావు. అన్నా! శరదృతువు చని హేమంతము వచ్చుటనుఁ బ్రకృతి యెన్ని విధముల బోధించుచున్నదో చూచితివా?' యనెను.

ఆ ఋతువర్ణనంబును సీతారాములెంతయు మెచ్చుచు సౌమిత్రి వెంటఁజని తోయంబులాడి దేవతలకును పితృదేవతలకును దర్పణంబు లర్పించి యప్పుడప్పుడే పొడిచివచ్చుచున్న సూర్యభగవానునకు నమస్కరించి యాశ్రమముఁ జేరిరి.

శూర్పణఖ

అట్లు వారు పంచవటి నుండఁగా నొకనాఁడు రక్కసి యొత్తుక యటకు వచ్చి పుంమోహనమూర్తియైన రాముని జూచి డాయంజని, 'ఆర్యా! నీ వెవండవు? జడలు దాల్చి వల్కలంబులు గట్టి తాపసివలెఁ గాన్పింతువు; హస్తంబున ధనుర్బాణంబులు వెలయుచున్నవి. మఱియు భార్యాద్వితీయుండవైతివి. ఈ వింత యేమి? రాక్షససేవితంబైన యీ మహారణ్యంబున కేలవచ్చితి'వని పలికెను. రాముఁ డా రక్కసికి నిజ వృత్తాంతంబును వినిచి నీ వెవ్వ రెవని యడిగెను. నావుఁడు, 'రామా! నన్ను శూర్పణఖ యందురు. కామరూపిణినై యిందు విహరించుచుందును. నా పేరు విని గుండియలు వ్రీలని ప్రాణియుండదు. మహాబలపరాక్రమశాలియైన రావణుని విందువుగదా. ఆ శూరుఁడును కుంభకర్ణవిభీషణ ఖరదూషణులును నేనును విశ్రవసునకు జనించితిమి. నీ రూపలావణ్యంబులు నన్ను మోహసాగరంబునఁ ద్రోయుచున్నవి. నిన్ను భర్తగా వరించితిని. అలఁతినిగా నన్ను భావింపవలదు. నా ప్రభావ మింతనరాదు. స్వచ్ఛందబలశాలినినైన నన్నుఁగూడి చిర సుఖంబులు చూఱలాడుము. ఈ సీతాలక్ష్మణులు మర్త్యమాత్రులు; వారిని త్రుంగివైతును. మనమిరువురము నిష్టాగోష్ఠినుండ నొప్పు'నని.

రాముఁడు దరహాసకందళిత వదనారవిందుఁడై, 'శూర్పణఖా! తెలిసియో తెలియకయో యీ యింతిని పెండ్లాడితిని. నీ యట్టి నారీమణులు సవతితోడియునికి నోర్వరు. ఇతఁడు నా తమ్ముఁడు లక్ష్మణుఁడు భార్య నింట వదలివచ్చెను. ఎల్లవిధంబుల నితఁడు నీకు భర్తగాఁదగును;

సవతిపోరుగూడ నీకుఁ దప్పఁ'ననెను. శూర్పణఖ యీ మాటలు నమ్మి, 'లక్ష్మణా! నన్నుఁగూడి దండకారణ్య విహరణోత్సుకుండవై భోగంబుల పసఁగాంచు' మనెను. సౌమిత్రి యల్ల నవ్వి, 'శూర్పణఖా! దాసుని భార్యకు దాస్యము తప్పదుగదా! నా యన్నకు నేను దాసుఁడనై యుందును. నన్నుఁ బెండ్లాడుట దాస్యంబును నీవు వరించుట యగును. వ్రతము చెడినను సుఖము దక్కవలదా? నాయన్న సర్వార్థ సిద్ధుఁడు. వానికి భార్యవై సుఖింపుము. ఆయన నీ పొందుగాంచి యసతియు విరూపయుఁ గరాళయు నిర్ణతోదరియు మీఁదుమిక్కిలి ముదుసలియు నైన సీతాదేవిని తటిమివైచును. వరవర్ణినీ! నీవంటియందకత్తెను గన్న కంటికి మర్త్యభామిని యింపుఁ గూర్చునా?' యనెను. మేలమెట్టిదో యెఱుంగని యీ పొలసుదిండి రామునివంక మఱలి, 'రోఁతరోయు చున్న యీ ముదుసలి పెండ్లాము మ్రోల నేను కానైతినా? సపత్నీ కుండనను బెంగ కలదేని దీనినిప్పుడే మ్రింగి యీ నెంజలి తీర్తు'నని విజృంభించి క్రూరగ్రహము రోహిణింబలె సీతాదేవిపైకి నుఱికెను. ఆ దుండగంబునకు రాముఁడు కనలి, 'తమ్ముఁడా! అనార్యలతోడఁ బరిహసింపరాదు. వైదేహి యీ ముప్పదప్పి బ్రదుకఁజూడుము. ఇది మదోన్మత్తయై యున్నది. దీనిని విరూపగా నొనర్చి తఱువు'మనెను. లక్ష్మణుఁడు కత్తిదూసి యీరక్కసి ముక్కును జెవులను దటిగెను. అది ప్రావృట్పయోధరంబువలె గర్జించుచు రక్తధారలు స్రవించుచు హుటాహుటిం బఱువెత్తి జనస్థానము చేరి యందు రాక్షసులతోడఁ బేరోలగంబున్న తన యన్న ఖరునియొడిలోఁ బడి వాపోవసాగెను.

జనస్థానము - ఖరాసురుఁడు

ఖరుఁడు తన చెలియలికిఁ గ్రోధదుర్నిరీక్షణుండై, 'సోదరీ! మోహసంభ్రమంబులు మాని సంగతి చెప్పుము. ఏ వెట్టి మిన్నకున్న దానిని త్రాచును లీలార్థము చెనకెనో, ఏ యంధుఁడు నిజకంఠగతమైన కాలపాశంబు నెఱుంగఁడో, ఏ మూఢుఁడు నీస్పర్శరూపకాలకూటంబును గ్రోలెనో, యీ నిర్భాగ్యుని జెప్పుము. దేవగంధర్వ భూతంబులుగానీ మునిప్రముఖ్యులుగానీ తుదకా సహస్రాక్షుండుగాని నన్నపకరించి మనఁజాలరు. ఎవని ప్రాణంబుల నూటాడవలయునో ఎవని మాంసంబున విహగవ్రాతంబునకు విందొనర్పవలయునో, ఎవని రక్తంబున ధాత్రీ సంతర్పణము గానున్నదో యీ క్రూరాత్ముని బలుకుము. మృత్యువడ్డు వడినను దక్కృపణుండింక బ్రదుకనోపఁడ'ని సింహస్వరంబున వచించెను.

శూర్పణఖ కన్నీరు నించుచు, 'అన్నా! ఏమిచెప్పుదు? ఎవరో యిద్దఱు తరుణవయస్కులు మన వనముం జొచ్చిరి. వారి రూపసంపద యిట్లన రాదు; ఎంతో సుకుమారులుగాఁ దోతురు. వారి బలంబన్ననో యచింత్య మహోన్మత్తంబుగానున్నది. ఏలనో వారు జటావల్కలాజినంబులు ధరించి తాపసవృత్తి ననలంబించి కందమూలానుశనులై చరించు చున్నారు. వారు దశరథ మహారాజకుమారులఁట; రాము లక్ష్మణులను వారఁట. వారు దేవతలో నరులో యూహింపరాదు. వారివెంట సర్వాభరణభూషితయైన యింతి యొయ్యగలదు. అట్టి సుందరీలలామ యెందును గానరాదు. సాబగులెల్ల మూర్తీభవించి యీ యింతి రూపంబున సభ్యుదయించెనోయని తలంతును. ఆ కాంతామణి కారణంబున వారు నాకిట్టి దురవస్థను గలిగించిరి. ఆ మువ్వురి క్రొవ్వేడి నుదువు నెత్తురు త్రావినఁ గాని నా తాపంబు తీఱదు. నా యీప్సితం బొనర్పవా?' యని రోదన మొనర్చెను.

ఖరుఁడు రామునిపైఁ బదునల్వుర రక్షోవీరులఁ బంపుట

అది విని ఖరుఁడు రోషభీషణుండై ప్రళయాంతకులం బోని రక్షోవీరులను బదునల్వురఁజూచి, 'నిశితాశనులారా! సంగతి వింటిరిగదా. ఆ దురాత్ములను ఖండఖండంబులుగాఁ దుండించి భూతంబులకు బలిపెట్టి యీ యింతిని గృహాంతనంతిపురికిఁ బంచిరమ్ము. వారి రక్తపానంబున గాని నా చెల్లెలి తాపము తీఱ'దని యాజ్ఞాపించి వారివెంట శూర్పణఖను బంపెను. ఆ మాటతోడ వారు మేఘవేగంబునఁ బంచవటికిఁ బోయి యచ్చట సముదగ్ర తేజోవిరాజితుఁడై యున్న రాముని జూచి దావాగ్నికి గజంబులువోలె వెఱగందిరి. రాముఁ డా రక్కసులను శూర్పణఖను గాంచి, 'లక్ష్మణా! ఇంచుక తడవు సీతయొద్ద నుండుము; ఈ రాక్షసుల పీఁచ మడంచి వత్తు'నని పలికి చామీకరవిభూషితంబైన కోదండంబు నెక్కుపెట్టి యసురులనుడాసి, 'రాక్షసులారా! మేము దశరథాత్మజులము; మమ్ము రామలక్ష్మణులందురు. ఈబిడ జనకరాజసుత సీత; ఈ యింతిని వెంటఁగొని దండకారణ్యంబునకు వచ్చితిమి. ఇందుఁ గంద మూలంబు లారగించుచు జితేంద్రియులమై తపోధర్మంబులఁ దవిలి యుందుము. మా జోలికి రావలదు. సాధుజనహింసకులను బరిమార్చు కార్యమందు ఋషిజనము మమ్ము నియోగించెను. ప్రాణంబులు తీపగు నేని యిందుండి చనుమ'ని చెప్పెను. ఆ రాక్షసు లమ్మాటలకు మహా కుపితులై శూలంబులు త్రిప్పుచు, 'మా తోనికి ఖరునకు నిష్కారణంబుగా

నాగ్రహంబుఁ బుట్టించితిరి. మీ ప్రాణహరణంబునఁగాని వానికిఁ దాప శాంతిగూరదు. సరాధమా! ఈ ప్రల్లదంబులేల? మా యెమట నిలువ నైన నోర్తువా? ఇదిగో చూడుము మా శూలంబులు నీ వింటిని ద్రుంచి నీ ప్రాణంబులను హరింపనున్న'వని పలుకుచు రాముని గదిసి తమ శూలంబులను విసరిరి. రాముఁడు వారి శూలంబులఁ బదునాల్గింటిని బదునాల్గుశరంబులఁ ద్రుంచి కోపోద్దీపితుఁడై వెండియుఁ బదునాల్గు బాణంబులను సంధించి యాకర్ణాంతముఁ దివిచి విడలెను. ఆ భల్లంబులు వారి వక్షోభాగంబులను భేదించి రుధిరప్లుతములై దూసి నేల వ్రాలెను. వారు భిన్నమూలంబులగు వృక్షంబులక్రైవడి గూలిరి.

ఖరుని యుద్ధ సన్నాహము

వారి పాటునకు శూర్పణఖ బెగడొంది వికృతారావము గానించుచు ఖరునొద్దకుఁ బరుగెత్తి, 'అన్నా! నీ శూరులు రామబాణ నిహతులై ద్రెళ్ళిరి. వాని పరాక్రమంబునకు భయమునుగుచున్నది. పరిత్రాసతరంగమాలికా సంకులంబును విషాదమకరాభీలంబునైన శోక సాగరంబునఁ గ్రుంగిన ననున్ను రక్షింపుము. నాకుఁగావచ్చి చచ్చిన నీ యనుచరులయెడ నీకుఁ బ్రీతి కలదేని యప్రతిహతబలపరాక్రమశాలి వేని రాక్షసకంటకుని రాముని రూపుమాపి దండకారణ్యంబును నిర్వైరి వీరవంత మొనరుపుము. ఒండుచో నీ వ్రేమాల నిప్పుడే యసువులు త్యజింతును. అన్నా! ఊఱకుందువేల? రామునకు నెఱతి వ్రుగాఁబోలు. కాదేని చెల్లెలిపాటుఁ గన్నారఁ గాంచుచు శూరుఁడిట్లుండునా? అన్నా! అల్పవీర్యవంతులకు జనస్థానము యోగ్యముగాదు. ఇంచుండి మనము సబాంధవంబుగాఁ బఱచి ప్రాణంబులు దక్కించుకొందమురండు; విలంబము వలదు; రాము తేజంబు మిమ్మెల్ల భస్మీకరింపనున్న'దని పొడపుమాటలాడి యొమ్మో మోఁదికొనుచు విలపించుచుఁ బెనురోద గావించెను. ఖరుఁడా యవమాన వచనంబులకుఁ గ్రోధవినశుండై, 'సోదరీ! మృత ప్రాయుండైన సరాధముని బీరంబింత పెద్దసేసి పలుకనగునా? వాని దుశ్చరితమే యతని ప్రాణంబులను మ్రింగనున్నది చూడుము. మంద జీవుఁడు వాఁడు నా వ్రేటు దిని మనఁడు; వాని వేడినెత్తురు నీ చేతఁ దనివారఁ గ్రోలింతు' నని యా యింతి నోదార్చి తన సేనానాయకుని రావించి, 'దూషణా! నీలజీమూతవర్ణులును సమరకాలురును మన్ననో నువర్తులునైన రాక్షసవీరులు సదునాల్గువేలుగలరు. వారినెల్ల యుద్ధ సన్నద్ధులఁ గావించి నా రథంబును ధనుర్బాణఖడ్గంబులతోడను వివిధ

శక్తులతోడను సమాయత్తమొనర్పుము. నా రణపాండిత్యంబును రాముఁడు గ్రహించుఁగాక; పౌలస్త్యవంశకీర్తి దీపించుఁగాక' యని యాజ్ఞాపించెను.

దూషణుఁడు చని మేరుశిఖరాకారంబును దప్తకాంచనభూషణాలంకృతంబును హేమచక్రవిరాజితంబును వైడూర్యమణిరచితకూబరంబును నానావిధసువర్ణమంగళప్రతిమాభిరామంబును నైన రథోత్తమంబును సాయుధంబుగాఁ దెచ్చెను. దానివెంట రాక్షసవీరులు పదునాలుగువేలమంది ముద్గరపట్టశూల పరశుఖడ్గశక్తితోమరపరిఘాది క్రూరాయుధంబులు బూని కవచంబులు ధరించి తరలిరి. ఖరుఁడు రథమారోహించెను. రథ నేమిధ్వానంబులును సేనామహోట్టహాసంబులును నింగిముట్టి మాఱుమ్రోసెను.

దుశ్శకునములు

రాక్షసబలంబు తరలినంతనే మింట గాడిదవన్నెమబ్బులు వ్రేలి రక్తవర్షంబులు కురిసెను; సూర్గము సమోన్నతమైయున్నను వారి రథాశ్వంబులు మహాజనస్త్వములుగలవయ్యు ద్రెళ్ళిపడసాగెను; రవిమండలంబును గొఱవిచక్రముఁబోని పరివేషంబు చుట్టెను; ఖరుని హేమదండ ధ్వజంబుపయి గద్దలువ్రాలెను; మాంసాదంబులగు మృగపక్షులు జనస్థానసమీపంబున వికృతంబుగాఁ గూసెను; తూర్పుదెస నక్కలెలుగెత్తి యఱచెను; దిక్కులందును విదిక్కులందును గాఢతమంబులు గప్పెను; అకాలసంధ్యారాగం బుదయించెను; రాపులుంగులు సేనాభిముఖమై బిట్టుకూసెను; సూర్యునిమ్రోల నల్లనిమూసిమొండెము తోఁచెను; అపర్వంబున భానుని స్వర్భానుఁడు గ్రసించెను; ప్రతికూల వాయువులు మహావేగంబున వీచెను. పట్టపగలు మింటనుల్కలుమిడుపుఱుంబురువులువోలె బొలిచెను; పెంధూళి మేఘంబులు రేగి రాక్షససైన్యంబును గప్పిపుచ్చెను; ఘోరికారవంబులు వీచికూచి యని పరుసంబుగా వినిపించెను; పిడుగులురాలెను; ధాత్రీతలము సశైలవనంబుగాఁ జలించెను; ఖరుని వామభుజం బదరెను; వాని కన్నులనుండి యకారణమ నీరు స్రవింపఁ దొడగెను; అతనికి డగ్గుత్తిక పాటొదవెను; తదీయ లలాటభాగం బనిర్వచనీయ వికారమొందెను.

ఆయుత్పాతంబులకు ఖరుఁడు వికవిక నవ్వి, 'దుర్మిత్రంబులు దుర్బలుని గలంచును; బలవంతులు వానిని లెక్కసేయరు. నేను తేతి

చూచినఁ దారాగణము నభోవీథి నెడసి జలజలరాలును; మృత్యువు సయితము పఱచును. అట్టి నాకు రాముఁడు గీముఁడు లెక్కయగునా? ఆకూళను దమ్మునితోడఁ బరిమార్పనేని నాదియు నొక మగంటిమి యగునా? ఇంతవఱకుఁ బరాజయమనఁ బెట్టిదో తెలియదు. ఐరావత యాయియైన మహేంద్రుఁడుగూడ నా యలుకకుఁ దాళఁడు. ఈ ముక్కఁడి యేపాటి?' యని సోత్కర్షంబులు వచించెను. వానిసైన్యము దోడ్తోడఁ దమ ధైర్యసంతోషమహోత్సాహంబులను జయజయధ్వనుల రూపంబున వెలిపెను. దేవర్షిగంధర్వసిద్ధచారణులు తత్సంగరసందర్శనో త్సుకులై విమానాదు లధిరోహించి గగనతలంబునఁ బొఱయులు తీఱి, 'గోబ్రాహ్మణులకును లోకంబునకును హితాభిలాషులైన రామలక్ష్మణు లకు మంగళంబగుఁగాక. చక్రపాణి యసురులంబోలె రాముఁడు పౌలస్త్యరాక్షసవర్గంబును దునుమాడి జగత్కల్యాణమొనర్చుగాక' యని పలుకుచు నిలువెల్లఁ గన్నులుగానుండిరి.

రాముఁడు యుద్ధసన్నద్ధుఁడగుట

రాముఁడాయుత్పాత పరంపరలు పరికించి, 'వత్సా! లక్ష్మణా! ఈ మహోత్పాతంబులు సర్వరాక్షససంహారసూచకంబుగాఁ దోఁచుచున్నవి. ఘోరసంగ్రామంబు తప్పదు. నా దక్షిణభుజము సారెసారెకు నదురుచున్నది; బాణంబులు పొగరాజుచున్నవి; నీమోము కాంతి మంతమై గాన్పించుచున్నది. ఒండుచోఁ బ్రాణహానియగు సందడు. అవిగో సింహనాదభేరీనినదంబులు; ముప్పును శంకించి తత్ప్రతీకారంబును మున్నుగా శుభకాంక్షి యొనర్చుటొప్పు. నీవు శరచాపంబులు దాల్చి సీతను గొనిపోయి పాదపసంకులంబును దుర్గమంబున్నైన యమ్మహా గుహాంతరంబునఁ గాచియుండుము. మాఱాడవలదు; జాగుసేయకు. నీశక్తిసామర్థ్యంబులను శంకించి యిట్లనుట గాదు. ఈ సోకుమూకకు నీవెంతయుఁ జాలుదువు. ఈపని నేనుచేయఁ దలకొంటి'నని చెప్పి వారినిఁ దక్కందరాంతంబునకుఁ బుచ్చి కవచధారియై గాఢతిమిరాంతం బున విధూమాగ్నికరణిఁ దేజరిల్లుచు దిగంతంబులు ప్రతిధ్వానంబు లీనునట్లు జ్యానిర్ఘోష మొనర్చెను. మింటనున్న ఋష్యాదులు తహతహ పడుచు, 'రాక్షసబలమన్ననో పదునాల్గువేలుగానున్నది. అందు మహా కపాలియు స్థూలాక్షుండును బ్రమాథియుఁ ద్రిశిరుండును గలఁడు. ఆ సేనానాయకులు మహాబల వీరోద్ధతులుగాని యేతన్మాత్రులుగాఱు. వారికిఁ దోడుగా శ్యేనగామియుఁ బృథుగ్రీవుండును యజ్ఞశత్రువును

విహంగముండును దుర్జయుండును గరవీరాక్షుండును బహుషుండును గాల కర్ముండును మేఘమాలియు మహామాలియు సర్పముఖుండును హుధిరాశ నుండును నిలిచి యున్నారు. ఈ పన్నిద్దఱును దుర్ధర్షులనుట యతిశ యోక్తిగాదు. రాముఁడో యనన్యసహాయుఁ' డనుచు మిగుకరింప సాగిరి.

రాక్షస సైన్య సంహారము

రాక్షససైన్యంబు దిక్కటాస్ఫాలనంబుగా బిట్టార్చుచు హుటా హుటి రామాశ్రమంబునకు వచ్చి తన్ముఖంబున నేకతంబుగాఁ బ్రళయ రుద్రుని పగిదినున్న దాశరథిని దాఁకెను. ఖరుఁడు శరవర్షంబున రాము నొప్పించి సింహనాదం బొనర్చెను. రాక్షసులు చెలరేఁగి యొక్కుమ్మడి వివిధాయుధంబులఁ గురిపించిరి. రాముఁడట్లు రాక్షసాయుధంబులకు గుఱియై నెత్తుటజొత్తిల్లుచు సాయంకాలమేఘావృతచండగభస్తిక్రియఁ గాన్పించి మండలీకృతకార్ముకుఁడై దుర్వారంబులను గాలదండసన్ని భంబులునైన బాణంబులను శతసహస్రంబుగాఁ బ్రయోగించెను. ఆ శరంబులు కాలపాశంబులు వోలె రక్కసుల ప్రాణంబులను హరించి తద్రక్తసిక్తములై మండుకొఅవ్వులో యన నొప్పి నింగి గప్పెను. శరంబులు తెగి సారథులు డుల్లిరి; వారి పయి హయంబు లొరఁగెను; వానిమీఁద మాతంగంబులు నడగొండలవలె డొల్లెను. రణరంగంబెల్ల శవమయంబును రుధిరప్లుతంబునై బీభత్సాకారము దాల్చెను. హత శేషులు భయభ్రాంతులై పఱవఁజొచ్చిరి.

రాక్షసబలచురవస్థకు దూషణుఁడు మహాకోపమంది హతశేషుల నూలుకొల్పి యుద్ధంబునకుఁ బూన్చి రుద్రునిమీఁదికి మృత్యువువోలె రామునిపయి నుఱికెను. రాక్షసులు కొందఱు తాలవృక్షంబులను విసరిరి; కొందఱు సాలమహీరుహంబులను బెకలించి తెచ్చి వైచిరి; కొందఱు భూరిశిలావర్షమును గురిపించిరి; కొందఱు నానాయుధంబులతో దాఁకిరి. వారట్లు నలుక్రేవలుజుట్టి హోరాహోరి పోరుగావించుట రాముఁడు పరికించి సింహనాదమొనర్చి గాంధర్వాస్త్రంబును బ్రయో గించెను. అందుండి వివిధ నారాచంబులు వేనవేలుగా నుప్పతిల్లి సోకు మూకనెల్ల నుగ్గునూచ మొనర్చెను.

మ॥ విఱిగెం బెక్కురథంబులొక్కమొగి, నుర్వింగూలె కుండాలముల్
దఱుచైవ్రాలెఁ దురంగసాదిబలసంతానంబు, నింతింతలై
కుఱుకుల్ గట్టె భటాంగకంబులు, రణక్షోణీతలంబెల్లెడఁ
బఱచెఁ జెత్తురు వాకలై, పరమభీభత్సాలయంబో యనఁ॥

దూషణ సంహారము

అట్లు రాక్షసబలంబు శిరంబులు తెగియు భుజంబులు విఱిగియు తొడలు తునిగియుఁ బాదంబు లేదియుఁ గూలుటయు, గజతురంగంబులు దొల్లుటయు ఛత్రచామరవ్యజనధ్వజంబులు భగ్నంబులగుటయుఁ, బరశుఖడ్గప్రాసంబులు పుప్పొడియై సమరాంగణంబెల్లఁ బఱచుటయు, దూషణుండు గాంచి యాగ్రహదుర్నిరీక్షణమూర్తియై వజ్రంబులువోని శరంబులుగొని పింజపింజ గఱపివైచి రామునొప్పించెను. అ య్యాహవ కాలుఁడు మధ్యాహ్నమార్తాండుని పగిది మండుచు నర్ధచంద్రాకార బాణంబువైచి దూషణుని చాపంబు నిరుఖండంబులొనర్చి, నాల్గుశర ంబుల నతనియశ్వంబు నొంటఁదత్సారథిని దెగటార్చి యారక్కసు నురం బున వాడియమ్ములు మూఁడు నాఁటెను. ఆ రక్షోనాయకుండు భగ్న కార్ముకుండును విరథుండునై మూర్తిగొన్న యుగ్రదేవతవలె దీపించుచుఁ గాంచనపట్టపరివేష్టితంబును దీప్తరాయశ్శంకుసంకల ితంబును దేవసైన్య సమర్థనంబునైన పరిఘంబుంబూని యురువిక్ర మాటోపంబులు మీఱి రాముని దలపడెను. రాఘవుఁడు వాని విజృం భణంబును సరకుగొనక బాణద్వయమువైచి యార్చెను. దూషణుఁడు భుజంబులు తెగి విధ్వస్తదంతతంతి పగిది బిట్టఱచుచు నేలఁ గూలెను. వాని చావునకు నిఖలభూతంబులు రాముని సాధువాదంబుల నుగ్గడించెను. దూషణానుచరులు కపాలస్థూలాక్షప్రమాథిప్రముఖులు తమయొడయుని పాటునకుఁ జింతాక్రోధంబులు దాల్చి తెంపుచేసి శూలపట్టస పర శ్వధంబులు గైకొని రాముని ఢీకొని తదీయ శరదహనార్చుల భస్మీ భూతులైరి.

ఖర సేనాధ్యక్షుల సంహారము

ఖరుఁడాసంగతి వినియాడుగఱచి శ్యేనగామిప్రభృతి సేనాధ్యక్షు లను బన్నిద్దఱ నొక్కుమ్మడి రామునిపయికిఁ బురికొల్పెను. వారు కొదమసింగంబులవలె గుప్పించి యెగచి చని రాఘవుని దారొక్కొని

వానిపయి వివిధాస్త్రశస్త్రంబులను గురిపించిరి. రాముఁడు వారి యస్త్రంబులనెల్లఁ బ్రతిశరంబులఁ ద్రుంచి వారి నొక్కొక్కరి నొక్కొక్క సాయకంబునకు గుఱిచేసెను. రాక్షసవీరు లాబాణంబులు తాకువడికిఁ గులిశధారానిహతవృక్షంబులవలెఁగూలిరి. రణభూమియెల్ల విడిసిన వెండ్రుకలతో రుధిరాప్లుతకళేబరంబులతో నిండి దర్భగప్పిన వేదికవలె నయ్యెను. ఆవనప్రదేశమంతయు రక్షోరక్తమాంసజంబాలమై మహా నరకంబుగాఁ దోచెను.

త్రిశిరుని సంహారము

రాముఁడట్లు పరసహాయనిరపేక్షముగా నయ్యసురబలంబునెల్ల జక్కాడగా, ఖరుఁడు కోపప్రచండుఁడై స్వయంబుగా వానినిదాఁకనుంకించెను. త్రిశిరుఁడు వానికి నడ్డపడి, 'రాక్షసేశ్వరా! నన్ను మఱచితివా? ఇదిగో చూడుము. రాముని వధింతు' నని తనకత్తి దాఁకి ప్రతిజ్ఞచేసి, 'దేవా! సాహసంబునలదు. సుంత యోర్చి సాక్షిమాత్రుండనై యుండుము. నా బాహువుల రణకండూతి సహింపరాదు. నేనో రాముఁడో యొక్కఁడు శేషించునందాక సనురాగ్ని చల్లారదు' అని పలికి, దేదీప్యమానమైన రథం బాగోహించి త్రిశిఖరపర్వతంబు పగిది రాముని డీకొని వానిసయి శరవర్షముంగురిసి, జలార్ద్రిదుందుభి ధ్వానంబట్లు సింహనాదంబొనర్చెను. రాముఁడు శితశరంబుల నయ్యసుర బాణంబుల నడికట్టి, 'రాక్షసవీరా! నీలాఘవ చూపు' మనెను. రామ త్రిశిరులపోరు సింహమత్తేభంబులపోరును దలపించెను. త్రిశిరుఁడు విశిఖత్రయంబును రామునుమీఁట నాటి యార్చెను. రాముఁడు పాద తాడితసర్పంబుపగిది నూర్చుచు, 'అహో! రాక్షసాగ్రణీ! నీ విక్రమం బింతనరాదు. నీ తూపులు మూఁడును గుహుమత్రయంబట్లు నా ఫాల భాగంబు నలంకరించెను జుమా. ఇఁక నా లాఘవ చూడు' మని యాశీవిషంబులఁబోని యాశుగంబులఁ బదునాల్గు త్రిశిరునిపేరురంబున గాడనేసి మఱి నాల్గుకోలల నతని వారువంబులను నాల్గింటిని గూర్చి బాణాష్టకంబునఁ దత్సారథిని హరించి యొక్కట ధ్వజంబును ద్రుంచెను. అంతఁ ద్రిశిరుఁడు రథంబునుండి లంఘింప నుంకించెను. రాముఁడంతలోన శరత్రయంబునఁ దన్మస్తకంబులను మూఁడింటిని జెండాడెను. త్రిశిరునిమొండెము నెత్తురు చిమ్ముచు నేలఁగూలెను.

ఖ ర సం హా ర ము

త్రిశిరదుర్మరణక్షుంక్షూనిలంబున ఖరక్రోధానలంబు రేగి భగభగ మండసాగెను. అతఁడు చండభానుఁడువలె నుద్దీపించుచు రథారూఢుఁడై వచ్చి రామునిఁ దలపడి ధనుర్విద్యాపరిణతి మెఱయ నానాబాణంబులఁ బ్రయోగించెను. రాముఁడు ప్రతిశరంబులను విస్ఫులింగాగ్నులంబోని వానినిఁ బుంఖానుపుంఖంబులుగాఁ బఱచి యాకాశంబెల్ల నిరవకాశం బొనర్చుటంజేసి సూర్యరశ్మి జల్లెడనుండివలె రణభూమిపయిఁ బ్రసరింప సాగెను. ఖరుఁడు తన శరంబులెల్ల నట్లు వ్యయంబగుటకు నాగ్రహం బొంది ధనుష్పాణియై పాశహస్తుఁడగు నంతకునిభంగి సర్వభూత భయావహుఁడై నిజభుజాసారం బేర్పడఁగా బాణంబొండు దివిచి వైచి రామచాపంబును ముష్టిదేశంబునఁ ద్రుంచి సప్తసాయకంబుల వాని కవచంబును జించి శరసహస్రంబున నతని నొప్పించి సింహనాదం బొనర్చెను. దాశరథి కోపమహోగ్రమూర్తియై యగస్త్యమహర్షి దత్తంబైన వైష్ణవనామక ధనూరత్నంబును గైకొని సజ్యంబు గావించి కనకపుంఖశరంబులఁబంచి యాదనుజేంద్రుని ధ్వజంబు నిహతుండము లొనర్చెను. ఖరుఁడు తన ధ్వజము ట్లగుటకుఁ గ్రోధమూర్ఛితుఁడై శారీర మర్మజ్ఞుఁడు గావున రాముని జీవస్థానములందు నాల్గుబాణంబుల నాటి వానినెత్తియు నొప్పించెను. రాఘవుండంత వైరిబాహుమూలంబులందు రెండుబాణంబులను వక్షస్థలంబున మూఁటిని గ్రుచ్చి, యొక్కటఁ దద్రథకూబరంబును నాల్గింట గుఱ్ఱంబులను నొంట సారథిశిరంబును దెగవైచి, మూఁట యుగంధరంబును భేదించి రెంట వక్షంబునుదునిమి యొంటఁ జాపంబును జూర్ణమొనర్చి యొక్కట వావిఁజెనకెను. ఖరుడట్లు భగ్నశరాసనుండును విరథుఁడును హతాశ్వుండును నిర్గతసారథియునై గదంబట్టి యరదంబునుండి దుమికెను. రాముఁడతనిఁజూచి, 'ఖరాసురా! రథాశ్వగజపదాతి బలగర్వంబునంజేసి మైమఱచి సర్వలోక జుగుప్సిత మహాదారుణ కర్మంబు లొనర్చితివి. ప్రాణులకు నెగ్గుచేయు నతఁడు ముజ్జగంబుల నేతయైనను మేలు బొందఁడు. లోకకంటకుని చుట్ట సర్వంబునట్లు బరిమార్వఁ జూతురు. ఎవ్వఁడు కామలోభప్రేరితుఁడై పాపంబులొనర్చునో వాఁడు వడిగంట్లు దిన్న నలిగండ్లసర్వంబువలెను వేరు తెగిన వృక్షంబు క్రియను వెనువెంట వశించును. నిరంతరము ధర్మవృద్ధుండు హవిర్హుతహోత్రతంబులఁ గాఁగముపుచ్చు మహాభాగులను దండకారణ్య ఋషిసత్తములను భక్షింప నీ చేతులెట్లాడెను? దాన

నీకగు లాభమేమి? ఋతుకాలంబునఁ దరువులు పుష్పాదికంబునువలె ననుభవయోగ్య కాలంబున జంతువులు తమ పాపకర్మఫలంబులను తప్పకపడయును. విషాన్నభోజన ఫలంబట్లు మహోత్కట పాపఫలంబు తోడ్తోడ సిద్ధించును. ఇంత మాత్రము విచారింపక మదాంధుండవై నిరంకుశముగా వర్తించితివి. దుష్టులు మనరాదు. దుష్టశిక్షణము రాజునకు విధివిధానము. ఈ కార్యార్థము దశరథమహారాజు నన్ను నియమించెను. తదాజ్ఞానువర్తినై నచ్చితిని. నీ పాపంబులెల్లఁ బరిణతిగాంచెను. సర్పంబులు నల్లికంబునుండి యవ్వలికిఁ జనుక్రియ నా ప్రాణంబులు నీశరీరంబును దూటాడిపోనున్నవి. ఏదండకారణ్య మునిసత్తములను నీవు భక్షించితివో యా మహాత్ములు వినూనస్థులై నీ పతనంబునకు వేచియున్నారు. కులాధమా! ఇదిగో నీతల తాటిపండువలె నేలరాలి ప్రయ్యలు గానున్నది చూడు' మనెను.

రామ పరిభాషణంబులకు ఖరుఁడు క్రోధసంరక్తలోచనుఁడై విహసించి, 'దాశరథీ! అలసులైన రక్కసులను గొందఱఁజంపి మేటివై విఱ్ఱవీఁగుదువు. లావుగలా రిట్లు పలుకరు. ఆత్మప్రశంస యలసత్వంబును వెల్లడించును. కుశాగ్నిజ్వాల సనిడికాంతులీనుచు నెంతచెలరేగినను బదార్థంబును దహింపనేర్చునా? ధాతుమంతంబగు పర్వతంబువలె వీర్యవంతుఁడైన శూరుఁడు స్వతముగాఁ బ్రకాశించును. రామా! నీ ప్రగల్భంబులిఁకఁ జాలు. కాలాంతకుఁడు ముల్లోకములకు వలె నేను నీప్రాణములకు నున్నాను. కాలవిలంబము వలదు; ఇదిగో రవి క్రుంకనున్నాఁడు. సూర్యాస్తమయము యుద్ధవిఘ్నకారి యగును. రారమ్ము; నీవలన మడసిన మావారెల్లరును భవద్రక్తధారాతిర్పణక్రియకు వేచియున్నా'రని పలికి పిడుగుంబోని పెనుగదను గిరగిరఁ ద్రిప్పి రాముని పయి విసరెను. అది మహావేగవంతమై మార్గమధ్య వృక్షంబులనెల్ల నున్మూలించుచు రాసాగెను. రాముఁడు దాని నొక్కకోలఁ దుత్తునియలొనర్చి, 'ఖరాసురా! నీలావును జూపితివి; ఇఁక నా పరాక్రమంబును జవిగొనుము. భవత్కంఠనాళనిస్సృత రక్తధారలను ద్రావి ధాత్రి ప్రశాంతరజస్కయగుఁగాక. నీవు ధూళిధూసరంబులైన నీ భుజంబులతో ధాత్రిని దుర్లభయగు ప్రమదనుబోలె నాలింగన మొనర్తువుగాక. దుష్టా! నీవు దీర్ఘనిద్రను జెందినఁగాని దండకారణ్యఋషిజన సంతాపంబులు తీఱవు. పరజన ప్రాణంబులతోఁ జెల్లాడు రాక్షసాంగనలు దుఃఖరసంబునుఁ జవిజూతురుగాక. దురాత్మా! నీనిమిత్తంబున వీథి

హోత్రంబులు వ్రేలనయ్యెను. ఇంక నేని వైశ్వానరుఁడు నిరాతంకముగా వెలుఁగుఁగాక' యనెను. ఆ మాటలకు ఖరుఁడు నెగటు నవ్వు నవ్వి, 'రామా! మృత్యుముఖంబును జొచ్చియు బ్రతులట మానవా?' యని భ్రుకుటీకుటిలలలాటుండై పండ్లు గీటి పెనువృక్షంబును సమూలంబుగాఁ బెకలించి యార్చి చావుమనుచు దానిని రాముని పై వైచెను. కౌసలేయుఁ డా భూరుహంబు నొక్క-శరంబునఁ దునిమి స్విన్న గాత్రుండును రోష కషాయనేత్రుండునై ఖరునిపయి వేలకొలఁది కఱుకుటమ్ములు చిమ్మెను. అసురుని నిలువెల్ల జల్లెడకంతలయ్యెను; ఆ గాయంబులనుండి క్రోవ్వులం బలె రక్తము నెగచిమ్మెను. ఖరుఁడు కోపవివశుండై యెగచి రాముని పయిఁబడెను. అ య్యసుర రక్తంబు మదమర్దంధ మహోదస్వదంబగుటం జేసియు నతఁడు కేవల సమీపగతుండగుట శరసంధానంబునకుఁ గూడ నెడము లేమిం జేసియు రాముఁ డొండు రెండడుగులు వెనుకకు జరిగి, యింద్రదత్తంబైన బాణంబును ద్వితీయ బ్రహ్మదండమో యన నిష్ఫలు గ్రక్కు-చున్న దానిని గైకొని సంధించి యాకర్ణాంతముఁ దివిచి వైచెను. అది నిర్ఘాతంబట్లు ఖరుని వేరురంబున వ్రాలి తదీయ నక్షో భాగంబును జీల్చి తూటాడి చనెను. ఖరుఁడా బాణాగ్ని దగ్ధుఁడై శ్వేతారణ్యంబున హరనేత్రాగ్ని సందగ్ధుఁడైన యంధకాసురుని దల పించుచుఁ గులిశధారాహతిఁ బడసిన వృత్రాసురునిపాటు మఱపించుచు నేలఁగూలెను.

ఖరదూషణుల వినాశంబునకు దేవర్షిగంధర్వాదులు పరమ సంతోషమంది నచ్చి, 'రామా! నాఁడు దేవేంద్రుఁడు శరభంగమహర్షి యాశ్రమంబునకువచ్చి చనుట చూచితివిగదా. ఆయన యట్లునచ్చుట యీ ఖరవధార్థమే యని యెఱుంగుము. ఈ పాతకులను బొలియించుటకై మహర్షు లుపాయంబు పన్ని నిన్నిటఁ జేర్చిరి. దాశరథీ! నీవు మా కొనర్చిన మేలింతనరాదు. దండకారణ్యఋషివర్యులను గప్పియున్న ధర్మాచరణప్రతిబంధకంబులెల్ల నేటితో సమసెను. నీ కెంతయుఁ గృతజ్ఞుల' మని యుగ్గడించిరి. 'అహో! రాముఁడేతన్మాత్రుఁడుగాఁడు; శ్రీమహావిష్ణువునకు సాటియగును. కాదేని చతుర్దశసహస్రరాక్షసానీకంబును ఖరదూషణాది సహితంబుగా నర్ధాధికముహూర్తకాలంబునఁ బరిమార్ప నొండు తరమా?' యను నమరప్రశంసోక్తులు నింగితలంబున మాఱుమ్రోఁగెను. దివిజభేరులు పెల్లుమ్రోసెను; పుష్పవృష్టి గురిసెను.

రాముఁడట్లు శత్రుబలంబునెల్ల నిర్జించి నిజాశ్రమంబునకుఁ జనెను. సీతాదేవి పతిరాకకై నిలువెల్లఁ గన్నులుగానుండి యట్లువచ్చుచున్న దయితునకు నెదురేగి వానిని గవుంగిటఁ గూర్చెను. రాముఁడు ప్రియాసమాశ్లేషసుఖంబంది రణక్లేశంబెల్ల మఱచెను.

అకంపనుఁడు జనస్థానవృత్తాంతంబును రావణునకుఁ దెలుపుట

అకంపనుండనుపేరి రావణచారుఁడొకం డాఖరదూషణాదుల పాటు చూచి భయాశ్చర్యత్వరితుఁడై పేరులుకొన లంకానగరంబునకుఁ జని రావణుని సన్నిధించి, 'దేవా! జనస్థానంబు రాక్షసశూన్యం బయ్యెను. నేనెట్లో దక్కి యిందువచ్చితిని; శరణు శరణు' అని పలికి సాగిలఁబడెను. రావణుఁడు మహావిస్మయాగ్రహంబులంది, 'ఏమేమీ? జనస్థానంబు రాక్షసశూన్యమయ్యెనా? ఖరదూషణాదులు నిహతులైరా? మృత్యువునోటఁ దలఁదూర్చి జనస్థానంబును జొచ్చిన యా మందప్రాణి యెవఁడు? ఆ బుద్ధిహీనుఁడు నన్నెఱుంగఁడా? ఎవని మాట విన్నంతి యముఁడుగూడ మోముపఱలించునో; ఎవని పేరుచెప్పిన నగ్నిచల్లారునో; దిక్పాలు లెల్లరు నెవనికనుసన్నల మెలంగుదురో; ఎవనియింట నగిలుఁ డూడిగంబొనర్చుచుండునో; మేఘుం డెవనినుంగిటఁ గలయంపి చల్లుచుండునో; ఎవని భానసంబు నగ్నిపాయఁడో; చంద్రుఁ డెవని తోటమాలియై యుండునో; ఎవని పూజారంబునఁ గొలువై యింద్రుఁడు జోహారువులు పలుకుచుండునో; విష్ణువుసయితం బెవని ధాకకు వెఱచి యొకచో నిలువక దాఁగి దాఁగి గ్రుమ్మరుచుండునో; యట్టినన్ను దశకంధరుని లెక్కగొనక యింతయొనర్చిన పందయెవఁడో చెప్పుము. ఈ తలవంపు సైపరా' నని గభీరస్వరంబున నడిగెను. నావుఁడు, 'దేవా! ఎవఁడో మర్త్యమాత్రుఁ డింతచేసెను. దశరథ మహారాజసుతుండఁట; రాముఁడట. అహో! వాని ధనుర్విద్యాకౌశల్యం బింతనరాదు. వానిరూపంబు లోకోత్తరంబనుటకన్న వేఱవర్ణింపఁజాల. ఆతని బలపరాక్రమంబు లత్యద్భుతంబులు. ఒక్కకోలను దూషణుని శిరంబు తెగి పెనుగాలికి దూదివలె నెందోపడెను; ఖరుఁడు పర్వతంబువలెఁ గూలెను. వేయేల? వాని శౌర్యాగ్నికి జనస్థానరాక్షసబలంబు పదునాల్గు వేలు తృణములో నింధనప్రాయమయ్యెను. సైన్యసహాయమన్నచో యొక్కఁడుండును గలుగఁడు. నిర్జరాదులు తోడువచ్చిరా యన నెవ్వరును రారు. ఏకాకిగా నతఁడింత యొనర్చెను. మేము సాయుధులమై

సమరంబునకుఁ గడంగితిమి. ఒక్కొక్క యోధుని యెదుట నొక్కొక్క రాముఁడు నిలిచి పోరెను. ఇది రాక్షసమాయకు మించినమాయగా నున్నది. ఈ చిత్రంబు మా యూహకు నందను. రాముని నెంట నతనితమ్ముఁడు లక్ష్మణుఁడు కలఁడు గాని, యతఁడు మిన్నకుండెను. దేవరవారిచిత్తం'బని యకంపనుఁడు విన్నవించెను.

రావణుండావచనంబులు విని, 'అకంపనా! సంగతి తెలిసెను; ఓడకు; వారి బూడిద బుంగలకెత్తింతుఁ జూడు'మని క్రోధస్ఫూర్తితో వచించెను. రాక్షసేశ్వరుని తలంపు నకంపనుఁడు గ్రహించి, 'స్వామీ! మన్నింపుము; నీ లెంకసాహసంబును మన్నింపుము. రాముఁడంత సులభసాధ్యుఁడుగాఁడు. వానికోపంబునకు సెలయేఱులుగూడ నింకఁ బాఱును; గగనంబు సనక్షత్రంబుగా రాలును; ముల్లోకంబులును దలక్రిందగును. సమస్త సృష్టివిలయంబులు వానియఱచేత నున్నట్లు భావింతును. మహాపాతకులకు స్వర్గము సాధ్యమైననగునాక; నీకుఁగాని నీయసురబలంబునకుఁగాని రాముఁడు సాధ్యుఁడు గాఁడు. దేవాసుర లేకమై యెత్తివచ్చినను జరాచరసమస్తప్రపంచము గూడివచ్చినను వానినిఁ జెనకఁ జాలరు. అట్లయిన నతఁడు నిర్జయుఁడా యని ప్రశ్నింప వచ్చును. దేవా! వాని నుపాయాంతరంబున నోడింపనగునే గాని సమరంబున జయింపరాదు. వెఱవేనుందువా? వానినెంట నతనిభార్య సీతయను కాంతామణి గలదు. ఆ సుందరీలలాము యౌవనమధ్యస్థయై సర్వమంగళస్వరూపిణియో యన నొప్పుచున్నది. ఆ నవలారత్నంబునకు సాటివచ్చు చెలువ యేలోకంబునను గానము.

"శా. ఆవాలుంగనుదోయి యానగుమొగం బాగుబ్బపాలిండ్లపెం
పావేణీయుచి యూతనూవిలసనం బాయొప్పులేఁ జెప్పినం
గైవారంబగుఁగాని యయ్యెడ శిరఃకంపంబుతోఁగూడ నా
హా! పుట్టింపదె పుష్పధన్వునకు నయ్యబ్జాక్షీ వీక్షించినన్."

ఆ యింతి నపహరింతువేని తద్వియోగాగ్నికి రాముఁడు చివికి మసియగును; నీకోర్కె సఫలంబగు; మేమెల్లరము సుఖంబుందు' మనెను.

రావణుఁడు మారీచుని సహాయము గోరుట

రావణుఁడు తలయూచి యకంపనుని బుచ్చి మఱునాఁడు ప్రాతఃకాలంబున లేచి సూర్యతేజోవిరాజితంబైన రథం బారోహించి

తాటకాసూనుఁడైన మారీచుని గూర్చి పోయి వానిని సంధించి తదీయ సత్కారంబులంది, 'మారీచా! సంగతి వింటివా? మన జనస్థానంబు రాక్షసశూన్యమయ్యెను. ఖరదూషణులు రూపుమాసిరి. ఇంత దుండగంబు నొక్కనరమాత్రుఁ డొనర్చునఁట. వానిని సాధింపమేని మన యునికి నిరర్థకంబగును. ఆ నరాధముఁడు భార్యాద్వితీయుఁడై వచ్చెనఁట. ఆ కాంత నపహరించి పగదీర్చికొన వచ్చితిని. నీ సాహాయ్యంబుఁ గోరుదు' నని శోకవిషణ్ణస్వరంబున నుడివెను. మారీచుం డతని విని, 'రాక్షసేశ్వరా! ఈ యూహ నీకుఁగలిగించినవాఁడు నీకు హితశత్రువుగాని మిత్రుఁడుగాఁడు. నీ వలనఁ దిరస్కృతుఁడై యీ పగను గపటోపాయంబున సాధింప వేచియున్న కూళతక్క మఱి యొకం డిట్టిది బోధింపఁడు. నీకిట్లు బోధించినవాఁడెవఁడో ముందు చెప్పుము. ఈ దురోబ్ధవలన నెంతయెగ్గురానున్నదో యూహించితివా? రాక్షసలోకంబు సమూలనాశంబగును. నీకీబుద్ధిఁగఱపిన యీ ద్రోహిని దురాత్ము వెనువెంట తుదిముట్టింపనగు. అహో! ఆశీవిషముఖాంతర విషదంతంబును బెకళింప వాఁడు నిన్నుఁ బ్రేరేచెనా? అది యట్లుండ నిమ్ము. ఖరదూషణులఁ బరిమార్చిన యీ వీరుఁడెవఁడు? వానివృత్తాంత మేమి?' యని యడిగెను. నావుడు, 'మారీచా! దశరథసుతుఁడు రాముఁడను వాఁడింత యొనర్చెనని చెప్పిరి. ఆ నరాధముని మననీయ రాద'ని రావణుఁడు నచించెను.

రాముని పేరు విన్నంతనే మారీచుఁడు గడగడ వడకుచు, 'రావణా! ఇఁక నీయత్నంబు నుజ్జగింపనగు. విశుద్ధవంశాభిజనహస్త సంశోభితంబును బ్రతాపమదదుర్ధర్షంబును బాహుదంతపరిఘవంబునైన రాఘవగంధగజంబును దారొక్కిన నలవిగాదు. బాణనఖంబులును ఖడ్గ దంతంబులును గలిగి రణాంతస్థితి సంధివాలమై నిద్రించుచున్న యీ నృసింహంబును జెనకి మేల్కొలుపవలదు. చాపమకరంబును భుజవేగ పంకంబును శరతరంగ సంకులంబును రణజలౌఘంబునై మహాభయంక రంబుగా నున్న రామపాతాళంబునఁ బడకు. రాక్షసేశ్వరా! తామసంబు వదలి ప్రసన్న చిత్తుండవై లంకకుఁ జనుము. నానోపభోగంబుల నిన్నుఁ దనుపు భార్య లెందఱో నీకుఁగలరు. నా మాట విను' మని హితము పలికెను. రావణుఁడు నాఁటికి వానితలంపు నుజ్జగించి లంకామార్గము ద్రొక్కెను.

రావణునకు శూర్పణఖ తనగతిచెప్పి విలపించుట

రావణుఁడు కొండొకనాఁడు పేరోలగంబుదీఱి, దేవాసురసమర సమయవజ్రివజ్రప్రణాంకితనిజవక్షోభాగసముజ్జ్వల్యమానరత్నహారకాంతి తతులు సభామండపంబునెల్లఁ గిమ్మారకాంతులఁ వెలిగించుచుండఁగా, యాగవిఘ్న పరదారాభిమర్శన ధర్మవ్యతిక్రమణాది దురూహాపరంపరలు తదీయ దశముఖదర్పణంబులఁ బ్రతిబింబించుచుండఁగా, మంత్రిపుంగవులు భయనమ్రులై గావించు విన్నపంబుల నాలకించుచు సేనానాయకులను గనుసన్నల నాజ్ఞాపించుచు నుండఁగా, రాక్షసాంగనలొయ్యొ తటాలున సభాస్థలిఁజొచ్చి, 'ఏ ప్రతాపశాలి యవక్రవిక్రముఁడై సర్పరాజ భోగవతీపురంబుపయి నడచి వాసుకిని లీలామాత్రంబున జయించి తక్షకప్రియసఖ్యుల నసహరించి తెచ్చెనో, ఏవీరాగ్రణి కైలాస కుధరంబు నోమనగాయంబలె నెగవైచి కుబేరుని పీఁచమడంచి జక్కఁ చేసి పుష్కరిణి బూడ్చి యింద్రనందనోద్యానంబును నామావశిష్ట మొనర్చెనో, ఏ పరాక్రమమూర్తి తన యఱచేతులడ్డమిడి సూర్య చంద్రుల యుదయంబులనాపెనో, ఏస్థిరసంకల్పుఁడు దశసహస్రాబ్దంబులు కఠోరతపంబొనర్చి చేఁజేతఁ దనతలలు తఱిగి పరమేష్ఠినర్చించి తద్వాక్కున నపరిమేయవరంబులఁ బడసెనో, ఏ చండశాసనునకు నోడి దేవతలు హవ్యకవ్యంబులను స్వతంత్రించి గ్రహింపరో, ఎవని నామోచ్చారణమాత్రంబున సమస్తలోకంబు లుడ్డుడుకునో, యా పౌలస్త్యవంశ రత్నం బా దశకంధరుఁడు నాయన్న యని వచింప సిగ్గయ్యెడు. రాక్షసేశ్వరా! మహాభయంబు నిన్ను సపరివారంబుగా మ్రింగనుండఁగాఁ గన్నులు మోడ్చి పరాకుననున్న నీ వెట్టితనంబు పరమాశ్చర్య విషాదంబులను గలిగించుచున్నది. గ్రామ్యభోగంబులకుఁ జిక్కి కామ వివశుండై లోభవృత్తిఁ జరించు రాజును శ్మశానాగ్నినివలెఁ బ్రజలు నిరసింతురుగాని పూజింపరు. యుక్తావసరంబునఁ గార్యంబును సాధింపని జోడు పదచ్యుతిఁగాంచి వినాశమొందును. దేశరక్షకులుగాని ప్రభువులు సాగరనిమగ్న పర్వతంబుల గతి ననుకరింతురు. దేవగంధర్వదానవు లతో మితిమీఱిన వైరంబును బెంచితివి. చారదృష్టి సుంతయు లేదయ్యెను; దానితోడ విచారదృష్టియు నన్నగిల్లెను; కామాంధ కారంబున మునింగితివి. ఇఁక నీకు రాజ్యమెట్లు దక్కును? చారసంప దయుఁ గోశసమృద్ధియు నీతిబలంబును రాజులకు జీవగఱ్ఱలగును. అవి లేనినాఁడు వారును ప్రాకృతులగుదురు. చారదృష్టి కలిమిం జేసిగదా

రాజులను దీర్ఘనేత్రులందురు? కటా! నీస్థితి యెంతయు విపరీతంబుగా నున్నది. నీజనస్థానమేమయ్యెనో, యందున్న నీబంధువర్గమెట్లున్నదో విచారించితివా? అన్నా! నరమాత్రుఁడు నీపదునాల్గువేల రాక్షస యోధులను ఖరదూషణులతోడ మ్రింగివైచెను. దండకారణ్యంబు రాక్షస శూన్యముగా నొనర్చునని యతండు ఋషులకు నభయదానం బిచ్చెనఁట. కృపణుండవు గావున నీకును నీదేశంబునకును రానున్న గారాము లెఱుంగవు. ప్రమత్తుండును గర్వితుండును శఠుండును గూఢాప చారుండును స్వల్పప్రదాతయునునైన రాజునకుఁ బ్రజలాపత్కాలంబునఁ దోడ్పడరు. అతిమానియు నగ్రాహ్యుండు నాత్మసంభావితుండును గ్రోధియునగు జోడు విపత్తునకుఁ జిక్కినేని వానినిఁ దదీయులే నిర్దయులై వధింతురు. ఎండుపుడుకలైనను మన్నైనను దుమ్మైనను నొకా నొకప్పుఁడేని యుపయోగించునుగాని రాజ్యభ్రష్టుఁడైన రాజెన్నఁడు నేనాటఁ గొఱగాఁడు. కట్టియూడ్చిన పుట్టంబుతో దాల్చి గెఱపిన పూమాలతో రాజ్యభ్రష్టుని సరిపోల్తురు. అప్రమత్తుండును సర్వజ్ఞుండును జితేంద్రియుఁడును గృతజ్ఞుండును ధర్మశీలుఁడునైన భూపతిని రాజ్య లక్ష్మి చిరకాలము సేవించును. ఏ మైని నీతినయనంబులు నిద్రావస్థ యందుఁ గూడ మెలఁకువతో నుండునో, ఏ నృపవర్యుని నిగ్రహానుగ్రహంబులు వ్యర్థంబులుగావో, యట్టిరాజు సర్వలోక సంభావితుండగు. నీజనస్థానము సంగతి యిందాక తెలియవు; నీవారిగతి యేమయ్యెనో వినవు; నిన్ను మ్రింగనున్న యెడరుంగూర్చి విచారింపవు; నీరాష్ట్రమేమి గానున్నదో నేరవు. ఇఁక నీవెట్టి వాఁడవో నీవే యూహింపనగు. పదజనావమానంబులు పండుగలుగా, విషయోప భోగసుఖంబులు బ్రహ్మానందంబుగా భావించి దేశకాల ప్రవిభాగత త్త్వజ్ఞానం బింతయు లేక, గుణదోష పరిజ్ఞానమేది, నిద్రించుచున్నావు. అచిరకాలంబున రాజ్యభ్రష్టుండవగుదు' వనెను.

రావణుఁ డా పరుషవచనంబులు విని కొంతతడవు చింతించి, 'సోదరీ! శూర్పణఖా! దశరథసుతుఁడు రాముఁడింత చేసెనని వింటిని. అతఁ డెందునిమిత్తమట్లు దురాసదమైన దండకారణ్యముఁ జొచ్చెనో యుద్ధమేల పొసఁగెనో వినవలతు' ననెను. నావుడు, 'అన్నా రాముని రాకకుఁ గారణంబు నాకు స్పష్టముగాఁ దెలియరాదు. అతని రూప లావణ్యసంపదలు లోకాతీతములు. అపరమన్మథుం డతఁడేలనో నార చీరలుకట్టి మునివేషము ధరించెను. వానికిని మనవారికిని ఘోరయుద్ధ

మయ్యెను. అన్నా ! రాముని రణపాండిత్య మేమని వచింతు ? అతఁడు శక్రచాపంబునుబోని కోదండంబునుబూని సమరక్షోణి నిలిచినప్పుఁడు వానిని జూడనికన్నులు కన్నులుగావు. వాని శరగ్రహణ సంధాన విమోక్షంబులకుఁ దెంపుగలుగదు. ఆ వీరాగ్రణి బాణంబులఁ గ్రక్కు-చున్నాఁడోయన దోఁచును. ఇంద్ర శిలావృష్టివలన సస్యంబువలె వాని బాణవృష్టివలన మన సైన్యంబెల్ల నశించెను. అతఁడు మహోత్సాహుఁడును విదితాత్ముఁడును గావున స్త్రీవధాపాతకంబునకు శంకించెను. అందువలన నేను బ్రదికి యిందు రానోఁచితిని. వానికిఁ దమ్ముఁడు లక్ష్మణుఁడనువాఁడు గలఁడు. భ్రాతృభక్తిప్రేమలు మూర్తిభవించి లక్ష్మణుఁడుగా జనించె నన వచ్చును. బలపరాక్రమంబుల నతఁడు రామునకు సాటియగును. లక్ష్మ ణుఁడు రామునకు బహిఃప్రాణమై యుండును. అన్నా! మఱియొక విశే షము గలదు. రామునివెంట వానిభార్య సీతయను సుందరీమణి గలదు. ఆయింతి చక్కదనమే చక్కఁదనము. ఇందీవరంబులఁ గ్రిందుసేయు కందోయితో, రాకాచంద్రునితో వియ్యమందఁజాలు నెమ్మోముతోఁ, బదియార్వన్నెలపైడిసొరుమెచ్చని తనూచ్ఛాయతోఁ, దారలకుఁ దలనంపు గలిగించునఖంబులతోఁ గలిమిలేములమధ్యంబగు మధ్యంబుతో సొబగారుచున్న యా చెలువ వనదేవతయో యపరలక్ష్మియో సంశ యింతును. సురనారీమణుల నెందఱనో చూచితిని; యట్టికాంతలు నాకుఁ దెలియనివారులేరు; కిన్నరకీర్వాణులనెల్ల నెఱుంగుదును; ఎవ్వరునుఁ దన్నఖాగ్రంబునకుఁ గూడ నోపరు. వేయేల?

"మ॥ అలినీలాలకఁ బూర్ణచంద్రముఖి నేణాక్షిం బ్రవాళాధరం
గలకంఠిఁ నవపల్లవాంఘ్రియుగళం గంభేభకుంభస్తనిఁ
బులినశ్రోణి మరాళయాన నరుణాంభోజాత వక్త్రిఁ మహో
త్పలగంధిఁ మృగరాజమధ్య నుపమింపంబోల రేకాంతలున్.

"చ॥ అంబురుహాక్షీనాసిక నిజాన్వయశత్రువుఁజంపక ప్రసూ
నంబుఁగరంబుగెల్చు మనంబునఁబెట్టి తదీయపార్శ్వ యు
గ్మంబున నిత్యసేవకతఁ గ్రాలెడు పీక్షణతారకాఖ్య రో
లంబకదంపతుల్ వెనువళావళి నెంతయు సంభ్రమించుచున్."

అన్నా ! ఆ కామినీ పరిష్వంగ భాగ్యంబు చేకూఱినవాఁడు మహేంద్రభోగంబులుగూడ వెకటించును. ఆ కాంతారత్నంబు ఆ పేశ లాంగి యా మంగళదేవత నీకెంతయుఁ గూర్చు భార్యకాదగును. నీసుఖమే నాసుఖంబుగావున నయ్యెమ్మెలాడి నపహరించి తెచ్చి నీ

యొడిఁజేర్ప యత్నించితిని. నా ప్రయత్నంబెఱిఁగి క్రూరాత్ముఁడు లక్ష్మణుఁడు నన్నిట్లు విరూపిగావించెను. నాకుఁగా ఖరదూషణాదు లలిగి రాముని జెనకి ప్రాణంబులు గోల్పోయిరి. ఆ త్రైలోక్యమోహినిని గోరుదువేనిఁ గర్తవ్యంబూహింపుము. రామలక్ష్మణులు జీవించియున్నచో నీమనోరథం బీడేరదు. నీభాగ్యమెట్లున్నదో' యని నాటఁబలికెను.

రావణుఁడు పగదీఱు విధమును నిశ్చయించుట

రావణుండంత సచివులకు సెలవిచ్చి సభచాలించి యంతఃపురంబునకుఁ బోయి, 'కటా! నరమాత్రుఁడు నాకింత యపకారంబొనర్చెఁగదా. ప్రతికృతియొనర్పనేని నా జీవమేల? మానధనులు ప్రాణహానియైన నోర్తురుగాని యసోహాని సహింపరు. పగదీఱెట్లు? వైరి యంతసులభసాధ్యుఁడని తోఁపదు. కాదని రణంబొనర్చినచో శత్రుహరణంబగును. అంత మాత్రాన నాపగ దీఱదు. చచ్చినవాఁడు నిజాపరాధఫలంబును జవిగాంచఁడు. రాముని వెతలం గుడిపి పరితపింపఁజేయుదునేని రాక్షసులమాట నుట్టియొకండు తలంపకుండు. ఇందులకుఁ దగుమార్గ మేది? ఎల్లక్లేశములకన్న భార్యాపహరణక్లేశంబు పురుషులకు దుర్భరంబు. ఆ దుఃఖము భర్తకు నిద్రాహారంబుల నుడిపి వానిని దేశద్రిమ్మరింగావించి యున్మాదావస్థకుఁదెచ్చి మరణాంతము వేధించును. రామున కింతకన్న శిక్షగలుగదు. అతఁడు పత్నికై చివికి నశించును. అన్న వెంటఁ దమ్ముఁడు చనును. నాకును గార్యంబు సిద్ధించును; రాక్షసలోకంబును సుఖముండును. ఇంతకన్న మంచిమార్గము గానరాదు. కటా! నాఁడు మారీచుని విని చెడితి'నని పెద్దయుండడవ్వు తలపోసి కృతనిశ్చయుఁడయ్యెను.

రావణ మారీచుల పునస్సమాగమము

రావణుఁడట్లు నిశ్చయించి మాత్రులకుఁగాని మండోదరికిగాని తెలుపక యానశాలకుఁజని కామచారిణియైన రథమెక్కి సముద్ర తీరముంబట్టి తరలి, నిర్మలతోయపూరంబులై పూచియేచిదలిర్చుచున్న పద్మములతో శోభిల్లు సరోవరంబులను జూచుచుఁ, గదళీనారికేళశాల తమాలవనంబుల నవలోకించుచు, గరుడగంధర్వకిన్నర వైఖానసవాల ఖిల్యాది నివాసప్రదేశంబులను వీక్షించుచు, దివ్యాభరణమాల్యసమలంకృతలై గీతానాదంబుల సొక్కించుచున్న నిలింపనితంబినీమణుల క్రీడాస్థానంబులను దిలకించుచుఁ, జందనాగరు తక్కోలాదిసుగంధి

వృక్షవనంబులనుగాంచుచుఁ, బుష్పితతమాలతరుకాండముతో మరీచాది లతాతతులతో సొబగారుచున్న రమ్యస్థలంబులను సందర్శించుచు, గైరికాదిధాతుకాంతి సమభివ్యక్తంబులై చిత్రపర్ణతోయంబులతో నింపిరోయన సొప్పుచున్న నిర్ఝరంబునకు నానందించుచు, ధనధాన్య సమృద్ధంబులును జనాకీర్ణంబులునైన నగరంబు లతిక్రమించి చనిచని, తొల్లి గర్ముంతుఁడు కచ్ఛపంబు నారగించుటకై కాలూనుటవలనఁ గొమ్మ తెగియున్న సుభద్రనామ న్యగ్రోధంబును దాఁటి కడలియవ్వలి దరిఁజేరి మారీచు నాశ్రమంబుఁజొచ్చి, యందు నియతాహారుఁడై కృష్ణాజినజటావల్కలంబులు దాల్చియున్న యతనిఁ గాంచి తదీయ సత్కృతులంది తనకార్యంబును మరల వానికి నొక్కిచెప్పి యతనిని సహాయపడఁ గోరెను.

మారీచుఁడు రావణునకు మరల హితంబు చెప్పుట

మారీచుఁ డా మాటవిని వేపమానశరీరుండును శుష్కీభూతవద నుండునై రావణుని నిర్నిమేషవృత్తిఁజూచి, 'దశకంధరా! నీ తలంపు వలదంటిని. సమ్మతించితివి. మరల నిన్నెవ్వరు పురికొల్పిరి? ఇచ్చకంబు లాడువారు వేలకొలందిగలరు; హితము పల్కువారు మిక్కిలియరుదు. అదియుఁ బ్రియంబగునేని చెప్ప సాహసింతురు. అప్రియంబగుహితంబును తెంపుసేసి పలుకు దిట్టఱి నూటికొకండు నుండఁడు. అదియు నధికునితోఁ బలుకవలసినప్పుడికఁ జెప్పవలయునా? అయినను నీ మేలుగోరుదును గావునఁ బలుక సాహసింతును. రామపరాక్రమంబు వినియుండవు. అది తెలిసియున్నచో నీకిట్టి సంకల్పం బుదయించి యుండదు. నాయనా! పెద్దవానిమాట వినుము. రాక్షసలోక శ్రేయంబును గోరుదువేని రాముని జోలికిఁ బోవలదు. సీతాదేవి నీకు మృత్యువై జనించెనని యెంతయు దుఃఖింతును. రాజునకు నిరంకుశవర్తనంబు గూడదు; అతఁ డెన్నడును దుర్మతి గారాదు. పాపమంత్రము వానియెడ నంకురింపఁ జనదు. రాజు నిరంకుశవర్తనుఁడును దుర్మతియుఁ బాపబుద్ధియు నగునేని వానిరాష్ట్రంబెల్ల సపరివారంబుగా నశించును. రాముఁడు జనకునివలనఁ బరిత్యక్తుఁడై మర్యాదమాని లోభమునకుఁజిక్కి ధర్మాతిక్రమంబుగా వనములు పట్టి ప్రాకులాడుచున్న క్షత్త్రియాధముండని తలంచితివా? అతఁ డేతన్మాత్రుఁడు గాఁడు. దశరథుఁడు భార్యావంచితుఁడై యా యింతిపంపు నెఱవేర్పనోపక తీఱని మనోవ్యాకులంబునకుఁ జిక్కి యుండఁగాఁ దండ్రియెడరుఁ బాపుటకై ప్రతిజ్ఞాపూర్వకముగా సమస్తముఁ

ద్యజించివచ్చిన మహాశుద్ధసత్త్వుఁడని రాముని గ్రహింపుము. అంతటి సర్వభూత ప్రియుండును ధర్మావతారుండును గలుగఁడు. వానిఁగూర్చి చెనఁటులు నీ చెవిఁగఱచి యుందురు. ఆకూళలమాటలకు భ్రాంతి చెందితివి. సీతాదేవి రాను తేజస్సార రక్షితయై యున్నది. ఆమె నపహరింపఁ దలకొనుట సూర్యప్రభ నపహరింప యత్నించుటగును. ఖడ్గచాపంబులనెడి యింధనంబుల వలన రగిలి శరజ్వాలాభీలమై ప్రజ్వరిల్లు రామాగ్ని కుండంబున నుఱుకకుము. సీతాదేవి రామునకుఁ బ్రాణాధిక గాని వేఱుగాదు. ఆమెను ధర్షింప నీకు సాధ్యమా? రావణా! ఆత్మ క్షేమంబు వలతువేని యిట్టి నీచసంకల్పంబును దిగవిడిచి మరలిపొమ్ము. నీ సచివులు విభీషణాదులు పరమధర్మిష్ఠులుండరా? వారు నీకొఱతలంపు ననుమతించిరా? రామునంతగాఁ బెద్దచేసి పలుకుదువేలయని యడుగ వచ్చును. సంగతి వినుము. తొల్లి నేను వేయి కుంజరంబుల బలంబు గలిగి యెదురులేక సంచరించుచుంటిని. ఋషిమాంసము దక్కఁ యొండు నాకు రుచింపకుండెను. నా పేరు చెప్పినంతనే జడములు సయితము భీతిల్లుచుండెను. విశ్వామిత్రుఁ డంతటివాఁడు గూడ నా దాడికి వెఱచి తన యజ్ఞంబును గొనసాగింప నోపకుండెను. ఆ ఋషీంద్రుఁ డెన్ని సారులో నా వలన భగ్నపడి వెఱవుదోఁపక నిజమఖరక్షణార్థము దశరథునర్థించి పండ్రెండ్లేండ్ల బాలుని రాముని వెంటఁగొనివచ్చి క్రతు వారంభించెను. ఆ సంగతి నా చెవిఁబడినంతనే నా వరగర్వం బుప్పొంగెను. నే నతని మఖశాలఁజొచ్చి యాగవేదిపై నడుగిడితిని. నేను వచ్చు నప్పుడు రాముఁ డా మఖశాలా ద్వారంబున విల్లెక్కుపెట్టి యుండెను గాని యతఁడు నాకుఁ గనుదాళలేదు. నా చరణంబు వేదిపై మూనుటే తడవుగా బాణమొండు నన్నుఁ దాఁకెను. నేను గాలికి దూదినలెనెగసి నూఱుయోజనంబుల దవ్వునఁ బడి చిరకాలమునకు స్మృతివడసి బ్రతికి తిని. ఆ దెబ్బలతోడ నా పూర్వవృత్తి నన్నెడసి చనెను. నేను తాపసి నైతిని. ఆ సంగతి దలంచిన నిప్పుడును నా గుండియలు గభిల్లుమనును. సర్పసంసర్గంబువలనఁ దటాకమత్స్యంబులకు గరుడబాధయట్లు దుర్జన సాహచర్యంబువలన సజ్జనులకు హానిగలుగును. రావణా! నీ దోషంబు నీతోన నంతరింపదు; అది రాక్షసబృందంబునెల్ల రామశరాభిహత మొనర్చును; అసురాంగనలనుఁ దీఱని కడగండ్లఁ గుడుపును; లంకా నగరంబును శరవహ్నిజ్వాలాపరిదగ్ధముఁ గావించును. ఇవన్నియు నీవుఁ గన్నారఁ జూతువు. చెలిమిఁజేసి యింత వచించితిని. నా నెయ్యంబును

గోరుదు వేని రామునిమాట నా క్రమోలఁ బ్రస్తావింపకుము. నీ యపరాధ కారణంబున నాకుఁ జేటుఁ గూర్పవలదు. శూర్పణఖాపరిభావంబును ఖరదూషణ వినాశంబును బురస్కరించుకొని రామునిపయి దోషం బారోపించి పగఁదీర్చికొన యత్నించుచున్నావు. నిజమును గ్రహించి తివా? పరమ పతివ్రతామణియగు సీతాదేవిని నిష్కారణంబుగా బాధించుటకై శూర్పణఖ చని నిజాపరాధఫలంబు ననుభవించెను. సత్య మెఱుంగక సోదరి మాటలు నమ్మి తన్నిమిత్తము ఖరదూషణులు దుడుకుపడి రాముని దాఁకిరి. రాముఁ డాత్మరక్షణార్థము వారిని వధించెను. ఇందు ధర్మవ్యతిక్రమంబుగాని దౌర్జన్యంబుగాని గలదా?' యని నయభయంబుల హితంబు బోధించెను.

రావణుఁడు మారీచుని శాసించుట

మృత్యువును వరించువానికి మందువలె రావణునకు మారీచ హితోపదేశమయ్యెను. అతఁడు క్రోధపరీతచిత్తుఁడై, 'మారీచా! నీ యుపదేశార్థం బింతదవ్వురాలేదు. ఊసరక్షేత్రంబున బీజారోపంబట్లు నాయెడ నీ బోధనలెల్ల వ్యర్థంబులని గ్రహింపుము. ఈ పిఱికిమాటల చేతనే నా నిశ్చయంబు మఱులదు. ఆఁడుదానిమాటకుఁ గట్టువడి తలిదండ్రులను బంధుమిత్రులను రాజ్యంబును సమస్తముఁ ద్యజించి వెఱ్ఱియై పరుగెత్తివచ్చిన వరాటును బెద్దచేసిన నీ యవివేకంబున కెంతయు వగపయ్యెడు. మారీచా! ఇంతకాలము మనినను నీకు రాజ తత్త్వంబు తెలిసినట్లు దోఁపదు. రాజులు మానాభిమానులు; మానంబు నకై ప్రాణంబులఁగూడఁ బాటింపరు; పరశాసనంబు ఋణమాత్రంబును సహింపరు. ఆంతరంగికమంత్రులు సహితము వారికెన్నఁడు నెదురాడరు. హితముఁ దెలుపవలసినప్పుడు గూడ నాప్తసచివులుసయితము భయ భక్తులతో నన్యాపదేశంబుగా వినయమధురోక్తులాడి తమమతంబును సూచింతురు. రాజులు దేవేంద్రాగ్నివరుణసోమాంశంబుల జనించి తదీయ విక్రమతేజ్ఞ శీఘ్ర సౌమ్య ప్రసన్న భావంబులుగలిగి యుందురు. అందు వలన వారు సర్వావస్థలయందును సమాదరణీయులు. మారీచా! ఈ పరమరహస్యం బెఱుంగక యజ్ఞానమోహావశుండవై నీ యింటికివచ్చిన రాక్షసేశ్వరునిఁ బరుసంబులాడితివి. నా వాఁడవని నిన్నుసహించితిని. గుణదోషవిమర్శంబునకై యిందు రాలేదు; హితాహితములఁ గఱపుటకై నిన్నుఁగోరలేదు. నాయాజ్ఞ నీకు విధివిధానము. సంగతి వినుము. నీవు చిత్రసువర్ణమృగరూపంబునుదాల్చి రామాశ్రమప్రాంత

ప్రదేశంబునంబునఁ దారాడి సీతను బ్రలోభించి యథేచ్ఛఁ జనుము. సీత యా మృగంబును గోరును. చిత్రవస్తుసమభిలాషము స్త్రీలకు నైజము. ప్రియురాలి ప్రియంబును సాధించుటకై రాముఁడు నీ వెంటఁ దగులును. నీవు కొంతదూరము చని, 'హా! సీతా! హా! లక్ష్మణా!' యని రామస్వరంబునఁ గేక వేయుము. ఆ ధ్వని చెవిసోకినంతనే రామునకై లక్ష్మణుని సీత తరలించును. అతఁడు మీ మార్గము వెదుకుచు వచ్చును; వై దేహి యొంటరిగానుండును. అది సమయముగా దేవేంద్రుఁడు శచీదేవింబోలె నేను సీతాదేవి నపహరింతును. ఎల్ల యర్థంబులును సమాకూఁతును. మారీచా! ఇది యంత కడిఁది కార్యము గాదు. నాకీయర్థంబొనర్చి యందుకులఁ బారితోషికంబుగా నా రాజ్యంబునం దర్ధ భాగమును గొని చిరసుఖముండుము. మనవ్యూహము ఫలించునేని యుద్ధప్రసక్తియే యుండదు; రాక్షసలోకంబునకెట్టి యెగ్గును బొనరదు; నీవన్న భయము రానోపదు. అట్లుచేయవేని నీకుఁ జూన్య సిద్ధము. రామునకు వెఱతునంటివి. రావణుఁడంత వ్యర్థుఁడా? చక్కఁగాఁ బరామర్శించి నీయిచ్ఛయొనర్పు' మని గంభీరముగా నుడివెను.

రావణమారీచులు రామాశ్రమము వచ్చుట

మారీచుఁడు మహోగ్రంబొంది, 'మందమతీ! మృత్యుముఖంబునఁ దలఁదూర్పనున్నావు. నిన్నిట్టి యుత్పథమునుండి మరలించు మంత్రు లెవ్వరును లేరా? అయ్యో! నీదుబ్బుద్ధికి రాక్షసలోకమెల్ల బలిగానున్నది. నీకుగా నాకును బ్రాణహాని నిక్కము. ఆత్మనాశంబును నేను బుద్ధిపూర్వకముగా వరించుటగాదు. తేనియాజ్ఞానిర్వహణఫలముగా నాకట్టిది కాకతాళీయమగును. నీతో బుద్ధిపూర్వకముగా నద్దాని వరించుచున్నావు. నీకై పెల్లు దుఃఖమగుచున్నది. రావణా! నీచేతి దుర్మరణంబునకన్న రాముని చేతి మరణము నెంతయు గోరుదును. అట్టిచావు నాకు మహోపకారమగును. నీ మేలుగోరి యెంతో చెప్పితిని; నా మాట సుంతయు వినవు. అసన్నమరణులకు హితవాక్యము రుచింపదుగదా' యని నిష్ఠురంబులాడి యొండువెఱవులేక యతని మత మొనర్ప సిద్ధుఁడయ్యెను. లంకాధిపుఁడు పరమసంతుష్టుఁడై, 'ఇప్పుడు గదా నీవు మారీచుఁడవైతి' వని వానిని బ్రశంసించి యతనిఁ గవుంగిటఁ గూర్చి తనరథముమీఁద నెక్కించుకొని విహాయసమార్గముఁబట్టి నదీనద వనపర్వతపట్టణంబులు దాఁటి రామాశ్రమప్రాంతమున దిగి మారీచుని

హస్తముఁబట్టుకొని 'అదిగో కదళీవనము; అల్లదిగో రామాశ్రమ' మని చూపి జాగుసేయకు మనెను.

మారీచుఁడు చిత్రసువర్ణమృగమై సీతాదేవిని బ్రలోభించుట

మారీచుఁడు క్షణములోపలఁ జిత్రసువర్ణమృగరూపంబును దాల్చెను. ఆ కురంగరత్నం బింద్రనీలశృంగశృంగారమై సితాసితముఖ మండలముతో సొబగారుచు సీలోత్పలవర్ణస్నిగ్ధములై నకర్ణపుటంబులు గలిగి నీలరదచ్ఛదముతోఁ గుందేందువజ్రచ్ఛాయాసుందరతరోదర భాగంబుతో మధూకకాంతికాంత పార్శ్వంబులతోఁ బద్మకింజల్కరుచి మనోజ్ఞములైన యితరావయవంబులతో వైడూర్యమణిఖురంబులతో నొప్పారుచుఁ గించదున్నత గ్రీవమై చూడఁ జూడ ముచ్చటలు గొలుపుచు మహేంద్రధనుస్సమానమైన తనవాలంబును గదలించుచుఁ గసివాటుగాఁ బచ్చికలుమేయుచుఁ జివురులు గొఱుకుచు భీతభీతేక్షణం బులఁ జూచుచు నింపుసొంపు దలిర్పఁ జెంగలించుచు రామాశ్రమ ద్వారమున సీతాదృష్టిపథగతమై విహరింపసాగెను. ఆ వింతలేడినిజూచి జింకలు డాయవచ్చి మూర్కొని యథార్థమెఱుంగుటనో యన దిశాక్రాంతములగుచుండెను.

సీతాదేవి మాయామృగంబును తేఁగోరుట

అత్తఱి సీతాదేవి పుష్పాపచయార్థము వనంబునకుఁ బోయి యుండి యా చిత్రమృగంబును గాంచి యాశ్చర్యవికసితనేత్రయై రామ లక్ష్మణులను బిలిచి వారికి నమ్మహాచిత్రకురంగమును జూపెను. లక్ష్మ ణుఁడు దానిని బరికించి, 'అన్నా! ఇది మాయామృగముగాని యొండు గాదు. మారీచుఁ డిట్టిమృగమై మృగయావినోదులైన రాజులను బెక్కండ్ర మోసగించి చంపెనని విందును. ఇట్టి చిత్రమృగంబును సృష్టిలో గనివిని యెఱుంగము' అనెను. సీతాదేవి యెలనవ్వుదాల్చి, 'నాథా! దీని ముఱుపు నా మనస్సు నపహరించెను. మనము దీనినిఁ గ్రీడార్థము పెంచుదము. ఇది మన వనవాసానంతరము శుద్ధాంతంబునకు నపూర్వాలంకారమగును. ఎట్లేని దీనినిబట్టి తేఁగోరుదు. ఇది సప్రాణ ముగాఁ జిక్కదేని దీనిచర్మము మన సుఖశయ్యకు ననువగును. నాథా! భర్తలను స్వతంత్రించి బ్రిబేరేచుట పతివ్రతలకుఁ దగదు. ఈ యవిన యంబునకు మన్నింపవేడుదు' ననెను.

రాముఁడు మృగార్థము పోవుట

రాముఁ డక్కురంగలావణ్యవిలాసవిశేషంబులకు నక్కజపడి భార్యకుఁ బ్రియమొనర్చువాఁడై, 'లక్ష్మణా, ఇట్టి కురంగము నెందుఁ గానము. దీని గోమంబులు కనకబిందు చిత్రితములై తచ్ఛరీరంబునకు వింతశోభను గూర్చుచున్నవి. ఇది నీలంపుఁ బెదవులు విచ్చి యూవులించు నప్పుడు దీని నాలుక సుంత బహిర్గతమై కృష్ణమేఘనిర్గతవిద్యుల్లతను దలపించుచున్నది. కదళీమృగంబులను బ్రియకీమృగంబులను బ్రవేణీ మృగంబులను వేనవేలుగాంచితిమి. అందేదియుఁ గోమలత్వంబున దీనికి సాటిరాదు. తారామృగంబును దీనితో నెనయింపవచ్చునేమో యని సంశయింతును. పురుషులకు మసకే యిది యింతముద్దుసేయుచుండఁగా స్త్రీలసంగతి చెప్పవలయునా? తమ్ముఁడా! జానకి దీనిని గోరెను. ఎల్లిని దీనిని బట్టి తెచ్చియిచ్చి వై దేహీప్రీతిఁ దీర్పవలయును. ఇది నీ వన్నట్లు మాయామృగమైనచో వాతాపిని మహర్షివలె దీనిని మనము వధించి లోకకళ్యాణ మొనరింతము. ఈ కార్యముగూడ మనకు విధి విహితమే గదా. అట్లుగాక యిది నిక్కమైనమృగమగునేని యిట్టిసరార్థము రాజులకెంతయుఁ దగును. రాజులు రత్నహారులనుట సుప్రసిద్ధము. వారు వేటకై గహనాంతరములు దూఱుటయు నందు రత్నాదినిచయంబులు వారికిఁ దొరకుటయుఁ దదర్థముచేత వారు దమకోశంబుల నానాయాసముగా నించుటయు గలదు. మనమో మృగంబులఁ గాకున్నను మృగప్రాయులను వేటాడుటకై వనముఁజొచ్చితిమి. ఇందు మనకీ యనర్ఘమృగరత్నము లభించెను. దీని నుపేక్షించి చనవచ్చునా? లక్ష్మణా! నీ విచ్చటనే యుండి సీతను గాపాడుచుండుము. నేను చని యీ మృగమును బట్టియో కొట్టియో తెచ్చెదను. జటాయువుగూడ సీతోడ నుండును. పలాకువల'దని పలికి పైడిపిడికయిదువును మొలఁ గూర్చి శార్ఙ్గకోదండమునుఁ జేతఁబట్టి తూణీరద్వయమును మూపునవైచి మృగార్థము తరలెను.

మాయామృగప్రతారణము

ఆ మాయామృగం బదిచూచి పెనుగాలికిఁ బఱుగులువాఱు మేఘుంబులబోని చంద్రబింబమువడువున క్షణముగాన్పించుచుఁ దటాలున గను మొఱుంగుచు గుత్తియియ్యక భయంబుననోయన నింగి నెగసి దవ్వగుచు నంతలోన నంతికంబునఁ దోఁచుచుఁ దృటిలోన దూరమునఁ

బొడసూపుచు బహుభంగులఁ జరించెను. రాముఁడు దానిచెయిదంబులు చూచి, 'అహో! ఏమి దీని లీలావిశేషములు!

"మ॥ పఱచున్ దవ్వుగఁ జేయలంతినిలుచుం బట్టిక యాసాసలం
బిఱుచోవుం బొదలందుడిందుఁ బొడమున్ బిట్టుల్కి వేదాటుఁ గ్ర
మ్మఱఁ జూచుం జెవిదార్చినిల్చు మలయున్ మట్టాడుఁ గోరాడు నే
మఱినట్లుండు దృణంబుమేయు నలయున్ మాయామృగం బిమ్ములన్॥"

అని దాని ప్రతారణంబులకుఁ గోపంబును దాని సొంపునకు మహా మోహంబును బొందుచు దైన్యధీభావగతుఁడై దాని ననుసరించి కడుదూరముచని యటఁగొండొకవృక్షము నీడ నిలిచెను. ఆకురంగము తటాలున దృష్టిగతమై వన్యమృగములఁగూడి పరుగెత్తసాగెను. రాముఁడు దాని చదురులఁ దుదిముట్టింప నిశ్చయించి బ్రహ్మనిర్మిత దివ్యాస్త్రంబును సంధించి యాకర్ణాంతము దివిచి దానినిగుఱిచేసి వైచెను. ఆ బాణము వజ్రిపాతమువలె నక్కురంగము పయిఁ బడి దూఱిచనెను. ఆ మృగంబట్లు ప్రేటుగొని తాళప్రమాణమెగచి పడి స్వస్వరూపముఁ దాల్చి, 'హా! సీతా! హా! లక్ష్మణా!' యని రామస్వరంబున నెలుగెత్తి యఱచి ప్రాణంబులు విడిచెను. ఆ వింతఁ గాంచినంతనే రామునకు లక్ష్మణవచనంబులు స్ఫురించెను. సీతాదేవి వాని హృదయదర్పణంబునఁ బ్రతిబింబించెను. ఆ యఱపులు సీతాలక్ష్మణులకు భ్రాంతిజనకంబులగునో యని రాముఁడు తహతహపడి వేవేగ నొండుమృగంబును వైచి దాని మాంసమును దీసికొని యాశ్రమ పథముఁబట్టి హుటాహుటి నడచెను.

సీతాదేవి లక్ష్మణుని గఠినోక్తులాడుట

ఆ కేకలు చెవిసోకినంతనే సీతాదేవి మహా ఖిన్నయై లక్ష్మణుని జూచి, 'మీ యన్నగారి యార్తరావంబును విందువా? నా హృదయము తల్లడిల్లుచున్నది; ప్రాణములు నిలువవు. ఆయన యెందున్నాఁడో సింగంబులకుఁ జిక్కిన యాబోఁతువలె రాక్షసులకుఁ జిక్కి యార్తుఁడై పరితపించు చున్నాఁడో యేమో హుటాహుటిఁ బొమ్ము; జాగుసేయకు; నా పతిని రక్షింపు' మని సౌమిత్రిని ద్వరపఱచెను. ఆమె యెంత త్వర పెట్టినను లక్ష్మణుఁడు కాలు కదలింపక యల్లే యుండెను. అందులకు నామె పరమకుపితయై, 'దురవస్థాగ్రస్థుని నీ యన్నను రక్షింపఁబొమ్మని త్వరపెట్టినను జనవు. నీ మతం బూహింపరాదు. హితశత్రువులు తప్ప యెరు లిట్లూనరర్రు. నన్ను గాంక్షించి రామవినాశంబును హర్షింతువా?

కాకున్న వాని యెడరు సహింతువా? నిక్కపుంగూర్మితమ్ముఁడు భ్రాతృ క్లేశంబునకు నెమ్మదినుండునా? నీవు రామార్థమిందువచ్చితివిగాని నా కొఱకు గాదు. రాముఁడు ప్రాణసందిగ్ధావస్థనుండఁగా వానిక్కై బరుగిడక నా కడ నుండనేల? నీ రక్షణ నా కక్కఱ లేదు.' అని కఠినంబుగాఁ బలికి కన్నీరొలుకుచు సంత్రస్తహరిణి కరణినుండెను. లక్ష్మణుండామె కెంతయు వగఁజెంది, 'దేవీ! రామునకుగా నీ భయంబు వలదు. ముక్కోటిదేవత లెత్తివచ్చినను జరాచరసమస్త ప్రపంచము పైకొనినను వానికి గోరంత యేని యెగ్గు రానోపదు. ఈ వనంబున నిన్నొంటరిగా వదలిపోఁజాలను. నీవు విన్నది నాయన్న కంఠధ్వని గాదు. మహామాయావి మారీచుం డట్లఱచెను. మనోవ్యాకులంబును మాని సమాహితవగుము. నాయన్న మాయామృగంబును వధించి శీఘ్రముగా నిందువచ్చును. నీరక్షణార్థము నన్నిందుంచి యాయన చనెను. వానియాజ్ఞ దాఁటరాదు. ఖరదూషణు లను వధించినది మొదలు రాక్షసులు మనయెడఁ బగఁ బూని యున్నారు. ఆ వైరంబును సాధించుటకై వా రెన్నోమాయలు పన్నుదు' రనెను.

లక్ష్మణుఁడు రాముని కొఱకు పోవుట

సీతాదేవి కన్నులెఱ్ఱసేసి, 'నృశంసా! అనార్యమైన సంకల్పంబు నెదలో దాఁచికొని యిట్లాడుచున్నావు. ప్రచ్ఛన్నవైరులను ద్రోహ చింతనము పాయదు. ఈదురీప్సితంబు నీకు స్వయంబుగా నంకురించెనా? లేక భరతుని దురుపదేశంబును వింటివా? నీవు రామరక్షణార్థంబు వచ్చుట నిమిత్తమాత్రమని నేఁడు స్పష్టమయ్యెను. నీకోరిక కొన సాగదు. రామపత్ని యన్యులను గడకంటఁ గూడ జూడదని నమ్ముము. రామునిఁ బాసి సీత నిమిషంబేనియు జీవింపదు. ఇదిగో నీసమక్షంబు ననే ప్రాణములు త్యజింతు' ననెను. హృదయశోకాలంబులైన యా పరుషవచనంబులను లక్ష్మణుఁడు విని చేదోయి యెత్తి, 'మాతృదేవతకు నీకు బదులాడనోడుదు. అనుచితభాషణంబులు స్త్రీలకు సహజంబులు. స్త్రీబుద్ధి చంచలాచంచలము. అది ధర్మమును బాటింపదు. క్రౌర్యం బును బాయదు. ప్రాణమిత్రులు గూడ స్త్రీకారణంబున దుర్వారవైర దగ్ధులై నశింతురు. నీపలుకులు పంచమహాగ్నిపరితప్తసాయకంబులై ననన్నెంతయు బాధించుచున్నవి. అన్యాయముగా నన్నిట్లాడుదువు. ఇందులకై యీవనదేవతలే సాక్షులగుదురు. నా యన్న యాజ్ఞను దలఁదాల్చి యున్న నన్ను సంశయించి నాకు నక్రమంబుగా నిందను

మూటగట్టు నీవు పరిదగ్ధవై నశింతువు. ఇదిగో నేను నాయన్న కడకుఁ జనుచున్నాను. వనదేవతలు నిన్ను రక్షింతురుగాక.' అని రెండడుగులు చని, 'అయ్యో! భయంకరంబులైన దుర్నిమిత్తంబులెన్నో తోఁచుచున్నవి. రామునితోడ మరలి వచ్చి నిన్నుఁ జూతునో లేదో తెలియరా' దనెను. సీతాదేవి కన్నీరు నించుచు, 'నా రామునిఁ బాసి యఱనిముసంబైనను జీవింపజాలను. ఉరియో విషమో యనలమో గోదావరియో నాకు శరణంబగుఁగాక. పరపురుషాభిమర్శనంబునకు నా శరీరంబు నర్పింప'నని పలికి గుండియలు మోమునొనుచు నిలపింపసాగెను. లక్ష్మణుండామెకు నమస్కరించి కోపము ముందునకును రామునాజ్ఞ వెనుకకును లాగుచుండుట వలన డోలాందోళితహృదయుడై యతిప్రయత్నంబున నచటువాసి యన్నకడకుఁ జనెను.

తే॥ గీ॥ జ్ఞానవిజ్ఞానభాగ్యంబుఁ గలిగియున్న,
హితులయుపదేశవాక్యంబు లెన్ని విన్న,
దైవమేవచ్చి వలదన్నఁ దరముగాదు
కర్మగతికిఁ జిక్కినబుద్ధిఁ గ్రమ్మరింప॥

రావణుఁడు సన్యాసివేషము దాల్చి వచ్చుట

లక్ష్మణుండట్లు పోవుట రావణుఁడు చూచి తన వ్యూహము ఫలించుట కెంతయు సంతుష్టుండై వినీతవేషంబును దలపోసి కృతనిశ్చయుండై,

"సీ॥ ముడిచిన యొంటికొండడ మూయ నువ్వలై
మెఱుఁగుతోలు కిరీటమున ధరించి,
కకపాల కేదారకటకముద్రితపాణిఁ
గురుచ లాతాముతోఁ గూర్చిపట్టి,
యైణేయమైన యొడ్డాణంబులవణిచే
నక్కలించినపాట్ట మక్కలించి,
యూరకూటచ్ఛాయ నవఘళింపఁగజాలు
బడుగుదేహంబున భస్మమలఁది,

గీ॥ మిట్టయూరమున నిడుయోగపట్టె మెఱయఁ
జెవుల రుద్రాక్షపోఁగులు చవుకళింపఁ
గావిబుసంబు జలకుండికయును బూని
మాయసన్యాసియయ్యె సమ్మాయలాడు॥"

రావణుఁడట్లు సన్యాసివేషముధరించి శ్రుతులఁబఠించుచు వచ్చి యా భూపుత్రినిఁ గన్నారఁ జూచి,

"సీ॥ నెత్తమ్మికేకుల మెత్తదనముఁదెచ్చి
యచ్చునఁ బెట్టినట్లందమొంది,
చక్రవాకంబుల చందంబుఁగొనివచ్చి
కుప్పగావించిన ట్లొప్పుమెఱసి,
చందురునునుగాంతికందేర్చికూర్చి బా
గునకుఁదెచ్చినయట్లు కొమరుమిగిలి,
యలికులంబులకప్పు గలయంతయునుబుచ్చి
నాఱుపోసినభంగి నవకమెక్కి—

గీ॥ యంఘ్రితలములుఁ గుచములు నాననంబుఁ
గచభరంబునునిట్లున్న రుచిరమూర్తి
యనుపమానభోగంబుల కాస్పదంబుఁ
గాననొనె యెందేనియుఁ గలుకులంగు?"

వ॥ నెఱికురులుఁ విలోలసితనేత్రయుగంబును నొప్పుతెప్పవా
తెఱయును దీనియాననము చెల్వుఁగరంబు మహోరంబు నా
యెఱిఁగిన యంతనుండి సతి నిట్టిలతాలలితాంగిఁ జూచియే
నెఱుఁగ సురేంద్రకన్యకలు నిట్టిరె? రూపవిలాససంపదన్॥

"సీ॥ ఇయ్యింతిప్రాపున నయ్యనంగుఁడు పార్వ
తీశునైనను దక్క— నేలకున్నె?
యిన్నాతిచెలువంబుఁగన్న శచీప్రియుం
డైనను గనుకలి నవయకున్నె?
యిత్తన్వికెనలేమి కెదిరిపన్నిదము భా
వావిభుతోనైనఁ జఱపరాదె?
యిత్తలోదరిజీవితేశున కిందిరా
పతినైనమెచ్చక పలుకఁ జనదె?

గీ॥ కుసుమబాణునిబాణముల్ గూడనైదు
గరగి నేరిమి వాటించి కరువుగట్టి
పోసిచేసి చైతన్యసంపుటము దగ ఘ
టించిరో? కాక యిట్టిచేడియలుగలరె?"

అని లోలోనఁ దలపోసి విస్మయమంది విలంబము తగదని నిశ్చయించి సూర్యచంద్రులులేని వేళ సంధ్యను జీకటి పొరయునట్లుగా, రజనీకరుఁడులేని తరుణంబున రోహిణి నంగారకుఁడు డాయుసరణిఁ, జిత్రానక్షత్రంబును శనైశ్చరుఁడు పొందుకరణిఁ, బతిచింతఁగూర్చి

తదేకచిత్తమై యేకాకిగానున్న యా పరమపతివ్రతారత్నంబును సీతాదేవి నతఁడు సమీపించి, వేదములు సుంత పఠించి, 'సువర్ణగాత్రీ! పీతకౌశేయవాసినీ! కమలమాలికను దాల్చినపద్మలతవు నీవెవతెవు? వరారోహా! హ్రీకాంతవో శ్రీకాంతవో కీర్తికాంతవో భూతికాంతవో పార్వతివో వచింపుము. కుందకుట్మలంబుల మెచ్చని రదనశ్రేణితోో, విమలాయతరక్తాంతకృష్ణతారకామనోజ్ఞంబగు కందోయితోఁ, గరిక లోరుయుగ్మంబుతోో, సమున్నతవృత్తంబులై యొండొంటి నొరయుచు మణిహారశృంగారాతిశయంబునంది కోరికలీరికలెత్తించు చన్నవతోఁ, బిడికిటకుఁ జాలు లేఁగానుతోో, హరినీలమేచకకుంతలంబులతోో, నొప్పారు నీ సౌందర్యముఁ జూడఁజూడ ముచ్చటయ్యెడు. చతురాస్యుఁడు తనసృష్టి కళానైపుణ్యంబునకుఁ బరమావధిగా నిన్ను సృజించెఁగాఁబోలు. తలోదరీ! నా చూడని మనుష్యాంగనలు గలుగరు; నా కంటఁబడని దేవగంధర్వయక్షకిన్నరపన్నగపద్మముఖులు లేరు; ఎందు నిట్టి రూప లావణ్యంబులు గానరావు. నదీప్రవాహము తీరముంబోలె నీ చెలువంబు జితాత్ములమనంబును సయితము క్షణమాత్రంబున హరించుట వింత గాదు. ఇట్టి యలౌకిక వయోరూపసౌందర్యవతివి నీ వివ్వనమందు నొంటినుండనేల? నీ కెంతయు దిగులయ్యెడు. ఈ గహనసీమయందు ఘోరాకారులును గామరూపులునైన రాక్షసులుందురు. ఇచ్చోట నీవుండరాదు; స్వస్థానంబునకుఁ జనుము. శోభనాకారా! నీధరించిన లోకోత్తరమాలికావస్త్రభోగ్యద్రవ్యంబులవలన నీ భర్త సరోత్తముండుగా నూహింపనగును. శాతోదరీ! దేవతాంగనవో రుద్రసతివో వాయుపత్నివో వసుప్రియవో చెప్పుము. కళ్యాణీ! ఎవతెవు? ఎవరి దానవు? ఎందుండివచ్చితివి? ఏలవచ్చితివి? ఇందుండనేల? వివరము వినుపింపు' మనెను.

సీతాదేవి మాయాసన్యాసిని సత్కరించుట

"మ॥ కమనీయంబగుజన్నిదంబు శిఖయుం గౌపీనముం ధాతు వ
స్త్రము దండంబును గుండియుం గుశపవిత్రంబుం గడున్ వృద్ధభా
వము సంధిల్లఁ ద్రిదండివేషధరుఁడై వల్లించుచున్ వేదముల్
సముదారస్థితినున్నవానిఁగని ప్రాంచద్భక్తి దీపింపఁగాన్॥"

సీతాదేవి వానికి భయభక్తులతోో యథోచితసత్కారంబులొనర్చి యాసనంబిచ్చి తన వృత్తాంతంబెల్ల వినిపించి, 'బ్రాహ్మణోత్తమా! తమగోత్రనామచరిత్రంబుల వినవలతు' ననెను.

మాయాసన్యాసి నిజరూపంబుఁ దెలుపుట

ఆసన్యాసి చిఱునవ్వు నవ్వి, 'సీతా! నన్నెఱుంగవా? ఎవని నామోచ్చారణంబు దేవాసురనరపన్నగలోకంబులకుఁ జండశాసనం బగునో యా రాక్షసేశ్వరుండను రావణుండను గదా! సుందరీ! పీతాంబరముఁగట్టి సువర్ణప్రతిమంబోలి సొబగారు నీరూపంబు నా హృదయంబును మదీయ శుద్ధాంతకాంతాజనపరాఙ్ముఖం బొనర్చెను. భాగ్యవతీరత్నమా! సాగరమేఖలావలయిత లంకాపట్టణంబునకు దేవివై మఱున్నారీమణులను గనుసన్నల శాసించుచు ననుఁగూడి నిఖిల కామోపభోగంబులఁ జూఱలాడుము. సుకుమారీ! వనవాసక్లేశంబులకు నీ వెంతయుఁ దగవు. మోహనాంగీ! వేయిమాటలేల?

"చ॥ ధరణి నతిప్రతాపబలదర్పమునఁ బిన నేన పెద్ద నె
వ్వరికిని మున్ భయంపడనివాఁడ భయార్తుఁడనైతి నిప్డు పం
కరుహదళాయతాక్షి దయుఁగావుము నన్ను భవన్నిమిత్తదు
ర్భరతర పంచబాణహతిఁ బంచతఁ బొందకయుండునట్లుగాన్॥"

అని నిజమోహావేశంబును వెలిపుచ్చెను.

సీతాదేవి రావణునిఁ దిరస్కరించుట

ఆకఠోరవచనంబులకు వైదేహి పరమకుపితయై, 'దురాత్మా! పర్వతంబువలె నక్షోభ్యుండును సముద్రమువలె నతిగంభీరుండును దేవేంద్రసమానుండును నైన రాముని కూర్మిపత్ని నిట్లాడ జంకుజనింపదా? సత్యసంధుండును మహాభాగుండును సర్వలక్షణసంపన్నుండును వట వృక్షంబునకుఁ బరిమండలముపోలె బంధుజాలముఁ గలవాఁడును నైన రాముని పత్ని యన్యపురుషునిఁ గ్రీగంటనేని చూచునా? అధమా ధమా! గోమాయువు సింహిని గోరునట్లు నీవు నన్ను గోరుచున్నావు. సూర్యరశ్మినినట్లు నన్ను నీవు ముట్టనోపవు. రామపత్నిని వలచు మందభాగ్యుఁడనతికాలంబుననే కనకవృక్షంబులను గాంచుట సిద్ధము. మందరాద్రి నఱచేతఁబట్టఁగా నుంకింపవలదు; కాలకూటంబును మింగ్రి బ్రదుకునట్టి యడియాసలు మానుము; సూదితోఁ గన్ను తుడువకుము; కత్తిని నాకవలదు; మండునిప్పు నొడిఁగట్టకు; శూలాగ్రములమీఁద నడవకు. చలిచీమ మహాసముద్రంబును దాఁటిన దాటుఁగాక; సీసము బంగారమైన నగుఁగాక; బురద చందనమైన నగుఁగాక; ఈఁగ వజ్రంబును మ్రింగిన మ్రింగుఁగాక; నీవెన్నఁడును రామనఖాగ్రంబునకుఁ

గూడ సాటిరావు. ఇంక నీదుర్మదంబును మాని వచ్చినదారిఁ బొమ్ము.' అని నిరసనభావవిస్పష్టంబుగాఁ బలికెను.

రావణుం డా తిరస్కారభాషల జీరికిఁగొనక 'విలాసినీ! ఇంత యజ్ఞానముండునా? ఎవని బాహుపరాక్రమోన్నతికిఁ గుబేరుఁడు తన పుష్పక విమానంబును గానుకఁ బెట్టి కైలాసంబునకు వలసపోయెనో, ఎవని యాగ్రహంబునకు హస్తగతప్రాణియై దేవేంద్రుండలమటించునో, ఎవనికిఁ గాల్బంటయి వాయువు సుఖస్పర్శముగా వీచుచుండునో, ఎవని శాసనంబున వేవెలుంగు చలివెలుంగయ్యెనో, ఎవని యాజ్ఞకు జడిసి నదీప్రవాహంబు లుజ్జగించునో, యట్టి లోక విద్రావణుని రావణుని నిరసింప నీకుఁగాదు. రాజపుత్రీ! పాండురప్రాకారశోభితంబును వైడూర్యతోరణాభిరామంబును హేమకక్ష్యావిరాజితంబును నానో ద్యానసుందరంబును జతురంగబలసంబాధంబును నైన లంకాపురంబునకు నరుదెంచి యందు నాతోడ లోకోన్నత భోగభాగ్యాతిశయంబుల ననుభవింపుము. మోడివలదు. నీ భర్త మృత్యువునోటఁ దలఁదూర్చెను. ఆ నరాధముండంత పరాక్రమశాలియేని దశరథుండు వానిని గుట్టలకుఁ దోలి యతని రాజ్యంబును భరతునకుఁ గట్టునా? రాముని పరాక్రమంబును నాకడఁ బోగడుదువా? సుకుమారీ! దేశనిష్కృతుండై వనాంతరంబునఁ దాఁగి కందమూలంబుల జీవించు మందభాగ్యుండు నీ కెట్టి సుఖంబును గూర్ప నేర్చును? కోమలాంగీ! కష్టంబులను వరింప వలదు. నా రాజ్యంబున సమస్తభోగంబులు సిద్ధంగా వేచియున్నవి. భీరూ! రామునకు వెఱచి యిట్లాడుదువా? ఆ నరాటుం డేమి సేయనోపు? అతని నింక మఱచిపొమ్ము. కామినీమణీ! వలచి వచ్చినవానిని ద్రోయరాదు. ఊర్వశీ పురూరవసుల చరిత్రను మఱచితివా? రా రమ్ము నా వెంట; ఇదే సరసంబగు' నని మరల నొక్కి పలికెను.

రావణుఁడు సీతాదేవిని హరించుట

సీతాదేవి వెచ్చనూర్చి, 'దురాత్మా! సర్వభూతనమస్కృతుండైన కుబేరునకుఁ దమ్ముండవని పలుక సీకు సిగ్గులేదా? నిదుర్బుద్ధికతన భవదీయ కులంబెల్ల నశింపనున్నది. ఇంద్రపత్ని నవమానించువాఁడు బ్రతికినను బ్రతుకవచ్చును గాని రామపత్ని నవమానించువాఁడు బ్రదుకుట కల్ల. అమృతంబుగూడ నట్టివానిని గాపాడనోపదు.' అని నిరసననిష్ఠురంబుగా నుడివెను. రావణుఁడంతఁ జేఁజేయితట్టి, 'ఉన్మత్తవు

గావున నా వీర్య పరాక్రమంబులను జెప్పినను గ్రహింపవు. సప్త సముద్రంబులను దిగద్రావి యగస్త్యుని మఱపింతును; ఇదే చూడు నా నిజరూపం' బని చెప్పి స్వస్వరూపంబుఁ దాల్చి కాలభయంకరుండై బుధుఁడు రోహిణింబలె వైదేహినిఁ గవసి వామహస్తంబునఁ దత్కేశ జాలంబును దక్షిణకరంబున నామె యూరుయుగ్మంబును బట్టి యా పతివ్రతామణి నెత్తికొని నిజస్యందనంబునఁ గూర్చుండఁబెట్టి గగన మార్గముఁ ద్రొక్కెను.

సీతా విలాపము

సీతాదేవి యారక్కసుని దుండగంబునకు భయవిహ్వలయై, హా! లక్ష్మణా! హా! గురుచిత్తప్రసాదకా! నీమాట వినక రాక్షసాధమునకుఁ జిక్కితిని.

ఆ॥ వె॥ అన్నయానలేక యడుగైనఁజననన్న,
వేఱుతలఁచి యంటి వెఱ్ఱినుడులు,
దాని పాపఫలము దారొక్కొ నె లక్ష్మణా!
చెనటిమతికి నెట్లు సేగి తప్పు?

"శా॥ ఆన్నా! లక్ష్మణ! నిన్నుఁబుణ్యనిధి నే నజ్ఞానినై పల్కితిఁ,
నన్నాపాపము వచ్చిచుట్టుకొనియెఁ, నాపాలిదైవంబవై
యి న్నీచుం బరిమార్ప వేఁగఁబఱతేవే నన్ను రక్షింపుమీ,
యన్నం గ్రక్కునఁ జీరవే యరుగవే యత్యుగ్రశీఘ్రంబునఁ॥"

'హా! రామా! ధర్మార్థంబు సర్వముం ద్యజించిన మహానుభావా! రక్కసుని యీ యధర్మంబునుఁ గంటివా? పరంతపా! దుష్ట శిక్షణార్థము వచ్చితివి; ఈ పరమదుష్టుని శాసింపవా? ఓగీ శరా! రావణా! సస్యము ఫలించుటకు బుఱువట్లు దుర్జనులు స్వకర్మఫలం బనుభవించుటకుఁ గాలము రావలయును. నీకిప్పు డట్టి కాలంబు దాపరించెను. రామునివలన నీకు జీవితాంతఘోరవ్యసనంబు తప్పదు. హా! నాథా! నా యీ గతి యెవరివలన నీకుఁ దెలుపుదు! కర్ణికారములారా! రావణుఁడు నీసీత నపహరించెనని రామునకుఁ జెప్పరా? ప్రస్రవణ పర్వతమా! నీకు నమస్కరింతును; నా గతి మదీయ విభునకు విన్న వింపుము. దేవీ! గోదావరీ! నీకు వేయిప్రణామంబులు. నా స్థితిని నా వల్లభునకు వినిపింపుము. వనదేవతలారా! కయిమోడ్చి వేడుదు; మీరేనియు నా దురవస్థను నాపాలి దైవంబునకుఁ దెలిపి పుణ్యముఁ

గట్టికొనరా ; వనమృగంబులారా ! విహంగంబులారా ! శరణు శరణు; నా రామునొద్దకుఁ బఱచి నా సంగతిఁ దెలుపరా ? ఆ మహానుభావుండు నా యునికి నెఱుంగునేని నన్ను యమగర్భంబునుండియైనను రక్షించును.

సీ॥ చూతురే మీర లో చూతవృక్షములార !
రాక్షసాధమని దుర్భార్గ మెల్ల ?
కాంతురే మీర లో కర్ణికారములార !
కామాంధకారుని కార్య మెల్ల ?
దిలకింతురే మీరు తిలకభూజములార !
పాపావతారుని పాటు లెల్ల ?
వీక్షింతురే మీరు విహగరాజములార !
కర్మచండాలుని గడుసు లెల్ల ?

గీ॥ నగములార ! యో వివిధపన్నగములార !
గోవులార ! చరాచర జీవులార !
రామరాజన్యమౌళి కీరామగతిని
మనవిసేయరే మీకు నమస్కరింతు.

చ॥ జడజములైన తమ్ములకుఁ జైతము గూర్తువు సంతసంబు, నీ
పాడఁ గనినంతనే యిరులు పోవుఁ బరాబరి, వేయికేల మ
ల్లుఁడవు, భవత్సమక్షమున లుబ్ధుఁ డొనర్చెడిదుండగంబు ని
వ్వడిఁగని మిన్నకుండ భవాదృశయోగ్యులకౌనె ? భాస్కరా !

హా ! సర్వసాక్షీ ! నా పాపంబు నిన్నడ్డగించుచున్నదా ? అయ్యో ! నావిధి కేమందు ?

శా॥ ఏలావచ్చెమృగంబు ? వచ్చెనదిపో, యేలా పడెం గంట ? నే
నేలా కోరితి దాని ? నాగు దయితుండేలా చనెఁ లేడికై ?
ఏలా లక్ష్మణు నాలకింపక మహాహీనోక్తులం బల్కితిం ?
గాలం బీక్రియ మూఁటెనాకుఁ దృటిలోఁ గాపాడ దిక్కెవ్వరో ?

అనుచు గుండియ లవియునట్లుగా విలపింప సాగెను. ఆ దారిలో యాదృచ్ఛికముగా వృక్షాగ్రమున జటాయువు గాన్పించెను. వానిని జూచి, 'గృధ్రరాజా ! పాపాత్ముఁడీరాక్షసుం డనాథనువలె నన్నపహరించుచున్నాఁడు. ఈ నిశాటుఁడు సత్త్వవంతుండును సాయుధుండును గావున వీని నెదిరింపఁగాదు. నా గతి రామలక్ష్మణుల కెఱిఁగింపు' మని గద్గదస్వనంబునఁ గుయ్యిడెను.

జటాయువు రావణులయుద్ధము

నిద్రావశుండైయున్న యజ్జటాయు వయ్యార్తరావంబువలన మేల్కాంచి కనువిచ్చి చూచి సంగతి గ్రహించి, 'ఆ! రావణా! వలదు వలదు, ఈ దుండగంబువలదు. గృధ్రరాజు జటాయువు మాట వినుము. రాముఁడు సర్వలోకహితుఁడు; వాని ధర్మపత్ని యీ సీతాదేవి పరమ పతివ్రతారత్నము. ఆమె నపహరింపఁ దగదు. ధర్మస్థితుఁడు పరదారలఁ జెనకవచ్చునా? సీతాదేవి రాజపత్నిగాని యొంటుగాదు. రాజమహిషి యెల్లరకు రక్షణీయగదా? ఈ నీ కార్యంబును లోకంబెల్ల గర్హించును. ఇట్టిది నీచులకు నగునేగాని పండితులకుఁగాదు. ఆత్మపత్నినట్లు పర పత్నిని రక్షించుట ధర్మము. శాస్త్రదుష్టంబులైన ధర్మార్థకామంబులను శిష్టులెన్నఁడును గోరరు. రావణా! నీవు రాక్షసేశ్వరుండవుగాని సామాన్యుండవుగావు. ధర్మరక్షణము నీకును విధివిహితమగును. ధర్మార్థ కామంబులకెల్ల రాజు మూలంబగు. రాజు ధర్మబాహ్యుండగునేని వానిరాష్ట్రమెల్ల నశ్లేయగును. 'యథారాజా తథాప్రజా' యనవినవా? దశకంధరా! నీ కీ విపరీతబుద్ధి యేల జనించెను? ఇంతటిక్రౌర్వ్యదంపుసేత యగునా? ఇట్టి చపలునకుఁ బాపస్వభావునకు సిరిదక్కునా? రాముఁడు నీకేమి యెగ్గొనర్చెను? వానికి నీవు నిష్కారణంబుగా నపకారం బొనర్పనేల? ఖరుని వధించెనందువా? అది రాముని తప్పుగాదు. రావణా! ఆత్మహితంబును గోరుదువేని సీతాదేవిని వదలిపుచ్చుము. ఒండుచో రామకోపాగ్నికుండంబునఁ బడి నామావశిష్టుండవగుదువు. కాలపాశము నీ యఱుతఁ దగిలియుండుట నేరవైతివి. లంకేశ్వరా! నా వచించు హితంబు వినుము. మోయరాని బరువును రోగకారియైన పదార్థంబును ధర్మహానియగు కార్యంబు నెవనికిని గావు. రావణా! అరువదివేలయేండ్ల వగ్గు ముదుసలి యని నన్నుఁ దలంపవలదు. ఆయుధ సంపత్తి నాకు లేదనుకొనకు. ఏమైననగుఁగాక, నీ దుండగంబును సాగనీయను. స్వతఃప్రమాణభూతమైన వేదశ్రుతి వేదవేత్తలమ్రోల నన్యథాకరింపరానట్లు సీతాదేవిని నాయెదుట హరింపఁజాలవు. అసు రాధమా! దొంగిలించి పఱచుట మగతనమా! రావణా! సిగ్గఱివై యింతకుఁ దెగించితివా? శూరుండవేని యెద యిచ్చి నిలువుము. కుశీలాధమా! రామలక్ష్మణులు దూరాననుండి రాకమున్నే వారిని గనుఁబ్రామి పోవ యుత్సహించుచున్నావు. నీ యీ టకటొంకరితనంబును జాలింపుము. జటాయువు బ్రతికియున్నంతకాలము రామునిభాగ్యదేవతను

నీవు గొనిపోఁ జాలవు. ఇది ముమ్మాటికి నిక్కము. నా ప్రాణంబు లుంకువఁ బెట్టియైనను నేను రామునకును నా మిత్రుండగు దశరథునకునుఁ బ్రియంబు సేయుదు' నని పలికెను. రావణుఁ డావచనంబులు చెవిఁ బెట్టక పరుగెత్తసాగెను. జటాయువందులకుఁ గనలి

"ఉ॥ ఓరిదురాత్మ యీయబలనోడక యేటికిఁబట్టినాఁడ వం
భోరుహనేత్ర విద్వు మెటవోయినఁ బ్రాణముఁగొందు నింక ను
గ్రారివిభేదివిక్రము జటాయు నెఱుంగవె చావుమూడె నీ
కోరయఁ గానిచోఁ ద్రిభువనాధిపుపత్నిని గోరుదే మదిన్."

శతాధమా! నిలునిలుము. నాయిచ్చు రణాతిథ్యంబును గైకొనుము. ఇదిగోచూడు తొడిమవిడిన పండుపలెఁ గ్రింద దొర్లనున్నా' వని గద్దించి పలికెను.

రావణుఁడు దురాగ్రహుండై ధర్షించి జటాయువును దాఁకెను. ఇరువురు నొండొరు వాతోద్ధూతాభ్రంబులకరణి మార్కొని తుములం బుగాఁ బోరిరి. రావణుఁడు నాళీకనారాచంబులను గురిపించెను. జటాయువు వానినెల్లఁ బక్షవిక్షేపంబునఁ దట్టివైచి శితశలీముఖములఁ బోని నిజనఖాగ్రంబుల రాక్షసాధముని నిలువెల్ల నక్కి చీల్చి చిందఱ వందఱ గావించెను.

"మ॥ ఘనపక్షాఘాతులం బ్రకోండపరిఘాతంబులం దీవ్రశా
తనఖోచ్చేదములం బ్రదీప్తశరవేధక్రీడలం గ్రూర చం
చు నిపాతంబులఁ బ్రౌఢకుంతముఖవిస్ఫోటంబులం దత్ఖగే
ద్ర నిశాచేంద్రులపోరు సాధనసమత్వస్ఫూర్తి నొప్పెం గడున్."

"చ॥ పటుతరపక్షిపక్షముఖపాతనఖప్రవిఘాత ఖండిత
స్ఫుటితశరీరుఁడై బహుళశోణితధారలు మేనఁగ్రమ్మఁగాఁ
దటసముపాంతనిర్గళితధాతురసారుణసాంద్రనిర్ఝరో
త్కటకులశైలలీల దశకంఠుఁడు నిల్చెనకుంఠితస్థితిన్."

అట్లు రాక్షసేశ్వరుండు వ్రణాంకితుండై నెత్తురులొలుకుచు మహా తీవ్రసాయకంబులఁ బదింటిఁ గైకొని సంధించి యాకర్ణాంతము దివిచి పక్షిరాజుపై నేసెను. జటాయువు శరవిద్ధుండయ్యు సీతావ్యసనంబునం జేసి యాత్మక్లేశంబును లెక్కింపక రక్కసుమీఁదికి నుఱికి తదీయ శరాసనంబును నఖాగ్రంబులఁ ద్రుంచెను. లంకాపతి వేఱొండు చాపంబుఁ గైకొని నూరార్లుగా శరంబులను గృధ్రరాజు పయిఁ గురిపించి యతనిని శరపంజరబంధితునిగా నొనర్చెను. అప్పతగేంద్రుఁడు విజృం

భించి తన్నుఁ జుట్టియున్న యంబకంబులనెల్ల నిజపక్షవాతంబునఁ జిమ్మివైచి యసురచాపంబును పాదతాడనంబుల ఖండించి వాని కవచంబును నుగ్గునూచ మొనర్చి తదీయ రథఖరంబులను వధించి స్యందనంబును తుత్తునియలుగావించి ఛత్రచామరంబులను జీగాకుపఱచి సారథిని ముక్కునవ్రచ్చి కూలఁద్రోసెను. రావణుఁడు భగ్నధన్వియు విరథుండునై సీతాదేవిని జంకనిడుకొని గగనంబునకు నుద్గమించెను. జటాయువు వానిని వెన్నంటి యెగచి తఱిమి యడ్డగించి, 'రావణా! రాక్షసకుల నాశంబునుగోరి యీ క్రూరకార్యంబునకు గడగితివి. మూఢులు తమ కార్యఫలంబు లెఱుంగక తుదనుఁ జేటొందుదురు. రామలక్ష్మణులు దుర్ధర్షులు; వారు నిన్ను మననీయరు. ఇంతటనేని నామాట విని లోక నిందితంబును వీరపురుష గర్హితంబును నైన యీ నైచ్యంబును మానుము. భగవంతుఁడు బ్రహ్మదేవుఁడు గూడఁ బాపంబునకు వెఱచుచుండఁగా నీ విట్లొనర్తువేల? అసన్నమరణులు స్వవినాశంబు నెఱుంగరందురు. అదినేఁడు నీయెడఁ గాననయ్యె'నని మరల హితంబుపలికెను. రావణుండవి యెల్ల సరకుచేయక జటాయువును ద్రోచిపుచ్చి చనునుంకించెను. విహంగాధిపుం డందుల కెంతయు నాగ్రహమొంది తచ్చిరోజంబులను నిజనఖాగ్రంబులఁబట్టి యీడ్చి వానిని నొప్పించెను.

రావణుండట్లు మహాబాధితుఁడై కోపించి సీతాదేవిని నిజవామాంకమందుఁ బొదివిపట్టి దక్షిణహస్తంబుతో శక్తికొలఁది జటాయువును జఱచెను. గృధ్రరాజు వ్రేటుపడి యాగ్రహావివశుఁడై రావణుని భుజంబులఁ బదింటిని నిజతుండంబునఁ దుండించెను. ఆ భుజంబులు పుట్టనుండి వెడలు పన్నగంబుల క్రైనడిఁ దోడ్తోడ మొలచి పతగేంద్రునకు నాశ్చర్యము గలిగించెను. దశగ్రీవుఁడంత సీతను డించి జటాయువును బైకొని ముష్టిహతచరణతాడనంబులఁ గ్రుమ్మి తొక్కలు నఱికి పార్శ్వపాదంబుల ఛేదించెను. పక్షిరాయఁ డల్పజీవితుఁడై నెత్తుట దోఁగుచు నేలఁబడెను.

జటాయువునకై సీతాదేవి దుఃఖించుట

సీతాదేవి జటాయువునకుఁగా నాత్మబంధువునకునలె దుఃఖించుచు నప్పతగేంద్రునిఁ జేరబోయి వానిని గవుంగలించుకొని, 'అయ్యో! గృధ్రరాజా! నాకై నీ ప్రాణంబులఁ దొఱఁగితివా? నీ ఋణంబెట్లు తీర్తు?' నని పెల్లు వాపోయి చేతులు పిసికికొనుచు, 'హా! రామా!

నిన్నుఁ బైకొన్న వ్యసనంబు నింకను గ్రహింపవా? భుజనేత్రస్పంద నంబులును విహగాది దర్శనంబులును రానున్న శుభాశుభంబులను సూచించునందురు. అట్టివేని నీకుఁ గలుగవా? అహో! ఈ మృగపక్షు లెంతోవడిగాఁ బలాయనంబు లగుచున్నవి! నాగతిని గూర్చి నా పతికిఁ దెలుపఁ బఱుగెత్తుచున్నవి గాఁబోలు. రామా! ఈ పుణ్యాత్ముఁడు జటాయువు నన్నుఁ గాపాడఁ దలకొని నా దౌర్భాగ్యనిహతుఁడోయన రావణహతుఁడై నేల శయనించెను. రక్షింప నీ వేలరావు? లక్ష్మణా! నా పయ్యుఁ గోపమా? ఇఁకనాకు దిక్కెవ్వరు?' అని విలపించుచుఁ బొదలంబట్టి ప్రాకుచు వృక్షంబులఁ గవుంగలించుచు 'రామా! రామా!' యని పేరులుంగునఁ బిలిచి పనవసాగెను.

రావణుం డామెను గేశపాశంబునఁ బట్టి యీడ్చి యెత్తికొని వియన్మార్గంబు మెట్టి దక్షిణాభిముఖుఁడయ్యెను. రాక్షసదౌష్ట్యంబునకుఁ జరాచర ప్రపంచంబెల్ల నతిక్రాంత నైసర్గికావస్థానంబు నొంది గాఢ తమోనిమగ్న మయ్యెను; నదాగతి స్తంభించెను; దివాకరుఁడు కాంతిఁ దొఱఁగెను. సీతాదేవి యట్లు పరామృష్టయు దీనయు నై విలపించుట పరమేష్ఠి తన దివ్యనేత్రంబులఁ గాంచి 'దేవకార్యము సిద్ధించె' ననెను. దండకారణ్యవాసులైన మహర్షులు సీతాదేవికై ఖేదంబును రావణాసన్న వినాశంబునకై మోదంబును జెందిరి.

సీతాదేవి యట్లా దనుజేశ్వరాంకస్థయై మేఘమండలాంతరంబునఁ దటిల్లత వలెఁ దళతళలాడుచు నిజదురవస్థావిశేషంబు కీణమాత్రంబని సూచించుచుండెను. ఆమె కట్టిన పీతాంబరంబు మడతలు గాలికి వీచి నాలుకలుచాచి మండుజ్వాలలంబోలి దవాగ్నికీలలు పర్వతంబునువలె నద్దనుజు నావరించి వాని యాసన్నమరణంబును దెలుపుచున్నవో యనఁ దోఁచెను. ఆమె కై సేసిన రక్తోత్పలఁబులు రాలి యాపొలసుదండికి రానున్నయైశ్వర్యభ్రంశనంబును వెల్లడించుచున్నవోయనఁ గాన్పించెను. ఆమె కనకచేలాంచనంబు గాలికిఁ బఱచి రవికిరణ ప్రసారణంబునఁ దామ్రాభ్రంబుపగిదిఁ దోచి, రక్షోనాయక వినాశపిశునోత్పాతంబును దెలుపనెత్తిన పతాకవలెఁ గ్రాలెను. ఆమె నెమ్మోము జలదంబునగిల్చి దోఁచు చంద్రునిఁబోలి ప్రతిచంద్రదర్శన రూపమహోత్పాతంబుగా గానవచ్చెను. ఆమె కంఠమందలి తారహారంబులు తెగి జాలువాఱి మిన్నేటియవతరణంబును దోఁపించెను. రావణుండవి యెల్ల లెక్క పేయక హుటాహుటిఁ జనసాగెను. ఆ నిశాటుని దౌష్ట్యంబును జూచి

వృక్షంబులు కొండలమంది వాయుప్రచలిత నిజశాఖాకరంబులను జూచి దేవికి నభయంబును దెలుపుచున్నవోయన నయ్యెను. విహంగంబులు కలకలధ్వనులతో నామెను దీవించెను. కమలాకరంబులు మృదిత పద్మముఖంబులును సమాకులితమీననేత్రంబులును నై యాత్మనుఃఖాతి శయంబును బ్రకటించెను. పర్వతంబులు తమ వ్యసనాతిశయంబును ఝరీబాష్పధారాప్రవాహంబులఁ దెలుపుచు మిన్నొరయు శిఖర హస్తంబులెత్తి యసుర నడ్డగింపనున్నవోయనఁ దోచెను.

దుశ్శకునాదులకు రాముఁడు సంతాపమొందుట

అట రాముఁడు మాయామృగమారీచుని వధించి సీతాసందర్శనో త్కంఠుడై మరలినంతనే వాని వెనుప్రక్కనుండి జంబుకంబు బిట్టఱచెను. ఆ వికృతారావంబునకు దాశరథి భయకంపితహృదయుండై, 'కటా! మహా దుశ్శకునమయ్యెను. వై దేహిని రక్కసులు భక్షించియుండరు గదా! మారీచుని యఱపు విని జానకి భయవిహ్వలయై నా కొఱకు సౌమిత్రినిఁ దటమి తా నొంటి నుండునేమో? అదే సమయంబని రాక్షసులు సీతను జంపి నా పయిఁ బగసాధింతురేమో?' అని తల పోయుచు నాశ్రమ మార్గముంబట్టి బఱచి రాసాగెను. మార్గమధ్యంబున మృగపక్షులు వానికి నప్రదక్షిణంబొనర్చి దీనంబుగాఁ గూసెను. ఆ యశకునమిత్తంబులకు రాముఁడు మఱిమఱి కలవరమొంది శంకాభయ విహ్వలుఁడై తహతహపడసాగెను.

అంతలోన వానికి లక్ష్మణుం డెదురు వచ్చెను. తమ్మునిఁ జూచినంతనే రాముని ప్రాణంబులు నిలువున నెగయఁబాఱెను. రాఘ వుఁడు సుంత సమదాయించుకొని తమ్ముని చేయి పట్టుకొని, 'సౌమిత్రీ! సీత నొంటరిగా వదలి వచ్చితివా? ఎంతప్రమాదంబొనర్చితివి? ఎల్లరు సుఖమేగదా? దుర్నిమిత్తంబులు పెక్కు గానవచ్చి నన్నెంతయు బెగడు పఱుచుచున్నవి. మృగవిహగసృగాలంబులు రవిదిక్కున బిట్టఱచు చున్నవి. మాయామృగంబు బాణవిద్ధమై యవసానకాలంబున రాక్షస రూపంబు దాల్చెను. అది గాంచినంతనే యింతనరాని దైన్యంబు నన్నుఁ బైకొనెను. లక్ష్మణా! జనకరాజసుతను సజీవగాఁ జూతుమా? తమ్ముఁడా! వామనేత్రం బదురుచున్నది. సీత హృతయో మృతయో యైయుండును. సమస్తముఁ గోలుపోయి దుఃఖైకద్వితీయుండనై గహ నాంతర సీమలఁ బల్లటిల్లు నన్ను నిఖలోపచారంబులఁ బోషించుచుఁ

ప్రాణంపుఁ ప్రాణంబుపగిది వర్తించుచున్న నా దయితారత్నంబు నాకు దక్కునా? సీతావియోగకారణంబున నా ప్రాణంబును నా చతుర్దశ వనవాసవ్రతంబును రెండు నంతరింపనున్నవి. అకటా! చిఱునగవు లేవెన్నెలలు ముద్దుమోమునఁ దొలుకాడుచుండగా రాయంచనడల నెదురేగి ప్రియముఁ గూర్చు నా దేవి లేనట్టి యాశ్రమంబు నే నెట్లు చొరనోర్తు? మారీచుని కుయ్యి మీకు భ్రాంతిఁ బుట్టించుననియు నా కొఱకు జానకి నిన్ను త్వరఁబెట్టి తరలించుననియు నీ వాయింతినొంటిగా వదలివత్తువనియు శంకించితిని. నా శంక నిజమయ్యెను. ఏకాకిగానున్న నా పత్నిని మనశత్రువులు మననీయరు. అయ్యో! ఏమి సేయనగు'నని పరిపరివిధంబుల మనస్తాపంబును వెల్లడించుచు నాశ్రమంబునకు వడివడి నడచెను.

లక్ష్మణుఁడు తాను సీతాదేవిని వదలిన కారణముఁ దెల్పుట

రాముఁడట్లు వచ్చి యాశ్రమాంతంబున సీతను గానక శోక వివశుఁడయ్యెను. వానికి లక్ష్మణుఁడెంతయు వగపు చెంది, 'అన్నా! ఇందు నా తప్పుకొంచెమేనియుఁ గలుగదు. నీ యాజ్ఞఁ దలఁదాల్చి సీతారక్షణతత్పరుండనై యుంటిని. హతాత్తుగా 'హా! సీతా! హా! లక్ష్మణా!' యని నీ యెలుంగు వినవచ్చెను. దేవి నీకు విపత్తు శంకించి భయవిహ్వలయై రోదనంబుసేయుచుఁ బొమ్మని నన్ను తొందఱఁ జెను. నీ శౌర్యపరాక్రమంబులు తెలిపితిని; ఎట్టి యాపద వచ్చినను నీకుఁ బరసహాయం బక్కఱలేదంటిని; రాక్షస మాయలకు మోసపోయి వృథాదుఃఖదైన్యంబు లొందవలదని చెప్పితిని; లోకార్తి నుడుపవచ్చిన నీ కెట్టియుపద్రవంబు కలుగనేరదనియు నొక్కి పల్కితిని. ఆమె తన మోడి వీడక 'అన్నచన్నంతట నన్ను గ్రహింపఁదలచి యీ గుట్టు నెఱ దాఁచి కుత్సితమతివై భ్రాతృభక్తి నటించుచు మా వెంట వచ్చితి' వనియుఁ 'దత్కారణంబున రాముని క్లేశంబులకు లోలోన సంతసింతు'వ నియు దుస్సహములైన పరుషవచనంబులు నన్నాడెను. ఒండుదోఁపక యిట్లు వచ్చితి' నని కేలొగ్గి పలికెను.

రామవిలాపములు

రాముఁడది విని, 'సౌమ్యా! స్త్రీలమాటలకుఁ గ్రోధజితుండవై వర్తించుట నీకుఁ బాడిగాదు. నా శక్తి సామర్థ్యంబులెఱిఁగిన నీ వెంత మాత్రంబు సీతను వదలివచ్చి యుండరా'దని పలికి భార్యను వెదక

నారంభించి, మధుకరధ్వంకృతులరూపంబున విలపించుటంబోలె నున్న వృక్షంబులకుఁ దలంకుచు, వ్యసనభరంబునఁ బుష్పాళులు మోడ్చినో యన నుండు లతలకు బెగ్గడిల్లుచు, దీనములై కానవచ్చిన మృగ పక్షులకు భీతిల్లుచు, వనదేవతా నిర్యాసంబునఁ, బాడుగోరుచున్న సోదరిండ్లకుఁ నలంగుచుఁ, జనిచని కొండొకచోట గృష్ణాజిన కుశబ్రుసీ కటంబులు చీకాకుగాఁబడియుండుటఁ జూచి తల్లడిల్లి యాశ్రమంబెల్ల శూన్యంబుగాఁ దోఁచుటకు దుఃఖించి, 'హా! జానకీ! హా! జీవితేశ్వరీ! రాక్షసులు హరించిరా? కాలుఁడు కొనిపోయెనా? ఎందేని దాగితివా? ఫలపుష్పంబులకుఁ వెడలితివా? జలంబులు దేర నది కేగితివా? విహారార్థము సరోవరంబులకుఁ జనితివా? ఎందున్నావో పలుకుము. అయ్యో! బదులాడవేల? నీరాముని పైఁగోపమా? నీవు పలుకకున్నను నీ గుట్టును వనవృక్షమృగంబులవలన నెఱుంగుదు. కదంబమా! కదంబ ప్రియను నా ప్రియను జూడవా? బిల్వమా! పల్లవకోమలాంగకయుఁ బీతకౌశేయవాసినియునైన నా సీతను గానవా? అర్జునమా! అర్జునప్రియ యైన నా దయిదారత్నంబెందుఁ బోయెను? జనకరాజసుత యున్నదో లేదో చెప్పుము. కకుభమా! కకుభోరువు మైథిలి నీకుఁ జిరపరిచిత గదా. ఆ కాంత యెందు జనెనో తెలుపుము. తిలకమా! నీభ్రమరగీతలకు నానం దించు తిలకినీతిలకంబును సీతను దిలకింపవా? అశోకమా! శోకాపహతు నకు నాకు మత్ప్రియాస్థితిఁదెలిపి నాయెడ రుడుపవా? జంబూవృక్షమా! జంబూఫలోపమగాత్రి నా యనుంగుఁజెలి యెందున్నది? కర్ణికారమా! కర్ణికార లాలసను సాధ్వీమతల్లిని నా జానకిని బరికింపవా? చూతమా! చూతపల్లవాధర నా యర్ధాంగి యిందురాదా? కురవకమా! లతాలలి తాంగిని నా జీవితేశ్వరి నవలోకింపవా? మల్లికా! కాంతామతల్లికను విదర్భరాజసుతను సందర్శింపవా? మాధవీ! మధుర మధురమూర్తిని జనకరాజపుత్రిని గానవా? చంపకమా! చంపకనాసను నామోహంపు బొమ్మను బొడగానవా! కేతకీ! కేతకీగర్భగౌరశరీర నాలక్ష్మి యిటు వచ్చెనా? హరిణమా! హరిణచపలాయతాక్షి నా సీత నీతోడ నున్నదా? కరీంద్రమా! కరభోరువు నా భాగ్యదేవత యిందుఁగలదా? ఆయ్యో! ఒకరును బదులాడరేల? నా యర్ధాంగిని విడిచి చన్నందులకు మీరు నా పయి నలుకవహింతురా? హా! సీతా! జాలమువలదు; నిన్నుఁ జూడక నీరాముఁడుండఁ జాలఁడు. నా రాక తడవయ్యెనని యలిగి తరువుల డాఁగి పలుకవా? గజగమనా! పోవలదు, నిలునిలుము;

నన్నుఁ గనికరింపుము; గోలతనంబు సేరని నీవు నన్నిట్లాడింతువా? వరవర్ణినీ! నన్నుఁ గనుభ్రామఁ జూతువా? అయ్యో! నీవు దాగనున్నను నీపసుపుఁజీర నిన్ను దాఁపదుసుమా! చారుదతీ! దుఃఖపరిదగ్ధుని నన్ను పేక్షింపవలదు—అయ్యో! ఎంత యవివేకము! నా సీతయేయున్న నన్నిట్లు దుఃఖపెట్టునా?—రాకాచంద్రముఖీ! రక్కసులు నిన్ను బొక్కలాడిరా? అయ్యో! నీముఖచంద్రుడేని వారికి జాలిఁగొలుపఁడయ్యెనా? కలకంఠీ! నీకలకలస్వనంబును వినియైనను బిశితాశనులు కరఁగరైరా? మృణాళనాళకరా! నీవు దోయిలొగ్గి యధిక్షేపించునప్పుడు నీ కరకమలంబులేని వారికిఁ బ్రియంబులు గావయ్యెనా? హా! సీతా! రాక్షసభక్షణార్థము నిన్నువిడిచి పోయితిఁ గాఁబోలు!' నని పలుతెఱంగుల విలపించుచు నున్నత్తునివలె వనమెల్లఁ గ్రుమ్మరుచు జడంబులనుగూడఁ బల్కరించుచు లతలను గవుంగలించి పరితపించుచు వెదకి వెదకి వేసారి సొమ్మసిల్లి తెలివిగాంచి, 'అహో! ఎంతభ్రాంతి! దిక్కాలాద్యవచ్ఛిన్నానవద్య మాయామంగళమూర్తిని నా సీతను భూతంబులు చెనకనోర్చునా? తత్త్వమెఱింగియు నజ్ఞాన వశంబున నిష్కారణ దుఃఖ మనుభవించితిని గదా. లోకుల ననసేల? సీతా! క్రీలాటము లీకమాని నీవియోగభరాలసుని నీరాముని గరుణించి యెందున్నను వచ్చి వానికిఁ గనుపండువు సేయుము. రమణీ! నీముద్దు కురంగశాబకములు భవద్విరహచింతాతిరేకంబునఁ గన్నీరెట్లు దోర్చుచున్నవో చూడుము.—అయ్యో! ఎంత పిచ్చి! ఎక్కడి సీత! తమ్ముఁడా! అదిగో నా జనకుఁడు భార్యాశోకసనూనన్నమరణుని నన్నుఁ బరిగ్రహింప స్వర్గంబునుండి చేతులు సాచుచున్నాఁడు చూడుము. పోయెద; ఇఁక నన్ను మఱచిపొమ్ము. ఏమంటిని! ఆమాట సరిగాదు. అకాలమృత్యువు వాతఁబడి చతుర్దశవర్ష వనవాసవ్రతభంగ మొనర్ప లజ్జింపవా యని నాయన భర్జించుచున్నాఁడు. అయ్యో! జానకీ!

ఉ॥ అంచితరీతి నాఁ డట సభాంతరమందుఁ బ్రికూలిపిల్లు ద్రుం
పించి గ్రహించి కూర్మివలపించి సుఖార్ణవరాశి నోలలా
డించి తబుద్ధిఁగీర్తివలె డించి దయాలవమేనిలేక వం
చించి యపూర్వచిత్రవధఁజేయఁగ నీ మది యెట్టులోర్చెనో?॥

ప్రేయసీ! నీవు నన్నుఁ ద్యజించినను, ద్యజింతువుగాక; నిన్ను నేను విడనాడి జీవింపఁజాలను. ఇదే ప్రాణత్యాగమొనర్చి నీయొద్దకే వచ్చుచున్నా'నని వాపోవసాగెను.

లక్ష్మణుఁడు రాము నోదార్చుట

రాముఁడట్లు జంభాలనిర్మగ్నకుంజరంబు క్రియ మహోర్తిఁజెంది దుర్వహ దుఃఖభాగుఁడు కాఁగా వాని శోకంబును లక్ష్మణుఁడు చూడ నోపక, 'అన్నా! దైన్యమువలదు; సీతాదేవి విహారప్రియయగుట యెఱుంగమా? ఆమె పుష్పంబులకై పెనుగుహాలంబోని యిందలి పొదరిండ్లు దూఱియుండును; అట్లు కాదేని స్నానార్థము చనియుండును; లేదా మనధైర్యంబును బరీక్షింపఁగోరి యెందేని డాగియుండును. అంత మాత్రానకే కొందలపడనగునా?' యని యనునయోక్తులు వచించెను. రాముఁడు సుంత ధైర్యము వహించి ప్రియురాలు పుష్పావచయార్థము చనెనో యని లతాగృహములు వెదకి వెదకి, విచిత్రధాతుసంగ్రహణాసక్తయై పోయెనో యని పర్వతప్రదేశమెల్ల నెమకి నెమకి, హంసకారండవాదివిహగరమణీయపులినతలంబులఁ జూడనేగెనో యని నదీతలంబులెల్లఁ దిరిగితిరిగి, జలవిహారోత్సుకయై తరలెనోయని కల్హార కమనీయ సరోవరంబులనెల్ల శోధించి శోధించి, విలాసార్థము డాగెనో యని కందరాంతరములు దూఱిదూఱి యెందును సీతను గానక దుఃఖాభిసంతప్తుఁడయ్యెను.

రాముఁడు దుఃఖాతిరేకంబున దారుణోద్యోగియగుట

తమ్ముఁడూరార్చుకొలఁది రాముని శోకం బతిశయించుచుండెను. వాని యవయవ బంధములు విలుళితములయ్యెను; నయనంబులు పచ్చనై పరిభ్రమించెను; నోరెండవాఱెను; మాట రాదయ్యెను; హృదయము వ్రీలి తావు తప్పినట్లు తోఁచెను. ఊర్పులు నిడుపులై యంతస్తాపాతిశయంబును దెలుపసాగెను; చిత్తము సంవిత్తముగాక భావనాప్రపంచంబు నెల్లఁ జుట్టి చుట్టి సంచరింపఁజొచ్చెను. రాముఁడవస్థాన శక్తిహీనుఁడై యొకచోఁ గూలఁబడి యర్ధాంగి కట్టెదుట నున్నట్లుగా భావించి, ప్రేయసీ! ప్రసూనప్రీతిం జేసి నీవు నిలువెల్ల నశోకశాఖలఁగప్పి నా శోకంబు నినుమడింప నగునా? కదళీకాండోరు ద్వయీ! కదళీవనంబున డాగురుమూఁతలాడు నీ బేలతనంబు నేమన వలయు? సహజస్పర్ధగల కదళి నిన్ను దాచునా? మంగళస్వరూపిణీ! ఎలనవ్వు లొలయించుచుఁ గర్ణికారవనంబున విహరింతువా? నీపరిహాసము చాలు, రమ్ము. సీతా! పరిశ్రాంతుని నన్ను గేళిసేయుదువా? ఇది తఱిగాదు. వినుము. ప్రియా! నీవు పరిహాసప్రియవగుట యెఱుం

గుదు. పరిహాసవిశేషంబులకు నాశ్రమస్థానములు తగవుగదా! కళ్యాణీ! నీ విరహంబున నా మదియట్లు పర్ణశాలయు శూన్యమయ్యెను. ఇందుండ నోపను' అని కొంతెడడ వున్నత్తావస్థకుఁ జిక్కియుండి తెలివి గాంచి, 'లక్ష్మణా! నా సీత సజీవగా నిండెచ్చటను లేదు. ఉన్నచో నన్నింతగా నలసటఁజెందనీయదు. ఆ తన్వంగిని రక్కసులు భక్షించియో హరించియో యుందురు. అదిగో చూడుము; మృగశాలనేత్రకుగా మృగంబులు వగచి కన్నీరు నిండుచున్నవి—హా! ఆర్యా! హా! సాధ్వీమణీ! క్షేకేయీమనోరథంబును దీర్చితివిగదా—అయ్యో! ప్రేయసీ! నీతోడ నంతఃపురము వెడలి వచ్చితిని. ఏకాకిగా నండెట్లు చొఱనేర్తు? సీతా! చేతులార నిన్ను రక్కసులకు నప్పగించితిని. ఈ పిఱికి మనసేల? మిథిలేశ్వరా! ఇఁకనిన్నెట్లు చూడనోర్తు? వనవాసాంతంబున నీవు నీ పుత్రికను జూడవత్తువు. ఏమని నీకుఁజెప్పదు?—ఛీ! ఎంతభ్రాంతి! నీతాపరిత్యక్తుఁడు రాముఁడు మరల నయోధ్యయందుఁ గాలిడునా?—లక్ష్మణా! నన్ను మఱచి యయోధ్యకుఁ జని నా మాటగ్గా భరతునకుఁ జెప్పి వానికిఁబట్టముఁ గట్టుము; తల్లులకు నా నమస్కృతు లందింపుము; నా తల్లి మా గతి విని మనఁబోదు; ఒకవేళ జీవించునేని యామెను గాపాడుము.' అని విలాపాశ్రయములైన దుర్వచనంబులు వెక్కి వెక్కి పలికి మరలఁ బ్రియురాలిని దలఁచి, 'జానకీ!

కీ॥ నీ మధురాకృతి నిరతంబుఁ గనుచుంటఁ
గందోయికితరంబు లిందవయ్యె,
నీ నగువెన్నెట నిచ్చలుఁనుండుట
మేనికిఁ జంద్రికల్ గానివయ్యె,
నీ నునుబల్కుల నిత్యంబు వినుచుంటఁ
గర్ణపాళికి వీణ కఠినమయ్యె,
వీ కాగిటిసుఖంబు నింపాది గాంచుట
నాత్మకు నొండేది యూనదయ్యె,

గీ॥ నింద్రియములెల్ల నీయంద యిరవుకొనుట
సతివ! నీతోడిదే ప్రాణమయ్యె నాకు
నీవు గల్గనినాడింక నీరజాక్షి
యుర్వి జీవచ్ఛవంబుసై యుండనేల?'

అని విలపించి దారుణోద్యోగి యయ్యెను.

లక్ష్మణుఁడు రాముని తలంపు మార్చుట

లక్ష్మణుఁడు రాముని తలంపు గ్రహించి భయనికలవదనుండును వ్యధితమనస్కుండునై యెలుగెత్తి యేడ్చి యన్నను తదీయ దుఃఖ పరిశ్రాంతికై బహుభంగులఁ బ్రార్థించెను. రాముఁడు నిట్టూర్చి, 'తమ్ముఁడా! నావంటి పాపాత్ముఁడు పుట్టఁడు. పూర్వపాపఫలంబులెల్ల నిప్పుడు దుఃఖదుఃఖబులుగా నాకుఁదాపరించెను. రాజ్యభ్రంశంబును బంధువియోగంబును బితృవినాశంబును మాతృపరిత్యాగంబు ఇందొక్కొక్కటియు నా జవసత్త్వంబులను హరించెను. దావాగ్నిబోని యీ దుఃఖాగ్ని నెద దాఁచి యిందు వచ్చితిని. ఇట నా దుఃఖము పరిమావధి ముట్టెను. గుండియలు వ్రీలెను; హృదయంబు జీలెను; ఇఁక మనఁజాల'నని విషాదస్వరంబునఁ బలికి ప్రియురాలిని దలంచి, 'హా! సీతా! రాక్షసులచేతఁజిక్కి నన్నెంత తలంచితివో గదా! జానకీ! పిశితాశినులు నిన్నెంత గాఁచించిరోగదా? దేవీ! రక్కసులు నిన్నుఁ గబళించువేళ నీ వెంతగాఁ బరితపించితివో? ప్రేయసీ! ఈ చలువరాతిన్నె పయి మనము గూర్చుండియుండఁగా నేనాడిన పరిహాసంబులకు నీ మోము జాబిల్లిగురిసిన లేనగవు వెన్నెలల నెట్లు మఱతును? జీవితేశ్వరీ! గోదావరి నీకెంతయుఁ బ్రియంబగును. అటకుఁ బోయి యుందువా? కమలాక్షీ! పద్మములఁ దేఱఁ జనితివా? అలివేణీ! ఒంటరిగానుండ లేక పుష్పితతరుమండలంబును విహంగమ గీతామధురంబు నైన వనాంతరంబున విహరింపఁ దరలితివా? అయ్యో! ఎంత భ్రాంతి! నా యర్ధాంగి పరమభీరువు; నన్ను వదలి యడుగైనను బెట్ట సాహసింపదు. ఇది యెఱింగియు నడియాసలు పడుచున్నాను—అయ్యో! ఇదమిత్థమని నిశ్చయింపరాకున్నది. నా సీత బ్రదికియున్నదో లేదో తెలియదు. ఎవరును జెప్పువారు గానరారు. ఏమిసేయుదు?—సరిసరి! సర్వసాక్షి సూర్యభగవానుఁడుండఁగా నొరులఁ గోరనేల? సహస్రకిరణా! నీ కను మూయ నెవ్వరికిని దరముగాదు. కర్మసాక్షివిగావున నీకుఁ దెలియక యే పనియు జరుగదు. నా ప్రియురాలెందున్నది? రాక్షసు లపహరించిరా? బదులాడవేల? నీకునుఁ బగయైతినా? వాయుభగవానుఁడా? నీవు సర్వాంతర్యామివిగదా! నా చెలి వివరంబును దెలిపి నన్ను రక్షింపు'మని కడుంగడు దురపిల్లి విసంజ్ఞుఁడయ్యెను.

లక్ష్మణుఁడు వానిని మెల్లఁగా నేదఁదేర్చెను. కొంత వడికి రాముఁడు ప్రజ్ఞఁగాంచి, 'జానకీ! క్లేశపరంపరలకు వాడి ససిచెడిన

నా జీవకుసుమంబింత వటకు నీ సరసనల్లాపామృతసేచనంబున వికాసము గాంచుచుండెను. ఇంక నది నిలువ'దని వెండియు విలపించి కట్టెదుటఁ జూపుసారించి, 'తమ్ముఁడా! ఈ మృగంబులేలనో సారెసారెకు నన్నుఁ జూచుచున్నవి. నా ప్రియురాలి వివరంబును నాకియ్యవి తెలుపనున్నట్లు వాని యింగితములు సూచించుచున్న'వని వాని వంకమఱలి, 'మృగములారా! నా దేవి సంగతి తెలిసియున్న నాకుఁ దెలిపి సుకృతము గావింపు' మనెను. ఆ మృగంబులు దక్షిణాభిముఖములై నింగిఁజూపెను. లక్ష్మణుఁ డాభావంబును గ్రహించి, 'అన్నా! నీ ప్రశ్నకుఁ బ్రత్యుత్తరముగా నిమ్మృగంబులు దక్షిణదిక్కును జూపుచున్నవి. ఆ వలనఁ జనుద' మనెను.

రాముఁడు సీతాన్వేషియై తరలుట

రాముఁడంతఁ దమ్ముని వెంటఁగొని దక్షిణదిశఁబట్టి కొంతదవ్వు చనెను. మార్గమునఁ బుష్పములు కొన్ని రాలియుండెను. రాముఁడా ప్రసూనములను గుఱుతించి, 'అహో! ఇవి నేను స్వయముగాఁ గోసి తెచ్చి నా సతి తుఱుమున ముడిచితిని. రక్కసులు నా చెలినిఁ గొని పోవునప్పుఁ డాయింతి కురులు వీడి యిని యింపు జాఱెననుట నిజము. సూర్యభగవానుండును వాయుదేవుండును భూదేవియు నా యభిజ్ఞానార్థము వీని నిందాఁక కాపాడిరి. వారి కెంతయుఁ గృతకృత్యుండ నగుదు. నా సీత యీ దారిం బోయెననుట నిర్వివాదాంశము. ఎందుఁ బోయియుండును? సంగతి తెలుపువారెవ్వరు? ప్రస్రవణగిరీంద్రమా! నా సఖి యెట్టు చనెనో చెప్పుము. బదులాడవేల? సానుమంతుండవుగా నుండఁగోరుదువేని నా మోహనాంగిని జూపు' మనెను. వాని వచనంబులు గిరికందరములదాఁకి ప్రతిధ్వనులీనెను. ఆ మాఱుమ్రోఁతలు ప్రత్యుత్తరముగా రాముఁడు భావించి, 'నగరాజా! నీ మాటలు స్పష్టములు గావు. భాగ్యహీనుండను గావున నాతో స్పష్టముగా మాటాడ నిచ్చగింపవా? అంత మాత్రాననే నీకు గౌరవహానియగునా?' యని మహా కోపముదాల్చి కన్నుల నిప్పుకలు రాల్చుచు లోకదహనోద్యోగివలెఁ గాన్పించి తీవ్రబాణమొండు సంధించి యా గిరినిగుఱిచేసి వదలనుండెను. అంతలోన వానియెదుట కాలిజాడలు కొన్ని కాన్పించెను. రాముఁడా జాడలను బరికించి, 'లక్ష్మణా! ఈ జాడ పురుషపదాంకితము గానున్నది. ఈ జాడ చిఱుపదంబుల త్రొక్కిడిగానున్నది. మఱియు నిది భయభ్రాంతికిఁ జిక్కిన స్త్రీ యటునిటుఁ బరుగెత్తుటను గూడ

సూచించును. నా సతి రాక్షసభీతయై వాని బారి తప్పించుకొనుటకై యీ దారిం బఱతెంచి యుండు' నని పలికి యీ జాడలఁబడి మఱికొన్ని యడుగులు చనెను. అచ్చటఁ దుత్తునియలుగాఁ దునిఁగిన విల్లును, ఛిన్నాభిన్నమైన రథంబును, రాలి పడియున్న బంగారుశకలంబులును, దెగియున్న పుష్పమాలికలును గానవచ్చెను. తత్సమీపంబున నొక తావు రక్తసిక్తమై యుండెను. రాముఁడవియెల్లఁ బరిశీలించి, 'లక్ష్మణా! సుందియంబులెల్లఁ దీఱెను. ఈ పెద్దజాడ రక్కసునిది; ఇవిగో నా కలికి యడుగులు; ఈ సువర్ణశకలంబులును విదీర్ణమాలికలును నా భాగ్య దేవతాతనువల్లినుండి తెగి రాలినవిగాని వేఱుగాదు. అయ్యో! ఈ రక్తసిక్తప్రదేశము నా యర్ధాంగిగతిని దెలుపకయే తెలుపుచున్నది. హా! జానకీ! నీ గతి యిట్లయ్యెనా? ఇఁక నేనుండనేల?' యని కన్నీరు నించెను. లక్ష్మణుఁడు కయిమోడ్చి, 'అన్నా! భ్రాంతికిఁ జిక్కి డీలుపడ వలదు. ఇట శూరులిద్దఱు పోరాడిరని భావింతును; కానిచో రథాదులిందుఁ బడియుండనేల?' యనెను. రాముఁడు వాని మాట నంగీకరించి, 'నాయనా! జానకినిమిత్తమెవరోయిద్ద ఱిందు నుఱుమాడి యుందురు. మణిమయంబైన యీ చాపంబును బాలభాస్కరద్యుతినిభోని యీ హిరణ్యకవచంబును సామాన్యులవిగా నుండనోపవు. ఇదిగో తపనీయ దండాతపత్రంబు; అవిగో వాహశవంబులు; అల్లవిగో భగ్నములైన సాంగ్రామిక రథధ్వజములు. లక్ష్మణా! ఈ తూపులను జూతువా? చతుశ్శతాంగుళపరిమితంబులును సుండాగ్రంబులునైన యీ సువర్ణసాయకంబు లే ఘోరకర్ముని హస్తనిర్ముక్తములై యెవని హరించెనో గదా! అదిగో సారథిని జూడుము. వాఁడు వాగెలోకచేతను మునికోల నొకకరంబునను బట్టి యట్లె చచ్చియున్నాఁడు. అదిగో చామరగ్రాహుల యుష్ణీషంబులు తొలఁగవు; వారి మణికుండలంబులు తళతళ లాడుచున్నవి; నిలిచినవారలు నిలిచినట్లే వారెల్లరు నూపిరి వాసియున్నారు. వీ రెవరివారో యూహింపరాదు. ఎవరివారైననుగాక. ఈ యుద్ధసన్నాహంబెల్ల నా జానకి నిమిత్తముగానున్నది. సీతా! రాక్షసులు నిన్నెంత గాటించిరోగదా! హా! ధర్మమా! అజన్మముగా నిన్ను గాపాడుచుందు. ఆకృతజ్ఞతయేని లేక గహనాంతరమందుఁ జిక్కి తోడుగానక యున్న యబలారత్నంబును రక్కసులు హరించుట నీవు చూచుచుంటివా! ఇంతకన్నఁ గృతఘ్నుతగలదా? అయ్యో! ఒకరి నననేల? నా మృదుభావమే నన్నింతకుఁదెచ్చెను. కట్టలేనినాడు

గొట్టెగూడఁ గఱచుననుట సార్థకమయ్యెను. కటా! గుణంబులు నన్నుఁ బొంది విపరీతములాయెను.—సౌమిత్రీ! సైరణ నన్ను వదలుచున్నది. మార్తాండుఁడు శీతచంద్రికలను జోపి లోకసంతాపకరుఁడై యుదయించునట్లు నేనిఁక సర్వసద్గుణంబులనుఁ ద్రోచి లోకంబునెల్ల నిరవకాశమొనర్తు; గ్రహగతుల నరిగట్టుదు; పంచమహాభూతంబులను నిర్మూలింతు; ప్రపంచంబునెల్ల ధూళీకరింతు. కటా! దేవతలెల్ల నెంతో యొగ్గి వేడినిని; నా నమ్రభావంబును దైన్యలక్షణంబుగా వారు భావించిరి. వారి భ్రాంతి వదలుగాక' యని బీరంబులు పలికి రోష తామ్రాక్షుఁడై కోదండంబును బూని యాశీవిషంబులఁబోని శిలీముఖంబులను సంధించి నిలిచెను. రాముని యాకారంబదృష్టపూర్వంబును మహా మహోగ్రంబునై దీపించెను. అతఁడు ప్రళయరౌద్రావతారుఁడుగాఁ దోఁచెను.

లక్ష్మణుఁడు రామునకుఁ బ్రశాంతిఁ గూర్చుట

లక్ష్మణుఁడు దుఃఖభయవిహ్వలుఁడై, 'అన్నా! శమదమాది సమస్త కళ్యాణగుణంబులు నిన్నాశ్రయించి తనరుచున్నవి. సర్వభూతంబులకు హితమొనర్చుట నీ పరమ దీక్షయై యున్నది; అట్టి నీవిట్లు క్రోధావతారము దాల్పనగునా? చంద్రుఁడు కాంతిని సూర్యుఁడు తేజస్సును వాయువు గమనవేగంబును భూమి క్షమను నిట్లొక్కొక్క రొక్కొక్క గుణంబును గలిగి ప్రకాశింతురు. నీవో సమస్తసద్గుణమూర్తివై విరాజిల్లుదువు. అపకారంబొనర్చుట యల్పులకు నైజము. వారి యకార్యమునకుఁగా సమస్త నిరపరాధిలోకంబును నిర్మూలింతువా? దండనంబు దోషానురూపంబుగా నుండఁబోలు గాని మితిమీఱి వచ్చునా? నరపాలుఁ డెన్నఁడేని శాంతికి విశ్రాంతి నొసఁగఁదగునా? రాజమాత్రుల సంగతియే యిట్లుండగా సర్వభూతశరణ్యుండవును జరాచర పరమగతివియునైన నిన్నుఁ గూర్చి యేమి చెప్పనగును? అన్నా! నీకుఁ గీడురోయు ప్రాణిగలఁడా? నా మనవి చేకొనుము. లోకంబు ననుగ్రహింపుము. నీ క్లేశములు నిన్నేగాదు ముల్లోకంబులను దురవగాహ దుఃఖాబ్ధియందు ముంచెను. వానికిఁ బ్రశాంతిఁ గూర్ప నీవే దక్షుండవు. సీతాపహర్తను మన్నింపుమనుటగాదు. ఆ ధూర్తు బిలాంతరంబు చొచ్చినను పాతాళగర్భంబున దాగినను దేవగంధర్వాది లోకంబులకు జన్నను విడువరాదు. వాఁడెందున్నను సాధించి లోకంబునకు మర్యాదఁ గావించుదము. అన్నా! ఇచ్చట రథమొక్కండు

మాత్రమే శకలీభూతమై యున్నది. ఖురనేమిక్షతంబును రుధిరబిందు సిక్తంబునైన యీ ప్రదేశంబును జూడఁగా నిందు ఘోరావహము సంఘటిల్లినట్లు స్పష్టము. సేనలజాడలు మాత్రము గానరావు. ద్వంద్వ యుద్ధమాయని తలంచుటకు నొక్కని విక్రమంబులు మాత్రమే తోఁచుచున్నవి. ఇదియెల్ల నేకవీరరణవిజృంభణంబుగా నిశ్చయింతును. నిజ మెఱుంగ నగు'నని కేలొగ్గి వచించెను.

ఆ మాటలెల్ల నిష్ఫలము లయ్యెను. లక్ష్మణుఁడంత సాహసించి రాముని చరణంబులను గవుంగిటఁ గూర్చి, 'అన్నా! దేవతలు సుధా రసంబును వలె దశరథమహారాజు నిజతపఃఫలంబును నిన్నుఁబడసి నీ గుణైకబద్ధుఁడై మనెను. ఆయన యచింతితోపనతమైన నీ వియోగంబు కారణంబుగా దేవత్వము నొందెనని వింటిమి. రాజ్యచ్యుతినోర్చి పితృ వియోగక్లేశంబును సైచి సత్యంబు నుద్ధరించుటకుఁగాఁ జతుర్దశవనవాస వ్యసనంబును వరించితివి. నీవిట్లు గావించుట లోకంబునకు మార్గప్రదీపి కార్థముఁగదా! ఎంతటి యాపదలునచ్చినను సహనంబును బాయరాదను నీతి నింతకాలము చాటించి యిప్పుడు నీవే యసహనంబును జూపుదువేని లోకము నిన్ననుసరించును. నీవలన నెంత యపకారము రానున్నదో యూహింపుము. అన్నా! లోకంబును దుర్గతిపాలు చేయకుము. లోకశరణ్యం డిట్లయినచోఁ బ్రాణికోటికి నిఁక దిక్కెవ్వరు? ఆపద లందువా? అవి సర్వలోకసహజంబులు. నహుషునికొడుకంతటివాఁడు శక్రునివలన నింద్రలోకచ్యుతిదుఃఖం బొందఁడా? మన కులగురువు వసిష్ఠమహర్షి యెంతటివాఁడో నీకుఁదెలియనిదిగాదు. అంతటివానికిఁ గూఁడ నాపదలు రావయ్యెనా? ఆయన తన నూర్గురుకొడుకుల నొక్క నాఁడు విశ్వామిత్రశాపవశంబునఁ గోలుపోవలేదా? భూదేవి యన్నలో సర్వలోకనమస్కృతగాని యే తన్మాత్రురాలుగాదు. ఆమెకుఁగూడ నప్పుడప్పుడుఁ బ్రకంపనాదులు సంభవించుటలేదా? అనవరత ధర్మైక నిరతులై లోకనేత్రంబులనెడి కీర్తిగాంచి జగత్ప్రతిష్ఠకు నాధార భూతులుగా నున్న సూర్యచంద్రులు సయితము గడచి బ్రదికిరా? వారి కిని గ్రహబాధ తప్పదయ్యెనుగదా! మహాభూతంబులకుఁ గూడ క్షయ వృద్ధులు గలుగుచున్నవి. దేవత లెంతో శ్రమించి ప్రాణంబు లుంకువ వెట్టి యమృతంబును సాధించి జరామరణంబుల దాఁటిరి. వారు మాత్రము సుఖదుఃఖంబులపాలగుటలేదా? అన్నా! నీ వెఱుంగని జ్ఞానము గలుగదు. సర్వజ్ఞుండవు. నీవు వనటం జెందరాదు. ఎట్టియాపదలు

పైకొన్నను యథార్థజ్ఞులు వెనుదీయరు. దుఃఖంబులను జయించుట పురుషకార్యంబు. అన్నా! సుఖదుఃఖములు నేడు రమ్మనిన వచ్చునవి గావు. అవి పూర్వకర్మఫలంబులై ప్రాణులఁ బొరయుచుండును. దాఁప రించిన ఫలము సుఖమేగాని దుఃఖమేగాని యనుభవింపక తీఱదు. ఈ రహస్యంబును నీవే యుపదేశించితివి. అన్నా! నీ జ్ఞానమిప్పుడు శోకసుప్తమయ్యెను. దాని ప్రబోధనార్థం బిట్లు పలికితినిగాని వేఱుగాదు. నీ పరాక్రమం బద్వితీయము, అప్రమేయము, నిఖలలోక సంహార సమర్థము. దానిని దుష్టశిక్షణంబున వ్యయింపనగునే గాని యొండు సేయరాదు.' అని మహాభయభక్తులతో విన్నవించెను.

జటాయువు రామునకు సీతావృత్తాంతము చెప్పుట

రాముఁడావచనంబులు విని సుంత శాంతి వహించి, 'లక్ష్మణా! సీతాపహారిని బరమఘూర్తును మత్రోక్షంబునకు లక్ష్యభూతునిగా నొనర్చి లోకకళ్యాణంబొనర్చునందాఁక నా యీ తాపము చల్లారదు. ఈ సమర రహస్యంబును గనుగొందము రా' యని వానిని వెటఁగొని మఱికొన్ని పదము లరిగెను. అటఁ గొండొక చోటఁ బర్వతశృంగమంతటి గృధ్రము నెత్తుటఁ దోఁగుచుఁ బడియుండెను. రాముఁడా గృధ్రంబును గాంచి, 'వీఁడుగో సీతనుహరించిన రక్కసుఁడు; నా దయితారత్నంబును మ్రింగి మత్తుఁడై యీ రూపమున నున్నాఁ' డని పలుకుచుఁ గ్రోధ దుర్నిరీక్షణుఁడై భూమి గ్రక్కదలఁ బాదఘాతంబొనర్చి యప్పతగేంద్రుని పయికి విజృంభించెను. ఆ పక్షిరాజు రామునిఁజూచి నురుగు నెత్తురు గ్రక్కుచు దీనదీనస్వరంబున, 'ఆయుష్మంతుఁడా! నేను జటాయువును గాని రాక్షసుండనుగాదు. వనాంతరంబున దివ్యౌషధినివలె నీ వెవ్వతెను వెదకుదువో యా సీతాదేవిని, నా ప్రాణంబులను రావణాసురుఁడు హరించెను. మీ రిద్దఱు నాశ్రమంబున లేనివేళఁ జూచి యా రాక్ష సాధముఁడు నీ దేవి నపహరింప యత్నించెను. వానిదుండగంబు నోర్వఁ జాలక నేను వానిని డీకొని పెద్దయుం బోరితిని. అవిగో యచ్చటఁ బడియున్న రావణచాపకవచరథసారథులే నాపోరిననిధంబుఁ దెలుపును. తుదకు వాఁడు నన్నుఁ బైకొని నా పక్షంబులను దెగవైచి రాజపుత్రిని గొని విహాయసమార్గంబునఁ జనె'నని చెప్పెను.

రాముఁడది విని దుర్భరమగుదుఃఖమొంది చేతివిల్లును జాఱవైచి జటాయువును గవుంగలించుకొని, 'మిత్రమా! నా వలన నీకీదురవస్థ

గలిగినంతల కెంతయు సంతాపింతును. ఖడ్గ ఘాతంబులకారణంబునఁ బ్రాణోత్క్రమణస్థితినున్న నిన్నుఁ బెక్కు మాటల గాసిపెట్టరాదు. ఒక్కటి యడుగుదు. రావణుఁడు నా భార్య నపహరింపగా వానికి నేనేమి యెగ్గొనర్చితిని? ఆ దుష్టుని చేతఁబడి నా యర్ధాంగి పరితపించెనా? ఏదేని నాకుఁ జెప్పెనా? ఆ నిశాచరుని రూపపరాక్రమంబు లెట్టిని? వాని వాసస్థానమేది?' యని యడిగెను. నావుడు, 'రామా! రావణుఁడు మాయాప్రభావంబు నాశ్రయించి సుడిగాడ్పులులేపి కాఱుమబ్బులు గలిగించెను. ఆశ్రమంబెల్లఁ బెంజీకట్లు గప్పెను. ఆ చీఁకటిలో నతఁడు సీతాదేవి నపహరించి యెత్తికొనిపోసాగెను. వై దేహీదుఃఖారావంబును విని నేను మేల్కాంచి సంగతి గ్రహించి యా పాపాత్ముని నిరోధించితిని. నాయనా! నా ప్రాణంబు లెగయుచున్నవి; కన్నులు మూతపడెను; మాట వెలువడదు. సీతాదేవి నపహరించిన ముహూర్తంబును 'విండ' మందుము. ఆ ముహూర్తమునఁ బోయినవస్తువు మరల నచిరకాలముననే దొరకును. నీవు నీ సీతను శీఘ్రకాలములోనే పడయుదువు. ఆ శత్రుఁడు చేపక్రై యాసపడి కాలంబునే బ్రింగెను. పెద్దకాలము మన' డని జటాయువు పలికి రక్తమాంసంబులు గ్రక్కి, 'రావణుఁడు విశ్రవసుని యూరసపుత్రుఁ' డనుచుఁ దలవాల్చి కాళ్ళుసాచి ప్రాణంబులు వదలెను.

జటాయువు దహన సంస్కారములు

రాముఁడు జటాయుమరణంబునకు నత్యంత శోకకర్శితుఁడై, 'లక్ష్మణా! ఏన్ని వేలయేండ్లు బ్రదికిననుఁ బ్రాణికిఁ దుదకుఁ జావు తప్పదు గదా. కాలంబు నతిక్రమింపఁ దరముగాదు. ఈ పక్షిరాజు నా కొఱకుగాఁ దనప్రాణంబులను గోలుపోయెను. పరోపకారబుద్ధులు మృగపక్షీ జాతులందును గలుగుననుటకు వేఱు నిదర్శనంబు వలయునే? జటాయువునకైన నా దుఃఖంబింతనరాదు. ఈ మాన్యునకు నేను చేతులార దహనసంస్కారమొనర్చి కృతకృత్యుండ నగుదు' నని పలికి, కట్టియ లేఱి తెచ్చి చితిపేర్చి యందా శవంబునుంచి, 'గృధ్రరాజా! నీమేలు మఱువరాదు. గృహమేధులు బహుయజ్ఞంబులొనర్చి యే లోకంబును బడయుదురో, ఆ హితాగ్నులకు నేది సంప్రాప్తమగునో వానప్రస్థులకు నేది లభించునో సన్యాసి యెందుఁజనునో భూగాతలు దేనిఁబడయుదురో యా యుత్తమలోకంబులు మత్సంస్కృతునకు నీకగుఁగాక' యని దారువును మథించి రగిల్చిన యగ్నిచేత వానికి దహనక్రియ లాత్మ

బంధువునకుఁ బోలె సమంత్రకంబుగా నొనర్చి, కేసరీమృగంబులను జంపి తెచ్చి తన్మాంసంబున వానికిఁ బిండప్రదానంబును బితృదేవతాక మంత్రపురస్సరంబుగాఁ గావించి నదీతోయంబుల లక్ష్మణునితోడ జలతర్పణంబులిచ్చి సీతను వెదకువాఁడై నిర్మితిదిశనుబట్టి చనెను. జటాయువు రామసంస్కారమహత్వంబున శాశ్వతపుణ్యలోక మొందెను.

రావణుఁడు సీతాదేవిని లంకకుఁ దెచ్చుట

అట సీతాదేవి తనదురవస్థను జటాయుదుర్మరణంబును రక్కసుని దుండగంబును దలఁచి నిజదుఃఖ రోషంబులను నేత్రకషాయకాంతులఁ దెలుపుచు, 'రావణా! మాయామృగవ్యాజంబున నా పతిని మోసగించి దూరము పంపి యాయన లేనితరుణంబున నన్ను బలాత్కారముగాఁ దెచ్చుట శౌర్యమా? నీ పరాక్రమంబును నిరోధింపవచ్చిన జటాయువును బుణ్యాత్ముని వధించి మహాపాతకంబు నొడిగట్టితివి. పరాంగనాపహరణ నింద నీకుఁ గలకాలము తప్పదు. నడినడిఁ బఱతువు. శూరుండవేని నీకింత భయమేల? నిశాచరా? నీ మేలు గోరుదువేని నన్ను విడిచి పరమ దయామూర్తియైన నా పతిని శరణు వేడుము. నా నల్లభుఁడు శరణత్రాణదీక్షాధురంధరుఁడు గావున నితప్పు మన్నించి నిన్ను రక్షించును. అట్లుచేయవేని నీకు మృత్యువు తప్పదు. ఆసన్నమరణులు రక్తవాహినియైన వైతరిణీనదిని నసిపత్త్రివనంబును దప్తకాంచన పుష్పవైడూర్యపత్త్రిలోహమయకంటకంబైన శాల్మలీ వృక్షంబును గాంతురు. అది యెల్లవేని నా చెప్పినట్లొనర్పుము. దవ్వు చని చావు తప్పించుకొందునని తలంతువుగాఁబోలు. కాలపాశంబునకు దవ్వు దాపులు గలుగవు. అది నిన్ను వెంబడించుచునే యున్న'దని చెప్పెను.

రావణుఁడామాటలు చెవిఁబెట్టక గమనవేగంబు నినుమడించి వాయుపథమునఁ జనసాగెను. సీతాదేవికి రక్షణంబెందుఁ గానరాకుండెను. ఏమిచేయుటకు నామెకుఁ దోపఁదయెను. ఆమె యట్లు పరితపించుచు మింటనుండి తనదృష్టినిఁ గ్రిందికి సారించి యచ్చటఁ గొండొక నగాగ్రంబున వానరులేవురుండుట గాంచి వారేనియుఁ దన సంగతిని రామునకు నెఱిగింతురు గాక యను నాసతో నిజాభరణంబుల నొలిచి చీరెకొంగు చించి యందవి మూఁటఁగట్టి దానిని వారినడుమఁ బడవై చెను. ఆ మూట తటాలున నవ్వానరులమధ్యఁబడెను. వారందులకు నాశ్చర్యపడి తలయెత్తి యసురయొకఁడు కొండొక స్త్రీని నెత్తికొని

పోవుచుండుటయు నామె యాక్రోశించుచుండుటయుఁ గాంచి శోకపరీతులై తదేకదృష్టిఁ జూడసాగిరి. వారట్లు చూచుచుండఁగానే యారక్షోవీరుఁడు పంపాసరోవరము దాఁటెను.

రావణుఁడట్లు పంపాసరస్సును దాఁటి లంకాభిముఖుఁడై నదీనదంబులను వనశైలంబులను గడచి సాగరంబును సమీపించెను. సముద్రుఁడా రాక్షసునికుటిలవర్తనంబును జూడనోపక వైముఖ్యుఁడయ్యెనో యన నిస్తరంగుడయ్యెను. గగనస్థులైన సిద్ధచారణులా నిశాచరునిపయి శాపంబులు గురిసిరి. దశకంధరుఁడవియెల్ల లెక్కసేయక కడలి నతిక్రమించి యొడిఁగట్టిన మృత్యువోయనఁ దోఁచుచు నంకపాళినున్న సీతాదేవితోడ లంకాపట్టణముఁ జొచ్చి నిజాంతఃపురముఁ బ్రవేశించి, మాయాశ్రీవలెనున్న జానకి నందు డించి, రాక్షసాంగనలను బిలిచి, 'నా యాజ్ఞ లేక యిందుఁ జలిచీమ యేనియుఁ జొఱరాదు; ఈ యింతి కోరునవెల్లఁ దెచ్చి యిచ్చుచుండుడు; మీకుఁ బ్రాణంబులు తీపగునేని యీ కోమలికి నెట్టి యప్రియంబును వినిపింప'రని యాజ్ఞాపించి, రక్షోవీరుల నెనమండ్రుగురను రప్పించి 'మీరు జనస్థానంబునకు వాయువేగంబునఁ జని రాముని వృత్తాంతంబెల్ల నప్పుడప్పుడే నాకు తెలుపుచుండునది. మన ఖరదూషణులను జంపిన యా నరాధముని బారిగొనకున్న నా పగ తీఱదు. మీ శక్తిశౌర్యంబులు నాకుఁ దెలియును గావున మిమ్మిందులకు నియమించితి' నని పలికి వారిని బంపివైచి చింతితార్థసాధనంబునకై యతఁడు సంతసించెను.

మతంగాశ్రమము అయోముఖి

అట రాముఁడు సీతాన్వేషణార్థము తరలి, లతాతరుగుల్మములతో నిండినదియుఁ జూపునకు మహా భయంకరముగా నున్నదియు జొఱరానిదియు నైన కొండొక త్రోవఁ ద్రొక్కి జనస్థానము దాటి, మూఁడుకోసులదవ్వు నడచి, క్రొంచారణ్యముఁ జొచ్చెను. ఆ కాననంబు వివిధ పతంగ సమూహ సమాకులమై కనివిని యుండని పెక్కురకముల సర్పములతో నిండి యుండెను. అందలి వృక్షరాజంబులు గగనచుంబి శాఖాగ్రంబులను బఱచియుండుటంజేసి వాని నీడలు కిమ్మీరమేఘావరణంబులో యను భ్రాంతిని గలిగించుచుండెను. రాముఁడా వనముఁ జొచ్చి సీతాదేవిని వెదకుచు విశ్రమార్థమందందు నిలుచుచుఁ బూర్వదిశాభిముఖుఁడై కోశత్రయము చనెను. అట మతంగాశ్రమముగలదు.

రాముఁ డాయాశ్రమముఁ బ్రవేశించి యంధకార బంధురంబును భీతాళ మహాభీలమునైన బిలంబును దత్సమీపంబునఁ గోఱలు తెఱచి సింహవ్యాఘ్రాతి క్రూరసత్వంబుల మెక్కుచుఁ దల విరియఁబోసి మహాభీభత్సరూపముననుండు రాక్షసిని జూచెను. ఆరక్కసి వారిని జూచి యందు లక్ష్మణుని జేరఁబోయి వానిని గౌఁగిటఁ గూర్చి, 'నాథా! అయోముఖి యని నన్నందురు. నన్నుఁ గూడి యీ పర్వతశిఖర నదీ పులినంబులందు యావజ్జీవము రమింపు'మనెను. లక్ష్మణుఁ డాగ్రహించి దాని నాసికాకర్ణస్తంబులను గోసివైచెను. అది బొబ్బరించుచుఁ బఱు గెత్తెను.

కబంధుఁడు

అంతట రామలక్ష్మణు లందుండి బయనమైరి. మార్గమధ్యమున లక్ష్మణునిఁ దటాలున దైన్యంబు పైకొనెను. అతఁడు పరమఖిన్నుఁడై, 'అన్నా! ఏమో నాకు వెఱపు దోఁచుచున్నది; నా యెడమభుజంబు వెల్లదరుచున్నది; దుర్నిమిత్తములు మెక్కు గానవచ్చుచున్నవి; సదోభయంబును శంకింతు. అదిగో వంజుళకపక్షి దారుణముగాఁ గూయుచున్నది. ఇది జయసూచకము అయిననుఁ బరాకువలదు.' అని పలుకుచుండఁగా మహాభీకరధ్వని యొండు రేగి వన మెల్ల మ్రోఁగుమ్రోయించెను. ఆ ధ్వనివలను వారిరువ్రురుఁ బోయి,

"చ॥ ఉరమునయందుఁ గన్నును బృథూదరదేశమునందు నోరుఁ బ్ర
స్ఫురితభుజద్వయంబుఁ గులభూమిధరోన్నతభావముం గరం
బరుదుగ నుగ్రమైన వికృతాకృతితోడ నశేషసత్త్వ ఘు
స్మరుఁ డగుచున్నవానిఁ బటుసత్త్వుఁ గబంధునిఁ గాంచిరచ్చటన్॥"

ఆ భూతము యోజనాయతంబులైన తన బాహువులను జాచి యందిన గజశార్దూలంబులను బట్టి మెక్కుచు వసవల్చుచుండి రామలక్ష్మణులను జూచి వారివంకఁ దన హస్తములను జాచెను. సూదంటురాతికి నుక్కుతునియలువోలె దాని కరంబులకు వారు దగుల్కొనిరి. లక్ష్మణుఁడు మహా భీతినొంది, 'దీని హస్తంబులు సమాకర్షణ శక్తిమంతములు గానున్నవి. దీనికిఁ జిక్కితిమి; తప్పించుకొను వెఱవు దోఁపదు. ఇది యూఱక మనలనుఁ బోనీయదు; ఇరువురము మడియుటకన్న నొక్కరైనను దక్కుట యుక్తము. అన్నా! నీ వలన నెంతో కార్యము జరుగనున్నది. కావున నన్ను దీనికి బలియిచ్చి నీవు తొలఁగి చని

సీతాదేవిని బడసి పితృపైతామహమైన రాజ్యంబును బాలింపుచు సుఖముండుము. నన్ను మఱువవలదు.' అని దీనస్వరమునఁ జెప్పెను.

రాముఁడు తమ్మునకు ధైర్యము చెప్పసాగెను. అంతలోనఁ దద్భూతము వారినుద్వేళించి, 'మీ రెవరు? దైవము నాకుఁగా మిమ్మిటకుఁ బంపెనా? నా నోరు సొచ్చితిరి; ఇఁకఁ బ్రాణాపేక్ష వదలు' డని మేఘగర్జనధ్వనిఁ బలికెను. దాని స్వరంబునకు రాముఁ డులికిపడి, 'తమ్ముఁడా! నా క్లేశములెల్ల నేటితో సరిపోనున్నవి. కాలబలంబు నెదిరింపరాదు. కాలవాహినికి రణశౌండీరులు సయితము సైకతబంధనంబులగుదురు. ఈ భూతమునలను క్రమింగనున్నాఁడు. ఇతని పరాక్రమంబెల్లఁ దదీయభుజంబులందు మూర్తీభవించి యున్నది. ఇతఁడు ప్రతీకార సమర్థుఁడుగాఁ దోఁపఁడు. ఇట్టివానిని గ్రక్కుమధ్యకాలంబునఁ జిక్కిన పశువును బోలె వధింపరాదు. హస్తంబులను ఛేదించి యితనిని నిర్వీర్యు నొనర్చుద' మనెను. లక్ష్మణుఁడు వల్లెయనెను. వారంతట నా భూతంబు భుజంబుల రెంటిఁ జేరి యొకటి త్రుంచిరి. అది భూనభోంతరాళంబులు పగులునట్లుగా బొబ్బరించి నేలఁబడి నెత్తుట జొత్తిల్లుచు, 'అయ్యా! మీ రెవ్వ'రనెను. లక్ష్మణుఁ డా భూతంబునకుఁ దమ వృత్తాంతంబును సంగ్రహముగాఁ జెప్పి, 'కబంధాకారముననున్న నీ వెవండ'వనెను.

నాఁపుడు, 'రాఘవులారా! మీకు స్వాగతము. నా భాగ్యపరిపాక వశంబున మీ సందర్శనము నేఁడు నాకు లభించెను. నన్నుఁ గబంధుఁ డందురు. నేను తొల్లి దనువంశజాతుండైన శ్రీయనువానికి జన్మించి బ్రహ్మను గూర్చి తపంబొనర్చి వాని వలన దీర్ఘాయుర్బలమును బడసి గర్వోద్ధతుండనై కామరూపబలంబున వివిధ రూపంబులు దాల్చి వనాంతరవాసులైన ఋషులను వెఱపించి బాధ పెట్టుచుంటిని. కొండొకనాఁడు స్థూలశిరుండను మహర్షి గందమూల సంగ్రహణార్థము వనంబునకు వచ్చెను. నేను రాక్షసరూపంబు దాల్చి వానిని ధర్షించితిని. ఆ తపోనిధి వన్ను శపించెను. ఆ శాపబలంబున నన్నా యాకారము వదలదయ్యెను. నా తప్పు చెప్పి వానినెంతో వేడ్కొంటిని. ఆ దయానిధి నన్నుఁ గరుణించి, 'దశరథరాముఁడు కారణాంతరమున నివ్వనంబునకు వచ్చును. అప్పుడు వానివలన నీ భుజములు ఖండితములగును; నీవు దహింపబడుదువు. అప్పుడు నీ సహజమంగళ విగ్రహము నిన్నుఁ బొరయు' నని శాపాంతము ననుగ్రహించెను. ఆ పుణ్యకాలంబును

బ్రతీక్షించుచుంటిని. అనంతరము మరల దేవేంద్రుని ధర్షించితిని. వేల్పు రాయుఁడు నాపై వజ్రాయుధంబును బ్రయోగించెను. దాని తాకునకు నా తలయుఁ దొడలును నా యుదరకోశంబు జొచ్చెను. అట్టి స్థితితో జీవింపనొల్లక, 'దేవదేవా! నన్ను వధించి పుణ్యముఁ గట్టుకొను' మని వానిని వేడితిని. ఆ నిర్జరవల్లభుఁడు ననున్ను విని, 'బ్రహ్మవరము వమ్ము గారాదుగావున నీ ప్రణయంబు చెల్లదు. నీ జీవనార్థము నీ యుదరంబున దంష్ట్రాకరాళవదనంబును యోజనాయతములైన బాహువుల నిచ్చితిని. నీ బాహువులు సమాకర్షణ సామర్థ్యము గలిగియుండును. నీ చేయి పాఱినంతలో నెట్టి ప్రాణియైనను నిన్ను దప్పించుకొన నేరదు.' అని చెప్పి చనెను. నాఁడునుత యిందు పడి యెట్లో జీవించుచు ఋషి వచనంబు సమ్మి యూపిరి పట్టుకొని యున్నాను. నాకు మీరగ్ని సంస్కారంబును గృపసేయవలయు. నాకు దివ్యజ్ఞానముగలదు. అది యిప్పుడు శాపకారణంబున నివ్వుఱుగప్పిన నిప్పువలె నున్నది. దహన క్రియానంతరం బాజ్ఞానము యథాపూర్వము ప్రకాశించును; మీకు సతిసాచివ్యమొనర్చి కూర్చు మిత్రుని దెలుపుదును. వాని వలన మీ యీప్సితార్థము చేకూఱును. నా చెప్పనున్న యతఁడు కొండొక కారణంబున జగమెల్లఁ గ్రుమ్మరెను. అతండెఱుంగని రహస్యస్థాన ముండదు. అతఁడు న్యాయవృత్తుఁడు గావున నీ కెంతయు స్నేహపాత్ర మగు' ననెను.

సుగ్రీవునితో మైత్రి సేయుమని కబంధుఁడు రామునకుఁ జెప్పుట

రామలక్ష్మణులంతట నక్కబంధుని గిరిప్రదరంబున వైచి దహించిరి. కబంధుఁడు దివ్యమాల్యాంబరధారియై విధూమాగ్నికరణిఁ దేజరిల్లుచు లేచి విమానమెక్కి, 'రామా, సంధి విగ్రహ యానాసన ద్వైధీభావ సమాశ్రయంబు లనెడి యుపాయంబు లాఱుగలవు. విజ్ఞులు సమయోచితోపాయంబు నాశ్రయించి కార్యంబును సాధింతురు. ఆపన్నుఁడు సహాయార్థము తనయట్టి వానికే చేరవలయును. సుగ్రీవుఁడను వానరముఖ్యుఁడు ఋష్యమూకక్షేత్రంబున నున్నాడు. సూర్యాంశజుఁడు గావున నతఁడున్నతవంశప్రసూతియని వేఱుఁజెప్ప నక్కఱలేదు. అతఁడు తన యన్నవలనఁ దఱుమఁబడి పరిభ్రష్టుఁడై కపివీరుల నలువుర ను దోడఁగొని ప్రకృతము ఋష్యమూక పర్వతము నాశ్రయించి యున్నాఁడు. వాఁడు బలపరాక్రమతేజోశాలియు సత్యసంధుఁడును నీతిసంపన్నుండును దక్షుడును బ్రగల్భుడు నగుట నీ

కెంతయు నుపకరించును. రామా, కాలము దురతిక్రమము; రా నున్నది రాకమానదు; అనివార్యమచింత్యము. సుగ్రీవునితో మైత్రి సేయుము. చెలిమి యగ్నిసాక్షికమగునేని ద్రోహబుద్ధికి నెడమీయదు గావున నీవు నట్లే యొనర్పుము.

"మ॥ తమకార్యంబుఁ బరిత్యజించియుఁ బరార్థ ప్రాపకుల్ సజ్జనుల్
తమకార్యంబు ఘటించుచుక్ బరహితార్థవ్యాపృతుల్ మధ్యముల్
దమకై యన్యహితార్థఘాతుకజనుల్ దైత్యుల్, వృథాన్యార్థభం
గముగావించెడు వారలెవ్వరొ యెఱుంగన్ శక్యమే యేరికిన్॥"

అని పెద్దలువచించిరి. సుగ్రీవుఁడు త్తముఁడు. అతఁడు సీతాదేవి నెందునన్ను సాధించి తెచ్చి నీ కిచ్చును. అదిగో పడమటితట్టు నేరేళ్ళ నడుమ దారిగలదు. ఆ మార్గము ద్రోకిక్ యమృతనిష్యందియైన జంబూఫలంబు లారగించుచుఁ జనుము. కొంతదవ్వు చనినంతట నిరంతర మధుస్రావియైన నందనవనము గలదు. ఆ దారింబోయినచోఁ బంపా సరోవరంబును జేరుదురు. అందలి హంసక్రౌంచాదివిహగంబు లెన్నఁడును భయంబెఱుంగవు గావున మీకు బెగడొందవు. వానిమధురరుతములు మీకు వీనులవిందగును. ఆ కొలని తోయంబులు స్ఫటికనిర్మలంబును వివిధపుష్ప మరందమధురంబు నై కమలగంధముల నీనుచుఁ జల్లగా నుండును. ఆ నీరు గ్రోలఁగా నగు హాయి యింతనరాదు. అచటి లతాతరుగుల్మంబులు నానాప్రసూనమాలికామనోహరములై కమ్మని తెమ్మరలువీచి మీత్వగింద్రియమును దనర్చును. అందలి పొందామరలు వాడుటనఁగా నెట్టిదో యెఱుంగవు. ఆ వింతకు మీ రాశ్చర్యపడక మానరు. అచటి ప్రస్రవణంబు లెన్నఁడును రాలవు. ఇదంతయు మతంగ మహర్షిప్రభావము. ఆ మహనీయుఁ డందుండెను. గుర్వర్థము శిష్యులు వన్యపదార్థంబులను మోచి తెచ్చుచు భారక్లేశమున వారు చెమర్చి నప్పుడు వారి స్వేదకణంబులు నేలరాలి తపోవిశేషంబున మొలచి పుష్పించి యందు విరాజిల్లుచున్నవి. అందువలన నవి యెన్నఁడును వాడువాఱక వికసించి యుండును. మతంగమహర్షిగాని వానిశిష్యులు గాని యిప్పుడచట లేరు; శబరియను స్త్రీ యొక్కతె మాత్రమందుఁ గలదు. ఆమెకు నీసందర్శనభాగ్యంబున స్వర్గప్రాప్తి కానున్నది. రామా! పంపాపశ్చిమతీరంబున రహస్యాశ్రమపదం బొండు గలదు. మతంగ మహర్షి దానిని నిర్మించెను. అందున్న మాతంగులకు లెక్కయే గలుగదు. ఆ యాశ్రమ పురోభాగంబున ఋశ్యమూకమున్నది. ఆ

పర్వతశిఖరంబునఁ బరుండినప్పుడు కలవచ్చునేని యది తప్పక జరుగును. అ నగంబును బాపాత్ముఁడొండె దురాచారుఁడొండె డాయనోపఁడు. భూత్తు లెవరేని మార్కొంచి యాశ్రయంబు నారోహించిరేని యా రాత్రి నిద్రాసమయంబున వారిని రాక్షసులు వధింతురు. ఆ కొండయందు బిలమొకటి గలదు. దానినిఁ బెనురాయి యొకటి కప్పియుండును. ఆ బిలప్రాగ్భాగంబున శీతోదక హ్రద మున్నది. సుగ్రీవుఁడు నిజాను చరులతోడ నబ్బిలంబున నుండు' నని చెప్పి చనెను. రామలక్ష్మణులు వానిమాటప్రకారము పంపాసరోవరమునకుఁ దరలిరి.

రావణుఁడు సీతాదేవికిఁ బండ్రెండు నెలలు గడవిచ్చుట

ఆట సీతాదేవి యట్లు బందీకృతయై రాక్షసాంగనలమధ్యఁ జిక్కి సుడిగాలికి నడిసముద్రంబునందలి యోడచందంబునను, మృగయూథంబెడసి జాగిలంబుల నడుమఁబడిన లేడివలెను, దహ్యమానపడుచుఁ బరితపించుచుండెను. రావణుఁడు గొండొకనాఁడు మదనప్రేరితుఁడై యామెకడకు వచ్చి, 'సీతా! నీ మాధ్యంబునకు మేర గలుగదా? ఎన్నాళ్ళు కన్నీళ్ళఁ దోఁగినను ఫలముగలదా? రా, రమ్ము. నా యంతఃపుర విలాసంబులను జూతువుగాక' యని పిలిచి, బదులాడమికిఁ గినిసి, యామెను బలాత్కారముగా నీడ్చికొనిపోయి, రత్నచిత్రితకుడ్యంబులతో వజ్రవైడూర్యదంతవికార స్తంభములతో హేమమయ గవాక్షములతో సొబగారు హర్మ్యప్రాసాదములందుఁ ద్రిప్పి, మనోహరపుష్కరిణులను జూపి, లతామండప మనోజ్ఞములైన యుద్యానవనంబుల నడపించి యథాస్థానము జేర్చి, 'సీతా! నా కోశంబు నవనిధులచేత నిండియున్నది గావున ధనమునకుఁ గొదువ గలుగదు. ధైర్యపరాక్రమవంతులగు రాక్షసవీరులు వేనవేలు నా కనుసన్నల మెలంగుదురు. వారినిఁ గెలువఁ దరముగాదు. భోగ్యవస్తువులన్ననో యిచ్చటఁ గలుగనివి ముల్లోకములందును లేవు. నా ప్రణయంబు గైకొనుము; మాయెల్లరకు నీశ్వరివై విలసిల్లుము. రాముఁడిటువచ్చునని పేరాసతో నున్నావు. ఈ లంకాపట్టణము శతయోజనవిస్తీర్ణ సాగరమేఖలావలయితమై యున్నది. దేవాసురులుగూడ నిందు రాఁజాలరు. నరాధముని సంగతి చెప్పవలయునా? జానకీ! రాజులకు రాజ్యంబు ప్రాణాధికము; అట్టిరాజ్యంబును హస్తగతమైనదానిని గోల్పోయి మునిజనదీనవృత్తి నవలంబించి కందమూలపర్ణంబులేరి తిని యడవులంబట్టి ప్రాకులాడుచున్న రాముఁడు తలంపునఁగూడ నిందు రాఁజాలఁడు. ఆ కించనునికైన నీ యడియాసలు

మానుము. ఒకవేళ నతఁడెట్లో యిందువచ్చుఁగో. వచ్చినను నిన్నతఁడుఁ బడయఁగలఁడా? మంగళకరీ! నాభుజాపరిపాలితను నిన్ను చతురాస్యుఁడుగూడఁ జెనకనేరఁడు. మదవతీ! కొఱమాలిన యూహలకుఁ జిక్కి జివ్వనంబును వృథసేయకు. లంకేశ్వరివై నన్నేలి జన్మసాఫల్యముఁ గాంచుము. నీ పూర్వరచితపాపంబులెల్ల వనవాసక్లేశప్రాయశ్చిత్తంబున సమసిపోయెను; ఇప్పుడు శుభోదయకాలము తారసించెను. ప్రాప్తభాగ్యంబును ద్రోసిపుచ్చి పదంపడి పశ్చాత్తాపపడుట వివేకము గాదు. కళ్యాణీ! దుఃఖమేఘపటలిని ద్రోచిపుచ్చి నీ వదనేందుబింబచంద్రికలను నా యంతఃపురమునఁ బఱచి నాకు సంతసముఁ గూర్పుము. అట్లు సేయుట ధర్మలోపమని వెఱతువా? మన యీసంబంధము శాస్త్ర విహితంబగు. మరుఁడే యిందులకుసాక్షి. ప్రేయసీ! వేయేల? ఎవనితలలు ముక్కంటికిఁగూడ వంగి నమస్కరింపవో యట్టి నాతలలు పదింటితో నీకు మ్రొక్కెదను; నీ దాసుని బాలింపు' మని బహుభంగులఁ బ్రార్థించెను.

సీతాదేవి వాని యసంగతప్రలాపంబులకు శోకకర్శితమానసయై తనకు వానికి నంతరముగా గడ్డిపఱకను ద్రుంచి వైచి, 'ఏమహనీయుఁడు సత్యసంధుఁడగు దశరథమహారాజునకుఁ బ్రియపుత్త్రుఁడో, ఏ ధర్మాత్ముని పేరు ముల్లోకములందుఁ గీర్తితమై చరితకలిలంబును హరించునో, యట్టిరాముని కూర్చుపత్ని యిట్టి యవినయోక్తుల వినసోపదు. జనస్థాన రాక్షసనిర్మూలనవార్తవలన గుండియలు వ్రీలి, నసిచెడి, పిఱికిపందవై, రామలక్ష్మణులకు వెఱచి, యరణ్యితను దొంగిలి తెచ్చితివి. ఇంతకన్న మగవానికిఁ దలవంపుగలదా? ఇట్టి యనదవు నీవు నీ మేటితనంబును బొగడ లజ్జింపవా? ఉత్తుంగతరంగంబుల తాకునకు నదీకూలంబట్లు రామజ్యావిముక్తశితశిలీముఖంబులకు నీ తనువు తుత్తునియలై రూపు మాయనున్నది. రావణా! ఎల్లరకు నజేయుండనని విఱ్ఱవీగుదువు. రాముని సంగతి యెఱుంగవు గావున నీ వట్లనుట వింతగాదు. నీ లావు నీ బిగువు నీ పొగరు సమస్తము నశించుకాలము వచ్చెను. నీకు జీవిత శేషమున్నట్లు దోపదు. కావుననే యిట్టి దుర్బుద్ధి నీకు జనించెను. ఎవఁడు సంకల్పమాత్రంబున భూనభోంతరాళంబులను తలక్రిందుసేయ గలఁడో, ఎవఁడు తేకి చూచెనేని నప్తజలధులింకి బీటలు వాయునో, యట్టిరామునకు సాధింపరానిది గలదా? ఆ మహనీయుఁడు తన సీత నిందుండి కొనిపోఁ జాలఁడా? చరాచరంబు లేకమై నిల్చినను వానికి

నడ్డమగునా? ఇఁక నీ జల్పములు మానుము. రాక్షసాధమా! నన్నుఁ దాక నుంకింతువు. శాలామధ్యస్థాపితంబును స్రుగ్భాండమండితంబును ద్విజమంత్రపూతంబునునైన యజ్ఞవేదిని జండాలుఁడట్లు రామకోదండ సంరక్షితయు లక్ష్మణపరాక్రమశ్రీకలితయు బతివ్రతాధర్మసంభావితయు నైన సీతను నీవు ముట్టుదువేని నీ తలలు వేయివ్రక్కలగును. కామాంధకా! రాజహంసి గగనతరంగిణీకనకకల్హార క్రీడాపరతంత్ర యగుఁగాని కసవుమెసవి జీవించు నీరుకాకివలెఁ బంకంబునఁ బొర్లాడునా? నృశంసా! నీ నీడయేని నా పయిఁ బాఱరాదుపొమ్ము.'అని పరుసంబుగా భాషించెను.

రావణుఁ డామాటలకు గగుర్పాటొంది క్రోధవివశుఁడై, 'సీతా! స్త్రీవగుట నిన్నోర్చితి; పదిరెండునెలలు గడువిచ్చితిని. ఆలోన నీవు నా మనంబుసేయవేని సూదకులు నిన్ను వండి భక్షింతురు. ఇదే హెచ్చరిక' యని కఠోరంబుగాఁ బలికి రక్కస రాక్షసాంగనలనుజూచి, 'ఈ మత్తకాశినిని గోనిపోయి యశోకవనాంతరంబున నుంచి మంత్ర తంత్రతర్జనాది ప్రయోగంబుల నాకు వశవర్తినిని గావింపుఁడని యాజ్ఞా పించి చనెను. వారు సీతాదేవిని గొనిపోయి యశోకవనంబున నుంచిరి.

రామలక్ష్మణులు శబరియాశ్రమముఁ జేరుట

అట రామలక్ష్మణులు బయలుదేరి ననసౌభాగ్యవిశేషంబుల నవలోకించుచు శబరియాశ్రమముఁ జేరిరి. శబరి వారికి యథార్హపూజలు గావించి కేలుమోడ్చి, 'స్వామీ! నా యొనర్చిన గురుసేవాఫలంబుగా మీ శుభదర్శనభాగ్యంబు నాకుఁ జేకూఁతెను. నేఁడు నాకు జన్మ సాఫల్యమయ్యెను. నీ దివ్యపదము చిత్రకూటంబును మెట్టిననాఁడే మతంగమహర్షిశిష్యులెల్లరు విమానారూఢులై స్వర్గంబునకుఁ జనిరి. వారట్లు పోవుచు, 'శబరీ! రామలక్ష్మణులిందు వత్తురు; వారికి సపర్య లొసంగుము; రామసందర్శనంబున నీకుఁ బునరావృత్తిరహితపుణ్య లోకంబుగలుగు' నని చెలవిచ్చిరి. నాఁటనుండి మీరాక నిరీక్షించు చున్నదాన. మీ కొఱకు వన్యఫలంబులను సేకరించియుంచితి' నని వినయభక్తిమధురంబుగా నుడివెను. రాముఁడు సంతోషభరిత చిత్తుఁడై, 'శబరీ! ఇచ్చటిసంగతి కబంధుఁడు చెప్పెను. ఇందలి వింతలఁ జూడఁగోరుదు' ననెను. ఆ యింతి వారికి నాశ్రమంబెల్లఁజూపి, 'స్వామీ! భావితాత్ములు నా గురువ్రులు యజించిన యజ్ఞవేది యిదిగో. వాని

తపఃప్రభావంబున నిది నేటికిని వెలుఁగుచున్నది. ఆ మహర్షి యుపవాద వాక్యములవలనఁ గదలియాడనైన శక్తిలేకుండెను. అట్లుండియు నమ్మహాత్ముఁడనుదినంబు సప్తసాగర తోయముల సాన్న మొనర్చుచుండెను. అది యెట్లు సాధ్యమందురా? ప్రాతఃకాలమున లేచి యాయన సముద్రములను స్మరించును. అవి పొంగి వానికడకు వచ్చును. ఆయన తజ్జలము లాడుచుండును. అట్లాయన తోయములాడి యాఱువైచిన వల్కలంబు లవిగో వృక్షాగ్రముల నేటికినిఁ దడియాఱవు. దేవ కార్యార్థము మహర్షులు కలువపూలను బుష్పములను గూర్చుచుండిరి. అవిగో యా దండలింకను వాడువాఱవు. మహాత్మా! ఇఁకఁ జూడఁ దగినవియు జెప్పఁదగినవియు లేవు. ఆజ్ఞయేని నా యీ తనువును దొఱంగి నా గురుచరణసాన్నిధ్యముఁ జెరుదు' ననెను. రామలక్ష్మణులు శబరి కెంతయు సంతసించి, 'యథాసుఖము పో'మ్మనిరి. శబరి యంత సమాధి యోగంబునఁ దనుత్యాగ మొనర్చి జ్వాజ్వల్యమాన దివ్య శరీరయై స్వర్గంబునకు నిర్గమించెను.

పంపా సరోవర సందర్శనము

రాముఁడు మునిజనప్రభావంబును జింతించి చింతించి, 'లక్ష్మణా! మహాత్ములైన మునుల యాశ్రమంబులను సందర్శించుటవలనను బుణ్య తోయంబులాడి పితృతర్పణంబు లొనర్చుటవలనను మన యమంగళంబు లెల్ల నేటితోఁ దీఱెను; మనకు శుభం బుపస్థితమయ్యెను. నా హృదయము నేఁడు మహోల్లాసవిస్ఫారితమై యలరారుచున్నది. సుగ్రీవునిఁ జూచుతమి యిందు నిలువనీయదు. పంపాసరోవరంబునకుఁ బోవుదము ర'మ్మని వానిని వెంటఁగొని చని నానాద్రుమపరివృతంబును స్వాదుజల పూరితంబునునై చెందొవల తోడను వెలిదమ్ములతోడను నిందీవరముల తోడను బెనఁగొని చిత్రకంబళము పఱుచిరోయనఁ దోచుచుండిన యా కాసారరత్నంబును జేరెను.

ఉ॥ భక్తియుర క్తియుంగలసి భాసురలక్ష్మణ భూమిపుత్రికా
వ్యక్తులఁజోడునిల్వ వనవాసనిమిత్తముఁజేసి ధాత్రి నా
ముక్తనిశాటరౌద్రముగఁ బూని రచించిన దివ్యమూర్తి యే
వ్యక్తవివిక్తవర్తి చరితార్థునిగా ననుఁ జేయుఁగావుతఁ॥

అరణ్యకాండము

సమాప్తము

ము ద్ర ణ :
యూనివర్సిటి ప్రెస్,
తె నా లి.

తప్పొప్పుల పట్టిక

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
10	2	సేనవాహిని	సేనావాహిని
61	19	నాయజ్ఞకు	నాయాజ్ఞకు
61	22	నక్రమోన	నక్రమీన
76	24	భామా	సామ్యా
89	21	గుగుంభుల్	గుంగుభుల్
102	24	మఁడచి	మడఁచి
105	14	ప్రాపు	ప్రాపృ
113	17	చెడమి	చెడని
114	18	మాఱు	మీఱు
116	20	వాసునికి	వాసుకిని
134	18	వలపుకుఁ	వలపునకుఁ
165	4	సుమిత్ర	సుమిత్రా
177	19	సహాయ్యముఁ	సాహాయ్యముఁ
181	16	నుఁడెను	నుండెను
189	33	మున్మ్	మున్న
190	12	నేడుఁను	నేఁడును
196	17	నంబున	నంబును
218	25	నిన్మానింతుమో	సన్మానింతువో
219	25	స్వతంత్రులు	స్వతంత్రులు
229	22	ఆడుగో	ఆదిగో
231	31	వినయంబు	అవినయంబు
247	31	లాదరించి	లాచరించి
248	29	ప్రబ్వంగ	ప్రబ్బంగ
256	32	సుతులను	సుతలను
258	31	గానున్నవి	శుభములుగానున్నవి
259	20	సంప్రాణికముగా	సప్రాణికముగా
260	22	ఆవగోధ	ఆవరోధ
263	7	లాక్షార	లాక్షారస
265	22	నభాంకుర	నఖాంకుర
270	30	తేఁడు	తేఁడు
275	28	దుకములముగా	దుములముగా

281	8	సత్యాలోకంబును	సత్యలోకంబును
285	14	యొడ్డునున్న	యొడ్డుననున్న
288	11	వారివారి	వారి
292	14	గోరువలె	గోగువలె
293	25	మిధునంబున	మిథునంబుల
311	1	దాది	దారి
329	12	యల్ల	యెల్ల
351	15	క్రెల్లిపడసాను	క్రెల్లి పడసాగెను
352	30	గలడు	గలరు
355	23	గుఘుమ	గుసుమ
356	21	వత్కుంబును	నత్కుంబును
361	4	డొనర్చునఁట	డొనర్చెనఁట
362	11	జక్కు–	జక్కు–ల
,,	12	చేసి	నేసి
369	1	ప్రదేశంబునంబునఁ	ప్రదేశంబునఁ
,,	10	యిందుకులఁ	యిందులకుఁ
,,	17	మహాగ్రం	మహాగ్రహం
370	5	శృంగశంగారమై	శృంగశృంగారమై
371	24	పలాకు	పరాకు
,,	29	మేఘుంబులబోని	మేఘుంబులలోని
375	16	మహాహారంబు	మనోహరంబు
376	7	లోరుయుగ్మంబుతో	రోరుయుగ్మంబుతో
383	4	జీగాకు	జీకాకు
384	10	పేరులుంగునఁ	పేరెలుంగునఁ
383	18	ఆయశునిమిత్తంబులకు	ఆయశుభనిమిత్తంబులకు
387	21	నిడదులై	నిడుదలై
388	6	మృగశాల	మృగశాబ
,,	7	నిండుచున్నవి	నించుచున్నవి